బి.ఎస్.రాములు

60
షష్టి పూర్తి
48వ పుస్తకం

భావజాల యుద్ధం

సంపాదకులు :
డాక్టర్ మొయిలి శ్రీరాములు
M.A., T.P.T., B.Ed., M.Phil., Ph.D., SLET.

ప్రచురణ
సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం
హైదరాబాద్ – 500 044
2009

60
షష్టిపూర్తి
48వ పుస్తకం

భావజాల యుద్ధం

బి.ఎస్.రాములు

Ph. 9391036987
e-mail : bsramulu@gmail.com
blog :

సంపాదకులు :
డాక్టర్ మొయిలి శ్రీరాములు
M.A., T.P.T., B.Ed., M.Phil., Ph.D., SLET.

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2009
బి.ఎస్.రాములుగారి 48వ పుస్తకం

కవర్ ఫోటో : సుధాకర్, 9849084999
డిటిపి : ఏవిఎమ్ గ్రాఫిక్స్, 9440096321

Publishers & Distributors:
University of Social Philosophy
Vishala Sahitya Acadamy
406, Usha Kiran Arcade, Osmania University Road,
Vidyanagar, Hyderabad - 500 044
✆ : 9391036987

వెల : **వంద రూపాయలు**

అంకితం ఫోటో

ఖాళీ

Dalithayugam-1
03-09-09
3

విషయ సూచిక

Dalithayugam-1

03-09-09

5

సంపాదకీయం

– డా. మొయిలి శ్రీరాములు

చరిత్ర తన కాల ప్రతినిధులను చరిత్ర ప్రతీకలుగా సృష్టించుకుంటుంది. అలా చరిత్రకు ప్రతీకగా బి.ఎస్. రాములు చరిత్ర పరిణామ క్రమంలో ఎదిగారు.

1990 నుండి నేటి దాకా సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములుగారు సమాజానికి వైతాళికుడుగా ముందు నడుస్తున్నారనిపించింది. వారి జీవితాన్ని, కృషిని పునర్మూల్యాంకనం చేశాక ఆ భావం మరింత బలపడింది. ఆధునిక సాహిత్య, సామాజిక, తాత్విక రంగాలను 1990 నుండి 2009 దాకా రెండు దశాబ్దాలుగా మార్గదర్శనం చేస్తున్న బి.ఎస్. రాములు ఒక యుగకర్త, ట్రెండ్ సెట్టర్, శతాబ్ది వైతాళికుడు.

యుగకర్త, వైతాళికుడు సాహిత్య, సామాజిక రంగాలలో సంఘ సంస్కర్తగానో లేదా సమాజ సేవకుడిగానో మంచి గుర్తింపు కలిగి ఉండడంతో పాటు, తాత్విక భావజాల రంగంలో తనదైన ముద్రను వేయగలగాలి. ప్రజాపోరాటాల్లో మమేకం కావాలి. ప్రజా పోరాటాల్ని సాహిత్య ప్రక్రియల్లో చిత్రించగలగాలి. ఆయా సాహిత్య ప్రక్రియల ద్వారా, కార్యక్రమాల ద్వారా సమాజాన్ని పురోగమన మార్గంలో నడిపించడానికి ముందు త్రోవ చూపాలి. నూతన సిద్ధాంతాలను, మార్గాలను, కార్యక్రమాలను అందించాలి. సమాజానికి ముందు నడవాలి. ఈ లక్షణాలు వున్నప్పుడు సాహిత్య, సామాజిక, తాత్విక రంగాల్లో ట్రెండ్‌సెట్టర్, యుగకర్త, వైతాళికులు అంటారు. గతంలో శ్రీశ్రీ ఈ శతాబ్ది నాది అని ప్రకటించారు. మార్క్స్ ఇలా ఈ శతాబ్ది నాది అని చెప్పుకోలేకపోయాడు. బి.ఎస్.రాములు 1990 దాకా సమాజంతో పాటు నడిస్తే 1990 నుండి సమాజానికి ముందు నడిచారు. కానీ, ఆ మాట మార్క్స్‌లాగే బి.ఎస్.కూడా చెప్పుకోలేదు. సాహిత్య, తాత్విక, సామాజిక, రాజకీయ రంగాలలో బి.ఎస్.రాములు వేసిన ముద్ర, చేసిన కృషి ఆ యా రంగాలలో మలుపులకు దారితీసాయి.

ఒకరో ఇద్దరో అనుకరిస్తే 'కాపీ' అంటారు. పదో ఇరవై మందో అనుసరిస్తే 'బృందం' అంటారు. ఇంకా ఎక్కువ మంది అనుసరిస్తే ధోరణి అంటారు. ధోరణికి కారకుడైన

వారిని ట్రెండ్ సెట్టర్ అంటారు. ధోరణి కన్నా ఎన్నో రెట్లు ప్రతిభావంతంగా ప్రభావితం చేసిన వారిని లెజెండ్ అనీ, యుగ పురుషులనీ, యుగ కర్తలని, మార్గదర్శకులని అంటారు. ఉదాహరణకు బుద్ధుడు, క్రీస్తు, కారల్‌మార్క్స్, లెనిన్, గాంధీ, అంబేద్కర్ మొదలగువారు.

1990 నుండి 2009 వరకు రెండు దశాబ్దాలుగా సామాజిక తత్వవేత్తగా బి.ఎస్. రాములు సామాజిక సైద్ధాంతిక రాజకీయ సాహిత్య రంగాలలో బలమైన ప్రభావాన్ని వేయడంతో పాటు, మలుపుతిప్పిన సంఘటనలు ఎన్నో... ఈ భావజాల యుద్ధంలో ఆయన శరీరం, మనస్సు నిండా గాయాలే... అయినా యుద్ధం నుండి బెదరలేదు. పారిపోలేదు. ముందుకే సాగారు. ఈ భావజాల యుద్ధం సందర్భంగా వీరు ఎదుర్కొన్న విమర్శలు, భౌతిక పరమైన దాడులు, హెచ్చరికలు, వ్యక్తిత్వ హత్యాకాండ నిండా ప్రచారాలన్నిటిని తన ఆచరణ, సిద్ధాంతాల ద్వారా పూర్వపక్షం చేయడంతో పాటు తనను వ్యతిరేకించిన వారికి కూడా గురువుగా మార్గదర్శనం చేసి తన భావాలవెంట నడిపించిన ధీశాలి బి.ఎస్.రాములుగారు. దార్ల రామచంద్ర అనే సాహితీవేత్త విపులంగా చర్చించి బి.ఎస్. రాములు గారిని యుగకర్తగా పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, సాహిత్యానికి, మైనారిటీ సాహిత్యానికి, తెలంగాణా సాహిత్యానికి బి.ఎస్. రాములు వేసిన బీజాలు మొలకెత్తి మహావృక్షాలయ్యాయి.

బి.ఎస్. రాములు 1949లో పుట్టి 1967 నుండి అనేక సామాజిక అనుభవాలను పొందుతూ సమాజ పునర్నిర్మాణంలో కృషి చేస్తూ వచ్చారు. ఆర్.యస్.యస్, పీపుల్స్ వార్‌ల నిర్మాణంలోనూ, బీడీ కార్మికుల, ఉద్యోగ సంక్షేమ సంఘాల, సాహిత్య సంస్థల నిర్మాణంలోనూ, వాటి పునర్నిర్మాణంలోనూ కృషి చేసి 1990 నుంచి సమాజానికి ముందు నడుస్తున్నారు. మార్గ నిర్దేశం చేస్తున్నారు. వామపక్ష భావజాలంతో దళిత, బహుజనుల భావజాలంతో, సాహిత్య విమర్శ, సాహిత్య సైద్ధాంతికతలో తాత్విక, సైద్ధాంతిక దృష్టి సముపార్జించడంలో నూతన విషయాల్ని ప్రతిపాదించడంలో సమాజంతో సంఘర్షించారు.

1990 నుండి దళిత వాయిస్ మాసపత్రికలో సీరియల్‌గా ప్రచురించబడి తాత్విక రంగంలో సంచలనం లేపి భావజాల యుద్ధానికి శంఖం ఊదిన **'గతితర్క తత్వదర్శన భూమిక'** గ్రంథాన్ని 1991లో వెలువరించారు. ఇది తెలుగునాట భావజాల చర్చను మౌలిక మార్పులకు గురి చేసింది. 'గురజాడ కన్యాశుల్కంను ఇప్పుడెలా చూడాలి?', 'గతితర్కం-అంబేద్కరిజం- మార్క్సిజం', అలాగే 'అంబేద్కరిజం-సోషలిజం', 'బహుజన తత్వం', 'ప్రేమ అంటే ఏమిటి?', 'వ్యక్తిత్వ వికాసం- సామాజిక నాయకత్వం', 'జీవితం అంటే ఏమిటి?', 'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం', 'స్వాతంత్ర్యానంతరం 60యేళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు', 'సమగ్ర సామాజిక కథ-50యేళ్ల తెలుగు కథా తీరుతెన్నులు', 'సాహిత్య చరిత్రను కొత్తచూపుతో తిరగరాయాలి', 'కథలబడి-కథా సాహిత్య అలంకార శాస్త్రం' మొదలైన తాత్విక సైద్ధాంతిక గ్రంథాల ద్వారా ఒక మహాప్రవాహంగా విస్తరించారు. భారతీయ ఉపఖండంలో తాత్విక, సామాజిక భావజాలాన్ని, సాహిత్య, సామాజిక ఉద్యమాల్ని మలుపు తిప్పారు. డాక్టర్ కత్తి పద్మారావు బి.ఎస్.రాములు గారు

ఒక తాత్విక విశ్వవిద్యాలయం అని అందులో మనమందరం విద్యార్థులమే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో భావజాలరంగంలో 1990 నుండి అందరు చేసిన కృషి ఒక ఎత్తు, బి.ఎస్.రాములు గారు చేసిన కృషి ఒక ఎత్తు అని ఆయన విశ్లేషించారు.

వీరు విశేష కృషి చేసి 'దరకమే' ఐక్యవేదికను స్థాపించి దానికి వ్యవస్థాపక అధ్యక్షులయ్యారు. వీరి స్ఫూర్తిని స్వీకరించి 'డఫోడం' వంటి సంస్థలు ఏర్పడ్డాయి. దళిత సాహిత్య సిద్ధాంత భూమిక వేళ్ళూనుకొని సాహిత్య సృజన బలంగా ముందుకు వచ్చింది. కారంచేడు, చుండూరు ఉద్యమాల తర్వాత సమాజంలో నూతన సైద్ధాంతిక భూమికను బి.ఎస్. రాములు రూపొందించారు.

భారతీయ చరిత్రను శూద్ర దృక్పథంతో పరిశీలించిన, 'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం' గ్రంథం భారతీయ చరిత్ర నిర్మాణంలో నూతన వెలుగును ప్రసరింప చేసింది. చరిత్ర నిర్మాణంలో ఇదొక మైలురాయి. 'భారతీయ సమాజం-నేటి రాజకీయ సామాజిక పరిణామాలు', 'రాజ్యం-ప్రజలు' మొదలైన గ్రంథాల ద్వారా రాజకీయ సామాజిక పరిణామాలను విశ్లేషించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 1995 నుండి సైద్ధాంతిక భూమికను అందించడమే కాకుండా ఉద్యమ నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణపై పలు పుస్తకాలు ప్రచురించారు. **'తెలంగాణా తల్లి'** రూపకల్పన చేశారు. విభిన్న అంశాలపై 50కి పైగా కథలు రాసి అనేక రంగాలలో మార్గదర్శనం చేశారు. అనేక ఉద్యమాలకు సిద్ధాంతకర్తగా నిలిచారు. పాట పుట్టుక గురించి విశ్లేషణ చేశారు. ప్రవహించేపాట, బీసీ, ఎస్సీల పాటలు పేరిట 1100 పాటలను సేకరించి ప్రచురించారు. విశాలసాహితి ప్రచురణలుగా 40 దాకా యువ రచయితల రచనలను సరిచూసి ప్రచురించారు. సాహిత్యవేత్తలకు విశాల సాహితి కథా పురస్కారాల్ని 49 మందికి అందించారు. వందలాది రచయితలను సత్కరించి ఆత్మవిశ్వాసం నింపారు. ఒక యూనివర్సిటీ, ఒక ప్రభుత్వం చేయాల్సిన వాటిని స్వయంగా చేసి సమాజానికి మార్గదర్శకులయ్యారు.

'మమతలు - మానవ సంబంధాలు' కథల సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం అందుకున్నారు. 1994లో హేతువాద రంగంలో వీరి కృషికి త్రిపురనేని రామస్వామి స్మారక హేతువాద పురస్కారాన్ని తెలుగు విశ్వవిద్యాలయం అందించింది. తెలంగాణతల్లి రూపకల్పనలో విశేష కృషికి తెలంగాణ సంబురాలలో బంగారు కడియం తొడిగి గౌరవించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అనేక కార్యక్రమాలను సూచిస్తూ ముందుకు సాగుతున్నారు. 'మీ ఊరిని మీరే అధ్యయనం చేయండి' అని ఎలా అధ్యయనం చేయాలో స్వయంగా అధ్యయనం చేసి గ్రంథంగా వెలువరించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల పరిణామాలు, గ్లోబలైజేషన్ పరిణామాలు, గ్రామీణ, పట్టణ పరిణామాలు ఎలా సాగుతున్నాయో వాటిని ప్రజానుకూలంగా ఎలా మలుపుతిప్పాలో సూచిస్తూ సమాజానికి ముందు నడుస్తున్నారు. 'రాజ్యం-ప్రజలు' గ్రంథంలో కేంద్ర రాష్ట్ర

ప్రభుత్వాలకు, ఆయా సామాజిక రంగాలకు నూతన ఆలోచనలను, కార్యక్రమాలను, సూచనలను అందించారు. అనేక విషయాలను నూతనంగా నిర్వచించి, విశ్లేషించారు. సామాజిక ఉద్యమాల్లో బి.ఎస్. రాములు 1990 దాకా సమాజం వెంట నడిచారు. ఆర్.ఎస్.ఎస్. మొదలుకొని, దళిత, బహుజన, కార్మిక, నక్సలైట్, ట్రేడ్ యూనియన్, ఉద్యోగ సంఘాల నిర్మాణంలో క్రియాశీలంగా ఎదిగారు.

బి.ఎస్. రాములు రాజకీయ పార్టీల ఉద్యమాల్లో, కుల సంఘాల ఉద్యమాల్లో, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యమాల్లో, నక్సలైట్ ఉద్యమాల్లో తాత్వికంగా తనదైన ముద్రను వేశారు. 1996 నుండి తెలంగాణ ఉద్యమంలో నూతన సిద్ధాంత పునాదులను వేసి కార్యక్రమాలను రూపొందించారు. 1000 పేజీలకు పైగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అనేక కోణాలను విశ్లేషించి సమగ్రంగా నిరూపించారు.

Dalithayugam-1
03-09-09
7

బి.ఎస్. రాములు తాత్విక, భావజాలం భారత ఉపఖండంలో విస్తరించింది. నూతన తాత్విక ఆలోచనల్ని, కార్యక్రమాలను రూపొందించుకోవడానికి మార్గదర్శనం చేసింది. డా॥ కంచ ఐలయ్య 'నేను హిందువునెట్లయిత' ఆంగ్లగ్రంథం దరకమే ఐక్యవేదిక ఇచ్చిన సైద్ధాంతిక ప్రాతిపదికతో వెలువడింది. బి.ఎస్.రాములు మార్క్సిజాన్ని, హేతువాదాన్ని, హిందూమత వాదాన్ని, కుల సమస్యల్ని ఒక కొత్త దృక్పథంతో, సూత్రీకరణ చేశారు. బుద్ధుడు ప్రపంచంలో మొట్ట మొదటి సోషలిస్ట్ సమాజ సిద్ధాంత వేత్త అని, ఆచరణ శీలి అని నిరూపించారు. సోషలిజంలో మూడు అంశాలుంటాయని, తనలో తాను, తన కొరకు తాను మాత్రమే మార్క్సిజం అంగీకరించిందని, కానీ ఇతరుల కొరకు తాను అనే మూడవ అంశాన్ని పరోపకారాన్ని అత్యున్నత సోషలిస్టు ఆచరణ అని బుద్ధుడు, అంబేడ్కర్ ఆచరించి చూపారని బి.ఎస్. రాములు 'అంబేద్కరిజం–సోషలిజం', 'బహుజన తత్వం' గ్రంథాల్లో నిర్ధారించారు.

'ఉదయం' దినపత్రికలో 1987లో రహస్య జీవితం జీవిస్తూ కలం పేరుతో కుల సమస్యపై తీవ్రమైన చర్చ చేశారు. 'అరుణతార' మాసపత్రిక 1987 అక్టోబర్ సంచికలో 'ఆలోచన–ఆచరణల మధ్య వైరుధ్యం' వ్యాసం రాసి కుల సమస్యపై, విప్లవ కార్యక్రమాల అవగాహనపై ఏడాదిన్నర పాటు చర్చకు దారితీశారు. తాత్విక అంశాలపై 500 పేజీల డాక్యుమెంట్లను రాసి తానున్న విప్లవ పార్టీకి అందజేశారు. రహస్య జీవితం నుండి బహిరంగ జీవితంలోకి వచ్చాక ఆ డాక్యుమెంట్లను పుస్తకాలుగా మలిచి 'గతితర్క తత్వదర్శన భూమిక'గా వెలువరించారు. ఈ గ్రంథానికి ప్రాతిపదిక అయిన ఆలోచన–ఆచరణల మధ్య వైరుధ్యం వ్యాసంపై పార్టీ శ్రేణులు మూడు వర్గాలుగా చీలిపోయాయి.

గతితర్క తత్వదర్శన భూమిక ముందుకు తెచ్చిన భావజాల యుద్ధంలో వామపక్షాలు, వాటి తాలూకు రచయితల సంఘాలు, ప్రజాసంఘాలు అన్నీ తమ అవగాహనను మార్చుకొన్నాయి. కుల సమస్య ప్రాధాన్యతను గుర్తించాయి. తమ పరిధిల్లో కుల సమస్యను,

వర్గ సమస్యలో భాగం చేసుకొనే ప్రయత్నం చేసాయి.

మార్క్సిజంలో, వర్గదృక్పథంలో, కులం, గణ తెగలలో లాగే తనలో తాను, తనకొరకు తాను అనే దశలకు పరిమితమైన సోషలిజం ఉందని నిర్ధారించారు. వర్గ దృక్పథం కూడా కుల దృక్పథం వలె పరోపకారాన్ని కాకుండా స్వీయ కేంద్రక దృక్పథాన్ని అనుసరిస్తుందని సోదారణంగా వివరించారు. బి.ఎస్. రాములు శతాబ్దాలుగా కులం, గణ తెగల దృక్పథాలు బలంగా కొనసాగడానికి అందులో గల సోషలిస్టు స్వభావమే కారణమని, మార్క్సిస్టు పార్టీ వామపక్ష భావజాలం, వాటి పార్టీ నిర్మాణాలు, వాటి పని విధానాలు బ్రాహ్మణీయ, చాతుర్వర్ణ, కుల వ్యవస్థ వంటివే అని 'గతితర్క తత్వ దర్శన భూమిక'లో నిర్ధారించారు. వీరి చర్చ తరువాత తెలుగునాట వామపక్షాలతో పాటు అనేక ఇతర సామాజిక రంగాలలో అవగాహనలు మలుపు తిరిగాయి. మార్క్స్ సిద్ధాంతాల కన్నా బుద్ధిజం, అంబేద్కరిజం ప్రజాస్వామ్య సోషలిజం ఎలా ఉన్నతమైనవో, ఎలా ఆచరణ సాధ్యమో చక్కగా నిరూపించారు.

స్త్రీవాదంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ మహిళల కోణాన్ని ప్రవేశ పెట్టి భావజాల యుద్ధం ప్రకటించారు. స్త్రీ వాదులు బి.ఎస్.రాములు గారి సిద్ధాంత చర్చ నుండి వెంటనే అనుకూలాంశాలను స్వీకరించారు. 'ప్రవహించే పాట–ఆంధ్రప్రదేశ్ దళిత పాటలు' పుస్తకానికి స్త్రీ శక్తి సంఘటన తరఫున ఆర్థిక సహాయం అందించి అది వెలువరించడంలో ఎంతగానో సహకరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల దృష్టి కోణాన్ని కూడా తనలో కలుపుకొని తన పరిధిని విస్తరించుకొన్నాక స్త్రీ వాద సాహిత్యం వ్యాప్తి చెంది మొత్తం సమాజంలో భాగమైంది. ఇవాళ ఈ అన్ని పరిణామాలను, ఉద్యమాలను సమాజం, ప్రధాన సామాజిక స్రవంతి ఫెమినిజం తనలో భాగం చేసుకుంది. విశ్వ విద్యాలయాల్లో పి.జి. స్థాయిలో ప్రత్యేక పాఠ్యాంశా లుగా చేర్చబడ్డాయి. యం.ఫిల్, పీహెచ్.డీ పరిశోధనలు వేగవంతమయ్యాయి.

వెయ్యేళ్ళ సాహితీ చరిత్రలో 'దరకమే' ఐక్యవేదిక నిర్మాణం ఒక మలుపు. దాంతో వందలాది రచనలు వెలువడ్డాయి. కథ, పాట, ప్రసంగం శిక్షణా తరగతులను నిర్వహించారు. వందలాది రచయితలను తీర్చి దిద్దారు. మరెందరో యువ రచయితలకు స్ఫూర్తి ప్రదాత అయ్యారు. 'దరకమే' ఐక్యవేదిక ఏర్పడక ముందు తెలుగు సాహిత్యం వేరు. 'దరకమే' ఐక్యవేదిక ఏర్పడిన తరువాత వచ్చిన తెలుగు సాహిత్యం వేరు. తెలుగు సాహిత్యాన్ని అనూహ్యమైన మలుపులు తిప్పిన దరకమే ఐక్యవేదికలో బి.ఎస్. రాములు కృషి శ్లాఘనీయమైనది. 50కు పైగా పుస్తకాల్ని ప్రచురించి సమాజానికి మార్గదర్శకుడయ్యారు.

బి.ఎస్. కథలు రాయడంలో వస్తువు, శిల్పం, అనుభూతి, తాత్విక భూమిక ప్రధానంగా చిత్రించారు. తెలుగు కథకు తాత్విక స్పర్శను అద్దారు. 1995 నుండి తిరిగి కథలు రాసి యువ కథా రచయిలకు మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ అస్తిత్వ ధోరణితో 50కి పైగా కథలు రాసి కథకుల కోసం 'కథలబడి' అనే కథా అలంకార శాస్త్రాన్ని రచించారు. పాట

కవుల కోసం 'పాట పుట్టుక', 'ప్రవహించే పాట' ప్రచురించారు. సాహిత్య విమర్శకు మార్గదర్శకాలను రూపొందిస్తూ 'కన్యాశుల్కాన్ని ఇప్పుడు ఎలా చూడాలి?', '50 ఏళ్ళ తెలుగు కథా తీరు తెన్నులు', 'సాహిత్య చరిత్రను కొత్తచూపుతో తిరిగి రాయాలి' వంటి గ్రంథాలను వెలువరించారు.

'సామాజిక రంగంలో బీసీలు ఏం చేయాలి?' స్త్రీవాదం ఎస్టీ, ఎస్సీ, బీసీలకు అనుగుణంగా ఎలా విస్తరించాలో మార్గనిర్దేశం చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వాటి పరిణామాల మంచి చెడ్డలను ప్రసంగాల్లోనూ, వ్యాసాల్లోనూ విశ్లేషించారు. నిజమైన ప్రేమ, ఆప్యాయత అంటే ఏమిటో తెలిపారు. సామాజిక వ్యక్తిత్వ వికాసం అంటే ఏమిటి? ఫెమినిజం అంటే ఏమిటి? జీవితం అంటే ఏమిటి? రాజ్యం– రాజకీయాలు అంటే ఏమిటి?, 'కుటుంబం అంటే ఏమిటి? మొదలైన అంశాలతో కొత్త సూత్రీకరణలు చేసి సామాజిక సాహిత్య రంగాల్లో వైతాళికులయ్యారు. తన జన్మదినాన్ని సాహిత్య సభలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. బి.ఎస్. రాములు 50వ జన్మదిన సందర్భంగా వందలాది రచయితలు, కళాకారులు సభల్లో పాల్గొన్నారు.

2

సామాజిక నేపథ్యం – చరిత్ర

1990 నుండి తెలుగు సాహిత్య భావజాల ఆచరణ, సామాజిక పరిణామాలకు సంబంధించి బి.యస్.రాములుగారు సామాజిక తత్వవేత్తగా ఎదిగిన పరిణామక్రమంలో ఆ యా కవులు, రచయితలు, కళాకారులు రూపొందించిన పుస్తకాలకు బి.యస్.రాములుగారు రాసిన పీఠికలు వాటికవే స్వతంత్ర వ్యాసాలు. అవి ఆంధ్రప్రదేశ్ చరిత్ర పరిణామాల క్రమాన్ని, సామాజిక వికాసాన్ని వివరించే డాక్యుమెంట్స్. వర్తమాన చరిత్రను మలుపు తిప్పడానికి అవి ఎంతో ఉపయోగపడ్డాయి. సాహిత్య భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలకు భావితరాల వారికి అవి చక్కని మార్గదర్శనం చేస్తాయి.

రానున్నది బహుజన సమాజ సాధికారికత. బహుజన ప్రజాస్వామ్య సామ్యవాద వ్యవస్థలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఏలికలుగా ఎదగడానికి, సాహితీవేత్తలు చరిత్రను అధ్యయనం చేయడానికి అధికారంలోకి వచ్చాక దళిత బహుజనులు సాహిత్య, సామాజిక, సిద్ధాంత పరిణామాలను సాధికారికంగా పాఠ్యాంశాల్లో చేర్చడానికి బహుజనుల పక్షాన సామాజిక చరిత్ర, సాహిత్య చరిత్ర పునర్నిర్మాణం చేయడానికి ఈ **'భావజాల యుద్ధం – దళిత సాహిత్య యుగం'** సంపుటాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

అందువల్ల బి.యస్.రాములుగారి వ్యాసాల్ని **'భావజాల యుద్ధం–దళిత సాహిత్య యుగం 1,2,3 సంపుటాలు'**గా స్వీయ సంపాదకత్వంలో వెలువరిస్తున్నాను. ఇందులో గల వ్యాసాలు దళిత సాహిత్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించేవి కొన్ని అయితే, దళిత సామాజిక అస్థిత్వ నిరూపణ, దళిత సాహిత్య చరిత్ర నిరూపణ, దరకమే ఐక్యవేదిక, ఆవిర్భావ పరిణామ

వికాసాలు, కుల సమస్య, వర్గ సమస్య, వర్గ దృక్పథం వర్గాలను రూపొందిస్తున్న కులవ్యవస్థ, తదితర అంశాలను (1990 – 94) వివరించబడ్డాయి.

బి.యస్. భావజాల యుద్ధంలో మొదటి దశలో ఒకవైపు దళిత సాహిత్య సిద్ధాంతాలు నిర్మాణాత్మకంగా బలపడుతూ ప్రజల్లోకి విస్తరిస్తూ, మహిళా వాదం లాగా దళిత వాదం దళిత దశను, బీసీ వాదం బీసీ దశను, ఒక ప్రధాన సిద్ధాంతంగా ఆచరణ అన్ని రంగాల్లోకి విస్తరించే స్వభావాన్ని కలిగివున్నాయి.

దళిత సిద్ధాంత చర్చలు, కార్యక్రమాల నిర్వహణ గురించి వెలువరించిన భావజాల యుద్ధ రచనలు, ప్రసంగాలు (1990 – 99) రెండవ దశ. మూడవ దశలో దళిత సాహిత్యంలో సామాజిక చైతన్యం, సమాజంలో ఆ చైతన్యం స్థిరపడ్డాక, స్థిరపడే క్రమంలో రాసిన పుస్తకాల గురించి, రచనల గురించి వెలువరించిన వ్యాసాలు, పీఠికలు. ఈ భావజాల యుద్ధంలో ఓడిస్తూ, గెలుస్తూ దళిత సాహిత్య సిద్ధాంతాల్ని, అస్థిత్వాల్ని, సాధికారికతను, సామాజిక న్యాయాన్ని సమాజం అవగాహన స్థాయిలో అంగీకరించాక సిద్ధాంత స్థిరత్వంతో నిండుగా, హుందాగా సాధికారయుతంగా భాషా శిల్పం, వస్తువు, విశ్లేషణ కన్పించడాన్ని గమనిస్తాం.

మూడవ దశలో దళిత సాహిత్యం, సామాజిక ఉద్యమం సమాజంలో అంతర్భాగం అవుతూ మొత్తం సమాజాన్ని పరిణామశీలంగా ముందుకు కొనసాగించడంలో భాగంగా రాయబడ్డాయి. అందువల్ల మూడవ దశ రచనలు సమాజాన్ని ముందుకు నడిపే నాయకత్వ పాత్రను, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాయని, అందులో భాగంగానే వ్యక్తిత్వ వికాసం, సామాజిక నాయకత్వం, జీవితం అంటే ఏమిటి?, భారతీయ చరిత్ర – శూద్ర దృక్పథం, బీసీలకు రాజకీయ అధికారం, యూపీలో బీఎస్పీ పిలుపు మొదలైన గ్రంథాలు వెలువరించారని గాఢంగా విశ్వసిస్తున్నాను.

ఇలాంటి భావజాల యుద్ధానికి, కార్యక్రమాల రూపకల్పనకు సంబంధించిన డాక్యుమెంటేషన్ కాంగ్రెస్ వాళ్లు, కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, నక్సలైట్లు, అరసం, విరసం, జనసాహితి మొదలైన వాళ్లు చేశారు. దళిత బహుజన దృష్టితో సేకరించి ప్రచురించడం ఇదే మొదలు. స్త్రీవాద సాహిత్య సామాజిక చరిత్రను, పరిణామాలను అలాగే తెలంగాణ అస్థిత్వ వాద, ముస్లిం అస్థిత్వ వాద సిద్ధాంతాలను సాహిత్య, సామాజిక చరిత్రను పరిణామాలను ఇలాగే సంపుటాలుగా వెలువరించాల్సిన ఆవశ్యకత ఎంతో వుంది. అందుకు ఈ సంపుటాలు స్ఫూర్తిదాయకాలని భావిస్తాను.

3

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సైద్ధాంతికంగా మూడవసారి ముందుకొచ్చింది. 1996 నుండి బలమైన గొంతుగా విస్తరించింది. బి.యస్.రాములుగారు 1996 సం॥లోనే తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను గుర్తించి ఉద్యమించారు. ఎన్నో ప్రసంగాలు చేశారు. రాష్ట్ర

వ్యాప్తంగా పర్యటించారు. పలు సిద్ధాంత చర్చలు చేశారు. ఏ సామాజిక వర్గాల వారు నాయకత్వంలో ఉంటే ఆ సామాజిక వర్గాల ప్రయోజనాలే నినాదాలుగా, కార్యక్రమాలుగా ముందుకు వస్తాయని 1996లోనే స్పష్టం చేశారు. అందువల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు తమ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని కోరారు. ఇందుకు దరకమే ఐక్యవేదిక కూడా దళిత సాహిత్యం కోసం, బహుజన సాధికారికత కోసం కృషి చేసినట్లుగానే, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేయాలని నొక్కి చెప్పారు. దీనిపై దరకమే ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గం ఏకీభవించలేదు.

ఖమ్మం జిల్లాలో 1996లో జరిగిన దరకమే ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గంలో బి.ఎస్.రాములు తెలంగాణ రాష్ట్రానికి మద్దతుగా నిలవడంతో పాటు దానికి నాయకత్వం కూడా అందించాలని ప్రతిపాదించారు. బహుజన సమాజ్ పార్టీ భావజాలంలో కూరుకుపోయి రాజకీయ పార్టీల అనుచరులుగా కొనసాగుతున్న వాళ్లు ఆ పార్టీ అవగాహనను దరకమే ఐక్యవేదికలో ముందుకు తెచ్చారు.

ముందు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీలు అధికారంలోకి రావడమే ముఖ్యం అంటూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అగ్రకులాల ఉద్యమం అని కొందరు వ్యతిరేకించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలే తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం అందించినప్పుడు అగ్రకులాల నాయకత్వం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని, అగ్రకులాలకు నాయకత్వం అందించడం వల్ల మనం ప్రేక్షకులుగా, అనుచరులుగా కాలక్రమంలో వెనకబడిపోతామని బి.ఎస్.రాములు తీవ్రంగా చర్చించారు.

బి.ఎస్.రాములు మైనార్టీలో పడిపోయారు మెజార్టీ కార్యవర్గ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి వ్యతిరేకంగా తీర్మానించారు. బి.ఎస్.రాములు సొంత ఖర్చులతో వెలువరిస్తున్న 'గబ్బిలం' మాసపత్రికను తీయనవసరం లేదని కూడా తీర్మానించారు. దాంతో బి.యస్.రాములు 1996 నుండి దరకమే ఐక్యవేదిక బ్యానర్‌పై కాకుండా విశాల సాహిత్య అకాడమీ, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక బ్యానర్లపై తన కార్యక్రమాలను, భావజాల యుద్ధాన్ని, ప్రచారాన్ని కొనసాగించారు.

1990 నుండి బి.ఎస్.రాములు స్థానిక కార్యక్రమాలకు, పుస్తక ప్రచురణలకు మిత్రులతో కలిసి విశాల సాహిత్య అకాడమీ సంస్థను నెలకొల్పారు. అది పుస్తక ప్రచురణకు పరిమితమైంది. దరకమే ఐక్యవేదికలో వున్న కొందరు తమ సొంత సంస్థలను విస్తరింప చేసుకోడానికి దరకమే ఐక్యవేదికను వాడుకున్నారు. సమిష్టి కృషికి దరకమే ఐక్యవేదిక నిర్మాణానికి, కార్యక్రమాలకు తమ స్వప్రయోజనాలు పరిమితమై మిగతా కార్యక్రమాలను నిరసించారు. యువతరం రచయితలు పెట్టే సభలను, వారి రచనలను నిరాదరించారు. దాంతో బి.ఎస్.రాములు తన దీర్ఘకాలిక భావజాల యుద్ధాన్ని, సమగ్ర సామాజిక విప్లవ దృక్పథాన్ని విశ్వవ్యాప్తం చేయడం కోసం 1995 నుండి దరకమే ఐక్యవేదికలో ఒక వైపు

పని చేస్తూనే విశాల సాహితి ద్వారా రచనా రంగంలో, ప్రచురణరంగంలో కథారచయితలను, పాఠకులను సమీకరించడంలో నిరంతరం కృషి చేస్తూ వచ్చారు. వి.జి.ఆర్.నారగోని దరకమే ఐక్యవేదిక అధ్యక్షులయ్యాక కాన్షీరాం గారు ముఖ్య అతిథిగా దరకమే ఐక్యవేదిక మహాసభను తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఆ తర్వాత మాష్టార్జీ రాష్ట్ర అధ్యక్షులుగా, అనిశెట్టి రజిత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వీరి కాలంలో దరకమే ఐక్యవేదిక కార్యక్రమాలు కార్యవర్గ సమావేశాలకే పరిమితమై సభలు సమావేశాలు ఏవీ జరగలేదు. దరకమే ఐక్యవేదిక కార్యక్రమాలు, నిర్మాణాలు ఆగిపోయాయి.

చివరకు దరకమే ఐక్యవేదిక దశాబ్ది ఉత్సవాలను 2003 సం॥లో నిర్వహించుకోవాల్సి వుండగా అవి కూడా జరగలేదు. అదే సమయంలో మాష్టార్జీ, 'దళిత కళామండలి' కార్యక్రమాలను, సభలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేశారు. మరోవైపు నారగోని బీసీ చైతన్యానికి కృషి చేస్తూనే ఉన్నారు. కంచె ఐలయ్య అంతర్జాతీయ సామాజిక శాస్త్రవేత్తగా సుప్రసిద్ధులయ్యారు. ఉ.సాంబశివరావు మొదలైన వారు రాజకీయ పార్టీల నిర్మాణంలో తలమునకలయ్యారు. దళిత మహాసభ కూడా ఎలాంటి కార్యక్రమాలు లేకుండానే కార్యవర్గాలు కొనసాగుతూ వచ్చాయి. మాదిగ దండోరా, ఏ బీ సీ డీ వర్గీకరణ అనుకూల, వ్యతిరేక ఉద్యమాలు ముందుకు వచ్చాయి. బి.ఎస్.రాములు భావజాల యుద్ధంలో, నిర్మాణంలో వీరికి నిరంతరం తన మద్దతును అందిస్తూ ముందుకు నడిచారు.

మాదిగ సాహిత్యం ప్రత్యేక అస్థిత్వంతో బలంగా ముందుకు వచ్చింది. ముస్లిం సాహిత్యం యువ సాహితీవేత్తల ప్రవేశంతో ముస్లిం అస్థిత్వ వాద ఉద్యమంగా ప్రత్యేక గుర్తింపుతో విస్తరించింది.

దళిత వాదం, బీస్సీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వాదం మహిళా వాదం లాగా, మార్క్సిజం లాగా, గాంధీయిజం లాగా ప్రధాన సామాజిక స్రవంతిగా మారే దారిలో ముందుకు సాగుతున్నది. ఇందుకు భావజాల యుద్ధంలో, కార్యక్రమాల్లో భారత దేశంతో పాటు ప్రపంచాన్ని అన్ని రంగాల్లో పట్టించుకొని, విశ్లేషించి తన దృక్పథాన్ని, దారిని, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు రూపొందించుకుంటూ విశ్వవ్యాప్త ప్రాపంచిక దృక్పథం రూపుదిద్దు కోవాలని బి.ఎస్.రాములు గారు 'సమగ్ర సామాజిక విప్లవం', 'సమగ్ర సామాజిక వికాసం' దృక్పథంతో ఒక నూతన దృక్పథాన్ని ముందుకు తెచ్చారు. ఇది గతంలోని ఏ దృక్పథానికి నకలు కాదు. వర్తమాన సామాజిక, ప్రాపంచిక సన్నివేశాల్లో, సంఘటనల్లో, పరిణామాల్లో ఎప్పటికప్పుడు రూపొందిస్తున్న, భారత ఉపఖండంలోని తాత్విక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక దృక్పథం ఇది. గతంలోని మహానుభావులు చెప్పిన అనేకాం శాలను ఇందులో భాగం చేసి ముందుకు సాగిస్తున్న భావజాల యుద్ధం ఇది.

4

ఈ సామాజిక చారిత్రక పరిణామంలో భాగంగా నేను విశాఖపట్నం

ఆంధ్రాయూనివర్సిటీలో డా॥ కొండపల్లి సుదర్శనరాజు గారి మార్గదర్శకత్వంలో "కత్తి పద్మారావుగారి జీవితం – సాహిత్యంపై కత్తి పద్మారావు సాహితీ సాక్షాత్కారం" అనే అంశంపై పీహెచ్.డీ చేసి 2006 సం॥లో పుస్తకంగా వెలువరించాను.

అంతకుముందు ఆచార్య శరత్‌జ్యోత్స్నగారి గైడ్‌లైన్స్‌లో డా॥బోయ జంగయ్యగారి 'జాతర' నవలపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో స్కూల్ ఆఫ్ హుమానిటీస్‌లో యంఫిల్ తెలుగు విభాగంలో చేశాను.

డా॥ కత్తి పద్మారావుగారిపై పరిశోధన చేస్తున్న క్రమంలో తెలంగాణా నుండి బి.యస్.రాములుగారు దళిత సాహిత్య సామాజిక ఉద్యమాలకు చేసిన కృషి క్రమక్రమంగా నా దృష్టికి వచ్చింది. డా॥ కత్తి పద్మారావుగారి నడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నాను. డా॥ కత్తి పద్మారావుగారి గృహ గ్రంథాలయంలోను, బి.యస్.రాములుగారి ఆఫీసు గ్రంథాలయంలోనూ "దళిత రాజ్యం" మాస పత్రికలోని వారి వ్యాసాలను పరిశీలించాను. ఆసక్తితో పాటు అపారమైన గౌరవం పెరిగింది.

డా॥ బోయ జంగయ్యగారి జాతర నవలపై పరిశోధన చేసి యం.ఫిల్ డిగ్రీని పొందాను. డా॥ కత్తి పద్మారావుగారిపై పరిశోధన చేస్తే డాక్టరేట్ డిగ్రీ వచ్చింది. బి.యస్.రాములుగారిపై పరిశోధన చేస్తే ఏం వస్తుంది? ఏ డిగ్రీ రాదు. ఎందుకంటే అప్పటికే రావల్సిన పీహెచ్.డీ డిగ్రీ వచ్చింది. అయినా నా సొంత ఆసక్తితో కర్తవ్యంగా భావించి బి.యస్.రాములుగారి సాహిత్యం గురించి జీవితం గురించి రాయాలని కృత నిశ్చయం చేసుకున్నాను.

అయితే నేను శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడిని. తెలంగాణ నాకు ఆ కొనకు ఉంటుంది. నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ కొసకు ఉంటాను. పైగా నేను జవహర్ నవోదయ విశ్వవిద్యాలయంలో బీహార్ రాష్ట్రంలో నేపాల్ సరిహద్దుల్లో గల పశ్చిమ చంపారన్ జిల్లా వృందావన్ గ్రామంలో తృతీయ భాషగా తెలుగును బోధిస్తూ తెలుగేతర హిందీ విద్యార్థులకు తెలుగు పండిట్‌గా తెలుగు బోధిస్తున్నాను. కొన్ని వందల కి.మీ. దూరంలో ఉన్నప్పటికీ నా ఆసక్తి తగ్గకపోగా మరింత పెరిగింది. వీలైనప్పుడల్లా బీహార్ నుండి బి.యస్.రాములుగారికి ఫోన్ చేస్తూ అనేక విషయాలు స్పష్టీకరించుకున్నాను.

2006 వేసవి సెలవుల్లో బి.యస్.రాములుగారితో కొన్నాళ్ల పాటు కలిసి ఉన్నాను. అలా హైదరాబాదు నుండి వారి స్వగ్రామమైన జగిత్యాలను కూడా సందర్శించి కొన్ని రోజులు వారింట్లో ఉన్నాను. బి.యస్.రాములుగారి జీవితం సాహిత్యం సామాజిక ఉద్యమ ఆచరణ, సిద్ధాంత వికాసం విస్తారమైనది, వైవిధ్యంతో కూడుకున్నది. వారు చెప్తుంటే అది నాకు స్వీకరించడం, గుర్తుంచుకోవడం కష్టమయ్యేది. వాటిని అంశాలవారీగా వర్గీకరించాలంటే ఆ యా సామాజిక ఉద్యమాలను వాటి నేపథ్యాన్ని, పరిణామాలను, వాటి గుండా ప్రయాణించిన బి.యస్.రాములుగారి ప్రయాణాన్ని, పాత్రను పరిశోధించాల్సిన అంశంగా ముందుకు వచ్చింది.

ఏదో రాసేస్తాను అనుకున్న నాకు సముద్రంలో ఒంటరిగా చెక్కబల్లపై (తెప్ప) తేలియాడుతున్నట్లు అనిపించింది. ఏం చేయాలో తోచలేదు. అయినా పట్టుదల విడువలేదు. ముందుగా జీవిత పరిచయం రాద్దామని బి.యస్.రాములుగారిని కదిలించాను. వారు చెప్తూ వెళ్లగా నేను రాస్తూ వెళ్లాను. బి.యస్. పుట్టుక నుండి 1978 వరకు కొంత రాశాను. విప్లవోద్యమం ప్రారంభ దశను గురించి చెప్పడం ప్రారంభించారు. అప్పటికి శ్రీకాకుళం అర్సవిల్లి వయా ఖాజీపేట గ్రామంలో పుట్టినా నాకు విప్లవోద్యమం గురించి తెల్సింది శూన్యం. ఆయన చెప్తుంటే విని నా మెదడు వేడెక్కిపోయింది. రాయడానికి చేయి కదల్లేదు. ఏం రాయాలో తెలియాలంటే ఏం జరిగిందో ముందు అధ్యయనం చేయాలని అర్థమైంది.

దాంతో జీవిత చరిత్ర రచన అక్కడికి ఆగిపోయింది. దాన్ని ఫెయిర్ చేసి బి.యస్.గారికి పంపాను. అది పద్మపీఠం మాస పత్రికలో సీరియల్‌గా అచ్చయింది. బి.యస్.రాములుగారి పరిచయంలోకి వస్తే కథలు రాయక తప్పదు. భోజరాజును చూడగానే ఎవరికైనా కవిత్వం జాలువారేదట. బి.యస్.రాములుగారు ఎంతోమందితో కథలు రాయించారు. నేను కూడా కథలు రాయక తప్పలేదు. బీహార్‌లో ఉండడం వల్ల ఆ కథల్ని పత్రికలకు పంపించే ఏర్పాటు బి.యస్.రాములుగారే చూసుకున్నారు.

ఆగిపోయిన జీవిత చరిత్ర రచనను కొనసాగించాలనుకున్న ఈ సమయంలో బీహార్ నుండి కరీంనగర్ జిల్లాలో చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయానికి బదిలీ అయ్యింది. జగిత్యాలకు ఎంతో దగ్గరయ్యాను. కాని బి.యస్.రాములుగారు జగిత్యాల నుండి హైదరాబాదుకు మకాం మార్చారు. అందువల్లే స్కూలుకు సెలవు వచ్చినప్పుడు కలిసే ప్రయత్నం చేశాను.

5

ఇంతలో బి.యస్.రాములుగారి 60వ జన్మదిన తేదీ సమీపించినది. దాంతో రెండు దశాబ్దాల 'యుగకర్త' అనే వ్యాసాన్ని రాశాను. అది 'మన పత్రిక', 'నేటి నిజం', "ది హైదరాబాద్ మిర్రర్" పత్రికల్లో ప్రచురించారు.

60వ జన్మదిన సందర్భంగా నేనేదైనా కృషి చేసి అందించాలనుకున్నాను. జీవిత చరిత్ర అసంపూర్ణంగానైనా మొదటి భాగాన్ని వెలువరించాలనుకున్నాను. ఈ సమయంలో బి.యస్.రాములుగారు కంపోజ్ చేయించిన పీఠికలు, దళిత వ్యాసాలు, వ్రాత ప్రతులు నా కంట బడ్డాయి. ప్రస్తుతం సేకరించినవి 800 పేజీలు అయ్యాయి. ఎంతో చరిత్ర, వ్యాసాలు రికార్డు కావలసివుంది.

వీటిని నా సంపాదకత్వంలో ప్రచురించే అవకాశమివ్వమని కోరగా బి.యస్.గారు అందుకు అంగీకరించారు. దాంతో జీవిత చరిత్ర రచన మరో రెండు అధ్యాయాలు మాత్రమే సాగింది. అది వాయిదా వేసి దళిత సాహిత్యం సంపుటాలను వెలువరించే పనిలో పడ్డాను. అలా వెలువడుతున్న మొదటి సంపుటి ఇది.

బి.ఎస్.రాములు గారు కథా సాహిత్యంలో 1995 – 2005 మధ్య తెలంగాణ నుండి వెలువడిన 50 పై చిలుకు కథా సంపుటాల్లో 30 పైగా బి.యస్.రాములుగారి సహాయ సహకారం, స్ఫూర్తి పొందిన రచనలు వెలువడ్డాయి. మిగతా సంపుటాల రచయితలు కూడా పరోక్షంగా ప్రభావితులైనవారే హెచ్చు. సాహిత్యాన్ని సాహితీవేత్తలను గుర్తించి, గౌరవించడంలో భాగంగా ఎందరో కథకులను, కవులను సత్కరించారు. పురస్కారాలు అందజేశారు. యువ రచయితల రచనలను సరిచూసి సరిచేసి పుస్తకాలుగా వెలువరించారు. ఒక సామాజిక విశ్వవిద్యాలయంగా బహుముఖాలుగా పనిచేశారు.

బి.ఎస్.రాములు దరకమే ఐక్య వేదిక వంటి అనేక సంస్థలను తానే నిర్మించినప్పటికీ తన కార్యక్రమాలకు, నూతన భావజాల చర్చకు, ప్రతిపాదనకు అడ్డుగా మారినప్పుడు సహచరులకే సంస్థలను అప్పగించిన త్యాగపూరిత వ్యక్తిత్వంతో ముందుకు సాగారు. ఆ యా సంస్థలను విభేదాలతో సహచరులకు వదిలేసినప్పటికీ వారు వాటిని నిర్వహించడంలో వారి కార్యక్రమాలకు సహకరించడంలో స్నేహ హస్తం అందించడంలో ఆదర్శ మూర్తిగా, ఉదాత్తంగా ముందుకు సాగారు.

సంస్థలను ఇతరులకు వదిలేసినప్పటికీ తాను ఆగిపోకుండా స్వతంత్రంగా నిరంతరం పనిచేస్తూనే రాజకీయ, సామాజిక పరిణామాల్లో తన వంతు పాత్ర నిర్వహించారు. భిన్నాభిప్రాయాలు కలిగి వున్న వారితో కూడా కలిసి పని చేయడం అందరితో కాని పని. బి.యస్.రాములుగారు కష్టసాధ్యమైన ఈ పనిని సుసాధ్యం చేయడమే వారి జీవన రహస్యం.

ఈ సంపుటిలో కొన్ని రిపీట్ అయిన వాటిని ఎడిట్ చేయాలనుకున్నాను. చారిత్రక పత్రాలుగా వాటి ప్రాధాన్యత వాటికుంది కనుక ఎడిట్ చేయకుండా ప్రచురిస్తేనే మంచిదని పెద్దల అభిప్రాయం. ప్రస్తుతం ప్రచురిస్తున్న ఈ సంపుటాలు ఎడిట్ చేయకుండానే అక్షర దోషాలు పరిహరించి ఇందులో చేర్చాను. ఎడిట్ చేయాల్సిన వ్యాసాల్ని తర్వాత సంపుటాల కోసమని కంపోజ్ చేసి జాగ్రత్త పరిచాను.

బి.ఎస్.రాములు గారు ఇరవై అయిదు వేల పేజీల మేర డాక్యుమెంట్లు, ఉత్తరాలు, ప్రసంగాలు, వ్యాస రచన చేశారని ఒక అంచనా. అచ్చులో వచ్చింది చాలా తక్కువ. వ్యక్తీకరించిందే ఇంత వుంటే రాయాల్సినది ఇంకా ఎంతో ఉందంటారు బి.యస్. రాములుగారు.

6

ఈ సంపుటి ప్రయత్నంలో నాకు సహకరించి సహాయపడింది బి.యస్.రాములు గారే. సందర్భోచితంగా వ్యాసాల్ని కూర్చడానికి పరిశోధనా వ్యాసాల్ని రూపొందించి సంబంధిత సాహిత్య పఠనంలోనూ, రాతలోనూ ఎంతో సమయం వెచ్చించాల్సి వచ్చినప్పుడు ఒంటరితనాన్ని సహనంతో భరించి సహకరించిన సామాజిక తత్వవేత్త బి.యస్.రాములుగారి త్యాగం ఎంతో గొప్పది.

ఈ సంపుటాల కొరకు ఎంతో సమయం వెచ్చించి అడిగిన కొద్దీ సంయమనంతో గుర్తు తెచ్చుకుని విశ్లేషించి తన విశేషణను కాలక్రమంలో వచ్చిన పీఠికలను, వ్యాసాలను వరుస క్రమంలో అందించడం ద్వారా పాఠకులకు పరిచయం చేసే అవకాశం కల్పించిన బి.యస్.రాములుగారికి నేను ఎంతో రుణపడి వుంటాను.

దళిత సాహిత్యయుగం సంపుటాలు ప్రచురించడానికి వస్తుసేకరణలో ఎందరో సాహితీవేత్తలు సహకరించారు. బి.యస్.రాములుగారు నేను అడిగేటప్పటికే డాక్యుమెంట్లు ఉత్తరాలు రాతప్రతులు పేరిట దాదాపు 500 పేజీలు కంపోజ్ చేయించి వున్నారు. అచ్చు కోసం కాకుండా ముందు కంపోజ్ చేసి 20 – 25 కాపీలు జిరాక్స్ తీయించి బైండింగ్ చేయించి లైబ్రరీలో భద్రపరిచాలని భావించారు. అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. వాటిని ఇందులో కొన్ని చేర్చడం జరిగింది. ఇలా నా పని ఎంతో సులువయింది.

పనిలో పనిగా "దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక" (దరకమే) తెలుగునాట వేసిన ప్రభావం గురించి దాని చరిత్ర గురించి రికార్డు చేయడం అవసరమనిపించింది. ఎందుకంటే బి.యస్.రాములుగారి కృషి, దరకమే ఐక్యవేదిక కృషి అవిభాజ్యం గనుక. అందువల్ల దరకమే ఐక్యవేదిక నిర్మాతల్లో అవిభాజ్యమైన గూడ అంజయ్య, మాష్టార్జీగార్లను సంప్రదించాను. వారి వద్ద గల 20 ఏళ్ల డాక్యుమెంట్లను, రికార్డులను పరిశీలించే అవకాశం నాకిచ్చారు. అందులోంచి దరకమే ఐక్యవేదికకు, బి.యస్.రాములుగారికి సంబంధించినవి ఎన్నో విలువైన పత్రాలు, వ్యాసాలు, లేఖలు లభించాయి.

ఈ సంపుటానికి అవసరమైన చోట ఫుట్‌నోట్సు చేర్చాను. ఈ ఫుట్‌నోట్స్ వల్ల అవి ఏ సందర్భంగా వెలువడ్డాయో కాలగతిలో వాటి ప్రాధాన్యత ఏంటో చెప్పే ప్రయత్నం చేశాను. ఈ ఫుట్‌నోట్సు రాయడానికి బి.యస్.రాములుగారితో అనేక దఫాలుగా సాగిన సంభాషణలు, ఇతర రికార్డులు, గ్రంథాలు గూడ అంజయ్య, మాష్టార్జీతో జ్ఞాపకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

హైదరాబాదుకు చెందిన బహుజన ఉద్యమ నాయకులు, సామాజిక శాస్త్రవేత్త వి.జి.ఆర్.నారగోని దరకమే ఐక్యవేదిక నిర్మాతల్లో ఒకరు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా॥ననుమాసస్వామి దరకమే ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా 1995 – 97 సం॥లో పనిచేశారు. వీరిని కూడా పరోక్షంగా సంప్రదించాను. అలాగే బి.యస్.రాములుగారు వారి పుస్తకాలకు రాసిన ముందుమాటలను సేకరించాను. పత్రికల్లో వచ్చిన వ్యాసాలు నా ప్రయత్నం మేరకు లభించినవి మాత్రమే ఇందులో చేర్చాను.

అలాగే నాకు ప్రత్యక్ష పరిచయం లేనందున బి.యస్.రాములుగారిని మిగతా రచయితలను మీరే సంప్రదించండని కోరాను. వారు అదిలాబాదులోని లింగాల రాజ సమ్మయ్య, జి.ఆర్.కుర్మే, కారం శంకర్, ఆనాడు దరకమే ఐక్యవేదిక నిర్మాణంలో పాల్గొన్న పి.సి. రాములు, కరీంనగర్ జిల్లాకు చెందిన దరకమే ఐక్యవేదిక మాజీ ప్రధాన కార్యదర్శి

కె.రామలక్ష్మణ్, రచయితలు అన్నవరం దేవేందర్, దార్ల రామచంద్ర, వరంగల్ జిల్లాకు చెందిన దరకమే ఐక్యవేదిక మాజీ ప్రధాన కార్యదర్శి అనిశెట్టి రజిత, సాహితీవేత్త ప్రొఫెసర్ బన్న ఐలయ్య, పి.రాములు, ఖమ్మం జిల్లాకు చెందిన కె.సీతారాములు, కె.వేంకటరత్నం, జూపల్లి సత్యనారాయణ మొదలైన వారిని సంప్రదించాను.

నిన్నటి వార్తే నేటి డాక్యుమెంటేషన్‌గా మార్చుకోగలుగుతున్న వాళ్ల మధ్య సమాజంలో దళిత సాహిత్య సామాజిక సిద్ధాంతాల పరిణామాలను, కృషిని ఇంత ఆలస్యంగా సంపుటాలుగా తీసుకు రావటానికి వెనుకబాటుతనమే ప్రధాన కారణం. సమిష్టి కృషి ప్రాధాన్యతను గుర్తించని దళిత, బహుజన సాహితీవేత్తల సామాజిక శాస్త్రవేత్తల, ఉద్యమకారుల వైఫల్యం కూడా ప్రధాన కారణమని చెప్పవచ్చు.

దీంతో దళిత సాహిత్యాన్ని దాని చరిత్రను రికార్డు చేయడంలో నా వంతు కర్తవ్యం నిర్వహించాననే అనుకుంటున్నాను. తెలంగాణ నుండి సామాజిక, సాహిత్య ఉద్యమంలో తలపండిన బి.యస్.రాములుగారి కృషిని ఈ రూపంలో రికార్డు చేయడం చరిత్ర ఇచ్చిన అరుదైన అవకాశంగా భావిస్తున్నాను. ఇందుకు సహకరించిన అందరికీ నా కృతజ్ఞతలు.

Dalithayugam-1
03-09-09
12

1

బి.ఎస్. ఉత్తరాలు, చారిత్రక పత్రాలు

Dalithayugam-1

03-09-09

Dalithayugam-1

03-09-09

14

<u>పత్రికా వార్తలు నుండి</u>

Dalithayugam-1

03-09-09

15

Dalithayugam-1

03-09-09

16

Dalithayugam-1

03-09-09

17

Dalithayugam-1

03-09-09

18

కరదీపిక

మీరు ప్రేమతో పంపిన మీ 'బతుకుపోరు' నవల చేరింది. ఇంకా చదవలేదు. కారణం మీ "గతితర్కతత్వ దర్శనభూమిక"ను పదేపదే చదవడమే. నిజం చెప్పాలంటే దాన్ని నేను చదవడంలేదు. అది నాచేత పదేపదే చదివిస్తున్నది. అంతటి గొప్పశక్తి దానికుంది. నా ఆలోచనలను యంతగా పదునుదేర్చిన రచనను ఇటీవలి కాలంలో నేను చదవలేదు. దీన్ని చదివిన ప్రతిసారి మరింత కొత్తగా మరిన్ని కొత్త కోణాలు, అంశాలు తెలిసి నేనెంతో ఆనందాన్ని, స్ఫూర్తిని పొందుతున్నాను. ఇందులో అక్కడక్కడా నా భావాలను మీరు మీ పద్ధతిలో వ్యక్తం చేసిన తీరుకు ముగ్ధుడనవుతున్నాను. సైద్ధాంతికంగా భావజాలరంగంలో అశేష పీడిత ప్రజానీకానికి నాయకత్వం వహించగల శక్తి మీకు పుష్కలంగా ఉందన్న సత్యాన్ని ఈ రచన చాటిచెబుతున్నది. మీరు వ్యక్తం చేస్తున్న నూతన, బరువైన మరియు విలువైన భావాలను మరంత తేలిక పదాల ద్వారా బట్వాడా చేయగలిగితే మరిన్ని ఫలితాలను పొందవచ్చు. అయితే ప్రస్తుతానికి ఈ స్థాయి అవసరమే.

ప్రతిదీ మారుతుంది. మార్పుకు అతీతమైనద ఏదీ లేదంటూనే తాము మాత్రం మారడానికి సుతారము అంగీకరించని ఈ దేశ అగ్రవర్ణ, అగ్రకుల మార్క్సిస్టుల్లో కొందరు "గతితర్క తత్వదర్శనభూమి" మీద మాత్రం యుద్ధం ప్రకటిస్తారు. ఆ యుద్ధంలో వాళ్ళను ఓడించాలంటే మీరు చాలా జాగ్రత్తలు తీసుకోవలసి వుంది. మొట్టమొదటి జాగ్రత్త ఏమిటంటే సి.పి.ఐ. నుండి విప్లవ గ్రూపుల దాకా వున్న (అన్ని పార్టీల్లోనూ, అన్ని గ్రూపుల్లోను వున్న) అణగారిన కులాల, మైనారిటీల వారి అడ్రస్‌లు పట్టి వాళ్లందరికీ ముందుకు "గతితర్క తత్వదర్శన భూమిక" అందేట్టుగా చూడాలి. ముందుగా మన వాళ్లకి అందకుండా మన వ్యతిరేకులందితే మన లక్ష్యం దెబ్బతింటుంది. మన వాళ్ల ద్వారానే వాళ్లు మనల్ని ఓడించే ప్రయత్నాలు చేస్తారు. ఇది వారికి వెన్నతో పెట్టిన విద్య. భావాల యొక్క బలం ప్రజలకంటే గూడా పాలకవర్గాల వారికే ఎక్కువగా తెలుసనే విషయం మనం మరిచిపోగూడదు. మార్క్సిజం ముసుగులో తమ బ్రాహ్మణిజాన్ని రక్షించుకుంటూ పీడితకులాల వారిమీద (అధికారం లేకపోయినా) పార్టీ నాయకత్వాల ద్వారా పెత్తనం చెలాయిస్తున్న అగ్రకుల మార్క్సిస్టుల్లో కొందరికి పాలకవర్గాల కంటేగూడా భావాల బలం, వాటిశక్తి, వాటి ద్వారా తమకూ తమ ఆధిపత్యానికి కలిగే నష్టం ఎక్కువగా తెలుసుకాబట్టి "గద్దర్" పాటల మీద పాలకవర్గాల వాళ్లు విరుచుకుపడేకంటే మీ భావాల మీద అధికారంలోలేని మార్క్సిస్టు ముసుగులో వున్న పాలకవర్గాల వాళ్లు మరింత కసితో, ద్వేషంతో విరుచుకుపడగలరు. అలా విరుచుకుపడుతూ కూడా వాళ్లు మార్క్స్-మావోలనే అడ్డం పెట్టుకోగలరు. మమ్మల్ని మార్క్సిజానికి వ్యతిరేకులైనట్టుగా చిత్రించడానికి, పడరాని పాట్లు పడతారు దాన్ని వాళ్లు పీడిత కులాల యువకులచే ఒప్పించే ప్రయత్నాలు చేస్తారు. అందులో వాళ్లు గెలిస్తే మనం ఓడిపోయినట్లే లెక్క. అయితే ఈ పుస్తకాన్ని పీడిత కులస్తులచే చదివింపచేసి దీన్ని సైద్ధాంతికంగా ఓడించడం అనేది వాళ్లకు సాధ్యం కానిపని. అందువల్ల ఈ పుస్తకాన్ని చదవకుండా నిరోధించడాకే పాట్లు పడతారు. మీపై నిందలు వేస్తారు. ఈ పుస్తకం యొక్క విలువను మార్చి ప్రదర్శించే ప్రయత్నాలు నిరంతరం సాగిస్తారు.

కులమేదైనా పేదలంతా ఒక్కటే వాళ్ళ బాధలన్నీ ఒక్కటేనని చెప్పడం బ్రాహ్మణిజమేగానీ మార్క్సిజం కాజాలదు. ఇది కారణమేదైనా హత్యలన్ని ఒక్కటే అనడంతో సమానం. న్యాయస్థానాల ఉరితీతలూ, వర్గశత్రు నిర్మూలనలూ, యుద్ధంలో సైనికులు చేసే హత్యలూ, సామూహిక మానభంగం చేసి చేసే హత్యలూ ఎన్నడూ ఒక్కటి కాజాలవు. నిర్దిష్ట పరిస్థితుల్ని నిర్దిష్టంగా అధ్యయనం చేయడం మార్క్సిజానికి గుండెకాయ అన్న సూత్రీకరణను ఈ దేశ అగ్రవర్ణ, అగ్రకుల మార్క్సిస్టులు అత్యంత దారుణంగా తుంగలో తొక్కారు. కులం విషయంలో వీళ్లు శంకరాచార్యుడి మాయా వాదాన్ని కౌగిలించుకొని మార్క్సిజాన్ని కాలదన్నారు. కులంకాదు. వర్గమొక్కటే అంటూ కులచలనాన్ని సంస్కృతిని అణిచివేతని గుర్తించ నిరాకరించడం శంకరుడి మాయావాదం ద్వారానే సాధ్యమవుతున్నది.

మార్క్సిస్టు బురఖాలో వున్న బ్రాహ్మణ్యరక్షకులైన ఈ దేశ అగ్రవర్ణ అగ్రకుల

'దళిత్ వాయిస్' మాసపత్రికలో 1990 నుండి సీరియల్‌గా ప్రచురించబడిన 'గతితర్క తత్వదర్శన భూమిక' వ్యాసాలు ఎంతోమంది కొత్త మిత్రులను సమకూర్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఒక భావజాల చర్చ వేగవంతమైంది. ఆ వ్యాసాలను పుస్తక రూపంలో కవర్‌పేజి ముద్రించకుండా రహస్య డాక్యుమెంట్ల వలె 1991లో రాష్ట్రంలోని రచయితలకు, మేధావులకు పంపించారు. దాంతో భావజాల యుద్ధం తీవ్ర స్థాయిలో మొదలైంది. ఆ పుస్తకం భారతీయ భావజాల చరిత్రలో ఒక మలుపు. ఆ పుస్తకం గురించి రాసిన ఈ లేఖను పుస్తకాన్ని కవర్ పేజితో తెచ్చినప్పుడు ముందుమాటగా చేర్చి ప్రచురించారు. ఈ పుస్తకాన్ని తొలుత నెల్లూరులో ఆవిష్కరించారు.

కుహనా మార్క్సిస్టు కుట్రలను ఓడించాల్సిన అవసరం పీడిత కుల మార్క్సిస్టులకెంతైనా ఉంది.

అందువల్ల మీరు తీసుకోవాల్సిన యింకోజాగ్రత్త ఏమిటంటే అగ్రకవర్ణ అగ్రకుల నాయకత్వానికీ మార్క్సిజానికీ మధ్యగల వైరుధ్యాన్ని కాస్తలోతుగా చర్చించాల్సి వుంది. అగ్రవర్ణ అగ్రకుల నాయకత్వాన్ని పీడిత కులాలకు చెందినవారు ఆమోదిస్తారే గాని అంతే సుళువుగా పీడితకుల నాయకత్వాన్ని అగ్రవర్ణ, అగ్రకులస్తులు ఆమోదించడం లేదు. ఈ వాస్తవం యిలా ఎందుకుంది? దాన్ని ఎలా మార్చడం? మొదలగు క్రమాన్ని భారత చరిత్ర నుండి కమ్యూనిస్టు పార్టీ చరిత్ర నుండి ఎత్తి చూసేపనిని కూడా మీరు చేపట్టాలి. ఉదాహరణకు మహాత్మ జ్యోతిబాపూలే, డా॥ అంబేద్కర్, మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావో, పెరియార్, ఈ.వి.రామస్వామి, రామమనోహర్ లోహియా, గౌతమ బుద్ధుడి రచనలను పీడితకుల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ఆ వారసత్వాన్ని వారు అందుకునేట్టు చేయాలి. వీరందరి భావాల ద్వారా అశేష ప్రజలు చైతన్యం అయినపుడే ఒక సమగ్ర దృక్పథంతో తమ హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం, విముక్తి కోసం ముందుకుసాగేవిగా ప్రజాపోరాటాలు పరివర్తన చెందడం సాధ్యమవుతుంది.

మీరు వర్గ సమస్యను, స్త్రీ సమస్యను, జాతి సమస్యను, విలువల సమస్యను, సంస్కృతి, చరిత్రల సమస్యను తాత్విక స్థాయిలో చర్చించిన తీరు చాలా గొప్పగా వుంది. నిరంతర సత్యాన్వేషణా ఫలితమే మీ గతితర్క తత్వదర్శన భూమిక. ఆలోచనలో, ఆచరణలో నమ్మకమున్న ప్రతివ్యక్తిని మీ రచన ఆలోచింప జేయగలదని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. నాకు తెలిసినంతవరకు మార్క్సిస్టులుగా ముద్రేయించుకొని మార్క్సిస్టు సిద్ధాంతకారులుగానూ, భాష్యకారులుగానూ, కీర్తి పొందుతూ అగ్రవర్ణ, అగ్రకుల తత్వాల్ని యింకా వదులుకోలేని మార్క్సిస్టులు మాత్రమే ఆలోచనకు మానవ సంపూర్ణ వికాసానికి సంపూర్ణ సామాజిక విప్లవాలకు వ్యతిరేకులు. వీళ్ల నుండే మీ రచనకు తీవ్రమైన వ్యతిరేకత వస్తుందని నేను ముందే పేర్కొన్నాను. వాళ్లను సైద్ధాంతికంగా ఓడించాలి. మన ప్రజల్ని సైద్ధాంతికంగా అభివృద్ధి పరచాలి. అందుకు మీ రచన విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలి. అందుకు నావంతు కృషిని మహత్తర కర్తవ్యంగా భావిస్తాను.

– ఐ. రామచంద్రరావు

1-3-91

నెల్లూరు

(నేను ఎవరు గతితర్క తత్వదర్శన భూమిక. పేజి నెం.15)

Dalithayugam-1

03-09-09

20

భావజాల యుద్ధం

గతితర్క తత్వదర్శన భూమిక

భారతీయ సంప్రదాయంలో తత్వశాస్త్రమనేది మరి విశేషంగా భారతీయ తత్వశాస్త్రం ఏదో ఒక వర్గ ప్రత్యేక ఆస్తి అన్నట్లు తరాలుగా ఎంచారు. దాంతో పాటు తత్వశాస్త్రమనే అంశం విశ్వవిద్యాలయాల్లో బోధించే తత్వశాస్త్ర ఆచార్యులకే గోచరమయ్యేదని గూడ ఒక నానుడి ఉంది. బి.ఎస్.రాములుగారి 'గతితర్క తత్వదర్శన భూమిక' ఈ భ్రమలను, తప్పుడు భావాలను పటాపంచలు చేసింది. ఈ పుస్తకం ఒక మహాయజ్ఞంలో నుండి వచ్చిన వజ్రాయుధం. పరిణతి చెందిన పాండిత్యంలో నుండి వచ్చిన ఒక సుదీర్ఘ పరిశోధనా ఫలితం. భారతీయ సమాజం, మార్క్సిజం, చరిత్ర రాజకీయ సిద్ధాంతాలు, సాంఘీక వ్యవస్థ, విప్లవ ఉద్యమాల పట్ల రాములు గారి విశిష్టమైన అవగాహన ఈ పుస్తకంలో బయల్పడుతుంది.

ఈ పుస్తకంలో బి.ఎస్.రాములుగారు విలువల సమస్యనూ, రాజ్యం, పరాయీకరణం, పరస్పర శక్తిమార్పిడిలో అదనపు విలువగా ఉత్పన్నమవుతున్న రాజ్యం, సంస్కృతి మొదలైనవి విపులీకరించారు. ఇండియాలోని 'అగ్ర-పీడిత' గతి తార్కిక సంబంధాలను అత్యుత్తమ స్థాయిలో విశ్లేషించారు. మన సమాజంలో అగ్రవర్ణ అగ్రకులాలు తమ అగ్ర ప్రాధాన్యతను నిలబెట్టుకోవడానికి పీడితులను పీడిత స్థాయి నుండి విడుదల కానియ్యకుండా వారిని మరెక్కువగా పరాయీకరణం చేయడానికి ఎన్నెన్ని రూపాల్లో ప్రయత్నిస్తాయో సుస్పష్టంగా నిర్మొహమాటంగా చెప్పారు. ఈ సందర్భంలో ఒకవైపు పీడిత జనవిమోచనకు అగ్రవర్ణాల నుండి వచ్చిన వారికి పీడితులకు మధ్య జరిగే గతితార్కిక పరిణామాలను, మరొకవైపు ఉద్యమాలలో పాల్గొన్న అగ్రవర్ణ, అగ్రకుల విప్లవకారులకు పీడిత కుల విప్లవకారులకు మధ్య ఆలోచనలోను, ఆచరణలోను జరిగే గతితార్కిక సంబంధాలను వాస్తవంగా చిత్రీకరించారు. విప్లవోద్యమాల్లో గూడా పాలక అగ్రవర్ణ, అగ్రకుల, పురుషాధిక్యత రాజ్యాపరమైన భావాలు ఎలా గూడు కట్టుకొని ఉన్నాయో ఆ పరిధిలోనే విప్లవ కార్యాచరణలు ఎలా సాగించబడుతున్నాయో చూపించారు. పీడిత వర్గాలు, కులాలు, జాతులు, మతాలు, స్త్రీలు మొదలైన వారి విమోచన ఎలా జరుగుతుంది, జరగాలి అనే విషయాన్ని శాస్త్రీయంగా, స్పష్టంగా సూచించారు. ఆ క్రమంలో భాగంగా వారి విమోచనలో భారతీయ మార్క్సిస్టులు ఎలా ఎందుకు ఎక్కడ విఫలమైనారో కూడా సూచించారు.

ఈ పుస్తకం చదవడం వలన భారతీయ సమాజంలో జరగవలసిన అసలుసిసలైన మార్పు ఏది, ఏ స్థాయిలో ఎలా జరగాలి అనే విషయాల పట్ల అవగాహనకు స్ఫూర్తి, రాపిడి కలుగకుండా వుండదు.

– కొత్తపల్లి విల్సన్, తత్వశాఖ శాఖాధిపతి

15-11-1991 ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 7

(నేను ఎవరు గతితర్క తత్వదర్శన భూమిక. పేజి నెం.9)

కరపత్రం

“గతితర్క తత్వదర్శన భూమిక” ఆవిష్కరణ సభ

మార్క్సిస్టు అధ్యయన వేదిక. **స్థలం : అంబేద్కర్ భవన్, నెల్లూరు.**

తేది : 14-12-91 మ॥ 3 గం॥లకు

బి.యస్.రాములుగారి

“గతితర్క తత్వదర్శన భూమిక”

గ్రంథ ఆవిష్కరణ : వై.రాజశేఖర్ అధ్యక్షత : ఐ. రామచంద్రరావు

ఉపన్యాసకులు : బి.యస్.రాములు

(విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు)

మానవ సమాజ పరిణామక్రమంలో ఏర్పడిన అసమాన మానవ సంబంధాలు, అమానవీయత భారతదేశంలో వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ రూపం తీసుకొన్నాయి. తరతరాలుగా అమలవుతున్న ఈ వర్ణ, కుల వ్యవస్థలే భారత సామాజిక, రాజకీయ వ్యవస్థకు పునాదిగా పనిచేస్తున్నాయి. నూటికి, 85 మందిని విద్యకు, ఆర్థిక సంపత్తికి కూడా దూరంచేసి పరాయీకరణకు లోనుచేసింది. ఈ పరాయీకరణ ఎంతదూరం వెళ్ళిందంటే పీడిత కులాలు తమ విముక్తి మార్గానికి, నాయకత్వానికి, సిద్ధాంతానికి కూడా తమపై ఇంతవరకూ పెత్తనం చేసిన కులాలపైనే ఆధారపడవలసి వచ్చింది.

ఫలితంగా ఈ విముక్తి ఉద్యమం అనేక వైఫల్యాలను, విద్రోహాలను ఎదుర్కోవలసి వచ్చింది. నిరంతర ప్రవాహ సదృశ్యమైన మార్క్సిస్టు సిద్ధాంతం “జడపదార్థం”గా మార్చి వేయబడి పీడిత వర్గ విముక్తికి హాని కలిగించింది.

గతి తర్క తత్వదర్శన భూమిక గ్రంథం దళిత వాయిస్ మాస పత్రికలో 1990 నుండి సీరియల్‌గా ప్రచురించబడింది. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా బి.ఎస్.రాములు గారి భావాలతో ఏకీభవించే వందలాది మంది మిత్రులు లభించారు. దరకమే ఐక్యవేదిక నిర్మాణానికి ఈ గ్రంథం, ఆ మిత్రులు ఒక భూమికను అందించారు. తొలుత ఈ గ్రంథం 250 కాపీలు ముఖచిత్రం లేకుండా రహస్య పార్టీ డాక్యుమెంటు వలె అందించబడింది. ఆ తరువాత ముందుమాటలు, మిగతా వ్యాసాలు చేర్చి ముఖచిత్రంతో వెలువడింది. ఆ తరువాత ఈ గ్రంథాన్ని గుంటూరులో జనవరి, 1992లో జరిగిన విరసం మహాసభల్లో విరసం కార్యవర్గ సభ్యులైన విమల గారు ఆవిష్కరించారు.

అయితే ఈ క్రమానికి అడ్డుకట్టవేయడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. దోపిడీ, పీడనలకు సంబంధించిన “భారతీయ వాస్తవికత”ను అర్థం చేసుకొన్న మార్క్సిస్టు దృక్పథం కలిగిన దళితులు తమ ఉద్యమాన్ని పునరవలోకిస్తున్నారు. మార్క్సిజంలోని బ్రాహ్మణీయతను వెడలగొట్టడానికి, మార్క్సిజానికి తమ వంతు చేర్పులను అందించడానికి మేథోపరమైన జైత్రయాత్రను ప్రారంభిస్తున్నారు. ఈ జైత్రయాత్రలోని ముందు శ్రేణి తాత్వికుడే కామ్రేడ్ బి.యస్.రాములు.

కామ్రేడ్ బి.యస్.రాములు విప్లవ రచయితల సంఘం (విరసం) కార్యవర్గ సభ్యులు. చాలాకాలంగా రాష్ట్రంలోని పీడిత ప్రజా ఉద్యమాలలో జీవిస్తూ కథకుడుగా, నవలాకారుడిగా అందరికీ పరిచయమైన వ్యక్తి. ఫిలాసఫీని ఆచరణ స్థాయికి తీసుకురావాలని, పీడిత కులాలను పరాయీకరణ నుండి బయట పడెయ్యాలనీ, ఈ వ్యవస్థను రక్షించే తాత్విక సిద్ధాంతమైన హిందూయిజానికి (బ్రాహ్మనిజానికి) ప్రత్యామ్నాయంగా మార్క్సిజాన్ని మలచుకోవాలనే ఈయన కృషిలో భాగమే ఈ “గతితర్క తత్వదర్శన భూమిక”.

గతితర్క తత్వదర్శన భూమిక

- **పరాయీకరణ నుండి పీడిత వర్గాలు బయటపడటానికై చేసుకొనే ఆత్మవిమర్శ.**
- **“సాధనాలు”గానేవున్న పీడిత కులాలవారు**
  “సాధకులు” గా మారడం కోసం చేసే ప్రయత్నం.
- **పిడిసూత్రాల గుదిబండగా ఘనీభవింపజేసిన మార్క్సిజాన్ని నిరంతర ప్రవాహంగా, చలనశీలిగా మార్చడానికై చేస్తున్న చైతన్యవంతమైన కృషి.**
- **అప్రధాన వైరుధ్యాల పేరుతో అలక్ష్యం చేయబడ్డ ప్రధాన సమస్యల పరిష్కారానికై సమగ్ర సాంస్కృతిక విప్లవానికి నాంది.**
- **బ్రాహ్మణీయ మార్క్సిజానికి ఒక సవాలు, భారతీయ భౌతిక వాస్తవికత నుండి మార్క్సిజానికి ఒక చేర్పు.**

ఆలోచనా పరులారా!

పై గ్రంధావిష్కరణ సభకు విచ్చేసి జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.

-మార్క్సిస్టు అధ్యయన వేదిక, నెల్లూరు

సమీకరించు! బోధించు! పోరాడు!!

దళిత మేధావుల్లారా! సాహిత్య కళాకారుల్లారా! ఒకే వేదికపైకి రండి!!

ఈ దేశంలో వేల యేళ్లుగా చదువే నిరాకరించబడిన వర్గాలు, జాతులు, కులాలు, లింగాలు, ప్రాంతాలు చదువు నేర్చుకుంటున్నాయి. ఆ క్రమంలో వారిలో మేధావులు, రచయితలు, కళాకారులు ఎదుగుతున్నారు. సామాజిక పరిణామక్రమంలో ప్రగతిశీల ఆచరణ క్రమంలో కూడా వీళ్లు తమ రక్షణ కోసం ముందుకు సాగేవాళ్లుగా ఎదుగుతున్నారు. సామాజిక ఆచరణ ప్రజల్ని విద్యావంతులుగాను, మేధావులుగాను, రచయితలుగాను, కళాకారులుగాను ఎదిగించే కృషి చేస్తున్నది.

ఇలా అటు చదువు ద్వారాను ఇటు సామాజిక ఉద్యమాల ద్వారాను చైతన్యవంతంగా ఎదుగుతున్న మేధావులు, స్త్రీలు, కార్మికులు, కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పిల్లలు మొదలైనవాళ్లు మరింత ఎదుగుదల కోసం ఎక్కడికక్కడ ప్రయత్నాలు ప్రారంభించారు. వివిధ రచయితల, కళాకారుల, మేధావుల సంస్థల్లో చేరారు. అయితే ఆ యా సంఘాలు, సంస్థలు చాలా మేరకు ఆ యా రాజకీయ పార్టీలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను పనిచేసే పరిస్థితికి మాత్రమే లోబడిపోయాయి. దానివల్ల ఆ యా రాజకీయ పార్టీల కుండే పరిమితులు ఆ యా సాహిత్య సాంస్కృతిక రంగాలకు్కూడా ఏర్పడ్డాయి. ఈ ఆచరణక్రమంలో అవి ఆ యా రాజకీయ పార్టీల ప్రత్యక్ష, పరోక్ష ప్రచార వేదికలుగా పరివర్తన పొంది ఉనికిని కొనసాగిస్తున్నాయి.

గూడ అంజయ్య బి.ఎస్.రాములు గారిని వెతుక్కుంటూ జగిత్యాలకు వచ్చారు. అప్పటి నుండి వారి స్నేహం కొనసాగుతున్నది. జగిత్యాలకు వచ్చిన సందర్భంగా మూడు రోజుల పాటు అనేక విషయాలపై సాహితీ మిత్రులతో చర్చలు జరిగాయి. ఆ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో 21-6-1992న జరిగిన సాహిత్య సదస్సు జరిగినప్పుడు బి.ఎస్.రాములు గారిని ఆహ్వానించారు. ఆ సమావేశం పూర్తయ్యాక రాష్ట్రంలోని రచయితలను, కళాకారులను సమీకరించాలని అందుకు ఒక సంస్థ నిర్మాణం చేయాలని కీ.శే. చందనగిరి దేవయ్య గారి ఇంట్లో ఆ రాత్రి చర్చించి బి.ఎస్.రాములు రూపొందించిన కరపత్రం ఇది. అప్పటికి సాంకేతికంగా విరసంలోనే ఉండడం వల్ల బి.ఎస్.రాములు ఈ కరపత్రంలో తన పేరును చేర్చలేదు. దీన్ని గూడ అంజయ్య ప్రచురించారు. దరకమే ఐక్యవేదిక నిర్మాణానికి భూమిక అందించిన కరపత్రం ఇది.

భావ విప్లవం సామాజిక సాంస్కృతిక విప్లవం ఒక స్వేచ్ఛాయుత మానవీయ సంబంధాల్లో పరిఢవిల్లవలసి యున్నవి. కాగా దీన్ని రాజకీయ పార్టీల ఆధిపత్యం తమ స్వార్థపూరిత తాత్కాలిక దీర్ఘకాలిక లక్ష్యాల కోసం విచ్ఛిన్నం చేస్తూ వస్తున్నాయి. ప్రతి సమస్యని సామాజిక సమస్యగా పరిష్కరించడం కాకుండా రాజకీయ సమస్యగా మార్చి రాజకీయం చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలకున్న పరిమితులు ప్రజా సాహిత్యానికి కూడా విస్తరించాయి. పీడిత ప్రజల పోరాటాల గురించే తప్ప వారి జీవన సంస్కృతి ఇతర సామాజిక సమస్యలు, మధ్యతరగతిగా ఎదుగుతున్న క్రమం వారి ఆశలు ప్రజా ఉద్యమాల సాహిత్యం సహజంగానే తనకున్న వనరుల కొరతల దృష్ట్యా అవగాహనలోని లోపం దృష్ట్యా ఆచరించలేకపోయాయి. ఆ అవసరాన్ని గుర్తించలేకపోయాయి.

పోరాటాలు లేని సామాజిక జీవన సమస్యలు, మానసిక వికాసం, వారి సాంస్కృతిక అవసరాలు తీర్చే సాహిత్యం కూడా ప్రగతిశీల సాహిత్యంగా గుర్తించబడుతూ వచ్చింది. సహజంగా అదంతా పాలకవర్గ ఆధారిత పాలక కులాల అభివృద్ధి చెందిన ప్రాంతాల, లింగాల (పురుషుల), ప్రజల జీవన సంస్కృతులతో నిండి ఉండింది. అయినా అది మధ్యతరగతి పేరిట ప్రగతిశీల సాహిత్యం ఎందుకు కాకూడదు, ఎందుకు సృష్టించగూడదు అనే ఆలోచనలు మొదలైనాయి. ఆత్మగౌరవం కోసం వాళ్లు అర్రులు చాస్తున్నారు. ఏది కనపడితే అది తమకు సహకరిస్తుందని వాటికి సహకరించారు. అశేష త్యాగాలు చేశారు.

అయితే వేల యేళ్లుగా వాళ్ల సహకారం పొందిన చేతులే దళితుల్ని నిరోధించాయి. కుల, మత, జాతి, లింగ, ప్రాంత సమస్యని పరిష్కరించాలని కోరినందుకు వారిని కొందరు కులతత్వ, మతతత్వ వాదులని, స్త్రీ తత్వవాదులని, ప్రాంతీయ తత్వవాదులని ముద్రలు వేశారు. ప్రగతిశీల రాజకీయాలు మావి అని చెప్పుకునే వాళ్లు గూడా ఈ విషయంలో అలాగే ప్రవర్తిస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక సంస్థలు అవి రూపంలో సాహిత్య సంస్థలు గాను, సారంలో రాజకీయ సంస్థలుగాను రూపాంతరం చెందాయే తప్ప మహత్తర సాహిత్య సాంస్కృతిక సంస్థలుగా కృషి చేయలేకపోయాయి.

పర్యవసానంగా ఆ యా రాజకీయ పార్టీల అభిప్రాయాలతో కార్యక్రమాలతో ఏకీభవించే వాళ్ళకే తప్ప ఇతరులకు ఆ యా సాహిత్య సాంస్కృతిక సంస్థల్లో సరియైన పాత్ర లేకుండాపోయింది. దాంతో ఈనాడు చాలా సాహిత్య సాంస్కృతిక సంఘాల్లో ప్రజాస్వామిక వాతావరణం లోపించింది. తాను చేసింది మాత్రమే కరెక్టు అనేది దురహంకారాన్ని సంతరించుకొన్నది. ఈ రకమైన ఆచరణ జ్ఞానక్రమాన్ని విరబూయించే

బదులుగా అది కొందరి గుత్త సొత్తుగా మార్చే క్రమం మొదలైంది. తమ రాజకీయ ఆర్థిక విధానాలతో ఏకీభవించే వారికి మాత్రమే జ్ఞానాన్ని అందిస్తామనే ఆచరణతో అది మరింత స్వార్థంతో కుంచించుకుపోయినట్టయింది. ఈ రకమైన ఆదరణ మానవ సమాజ భవిష్యత్తును దానియొక్క జ్ఞాన స్థాయి పట్ల అచంచల విశ్వాసం ప్రకటించేదిగా కాకుండా ప్రజల చిత్తశుద్ధిని గుర్తించ నిరాకరించే అమానుష అహంకార ప్రదర్శనగా కొనసాగుతున్నది.

మనకు మనిషి మానవత, మానవ సంబంధాలు ప్రాథమికం. మనిషి ఏక కాలంలో వ్యక్తిగత జీవితం జీవిస్తాడు. సమాజంలో భాగంగా జీవిస్తాడు. సమాజం కోసం జీవిస్తాడు. అందువల్ల మనిషి సమాజం ప్రకృతిల మధ్య సంబంధాలు ఏక కాలంలో ప్రాథమికం. ఈ ప్రాతిపదిక వల్ల అన్ని రకాల అసమానతలకు విచక్షణలకు వ్యతిరేకంగా మహోన్నత మానవ సమాజంగా మనం పరివర్తన చెందవలసి యున్నది.

వర్గ కుల లింగ ప్రాంత భాష జాతి మత దేశం విచక్షణలకి అసమానతలకి వ్యతిరేకంగా పోరాడుతూ సాహిత్య సాంస్కృతిక సామాజిక రంగాలలో కృషిచేసే విశాల ప్రాతిపదికపై ఒక సంస్థ ఆవిష్కరించబడవలసి యున్నది. ఇది సామాజిక రంగంలో మహోన్నత మానవ సమాజాన్ని నిర్మించే దీర్ఘకాలిక లక్ష్యాన్ని కలిగి యుండవలసి యుంటుంది. సంకుచిత రాజకీయ అభిప్రాయాల పరిమితుల్ని బద్దలు కొట్టేదిగా కూడా ఎదగవలసి ఉంటుంది. అశేష ప్రజల్ని కలుపుకొని పోవలసి ఉంటుంది. అన్నిటికన్న అణగారిన ప్రజల్లో, ప్రాంతాల్లో, కులాల్లో, వర్గాల్లో, లింగాల్లో వికసిస్తున్న చైతన్యాన్ని సానపెడ్తూ ఒకే వేదిక కల్పిస్తు మట్టిలోని మాణిక్యాల్ని వెలికి తీయవలసిన సంస్థగా ఉండవలసి ఉంటుంది. అవ్యక్తాన్ని వ్యక్తం చేయడం కోసం శిక్షణనీ అధ్యయనాన్నీ కొనసాగించడంలో సహకరించవలసి ఉంటుంది. సమస్త పార్శ్వాల్లో రంగాల్లో ప్రక్రియల్లో మానవ వికాసాన్ని ప్రాథమిక లక్ష్యంగా కలిగి యుండవలసి యుంటుంది.

ఈ మహోన్నత లక్ష్యంతో జాతి మత కుల వర్గ లింగ ప్రాంత దేశ విచక్షణా పీడనలను నిర్మూలించే క్రమాన్ని గమ్యంగా తీసుకుని ఆవిర్భవించాలని ఆశిస్తున్నదే యీ పిలుపు. పిలుపునకు ఇంకా ఒక సంస్థ స్వరూపం ఏర్పడలేదు. ఇప్పటిదాకా వివిధ సంఘాల్లో సంస్థల్లో పనిచేస్తున్నవాళ్లు ఈ లక్ష్యాల కోసం ఒక సంస్థగా లేదా ఒక వేదికగా దగ్గరకు చేరవలసి ఉన్నది. తద్వారా మారుమూల గ్రామాలలో అట్టడుగు వర్గాలలో, కులాలలో, స్త్రీలలో తెగలలో వెనుకబడిన ప్రాంతాలలో వెలికి రాకుండా ఉండిపోయిన, ఇప్పుడిప్పుడే వెలికి వస్తున్న అశేష ప్రజానీకంలోని ప్రజా సాహిత్యకారుల్ని, కళాకారుల్నీ, మేధావుల్నీ, సామాజిక కార్యకర్తల్నీ సమీకరించవలసి యున్నది.

Dalithayugam-1
03-09-09
23

ఇలాంటి వాళ్లందరూ కలిసి ఒక సంస్థగా లేదా వేదికగా కలిసి ముందుకు సాగే చారిత్రక అనివార్యత నేడు ఏర్పడింది. ఇలాంటి సంస్థ లేదా వేదిక ఏర్పాటుపై ఆ యా రచయితలు, కళాకారులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు తమ అభిప్రాయాల్ని తెలియజేయవలసిందిగా కోరుతున్నాం. ఈ సంస్థ యొక్క పేరు లక్ష్యాలు, నిర్మాణరూపాలు ఆచరణ కార్యక్రమాలు, ఎలా ఉంటే బాగుంటాయో మనమంతా కలిసి అభిప్రాయాలు కలబోసుకుందాం.

21.6.1992 తేదిన ఆదిలాబాదు జిల్లా ఉట్నూరులో జరిగిన దళిత సాహితి సదస్సులో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి పాల్గొనడానికి వచ్చిన రచయితలు, కళాకారులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు నేటి మన కర్తవ్యమేమిటి అని చర్చిస్తున్న క్రమంలో యీ పిలుపు రూపొందింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా గత రెండేళ్లుగా పలు ప్రాంతాల రచయితలు, కళాకారులు, మేధావులు వెలిబుచ్చిన ఆశల ఆశయాల ప్రతిరూపం కూడా ఈ పిలుపు. వారందరూ ఈ పిలుపు వెనుక సమీకృతమౌతున్నారు.

వచ్చే ఆగస్టు నెలలో అంబేద్కర్ భవన్ (ట్యాంక్‌బండ్) హైదరాబాదులో రాష్ట్ర స్థాయి సమావేశము ఏర్పాటు చేయబడును. ఈ లోపు ఈ సంస్థలో లేదా వేదికలో చేరడం పట్ల మీ అంగీకారం తెలియజేస్తే సన్నాహక కమిటీ సభ్యులుగా వ్యవస్థాపక సభ్యులుగా నమోదు చేసే అవకాశముంటుంది.

ఇట్లు

- శ్రీ **గూడ అంజయ్య** (ఊరు మనదిరా)
- శ్రీ **పి.సి. రాములు** (అగ్నిశ్వాస)
- శ్రీ **డా॥ దామెర రాములు** (నెత్తుటి వెన్నెల)
- శ్రీ **డి.యం. రవిప్రసాద్** (ఇదదే జీవితం)
  సోషియాలజీ లెక్చరర్ కాకతీయ యూనివర్సిటీ
- శ్రీ **జి.ఆర్. కుర్మె** (ముద్దుగుమ్మ)
- శ్రీ **ఉదారి నారాయణ** (రచయిత)
- శ్రీ **ఏ. రాములు** (కళాకారుడు)
- శ్రీ **చందనగిరి దేవయ్య** (రచయిత), ఎల్.ఐ.సి. డెవలప్‌మెంట్ ఆఫీసర్

వివరాలకు చిరునామా :

జి. అంజయ్య, ఇం.నె. 4-45,
బోయవాడ, ఉట్నూరు - 504311,
జిల్లా-ఆదిలాబాదు (ఆం.ప్ర.)

అరసం 11వ రాష్ట్ర మహాసభలకు సందేశం

తేది. 14-11-92, అధ్యయన సదస్సు పత్రం - కీ నోట్సు

1. ఏది దళిత సాహిత్యం - ప్రజాసాహిత్యానికి, దళిత సాహిత్యానికి మధ్య గల సంబంధం ఏమిటి? వ్యత్యాసం ఏమిటి? దళిత సాహిత్యం కేవలం ××××× తీర్చే సాహిత్యమా?
2. విప్లవ సాహిత్యానికి - దళిత సాహిత్యానికి గల సంబంధం, వైరుధ్యం
3. అభ్యుదయ సాహిత్యానికి - దళిత సాహిత్యానికి గల సంబంధం, వైరుధ్యం
4. సంప్రదాయ సాహిత్యానికి - దళిత సాహిత్యానికి గల సంబంధం, వైరుధ్యం
5. జానపద సాహిత్యానికి - దళిత సాహిత్యానికి గల సంబధం, వైరుధ్యం
6. దళిత సాహిత్యం అనేది భారతీయ వాస్తవికతను చిత్రించే సాహిత్యం.
7. వర్గదృక్పథానికి - దళిత దృక్పథానికి గల సంబంధం, వైరుధ్యం
8. పీడిత కులదృక్పథానికి లోబడి సాగే పీడితవర్గ దృక్పథం దళిత సాహిత్యం
9. వర్గదృక్పథం - కులంపట్ల అతీతంగా ఉండడం సాధ్యమా?
10. ప్రాపంచిక దృక్పథం - దళిత ప్రాపంచిక దృక్పథంల మధ్య గల తేడా - భారతీయ వాస్తవికతే తప్ప వేరు కాదు.

అరసం 11వ రాష్ట్ర మహాసభలు చాలాకాలం తర్వాత జరిగాయి. వాటిలో దళిత సాహిత్యంపై అరసం మహాసభలో అందరికీ వివరించాలని ముఖ్యఅతిథిగా బి.ఎస్.రాములు గారిని ఆహ్వానించారు. వివరంగా మాట్లాడిన ప్రసంగ వ్యాసానికి తయారు చేసుకున్న కీ నోట్సు ఇది. వీటన్నిటిని అరసం సభల్లో వివరిస్తూ ప్రసంగించారు.

11. ఉత్పత్తి సంబంధాల్లో పుట్టే ప్రత్యక్ష సాహిత్యం-దళిత సాహిత్యం
12. దళిత సాహిత్యం యొక్క సాహిత్య జ్ఞానసిద్ధాంతం ఏది? బీజం - క్షేత్రం - సిద్ధాంతంలో బీజం సిద్ధాంతం మార్క్సివాదం - క్షేత్రం సిద్ధాంత స్త్రీవాదం, దళిత సాహిత్యం - పీన్‌పాల్ సార్త్రే చెప్పిన సాహిత్య సిద్ధాంతం.
13. నేటి వ్యావహారిక భాషల్లో, పాఠ్యపుస్తకాల్లో గల భాష అగ్రవర్ణ, అగ్రకుల భాషే, అగ్రకుల స్వప్రయోజనాలు నెరవేర్చే క్రమానికి అనువుగానే యీ భాష ఏర్పడింది. పితృస్వామ్యానికి అనువుగానే యీ భాష ఏర్పడింది. భాషకు వర్గ స్వభావం ఉందా? భాషకు కుల స్వభావం ఉందా?
14. జ్ఞానానికి వర్గ స్వభావం ఉంది. దాంతోపాటు మనదేశంలో జ్ఞానానికి కులస్వభావం ఉంది. సాహిత్యం జ్ఞానక్రమాల్లో ఒకటి కనుక సాహిత్యానికి కూడా కులస్వభావం ఉంది. ఈ రోజు అగ్రకులస్వభావం వున్న సాహిత్యం ఏ కులస్వభావం లేని సాహిత్యంగానూ, పీడిత కులానుకూలత ఉన్న సాహిత్యం దళిత సాహిత్యంగానూ కనపడుతున్నది. దీన్ని కొందరు కులతత్వ సాహిత్యంగా కూడా పిలుస్తున్నారు. అలా పిలవడానికి వారిలోని అగ్రకుల స్వభావమే కారణం.
15. కులాన్ని గుర్తించనివాడు అది కులతత్వం అనడం మోసం, వంచన. అతడు వర్గం తాలూకూ పదాల ద్వారానే దళిత సాహిత్యాన్ని వర్గీకరించుకోవాలి.
16. రాజకీయ పార్టీల ఆధిపత్య భావజాలం, ప్రమేయం ఉన్న సాహిత్యం ప్రజాకళల్ని, అగ్రస్వభావంలోకి మార్చి విప్లవీకరిస్తున్నాయి. అనగా విప్లవీకరణలో భాగంగా అగ్రవర్గీకరణ కూడా సాగుతున్నది. ఎలాగంటే, తిరిగి ఆయా విప్లవ కళలు, సాహిత్యం ద్వారా ప్రజలు పరస్పరం సంబంధంలో ప్రజాకళలు అభివృద్ధి చెందడం లేదు. పైగా విప్లవీకరించాక విప్లవీకరించిన రూప సారం, తప్ప విప్లవీకరించబడని రూపం, సారం, అభివృద్ధికావడం లేదు. ఇది పరాయీకరణ. అనగా పార్టీ ప్రమేయంగల సాహిత్యం, ప్రజల కళల్ని అభివృద్ధిపరచే సాహిత్యం కాదు, ప్రజాకళల్ని పరాయీకరించే సాహిత్యం.
17. అభివృద్ధి చెందిన ఉన్నతవర్ణాల, వర్గాలకనుగుణంగా వచ్చిన సాహిత్యంలో భాష, భావం, శిల్పం అన్నీ వారికనువుగానే ఉంటాయి. దీన్ని దళిత సాహిత్యం వ్యతిరేకిస్తుంది. రచయిత సాంస్కృతిక నేపథ్యాన్ని తప్పనిసరిగా లెక్కలోకి తీసుకోవాలి. అలా తీసుకోనట్టయితే ప్రపంచ సాహిత్యంతో సమానస్థాయిలా నిలబడని తెలుగు సాహిత్యాన్ని సాహిత్యం అనాల్సిన పనిలేదు.
18. డీక్లాసిఫై అయ్యే ముందు డీక్యాస్టుపై కావాలి. అందుకు సాహిత్యంలో, భాషలో,

భావవ్యక్తీకరణలో డీక్యాస్టిపై కావాలి. ఇపుడు మాట్లాడుతున్న భాష అగ్రకులీకరించే భాష.

19. వాస్తవాల్ని, సభ్యతపేర గుర్తించి నిరాకరించే దాన్లో సాధారణంగా, పీడిత కులాల వ్యక్తీకరణలే – అలా నిరాకరించేవారు అగ్రకుల స్వభావులే – (ఉదా. రంగనాయకమ్మ వ్యాసాలు) మీరు ప్రయోగం, గారు ప్రయోగం, అరే, ఒరే నిషేధం, వాస్తవాల్ని గుర్తించ నిరాకరించడం, పరాయీకరించే క్రమంలో భాగమే.

20. నేటి వచన కవిత్వ స్వభావం – అగ్రకుల స్వభావమే. జానపద పాట, గేయం, పీడితకుల స్వభావానికే.

21. పీడితకుల సాహిత్యంలో రాజ్యనిర్బంధాన్ని ప్రాథమికం చేసి ఫిలాసఫైజ్ చేయడం కాకుండా, దాన్ని మ్యానిఫెస్టేషన్లో చూపిస్తుంది. వ్యక్తీకరణలో అగ్రకుల స్వభావం వుంటుంది. కథలో ప్రక్రియలు, నవల ప్రక్రియలో వినయ స్వభావం.

22. దళిత సాహిత్య ఉద్యమంలో యిమిడి ఉన్న రాజకీయ అంశాలు

23. దళిత సాహిత్య ఉద్యమానికి నేపథ్యంగా ఉన్న ప్రజల ఆర్థిక అంశాలు.

24. దళిత సాహిత్య ఉద్యమానికి నేపథ్యంగా ఉన్న సామాజిక గౌరవ అంశాలు, విలువల శాస్త్రం సమస్య.

25. దళిత సాహిత్య ఉద్యమానికి నేపథ్యంగా ఉన్న సాంస్కృతిక సమస్యలు, తాత్విక అంశాలు.

26. దళిత సాహిత్య ఉద్యమానికి నేపథ్యంగా ఉన్న సామాజిక సమస్యలు

27. దళిత సాహిత్య ఉద్యమానికి నేపథ్యంగా ఉన్న స్త్రీ సమస్య.

28. దళిత సాహిత్య ఉద్యమానికి నేపథ్యంగా ఉన్న విద్య, నిరక్షరాస్యత సమస్య.

29. దళిత సాహిత్యం అభివృద్ధి చెందడానికి మనం ఏం చేయాలి? దళిత సాహిత్యం ఎందుకు అభివృద్ధి చెందాలి?

30. బాలల సమస్య – దళిత సాహిత్య దృక్పథం

31. జాతుల సమస్య – దళిత సాహిత్య దృక్పథం

32. ప్రజాస్వామిక హక్కులు – దళిత సాహిత్య దృక్పథం

33. సాయుధ పోరాటాలు – దళిత సాహిత్య దృక్పథం

34. గిరిజనులు – దళిత సాహిత్యం

35. ఎస్.సిలు – దళిత సాహిత్యం

36. బిసిలు – దళిత సాహిత్యం

37. అగ్రకులాల పేదలు – దళిత సాహిత్యం

38. రాజ్యాంగ యంత్రం అదృశ్యమయ్యే ఒక క్రమమే – దళిత సాహిత్యం – ఎలాగంటే కులం అణచివేత అనేదే స్వయంగా ఒక రాజ్యాంగ యంత్రం. అందువల్ల కులనిర్మూలన రాజ్య అదృశ్యం దళిత సాహిత్యంల అసత్య కర్తవ్యాల రూపము.

39. ఓటుహక్కు వచ్చాక దళిత సాహిత్యం మౌలిక మార్పుకు లోనైంది. చట్టరీత్యా దానికి ఇతర సాహిత్యాలతో సమాన స్థాయి వచ్చింది.

40. అసలు దళిత సాహిత్యమే ప్రజాసాహిత్యం ఎందుకవుతుంది? ఎలా అవుతుంది? అన్ని రకాల ప్రజాసాహిత్యాలు దళిత సాహిత్యంలోని పాయలుగా ఎందుకు కలవాలి? ఎలా కలవాలి?

6-12-92న కరీంనగర్‌లో జరిగిన

దళిత సాహిత్యంపై రాష్ట్రస్థాయి సదస్సు

విశేషాలు సంక్షిప్తంగా...

ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ప్రథమ మహాసభల ఏర్పాటు గురించి, సంస్థ నిర్మాణం గురించి ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి సమావేశం సందర్భంగా నిర్వహించిన దళిత సాహిత్యంపై సదస్సు ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.

కరీంనగర్ బస్టాండ్ ఎదుట గల నెహ్రూ యువక కేంద్రంలో జరిగిన ఈ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ఉదయం 9 గంటల నుండి చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం పదింటికి టంచనుగా ప్రారంభమైన సదస్సు పరిచయ కార్యక్రమంతో ప్రారంభించిరి. ఉదయం పదిన్నరకల్లా హాలు కిక్కిరిసిపోవడంతో పరిచయ కార్యక్రమం రాత్రికి వాయిదావేసి సదస్సు నిర్వహణ ప్రారంభమైంది.

తొలుత దళితుల కోసం నిరంతరం శ్రమించి అమరులైన ఎందరో రచయితలకు, కళాకారులకు, ప్రజలకు, వీరులకు వినయాంజలి ఘటించారు సదస్సు నిర్వాహకులు. స్వాగత వచనాలు అనంతరం ఉదయం సెషన్ ప్రారంభమైంది.

"ఒక దశాబ్ది తెలుగు కవిత" అనే అంశంపై యువకవి పి.సి. రాములు (అవిశ్వాస) ఆదిలాబాద్‌గారు తమ ప్రసంగ వ్యాసం వినిపించారు. కొన్ని ప్రశ్నలు, సమాధానాల అనంతరం ఐ. రామచంద్రరావు (నెల్లూరు) గారు "దళిత రచయితల,

---

బి.ఎస్.రాములు నిర్వహణలో 6-12-1992న కరీంనగర్ బస్టాండుకు ఎదురుగా గల నెహ్రూ యువ కేంద్రంగా దళిత రచయితల, కళాకారుల, మేధావులతో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి పలువురు రచయితలు, కళాకారులు, మేధావులు పాల్గొని ప్రసంగించారు. సైక్లోస్టైల్ చేసి ఈ రిపోర్టు రాష్ట్ర వ్యాప్తంగా పంపబడింది.

Dalithayugam-1
03-09-09
26

కళాకారుల, మేధావుల ఐక్యవేదిక యొక్క ఆవశ్యకత, దాని చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, భావజాల భూమిక" గురించి విపులంగా ప్రసంగించారు. ఈ ప్రసంగంపై ఎంతో ఆసక్తికరమైన చర్చ సాగింది. దళిత ఉద్యమాల నుండి ప్రపంచ రాజకీయ పరిణామాల దాకా యీ ప్రసంగంలోను, చర్చలోను చోటుచేసుకున్నాయి.

ఈ ఉదయం సెషన్‌కు ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, కళాకారులు జి.వై. గిరి (వరంగల్) గారు వేదికనలంకరించగా, బి.ఎస్.రాములుగారు అధ్యక్షులుగా వ్యవహరించారు. చర్చల్లో కొరివి వేణుగోపాల్ (కరీంనగర్), డి.ఎం. రవిప్రసాద్ (వరంగల్), రవీందర్ (వరంగల్), నూనె అంజయ్య (కరీంనగర్), కె. సీతారాములు (ఖమ్మం), వి.జి.ఆర్. (హైదరాబాద్), షరీఫ్ (కరీంనగర్), సుద్దాల హనుమంతుగారి సుద్దాల అశోక్ (కరీంనగర్) తదితరులు ఎందరో ఉత్సాహంగా పాల్గొన్నారు.

సదస్సు మొదటి ప్రసంగం అనంతరం వివిధ జిల్లాల నుండి, సంస్థల నుండి యీ సదస్సు జయప్రదం కావాలని కోరుతూ పంపిన సందేశాలను చదివి వినిపించడం జరిగింది. డా॥కొత్తపల్లి విల్సన్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం), మహీధర రామమోహనరావు (విజయవాడ), బొజ్జా తారకం, కత్తి పద్మారావు, మంజూష సాహితీ చిత్రమండలి (నిర్మల్), ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం. నర్సింహారెడ్డి, అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి (ఎ.ఐ.ఎల్.ఆర్.సి.) ప్రధాన కార్యదర్శి కె.వి.ఆర్. కోవెల (నెల్లూరు), డా॥ కె.యస్. చలం (విశాఖ), దాశరథి రంగాచార్య (సికింద్రాబాద్), త్రిపురనేని మధుసూధనరావు, టి.ఎల్.ఎన్. మూర్తి (కేంద్ర విశ్వవిద్యాలయం, హైదరాబాద్), బోయ జంగయ్య (నల్గొండ), కాలువ మల్లయ్య (ఫర్టిలైజర్ సిటీ), కొండపల్లి సుదర్శన్‌రాజు (ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖ), జి. సద్దర్మ (నెల్లూరు), జూపల్లి సత్యనారాయణ (ఎడిటర్, రజక దీపిక, ఖమ్మం), సి.వి. కృష్ణారావు (నెలనెలా వెన్నెల, హైదరాబాద్), అద్దేపల్లి రామమోహనరావు (కాకినాడ), క్రాంతికార్ (ఖమ్మం), శంభకుడు (గుంటూరు), బి. అయిలయ్య (వరంగల్), డా॥ ఎస్వీ (అరసం ప్రధాన కార్యదర్శి), యం. గంగాధర్ (వరంగల్) గారలు ఇంకా మరెందరో సదస్సు జయప్రదం కావాలని కోరుతూ సందేశాలు పంపారు. వ్యవధి తక్కువ కావడం వల్ల అంతకుముందే నిర్ణయమైన కార్యక్రమాల వల్ల రాలేని సభ్యులు కూడా రాలేకపోయినందుకు సందేశాలు పంపారు.

మధ్యాహ్నం భోజనానంతరం బహుజన రచయితల సంఘం తరపున వి.జి.ఆర్. నారగోని, అఖిల భారత విషమతా నిర్మూలన ఆందోళన సన్నాహక కమిటీ తరపున తులసి సంపత్‌కుమార్, దళిత కళామండలి తరపున మాస్టార్జీ, తదితరులు తమ సందేశాలిస్తూ ప్రసంగించారు. ఆ క్రమంలో మన ముందున్న కర్తవ్యాల గురించి,

సాహిత్య, సాంస్కృతిక తీరుతెన్నుల్ని కూడా వివరించారు. వారి సందేశాలు కూడా దళిత సాహిత్యంపై ప్రసంగ వ్యాసాలుగానే ఉన్నతస్థాయిని సంతరించుకున్నాయి.

అనంతరం "ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత స్పృహ" అనే అంశంపై ఉదారి నారాయణ (ఆదిలాబాద్) గారు తన ప్రసంగ పాఠం వినిపించారు. కందుకూరి అంజయ్య (కరీంనగర్) "జాతీయోద్యమం-దళిత సాహిత్యం" అనే అంశంపై ప్రసంగించారు. బి.ఎస్. రాములు సదస్సులో ఇవ్వబడిన సందేశాలకు స్పందిస్తూ కొన్ని వివరాలు యిచ్చారు. వాటిల్లో దళిత సాహిత్యంపై మార్క్సిజంపై దాడిచేయడం తగదని యిచ్చిన సూచన ముఖ్యమైనది. ఈ రోజు కుల సమస్యని ఎందరో గుర్తించినా, భారతదేశంలో గుర్తించినది, గుర్తించినా అందుకు పోరాటరూపాలు తీసికోనిది మార్క్సిజమేనని, అందువల్ల సహజంగానే మార్క్సిజం సైద్ధాంతిక మూలాల్నించి ప్రారంభించడం జరుగుతోందని వివరించారు. ఈ క్రమంలో "దళిత దృక్పథం" అనే సెమినార్ పేపర్ని సమర్పించారు. దీనిపై చాలా వేడివేడిగా, ఉత్తేజపూరితంగా చర్చ జరిగింది. అనంతరం దళిత కళామండలి హైదరాబాద్ బృందంచే మాస్టార్జీ గారి నాయకత్వంలో సాంస్కృతిక ప్రదర్శనలు కొన్ని యివ్వబడ్డాయి. కరీంనగర్ జిల్లాలోని భాను బృందం కూడా కొన్ని కార్యక్రమాలనిచ్చింది.

అప్పటికి రాత్రి 9.15 అయిపోయింది. కార్యక్రమాలు రాత్రంతా సాగాలనే ఉత్సాహంతో వున్నారంతా. అంతలో బాబ్రీమసీదు కూల్చిన వార్త, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కళ్యాణ్‌సింగ్ బర్తరఫ్, రాష్ట్రపతిపాలన వార్తలు తెలిశాయి. శాంతిభద్రతల పరిస్థితి తీవ్రమైంది. దాంతో రాత్రి 9.30లకు సెషన్ ముగించి భోజనాలయ్యాక స్టేట్ టీచర్స్ యూనియన్ భవనంలో మూడో సెషన్ సంస్థ నిర్మాణం గురించి ప్రారంభమైంది. అప్పటికి జరిగిన కొంత చర్చ జరిగి కొన్ని స్థూల నిర్ణయాలు రూపొందించబడ్డాయి. రాత్రి తిరిగి వివరంగా వాటిపై చర్చ జరిగింది. ఉదయం ఆగిపోయిన పరిచయాల కార్యక్రమం తిరిగి ఈ మూడో సెషన్‌లో ప్రారంభించడం జరిగింది. రాత్రి రెండుగంటల దాకా చర్చలు సాగాయి. కొన్ని తీర్మానాలు చేశారు.

సమావేశం తీసుకున్న సాధారణ నిర్ణయాలు - ఆకాంక్షలు - ఏకాభిప్రాయాలు

ఒక సాధారణ విస్తృత లక్ష్యంతో మన వేదిక పనిచేయాలి. అదే మన దృక్పథం. ఇది ఎన్నో సంస్థల, వ్యక్తిగత సభ్యుల రాష్ట్రస్థాయి ఐక్యవేదిక. ఇది ఈ క్రింది లక్ష్యాలపై ఐక్యవేదికగా కృషిచేస్తుంది.

1. కులనిర్మూలన కోసం

2. వర్గనిర్మూలన కోసం

3. పితృస్వామిక నిర్మూలన కోసం

4. అన్ని రంగాల్లోని అసమానతల (ప్రాంతీయ, జాతీయ, అసమానతలు, వయస్సు దోపిడీ వగైరా) నిర్మూలన కోసం

5. అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో, దళితుల నాయకత్వం, ఇందులో ప్రత్యేకించి దళిత స్త్రీలకు ప్రధాన పాత్ర వుండాలి అనే అవగాహనతో ఈ వేదిక పనిచేస్తుంది.

మన యీ వేదిక వివిధ సంఘాల ఐక్యవేదికగా పనిచేస్తుంది కనుక ఆయా స్థానిక, ప్రాంతీయ, లేదా యితర సంఘాలు తమ సొంత ఉనికిని కొనసాగిస్తూ ఒక ఫెడరేషన్‌గా పనిచేస్తాయి. వీరందరిని సమన్వయపరిచేందుకు ఆయా జిల్లాల్లో తక్షణం కన్వీనర్లు వుండే కమిటీల నిర్మాణం సాగాలి.

ఒక మాసపత్రిక నిర్వహించాలి. పత్రిక పేరు "చాటింపు". చాటింపునకు యిప్పటికే రిజిస్ట్రేషను ఉంది. దాని హక్కులలో స్వల్ప మార్పులు చేయాలి.

ఫిబ్రవరి రెండవ వారంలో రాష్ట్రస్థాయి ప్రథమ మహాసభల కరీంనగర్‌లో బస్టాండ్ ఎదుటగల "కళాభారతి" ఆడిటోరియంలో గానీ, జిల్లా కోర్టు ప్రక్కనగల శ్రీరాజరాజేశ్వర కళ్యాణమండపంలో గాని జరుగుతాయి. సభలు ఎక్కడ జరుగుతాయి అనే అంశంపై జనవరి 3వ తేదీన వరంగల్‌లో జరిగే సదస్సు-కమ్-సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

రాష్ట్ర మహాసభలు జరుపుకునేలోపు తాత్కాలికంగా ఒక రాష్ట్ర కమిటీ వుండాలి. దానికి నలుగురు, ఐదుగురు కన్వీనర్లు పని సౌలభ్యం కోసం ఎంచుకోబడితే బాగుంటుంది.

రాష్ట్రకమిటీలో సభ్యులు: సి. జాన్‌బర్నబాస్ (కర్నూలు), మాస్టార్జీ (రంగారెడ్డి), వి.జి.ఆర్. నారగోని (హైదరాబాద్), వెంకట రత్నం (ఖమ్మం), డి.ఎం. రవిప్రసాద్ (వరంగల్), గూడ అంజయ్య (ఆదిలాబాద్), ఐ. రామచంద్రరావు (నెల్లూరు), బి.ఎస్. రాములు (కరీంనగర్). ఈ సదస్సుకు హాజరుకాని యితర సభ్యుల నుండి మరికొంతమందిని యిందులో చేర్చుకోవలసి ఉంది. వరంగల్‌లో జరిగే జనవరి 3వ తేదీ సమావేశంలో వీరి ఎన్నిక జరుగుతుంది.

డి.ఎం. రవిప్రసాద్, వెంకటయ్య, పి.రాములు, కె.రాములు, ప్రసంగి గారలు తదితరులు కలసి వరంగల్ జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయుటకు కృషిచేస్తారు.

ఖమ్మం జిల్లాలో కె. సీతారాములు, వెంకటరత్నం, జూపల్లి సత్యనారాయణ, క్రాంతికార్ గారలు కలిసి పనిచేస్తారు.

సి.బాస్‌బర్నబాస్‌గారు కర్నూలు, అనంతపూర్, కడపలలో జిల్లా కమిటీలను ఏర్పరిచే బాధ్యతలను తీసుకుంటారు.

ఐ. రామచంద్రరావు (నెల్లూరు) గారు నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో కూడా కమిటీలు ఏర్పాటుచేసే కృషిచేస్తారు.

నారగోని, మాస్టార్జీ గారలు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కమిటీలను రూపొందించే బాధ్యతలను తీసుకుంటారు.

Dalithayugam-1
03-09-09
28

పి.సి. రాములు, జి.ఆర్. కుర్మే, రాములుగారలు నిజామాబాద్ కమిటీకి కృషిచేస్తారు. ఉత్తరకోస్తా జిల్లాల్లోనూ, కృష్ణా, గుంటూరు, ఇంకా ఇతర జిల్లాల్లోనూ జిల్లా కమిటీల నిర్మాణాన్ని రాష్ట్ర కమిటీయే చూసుకోవాలి. ఆదిలాబాద్ జిల్లా కమిటీని గూడ అంజయ్య, కరీంనగర్ జిల్లా కమిటీని బి.ఎస్.రాములుగారలు ఏర్పాటుచేస్తారు.

ఈ ఐక్యవేదికకు ఇమ్మడి సంపత్‌కుమార్ (హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా) గారు రూ. 2వేల దాకా ఖర్చయ్యే ప్రింటింగ్ పనిని తమ ప్రెస్సులో ఉచితంగా విరాళంగా అచ్చువేసి యిస్తారు.

కన్వీనరు బాడీకాకుండా ఇవి ఎక్కడికక్కడ ఇవి అధ్యయన బృందాలుగా కూడా ఫంక్షన్ కావాలి. స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలి. పిలిచే వక్తలకు, పిలుస్తున్న స్థానిక యూనిట్లు, భోజన వసతితోపాటు బస్సుఛార్జీలు కూడా ఇవ్వాలి.

ఏటా సభ్యత్వ రుసుం ప్రతి సభ్యుడు (రూ. 50లు) – విద్యార్థులకు, పేదలకు రూ. 25లు మాత్రమే.

చాటింపు పత్రిక చందా (రూ. 50లు) – ప్రథమ సభ్యులకు ఒక సంచిక విడుదల కావాలి.

ప్రథమ రాష్ట్రమహాసభల కోసం పైన పేర్కొన్న ప్రతి యూనిట్ రూ. 1500లు విరాళాలు సేకరించి గాని తామే తలాయింత వేసుకుని గానీ సభల నిర్వహణ నిమిత్తం పంపాలి.

తీర్మానాలు :

1. బాబ్రీమసీదు, రామమందిర వివాదాన్ని, దళితుల్లో పెరుగుతున్న చైతన్యాన్ని దెబ్బతీసి తప్పుడు చైతన్యంతో పక్కదారి పట్టించాలని బ్రాహ్మణిజంలో కుట్రతో రేకెత్తిస్తున్నదేనని యీ సదస్సు తీర్మానించింది.

2. ఈ ఐక్యవేదిక నిజమైన మూలవాసులైన భారతీయుల సాహిత్య, సాంస్కృతిక

కళాసంస్థ.

ఈ సదస్సులో డా॥ దామెర రాములు, కె. రామలక్ష్మణ్, జాగీరు శ్రీనివాస్‌గౌడ్, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, నందిని సిధారెడ్డి, పద్మజ, దాస్, కళాకిరణ్, వారాల ఆనంద్, సి. జగన్‌రావు, గీట్ల జనార్ధన్‌రెడ్డి, దామోదరరావు మొదలైన వారెందరో రచయితలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సదస్సుకు నెహ్రూ యువకేంద్రం కో–ఆర్డినేటర్‌గారు వారి సిబ్బంది, స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, భవన సిబ్బంది, ఎన్. శ్రీనివాస్ (రాష్ట్ర వినియోగదారుల సంక్షేమ సంఘం), డా॥ గోపు లింగారెడ్డి, కొరివి వేణుగోపాల్, ఎ. భూమయ్య (ఎపిటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి) పత్రికా విలేఖరులు, తదితరులు ఎందరో సహకరించారు. వారందరికి సదస్సు కృతజ్ఞతలు తెలియజేసింది.

సదస్సు నిర్వహణ ఖర్చు వివరాలు :

1.	సదస్సు బ్యానర్లు, గుడ్డ, ఆర్టిస్టు ఖర్చు కలిపి	100.00
2.	పోస్టల్ ఖర్చులు	200.00
3.	సైక్లోస్టైలు ఉత్తరాల ఖర్చు	100.00
4.	సదస్సు రోజు అటుకుల టిఫిన్	75.00
5.	సదస్సు రోజు భోజనాలు 2 పూటలు కలిపి	450.00
6.	నిర్వహణ కోసం తిరిగిన బస్సు ఛార్జీలు, సైకిల్ కిరాయి, చిల్లర ఖర్చులు	100.00
7.	పెన్నులు, నోట్‌బుక్‌లు, బ్యాడ్జీలు	200.00
8.	వసతి కల్పించిన సిబ్బందికి భత్యం	50.00
	సుమారు మొత్తం రూ.లు	1275.00
	ఇపుడు విశేషాల లెటర్ సైక్లోస్టైల్ ఖర్చులు	200.00
	పోస్టల్ ఖర్చులు	200.00
	మొత్తం రూ.లు.	400.00
	రెండు కలిసి మొత్తం ఖరీదు	**1675**

ప్రతి సభ్యుడు తన సభ్యత్వ రుసుమును వెంటనే చెల్లిస్తే యీ అప్పు వ్యవహారం

సెటిలవుతుంది. సంస్థ నిర్వహణకయ్యే నెలవారీ ఖర్చులకూ ఒక ఆధారం ఏర్పడుతుంది. కనుక వెంటనే పంపగలరని కోరుతున్నాను. సభ్యత్వ రుసుం రూ.50లు. పత్రిక చందా రూ.50లను మీరు ముందే పంపితే ఫిబ్రవరి మహాసభలకు వచ్చినపుడు భారంకాకుండా ఉంటుంది. పత్రిక మొదటి సంచిక తీయడం సాధ్యమవుతుంది.

నోటు: దీంతో పంపుతున్న మూడు పత్రికా ప్రకటనలపై మీరు సంతకాలు చేసి మీ జిల్లాల్లో పత్రికలకు విడుదల చేయగలరు. అట్లే ఇంకా ఎవరైనా వరంగల్ సదస్సులో పత్రం సమర్పించే వారుంటే మాకూ, వరంగల్‌కూ ఆ టాపిక్ తెలుపుతూ రాస్తే పత్రికలకు మళ్లీ విడుదల చేసే ప్రకటనలో చేరుస్తారు.

–బి.ఎస్. రాములు, కన్వీనర్,

ఆం.ప్ర.దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక

Dalithayugam-1

03-09-09

29

కరపత్రం

దళిత రచయితల, కళాకారుల మేధావుల ఐక్యవేదిక

ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13, 14 1993, హైదరాబాద్‌లో అంబేద్కర్ భవన్‌లో జరగబోయే ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి

మిత్రులారా!

దళిత పితామహులైన, మేధావులైన జ్యోతిరావ్ పూలే, నారాయణ గురు, డా॥ బి.ఆర్.అంబేద్కర్, పెరియార్ రామస్వామి లాంటి మహనీయులు జరిపిన కుల నిర్మూలన, ఆత్మగౌరవ ఉద్యమాలు దేశంలోని ప్రజలలో అనేక మార్పులను కలుగజేసినాయి. వీరి రచనల వల్ల, ఆలోచన విధానం వల్ల ఎస్.సి., ఎస్.టి., బి.సి. మైనారిటీల ప్రజలలో ఐక్యత, చైతన్యం, విజ్ఞానం, కులవ్యవస్థపై వ్యతిరేకత గణనీయంగా పెరిగింది. ఎస్‌సి., ఎస్.టి., బి.సి., మైనారిటీల ప్రజలలో నుండి వేలాది రచయితలు, కళాకారులు చరిత్రకారులు, సాహితీవేత్తలు, ఉద్భవించటానికి కారణమైంది. వీరంతా అగ్రకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా రచనలు చేయటానికి ముందుకు వస్తున్నారు. చాతుర్వర్ణ సిద్ధాంత దృక్పధంతో వుంటూ అంటరానితనాన్ని రెచ్చగొడ్తూ, పూజారి సంస్కృతికి జీవంపోస్తూ, ఆధ్యాత్మిక, కర్మ సిద్ధాంతాలను ప్రోత్సహిస్తూ, అగ్రకుల అహంకారాన్ని ప్రదర్శిస్తూ సమాజాన్ని విషపూరితం చేస్తున్న బ్రాహ్మణిస్టు సాహిత్య కళాకారుల స్వభావాల్ని బట్టబయలు చేస్తున్నారు. తరతరాలుగా ఆకలితో, పేదతనంతో, అంటరానితనంతో, అజ్ఞానంతో వుంటి ఎలాంటి హక్కులకు అధికారాలకు నోచుకోకుండా వెలియబడిన ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ ప్రజలకు చేయూతనిచ్చి చైతన్య పరుస్తున్నారు.

ఈ బ్రాహ్మణిస్టు సాహిత్యానికి–కళలకు సాంస్కృతిక భావజాలానికి ప్రత్యామ్నాయంగా దళిత సాహిత్యాన్ని–కళలను– సంస్కృతిని భావజాలాన్ని సృష్టించాలంటే రాష్ట్రవ్యాప్తంగా వున్న దళిత–రచయితలను కళాకారులను సంఘటితం

చేయకుండా ఈ గమ్యాన్ని చేరుకోలేం. దళిత రచయితలు విడివిడిగా వుంటూ రచనలు చేయటం వల్ల తొందరగా గమ్యాన్ని చేరుకోలేం. 85% వున్న ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనారిటీ ప్రజలను తొందరగా ప్రభావితం చేసి విజ్ఞానవంతులుగా చేయలేం. అందుకే దళిత రచయితలను కళాకారులను ఐక్యం చేయటానికి వారిలో సృజనాత్మక కళలను వెలికి తీయటానికి సాహిత్యమనే ఆయుధానికి పదును పెట్టడానికి "దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక" అనే సంస్థ ఏర్పాటు అయింది. 1992 డిసెంబర్ 6న కరీంనగర్ పట్టణంలో పెద్ద ఎత్తున దళిత రచయితలు, కళాకారులు పాల్గొనం వల్ల ఈ ఐక్య వేదిక విజయవంతమైంది. కరీంనగర్ సమావేశంలోనే కార్యక్రమము, తాత్కాలిక కమిటీ ఏర్పాటుకు రూపకల్పన చేయబడింది. ఫిబ్రవరి నెలలో హైదరాబాద్‌లో రెండు రోజుల ప్రథమ మహాసభలను నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడమైంది. జనవరి 3న వరంగల్ శాఖ ఆధ్వర్యంలో గొప్ప సదస్సు జరిగింది. దీనికి రాష్ట్ర నలుమూలల నుండి దళిత రచయితలు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సదస్సు అనేక నిర్ణయాలు తీసుకుంది. హైదరాబాద్‌లో జరిగే ప్రథమ మహాసభల నిర్వహణ ఏర్పాట్లు చర్చించింది. దానిలో భాగంగానే దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి, 1993 హైదరాబాద్‌లో జరిగే ప్రథమ మహాసభలను విజయవంతం చేయటానికి ఎస్సీ., ఎస్టీ, బి.సి. మైనారిటీల సంఘం, సంస్థల, రాజకీయ పార్టీల, వ్యక్తుల సహకారాల్ని కోరుతుంది. ముఖ్యంగా మహాసభల నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

తేదీ : 8-1-1993

దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక

రాష్ట్రకమిటి

ఆంధ్రప్రదేశ్

దరకమే ఐక్యవేదిక ప్రథమ మహాసభల నిర్వహణ కోసం ఏర్పడిన అడహాక్ కమిటి, డ్రాఫ్టు కమిటి కలిసి రూపొందించిన కరపత్రం ఇది. ఆహ్వాన సంఘ నాయకులైన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జలదృశ్యంలో ఇది రూపొందించి ప్రచురించబడింది. దీని తర్వాత రెండు రోజుల కార్యక్రమ వివరాల కరపత్రం ప్రత్యేకంగా ప్రచురించబడింది.

దళిత (ఎస్సీ, ఎస్టీ, బీసీ) మైనారిటీల, రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక - ఆంధ్రప్రదేశ్

చిత్తు ప్రణాళిక

పడగవిప్పిన బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విష సంస్కృతి ఆట కట్టించడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజన దళిత శక్తులకు చెందిన కవులు, కళాకారులు, మేధావులంతా ఏకమై ప్రత్యామ్నాయ దళిత విప్లవ సంస్కృతినీ, సాంస్కృతికోద్యమాన్ని నిర్మించాల్సిన చారిత్రక కర్తవ్యం మన ముందు కొచ్చింది.

సాంస్కృతిక రంగంలో ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన సాహితీ సాంస్కృతికోద్యమం బ్రాహ్మణీయ సంస్కృతి ప్రభావం నించి బయట పడకపోవటం వలన చారిత్రక వైఫల్యానికి గురైంది.

ఈ చారిత్ర నేపథ్యంలోంచే ఈ చారిత్రక సవాలుని ఎదుర్కోవటానికి సామాజిక అణిచివేతను తుదముట్టించటానికి ఒక నూతన సామాజిక పోరాట శక్తిగా దళిత ఉద్యమం ముందుకొచ్చింది. ఈ ఉద్యమ ప్రేరణతోనే దళిత సాహిత్య, సాంస్కృతికోద్యమం ఉనికిలోకి వచ్చి కలం పట్టి గళ్ విప్పింది. విభిన్న మార్గాల్లో వివిధ సంస్థలు, శక్తులు వ్యక్తులు చేస్తున్న ఈ కృషిని రాష్ట్ర వ్యాపితంగా ఒక ఐక్యవేదిక మీదకి తీసుకువచ్చి సంఘటితంగా సాగటానికి సమాఖ్యగా రూపొందింది. డిసెంబర్ 6న కరీంనగర్‌లో జరిగిన సదస్సు, జనవరి 3న వరంగల్‌లో జరిగిన సదస్సుల్లో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన దళిత రచయితలు, కళాకారులు పాల్గొని దళిత సాహిత్య దృక్పథాన్ని చర్చించి తీసుకున్న నిర్ణయంలో భాగంగానే 'దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఆవిర్భవించింది. ఈ సమాఖ్య ప్రణాళికాబద్ధంగా సాగటానికి నిర్దిష్టమైన కొన్ని మార్గదర్శక సూత్రాల్ని, కర్తవ్యాల్ని రూపొందించుకొంది. అదే ఈ ప్రణాళిక, నిబంధనావళి.

ప్రణాళిక

1. సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, భాషా, ప్రాంతీయ

అసమానతలకు, అణిచివేతకు తావిచ్చే సామాజిక విలువలకు, సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడి అణిచివేతకూ, అసమానతలకూ తావులేని నిజమైన ప్రజాస్వామిక నూతన సాంస్కృతిక విలువల సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంది.

2. ఈ కుల, వర్గ, లైంగిక అసమానతల సమాజంలో అగ్ర కుల అణిచివేతకీ, పురుషాధి పత్యానికీ, బ్రాహ్మణ, బనియా (వ్యాపార), అగ్ర కుల భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద - వర్గ దోపిడీకి వ్యతిరేకంగా సాగే వర్గ విముక్తి పోరాటానికి, జాతుల విముక్తి పోరాటాలకి, స్త్రీ విముక్తి పోరాటానికి, అగ్ర కులాధిపత్య వ్యతిరేక కుల నిర్మూలనా పోరాటానికి బాసటగా సాంస్కృఇక భావజాల రంగంలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వరిస్తుంది.

3. బ్రాహ్మణాధిక్య హిందూ వర్ణాశ్రమ, అగ్ర కుల సమాజానికి, సంస్కృతికి పోరాడిన మన పూర్వీకులు చార్వాకులు, లోకాయతుల నుండి బుద్ధుడు, బసవేశ్వరుడు, పోతులూరి, వేమన, అమీర్‌కుస్రో, గురునానక్, కబీర్‌దాసు, గురు రవిదాసు, జ్యోతిరావు పూలే, పెరియారు, నారాయణగురు, అంబేద్కర్, జాషువా, కుసుమ ధర్మన్న తదితరుల చారిత్రక స్ఫూర్తిని స్వీకరిస్తుంది. వారి సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సైద్ధాంతిక వారసత్వాన్ని ముందుకు తీసుకెళుతుంది.

4. స్త్రీ అణిచివేతకు మూలమైన మగ పెత్తనానికి, పితృస్వామిక కుటుంబాధిపత్య వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడుతుంది.

5. విదేశీ సెక్స్, హింసా విష సంస్కృతే ఉదాత్తమైనదిగా, వెనుకబడిన దేశాల ప్రజల సంస్కృతి అనాగరికమైనదిగా ఇంగ్లీషు సినిమాల్లో, సాహిత్యంలో చిత్రించే సామ్రాజ్యవాద ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుతుంది. అలాగే ఈ దేశంలో దక్షిణాది తమిళ భాషని ఉత్తరాది హిందీ సినిమాల్లో తమిళ మాండలిక యాసలో అపహాస్యం చేయటం, తెలుగు సినిమాల్లో వివిధ తెలుగు మాండలిక యాసల్ని హాస్య పాత్రలకి, గూండా పాత్రలకి పెట్టి అనాగరికంగా అపహాస్యం చేసే భాషా, ప్రాంతీయ ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుతుంది.

6. ఈ విధంగా కుల, వర్గ, లింగ, మత, జాతి తదితర అన్ని రంగాల ప్రజల్ని సామాజికంగా సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచి వుంచి ఆధిపత్యం చెలాయించే బ్రాహ్మణ సంస్కృతిని తుదముట్టించటానికి పోరాడే విప్లవ సంస్కృతే దళిత సంస్కృఇతి. బ్రాహ్మణీయ అణిచివేత సంస్కృతికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయంగా ప్రజల ప్రజాస్వామ్య నూతన సాంస్కృతిక విలువల్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల్లో పునరుద్ధరించటమే దళిత సంస్కృతి ప్రధాన కర్తవ్యం.

7. ఎస్సీ, ఎస్టీ, బీసీలకి చెందిన అణగారిన కులాల్లో, మైనారిటీలలో దాగివున్న ప్రజల శక్తి యుక్తుల్ని వెలికితీసి, సాహితీ, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ,తాత్విక రంగాలన్నింటిలోనూ నూతన పోరాటానికి నేతృత్వం నాయకత్వం వహించేట్లుగా వారి సృజనాత్మక శక్తుల్ని అభివృద్ధి చేస్తుంది.

నిబంధనావళి

1. పై ప్రణాళికా లక్ష్యాల్ని సమ్మతించిన వారందరికీ ఈ వేదికలో సభ్యత్వం వుంటుంది. సభ్యత్వ రుసుం సం॥నికి 10 రూపాయలు.
2. వేదిక పేరు "ఆం.ప్ర. దళిత (ఎస్సీ, ఎస్టీ, బీసీ) మైనారిటీల రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక."
3. వివిధ సంస్థల, శక్తుల, వ్యక్తుల ప్రాతినిధ్యంతో ఏర్పడే ఈ ఐక్యవేదిక సమాఖ్య స్వభావం కలిగి వుంటుంది. ఈ సమాఖ్యలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా అన్ని స్థాయిల్లోనూ ప్రాతినిధ్య స్వభావం ఒకే విధంగా వుంటుంది.
4. రాష్ట్ర కార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకొంటుంది. మహాసభ ప్రతి రెండేళ్ల కొకసారి జరుగుతుంది. సం॥ని కొకసారి సర్వసభ్య సమావేశం, సాహిత్య సాంస్కృతిక పాఠశాల జరుగుతుంది. ప్రతి మహాసభలో ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుల బాధ్యతలు మారతాయి. ఈ బాధ్యతలు నిర్వహించేవారు రెండుసార్లకి మించి వుండరాదు. వెంట వెంటనే కూడా రెండుసార్లు వుండరాదు.
5. కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొనేవారిని సాహితీ సాంస్కృతిక రంగాల్లో నిర్దిష్టంగా కృషి చేసేవారిని, క్రియా శీలకుల్ని అణగారిన కులాలకు, వర్గాలకు, స్త్రీలు మైనారిటీలకు చెందిన వారిని ప్రాధాన్యత ఇచ్చి ఎన్నుకోవాలి.
6. జిల్లా మహాసభలు జిల్లా కార్యవర్గాన్ని పై ప్రాతిపదికపైనే ఎన్నుకోవాలి.

2

సాహిత్యం సమాజం

దళిత సాహిత్య గర్జన

దళిత సాహిత్యం అంటే ఏమిటి? దళితుల మేలు కోరేది దళిత సాహిత్యం. ఈ జవాబుతో ఎవరికీ పేచీ లేదనుకుంటాను. ఇంత సులువైన ప్రశ్నకు యింత సులభమైన జవాబుండగా దళిత సాహిత్యం అనగానే కొందరు ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదు. బహుశా దళితుల మేలుకోరే సాహిత్యం తమకు కీడు కలుగజేస్తుందని వాళ్ళ భయం కాబోలు.

అయితే ఒకటి వాస్తవం. ఎవరు దళితులనే వివరణ పట్ల తేడాలు ఉండవచ్చు. ఏది దళితులకు మేలు చేస్తుందనే దానిపట్ల బేధాభిప్రాయాలుండవచ్చు. దాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ కొందరు దళితుల మేలు కోరే దళిత సాహిత్యం అనే మాట పట్ల కూడా ఎందుకు పేచీ పెడుతున్నారో తెలియదు.

వాళ్ళల్లో కొందరు అభ్యుదయ సాహిత్యం అనో, ప్రజా సాహిత్యం అనో, విప్లవ సాహిత్యం అనో, హిందూ సాహిత్యం అనో పిల్చుకుంటే సరిపోతుంది గదా అని ప్రశ్నిస్తుంటారు. ఇవన్నీ నిజంగా ప్రజలందరి మేలు కోరేవి గనుక అయితే అవి దళితుల వ్యతిరేక సాహిత్యమేమీ కాదుగదా! అయినపుడు

శంభుక 'పోయేదేమీ లేనోళ్లం' పుస్తకానికి 1992లో రాసిన ముందుమాటనుండి విడదీసి ప్రత్యేక పుస్తకంగా దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక, వరంగల్ జిల్లా వారు అచ్చు వేశారు. వేల కాపీలు రాష్ట్ర వ్యాప్తంగా మళ్ళీమళ్లీ ముద్రణ పొందాయి. పత్రికల్లో పునర్ ముద్రించబడిన వ్యాసం ఇది. 'కన్యాశుల్కంను ఎలా చూడాలి?' వ్యాసంలాగే సాహిత్య చర్చను మలుపు తిప్పిన వ్యాసం ఇది.

అభ్యుదయ సాహిత్యం అనో, ప్రజా సాహిత్యం అనో, విప్లవ సాహిత్యం అనో, హిందూ సాహిత్యం అనో మాత్రమే పిలవాలనే వాదం ఎంతో బలహీనంగానైనా ఎందుకు ముందుకు వస్తున్నది? అసలా ప్రశ్నే ఎందుకు ఉత్పన్నమవుతుంది.

సమాజంలో దళితులు తమ సొంత కాళ్ళమీద నిలబడడం యిష్టంలేని వారు కొందరున్నారు. అందుకు వాళ్ళలో కొందరు సాహిత్య రంగంలోనూ కృషి చేస్తారు. అలాంటి వారు దళితులు తమ సొంతకాళ్ళమీద నిలబడ్డం యిష్టం లేని తనానికి సాహిత్య రూపం యిస్తారు. అప్పుడు వారి వాదం "దళిత సాహిత్యం, దళిత దృక్పథం" అంటూ ప్రత్యేకంగా ఉండనవసరం లేదనే రూపం తీసుకుంటుంది. దళితులు తమ సొంత కాళ్ళ మీద నిలబడనవసరం లేదనటానికి, ప్రత్యేకంగా "దళిత సాహిత్యం, దళిత దృక్పథం", దళిత సంఘాలు, దళిత రచయితల సంఘాలంటూ ఉండనవసరం లేదనటానికి మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. మొదటిది వారి ప్రాపంచిక దృక్పథం అయితే రెండోది సాహిత్యంలో దాని ఆచరణా, వ్యక్తీకరణా, అంతే. అందువల్ల ఎందరు ఎంత గట్టిగా "దళిత సాహిత్యం", "దళిత దృక్పథం", "దళిత సంఘాలు" దళిత రచయితల సంఘాలు అంటూ అవసరం లేదని వాదిస్తారో సరిగ్గా వారిలో అంత మేరకు దళిత వ్యతిరేక దృక్పథం ఆచరణ కొనసాగుతోందని అర్థం.

అయితే, వీళ్ళు నాజూకుగా వ్యవహరిస్తున్నారు. ఒక సాధారణీకరణ పొందగలిగే సాహిత్యాన్ని నిర్దిష్టంగా దళిత సాహిత్యం అంటూ కుదించటం ఎందుకు అని వగలుపోతారు. వాళ్ళన్నదే నిజమైతే, సాహిత్యాన్ని, ప్రజా సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం, హిందూ సాహిత్యం అని ఎందుకు నిర్దిష్టం చేస్తున్నట్టు? "సాహిత్యం" అని పిలవవచ్చుగదా!

ప్రజాసాహిత్యం అని పిలుస్తున్నారంటే ప్రజా సాహిత్యేతర సాహిత్యం కూడా వుంటుందనే గదా! విప్లవ సాహిత్యం అని పిలుస్తున్నారంటే విప్లవేతర సాహిత్యం కూడా ఉంటుందనీ అర్థం. అలాగే దళిత సాహిత్యం అని పిలుస్తున్నామంటే దళితేతర సాహిత్యం కూడా ఉంటుందని అర్థం. దళితేతర సాహిత్యంలో దళిత వ్యతిరేక సాహిత్యం కూడా వుండవచ్చు.

సాధారణీకరణ పొందే తాత్వికతను, ప్రాపంచిక దృక్పథాన్ని దళిత దృక్పథం, దళిత సాహిత్యం అని పిలవడం, కుదించడంగా ఎందుకు కనబడుతుంది వారికి? దళితుల్ని, దళిత దృక్పథాన్ని కుదించి చూసే దళిత వ్యతిరేకులకు తప్ప అలా మరొకరికి ఎందుకు కనబడుతుంది? ఇలాంటి వాళ్ళే దీన్ని సామాజిక రంగంలో నన్ను నేను "హిందువుననో, భారతీయ పౌరున్ననో, పీడితవర్గంననో, ప్రపంచ మానవుడిననో,

సగర్వంగా ప్రకటించుకోకుండా మళ్ళీ నేను మాలమాదిగను, డెక్కలినీ, ఛండాలినీ, కిరాతుడిని, చాకలిని, మంగలినీ, సాలెను, గొల్లను అని నీకు నీవే ఎందుకు కించపరచుకుంటావు" అని ప్రశ్నిస్తారు.

ఈ ప్రశ్న దళితుడిని గౌరవించటం కోసమేననుకుంటారు. కానీ వాళ్ళు ఆ మాట అన్నప్పుడల్లా నా హృదయం బల్లెంతో తూట్లు పొడిచినట్టు విలవిలలాడి పోతున్నదని వారికి తెలియదు. తెలియదా! ఏమో వారికి తెలుసో, తెలియదో కూడా తెలియదు. నన్ను నేను మాల మాదిగను, డెక్కలిని, ఛండాలిని, గొల్లను, సాలెను, మంగలిని, చాకలిని అని సగర్వంగా ప్రకటించుకోవటం నన్ను నేను కించపరచుకోవటంగా వారికి కనిపిస్తున్నదా? నేను బ్రాహ్మణుడినని, రెడ్డిని, వెలమను, కమ్మను, ముస్లింను, హిందువును, పీడిత వర్గాన్ని అని నీవు నీ యింటి పేరులోను, లోకంలోను, నీ సంస్కృతిలోను ఆచరణలోను ప్రకటించుకోవటానికి నీకు సిగ్గెందుకు లేకుండా పోయిందో తెలుసుకోవచ్చా? నీకు గల బ్రాహ్మణుడు, కోమటి, రెడ్డి, హిందువు, ముస్లిం, పీడిత వర్గం అనే నిర్దిష్టతలు నీలోని భారతీయుడు, మానవత్వం అనే సాధారణీకరణల్ని, విలువల్ని నాలోని పీడితవర్గం వాటిని కించపరుస్తాయా! అంటే ఏమిటి? నీ కులం హోదాకు హీనత్వమేమీ లేదని దాన్ని నీవు కూడా అనుభవిస్తున్నావు. నాకు గల కులం, తద్వారా నాకు గల నిర్దిష్ట సామాజిక హోదా చిహ్నం, గుర్తింపు చిహ్నంను నీవు కూడా కించపరచడం వల్లనే కదా నీలో ఈ భావం కలుగుతోంది.

అయ్యా! యిలా నన్నూ నా కులాన్నీ, నా దృక్పథాన్ని, "దళిత దృక్పథం", "దళిత సాహిత్యం" అనే నిర్దిష్టత్వంలోకి కుదించకుండా ప్రజా దృక్పథం అనో, వర్గ దృక్పథం అనో, మరొకటనో ఒక సాధారణీకరణ పొందే ప్రయత్నం చేయాలనడంలోనే నన్నూ, నా జాతినీ, కులాన్నీ, పేరునూ, నా దృక్పథాన్నీ కించపరచి చిత్రవధ చేయటమౌతుందని నీకు మాత్రం తెలియదా? దళితులు ఒక వాస్తవం. దళిత దృక్పథం, దళిత సాహిత్యం అనేవి కాలం తీరినవైపోతాయి. అంతదాకా దళిత దృక్పథాన్నీ, దళిత సాహిత్యాన్నీ వాటి అస్తిత్వాన్నీ ఆవశ్యకతను అంగీకరించని వారు వాస్తవాలను గుర్తించ నిరాకరించే వారే కాకుండా అగ్రకులతత్వ పూరిత హిందూ మనుధర్మాన్ని గుండెల్లో నింపుకొని 'పజలు, ప్రజలంటూ'పైపైన అరిచే పచ్చిస్వార్థపరులు, స్వప్రయోజనపరులు అని స్పష్టం అవుతున్నది.

ఇలాంటి వీరు అందమైన పదాలు, ఆవేశపూరిత ఆర్భాటాలు తమ దళిత వ్యతిరేకతకు నగిషీలుగా ఉపయోగిస్తారు. దాంతో వీరి అరుపులు హిందూవర్గ గోడమీది పిల్లుల్లాగుంటాయి. వీరి పిల్లి కూతలకు దళిత దృక్పథం ఉట్టిగెగదు. దళిత సాహిత్యం

ఆగిపోదు. వారు ఏ దృక్పథంతో రాసినా అది దళితులకు మేలు చేసేదైనపుడు "వారిది దళిత దృక్పథం కూడా" అని వర్గీకరించడాన్ని అభ్యంతర పెట్టేవాళ్ళు, రాసేదీ చేసేదీ ప్రజా సాహిత్యంగానీ, విప్లవ సాహిత్యంగానీ, హిందూ సాహిత్యంగానీ, వర్గ సాహిత్యం గానీ, ఎలా అవుతుందో వారికే తెలియాలి. అంటే మన ఇంటికి పిల్లను ఇవ్వడం గానీ, మన ఇంటి పిల్లను చేసుకోవడంగానీ వారికి యిష్టం లేదన్న మాట. వారు మనతో మంచం పొత్తు, కంచంపొత్తుకే కాకుండా మాట పొత్తుకు కూడా వ్యతిరేకులన్నమాట.

అందువల్ల దళితులకు ఉపయోగపడే ప్రజాసాహిత్యంగానీ, విప్లవ సాహిత్యంగానీ, వర్గ సాహిత్యంగానీ, దళితసాహిత్యంగా వర్గీకరించడానికి చెప్పే అభ్యంతరాలు స్పష్టంగా అస్పృశ్యతకు సంబంధించినవే. అస్పృశ్యతకు ఏడేళ్ల జైలుశిక్ష. కాగా వీరిలోకొందరు ఘరానా పెద్ద మనుషులుగా, తత్వవేత్తలుగా, హిందువులుగా, రచయితలుగా, రాజకీయ నాయకులుగా, విప్లవకారులుగా చలామణి కావడం విచిత్రం. తాత్విక, సామాజిక విమర్శ రూపంలో, సాహిత్య విమర్శ రూపంలో సాగుతున్న యీ తాత్విక, సామాజిక సాహిత్య అస్పృశ్యతను దళితులు, ప్రజాస్వామిక వాదులు నిరంతరం ఎండగట్టాల్సి వున్నది.

వివిధ దృక్పథాల్లో సామాజిక జీవితాన్ని, ప్రజా జీవితాన్ని విశ్లేషించే సాహిత్యాన్ని, ఆచరణను ఆయా దృక్పథాలతోనే చూడాలిగానీ దళిత దృక్పథంతో చూడ్డం సరికాదు అని ఎవరైనా వాదించవచ్చు. వారు వాస్తవాలను ఏ దృక్పథంతో చిత్రించినా దళితుల మేలుకోరే సాహిత్యంగా ఉన్నదా లేదా అని తేల్చడం అత్యంత ముఖ్యమైన విషయం.

వారు ఏ దృక్పథంతోనైనా రాయనీగానీ, కులం అనేది యిప్పటికే ఒకరి అభివృద్ధికీ మరొకరి అణచివేతకు సాధనంగా కొనసాగుతోందా లేదా అనేది అసలైన సూటిప్రశ్న. కొనసాగడం లేదు అనేవాడు పుట్టుగ్రుడ్డి లేదా పెట్టుగుడ్డి, వారికి రెండు కళ్ళూ అమర్చాలి. అందుకు వారి దృక్పథం, జీవితం అనే ఎందు కళ్ళకూ ఆపరేషన్ చేయాల్సి వుంటుంది. కులప్రాతిపదికపై రిజర్వేషన్లను అంగీకరించేవారూ, వ్యతిరేకించే వారూ కులం అనేది ఒకరి అభివృద్ధికీ, మరొకరి అణచివేతకు సాధనంగా సాగుతోందని అంగీకరిస్తున్న వారే. కులాన్నీ, కులంలోగల యీ లక్షణాన్నీ గుర్తించనివాడు, అది అగ్రకులతత్వంగానీ, పీడిత కులతత్వంగానీ దాన్ని "కులతత్వం" అనే పదాల్లో చెప్పడం మోసం, వంచన. వాళ్ళు వర్గం, హిందువు తాలూకు పదాల ద్వారానే కులతత్వాన్ని, దళిత సాహిత్యాన్ని, దళిత సంఘాలను, దళిత రచయితల సంఘాలను వర్గీకరించుకోవాలి. తమ రచనల్లో అన్నిటితో పాటు కులాన్నీ, కుల అణచివేతను చిత్రించనివారు, ఈ దేశంలోని ఒక ముఖ్య వాస్తవాన్ని వదిలేసి మాయావాదంతో

స్వప్నజగత్తులో విహరించే బాధ్యతా రహితులే.

జ్ఞానానికి మత స్వభావం వుంది. జాతి స్వభావం వుంది. వర్గ స్వభావం వుంది. కుల స్వభావం వుంది. యూరప్‌లో గుర్రాల వినియోగం ఎక్కువ. అందువల్ల అక్కడ కనుక్కున్న కరెంటును కొలవడాన్ని గుర్రపు శక్తి (హార్స్‌పవర్) అని పిలిచారు. కరెంటును మన దేశంలో కనుక్కుంటే దాన్ని ఎద్దుశక్తి (ఆక్స్‌పవర్)తో కొలిచేవారు. ఒక గిరిజనుడు కనుక్కుంటే దాన్ని "దున్నపోతు" శక్తితో కొలిచేవారు. హిందూ మతతత్వం గల బ్రాహ్మణిస్టు దాన్ని కనుక్కుంటే ఎద్దుశక్తి అని గాకుండా గోశక్తి (కౌపవర్) అని పిలిచే వారు. ఇలా జ్ఞానానికి వర్గ స్వభావం, మత స్వభావం, కుల స్వభావం, జాతి స్వభావం ఏకకాలంలో కొనసాగుతాయి. మన దేశంలో పీడిత కులాల ప్రజలే ఎక్కువ మేరకు నిరక్షరాస్యులుగా, పేదలుగా బతుకీడుస్తున్నారంటే, మన దేశ భాషలు, మతాలు, జ్ఞానం, అభివృద్ధి, కులవ్యవస్థ, సంస్కృతి, రాజకీయాలు, విప్లవపోరాటాలు మొదలైనవన్నీ అగ్రకుల స్వప్రయోజనాల కనువుగా పరివర్తన చెందించబడుతున్నాయని అర్థం.

అది నిజంగా ప్రజాసాహిత్యంగానీ, అభ్యుదయ సాహిత్యంగానీ, విప్లవ సాహిత్యం గానీ, వర్గ సాహిత్యంగానీ, హిందూ సాహిత్యంగానీ అయితే అది దళితుల మేలు కోరే దళిత సాహిత్యానికి, దళిత దృక్పథానికి, దళిత ఆచరణకు వెలుపలవుండే సమస్యే ఉత్పన్నం కాదు. దళిత సాహిత్యంలో, దళిత దృక్పథంలో, దళిత ఆచరణలో భాగం కాలేనిది,దళితులతో, దళిత సంఘాలతో, దళిత సాహిత్యకారులతో, దళిత రచయితల సంఘాలతో కలిసి పని చేయలేనిది ప్రజాదృక్పథంగానీ, వర్గ దృక్పథంగానీ, హిందూ దృక్పథంగానీ, మానవతా దృక్పథంగానీ ఎలా కాగలదు? అది స్వప్రయోనం కోరే సాహిత్యం అవుతుందేగానీ, పరుల ప్రయోజనం కోరే సాహిత్యం ఎలా కాగలదు?

అది ఏ సాహిత్యమైనా, ఏ ఆచరణైనా పరోపకారాన్ని కోరుతున్నదా? స్వప్రయోజనాలకు పరిమితమైనదా? ప్రజావ్యతిరేక అంశాలేమైనా వున్నాయా? అని నిర్ధారించడానికి దళితులను, దళిత ప్రయోజనాలను, దళిత సాహిత్య ప్రమాణాలను కూడా ఒక గీటురాయిగా తీసుకోవటం అనివార్యమవుతుంది. నిర్మాణ రూపాల్లో ఇదే ప్రత్యేకంగా దళిత సంఘాలు, దళిత రచయితలు, దళిత సాహిత్యానికి వెలుపల వుండే సాహిత్యంలో దళిత వ్యతిరేక అంశాలుంటే అవకాశాలున్నాయి. వాటి దృక్పథాన్ని, ఆచరణను విశ్లేషించాలన్నా, సరిచేయాలన్నా, వాటన్నింటిని దళిత దృక్పథం, దళిత సాహిత్యం పరిధి లోపలికి తెచ్చి చర్చించక తప్పదు. అందువల్ల కూడా ఎన్ని రకాల దృక్పథాలున్నా తిరిగి వాటన్నింటిలో దళిత దృక్పథం, దళిత సాహిత్యం, దాని అస్తిత్వం ఆచరణ అనివార్యమవుతున్నది. దళిత రచయిత సంఘాలు,

దళిత సాహిత్యోద్యమం మొదలైన వాటి అస్తిత్వాన్ని, ఆచరణని ఉత్పన్నం చేస్తున్నది. అదే సమయంలో వివిధ సమస్త దృక్పధాల్లో, సాహిత్యాల్లో, దళిత సాహిత్య విభాగాలను, దళితుల ప్రత్యేక సెల్స్ విభాగాలను కూడా అనివార్యం చేస్తున్నది. దళితుల ప్రయోజనం మేరకు యివి ఆయా సంస్థలలో, సాహిత్యాలలో, వాటిపై ఉన్నతాధికార సంస్థగా, సాహిత్యంగా నిర్దేశించగలిగినపుడే వీటి లక్ష్యం నెరవేరుతుందని కూడా స్పష్టమవుతున్నది.

03 జనవరి, 1993, దళిత సాహిత్యంపై సదస్సు

ఆం.ప్ర. దళిత రచయిత, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక, వరంగల్ శాఖ

Dalithayugam-1
03-09-09
35

స్వదేశీ సిద్ధాంతవేత్తలకు ప్రత్యేక అవకాశాలు

విదేశీ వాదాలకు గల సౌకర్యాలు స్వదేశీ వాదాలకు లేవు. గనక అంతర్జాతీయ స్థాయికి మనమే ఎదగడం దీనికి పరిష్కారం! ఇది బహుజనులకు వచ్చిన గొప్ప అవకాశం.

ఇక్కడ నక్సల్బరీలో వసంతమేఘం గర్జిస్తే పొరుగున వున్న చైనా దేశపు మద్దతు ప్రతిధ్వనించింది. చైనా అధికార పత్రిక పీపుల్ డైలీ సంపాదకీయం రాసింది. అదే సమయంలో 1967లో యిక్కడే మహారాష్ట్రలో పుట్టిన దళిత పాంథర్స్ ఉద్యమానికి అలాంటి విదేశీ మద్దతు పెద్దగా అందలేదు. ఇంటిపట్టున వుండే స్త్రీ ఎదురు తిరిగి పురుషుడిపై గర్జిస్తే ప్రపంచం, కుటుంబం, అతలాకుతలం అయిపోయాయి. ఎన్నో దేశాలు కదలబారి మద్దతు పలికాయి. ఐక్యరాజ్య సమితి మహిళా దశాబ్దాన్ని, మహిళా సంవత్సరాన్ని, మహిళా దినోత్సవాన్ని ప్రకటించి నిధులు కేటాయించాయి. అట్టడుగు ప్రజలదాకా అందకపోయినా విద్యావంతులైన ఎందరో స్త్రీలకు నైతిక స్థైర్యాన్నీ, సైద్ధాంతిక మద్దతునూ యిచ్చాయి.

మనదేశంలో కమ్యూనిస్టు నిర్మాణానికి ఆర్థికంగా, నైతికంగా, సైద్ధాంతికంగా రష్యా ఎంతో మద్దతు యిచ్చింది. ఇంకా ముందుకు వెళ్తే మనదేశంలోకి పెట్టుబడిదారీ అభివృద్ధిని యూరపు దేశాలు ప్రవేశపెట్టి ఆధునిక విజ్ఞానానికి తలుపులు తెరిచాయి. ఆధునిక భారత నిర్మాణానికి, అందులోని సామాజిక సమస్యలెన్నిటికో విదేశీ సిద్ధాంతాలు గానీ, శాస్త్రాలుగానీ,

ఆచరణగానీ తాము ముందుకు నడిచి మనకు బాట చూపాయి. అలా నడిచిన దారిలో నడవడం మనకొక అలవాటుగా మారిపోయింది. ఎవరి ఆచరణకో కొనసాగింపుగానే తప్ప ఇతరులకు మన ఆచరణ ప్రారంభ బిందువు కాలేకపోయింది. అందువల్ల యీ దేశంలోని "అలవాటు" పడిన మెదళ్లు, మేధస్సు "అలవాటు" ప్రకారంగానే "అలవాటు"ను అలవాటు చేస్తాయి తప్ప కొత్త ఆలోచనలు చేయలేవు. కాంగ్రెస్, బ్రాహ్మణిజం, ఆరెసెస్ మొదలుకొని కమ్యూనిస్టులు, నక్సలైట్ల దాకా అందరి ఆచరణా, ఆలోచనా అలవాటు పడిన మొదళ్ళకు సంబంధించిందే. ఇలాంటి మెదళ్ళు గానీ, మొదళ్ళుగానీ దళిత సమస్యకైనా మరే సమస్య పరిష్కారానికైనా కొత్తగా చెప్పగలిగేదంటూ పెద్దగా ఏమీలేదు.

అందువల్ల ఎవరికి పరిష్కారం అవసరమో వారే కొత్తగా ప్రారంభించుకోవాల్సి వస్తున్నది. "అలవాటు పడినవారికి" యిది ఏ దేశంలోని గొంతులాగా వినపడ్డంలేదు. దాంతో అంచనా కట్టడానికి ఏ రాళ్ళతో తూచాలో తెలియడం లేదు. పైపెచ్చు అది "అలవాటు పడినవారి" ఆధిక్యతను ప్రశ్నార్ధకం చేస్తున్నది. ఇక ఏం చేయాలో తోచకవారు అలవాటు ప్రకారం దీవెనల రూపంలో శాపనార్థాలను వల్లించడం అలవాటు చేసికొన్నారు. దళిత తత్వశాస్త్రం సామాజిక, రాజకీయ, తాత్విక రంగాల్లో చర్చనీయాంశం గా మారినపుడు అలవాటు ప్రకారం అర్థం కాలేదనో, హిహిహితోనో, మౌనంతోనో తమను తాము ఆత్మవంచన చేసికొన్నారు. అది సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోకి విస్తరించే సరికి. ఇంటికుక్క కరిచినట్టయి చర్చ తప్ప ఏదీ దళిత సాహిత్య సృష్టి అని సాహిత్య విమర్శతో చావబాదే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక్కడ అభ్యుదయ కవిత్వం పుట్టడానికి యూరపులోని తత్వశాస్త్రం భూమిక అయింది. ఇక్కడ విప్లవ కవిత్వం పుట్టడానికి చైనా రష్యా సమాజాల ఆచరణతత్వమూ భూమిక అయింది. అందువల్ల యిక్కడి దేశీయ (నేటివిటీ) తత్వశాస్త్రం అభివృద్ధితో నిమిత్తం లేకుండానే ఆయా పార్టీల వ్యూహం, ఎత్తుగడలు, ఆచరణలకు ప్రచారంగా ఉపయోగపడే అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు అభివృద్ధి చెందాయి. ప్రెషర్‌కుక్కర్ మీద అమ్మ వండిన అన్నం తినడం అలవాటైన పిల్లలకు ఆ బియ్యం ఎక్కడ పండి ఎన్ని దశలు దాటి యిక్కడి కొచ్చాయో తెలియకపోవచ్చు. క్రమం తెలియకుండా ఫలితం తెలిస్తే చేరుకోగలిగే జ్ఞానం ఎటైనా పయనించవచ్చు. ఈ దేశంలోని కమ్యూనిస్టుల్లోని నక్సలైట్లలోని ఒక శాతం ప్రజలైనా తాత్విక క్రమం తెలిసి తాత్విక ఫలితం అనుభవిస్తున్న వారు కాదు. అందువల్ల వారి జ్ఞానం, ఆచరణ అలవాటు ప్రకారం ఎటైనా పయనించవచ్చు.

దళిత తత్వశాస్త్రం లేకుండా దళిత సాహిత్యం, సంస్కృతి, కళల పుట్టుక, పెరుగుదల సాధ్యం కాదు. దళితుల సామాజిక ఆచరణ లేకుండా దళిత తత్వశాస్త్ర

అభివృద్ధి సులభం కాదు. అందువల్ల దళితుల సామాజిక ఆచరణలో భాగంగానే విభిన్న రూపాల ద్వారా దళిత తాత్వికత వ్యాప్తి చెందింది. అది క్రమంగా దళిత తత్వశాస్త్రంగా సమీకరించబడుతున్నది. తిరిగి అది అన్ని రంగాలను కొత్త శక్తితో ప్రభావితం చేస్తూ ముందుకు సాగుతున్నది. ఇదే క్రమంలో దళిత సాహిత్యం, కళలు, కొత్త రూపును, కొత్త వస్తువును సంతరించుకుంటున్నాయి.

తత్వశాస్త్ర ప్రాధాన్యత గురించి కమ్యూనిస్టులకు గానీ, నక్సలైట్లకు గానీ తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే అది వారికి "ప్రేషర్ కుక్కర్" ద్వారా అమ్మ వండిపెట్టిన అన్నంగా అయాచితంగా అందుబాటులోకి వచ్చింది. తత్వశాస్త్ర ప్రాధాన్యత తెలియకపోవడం వల్లనే వారు యీ డెబ్బయి ఏళ్ళల్లో గతితార్కిక తత్వశాస్త్ర మౌలిక గ్రంథాల అనువాదాల్ని ప్రచురించలేకపోయారు. ఇలాంటి అలవాటు పడినబాపతుగాళ్ళంతా దళిత సిద్ధాంత చర్చే ఎక్కువగానీ దళిత సాహిత్యం ఏదీ అని దీవెనల రూపంలో శాపనార్థాలు పెడుతున్నారు.

నిజానికి సాహిత్యం అంతా దాని తొలిదశలో దళితులు సృష్టించిన సాహిత్యమే, శ్రమనుంచి సమస్త సంపదలు పుట్టాయి. శ్రామికుల నుండి శ్రామిక కులాల నుండి సమస్త కళలు పుట్టాయి. శ్రామిక కులాలు సృష్టించే సంపదను హక్కు భుక్తం చేసికొన్నట్టుగానే, దోపిడి కులాలు, దళితుల కళల్ని పరాయీకరించి తన దోపిడి కళలుగా, మార్చుకున్నది. జానపదుల గేయ చందస్సు దోపిడీ కులాల పద్యచందస్సుకు మాతృక అయింది. జానపదుల ప్రతీకవ్యక్తీకరణ, జాతీయాలు, నుడికారం మధ్య తరగతి వచన కవితకు మాతృక అయింది. వ్యక్తీకరణలోనూ కులం, వర్గం, లింగం, వ్యక్తం అవుతూనే వుంటుంది. వ్యక్తం చేసేది ఆలోచనే. "ఆలోచన"కు కులం, వర్గం లింగం, వుంటుంది. అది వ్యక్తీకరణ రూపంలో వ్యక్తీకరణ పొందుతుంది. అందువల్ల వ్యక్తీకరణ రూపాలైన ప్రక్రియలకు కూడా కుల, వర్ణ, లింగ, జాతి, స్వభావం వుంటుంది.

వచన కవిత్వం దోపిడీ కులాల చేతుల్లో పడి దోపిడీ కులీకరణ పొందింది. అది పీడిత కుల విద్యావంతులకు నక్క ముందుంచిన కూజాలోని పాయసం అయింది. దాంతో అలా రాయలేక రాస్తే అది ఉన్నత ప్రమాణాల కవిత కాలేక కొత్త రూపంలో ఆధిక్యత జారీ చేసిన అల్పత్వ భావనతో తనలోని సృజనాత్మకతను ఎలా వెలికి తీసుకురావాలో తెలియలేదు. ఈ దశను అధిగమించి ఉన్నత సాహిత్య సృష్టి జరిగే క్రమలో దళిత కవిత ఆత్మ విమర్శ ప్రారంభమైంది. ప్రస్తుతం మంచి వచన కవిత అని పిలువ బడుతున్నదాన్లో దోపిడీ కుల స్వభావం, దోపిడీ కుల వ్యక్తీకరణ పద్ధతి వుందని సిద్ధాంత చర్చ వేగవంతమైంది. ఇతర భూముల నుంచి మనకే చర్చ అందకపోయినా, అదే సమయంలో తెలుగులోనూ, దోపిడీ కుల వ్యక్తీకరణ పద్ధతిపై

తిరుగుబాటు ప్రారంభమైంది. ఆ తిరుగుబాటు యొక్క వ్యవస్థీకృత రూపమే జననాట్య మండలి, అరుణోదయ తదితర పాటలు.

అవి దోపిడీ కుల వచన కవితను సంక్షోభంలో పడేసాయి. ప్రతి మధ్యతరగతి జీవి, ముఖ్యంగా అందులోని దోపిడి కులాల వాళ్లు పాటతో పోటీలో మొదటిసారిగా అల్పత్వ భావనకు గురయ్యారు. అభ్యుదయ సాహిత్యంలో, నక్సల్బరీ సాహిత్యంలో ప్రక్రియ ద్వారా అనగా వ్యక్తీకరణ ద్వారా దోపిడీ కులాల ప్రక్రియల ఆధిక్యతను కూల్చివేయడం ప్రారంభమైంది. నక్సల్బరీలో ప్రజలభాష చర్చతో అది వేగవంతమైంది. కొన్నాళ్ళకు దోపిడీ కులాల ప్రక్రియలు సర్దుకుని, వారు పాటకు, దాని చర్చరూపంలో వ్యాఖ్యాతలుగా మారారు.

ఈ క్రమంతో పాటు వచన కవిత్వంలోనూ దోపిడీ కుల వ్యక్తీకరణ యొక్క ఆధిక్యతపై యుద్ధం మొదలైంది. అదీ ప్రక్రియా వివాదం రూపంలోనే దద్దరిల్లింది. మినీ కవితా విప్లవం పీడిత కుల వ్యక్తీకరణను వేగవంతం చేసింది. దీనిపై అలవాటు ప్రకారం దోపిడి కులాలు యుద్ధం ప్రకటించాయి. ప్రక్రియ ఎట్లా విప్లవం అవుతుందని విప్లవ రచయితలు హేళన చేశారు. అదే నోట పద్య పునరుద్ధరణ మాత్రం తిరోగమన విప్లవం అవుతుందని యిప్పుడు వాదిస్తున్నారు. పద్యం కూడా ఒక ప్రక్రియ అయినపుడు వస్తు చర్చ వదిలి రూప చర్చ ఎందుకు చేస్తున్నారు వీళ్లు. ప్రక్రియకు, రూపానికి కూడా, కులం, వర్గం, లింగం, జాతి, వ్యవస్థ, స్వభావాలుంటాయి. అయితే ఈ విషయాన్ని మినీ కవితా చర్చలో కావాలని మర్చిపోయారు విప్లవ రచయితలు.

అభ్యుదయ కవిత్వంలో దోపిడి గల వ్యక్తీకరణను అధిగమించి పీడిత కుల వ్యక్తీకరణకు ఒరవడి దిద్దిన వారిలో సుద్దాల హన్మంతు, నాజర్, ప్రతీకలైతే, విప్లవ కవిత్వంలో శివసాగర్, గద్దర్‌లు తమ పాటల ద్వారా ప్రతీకలయ్యారు.

వచన కవితకు గల దోపిడి కుల స్వభావం దళితుల్లోంచి వచ్చి మధ్య తరగతిగా ఎదిగినా పాటలు తప్ప గొప్ప వచన కవిత రాయలేక పోవడంలో గమనించవచ్చు. దళితులు రాసిన వచన కవితల్లో హెచ్చుభాగం స్పష్టంగా సూటిగా వుండడంలోనూ పీడిత కుల స్వభావం గమనించవచ్చు.

నిబద్ధత నిమగ్నత సిద్ధాంతాల్లో కుల స్వభావం వుంది. నిబద్ధత అవసరం కానీ నిమగ్నత అంతగా అవసరం లేదు అనే సిద్ధాంతం దోపిడీ కుల స్వభావానికి చెందింది. దళితులు సాధారణంగా నిమగ్నతను ఆదరిస్తారు. ఎందుకంటే అవి వారి సమస్యలే కనక, ఈ నిమగ్నతే వారి వ్యక్తీకరణలో సూటి దనాన్నిస్తుంది. అందువల్ల వారి వచన కవితల్లో దోపిడీ కుల స్వభావ చిహ్నామైన చుట్టూ తప్పి చెప్పడం తక్కువ. మాటలు యీటెల్లా వుంటాయి.

Dalithayugam-1
03-09-09
37

ఇది మానవ హక్కుల పోరాటం

గవర్నర్ కృష్ణకాంత్‌గారు యిటీవల ఒక మిత్రునితో మాట్లాడుతూ కులం అనేది భద్రతనిస్తుందికదా అని అభిప్రాయపడ్డారు. భద్రతయిస్తుంది నిజమే, కాని అది ఎవరికి? ఒక బ్రాహ్మణ, రెడ్డి, వెలమ, కమ్మ స్త్రీ గ్రామంలోని అన్ని వీధుల్లోకి దర్జాగా ఒంటరిగా వెళ్ళి క్షేమంగా యింటికి రాగలదు. శూద్రకులాల స్త్రీలు, అతిశూద్ర కులాల స్త్రీలు, అగ్రకుల వీధుల్లోకి, యిళ్ళలోకి, పొలాల్లోకివెళ్ళి ఇంతే దర్జాగా, ఒంటరిగా వెళ్ళి భద్రంగా తిరిగి రాగలరా ! కులం యిచ్చే భద్రత, రక్షణ ఎవరికి ఉపయోగపడుతున్నది. అగ్ర కులాలకు కాదా అని ఆ మిత్రుడు ఎదురు ప్రశ్న వేయడంతో గవర్నర్‌గారు ఆలోచిస్తూ ఉండిపోయారు.

మిత్రుడు కిసాన్‌సంఘ్ దక్షిణ భారత ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రావు (సాగర్‌జీ) గారు మాట్లాడుతూ కులంలో బ్యాలన్సింగ్ స్వభావంవుంది, అది గ్రామాన్ని, సమాజాన్ని పరిణామక్రమం ద్వారా ఎదగనిస్తుదేగానీ మిగిలిన అందరిని కాదని ఒక్కడు తాడిచెట్టులా అభివృద్ధిచెందే

1994లో జూపల్లి సత్యనారాయణ ప్రచురించిన హింసా చక్రం కింద రజకులు పుస్తకానికి రాసిన ముందుమాట ఇది. కుల సమస్య, కులవృత్తి సమస్య మూలాలను, వాటి పరిష్కారాలను మానవ హక్కుల్లో, పౌర హక్కుల్లో ఎలా భాగమవుతాయో బి.ఎస్.రాములు గారు ఇందులో విశ్లేషించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా వారి సమాన హక్కుల కోసం పోరాడని పౌర హక్కుల సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, అగ్రకులాల హక్కుల దృక్పథం, పరిమితిని లోనైందని అనేక ప్రసంగాలు చేశారు. తరువాత పౌరహక్కుల సంఘాల వారు తమ అవగాహనను, ఆచరణను మార్చుకున్నారు. కుల సమస్యను కాస్త పట్టించుకున్నారు.

అవకాశం యివ్వదు గ్రామీణులందరి అభివృద్ధిలో భాగంగానే అభివృద్ధి ముందుకు సాగే అవకాశం ఇస్తూ బాలన్సింగ్ స్వభావం కనపర్చుతుంది కులం అని అన్నారు. ఈ మాటలో కొంత నిజంవుంది.

సమాజాన్ని బ్యాలన్స్ చేయడంలో కులంపాత్రవుంది. కులం కొనసాగడంలో భద్రత పాత్రకూడా ఉంది. అయితే బ్యాలన్స్ చేయడం అనేది పీడిత కులాలకే పరిమితం అవుతున్నది. భద్రత అనేది అగ్రకులాలకే ఎక్కువ ప్రయోజనకారిగావున్నది. సామాజిక భద్రతకోసం రిజర్వేషన్లు ఎస్సీ, బి.సి, ఎస్టీ, మైనారిటీల ఐక్యతను అన్ని రంగాల్లోకి విస్తరింపజేసి కృషిచేసి పీడిత కులాలయొక్క కులంకూడా రక్షణ, భద్రతను యిచ్చేదిగా మార్చే కృషిచేసినవారు, అంబేద్కరె. దాన్ని ముందుకు కొనసాగిస్తున్నవారు కాన్సిరాం దీంతో అంతదాకా తాము మాత్రమే భద్రత అనుభవించిన దోపిడి కులాలు, తాము మాత్రమే ఇతర కులాలను బ్యాలన్సింగ్ చేయగలిగే స్థాయిలోవున్న అభివృద్ధి చెందిన కులాలు అసలు కులంవద్దు, కులభద్రత వద్దు దాని బ్యాలన్సింగు స్వభావమూ వద్దు అని ఓండ్రపెడుతున్నాయి. కొందరు కమ్యూనిస్టు, నక్సలైటు తోలుకప్పువారు కూడా ఇదే ఓండ్ర పెట్టడంతో వారి అసలు స్వభావం బయటపడిపోతున్నది.

ఏ స్త్రీ అయినా అర్ధరాత్రి ఒంటరిగా నిర్భయంగా, స్వేచ్ఛగా వీధిలో నడువగలిగినపుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అని గాంధీ చెప్పిన మాట గొప్పమాట, అర్ధరాత్రి కాదు, పట్టపగలే ఎస్సీ, బి.సి, ఎస్టీ స్త్రీలు, పురుషులు, అవమానాలకు, అత్యాచారాలకు, హత్యాకాండకు గురవుతున్నారు.

మనం రాజ్యాంగబద్ధం చేసికొన్న ఒక మనిషి ఒకే విలువ, ఒకె ఓటు అనే రాజకీయ, సామాజిక న్యాయాన్ని, సాంఘిక సమానతను కులవ్యవస్థ ఆచరిస్తున్న విభిన్న విలువలవల్ల దెబ్బయిశాతం జనాభా పొందలేక పోతున్నది. సామాజిక రంగంలో ప్రతిపాదిస్తున్న ఒక మనిషి, ఒకే విలువ సూత్రాన్ని ఆచరణలోకి తెస్తే మనుధర్మం, కులవ్యవస్థ, బ్రాహ్మణిజం రూపాల్లోని అసమానతలు తొలగిపోతాయి, అన్ని కులాలు సమాన విలువను, ప్రతిపత్తిని పొందుతాయి. తద్వారా కులంయొక్క ఉనికిఉన్నా ఊడిన పెద్దగా సమాజానికి ఒరిగేదేమీలేదు. కులాల విలువలన్నీ సమానం కావడంతో కులాలమధ్య సమన్వయం, కులాంతర వివాహాలు వేగవంతమవుతాయి. అందువల్ల ఎన్నో సేలాలు తొలుత కొన్ని కులాలుగా కలిసిపోతాయి.

కులవ్యవస్థవల్ల లాభపడుతున్న దోపిడి కులాలు దీన్ని సహజంగానే వ్యతిరేకిస్తాయి. తమ ఆధిక్యతను చాటుకోవడానికి వారు ఏ ఆయుధాన్నయినా ఉపయోగిస్తారు. సాంఘిక బహిష్కారం, అత్యాచారం, వెట్టిచాకిరి, భూముల్నించి,

వృత్తినుంచి బహిష్కరించడం, హత్యచేయడం వంటి ఎన్నో రూపాల్లో ప్రయత్నిస్తారు. రజకులపై జరిగే అత్యాచారాలు అణిచివేత యిందులో ఒక భాగంకూడా.

సామాజిక రంగంలో ఉత్పత్తిరంగాలు, సేవారంగాలు అనే రెండు రంగాలున్నాయి. పరిపాలన మొదలయిన రంగాలుకూడా ఎన్నో వున్నాయి రైతులు, చేతివృత్తి కులాలు మొదలయినవి ఉత్పత్తిరంగంలోనివి. చాకలి (మన పేరు మనం కించపర్చుకోనవసరంలేదు. సగర్వంగా మనం చాకలి అని చెప్పుకోగలిగినపుడే మన ఆత్మ విశ్వాసం పెరుగుతుంది) మంగలి, విద్యల వంటివి సేవారంగాలు.

ఒక కూతురు, ఒక కోడలు, తల్లిదండ్రులకు, అత్తమామలకు ముసలి తనంలో సేవలు చేస్తుంది. ఓరెండు, మూడేళ్ళు ఉచ్చ పితిల్లు ఎత్తిపోస్తుంది, ముడ్డి కదుగుతుంది, ఆ ముసలివాళ్ళు ఆస్తి ఎంత సంపాదించారు లేదా తమను ఎంత ప్రేమగా చూసుకున్నారు అన్న అంశాన్ని బట్టి కొడుకు కోడళ్ళ కూతురు, అల్లుళ్ళ, సేవలు, ఆధారపడివుంటాయి. వారు ఏడాది ఎత్తిపోస్తే చచ్చిపోయినంక పంపకాల్లో తులం బంగారమైనా ఎక్కువియ్యలేదు అని ఏడ్చేస్తారు వారి దుఃఖం సహజమైనదే.

మరివేల ఏళ్ళుగా, సమాజంలోని అందరి పీతిబట్టలు, ముట్టు బట్టలు, మురికి బట్టలు ఉతుకుతున్న చాకలి వంశీయులను తమ సొంత కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు, కోడళ్ళకన్నా ఎక్కువ ఆప్యాయంగా చూసుకోవాలి, ఆస్తి వంచివ్వాలిగదా! దాన్ని అడ్డుకుంటున్నదేమిటి? దానిపేరే బ్రాహ్మనిజం దాని పేరే మనధర్మం.

మహోన్నతమైన సేవచేసినందుకు ప్రతిఫలంగా యిస్తున్నది ఆస్తిలో హక్కుకాదు, కుటుంబ ప్రేమలో వాటాకాదు, కనీసం కూలి సైతం ఇవ్వడం లేదు. శరీరంలోగల నీచమైన పుండ్లరోగాలను శుభ్రపరిచే డాక్టరు పూజనీయుడై మనవులకు శుభ్రమైన బట్టలద్వారా నాగరికత నేర్పుతున్న చాకలివారు హీనంగా చూడబడడంలో వున్నది మానవత్వం కాదు మనుధర్మం బ్రాహ్మణిజం.

ఇలా మానవ సంబంధాల్ని తలకిందులుచేసి ఆచరిస్తున్న బ్రాహ్మణిజాన్ని, మనుధర్మాన్ని సామాజిక జీవితం నుంచి పారదోలి ఒక మనిషి ఒకే విలువ అనే సామాజిక సమానత్వాన్ని సాధ్యం చేసికోవాల్సివున్నది. వాళ్ళు మనల్ని అణిచివేయడానికి ఉపయోగించిన కులాన్నిసైతం ఆయుధంగా సంఘటితశక్తిగా ఉపయోగించుకోవాల్సి వున్నది, అగ్రకులాలవాళ్ళు చేసిన సాంఘిక బహిష్కరణ వారిపైకే ప్రయోగిస్తే నాల్రోజులైనా బతకలేక పట్నాలకు పారిపోయిన వెనాన్ని కరీంనగర్, అదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మంజిల్లాల నక్సలైటు ఉద్యమం చరిత్ర కెక్కించింది ఇప్పుడు అగ్రకులాలు అనుభవిస్తున్న ''కులభద్రత'' బహుజన కులాలకు

అందుబాటులోకి రావడానికి కులాన్నే ఆయుధంగా మార్చి చరిత్ర కెక్కించారు బహుజన సమాజ్ పార్టీవారు.

ఎవరిది వారికే అయినపుడు వాడికి ఎంతవుంటేనేమి, వాడు ఎంతగొప్ప వాడయితేనేమి మనని గౌరవించకపోతే వాడిని గౌరవించాల్సిన పనేమీలేదు. మనకన్నా ఉన్నతకులం అంటూ ఏదీలేదు. మనకన్నా తక్కువ కులం అంటూ ఏదీలేదు. మనకన్నా గొప్ప వృత్తి అంటూ ఏదీలేదు. మనకన్నా నీచవృత్తి అంటూ ఏదీలేదు, సమాజానికి అవసరమైన వృత్తులన్నీ సమంగా గౌరవనీయాలే, కోటీశ్వరుడో, భూస్వామో, మరొకడో మనను తనలాగే సమానస్థాయిలో గౌరవించకపోతే వాడు మనిషి ఎలా అవుతాడు, వాడి డబ్బూ, దస్కం, జ్ఞానం, గౌరవం యివ్వకపోయాక వాడిని గౌరవించడం అనవసరం, ప్రజలకు మేలుచేయని అధికారులకు, నాయకులకు, భూస్వాములకు, పెట్టుబడిదారులకు, కోటీశ్వరులకు నమస్కారం పెట్టడం అనవసరం నమస్కరిస్తే మన ఆత్మగౌరవాన్ని కించపర్చుకున్నట్టవుతుందికూడా.

డాక్టర్ని గారు అని పిలిచినపుడు, నీకు సేవలు చేసిన తల్లిని అమ్మా అని పిలిచినపుడు మన పేరు వెంట గారు అనీ అమ్మా అనీ అదనంగా కలిసి ఎందుకు పిలువకూడదు? అడగకపోతే అమ్మయినా పెట్టదు. నిలదీయంపోతే కుక్కయినా అరే తాబేలు ఒసి తాసేలు మానుకాదు.

కుల, ధన, మద అంధకారంతో మనుషుల రూపంలో సంచరించే పశువులు, నరాధములు మనపై దాడులు చేస్తున్నారు. కుల ఆధిక్యత చాలా మందిని పశువులుగా మార్చింది అగ్రకులం అనేది అనేకమందిని మనుషుల స్థాయినుంచి దిగజార్చి నరాధముల్ని చేసింది. మనుషుల్ని పశువులుగా మర్చే విద్య బ్రాహ్మణిజంలోవుంది. వారిని మనుషులుగా మార్చాల్సివుంది. అందుకు వారిలోగల అగ్రకులతత్వం, కులాధిక్యత అనే పశుత్వాన్ని వదలగొట్టవలసి వున్నది. బహుజనులంతా సఖ్యతతో ఏకమైతే దెబ్బకు దయ్యం వదులుతుంది. వారు మనుషులవుతారు మనుషుల్ని మనుషులుగా మార్చే క్రమంలో మనపై అత్యాచారాలు, అణిచివేతకూడా తొలగిపోతాయి వారి పశుప్రవృత్తిని ఎదిరించి, నిలదీసి కలసికట్టుగా వుడడం ద్వారానే వారిలోని మనిషిని వెలికి తీసుకురావడం సాధ్యపడుతుంది. హింసాచక్రం కింద నలిగే రజకులు దాన్ని ఎదిరించడం ద్వారా తాము ఎదిగి, ఎదుటివారిని మనిషిగా ఎదిగించడం అనే రెండుపనులు ఏకకాలంలో చేసినవారవుతారు. అందుకు అందరూ సహకరించాల్సివుంది.

నీచంగా చూడబడే వృత్తుల గౌరవాన్ని పెంచాల్సివుంది. నెలకో వారం

రోజులు, ఏడాదికో నెల మా ముట్టుబట్టలు, పీతిబట్టలు, మీరుతుకండి మీకూ అదే కూలియిస్తాం, అని ఆప్యాయంగా అడగగలిగినపుడు మనపట్లగల చిన్నచూపు ఎంతటిదో ఎదుటివారి కోపంరూపంలో ప్రదర్శితమవుతుంది ఎదుటి వారికి కనువిప్పు కలుగుతుంది.

నుడికార్యం రీత్యా చాకలి మంగలి అని జంటగా వ్యవహరిస్తారు. మంగలి పని ప్రధానంగా పురుషులు చేసేది. బట్టలుతికే చాకలి వృత్తి మాత్రం ప్రధానంగా స్త్రీలదే. గ్రామానికి చాకలి పురుషులు, చేసే సేవలుకూడా ఉన్నాయి. కోళ్ళు, గొర్లు కోసిపెట్టడం పెళ్ళి, శోభనం, చావుకార్యాల్లో సమాచారం మొదలుకొని వివిధ పనులు చేసిపెట్టడం అందులో కొన్ని.

ఈరోజు ప్రతి వ్యక్తికివ కనీస కూలి 30 రూ॥లు ఒకరోజు 5, 6 ఇళ్ళ బట్టలకన్నా ఎక్కువ ఉతకడం సాధ్యపడదు. సెలవురోజులు సోడా, సబ్బు, కట్టెలు, డ్రమ్ము, రవాణా ఛార్జీలు కలిపితే రోజుకు 50 రూ॥లు ఆదాయం వుండాలి. అనగా అయిదుగురన్న కుటుంబం నుంచి కనీసం నెలకు వంద రూ॥లైనా కూలి వసూలు చేస్తేగానీ కనీస కూలీ గిట్టుబాటు కాదు. దీన్ని సాధించాల్సివుంది.

ఒక కులవృత్తిలో యితర కులాలవాళ్ళు ప్రవేశించడం ఆ వృత్తిలాభ సాటిగానో, గౌరవప్రదంగానో ఉండడాన్ని తెలుపుతుంది. బట్టలుకుట్టే కులవృత్తిలోకి ఈరోజు లెక్కలేనన్ని కులాలు ప్రవేశించాయి. కూలి గిట్టుబాటు అందులోగల ఆకర్షణల్లో ఒకటి. అగ్రకులాల్లో పేదలు లేరా అని కమ్యూనిస్టు, నక్సలైటు తోలు కప్పుకున్న అగ్రకులతత్వం ఓండ్రపెడ్తున్నది. అగ్రకులాల్లోని పేదలకు చాకలివృత్తి లాభసాటి వృత్తిగా మారి వారిని మనతోపాటు సమానంగా గౌరవించాల్సివుంది. అందుకు బ్రాహ్మణ, కోమటి, వెలమ, రెడ్డి, కమ్మరి ఊరందరి అగ్రకుల పేదలు, పీతిబట్టలు, ముట్టుబట్టలు ఉతికేవృత్తికి ఎగబడేంత లాభసాటిగా వుండేంతదాకా మనం కూలీలు పెంచుకోవాల్సివుంది లేదా వృత్తి వదిలేసి విద్యనభ్యసించి వివిధ రంగాల్లో చేరాల్సివుంది. అగ్రకుల పేదలు ఊరిబట్టలు (ఇస్త్రీ బట్టలు కాదు) ఉతికే వాళ్ళుగా ఎంతమంది పెరిగితే అంతగా మన కులవృత్తి, గౌరవాన్నో, గిట్టుబాటునో సాధిస్తోందని చెప్పుకోవచ్చు. కులం యొక్క, కులవృత్తి విలువలు కూడా మారుతున్న అంశాన్ని అది సూచిస్తుంది.

యాభయిఏళ్ళ క్రితందాకా గ్రామంలోని ప్రజల జీవితం ప్రధానంగా వస్తుమారకంతో ముడిపడి వుండేది. ఇప్పుడు అన్నీ కొనుగోలు సరుకులయిపోయాయి. అందువల్ల మన చాకలి సేవలనుకూడా కూలిరేటు తగ్గకుండా చూసుకుని

అందించాల్సివుంది. గ్రామాల్లో సాధారణంగా, ఆధిక్య కులంతప్ప అన్ని కులాలూ చిన్నవిగా విడిగొట్టబడి వుంటాయి. వీటిని పరస్పరం రెచ్చగొట్టి ప్రతికులం మీద ఆధిక్యత చెలయిస్తాయి భూస్వామ్య, కులాధిక్యవర్గాలు. అందువల్ల దీన్ని ఎదిరించాలంటే పీడిత కులాల మధ్య ఐక్యత సాధించాలి. విడగొట్టి పాలించే అగ్రకులాలను కలిసికట్టుగానే ఎదిరించడం సాధ్యం. మనం ఐక్యమైన మేరకు, సమాజం బలపడుతుంది. ప్రభుత్వం భయపడ్తుంది, మనదయతుంది. అప్పుడు సమాజాన్ని బ్యాలన్స్ చేసే కుల స్వభావం, పీడిత కులస్తుల అందుబాటులోకి వస్తుంది. ప్రతి మనిషికి ఒకే విలువ యిచ్చిన ఓటుహక్కును మనం సంఘటితపరిచి ఓటుహక్కు ద్వారా కులాధిక్యతగలవారిని ఓడించాలి, పీడిత కులాలు అధికారంలోకి రావాలి. అప్పుడే కులాధిక్యతను తద్వారా పొందిన పశుప్రవృత్తిని తొలగించి వారిని మనషులుగా మలచడం సులభం అవుతుంది. అందువల్ల బహుజనులంతా ఐక్యమై సామాజికో ద్యమంలో భాగంగా రాజకీయ అధికారాన్ని సాధించుకోవాల్సివుంది.

పీడిత కులసంఘాలు మహత్తర పౌరహక్కుల ప్రజాస్వామిక ఉద్యమాలుగా ఎలా ఆచరణ కొనసాగిస్తున్నాయో ఈ పుస్తకం ఒక సాక్ష్యంయిస్తుంది. స్వంతకులస్థుల ప్రజాస్వామిక పౌరహక్కులతోపాటు పీడితకులస్థులందరి పౌరప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడే ఉద్యమాలుగా పీడిత కులసంఘాలు లక్ష్యాల్ని విస్తరించుకొని పరిస్పరం సహకరించుకోవాల్సివుంది. రజక సంఘాల రూపంలో ఒక నూతన పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం కొనసాగుతోందని ఈ పుస్తకం సాక్ష్యంయిస్తోంది. ఇది రజకుల పోరాటాల రూపంలో కొనసాగుతున్న మానవ హక్కుల పోరాటం.

మార్చి, 1994

Dalithayugam-1

03-09-09

40

"సమగ్ర సామాజిక విప్లవం"

నేను 1990 నుండి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ "సమగ్ర సామాజిక విప్లవం" గురించి క్లాసులు ఇస్తూ వస్తున్నాను. సమగ్ర సామాజిక విప్లవ దృక్పథాన్ని ముందుకు తీసికెళ్లడంలో దరకమే ఐక్యవేదిక ఒక ముఖ్యపాత్ర నిర్వహిస్తుందని నేను ఆశించడం జరిగింది. అంఉకని సమస్త వర్గ, వర్ణ, కుల, లింగ, భాష, జాతి, ప్రాంత, దేశ వివక్షతలకు, అసమానతలకు వ్యతిరేకంగా దరకమే ఐక్యవేదిక ముందుకు సాగుతుందని లక్ష్య ప్రకటన కావించడం జరిగింది.

అఖిల భారత స్థాయిలో సామాజిక ఉద్యమ నిర్మాణం కోసం మహారాష్ట్రంలోని శరద్ పాటిల్ 1993లో సాక్రి జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో పాల్గొనడం జరిగింది. అక్కడ గెయిల్ ఒంవెద్, భరత్ పతంకర్, మేధా పాట్కర్, శిబ్దాస్ ఘోష్ ఆలోచనా విధానం గల గ్రూపు, అంబేద్కరైట్ల గ్రూపులను కలవడం జరిగింది. శరద్ పాటిల్ డ్రాఫ్టు కమిటి అధ్యక్షుడుగా కులరహిత, వర్గరహిత సమాజ నిర్మాణం కోసం డ్రాఫ్టు రాయడం జరిగింది. ఈ డ్రాఫ్టుపై శ్రీశైలంలో రెండు రోజుల పాటు చర్చలు జరిగాయి. చివరకు శరద్ పాటిల్ 1978లో మహాఇరాష్ట్రంలో ప్రారంభించి రెండు జిల్లాలకు పరిమితమై నడుపుతున్న సత్యశోధక కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక కొనసాగింపుగా ఆ డ్రాఫ్టు రూపొందించారు. "సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, భాష ప్రాంత, దేశ విచక్షణలకు, అసమానతలకు వ్యతిరేకంగా సమగ్ర సామాజిక

విప్లవాన్ని నడపాలనే భావన" ఆ డ్రాఫ్టులో లేనందున దాన్ని చేర్చాలని నేను ప్రతిపాదించాను. శరద్‌పాటిల్ తాను రాసిందే సమగ్రంగా ఉందని దీన్ని చేర్చడానికి అంగీకరించలేదు. నేను ఆయన రాసింది అసమగ్రంగా ఉందని విభేదించాను. కోర్ గ్రూపుగా ఏర్పడిన ఆ కమిటీ ఏడాది కొనసాగింది. శరద్ పాటిల్ పత్రికల్లో వ్యాసాలు రాస్తూ వెళ్లారు. నేనది అసమగ్రం అనుకోవడం వల్ల చురుకుగా సంబంధాలు కొనసాగించలేదు. మిగతా వారికి ఎవరి గ్రూపులో వారికి అదివరకే నిర్ణయించుకున్న పనులు, నిర్మాణాల్లో పని చేసుకుంటూ వెళ్లారు. అట్లా శరద్ పాటిల్ కమిటీ అస్తిత్వం కోల్పోయింది.

స్థానికంగా దరకమే ఐక్యవేదికలో 'అంబేద్కరిజం' ఒక్కటే దరకమే ఐక్యవేదిక దృక్పథంగా ఉండాలని ఒక గ్రూపు సంఘటిత పడింది. మరో గ్రూపు బీయస్పీ భావజాలంతో బుద్ధుడు–చార్వాకులు మొదలుకొని అమీర్ కుస్రో, కబీరు, గురునానక్, గురు రవిదాస్, వేమన, పోతులూరి వీరబ్రహ్మం, సాహూ మహరాజ్, మహాత్మా జ్యోతిబా పూలే, పెరియార్ రామస్వామి, నారాయణగురు, అంబేద్కర్‌ల వారసత్వం, వీరందరి స్ఫూర్తి దరకమే దృక్పథంగా ఉండాలని సంఘటిత పడింది. ఇంకొక వైపు వర్గానికి మార్క్సిజం, కులానికి అంబేద్కరిజం రెంటిని రెండు చరిత్రల వారసత్వాన్ని నిర్మాణాల పోరాటాల స్ఫూర్తిని సమన్వయించుకునే దృక్పథం ఉండాలని దరకమే ఐక్యవేదికలో ప్రతిపాదించబడింది. బీసీ, ఎస్సీ కుల సంఘాల నాయకులు, భావజాలం అస్తికత్వం పరిధిలోని వారు కూడా దరకమే ఐక్యవేదికలో చేరే విధంగా లిబరల్ దృక్పథం ఉండాలన్నారు. అంబేద్కర్ సంఘాలు, నాస్తిక హేతువాద సంఘాలు, దళిత మహాసభ, బీయస్పీల దృక్పథాలు దరకమే ఐక్యవేదికలో స్నేహంగా దోబూచులాడాయి. సంఘర్షించుకున్నాయి. అంబేద్కరిజం తాత్విక పునాది అని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యవేదిక సాహిత్య దృక్పథంగా కొనసాగాలనే గ్రూపు బలం పెరిగింది. బీయస్పీ రాజకీయ పార్టీ కావడం వల్ల ఉద్యోగులు అందులో ప్రత్యక్షంగా చేరి ప్రచారం చేయడం చట్టరీత్యా కుదరదు కనుక అందుకు దరకమే ఐక్యవేదిక ఒక మంచి వేదిక అని టెక్నికల్‌గా బీయస్పీలో బహిరంగంగా పని చేయడంలో ఇబ్బంది వున్నవాళ్లు చురుకుగా పని చేయడంతో వారిది పైచేయి అయింది. దరకమే ఐక్యవేదిక సభ్యులను బీయస్పీలు నాన్ బీయస్పీలుగా వర్గీకరించి పరస్పర ఘర్షణ సాగింది. ముందు ఒక వర్గం నిష్క్రమించడం మొదలైంది. ఆ తర్వాత రెండో వర్గం కూడా నిష్క్రమించింది. ఎవరి సంస్థలు వారికుండడంతో కొత్తవాళ్లకు తప్ప నిష్క్రమించిన వారికి వచ్చిన కష్టం లేదు. నష్టం లేదు. దరకమే ఐక్యవేదిక ప్రభావంతో అంబేద్కరిజం దేశీయ మార్క్సిజం అని మరో సమన్వయ వాదం బయలుదేరింది.

దరకమే ఐక్య వేదిక అందించిన సిద్ధాంత భూమిక నుండి సామాజికోద్యమాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యమాలు, సాహిత్య ఉద్యమాలు తెలుగునేల చరిత్రని మలుపు తిప్పాయి. ఎన్నికల్లో బీయస్పీ ఓడిపోయిన తర్వాత కూడా మరింత బలంగా, ఊపుతో సైద్ధాంతిక, సాహిత్య రంగాల్లో ముందుకు సాగడానికి దరకమే ఐక్యవేదిక నాయకత్వం వహించింది. దరకమే ఐక్యవేదిక ఇచ్చిన సిద్ధాంత స్ఫూర్తి నుంచి మాదిగ దండోరా ఉద్యమం ముందుకు సాగింది. దండోరా ఉద్యమంత ప్రేరణ పొందిన బీసీ కులాల యువ నాయకత్వం కదిలి ఆయా కులాల మహాసభలు నిర్వహించడం ద్వారా ఆయా కులాలకు సంబంధించిన సాహిత్యం, సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి.

ఇట్లా సాహిత్య, సామాజిక, భావజాల ఉద్యమాలు విస్తరిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగాయి. ఇవాళ అంతర్జాతీయ స్థాయిలో తెలుగునేల నుండి భావజాల నాయకత్వం అందించబడుతున్నది. దీనికి పునాది దరకమే ఐక్యవేదికనే.

అంబేద్కరిజం దేశీయ మార్క్సిజం కాదు. అది మార్క్సిజం వలె తనదైన ప్రత్యేక ప్రాపంచిక దృక్పథంతో సమస్త విలువలను సంస్కృతిని చరిత్రను దోపిడీని శాస్త్రాలను ప్రశ్నించి బహుళ పార్టీ ప్రజాస్వామిక వ్యవస్థలో భాగంగా బహుజన సమ్మతితో శాంతియుతంగా ప్రవర్తన తీసుకురావాలని బౌద్ధ సంస్కృతి వ్యక్తిగత జీవిత విధానం కావాలని నొక్కి వక్కాణిస్తుంది. దేశీయ మార్క్సిజం అనే పదబంధం ఈ అర్థాన్ని ఇవ్వకపోగా అంబేద్కరిజాన్ని తప్పుడు అవగాహనకు గురి చేస్తుంది. మార్క్సిజం యొక్క వ్యూహం ఎత్తుగడలు వేరు. అంబేద్కరిజం యొక్క వ్యూహం, ఎత్తుగడలు వేరు. అంబేద్కరిజం ప్రపంచాన్ని అర్థం చేసుకునే తీరు వేరు. మార్క్సిజాన్ని అర్థం చేసుకున్న తీరు వేరు. అందువల్ల దళిత వాదానికి దేశీయ మార్క్సిజం పేరు తప్పు.

సమగ్ర సామాజిక విప్లవం అంటే సమాజంలోని మొత్తం ప్రజలు ఆధునిక అభివృద్ధిని అందుకునే క్రమం. అందుకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళా, ఉపాధ్యాయ, ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక, న్యాయ, ప్రభుత్వ పరిపాలనా రంగాల్లో ఏకకాలంలో మార్పులు వేగవంతం కావడం, వాటి ఫలాలు సమానంగా అందరికీ అందడం. ఈ రీత్యా కమ్యూనిస్టు, మార్క్సిస్టు, నక్సలైటు గ్రూపులు విప్లవం పేరిట చెప్తున్నవి, చేస్తున్నవి అంతా సంస్కరణవాదాలే. ప్రధాన వైరుధ్యం అని వాళ్లు దేన్నయితే ప్రకటిస్తున్నారో ఆ సమస్య పట్ల వాళ్లు సంస్కరణ వాదాలను ప్రాచుర్యంలోకి తెస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే ప్రధాన వైరుధ్యాల చర్చ చేసేవాళ్లు ఆచరణలో సంస్కరణవాదులుగా కొనసాగుతున్నారు.

విప్లవం పరిణామ శీలమైనది. పరిణామ శీలమైన విప్లవంలో ఒక రైతు కూలి,

ఒక బాల కార్మికుడు, ఒక దళితుడు, విద్యాధికుడై, రీడరై, వైస్‌ఛాన్సలర్ అయి జీవితాన్ని గెలుచుకోవడం ఒక యుద్ధం. నిన్నటిదాకా చదువు నిరాకరింపబడిన శ్రామిక కులాలు విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగడం విప్లవం.

సమగ్ర సామాజిక విప్లవం ఎలా ఉండాలో నక్సలైట్ గ్రూపులో శంకర్ గుహ నియోగి ఎంఎల్ గ్రూపు నుండి చీలిపోయి చత్తీస్‌ఘడ్ ప్రాంతంలో ఉద్యమం నిర్మించాడు. మనిషి జీవితంలో సమస్త రంగాలను పట్టించుకుని విప్లవీకరించాడు. సారా వ్యతిరేక పోరాటాలు చేశారు. అవినీతి వ్యతిరేక పోరాటాలు చేశారు. సాంఘిక పరివర్తన, సాంఘిక సంస్కరణ పోరాటాలను సమగ్ర విప్లవ ఉద్యమంతో గొప్పగా మిళితం చేశాడు. ఇందుల భాగంగానే ఆస్పత్రులను కట్టుకున్నారు. గ్రంథాలయాలను ఏర్పరుచుకున్నారు. ప్రత్యామ్నాయ సమాజాన్ని, సంస్కృతిని, సామాజిక సంబంధాలను నిర్మించుకున్నారు. అన్నా హజారే రాలే గామ్ సిద్ధి అనే ఒక గ్రామంలో గాంధీ మార్గంలో ఇదే పని చేశారు. అతనికి చాలా ప్రాచుర్యం ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిని కలిగించారు. శంకర్ గుహ నియోగి ఉద్యమం ఎన్నో గ్రామాలకు విస్తరించింది. భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీ చుట్టూతా ఉన్న గిరిజనులను, కార్మికులను కదిలించింది.

– *'బహుజనతత్వం' నుండి*

సామాజిక అర్థశాస్త్రం

సామాజిక అర్థశాస్త్రం మనిషి, మానవీయత, మానవ సంబంధాలు పునాదిగా సమస్త శాస్త్రాలను, కళలను అధ్యయనం చేస్తుంది. లాభాలు, పెట్టుబడి, శ్రమశక్తి అదనపు విలువ, మొ॥న పదజాలం వదిలివేసి మానవ వనరులకు పనికల్పన, స్వేచ్ఛా సమానత్వం, జీవిత అవసరాలు, సామాజిక సంక్షేమం, సామాజిక మార్పు, సామాజిక న్యాయం గురించి సామాజిక అర్థశాస్త్రం చర్చిస్తుంది.

మానవునికి ఉపాధిహక్కు అనేది మానవ ప్రాథమిక హక్కు, ప్రభుత్వం, ఒక వర్గం లేక సమాజం ఏ వ్యక్తికి కూడా ప్రత్యక్ష ఉపాధి కల్పించక పోవచ్చు. కాని యాంత్రిక ఉత్పత్తి కారణంగా ఒక వ్యక్తి ఉపాధి అవకాశాలు ఇంకొక వ్యక్తి తీసుకోకుండా చూడడం సమాజపు ప్రాథమిక బాధ్యత.

ప్రపంచంలోని సామాజిక శాస్త్రవేత్తలు, అర్థశాస్త్రవేత్తలు నూతన సమాజాల గురించి ఎన్నో కలలు కన్నారు. ఆచరణలో ఆ ఆదర్శాలు రకరకాల రూపాలు

Dalithayugam-1
03-09-09
42

తీసుకున్నాయి. ఆదర్శంగా ఆదరించినవారే ఆచరణ రూపాలు చూసి వాటిని వ్యతిరేకించారు. వదిలించుకున్నారు.

కలలు కనడం మానవుని హక్కు. కలలు, ఊహలు, ఆదర్శాలు, వాస్తవ రూపం లోకి వచ్చినప్పుడు అవి ఉన్నత లక్ష్యాలకనువుగా లేకపోతే వాటిని వదిలించుకోవడం కూడా అంతే అవసరం. కానీ, చాలా మంది ఈ పని చేయడం లేదు. పైగా ఆచరణలో వాటిని సరిగ్గా అన్వయించలేదని, ఆచరించిన వారిదే తప్పని తమ సిద్ధాంతం మాత్రం సరైనదేనని వాదిస్తుంటారు. వాటినే పట్టుకువేలాడుతుంటారు. ఇది సామాజిక ఆచరణ కన్నా సిద్ధాంతం గొప్పది అని, జీవితంకన్నా మాటలు గొప్పవి అని చెప్పడం. కొందరు జీవితంకన్నా, ఆచరణ కన్నా సిద్ధాంతం గొప్పది అని భావిస్తుంటారు. సిద్ధాంతంకన్నా, బండెడు మాటలకన్నా, వినరంత ఆచరణ ఎంతో గొప్పది అని నిరూపించినవాళ్ళున్నారు.

నేను ఎవరు గతితర్క తత్వదర్శన భూమిక

నిన్ను నీవు ఎవరని భావించుకుంటావో అలా ఉండడమే సాధ్యం అనే తత్వాన్ని గ్రహించి బ్రాహ్మణవాదులు నీవెవరు అనే ప్రశ్నకు నేను బ్రాహ్మణున్ని, రాజును, దాసిని, మాదిగను, చాకలిని అనుకునేట్టు చేశారు. నీవెవరు అనే ప్రశ్నకు కులమే నేను కావడం ద్వారా వర్ణవ్యవస్థ కుల వ్యవస్థగా స్థిరపడుతూ వచ్చింది. నేను క్రైస్తవున్ని, ముస్లింను అనే జవాబులీయ నేర్పడం ద్వారా మతాలుగా స్థిరపడుతూ వచ్చాయి.

నిన్ను నీవు ఎలా భావించుకుంటావో అలా తఉండడమే సాధ్యం. అన్నింటికీ నీ మనస్సే ప్రధానం అనే సత్యాన్ని ప్రపంచంలోని మతాలన్నీ స్వీకరించి రహస్యం చేసి ఆ మనుషుల మనస్సులను మాత్రం తామనుకునే భావాలతో మలిచే పనిమొదలు పెట్టడం ద్వారానే అని మతాలుగా రూపుదిద్దుకున్నాయి. ఇలా ప్రాచ్యదర్శనాల నుండి పుట్టిన బౌద్ధం అన్ని మతాలకు తాత్విక భూమికయింది.

నేను నాది అనే భావన దుఃఖ కారకమైంది. ఆశ నిరాశలకు, కుట్రలకు, ఆస్తి హక్కుకు నెలవైంది. మనసులో రహస్య కర్మాగారంగా పనిచేసే నేను స్వభావాన్ని తెలుసుకునే వేట మొదలైంది. అదంతా ప్రాచ్య తత్వశాస్త్రాల్లో విస్తారంగా పరుచుకుంది.

స్వార్థం, నేను, నాది అనే భావన ఆస్తిహక్కు, జ్ఞానహక్కు, అధికార హక్కు వృత్తి హక్కు, వృత్తివిధుల రూపాలు ధరించింది. కొందరికి వంశ పారంపర్యంగా రాజులుగా, బ్రాహ్మణులుగా, సేవకులుగా హక్కులు బాధ్యతలు సంక్రమించాయి. బ్రాహ్మణులకు రాజులకు మధ్య జ్ఞానార్జన, ఆయుధధారణ, రాజ్యపాలన హక్కుల కోసం తీవ్ర పోరాటం సాగింది. విశ్వామిత్ర పాత్ర సృష్టిలో దీన్ని చూడవచ్చు.

బుద్ధుడు సమాజంలో దుఃఖం గురించి చర్చించాడు. చార్వాకులు సమాజంలోని సుఖాల గురించి చర్చించారు. లోకాయత చార్వాకాన్ని రాజులు, పాలకవర్గాలు రహస్యంగా నేర్చుకుంటూ ప్రజలను దానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. రాజ్యం వీరుల హక్కని అన్నదమ్ములు, గురువులు అని చూడకుండా యుద్ధం చేయమని అర్జునుణ్ణి కృష్ణుడు పురికొల్పడం లోకాయత దర్శనమే.

నేను నాది అనే భావన పూర్తిగా నశించడం కష్టం. యోగులు, సన్యాసులు నేను నాది అనే భావన అధిగమించినట్టు ప్రచారంలో ఉంది. కానీ తమవైన విడిపేర్లతో పిలువబడడమే నేనును అధిగమించలేదని తెలుపుతుంది. యోగుల ఆత్మకథలు, కథలు నేను పొందిన అనుభవాలే. రజనీష్, జిడ్డు కృష్ణమూర్తి, పుట్టపర్తి సాయిబాబా, కృష్ణ పరమాత్మ, బ్రాహ్మణవాద తదితరులు నేను రాహిత్యం గురించి చెప్పిందంతా వారి పేర్లుమీదుగానే చెలామణిలో ఉందంటే – వారు తమ పేర్లయినా వదులుకోలేక పోయారంటే – వాళ్ళే నేనులుగా మారారని అర్థం. అందుకని నేను రాహిత్యం కన్నా నేనును విశ్వవ్యాప్తం చేయడం అవసరమని కొందరు తలపోశారు. అలా అందరినీ నీ సొంత పిల్లల్లా, నీ కన్న తల్లుల్లా, నీ సొంత చెల్లెల్లా ప్రేమించు అనే భావాలు వ్యాప్తి చెందాయి.

ఈ భావం నాది. ఈ అనుభవం నాది. అనే వ్యక్తిగత ఆస్తిభావన లేకపోతే దాని గురించి ఎందుకంత పట్టుబడుతారు. ఇతరులను ఎందుకంత కించపరుస్తారు. నీ భావాలను నీ వ్యక్తిగత ఆస్తిగా భావించడం వల్లే ఇతరుల భావాలు స్వీకరించలేక పోవడం, నీ భావాలు వదలాలంటే కలిగే బాధ నేను, అహంలకు సంబంధించినది. పిల్లలు ఏ భావాన్నయినా స్వీకరించగలరు, వదలగలరు. అదే నేను రాహిత్యం.

భావాలన్నీ ఆచరణ నుండే పుడతాయనుకుంటే భావాలన్నీ గతమే. భావాల్లో జీవించడం అంటే గతంలో జీవించడమే. రేపును గురించిన ఊహలు కూడా నిన్నటి గతం నుంచి పుట్టినవే.

"నేను" సంఘజీవి. నేను ఒక ఇండివిడ్యువల్ (పర్టిక్యులర్), సంఘం యూనివర్సల్. అన్ని నేనుల భావాల, ఆచరణల పరవశం, తాదాత్మ్యమే. లీనమే వాటి సగటు అభివృది. అదే సాంఘిక జీవితం.

నేను రాహిత్య, రాజ్యరహిత సమాజం (స్టేట్‌లెస్ సొసైటీ) నిర్మాణం కోసం చేసిన ప్రాచ్య, భారతీయ, బౌద్ధ తత్వశాస్త్రాల చర్చల ముందు పాశ్చాత్య తత్వశాస్త్రాల చర్చలు రంగువెలిసి వెలవెలపోతాయి. పాశ్చాత్య తత్వశాస్త్రాలు "నేను"ను బలోపేతం చేసే చర్చలు చేసి గుర్తింపు (ఐడెంటిటి)ని ప్రధానం చేశాయి. ప్రాచ్య, భారతీయ

తత్వశాస్త్రాలు నేను, అహాన్ని, స్వార్థాన్ని కరిగించి అందరిలో ఒకరిగా మార్చుతూ నేను రాహిత్య స్వార్థరాహిత్య స్థితికి తీసుకెళ్ళే చర్చలు చేశాయి.

కరుణ సామాజికమైంది. శృంగారం వ్యక్తిగతమైంది. శృంగారం సహజాతం. కరుణతో ఎదుటివారి పట్ల స్పందించడం సమాజానికి సంబంధించినది. శృంగారరస కావ్యాలు స్వార్థానికి సంబంధించినవి. కరుణరస రచనలు సామాజిక చైతన్యానికి సంబంధించినవి.

సత్యాలు శక్తీకరించిన తాత్వీకరణనీ, విలువనీ పొంది ఆచరణలో కొనసాగుతున్నపుడు మనం మొదలే మార్చేది – మార్చగలిగేది ఆ వాస్తవాన్ని కాదు, ఆ వాస్తవం (సత్యం) యొక్క విలువను.

పాత విలువల పరిధిని మార్చడం ద్వారా కొత్త విలువలు సార్వత్రిక విలువలుగా రూపొందుతాయి. పాత తాత్వీకరణల్ని మార్చడం ద్వారా కొత్త విలువలు ఉత్పన్నమవుతాయి.

కులం సమస్యని పట్టించుకోకుండా జాతుల సమస్యని సమర్థించడం అంటే అగ్రవర్ణ, అగ్రకులాధిక్యతావాదులకు రాజ్యాధికారాన్ని జాతుల సమస్య రూపంలో అందించడం తద్వారా కులవ్యవస్థ మరింత బలపడ్డాన్నే అనివార్యం చేయడం.

శక్తీకరించిన ఆచరణే భావజాలం సంస్కృతి. అది దేహంలోని మెదడువంటిది. అది అర్థశాస్త్రంలో పెట్టుబడివంటిది. అది ఎవరిచేతిలో ఉంటుందో వారు తమకనువుగా భౌతిక ఆచరణని మలుచుకోగలుగుతారు. అందువల్ల భావజాల సాంస్కృతిక రంగాల్లో పాలసీనిర్ణాయక స్థానంలో ఏ వర్ణాలు, ఏ కులాలు, ఏ వర్గాలు నాయకత్వం వహిస్తున్నాయనేది చాలా ముఖ్యమైంది.

1909లో ముస్లింలకు ప్రత్యేక ఎన్నికల నియోజకవర్గాల కల్పన బిల్లు హౌస్‌లో ఆమోదం పొందింది. దీనివల్ల భారతదేశంలో పార్లమెంటరీ విధానానికి పునాది ఏర్పడుతుందని ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత కాలంలో సిక్కులకు, 1919లో అణగారిన వర్గాలకు 1931లో అంటరానివారికి 1935లో క్రిస్టియన్లకు ప్రత్యేక నియోజకవర్గాలు కల్పించటం జరిగింది. అలాగే విద్యా, ఉద్యోగ రంగాల్లో శూద్ర– వెనుకబడిన, అంటరాని కులాలకు రిజర్వేషన్లు సాధించటానికి మార్గం సుగమం అయింది. జస్టిస్ పార్టీ, బాబా సాహెబ్ అంబేద్కర్, పెరియార్ రామస్వామిల ద్వారా శూద్ర, అతిశూద్ర కులాలకు రిజర్వేషన్లు సాధించటానికి బలమైన సాధనంగా ఉపయోగపడింది. ఈ విషయంలో క్రింది కులాలు యావత్తూ ముస్లింలకు రుణపడి ఉన్నారు.

మమతలు – మానవ సంబంధాలు

"ఏదైనా సరే కార్మికరంగం గానీ, ఉద్యోగరంగం గానీ సంఘటిత రంగంగా యాజమాన్యంతో బేరం చేయగలిగిన శక్తి, యాజమాన్యం తాలూకు ఆస్తిత్వంలో తాలుకు అస్తిత్వంలో లాభాల్లో మనకు ఉండే కీలక స్థాయిననుసరించి కూలీలు జీతాలు గిట్టుబాటవుతాయి. వెనకట వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అందుకని అది లేని నాకు నిన్ను యివ్వనన్నారు. ఇపుడది గిట్టుబాటు లేనిదైపోతున్నది. వెనకటి బట్ట మిల్లు కార్మికరంగం దాని స్థానం బలంగా ఉన్నంతకాలం కూలీ బాగా గిట్టుబాటై ఆ కార్మికుల్లోంచే చిన్న పెట్టుబడిదారులు పుట్టి యిపుడు షోలాపూర్, భీవండి బట్టల మిల్లుల యాజమానులయ్యారు. ఇపుడా అవకాశం లేదు. కంప్యూటర్ ఎలక్ట్రానిక్ రంగాలిపుడీ దశలో ఉన్నాయి. అందులో నిన్నటి ఉద్యోగుల్లోంచి నేడు వేలకోట్ల అధిపతులయ్యారు."

వ్యక్తి కుటుంబాలు ఏర్పడిన తరువాత కుటుంబ సంబంధాల్లో వచ్చిన పరిణామాలు

కుటుంబాలు వ్యవసాయం నుండి, కుల వృత్తుల నుండి ఆధునిక వృత్తుల్లోకి, ఇతర ప్రాంతాల్లోకి వలస వెళ్ళినప్పుడు వ్యక్తి కుటుంబాలుగా మారుతూ వచ్చాయి. సంపాదన వ్యక్తి చేతిలో చేరింది. ఉమ్మడి కుటుంబానికి ఎంత పంపాలో అనే నిర్ణయ శక్తి సంపాదిస్తున్న వ్యక్తి యొక్క ఇష్టాఇష్టాల మీద ఆధారపడే పరిణామం సాగింది. దాంతో ఇంటికి మొదట్లో బాగానే పంపేవారు. క్రమంగా సొంత పిల్లలు, సొంత ఇల్లు, సొంత సంసారం అంటూ ఆలోచిస్తూ ఉమ్మడి కుటుంబ సభ్యులకు చెబుతూ సంపాదనలో కొంత వాటా మాత్రమే పంపడానికి పరిమితమయ్యారు. తమ్ముళ్ళ, చెల్లెల్ల చదువులు, పెళ్ళిళ్ళు మొదలైన వాటికి సహకరిస్తూ ఆ తరువాతి తరంలో కేవలం పెన్షన్‌లాగా కొంత ఇంటికి పంపడానికి పరిమితమై సంబంధాలను ఒక కుటుంబానికి, మరో కుటుంబానికి మధ్య ఉండే సంబంధాలుగా మార్చుకున్నారు.

సమాజాన్ని పట్టించుకోవడం తగ్గిపోయిన తీరు – వ్యక్తిగత ఆలోచనా విధానం, మారిన విలువలు

ఇండివిజ్యువల్ థింకింగ్ వ్యక్తిగత ఆలోచనా విధానం పెరిగాక స్వాతంత్ర్యానంతరం భారత జాతి గురించి మొత్తం భారత ప్రజల గురించి పట్టించుకోవడం తగ్గిపోయింది. సేపులొచ్చిన ఆవు పాలు పిండుకోవడమే తమ వంతు అనుకుంటూ

ఎవరి వర్గ ప్రయోజనాలకు, ఎవరి పార్టీ ప్రయోజనాలకు, ఎవరి రాష్ట్ర ప్రయోజనాలకు వారు పరిమితమయ్యారు. రాజకీయ పార్టీలు కూడా తమ పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యత నిచ్చి జాతీయ ప్రయోజనాలకు, కోట్లాది ప్రజల ప్రయోజనాలకు రెండవ స్థానాన్ని ఇచ్చాయి. అందువల్ల స్వాతంత్ర్యం పూర్వం ఎదిగి వచ్చిన నాయకత్వం, వారి వ్యక్తిత్వం, వారి విలువలు, వారి సంస్కారం, వారి దృక్పథం వేరు. స్వాతంత్ర్యానంతరం ఎదిగిన నాయకత్వం, విలువలు, వ్యక్తిత్వం దృక్పథం వేరు. సెక్షనల్ థింకింగ్, కంపార్ట్‌మెంటల్ థింకింగ్, ఇండివిజ్యువల్ థింకింగ్ పెరిగింది. పర్యవసానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికా సంఘాల, ప్రభుత్వ శాఖల బాధ్యత బాగా పెరిగిపోయింది. కేంద్ర ప్రణాళికా సంఘం, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాత్రమే భారత దేశాన్ని గురించి సమగ్రంగా ఆలోచించే జాతీయ దృక్పథానికి ప్రతినిధులుగా మిగిలిపోవాల్సి వచ్చింది.

స్వాతంత్ర్య అనంతరం జాతీయోద్యమం స్ఫూర్తిలో భాగంగా ఆయా అగ్రకులాల ఆధిపత్యం, స్వప్రయోజనాలు కూడా కొనసాగుతూ వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాంతీయ పరిపాలకుల అభివృద్ధికోసం కృషి చేయాలని స్థానిక అగ్రకులాలు ఉద్యమాలు చేశాయి. అందుకు కులం పేరుతో కాకుండా రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి వికేంద్రీకరణ సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. ఇలా రాజకీయ రంగంలో రాజకీయ భావజాలాల్లో పరిణామాలు, ప్రాంతాల గురించి, ప్రాంతీయ అస్తిత్వ వాదాల్లో ఆయా కులాల అభివృద్ధి అధికారం తాలూకు సిద్ధాంతాలు ప్రయోజనాలు రూపుదిద్దుకున్నాయి.

స్వాతంత్ర్యానంతరం అధికారం అన్ని రంగాల్లో అందిపుచ్చుకున్న అగ్ర కులాలు, పాలక వర్గాలు, పారిశ్రామిక వేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, విద్యావంతులు అభివృద్ధిలో వెనుకబడిన, అభివృద్ధిలో అణిచివేయబడిన వర్గాల కులాల, ప్రాంతాల ప్రజల భావజాలాన్ని అనేక విధాలుగా థాట్‌పోలిసింగ్‌తో నియంత్రించారు. కర్మ, పునర్జన్మ, తెలివితక్కువ తనం, నైపుణ్యం తక్కువ, విద్య తక్కువ, కులం తక్కువ మొదలైన అనేక సిద్ధాంతాలను ప్రజల మీద నిరంతరం ప్రచారం చేశారు. ప్రతిభా సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి అవకాశాలు ఇవ్వకుండానే మీకు ప్రతిభ లేదని కించ పరిచారు. అవమానించారు. ఆధునిక విద్యను కొన్ని వర్గాలు, కొన్ని కులాలే అందుకొని మిగతా వారిని అందుకు అర్హత లేదని హేళన చేశారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని పెంచే బదులు చంపే ప్రయత్నాలు చేశారు. అందుకు అనేక సిద్ధాంతాలు ఉపయోగపడ్డాయి.

మరొకవైపు అధికారం అందని ప్రజలు, పారిశ్రామిక ఉత్పత్తి విధానం వల్ల వృత్తులు కోల్పోయిన కుల వృత్తుల ప్రజలు జాతీయోద్యమ కాలం నుండి సంఘాలుగా

ఏర్పడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ సంఘాలు తమ ఓటు హక్కు ద్వారా తమ కులాల వారిని ఎన్నుకుని చట్టసభలకు పంపి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయించాలనే దృష్టి లోపించింది. కాంగ్రెస్ పార్టీ దార్శనికత, గాంధీవాదం, నెహ్రూవాదం దీన్ని మనసులోకే రాకుండా చేసింది. అంబేద్కరిజం ఒక్కటే దీన్ని ప్రజల మనస్సులో ప్రవేశపెట్టింది. సమాంతర, ప్రత్యామ్నాయ భావజాలాన్ని, సిద్ధాంతాలను, చరిత్రను అంబేద్కరిజం ముందుకు తెచ్చింది. పెరియార్ రామస్వామి నాయకర్ ద్రావిడ ఉద్యమం పేరిట ఆర్య, ద్రావిడ చారిత్రక పరిణామాల పేరిట అంబేద్కరిజం లాగే బ్రాహ్మణ వాద వ్యతిరేక సిద్ధాంతాలను చరిత్రను, రాజకీయాలను ముందుకు తెచ్చారు. ఫలితంగా 1967 నుండి డిఎంకె పేరిట బిసిలు ఎస్‌సిలు తమిళనాడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. రామ్‌మనోహర్ లోహియా బిసిలకు పెద్ద పీట వేయాల్సి ఉందని సిద్ధాంతాలు చేసి సోషలిస్టు పార్టీ నిర్మాణాన్ని అందుకు అనువుగా చేపట్టారు. దాన్నుంచి 1967 నుండి ఉత్తరప్రదేశ్‌లో బిసిలు అధికారంలోకి వస్తున్నారు.

బడ్జెట్ల కేటాయింపులో వివక్షత వల్ల కాకతీయుల కాలం నుండి 1956 దాకా సుభిక్షంగా వుండి ప్రపంచంలోనే మూడవ సంపన్న రాజ్యంగా 1906లోనే గుర్తింపు పొందిన నిజాం రాజ్యం హైదరాబాద్ రాష్ట్ర తెలంగాణ ప్రాంతాలు 1956 తరువాత కరువులకు, వలసలకు దారితీసాయి. మరొకవైపు తెలంగాణలో వచ్చే ఆదాయాన్ని, తెలంగాణలోని ఖనిజాలను, గనులను తెలంగాణ పేరిట ఖర్చు రాస్తూ ఆంధ్ర ప్రాంత ప్రయోజనాలకనువుగా ఆదాయాన్ని తరలించారు. ప్రకృతి వనరులను తరలించారు. ఇలా 60 ఏళ్ళలో రెండు వేల ఏళ్ళలో సాధ్యం కానంత దోపిడి తెలంగాణ ప్రాంతంపై జరిగింది. తద్వారా రెండువేల ఏళ్ళలో సాధ్యంకాని అభివృద్ధిని ఆంధ్రప్రాంత రెడ్లు, కమ్మలు, రాజులు, బ్రాహ్మణులు స్వాతంత్ర్యానంతరం రెండువేల రెట్లు అభివృద్ధి సాధించారు. ఇది ఒబిసిలకు, ఎస్‌సిలకు, ఎస్‌టిలకు మైనార్టీలకు, మహిళలకు అందవలసిన వాటా. దాన్నంతా ఈ కొన్ని కులాలే హక్కు భుక్తం చేసుకున్నాయి.

పూర్వం ప్రభుత్వ ఉద్యోగాలు బాగా తక్కువ. ప్రభుత్వ ఉద్యోగం చేయడం దిక్కులేని వారు చేస్తారు అనే భావన ఉండేది. క్రమంగా 1965-70 నాటికి ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆసక్తి గౌరవం పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగాలు బాగా పెరిగాయి. ప్రభుత్వేతర రంగాల్లోకూడా ఉద్యోగాలు పెరిగాయి. పరిశ్రమలు పెరిగాయి. సంఘటిత రంగం పెరిగింది. వికేంద్రీకృత వృత్తులు వాటి ఉత్పత్తులు తగ్గాయి. వాటి మార్కెట్ కూడా కష్టమైపోయింది. ఇలాంటి వాటి వల్ల ఉత్పత్తిదారులకన్నా వాటిని అమ్ముకునేవారికే ఎక్కువ లాభం వచ్చేది. భారీ పరిశ్రమలు, భారీ ఉత్పత్తులు పెరిగాయి.

తద్వారా సరుకుల రవాణా పెరిగింది. రోడ్ల అవసరం పెరిగింది. పర్యవసానంగా స్థానిక ఉత్పత్తులు పడిపోయాయి. స్థానికులు ఉపాధి కోల్పోయాయి. దాంతో ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగాయి.

చదువుకున్న యువకులకు ఉద్యోగాలు దొరకక పోవడంతో ప్రైవేటు స్కూళ్ళు ప్రారంభమయ్యాయి. ఇతర రాష్ట్రాల నుండి మొదట స్కూళ్ళు పెట్టారు. కొందరు నడవక వెళ్ళిపోయారు. కొందరు స్థిరపడ్డారు. 1980 నాటికి ప్రైవేటు స్కూళ్ళ ప్రాధాన్యత పెరగడం ప్రారంభమైంది. మొదట్లో ప్రభుత్వ స్కూళ్ళలో పనికి రాని పిల్లలను ప్రైవేటు స్కూళ్ళలో వేసేవారు. 1980 నాటికి ప్రైవేటు స్కూళ్ళలో పిల్లలను వేయడం గౌరవ ప్రదంగా మారింది. ముఖ్యంగా ఇంగ్లీషు మీడియం వల్ల ఆర్‌ఎస్‌ఎస్ దృష్టితో ఆదర్శ పాఠశాలలు నడపాలనే ప్రయత్నం వల్ల, స్థానిక విద్యావంతులు ఇల్లు ఇల్లు తిరిగి తల్లిదండ్రులను బతిమాలడం వల్ల, ప్రభుత్వ స్కూళ్ళలో సెలవులు పెరగడం, ఉపాధ్యాయులు పిల్లలను పట్టించుకోవడం తగ్గడం వల్ల ప్రైవేటు స్కూళ్ళకు గౌరవం పెరిగింది. 2007లో ప్రభుత్వ స్కూళ్ళలో చదువుకోవడం పేదరికానికి ధృవీకరణ లాగా మారింది.

1990 నుండి సాఫ్ట్‌వేర్ రంగంలో, కమ్యూకేషన్ రంగంలో, టీవీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. వై2కె కోసమని లక్షలాది మంది కొద్దిపాటి శిక్షణతో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌లుగా ఉద్యోగాలు పొందారు. 1990 నాటికి ఇంజనీరింగ్ సీట్లు ఆరువేలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు అన్నీ కలిసి లక్షాయాభైవేలు దాటిపోయాయి. ఈ రంగాల్లో ఒక కొత్త తరం పారిశ్రామిక వేత్తలు మధ్య తరగతి నుండి ఎదిగారు. పాత పారిశ్రామిక వేత్తలు ఆలస్యంగా కళ్ళు తెరిచారు. టిసిఎస్, రిలయన్స్ మొదలైన సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ఈ రంగంలోకి దిగితే తప్ప ఈ మధ్య తరగతి నుండి ఎదిగిన కంప్యూటర్ పారిశ్రామికవేత్తలతో పోటీలో అందుకోలేము అని గమనించి వేల కోట్ల రూపాయలను పెట్టుబడులుగా తమ ఇతర సంస్థల నుండి, బ్యాంకుల నుండి సేకరించి కుమ్మరించారు. అలా మరిన్ని సంస్థలు, ఉద్యోగావకాశాలు పెరిగాయి. లక్షలాది ఉద్యోగాలు లభించాయి. ఇలా కంప్యూటర్ ఆపరేటర్‌లు, రిపేరర్‌లు, డిటిపి, కంపోజిటర్లు మొదలైన రంగాలు కూడా విస్తరించాయి. ఇలా రాష్ట్రంలో రెండు లక్షలమందికిపైగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మరో రెండు లక్షల మంది కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలు పొందారు.

భారతీయ సమాజం - నేటి రాజకీయ సామాజిక పరిణామాలు

రోజువారిగా రాజకీయాలు, రాజకీయ అధికారం ఎవరికి అవసరమో వాళ్లు

రాజకీయాల్లో చురకుగా పాల్గొంటారు. రాజకీయ నాయకులను అంటిపెట్టుకుని ఉంటారు. ఎవరెవరికి నిరంతరం రాజకీయ నాయకుల, రాజకీయ అధికారాల, ప్రభుత్వ పాలసీల అవసరం పడుతుందో వాళ్లు రాజకీయాల్లో ఉండడంగాని తమవారిని గాని, తమకు అనుకూలమైనవారిని పెట్టుకోవడం కాని, ప్రోత్సహించడం కాని, సృష్టించడం కాని చేస్తుంటారు.

వీరితోపాటు రాజకీయాలతో మరికొందరికి కూడా నిరంతర అవసరం పడుతూ ఉంటుంది. ఉదా: పత్రికలు, టీవీలు. అలాగే సమాజం మౌనంగా అంగీకరించినా చట్టప్రకారం నేరాలుగా ఉండే సామాజిక కార్యకలాపాలలో ఉండేవారు ఇందులో ఒకరు. ఉదాహరణకి చట్టపరంగా నేరంగా పరిగణించే బ్లాక్‌మార్కెట్, కల్తీ, హవాలా, మాఫియా, స్మగ్లింగ్, అక్రమ మద్యం, అక్రమ బియ్యం రవాణా, అక్రమ కలప రవాణా, అక్రమ గనుల తవ్వకం, అక్రమ నిల్వలు, అక్రమ ధరల పెరుగుదల మొదలైన చట్టవ్యతిరేక సామాజిక కార్యకలాపాలు.

ఎవరిని ఎన్నుకోవాలో ఓటర్లకన్నా ముందు పార్టీలే నిర్ణయించాయి. ఆయా పార్టీల్లో ఎవరిని ఎన్నుకోవాలి అనే ప్రశ్నకు అగ్రకులాలనే ఎన్నుకోక తప్పదు అనే జవాబు ముందే తెలిసిపోయింది. వాటిల్లో ఎలాంటివారిని ఎన్నుకోవాలి అనే ప్రశ్న మాత్రం మిగిలి ఉంది. కాంగ్రెస్, టిఆర్ఎస్ వారిని ఎన్నుకోవాలా? బిజెపి, టిడిపి వారిని ఎన్నుకోవాలా? ఇండిపెండెంట్లను ఎన్నుకోవాలా అనేది పార్టీస్థాయికి సంబంధించిన ప్రశ్న. అందులో మళ్ళీ ఫ్యాక్షనిస్ట్, గూండా, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు నడిపే నాయకులను ఎన్నుకోవాలా? కాంట్రాక్టర్లుగా లాబీనీ నడిపే నాయకులను ఎన్నుకోవాలా? పారిశ్రామికవేత్తలనా? రియల్ ఎస్టేట్ వ్యాపారులనా? సినిమా రంగ గ్లామర్‌నా, వ్యవసాయ సమాజానికి ప్రాధాన్యతనిచ్చే వారినా? ఉద్యోగులకు, ట్రేడ్ యూనియన్లకు ప్రాధాన్యత నిచ్చేవారినా? అనే ప్రశ్న కూడా ప్రజల ముందున్నది.

ఆయా అభ్యర్థుల్లో ఎలాంటివారిని ఎన్నుకోవాలి అనే ప్రశ్నలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేవారిని ఎన్నుకోవాలా? హైదరాబాదులోనే కూర్చునేవారిని ఎన్నుకోవాలా? ప్రజల దగ్గరికి వచ్చేవారిని ఎన్నుకోవాలా?

స్వాతంత్ర్యానంతరం అక్రమ పద్ధతుల్లో సంపాదించిన వాళ్ళే ఇవాళ సంపన్నుల పేరిట రాజకీయాల్లో వెలుగు వెలిగిపోతున్నారు. కాయకష్టం చేసేవారు, జీతంమీద ఆధారపడి బ్రతికే ఉద్యోగులు ఎంత తెలివికలవారైనా, ఎంత గౌరవనీయులైనా ఈ రాజకీయాల్లో నిలబడి పోటీచేసి గెలుపొందే అవకాశాలు లేకుండాపోయాయి. ఇది సమాజం యొక్క పతనావస్థని సూచిస్తుంది.

మరోవైపు ప్రజాస్వామ్యబద్ధంగానే ధనస్వాములు అధికారంలోకి వచ్చి ప్రజల సంక్షేమం వదలి సంక్షేమ పథకాలకు తిలోదకాలిచ్చి తమ వర్గ, కుల, స్వార్థ ప్రయోజనాలకు మరింత సుఖం, మరింత సంపద కూడబెట్టుకోవటానికి అనువుగా ప్రభుత్వాలను నిర్దేశిస్తున్నారు. వాళ్ళే ప్రభుత్వంగా మారుతున్నారు. న్యాయమూర్తులను అలాంటివారినే పెట్టుకొంటున్నారు. ఐఎఎస్‌లను అలాంటివారినే ఎన్నుకొంటున్నారు. పారిశ్రామిక మేనేజర్లుగా, సిఇఓలుగా ఐఐఎంల ద్వారా అలాంటివారినే పెట్టుకుంటున్నారు.

సమాజం, సామాజిక జీవితం బహుముఖమైనది. సామాజిక జీవితానికి ఎన్నో పార్శ్వాలు, ఎన్నో దశలు, ఎన్నో సంబంధాలుంటాయి. ఎన్నో రంగాలుంటాయి. ఏకకాలంలో అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో సమూలమై, సమగ్రమైన, పరిణామ శీలమైన మార్పులను అభివృద్ధిని ప్రజలందరికీ అందించటమే సమగ్ర సామాజిక విప్లవం. వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయిక, సాంస్కృతిక రంగాల్లో ఆస్తి హక్కులో కుటీర పరిశ్రమల్లో, న్యాయ వ్యవస్థలో సైనిక వ్యవస్థలో, బ్యూరోక్రసీ అధికారం యంత్రాంగంలో సాహిత్య కళారంగాల్లో సామాజిక చరిత్రలో ప్రజలకు అందాల్సిన 80 శాతం వాటాని ఎప్పటికప్పుడు అన్ని రంగాల్లో ఏకకాలంలో అందించే కృషి చేయడమే సమగ్ర సామాజిక విప్లవం. అదే సామాజిక వికాసం కూడా.

దళిత స్త్రీ సాహిత్యం ఆవశ్యకత

బహుజన లేదా దళిత స్త్రీ సాహిత్యం అంటే ఏమిటి? బహుజన స్త్రీల మేలుకోరేది బహుజన స్త్రీ సాహిత్యం. ఈ జవాబుతో ఎవరికీ పేచీ లేదనుకొంటాను. ఇంత సులభమైన ప్రశ్నకు ఇంత సులభమైన జవాబులుండగా బహుజన స్త్రీ సాహిత్యం అనగానే కొందరు ఎందుకు ఉలికిపడుతున్నారో అర్థం కావడం లేదు. బహుశా బహుజన స్త్రీల మేలుకోరే సాహిత్యం తమకు కీడు కలుగజేస్తుందని వాళ్ల భయం కాబోలు,

అయితే, ఒకటి వాస్తవం. ఎవరు స్త్రీలు, ఏ స్త్రీలు, ఎవరు బహుజన స్త్రీలు అనే వివరణ పట్ల తేడాలుండవచ్చు. ఏది బహుజన స్త్రీలకు మేలు చేస్తుందనే దానిపట్ల భేదాభిప్రాయాలుండవచ్చు. దాన్ని అర్థం చేసికోవచ్చు. కాని బహుజన స్త్రీల మేలుకోరే బహుజన స్త్రీ సాహిత్యం అనే మాటపట్ల కూడా కొందరు ఎందుకు పేచీపెడ్తున్నారో తెలియదు. వాళ్లలో కొందరు వర్గ సాహిత్యం అనో బహుజన సాహిత్యమనో, విప్లవ సాహిత్యమనో, స్త్రీ సాహిత్యం అనో పిలుచుకుంటే సరిపోతుందిగదా అని ప్రశ్నిస్తుంటారు. ఇవన్నీ నిజంగా బహుజన స్త్రీల వ్యతిరేక సాహిత్యమేమీ కాదు గదా!

ఈ వ్యాసం తొలుత కొన్ని వందల కాపీలను సైకిలోస్టైలు చేసి ఆ రాష్ట్రంలోని మహిళా వాదులకు, ఇతర సాహిత్య, సామాజిక సంస్థలకు పంపిణీ చేయడం జరిగింది. తరువాత గోదావరి కెరటాలు, తదితర పత్రికల్లో పలుమార్లు ముద్రణ పొందింది. ఈ చర్చ తరువాత ఫెమినిస్టులు వెంటనే బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలను వారి కోణాలను పట్టించుకున్నారు.

అయినపుడు వర్గ, కుల, దళిత, అభ్యుదయ, విప్లవ, హిందూ, సాహిత్యం అనో లేదా స్త్రీ సాహిత్యం అనో మాత్రమే పిలవాలనే వాదం ఎంతో బలహీనంగానైనా ఎందుకు ముందుకు వస్తున్నది? అసలా ప్రశ్న ఎందుకు ఉత్పన్నమైంది?

సమాజంలో బహుజన స్త్రీలు తమ సొంతకాళ్ల మీద తమ సొంత ఆలోచనలతో, సొంత దృక్పథంతో నిలదొక్కుకోవడం ఇష్టం లేని వాళ్లు కొందరున్నారు. అందుకు వాళ్ళల్లో కొందరు సాహిత్యరంగంలోనూ కృషి చేస్తారు. అలాంటివారు బహుజన స్త్రీలు, సొంత ఆర్థిక స్వావలంబనతో, సొంత మెదడుతో, సొంత సృజనత్వంతో సొంత కాళ్లమీద నిలబడ్డం ఇష్టంలేని తనానికి, సాహిత్య రూపం ఇస్తారు. అపుడే వారి వాదం బహుజన స్త్రీ సాహిత్యం, బహుజన స్త్రీ దృక్పథం అంటూ ప్రత్యేకంగా వుండనవసరం లేదనే రూపం తీసుకుంటుంది. బహుజన స్త్రీలు తమ సొంత కాళ్ల మీద సొంత సృజనత్వం మీద స్వయంగా నిలబడ నవసరం లేదనడానికి బహుజన స్త్రీ సంఘాలు, బహుజన స్త్రీ రచయితల, కళాకారుల సంఘాలు బహుజన స్త్రీ, సాహిత్యం అంటూ ప్రత్యేకం ఉండనవసరం లేదనడానికి మధ్య పెద్దగా తేడా ఏమీ లేదు. మొదటిది వారి ప్రాపంచిక దృక్పథం అయితే రెండోది సాహిత్యంలో, సమాజంలో దాని ఆచరణా, వ్యక్తీకరణా అంతే. అందువల్ల ఎందరు ఎంత గట్టిగా బహుజన స్త్రీ సాహిత్యం బహుజన స్త్రీ దృక్పథం, బహుజన రచయితల కళాకారుల సంఘాలు బహుజన సంఘాలు ప్రత్యేకంగా అవసరం లేదని వాదిస్తారో వారిలో సరిగ్గా అంతమేరకు బహుజన స్త్రీ వ్యతిరేక దృక్పథం ఆచరణ కొనసాగుతోందని అర్థం.

అయితే వీళ్లు నాజూకుగా వ్యవహరిస్తారు. ఒక సాధారణీకరణ పొందగలిగే సాహిత్యాన్ని నిర్దిష్టంగా బహుజన స్త్రీ సాహిత్యం అంటూ కుదించడం ఎందుకు అని వగలు పోతారు. వాళ్లనేదే నిజమైతే సాహిత్యాన్ని ప్రజాసాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం, బహుజన సాహిత్యం స్త్రీ సాహిత్యం హిందూ సాహిత్యం అని ఎందుకు నిర్దిష్టం చేస్తున్నట్టు? “సాహిత్యం” అని పిలవచ్చుగదా!

బహుజన సాహిత్యం అని పిలుస్తున్నారంటే బహుజన సాహిత్యం కూడా వుంటుందనేకదా. అలాగే స్త్రీ సాహిత్యం అని పిలుస్తున్నామంటే స్త్రీయేతర సాహిత్యం కూడా వుంటుందని అర్థం. స్త్రీయేతర సాహిత్యంతో స్త్రీ వ్యతిరేక అంశాలుండవచ్చు. అలాగే బహుజన స్త్రీయేతర స్త్రీ సాహిత్యంలో ఇతర సాహిత్యాల్లో బహుజన స్త్రీ వ్యతిరేక అంశాలుండవచ్చు. లేదా వారి సమస్యల ప్రాధాన్యతపట్ల మౌనం, నిర్లక్ష్యం వుండవచ్చు.

సాధారణీకరణ పొందే తాత్వికతను దృక్పథాన్ని బహుజన స్త్రీ దృక్పథం అని

పిలవడం వారికి కుదించడంగా ఎందుకు కనపడుతున్నది. బహుజన స్త్రీలను బహుజన స్త్రీల దృక్పథాన్ని చిన్నచూపు చూసే దళిత స్త్రీ వ్యతిరేకలకు తప్ప అలా మరొకరికి ఎందుకు కనబడుతుంది? ఇలాంటి వాళ్లే నన్ను సామాజిక రంగంలో నన్ను హిందువుననో, భారతీయ పౌరురాలిననో, ప్రపంచ మానవురాలిననో, స్త్రీయనో, సగర్వంగా ప్రకటించుకోకుండా మళ్లీ అందులో మాలమాదిగదాన్ని మంగలిదాన్ని, దొమ్మరిదాన్ని, శాలదాన్ని, గొల్లదాన్ని అని నీకునీవే ఎందుకు కించపరచుకుంటావు అని ప్రశ్నిస్తారు వాళ్లు.

ఈ ప్రశ్న బహుజన స్త్రీలను గౌరవించడం కోసమే ననుకుంటారు వాళ్లు. కానీ వాళ్లు ఆ మాట అన్నప్పుడల్లా నా హృదయం బల్లెంతో తూట్లు పొడిచినట్టు విలవిల్లాడిపోతున్నదని వారికి తెలియదా? ఏమో వారికి తెలుసో లేదో కూడా తెలియదు. నన్ను నేను మూలదాన్ని, మాదిగదాన్ని, డెక్కలిని, చండాలిని, దొమ్మరిదాన్ని, గొల్లదాన్ని, చాకలిదాన్ని, శాలదాన్ని అని సగర్వంగా ప్రకటించుకోవడం నన్ను నేను కించపరచుకోవడంగా కన్పిస్తున్నదా వారికి? నేను బాపనదాన్ని కోమటిదాన్ని, రెడ్డిఆన్ని, కమ్మదాన్ని, అని ఒకరు, పీడిత వర్గాన్ని అని ఒకరు, మగవాన్ని అని ఒకరు అలా నీవు నీ ఇంటి పేరులోను, సొంతపేరులోను, లోకంలోను, నీ సంస్కృతిలోను, భాషలోను, చివరకు క్రియాపదంలోనూ ప్రకటించుకొనడానికి నీకు సిగ్గెందుకు లేకుండా పోయిందో తెలుసుకోవచ్చా? నీకు గల మంగలింగం లేదా, పీడిత వర్గం లేదా బాపనదాన్ని, రెడ్డిదాన్ని, కోమటిదాన్ని, కమ్మదాన్ని అనే నిర్దిష్టతలు నీలోని స్త్రీతత్వం, మగత్వం, భారతీయత, మానవత్వం అనే సాధారణీకరణాల్ని, విలువల్ని, వాస్తవాల్ని కించపరచవుగానీ నాకున్న నిర్దిష్ట స్త్రీలింగం, మాలమాదిగ డెక్కలి దొమ్మరిదాన్ని అనే నిర్దిష్టతలు నాలోని భారతీయతను, మానవతను, పీడితవర్గం అనే వాటిని కించపరుస్తాయా? అంటే ఏమిటి? నీ కులం హోదాకు, మగహోదాకు, నీ అగ్రకుల స్త్రీత్వ హోదాకు హీనత్వమే లేదని నమ్మి దాని ఆధిక్యతని నీవు కూడా అనుభవిస్తున్నావు. నాకుగల కులం, స్త్రీలింగం, తద్వారా నాకుగల నిర్దిష్ట సామాజిక హోదా చిహ్నంను, గుర్తింపు చిహ్నంను నీవు కూడా కించపర్చడం వల్లనే కదా నీలో ఈ భావం కలుగుతోంది? నీవు పీడితవర్గ దృక్పథాన్నో, స్త్రీ దృక్పథాన్నో లేదా బహుజన దృక్పథాన్నో గుర్తించినా దళిత స్త్రీ సొంత కాళ్లమీద, సొంత మెదడుతో నిలదొక్కుకునే దృక్పథం అనేదాన్ని గుర్తించకపోవడం ఇందులో భాగంకాదా?

అయ్యా! అమ్మా! ఇలా నన్నూ నా కులాన్నీ, నా లింగాన్నీ, నా దృక్పథాన్నీ, దళిత స్త్రీ దృక్పథం దళిత స్త్రీ సాహిత్యం అనే నిర్దిష్టతతో చెప్పడాన్ని కుదించడం అంటూ చిన్నచూపు చూస్తూ ప్రజా దృక్పథం అనో, వర్గ దృక్పథం అనో, స్త్రీ దృక్పథం

Dalithayugam-1
03-09-09
48

అనో దళిత దృక్పథం అనో మరొకటనో ఒక సాధారణీకరణ పొందే ప్రయత్నం చేయాలనడంలోనే నన్నూ నా జాతినీ, కులాన్నీ, ప్రాంతాన్నీ నాలోని దళిత స్త్రీత్వాన్ని, నా పేరునూ, నా దళిత స్త్రీ దృక్పథాన్ని కించపరిచి చిత్రవధ చేయడం వున్నదని నీకు మాత్రం తెలియదా?

దళితులు ఒక వాస్తవం. స్త్రీలు ఒక వాస్తవం. పీడితవర్గం ఒక వాస్తవం. దళిత స్త్రీలు ఒక వాస్తవం. స్త్రీలు అనే వాస్తవం కన్నా బహుజన స్త్రీలు అనే వాస్తవం ఎక్కువ వాస్తవం. ఏమంటే స్త్రీలలో బహుజన స్త్రీలే డెబ్బయి శాతం. దళితులు అనే వాస్తవం యొక్క ఒక వ్యక్తీకరణ దళిత దృక్పథం. పీడితవర్గం అనే వాస్తవం యొక్క వ్యక్తీకరణ పీడితవర్గ దృక్పథం స్త్రీ అనే వాస్తవం యొక్క ఒక వ్యక్తీకరణ, స్త్రీ దృక్పథం. అలాగే దళిత స్త్రీ అనే వాస్తవం యొక్క ఒక వ్యక్తీకరణ అదృశ్యమైనపుడు ఆయా దృక్పథాలు, ఆచరణలు కాలం తీరినవైపోతాయి. ఇవన్నీ ఏకకాలంలో కొనసాగుతున్నాయి. వీటి అస్తిత్వాన్ని ఆవశ్యకతను నిరాకరించేవారు వాస్తవాలు గుర్తించి నిరాకరించేవారు. అంతేకాదు వారు అగ్రకులతత్వ పూరిత హిందూ మనుధర్మాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతీయాధిక్యతా భావాన్ని, అభివృద్ధి చెందిన అగ్రకుల స్త్రీల ఆధిక్యతా వాదాన్ని, మంగలింగ ఆధిక్యతా వాదాన్ని, గుండెల్లో నింపుకొని ప్రజలు ప్రజలంటూ స్త్రీలు స్త్రీలంటూ దళితులు, దళితులంటూ, పైపైన అరిచే పచ్చి స్వార్థపరులు.

తమపైగల సమస్త అణచివేతల్ని వదిలించుకొని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సాధించుకోవాలంటే తమకు ఇతరులపై పదవీరీత్యా కులరీత్యా, వర్గరీత్యా చదువురీత్యా, లింగరీత్యా, వయసురీత్యా, జ్ఞానంరీత్యాగల సమస్త ఆధిక్యతల్ని, పెత్తనాన్ని, అధికారాల్ని వదులుకోకుండా సాధ్యపడదు. ఏమంటే అణచివేత వుందని, అదిపోవాలని గుర్తించిన నీవే నీకుగల ఆధిపత్యాన్ని వదులుకొనే సంస్కారాన్ని అలవర్చుకోలేకపోతే నీ మీద ఆధిపత్యం చెలాయించేవాడు తన అగ్రకులాల్లోని పురుషులకు, అగ్రకులాల్లోని, స్త్రీవాదులకూ, దళిత కులాల్లోని పురుషులకూ సమానంగా వర్తిస్తుంది. అగ్రకుల స్త్రీవాదులు పురుషాధిపత్యాన్ని దాంతోపాటు దళిత దృక్పథంలోని స్త్రీ సమస్యల ఆధిపత్య వాదాన్ని నిలదీయాలి. ఈ రెండు పనులూ ఏకకాలంలో చేసిన నాయకత్వంగా దళిత స్త్రీ నాయకత్వం ఎదగాలి. అలా అగ్రకుల స్త్రీలకూ, దళిత పురుషులకూ అగ్రకుల పురుషులకూ అన్ని రంగాలలో దళిత స్త్రీలే నాయక స్థానాలలోకి ఎదగాలి. అందుకు అందరూ హృదయపూర్వకంగా సహకరించవలసి వుంది.

వివిద దృక్పథాలలో సామాజిక జీవితాన్ని ప్రజా జీవితాన్ని విశ్లేషించి సాహిత్యాన్ని,

ఆచరణను ఆయా దృక్పథాలలోనే చూడాలిగానీ దళిత దృక్పథంతోనో, దళిత, స్త్రీ దృక్పథంతోనో చూడ్డం సరికాదుఅని ఎవరైనా వాదించవచ్చు. సూర్యుని సహాయంతో చూస్తాం. అయితే అందుకు మన కళ్లసాయం కూడా అవసరం. వాస్తవాలను ఏ దృక్పథంతో చిత్రించినా దళితుల దళిత స్త్రీల, గిరిజన స్త్రీల వారిలోనూ వెనుకబడిన ప్రాంతాల, జాతులలోను, వెనుకబడిన కులాల వారి ప్రయోజనాలను నెరవేర్చేదిగా వున్నదా లేదా అని తేల్చడం అత్యంత ముఖ్యమైన విషయం.

కులం, లింగం, వర్గం, జాతి ప్రాంతీయ అసమానత మొదలైనవన్నీ ఇప్పటికీ ఒకరి అభివృద్ధికి మరొకరి అణచివేతకు సాధనంగా కొనసాగుతున్నాయా లేదా అనేది అసలైన సూటిప్రశ్న. వారు ఏ దృక్పథంతో రాసినా దీనికి సూటిగా జవాబు చెప్పాలి. ఈ ప్రశ్నకు లేదు అని జవాబు చెప్పేవారు పుట్టుగుడ్డి లేదా పెట్టుగుడ్డి. వారికి రెండు కళ్లు అమర్చాలి. అందుకు వారి దృక్పథం, జీవితం అనే రెండు కళ్లనూ ఆపరేషన్ చేయాల్సి వుంటుంది. కుల, మత, దేశ, ప్రాంత, జాతి, లింగ వర్గ ప్రాతిపదికలపై రిజర్వేషన్లకు అంగీకరించేవారూ వ్యతిరేకించే వారూ అని ఒకరి అభివృద్ధికి మరొకరి అణచివేతకు సాగుతున్నాయని అంగీకరిస్తున్న వారే. ఏమంటే దాన్ని వ్యతిరేకించడం అది తమ అభివృద్ధి నిరోధిస్తుందనే కదా! అలాగే దాన్ని సమర్థించడం తమ అభివృద్ధిని ప్రోత్సహిస్తుందనే కదా! అలాకాకుండా వీటిని, వీటి అస్తిత్వాన్ని ఫంక్షనింగ్‌ని గుర్తించ నిరాకరించేవారు వాస్తవాల్ని చూడ నిరాకరించే శుంఠలూ, మాయావాదులూ, తమ రచనల్లోను, ఆచరణలోను, అన్నింటితో పాటు వర్గ, కుల, లింగ, జాతి, ప్రాంత, మత వయస్సు ఆధిక్యతా రూపాలలో సాగే అణచివేతను కూడా చిత్రించవలసి వుంటుంది. ఇవి ప్రతి సందర్భంలో, ప్రతిచోటా ప్రతి విషయం ఏకకాలంలో కొనసాగుతున్నాయి. అందువల్ల ప్రతిరచనలో వీటిద్వారా జరిగే అణచివేతను అన్నిటితోపాటు అన్నింటిలో భాగంగానైనా చిత్రించని వారు ఈ దేశంలోని ముఖ్య వాస్తవాలను వదిలేసి అర్భక శుంఠ మాయావాదంతో స్వప్న జగత్తులో నివారించే బాధ్యతా రహితులే.

జ్ఞానానికి లింగస్వభావం వుంది. మత స్వభావం వుంది. జాతి స్వభావం వుంది. వర్గ స్వభావం వుంది. కులస్వభావం వుంది. ప్రాంత స్వభావం వుంది. వయస్సు స్వభావం వుంది. పదవి, హోదా స్వభావం వుంది. ఇవి ఏకకాలంలో కొనసాగు తున్నాయి. మనదేశంలో పీడిత కులాలు అందులోని స్త్రీలే ఎక్కువ మేరకు నిరక్షరాస్యులుగా, పేదలుగా, బతుకీడుస్తున్నారు. అంటే మనదేశ భాషలు, మతాలు, జ్ఞానం, కులవ్యవస్థ, సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు, విప్లవ పోరాటాలు మొదలైనవన్నీ అగ్రకుల స్వప్రయోజనాల కనువుగా అందులో భాగంగా అగ్రకుల

స్త్రీల ప్రయోజనాల కనువుగా పరివర్తన చెందించబడుతున్నాయని అర్థం.

డెబ్బయి ఏళ్ల జాతీయోద్యమాల్లోనూ విప్లవోద్యమాల్లోనూ, సమాజ చలనంలోనూ దళిత స్త్రీలు నాయకత్వంలోకి రాకపోవడం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. వీటన్నిటిలో అగ్రకుల పురుషులూ, అగ్రకుల స్త్రీలే నాయకత్వంగాఎదుగుతున్నారంటే ఆయా వ్యూహాలు, ఎత్తుగడలు, ఆచరణ, జ్ఞానం అన్నీ అగ్రకుల పురుషులు, అగ్రకుల స్త్రీలు మాత్రమే ఎదగగలిగే విధంగా వున్నాయని అర్థం. కొంగ, నక్క కూజా, పళ్లెం, పాయసం కథలాగా జ్ఞానం, నాయకత్వం అగ్రకులం మూతలకు మాత్రమే అందే విధంగా సాగుతోంది. అందులోనూ అభివృద్ధి చెందిన ప్రాంతాల వారి నాయకత్వం రావడం జరుగుతున్నది.

స్త్రీ సమస్య దళిత సమస్యలలో కూడా ఇదే జరుగుతుంది. వారు తమ కన్నా వెనకబడిన కులాల స్త్రీల సమస్యలను తమకన్నా వెనకబడిన ప్రాంతాల దళితుల సమస్యను పరిష్కారం కోసం ముందుకు తీసుకువచ్చి అక్కడి నాయకత్వాన్ని కూడా ఎదిగించడం వగైరా త్యాగాలు, కర్తవ్యాలు చేయలేకపోతున్నారు. గత కొన్ని ఏళ్లుగా చూస్తే స్త్రీవాదుల్లో, వెనుకబడిన ప్రాంతాలలోని, దళిత స్త్రీల నుండి తయారైనవారు ఏరీ? ఎంతమంది? వారని స్థానమెక్కడ? అలాగే దళిత మహాసభల ఉద్యమాలు కొంచెం ఆవేశం రంగు పలుముకున్న దళిత పౌర హక్కుల సంఘాలుగా పాత అంబేద్కర్ సంఘాల్లా పరిమితమైపోయాయి. వీరు ఈ వెనుకబడిన ప్రాంతాలలోని దళితుల గురించి చేసింది తక్కువ. అసలు పట్టించుకోలేదు అనడం సబబు. వాటికి వెనుకబడిన ప్రాంతాలే మద్దతునిచ్చాయి గానీ వెనుకబడిన ప్రాంతాల దళితులకు మద్దతునిచ్చే స్థాయికి ఎదగలేకపోయాయి.

ఒక ఏడేళ్ల సమయంలో ఉదా.కు 1971 నుండి 1984 దాకా విప్లవ పోరాటాలు ఎంత చైతన్యం, ఎన్ని సామాజిక మార్పులు తీసుకొచ్చాయో వెనుకబడిన ప్రాంతాల నాయకత్వాన్ని ఎంతగా తీసుకొచ్చాయో పరిశీలించి దళిత ఉద్యమాలలో 1985-92 పోలిస్తే అవి ఎన్నిరెట్లో గొప్పది. వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల ప్రజలు సహకరించే విధంగా విప్లవ పోరాటాలు సాగాయి. కాగా అభివృద్ధి చెందిన ప్రాంతాల సమస్యల కనువుగా వెనకబడిన ప్రాంతాల స్త్రీవాదులు, బహుజనవాదులు కదలడం వరకే సమస్యలు ఏకపక్షానికి పరిమితమైపోవడం విచిత్రం. ఇలా స్త్రీవాదాలు దళిత మహాసభ ఆచరణలు అభివృద్ధి చెందిన ప్రాంతాల వారి భౌతిక, భావజాల నాయకత్వాన్ని వెనకబడిన ప్రాంతాలమీద కొత్తరూపంలో కొనసాగించినట్టవుతున్నది. సరిగ్గా చెప్పాల్సి వస్తే స్త్రీవాద, దళితవాదం, పర్యావరణ వాదం నయా వలస వ్యతిరేకవాదం వంటి కొత్త కొత్త రూపాల్లో అభివృద్ధి చెందిన

ప్రాంతాల, జాతుల అగ్రకులాల, దేశాల, ఆధిక్యతవాదం నయా రూప వలసవాదం కొనసాగుతున్నది. తమకన్నా వెనుకబడిన వారిని అంతిమ లక్ష్యంగా నిర్ణయించుకోలేని ఎవరికైనా ఇదే గతి పడ్తుంది. వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం వున్నా లేకున్నా అవి ఈ నడుస్తున్న చరిత్రే సాక్ష్యం ఇస్తున్నది.

అగ్రకుల, ప్రాంత, జాతి, మత ఆధిక్యతావాదులు, అభివృద్ధి చెందిన ప్రాంతాల స్త్రీవాదులు, దళితవాదులు, పీడిత కులాలు, పితృస్వామిక వాదులు వగైరాలు అందమైన పదాలు, ఆవేశపూరిత ఆర్భాటాలు నూతన తాత్విక సిద్ధాంతాలను తమలోని వెనకబడిన ప్రాంతల వ్యతిరేకతకు, దళిత స్త్రీ వ్యతిరేకతకు నగిషీలుగా ఉపయోగిస్తారు. దాంతో వీరి అరుపులు హిందూ, అగ్రకుల, మత, వర్గ అభివృద్ధి చెందిన ప్రాంతం తాలూకు, గోడమీద పిల్లుల్లాగుంటాయి. దళితుల గురించి పట్టించుకోవాలంటూనే వెనకబడిన ప్రాంతాలలోని దళితుల సమస్యలను, అణచివేతను, అస్పృశ్యతను గురించి పోరాటాలు నిర్వహించారు. అగ్రకుల స్త్రీవాదులు వెనకబడిన ప్రాంతాలలోని దళిత స్త్రీల సమస్యలను, అణచివేతను, పట్టించుకోవాలంటూనే భావజాల, భౌతిక పోరాటాలు మాత్రం సాగించరు. ఉదా.కు బహుజన స్త్రీల గురించి పట్టించుకోవాలంటూనే వదిలేస్తారు. అమ్మా! ఏడాదంతా మీ పిల్లల పీతిబట్టలూ, మీ మురికి బట్టలూ, ముట్టుబట్టలూ వీర్యంతో తడిసిన లంగాలు, లుంగీలు వేల ఏళ్లుగా ఉతుకుతున్నాం మాక్కూడా మీతో సమానంగా గౌరవం కావాలి.

మీ నుండి నిజమైన సహృదయత కావాలి. అందువల్ల దయచేసి ఏడాదికోనెలైనా నెలకోవారమైనా మా ఇళ్లకొచ్చి మా ముట్టుబట్టలు, పీతిబట్టలు ఉతికి ఇచ్చిపొండి. మీరిచ్చినంతే కూలీ ఇస్తాం అంటే చాకలిదానికి ఎంత గర్వం వచ్చిందీ అని గుడ్లురిమి చూస్తారు. వాషింగ్ మిషన్ తెచ్చుకొని నాకున్న ఆకాస్త పనిని పోగొడ్తారు. ఇలా అభివృద్ధి ఫలితాలు మీ పాలు, ఉపాధి కోల్పోవడం, నిరుద్యోగం మాపాలు, ఎందుకు తల్లీ నీ హితబోధలు! నిజంగానే నా బాధలు ఆర్చడానికి తీర్చడానికేనా? ఏడాదల్లా మీ గిన్నెలు తోముతున్నాను గదా! కనీసం నెలకొ మూడు రోజులైనా మా ఇంట్లో గిన్నెలు తోముమని అదే కూలి ఇస్తానని నిన్ను నేనడిగితే యీ పనిమనిషి ముండకు కావరం వచ్చింది. చిన్నతరం, పెద్దంతరం లేకుండా మాట్లాడుతుందని నీ మగనితో అంటావు. మా యీ సామాజిక గౌరవం హోదా గురించి మీరేం చేస్తున్నారని మేం నిలదీస్తే ఇదెక్కడి ముండ చిల్లరకులమేగంత అని అనేస్తారు. లేదా మనస్సులో అనుకొంటారు. వాషింగ్‌మిషన్‌లాగే అంట్లు తోమే మిషన్ కూడా తయారు చేయమని మీ మగన్ని పురమాయిస్తారు. ఇలాంటి గోడమీద పిల్లులు పిల్లికూతలకూ మా దళిత స్త్రీ దృక్పథం ఉట్టి తెగదు. దళిత స్త్రీ సాహిత్యం ఆగిపోదు.

ఏ దృక్పథంతో రాసినా అది దళితులకు, దళిత స్త్రీలకు వెనుకబడిన ప్రాంతాలకు, జాతులకు, వర్గాలకు మేలు చేసే దృక్పథం కూడా అని వర్గీకరించడాన్ని అభ్యంతర పెట్టేవాళ్ల రాసేది చేసేదీ ప్రజా సాహిత్యంగానీ, విప్లవ సాహిత్యంగానీ స్త్రీ సాహిత్యంగానీ ఎలా అవుతుందో వారికే తెలియాలి.

నీ కొడుకు నా బిడ్డను ప్రేమించిండు. పెళ్లిచేద్దాం అని నేను అంటే అదే నా కొడుక్కి కన్నుకొట్టి వలలో వేసుకున్నదటనే – నా ఆస్తి చూసి, నా పెద్ద కులం చూసి – అని నీవు యీసడించి యీ చిల్లరకుల పోల్లేగింత అని మనస్సులో అనుకొని 5, 10 వేలు లంచం ఇచ్చి మంచి మొగన్ని జూసి దానికి పెళ్లి చెయ్యవే అని హితబోధ చేసినపుడు నీలోని స్త్రీతత్వం, ఎక్కడుందని వెతకాలి తల్లీ!

నీ బిడ్డకు నీ కులంలో లెక్కలేనన్ని సంబంధాలు వెతికి వేలు లక్షలు పోసి ఆ తాగుబోతుకు మంచి నౌకరి అని తగులకడితివి వాడు యాడాది తిరకుండానే కిరోసిన్ పోసి, చంపి, ప్రమాదవశాత్తు చచ్చిపోయిందని టెలిగ్రాం ఇచ్చె. అవ్వా! గవ్వే పైసలు నా కొడుక్కో, నా తమ్మునికో పోసి ఓ దుకాణమో, వ్యవహారమో పెట్టిస్తేంది బిడ్డ అల్లుడూ మీ కండ్ల ముంగట వుంటారని నేను బతిమిలాడ్తే నువ్వూ నీ మొగుడూ కలిసి చిల్లర కులపు మాదిగిదానా చెప్పు తీసుకొని పండ్లు రాలగొడ్తా – బ్రాహ్మణదాన్ని, వెలమదాన్ని, కోమటిదాన్ని, రెడ్డిదాన్ని, కమ్మదాన్ని, నన్ను ఎంత మాటడిగితివేయని తిట్టినప్పుడు ఎక్కడ పోయిందవ్వా నీలోని స్త్రీతత్వం. స్త్రీతత్వం. అవ్వా ఇవేవీ నువ్వు పట్టించుకోకపోతే నువ్వేరకం స్త్రీ వాదినవ్వా? యధాతథవాద జడాత్మకభ్రామక అగ్రకుల స్త్రీవాదం కాదానీది?

ఇలా వీరికి మన ఇంట్లో పని చేయడంగానీ, మన బట్టలుతకడం గానీ, మన యింటికి పిల్లను ఇవ్వడంగానీ, మన ఇంటి పిల్లను చేసికొనడంగానీ ఇష్టం లేదన్నమాట! ఇలా వీళ్లు మంచం పొత్తు, కంచం పొత్తుతో పాటు పనిపొత్తు, మాటపొత్తుకు కూడా వ్యతిరేకమన్నమాట! వీరిలోని స్రీత్వం, స్త్రీత్వం మా సామాజిక గౌరవాలికిచ్చే ప్రాధాన్యత సమాన హోదా యిదన్నమాట? ఈ మాట కాదనే వాల్లకోమాట. నా చీపిరికట్ట, పార నీకిస్త, నీ పెద్ద జీతం తీసుకుంటెనే ఏడాదికోనెలన్నా నా తీరు మున్సిపాలిటీ రోడ్డు చెత్త, మురికి కాల్వలు బాగుచేయి తల్లీ! మేం చందాలేసుకొని నీ పెచ్చు జీతం కట్టిస్తం".

పై బహుజన స్త్రీ వాదనలో తేలుతున్నదేమిటి? దళితులకు, దళిత స్త్రీలకు వెనకబడిన ప్రాంతాలకు, ఉపయోగపడే ప్రజా సాహిత్యాన్ని, స్త్రీ సాహిత్యాన్ని గానీ, సామాజిక ఆచరణని గానీ, దళిత సాహిత్యంగా, దళిత స్త్రీ సాహిత్యంగా వర్గీకరించడానికి చెప్పే అభ్యంతరాలు స్పష్టంగా అస్పృశ్యతకు సంబంధించినవే.

కాగా వీరిలో కొందరు ఘరానా పెద్ద మనుషులుగా తత్వవేత్తలుగా, రచయితలుగా, రాజకీయ నాయకులుగా విప్లవకారులుగా, స్త్రీవాదులుగా చలామణి కావడం విచిత్రం, తాత్విక, సామాజిక, విమర్శ రూపంలో దృక్పథం, ఆచరణ రూపంలో సాగుతున్న యీ తాత్విక, సామాజిక, సాహిత్య, లింగ, కుల ప్రాంత, జాతి, వర్గ దళిత, అస్పృశ్యతను స్త్రీలు దళితులు దళిత స్త్రీలు ప్రజాస్వామికవాదులు నిరంతరం ఎండగట్టాల్సి వుంది.

నిజంగా ప్రజాభ్యుదయ విప్లవ, హిందూ, వర్గ, దళిత సాహిత్యంగానీ, స్త్రీ సాహిత్యం గానీ, అయితే అది దళిత స్త్రీల మేలుకోరే దళిత స్త్రీ సాహిత్యానికి, ఆ దృక్పథానికి, ఆచరణకు వెలుపల వుండే సమస్య ఉత్పన్నం కాదు. దళిత సాహిత్యంలో భాగంగాలేని సాహిత్యం, దళిత స్త్రీ సాహిత్యంలో భాగం కాలేని సాహిత్యం, దళిత సంఘాలతో, దళిత స్త్రీ సంఘాలతో దళిత రచయితలతో, దళిత రచయితల సంఘాలతో కలిసి పనిచేయని, చేయలేని ప్రజావర్గ విప్లవ, హిందూ మానవతా, దృక్పథాలు ఆచరణలుగానీ స్త్రీ దృక్పథం ఆచరణలుగాని నిజంగా ప్రజలకు, స్త్రీలకు సంబంధించినవి ఎలా కాగలవు?

అది ఏ సాహిత్యమైనా ఆచరణైనా పరోపకారాన్ని కోరుతున్నదా, స్వప్రయోజనాలకు పరిమితమైనదా, ప్రజావ్యతిరేక, దళిత వ్యతిరేక, దళిత స్త్రీ వ్యతిరేక, సమాజ వ్యతిరేక అంశాలు ఏమైనా వున్నాయా, వాటి ప్రాధాన్యతల పట్ల మౌనంగాని, నిర్లక్ష్యం గాని ఏమైనా వుందా? అని నిర్ధారించడానికి దళితులను, దళిత స్త్రీలను అగ్రకుల స్త్రీలను వారి ప్రయోజనాలను, ఏ మేరకు ఎంతెంత పట్టించుకున్నాయనేది కూడా ఒక గీటుగా తీసుకోవడం అనివార్యమవుతున్నది. దళిత సాహిత్యానికి, దళిత స్త్రీ సాహిత్యానికి వెలుపల వుండే సాహిత్యంలో దళిత వ్యతిరేక, అగ్రకుల తత్వపూరిత, స్త్రీవాదంతో పాటు దళిత స్త్రీ సమస్యను నిర్లక్ష్యం చేసే అవకాశాలుంటాయని అగ్రకుల స్త్రీవాదుల ఆచరణే స్పష్టం చేస్తున్నది. వాటిని విశ్లేషించాలన్నా, సరిచేయాలన్నా వాటన్నిటిని దళిత దృక్పథం, దళిత స్త్రీ సాహిత్యం, దళిత సాహిత్యం పరిధిలోకి తెచ్చి చర్చించక తప్పదు.

అందువల్ల ఎన్ని దృక్పథాలున్నా వాటన్నిట్లో దళిత దృక్పథం, దళిత స్త్రీ దృక్పథం, దళిత సాహిత్యం, దళిత స్త్రీ సాహిత్యం యొక్క అస్తిత్వం, ఆచరణ అనివార్యమవుతున్నది. నిర్మాణ రూపాల్లో ఇదే ప్రత్యేకంగా దళిత సంఘాలు, స్త్రీల సంఘాలు, దళిత స్త్రీ సంఘాలు, దళిత రచయితల సంఘాలు, దళిత సాహిత్యోద్యమాలు, దళిత స్త్రీ సాహిత్యోద్యమాలు మొదలైన వాటి అస్తిత్వాన్ని ఆచరణని ఉత్పన్నం చేస్తున్నది. అదే సమయంలో వివిధ సమస్త దృక్పథాల్లో సాహిత్యాల్లో దళిత సాహిత్య, దళిత స్త్రీ

సాహిత్య, గిరిజన స్త్రీ సాహిత్య విభాగాలను దళితుల, దళిత స్త్రీల, అగ్రకుల స్త్రీల, అగ్రకుల పురుషుల ప్రత్యేక సెల్సును కూడా అనివార్యం చేస్తున్నది. దళిత సెల్సువారి ప్రయోజనం మేరకైనా ఆయా సంస్థల్లో ఉన్నతాధికార సంస్థలుగా ఆయా సంస్థల్ని నిర్దేశించగలిగినపుడే వీటి లక్ష్యం నెరవేరుతుంది.

అందువల్ల కులం సమస్యను చిత్రించిన స్త్రీ సాహిత్యం కులం అనేది ఒక సమస్యగా లేని అగ్రకులతత్వవాద స్త్రీల సాహిత్యం అవుతుంది. అలాగే వెనుకబడిన ప్రాంత, జాతి సమస్యను స్త్రీ సమస్యలో భాగంగా చిత్రించని స్త్రీ సాహిత్యం అభివృద్ధి చెందిన జాతుల, ప్రాంతాల, అగ్రకులాల లేదా దళితుల, స్వార్థపూరిత, సుఖ ప్రయోజన సాహిత్యం అవుతుంది. అలాగే వర్గం సమస్యను, మత సమస్యను చిత్రించని స్త్రీ సాహిత్యం వర్గం అనేది, మత అణచివేత అనేది ఒక సమస్యగా లేని పాలకవర్గాలకు, పాలక కులాలకు చెందిన స్వార్థపూరిత స్వప్రయోజనపరులైన స్త్రీల, స్త్రీ ఆధిపత్యావాదుల సాహిత్యం అవుతుంది.

ఈ సమస్యల్ని వదిలేసి చిత్రించే సాహిత్యం ఆయా కోణాల్లో ఆయా సమస్యల్లో పలాయనవాదాన్ని, యధాతథ వాదాన్ని కొనసాగిస్తున్నాయని అర్థం. అనగా అవి స్త్రీలలో పది శాతమైనా లేని అల్పసంఖ్యాకులైన అగ్రకుల మధ్యతరగతిలో ఉపాధిగల స్త్రీల సమస్యల్ని స్త్రీలందరి సమస్యలుగా రుద్ది చూపుతున్నారని అర్థం. స్త్రీవాద సాహిత్యం, ఆచరణ ఇంకా గొప్ప నిర్మాణ రూపాలు తీసికోలేకపోవడానికి వారి యీ అల్ప సంఖ్యాకత, అలిగార్కి (శిష్టవర్గ) ఎలైట్ అగ్రకుల స్త్రీత్వం కూడా ఒక ముఖ్య కారణం. తనకన్నా వెనుకబడిన స్త్రీల కోసం తనకున్న ఏ సౌకర్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగాలేని యధాతథవాద జడత్వంలో ఇలాంటి అగ్రకుల స్త్రీవాదం కొనసాగుతున్నది. అందువల్లే దళిత స్త్రీలను కూడగట్టి దళిత స్త్రీ నాయకత్వాన్ని భావజాల భౌతిక స్థాయిల్లో ఏర్పరచే ప్రాతిపదికలను పరిపూర్తి చేయలేకపోయారు. తనకన్నా వెనుకబడిన దళితుల కోసం తనకున్న ఏ సౌకర్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడం వల్ల అంబేద్కర్ కూడా బాధపడిన స్థాయిలో అరవై ఏళ్లుగా దళితవాదుల జడత్వం కొనసాగుతున్నది. అందువల్ల కూడా దళిత ఉద్యమాలు ఇలా నీల్గుతున్నాయి. చాలా దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘాలు పైరవీ దళారీ సంఘాలుగా కుదించుకు పోయాయి. తనకన్నా వెనుకబడిన వాళ్లకోసం తనకున్నదాన్ని కూడా త్యాగం చేయలేకపోతే ఇక నీవు చేసేదేమిటి? ప్రజాసేవ పేర, స్త్రీవాదం పేర, దళిత సేవపేర, నీ స్వప్రయోజనాల కోసం వారిని పరాయీకరించడమే గదా!

ఈ విషయంలో గ్రామీణ పీడితుల విప్లవాదాల్లోని త్యాగం, కర్తవ్యదీక్ష ఎంతో ఆదర్శప్రాయమైనవి. అందువల్ల నిజమైన దళిత స్త్రీవాదులు పట్టణ ప్రాంత స్త్రీవాద,

దళితవాదాల్లోంచి రావడం తక్కువని, నిజమైన దళిత స్త్రీవాదం మరీ వెనకబడిన ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన పీడితకుల రైతాంగ స్త్రీల పోరాటాల్లోంచి ఎదుగుతారని ఎదగాలని వర్తమాన ఆచరణ సూచిస్తున్నది. వాళ్లు గ్రామీణ దళిత స్త్రీవాదాన్ని అభివృద్ధి పరచవలసి వున్నది. ఎక్కువ అభివృద్ధి చెందిన వాళ్లు ఎక్కువ చదువుకున్న వాళ్లు ఎక్కువ మోసగాళ్లుగా, ఎక్కువ స్వార్థపరులుగా మారుతున్నారు. గనుక వెనుకబడిన వారు, వెనుకబడిన కులాల ప్రాంతాల స్త్రీలు ఇవన్నీ గుర్తుంచుకోవలసి వున్నది. వారి త్యాగంతో కర్తవ్యదీక్షతో ఎదిగే చైతన్యంతో ముందుకుసాగితే వారి ద్వారా సామాజిక మౌలిక మార్పులకు నూతన దృక్పథం, వ్యూహం, ఎత్తుగడలు, కార్యక్రమాలు రూపొందించబడతాయి. అనగా గ్రామీణ దళిత స్త్రీలు భావజాల, భౌతిక రంగాల్లో నాయకులుగా, పథ నిర్దేశకులుగా ఎదిగే క్రమంలో సమస్త రకాల ఉద్యమాల్లో, రంగాల్లో, ఆచరణల్లో గణనీయమైన మలుపులు సంభవిస్తాయి.

అపుడు అగ్రకులాల వారి వలసలుగా పీడిత కుల విప్లవ పోరాటాలు, పాలకుల స్త్రీల వలసలుగా, స్త్రీవాద, దళిత స్త్రీవాద ఉద్యమాలు, పట్టణ ప్రాంతాల వారి వలసలుగా గ్రామీణ ఉద్యమాలు, అభివృద్ధి చెందిన ప్రాంతాల వారి వలసలుగా వెనకబడిన ప్రాంతాల ఉద్యమాలు, అభివృద్ధి చెందిన దళితుల, దళిత స్త్రీల వలసలుగా వెనకబడిన ప్రాంత దళితుల, వెనుకబడిన దళిత స్త్రీల పోరాటాలు సాగే ప్రస్తుత అధ్వాన్న తలకిందుల స్థితి నుంచి బయటపడతారు. ఇలా దళిత స్త్రీ దృక్పథం యొక్క ఆవశ్యకత కేవలం వారికి సంబంధించినది కాదు. అది భారతీయ సమాజం యొక్క ఆవశ్యకత కూడా.

తాను అన్నీ అందిపుచ్చుకొని దాన్నే అశాస్త్రీయ విద్యావిధానమంటూ దళితులను, ఉన్నతవిద్య, ఉద్యోగావకాశానున్నుంచి దూరం చేసే సెక్షన్ ఒకటి తయారైంది. పూర్వం దోపిడి కులాలు, దోపిడి వర్గలు నా విద్య నీవు నేర్పితే సీసంపోస్తా, నాలికకోస్తానని బరితెగించి మాట్లాడేవి. అన్నంతపని చేసేవి. ఇపుడువాళ్లు కూడా నాగరికతను, నాజూకు సంస్కృతిని అలవరచుకున్నారు. అందుకే తాము అందిపుచ్చుకున్న విద్యనీ, ఉద్యోగాన్నీ అశాస్త్రీయ విద్యావిధానమంటూ యితరులు తమ రంగంలోకి రాకుండా నూతన పోరాట రూపాలు తీసుకున్నారు. ఈ చదువు నిజంగా వారు చెపుతున్నంత అశాస్త్రీయమైనదైతే వీటి కారణంగా నీకు వచ్చిన పట్టా, హోదా, వృత్తి, ఉద్యోగాల్ని, ఎందుకు వదులుకోవడం లేదు? నీచెల్లి, నీ తమ్ముడు, నీ పిల్లలు, నీ బంధుమిత్రులు, నీ అగ్రకులాలు, మళ్లీ ఇదే చదువులు చదువుతున్నారెందుకు? నీవాళ్లను నీ అగ్రకులాల వారిని ఈ చదువు మాన్పించే పోరాటాలు ఎందుకు చేయడం లేదు. నీ అగ్రకులాల వారు యీ చదువు ద్వారా పొందుతున్న సౌకర్యాలు ఉద్యోగాలు వదులుకోవాలని

పోరాటాలు ఎందుకు చేయడం లేదు. నీ బిడ్డలు నా బిడ్డల్లా మున్సిపాలిటీ సపాయి కార్మికుల్లాగా కావడం లేదేమిటి? మళ్లీ అదే మానసిక శ్రమమీద ఆధారపడే వృత్తుల్లోకే ఎందుకు వెళుతున్నారు నీ వాళ్లు? ఈ చదువుల్తో అంత ఉపయోగమేమీ లేక వీటిల్లో బీసీ, ఎస్సీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నగరాలు, వీధులు రక్తసిక్త మవుతున్నాయెందుకు? ఈ డెబ్బయి ఏళ్లలో వారికి యీ చదువులు, ఉద్యోగాలు అశాస్త్రీయమైనవి వారు స్వయంగా ఈ చదువు మానేసే పోరాటాలు చేయలేదేమి?

అసలు విషయం ఏమంటే మనువు యొక్క ఆధునిక వారసలు వీళ్లు. వీళ్ల తెలివి ఏమంటే రూపాయి కూలి పెంచడం అనే ఈతాకు ఇచ్చి విద్య, జ్ఞానం, నాయకత్వం అనే తాటాకు ఎత్తుకుపోవడం, మనుధర్మాన్ని స్వయంగా మన చేతుల్తోనే ఆచరింప చేయడం వారు సాధిస్తున్న ప్రత్యేకత. కాకపోతే పదిహేను శాతం గల ఈ దోపిడీ కులాలు ఈ విద్యతోనే డెబ్బయి శాతం వృత్తి ఉద్యోగ అవకాశాల్ని అన్ని రంగాల్లో నాయకత్వాన్ని ఆక్రమించడం ఎలా సాధ్యం? ఈ విద్యలో కొంత అశాస్త్రీయత వున్నమాట వాస్తవం. అయితే ఈ విద్యను బాగా అధ్యయనం చేయకుండా, యిందులోని అశాస్త్రీయతను పసికట్టడం, తొలగిచడం ఎలా సాధ్యం? అందువల్ల గ్రామీణ పీడితకుల బాలికల కోసం ఇపుడున్న స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, రెట్టింపు చేసి అవకాశాలు కల్పించాలని ఉద్యమించడం అసలు కర్తవ్యం. ఇలా ఎన్నో రంగాల్లో స్థాయిల్లో దళిత స్త్రీ దృక్పథం ఎన్నో మార్పుల్ని తెస్తుంది. వీటన్నిటిని గుర్తు చేసే, సరిచేసే సాహిత్యంగా కూడా బహుజన స్త్రీ సాహిత్యం అభివృద్ధి కావడం నేటి చారిత్రక అవసరం.

అరసం, విరసం దరకమే ఐక్యవేదిక

ఈ మధ్య అరసం, విరసం దళితుల పట్ల, దళిత సాహితీవేత్తల పట్ల ఎంతో ప్రేమ ఒలకబోస్తున్నాయి. ఇటీవల విప్లవ రచయితల సంఘం తన 25 ఏళ్ళ పండగ సందర్భంగా దళితవాదంపట్ల, దళిత సాహిత్య సంస్కృతిక ఉద్యమంపట్ల సానుకూలత వ్యక్తం చేస్తూ డాక్యుమెంటు విడుదల చేసింది. అరసం ప్రధాన కార్యదర్శి ఎస్వీ 1985–1995 దశాబ్దాన్నిదళిత ఉద్యమ దశాబ్దంగా, దళిత సాహిత్య ఉద్యమ దశాబ్దంగా అరసం అంగీకరిస్తున్నదని సెలవిచ్చారు. ఆరెసెస్ అనుకూల జాతీయ సాహిత్య పరిషత్, కూడా ఇలాగే సానుకూలంగా స్పందించే ఉండొచ్చు. ఇవన్నీ ఆహ్వానించదగిన పరిణామాలే.

అయితే మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి ఇంకా ఆ వాసన వస్తూనే ఉంది అని అన్నట్టుగా అరసం, విరసం తాము ఎప్పటినించో దళిత సమస్యను పట్టించుకున్నామని, ఏదేదో రాసి పొడిచేశామని కూడా ఈ సందర్భంగా ప్రకటించు కుంటున్నారు. తద్వారా ఆత్మవంచన, పరవంచనతోపాటు చరిత్రను వక్రీకరిస్తున్నారు. వాళ్ళు ఎపుడో ఏదో కులం గురించి రాసేసు కున్నామని తవ్విచూపిస్తున్నారు. వాళ్ళు నిజంగా ఆ దృక్పధంతో, ఆచరణలో ఉండి ఉంటే ఇపుడు కొత్తగా వాటిని తవ్వి చూపాల్సిన పని

కుల సమస్యను గుర్తించాక వామపక్షాలు, మహిళా వాదులు తమ నాయకత్వంలోనే దళిత సాహిత్యం వస్తుందని, రచయితలను, కళాకారులను, కేడర్‌ను కాపాడుకోవడానికి చర్చలు చేశారు. పోలరైజేషన్ జరగకుండా దళితవాదం వైపు రాకుండా తామే నాయకత్వం వహించగలమని, రాయగలమని చర్చించారు. దాంతో వారి పరిమితులను వివరిస్తూ, విమర్శిస్తూ రాసిన వ్యాసమిది.

లేదు. దళితుల గురించి దళిత సాహిత్య సంస్కృతి గురించి తాము చేసిన కృషిని, రచనల్ని రీప్రింటుచేస్తే అదే సాక్ష్యం యిస్తుంది. ఇలాంటిదేమీ చేయకుండా ఎక్కడో ఒక వాక్యం రాసుకున్నంత మాత్రాన వారు దాన్ని గుర్తించి, ఆచరించినట్లు అవదు. ఆ మాటకొస్తే వీరికన్నా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలు, లక్ష్యాలు ఎన్నోరెట్లు ఉన్నతంగా ఉన్నాయి. వాటిని ఆచరించాలని కోరుకుంటూ, న్యాయస్థానాలకు వెళ్ళే హక్కుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని నిలదీసే హక్కుంది. ఎన్నికల్లో అందుకనువుగా ఉండే వారినే ఎన్నుకునే హక్కు కూడా ఉంది. అయినా అవి ఏ మేరకు అమలయ్యాయో విడిగా చెప్పాల్సిన పని లేదు. ఇంత యంత్రాంగం, రాజ్యాంగబద్ధంగా ఉంటూ ఉన్నప్పటికీ ఆచరణలో అంతంతమాత్రం ఉంటే ఏదో ఒక వాక్యం రాసుకున్నందుకు అరసం, విరసం గతంలో ఏదో పొడిచేసినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటు.

భారతదేశ చరిత్ర విషయానికివస్తే పీడితవర్గ, కుల, లింగ దృక్పథాల సమన్వయంతో ప్రారంభమైన శ్రామిక కులాల సామాజిక ఉద్యమాల శిథిలాల నుండి, అక్కడక్కడా వాటిని విచ్ఛిన్నం చేయడం నుండి అరసం, విరసంల పుట్టుకకు కారణమైన కమ్యూనిస్టు, నక్సలైటు ఉద్యమాలు పుట్టాయి.

మార్క్సిజం అనేది ఈ దేశంలో అగ్రకులపేదలు, పెటీ బూర్జువాలు నయాధనిక వర్గంగా ఎదుగుతూ, అగ్రకుల జాతీయ బూర్జువా వర్గంగా, రాజకీయాల్లో, సాహిత్యంలో, సామాజిక ఉద్యమాల్లో తన వాటాకోసం, నాయకత్వం కోసం ఉపయోగపడే సాధనంగా తన ఉనికిని ప్రారంభించింది. ఇప్పటికీ కొద్ది మినహాయింపుల్తో దేశంలోని కమ్యూనిస్టు, నక్సలైటు పార్టీలు, వాటి ఉద్యమాలు, వాటి తాలూకు సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలు, సంస్థలు అన్నీ పెటీ బూర్జువా, బూర్జువా దృక్పథం, ఆచరణలకే పరిమితమయ్యాయి. నేటి దండకారణ్య పోరాటాలు అని పిలువబడే ప్రాంతాల్లోని దళాల ఆచరణ, అయితే ఎం.సి.సి. (బీహార్) దాని తాలూకు దళాల ఆచరణ, శంకర్ గుహనియోగి ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో నిర్మించిన సమగ్ర సామాజిక విప్లవంలోని కొన్ని ప్రత్యేకాంశాలు యిందుకు మినహాయింపు. ఆమేరకు అవి పీడితవర్గ దృక్పథంతో, పీడిత గిరిజన దృక్పథంతో ఆచరణలో ఉన్నాయి.

అయితే భారతదేశంలో కమ్యూనిస్టు, నక్సలైటు ఉద్యమాలు, వాటి సాహిత్య సాంస్కృతిక సంస్థలు ఏనాడూ పీడితవర్గ దృక్పథం కలిగిలేవు అనేదే సాధారణీకరించగలిగే వాస్తవం. ఈ దేశంలోని కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, నక్సలైట్లు వారి ఉద్యమాలు, దృక్పథాలు, ఏనాడూ అగ్రకుల పెటీ బూర్జువా, బూర్జువా పరిమితుల్నించి బయటపడలేదు. వారి వ్యూహం, ఎత్తుగడలు, లక్ష్యాలు, సాహిత్య సాంస్కృతిక నిర్మాణం అన్నీ అగ్రకుల పెటీ బూర్జువా స్థాయినించి ఒక్క అంగుళం

మేరకైనా ముందుకు సాగలేదు. అరసం, విరసం సభ్యులు–వాటితో కల్సి నడిచే వ్యక్తులు, వాటి సానుభూతిపరులు వారి ఉద్యమాల్లో, ఇళ్ళల్లో, ఆచరించేదంతా అగ్రకుల పెటీ బూర్జువా సంస్కృతే. వారిని కోసినా వారి రక్తంలో, వారి పెన్ను విరిచినా వారి సిరాలో పెటీ బూర్జువా సంస్కృతీ, దృక్పథాలే ఎర్రెర్రగా హెమోగ్లోబిన్‌తో మెరిసి పోతుంటాయి. వాళ్ళ హృదయానికీ, వారి అంతర్గత డాక్యుమెంట్లకు కూడా ఈ విషయం స్పష్టంగానే తెలుసు. కనక ఉదాహరణలక్కర లేదు.

అలాంటి అగ్రకుల పెటీ బూర్జువా ఈరోజు దళిత ఉద్యమాలకు, దళిత సాహిత్యానికి "సర్టిఫికెట్లు" ఇస్తున్నది. అరసం 1985–95 దశాబ్దాన్ని దళిత సాహిత్య సామాజిక ఉద్యమ దశాబ్దంగా అంగీకరిస్తున్నదట! విరసం దళిత సమస్యను, దళిత సాహిత్యాన్ని ఇపుడు గుర్తిస్తున్నదట. వాహ్! ఇంకేం దళిత సాహిత్య సామాజిక ఉద్యమకారులారా, దళిత సైద్ధాంతిక తత్వవేత్తలారా, మీ ఉద్యమాలని కట్టేయండి. మీ దుకాణాలను మూసేయండి. మా దుకాణాల్లోనే ఇకనుండి మీ సరుకునూ, దాంతోపాటూ మిమ్మల్ని జనానికి అమ్ముతాం. రండి. కల్సి పనిచేయండి అని పిలుపునిస్తున్నారు. గేటవతలనిలబెట్టే దొరగారు తన పక్క కుర్చీలో కూర్చోమనగానే ఉబ్బి తబ్బిబ్బయి పోయే నాటి దళితుడిలా తబ్బిబ్బయి పోతున్నారు.

అరసం, విరసం వారి ఆచరణలోనే రోత పుట్టించే సంస్కృతి విషయాన్ని పక్కనపెట్టి యిక్కడొక విషయం స్పష్టం చేయాలి. నేను గత 16 ఏళ్ళుగా చూసిన దళిత ఉద్యమాలు నిర్మిస్తున్న సంస్కృతికన్నా కమ్యూనిస్టు, నక్సలైటు విప్లవకారులు ప్రజల మధ్య ప్రజలతోఉంటూ నిర్మించిన విప్లవ సంస్కృతి, కమ్యూనిస్టు సంస్కృతి మహోన్నతమైంది. కమ్యూనిస్టు నక్సలైటు విప్లవకారుల ఆచరణలో, అవగాహనలో ఎన్ని లోపాలున్నప్పటికీ వారు నిర్మించిన సంస్కృతి ప్రజలపట్ల వారికి గల నిర్మలమైన ప్రేమ మహోన్నతమైంది. ఇంతలోతైన కమిట్‌మెంట్‌నుగానీ, జీవితాల్ని అంకితం చేసి కృషిచేయడంగాని, గత 16 ఏళ్ళుగా నేను చూసిన, పనిచేసిన దళిత సాహిత్య, సామాజిక ఉద్యమాల్లో నాకు కనపడలేదు.

ఇదే సందర్భంగా మరో విషయం కూడా స్పష్టం చేయాలి. ఇంత మహోన్నతమైన సంస్కృతిని నిర్మించిన కమ్యూనిస్టు నక్సలైటు విప్లవకారులే మరో విషయంలో అత్యంతదుర్మార్గమైన సంస్కృతిని విప్లవ సంస్కృతిగా ఆచరించారు. తమతో ఏకాస్త విభేదించినా ప్రశ్నించినా వారిని దిగజారిపోయారనో, ప్రజాద్రోహులనో, రివిజనిస్టులనో, అతివాదులనో, మితవాదులనో కులతత్వవాదులనో, పేర్లుపెట్టి వారితో కలుపుకోకుండా దూరంకొట్టి తన మిత్రుల్నే శత్రువులుగా మార్చుకొని దూరం కొట్టారు. అందుకు ఏకాకులై నష్టపోయి ఎంతో మూల్యాన్ని చెల్లించారు. చెల్లిస్తూనే ఉన్నారు.

కమ్యూనిస్టులు, నక్సలైట్లు దళితవాదం, స్త్రీవాదం ముందుకు తెస్తున్న సమస్యల్ని ఏనాడో గుర్తించకపోవడానికి ఆయా చారిత్రక సామాజిక, రాజకీయ ఉద్యమాల సందర్భాలు కారణం అని ఎస్వీ అనడం అర్థసత్యం. అసలు ఆయా ఉద్యమాలు పీడిత, వర్గ, కుల, లింగ దృక్పథంతో శ్రామికకులాల నాయకత్వంలో నడిచే ఉద్యమాల్ని విచ్ఛిన్నం చేయడం నుండే పుట్టిపెరిగాయి అనేది అసలు వాస్తవం. అగ్రకుల పెటీ బూర్జువా, బూర్జువా వర్గాలకున్నంత శక్తి సామర్థ్యాలు, నోరు, ఆర్థిక వనరులు, పాలకవర్గాల తోడ్పాటు శ్రామిక కులాల ఉద్యమాలకు లేకపోవడం వల్ల అవి విచ్ఛిన్నమైపోయాయి. శిథిలమైపోయాయి. అంతేగానీ మార్క్సిస్టులు, మావో ఆలోచనావాదులు అనుకుంటున్నట్టు ఆయా ఉద్యమాల దృక్పథాల పరిమితులకు చారిత్రక పరిమితులుండడం కాదు. వాటి నాయకత్వంలో గల అగ్రకుల పెటీ బూర్జువా పరిమితే ఆయా ఉద్యమాల పరిమితులుగా మార్చారనేది అసలు సంగతి.

కాంగ్రెస్ పార్టీ మొదలైనవి అగ్రకుల బూర్జువా దృక్పథానికి, ఆచరణకు పరిమితమై జాతీయోద్యమాన్ని కుదిస్తే, కమ్యూనిస్టు, నక్సలైట్లు అగ్రకుల పెటీ బూర్జువా దృక్పథానికి, ఆచరణకు, నాయకత్వానికి అనువుగా, తనకుతాను సమస్త అగ్రకుల పెటీ బూర్జువా పరిమితులకులోనై కొనసాగుతున్నాయి.

మరోమాటలో చెప్పాలంటే "నియోరిచ్" (నయాధనికవర్గం)గా ఎదగాలనుకునే శ్రేణిలోని ఒక సెక్షను, మార్క్సిజాన్ని, మావో ఆలోచనా వాదాన్ని, అరసాన్ని, విరసాన్ని, తమకు సాధనాలుగా చేసుకొన్నాయి. సాహిత్య సామాజిక రంగాల్లో వీరి కీర్తికాంక్ష సమీక్షా విమర్శల తీరుతెన్నులు, ప్రసంగాలు, ప్రక్రియలు, అన్నీ అరసం, విరసం పెటీ బూర్జువా నయాధనిక వర్గంగా ఎదగాలని ఆరాటపడి పోరాటాలు చేయడానికే పరిమితం అని 70 ఏళ్ళుగా వీరి ఆచరణ స్పష్టం చేస్తుంది. కాకపోతే అది డబ్బు రూపంలో కాకుండా, కీర్తిప్రతిష్టలు, నాయకత్వం రూపంలో కొనసాగుతోంది. కీర్తిప్రతిష్టలు, నాయకత్వం అనే వాటి సీమకు అంతులేదు.

అందువల్ల ఆర్థిక రంగంలోని అగ్రకుల పెటీ బూర్జువా నయాధనిక వర్గమైనా ఏదో ఒకాడికి తృప్తి పడుతుందేమోగానీ సాహిత్య సాంస్కృతిక రంగాల్లోని అగ్రకుల పెటీ బూర్జువా, నయా (కీర్తి) ధనికవర్గం ఎంత అందినా తృప్తిపడే అవకాశం లేదు. అగ్రకుల పెటీ బూర్జువా నయాధనిక వాదానికి .... 1935 దాకా తెలుగు సాహిత్యం నన్ను నిర్దేశిస్తే 1935 నించి నేను తెలుగు సాహిత్యాన్ని నిర్దేశించాను అన్న శ్రీశ్రీ మాటలు ఒక చక్కని ఉదాహరణ. ఆ మాట రిలయన్సు అంబానీ కోవలోనిదే. బతికున్న అగ్రకుల పెటీ బూర్జువా నయాధనికవాద సాహిత్య సాంస్కృతిక రంగాల ప్రతినిధులను పేర్కొనాల్సివస్తే మహీధర రామ్మోహనరావును అతని కుటుంబాన్ని పేర్కొనవచ్చు.

ఆయన జాతీయోద్యమాలపై రాసిన నవలలన్నీ అగ్రకుల పెటీ బూర్జువా నయాధనిక వర్గంగా ఎదగడానికి దారి సుగమం చేసేవే.

అరసం, విరసం, దళిత కవులు వచన కవితను ఆశ్రయించుకొని బతకడానికి కారణం వారికి గల పెటీ బూర్జువా, నయాధనికవర్గ స్వభావమే కారణం. కొండకు వెంట్రుకను ముడేసి లాగితే కొండంత కీర్తయినా వస్తుంది. పోతేపోయేది వెంట్రుక అనే స్థాయి ప్రక్రియా, వస్తు, పెట్టుబడిని వచన కవితగా స్వీకరించారు. తమకు కీర్తిరావడం కోసం రాశారు. అదిరాగానే నా అంతటివాడు లేడని విర్రవీగారు. కాలగర్భంలో కలిసిపోయారు. కల్సిపోతారు.

సామాజిక ఉద్యమాలకు మద్దతు ఇస్తున్నాం అనే పేరిట ఆయా సామాజిక ఉద్యమాలలో ఉద్యమించిన ప్రజల్నించి ఎదగాల్సిన రచయితలకు అరసం విరసంలు చేసినంత విప్లవద్రోహం మరెవరూ చేయలేదేమో. ఉదాహరణ ఆయా సామాజిక ఉద్యమాల సందర్భంగా సామాజిక పరిణామాల గురించి ఆయా దశల్లో కొన్ని వందల కథలు, నవలలు ఎన్నదగిన ఇతర ప్రక్రియలు రావాల్సి ఉండె. రాలేదు. అందుకు కృషి చేయలేదు. వారిని సృజనను, చైతన్యాన్ని వెలికి తీయలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉద్యమించాక వారి నుండి రచయితలుగా, మేధావులుగా, నాయకులుగా ఎదిగించే కృషి చేయకుండా అగ్రకుల నాయకత్వమే కొనసాగింది. ఇదొక ద్రోహం. అలా వారి నుండి రాకుండా, రాయకుండా, ఆయా ఉద్యమాల కీర్తిని అరసం, విరసం మరెవరికీ మిగలకుండా, తామే అనుభవిస్తున్నాయి. ఉదాకు, ఆయా ఉద్యమాలకు ప్రజలకు ఈనాడు ప్రజానాట్యమండలి, ఈనాడు జననాట్యమండలి, వగైరా యిచ్చిన ప్రేరణ, చైతన్యంతో పోల్చితే అరసం విరసంలిచ్చిన కాంట్రిబ్యూషన్ ఒక్క లెక్కలోకి రాదు. అలాగే నేటి దళిత వచనకవులు. దళిత పాటలు, దళిత కళామండలి, మాష్టార్జీల కృషి ప్రభావంతో పోల్చితే దళిత వచన కవులది కొండకు వెంట్రుక కట్టడంతో సమానమైన కృషే. దళితవచన కవుల వర్గ స్వభావం కూడా శ్రామిక కుల పెటీ బూర్జువా నయాధనిక వర్గ స్వభావమే తప్ప శ్రామిక కుల పీడితవర్గ స్వభావం కాదు. దళిత ఉద్యమాలు, దాని తాత్వికత ఎదిగిఎదిగి ఇపుడు పంటకొచ్చాయి. పండిన పంటను కోసుకోవడానికి దాన్ని సరుకుగా అమ్ముకోవడానికి వచ్చిన శ్రామిక కుల పెటీ బూర్జువా యేనేటి దళిత వచన కవి. పత్రికల్లో బాగా చర్చనీయాంశంకాని ఇతర దళితవచన కవులకీ ఈ మాట వర్తించదు. వారు నిజాయితీపరులే.

గత 70 ఏళ్ళుగా అగ్రకుల పెటీ బూర్జువా, నయాధనికవర్గ స్వభావంతో సాహిత్య సాంస్కృతిక రంగంలో అరసం విరసంల రూపంలో ఏం చేసిందో, దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక కూడా అదే పని చేస్తుంది. అయితే

వాటికి వీటికి స్వభావంలోనే మౌలికమైన తేడా ఉంది. దరకమే ఐక్యవేదిక శ్రామిక కులాల పెటీ బూర్జువా నయాధనిక వర్గ స్వభావం కలిగి ఉంటుంది. శ్రామిక కులాల పెటీ బూర్జువా జాతీయ బూర్జువాగా ఎదిగేమేరకే దళితులకు కాంగ్రెస్, బిజెపి, కమ్యూనిస్టు, నక్సలైటు, అరసం, విరసం, జాతీయ సాహిత్య పరిషత్ వంటి పార్టీల్లో, సంస్థల్లో స్థానమూ, నాయకత్వమూలభ్యమవుతాయి. విరసం విప్ల వోద్యమాల్లోని చెత్తను కొన్ని ప్రాంతాల్లో నిర్బంధం చెరిగివేస్తుంది. ఆస్థాయి నిర్బంధం లేనందువల్ల దళిత ఉద్యమాల్లో దళిత సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఈ చెత్తకూడా ఎక్కువ జమ అవుతుంది.

అరసం విరసంలకున్న బలం విప్లవోద్యమాలు కాదు. వాటి అసలైన బలం పాలకవర్గంగా ఎదిగిన అగ్రకుల పెటీ బూర్జువా, బూర్జువా వర్గంలో ఉంది. కాళోజీ, వరవరరావు, బాలగోపాల్‌లు ఎన్‌కౌంటర్లపేరిట చంపబడకుండా బతికి ఉండడానికి పాలక వర్గంగా ఎదిగిన వారి వర్గమైన అగ్రకుల పెటీ బూర్జువా, బూర్జువా–పాలకవర్గాల్లో తగుస్థానాల్లో ఉండడమే కారణం. ఈ బలం పునాది వల్లనే వాళ్ళు విప్లవపార్టీల అభిప్రాయాల్లో విభేదిస్తూ మరియు విప్లవ పార్టీలను ఎదిరిస్తూ కూడా విప్లవ సాంస్కృతిక ఉద్యమాలకు నాయకత్వం వహించడం సాధ్యపడుతోంది. మాలమాదిగలు, శ్రామిక కులాల పెటీ బూర్జువాలు, బూర్జువా పాలకవర్గాలుగా ఎదగకుండా ఆ పునాది లేకుండా గద్దర్, వంగపండులు విప్లవ పార్టీలతో విభేదించి మరియు వాటిని ఎదిరించి, విప్లవ సాంస్కృతికోద్య మానికి నాయకత్వం వహించడం సాధ్యంకాదు. ఈ కారణం రీత్యానే ఆ బలంగల కొందరు దళిత వచన కవులు ఆల్ ఆఫ్ సడెన్‌గా గొప్ప కీర్తి ప్రతిష్టలనార్జించే క్రమంలోకి రావడం సాధ్యపడింది. ఆ పునాది లేకపోవడం వల్లనే మాష్టార్జీ, ఉ.సాంబశివరావు, గూడ అంజయ్య, వంటి దళితపాటల కవులూ దళిత వచన కవుల కీర్తి ప్రతిష్టతో పత్రికల్లో (జనంలో కాదు) వెనకబడిపోవాల్సి వస్తుంది.

మార్క్సిజం చదువుకున్నామనుకునే ఎస్వీకి యివేవీ అర్థం కాకపోవడం ఆయన చదివిన మార్క్సిస్టు పరిజ్ఞానాన్నే శంకించేట్టు చేస్తోంది. అరసం, విరసం వాళ్ళందరికీ ఈమాట వర్తిస్తుంది. ఏమంటే వాళ్ళు వచ్చిన, వాళ్ళు ఎదిగిన, వాళ్ళు నిలబడిన వర్గ పునాదే వారికి అర్థం కాకపోతే వారేం మార్క్సిజం చదివినట్టు? అగ్రకుల పెటీ బూర్జువా దృక్పథం, ఆచరణ, పరిమితుల్లో నిండా కూరుకుపోయిన అరసం విరసంలు, కల్సి పనిచేద్దాం రండి అని దళితవాదులకు, స్త్రీవాదులను ఆహ్వానించడం హాస్యాస్పదం. ఈ అరసం, విరసం సభ్యులు తాము పుట్టిపెరిగిన గ్రామాలు ఎలా ఉన్నాయో అని అయినా అధ్యయనం చేశారా? 1982లో మాచెర్ల విరసం సభలో గద్దర్ యిచ్చిన

పిలుపుకు స్పందించి ఔను గ్రామాల్ని అధ్యయనం చేయాలి అని తలపూపి 14 ఏళ్ళవుతోంది. ఈనాటికైనా ఏ ఒక్కరైనా విరసం సభ్యులు ఆ పని చేశారా? ఈ పడక్కుర్చీ, అరసం, విరసం వాళ్ళా గ్రామీణ, దళితవాద సమస్యల్ని శ్రామిక కులాల పీడితవర్గ దృక్పధాన్ని అర్థం చేసిగోగలిగేది! వారికి చాతనైతే కులం, కుల సమస్య ఎన్ని రూపాలో, సమస్య రంగాల్లో ఎలా కొనసాగుతుందో వారి వారి అరసం, విరసం దృక్పథంలో భాగంగానే అయినా కథలు, నవలలు, వ్యాసాలు, ప్రసంగాలు, పాటల ద్వారా విశ్లేషించి చూపినపుడు గదా వీరంతా నిజంగానే ఏదో ఓ మేరకు కులసమస్యను గుర్తించినట్టు. అరసాన్నో, విరసాన్నో, "విశాలాంధ్ర"నో, విప్లవోద్యమాలనో ఆశ్రయించే పెటీ బూర్జువాలా మాకు చెప్పవచ్చేది! వారు చేసిన త్యాగాలేవి? వారు వారి కుటుంబాలు ఎంచక్కా పెటీ బూర్జువాలు గానే ఎదుగుతున్నారే!

మా నాయకత్వంలో, దరకమే ఐక్యవేదిక నాయకత్వంలో, బీసీ, ఎస్సీ, ఎస్టీల నాయకత్వంలో మీరు పనిచేయడమే అసలైన పరిష్కారం.

విప్లవ, దళిత, స్త్రీ వాదాలు

ఆచరణకు వ్యక్తీకరణ అవసరమైనపుడు కవిత్వం, తత్వశాస్త్రం, కళలు చరిత్ర, సంస్కృతి పుద్తున్నాయి. ఆచరణ యొక్క అదనపు విలువగా యివి పుద్తాయి. ఆచరణ వీలుకానపుడు ఆచరించాలనే తపనను, ఆసక్తిని వ్యక్తీకరించడంలోనూ యివి పుద్తాయి. ఇలా ఆసక్తి యొక్క అదనపు విలువగానూ యివి పుద్తాయి. చెప్పేదొకటి చేసేదొకటి అయినపుడు మభ్యపెట్టి మోసగించే ఆచరణలో భాగంగా కూడా యివి పుద్తాయి. ఆచరణకు దాని క్రమాన్ని, గతాన్ని యితరులకు అందించాలనుకున్నపుడు కూడా యివి పుద్తాయి.

కవితా వస్తువు సమాజమే అయినపుడు వస్తువు ఎదగకుండా శిల్పం ఎదగడం అంటే సమాజం ఆగిపోయి శిల్పం ముందుకు సాగడం, అనగా విప్లవం ఆగిపోయి విప్లవ కవిత్వ శిల్పం ముందుకు సాగిందని అర్థం. అందువల్ల వస్తువు కన్నా శిల్పం ఎదగడం క్షీణయుగం అంటారు.

వ్యక్తీకరణ అనేది పరస్పర సంబంధంలో సామాజికత్వంలో వ్యాప్తికి సంబంధించినది. వ్యాప్తి అవసరం లేనపుడు, ఆ అవసరం తీరినపుడు వ్యక్తీకరణ అవసరం తగ్గుతుండవచ్చు. అలాంటి దశలో కవిత్వం, తత్వశాస్త్రం, కళలు, చరిత్ర సంస్కృతి పుట్టకపోవచ్చు.

ఆధునిక భారతదేశంలో 160 దాకా గిరిజన సాయుధ

ల

తిరుగుబాట్లు జరిగాయి. ఈ ఆచరణ నుంచి వాళ్ళు కొత్త సిద్ధాంతాలు పెద్దగా రూపొందించుకోలేదు. వ్యాప్తి అవసరాన్ని వారు గుర్తించలేదు. వాటి వ్యాప్తి అవసరాన్ని గుర్తించేవారు వాటిని 'వ్యక్తీకరణ' లోకి తెస్తారు. ప్రాచుర్యం కలిగిస్తారు.

ఈ రోజు విప్లవ కవితకి కాలం తీరిందనడం సరైనది కాకపోవచ్చు. అది వ్యాప్తి అవసరం తీరి వ్యక్తీకరణ అవసరం తగ్గి వుండవచ్చు. వ్యక్తీకరణ పూర్తయి ఆచరణ అసంపూర్తిగా మిగిలిపోవడం నుంచి యిలా జరుగవచ్చు. ప్రకటించిన ఆశయాల వ్యక్తీకరణ ప్రాచుర్యం పూర్తయి ఆచరణ పూర్తి కావలసిన ఖాళీ ఏర్పడినపుడు యీ స్థితి కలగవచ్చు. తద్వారా ఆచరణ నుండి మళ్ళీ అదనంగా పుట్టే వ్యక్తీకరణ ఆవశ్యకత లేకపోవటాన విప్లవ కవిత్వం, ఉరవడి తగ్గి అలంకారశాస్త్రంగా కుదించుకుపోవచ్చు. దీన్నే తిరగేసి చెప్తే విప్లవ ఆచరణకూ వ్యక్తీకరణకూ మధ్య ఆచరణ ఆ వ్యాప్తి దోషానికి, వ్యక్తీకరణ అతివ్యాప్తి దోషానికి గురై తద్వారా వ్యక్తీకరణ స్థాయికి ఆచరణ లేదనే నిందకు గురిచేసిందనవచ్చు.

ఇలా విప్లవ ప్రచారం అతివ్యాప్తి దోషానికి గురికావడం నుంచి విప్లవ కవిత్వం, విప్లవ ఆచరణ గిడసబారిపోయిందనే అపోహను కలిగిస్తుండవచ్చు. గోరంత విప్లవాన్ని కొండంతలుగా వ్యక్తీకరించడం నుంచి ఈ ఫలితం వచ్చి వుండవచ్చు.

1985 నుంచి విప్లవాచరణకు వ్యక్తీకరణ యొక్క అవసరం తీరిందనవచ్చు. అందువల్లే 1985 నుంచి విప్లవ కవిత్వం అలంకార శాస్త్రంలో శిల్పపరంగా ఉన్నత శిఖరాలనందుకునేదిగా ఎదగడం అనివార్యమై వుండవచ్చు.

మనుచరిత్ర, వసుచరిత్ర వంటి ప్రబంధ యుగం, ఆనాటి సామాజిక జీవితం క్షణయుగం. వాటిలో సామాజిక వస్తువు గిడసబారి శిల్పం, అలంకారశాస్త్ర వ్యక్తీకరణ ఉన్నత శిఖరాలకెదిగింది. గుప్తుల కాలాన్ని కళలు శిల్పం అభివృద్ధి తదితరాల రీత్యా కొందరు స్వర్ణయుగం అంటారు. గిడసబారిన సామాజిక జీవితం రీత్యా గుప్తుల కాలాన్ని మనం అంధయుగం అంటాము. ఈ అర్థంలో 1985 నుంచి విప్లవం గిడసబారి విప్లవ కవిత్వం క్షీణయుగంలోకి ప్రవేశించి పదేళ్లు కావస్తోంది. పైకి అన్నా అనకపోయినా 1985 నుంచి విప్లవం ఎదుగుదల ఆగిపోయిందని తత్సంబంధీకులు గుర్తిస్తున్నదే.

క్షీణయుగంలోకి ప్రవేశించిన విప్లవోద్యమానికి, విప్లవ కవిత్వానికి స్త్రీవాద, దళిత ఉద్యమాలు 'జీవగంజి' పోశాయి. గిడసబారిన విప్లవోద్యమాలకు స్త్రీసమస్య, దళిత సమస్య ప్రాణశక్తినిచ్చాయి. నిర్దిష్టంగా చెప్పాలంటే "సారా విరాళాల వసూలు ఉద్యమం" విస్తృతమైన కాలం నుంచే విప్లవాచరణకు వ్యక్తీకరణ యొక్క అవసరం

Dalithayugam-1

03-09-09

58

తీరిందనవచ్చు. అనగా సాహిత్యం మీద, ప్రజల మీద ఆధారపడి వ్యాప్తిని కోరుకునే దశ నుంచి పైసల మీద, తుపాకుల మీద, రహస్యం మీద ఆధారపడి బతికే ఉద్యమంగా విప్లవోద్యమం మలుపు తీసుకుంది.

రహస్యం వ్యక్తాన్ని అవ్యక్తం చేస్తుంది. తద్వారా వ్యక్తీకరణని, వ్యాప్తిని నిరోధిస్తుంది. వ్యక్తీకరణ రంగాన్ని అంటిపెట్టుకొని సాగుతుండిన వారికి రహస్యం కారణంగా వ్యక్తీకరణలో మార్మికత, ప్రతీకాత్మకత అనివార్యమైంది. గడసబారిన వస్తువుకు ఇవి వన్నె చిన్నెలను చేకూర్చాయి. లేని విప్లవాభివృద్ధిని వున్నట్టు చూపడానికి వ్యక్తీకరణ రంగం శిల్ప అభివృద్ధి ద్వారా ఎనలేని కృషి చేసింది. అలా శిల్పం మీద ఆధారపడి వస్తువు (విప్లవం) కొన వూపిరితో బతకడానికి వ్యక్తీకరణ రంగం చేసిన కృషి ఎనలేనిది.

ఇలాంటి దశనుంచి తిరిగి ప్రజలపై ఆధారపడి వ్యాప్తి చెందేందుకు కన్నతల్లిలా ఫెమినిజం, అంబేద్కరిజం ఆదుకున్నాయి. దాంతో అవి తమనుతాము కొత్త స్వరూపస్వభావాల్తో వ్యక్తిత్వాన్ని, వ్యక్తీకరణను తీర్చి దిద్దుకునే ప్రయత్నాలు ప్రారంభించాయి. అందువల్లే 1978 నాటి "రమీజాబీ ఉద్యమం"లో పాల్గొన్నా, 1983 నాటి పదిరికుప్పల దుర్ఘటనకు వ్యతిరేకంగా పాల్గొన్నా స్త్రీ సమస్య, దళిత సమస్యల గురించి అది నేర్చుకున్నదేమీ లేకపోయిందనీ కారంచేడు దుర్ఘటన ద్వారా, ఎన్టీఆర్ పెట్టిన అదనపు రిజర్వేషన్ల ద్వారా 1985 నుంచి దళిత ఉద్యమం వేగం పుంజుకోవడం నుంచే విప్లవోద్యమం వెనకబడిపోతున్న తన దృక్పథాన్ని మార్చుకుని అభివృద్ధి చెందాలనే ధ్యాసకు చేరిందనీ అంటున్నాము.

ఎన్టీఆర్ పెంచిన రిజర్వేషన్లుగాని, మండల కమిషన్ గానీ, అంబేద్కరిజాన్ని ముందుకు కొనసాగించిన రామమనోహర్ హిందూ వాదం యొక్క ఆచరణ రూపాలే అని అందరు ఎరిగిందే.

అందువల్ల స్త్రీవాదాన్ని, దళితవాదాన్ని (అందులో భాగంగా లోహియావాదాన్ని) యీ విప్లవాలు గుర్తించాయంటే తాము జీవగంజి తాగి ప్రాణశక్తి పొందడానికే. స్త్రీవాద, దళిత వాదాల వల్ల యివి ఎంత ప్రాణశక్తిని పొందాయో చెప్పడానికి వాటి అభివృద్ధి వేగమే సాక్ష్యం. ఈ పదేళ్ళలో వర్గం అనే పదం స్థానంలో పీడిత వర్గ కుల లింగజాతి ప్రాంత అనే పదబంధం వ్యాప్తిలోకి రావడం అనేది విప్లవాలకు జీవశక్తి నెవరిస్తున్నారో చెప్పకనే చెప్తోంది. దీనివల్ల ఆయా ఉద్యమాలకు కొంత నష్టం కూడా జరిగింది. ఆయా ఉద్యమాలు బలోపేతం అయ్యే బదులుగా ఆయా సంస్థల్లో, ఉద్యమాల్లో ఉన్న వాళ్లు అందులోనే ఉండిపోయారు. పోలరైజేషన్ జరిగినప్పటికీ

నిర్మాణపరంగా ఒక్కటిగాకుండా పోయారు. దానివల్ల తమ కార్యకర్తలను, సభ్యులను కాపాడుకోవడానికే తప్ప అందరు కలిసి దళిత సమస్యపై, కుల సమస్యపై, మహిళా సమస్యపై ఉద్యమించాలని ఐక్యసంఘటనగా ముందుకు రాలేకపోయారు. ఇలా దళిత స్త్రీవాదాలు అంతదాకా వున్న కాంగ్రెస్, టిడిపి, సిపిఐ, సిపిఎమ్, బిజెపి, నక్సలైట్, తదితర పార్టీల్లో వాటి మార్గంలో సాగే ప్రజాసంఘాల్లో, రచయిత సంఘాల్లో వున్న వారిని తనలోకి తీసుకురాలేకపోయింది. తన సిద్ధాంతాలు, నిర్మాణం వారిని చైతన్యపరిచి తాను మార్గదర్శిగా మిగిలిపోయే స్థాయిలో నిర్మాణాలు విస్తరించలేకపోయాయి. ఇలా సిద్ధాంత వ్యాప్తిలో ఒక లాభం జరిగినప్పటికీ నిర్మాణ పరంగా వాటిని వ్యాప్తి చేయడంలో చాలా పెద్ద నష్టం జరిగింది.

వస్తువు పట్ల చర్చ అవసరం తీరడం అంటే వస్తువు "జడం"గా మారిందని అర్థం. సమాజంలో, కవిత్వంలో, తత్వశాస్త్రంలో విప్లవం అనే వస్తువు పట్ల చర్చ అవసరం తీరిందంటే అది "జడం"గా మారి జడత్వంలో భాగంగా కొనసాగుతున్నదని అర్థం. స్త్రీవాదం, దళితవాదం సమాజంలో, విప్లవంలో, తత్వశాస్త్రంలో, కవిత్వంలో చర్చను రేకెత్తించాయంటే వాటిని జడత్వం నుంచి చైతన్యంలోకి తీసుకువచ్చాయని అర్థం.

వ్యాప్తిని కోరుకోవడం ద్వారానే స్త్రీవాదం, దళితవాదం వ్యక్తీకరణ లోకి వస్తున్నది. జడత్వాన్ని వదిలిస్తున్నది. అందువల్ల విప్లవం విప్లవ తాత్వికత, విప్లవకళలు జడత్వంలో, క్షీణయుగంలో కూరుకుపోగా స్త్రీవాద, దళితవాద ఉద్యమాలు ముందుకు సాగడం ద్వారా వెనకబడిపోయిన సమాజాన్ని, సామాజిక విప్లవాన్ని ముందుకు నడిపిస్తున్నదని చెప్పడం సాధ్యపడుతున్నది. అనగా 1985 నుంచి స్త్రీవాద, దళితవాద సామాజిక ఉద్యమాలు అన్ని రంగాలను ప్రభావితం చేస్తూ సమగ్ర సామాజిక విప్లవంగా ముందుకు సాగుతున్నాయని అర్థం. పర్యవసానంగానే వస్తుశిల్పాల మధ్య స్త్రీవాదం, దళితవాదం వ్యాప్తి చెందుతున్నాయి. స్త్రీవాదం, దళిత వాదం సిద్ధాంతాలుగానే కాకుండా సాహిత్యంగానే కాకుండా ఉద్యమ నిర్మాణంలో కూడా స్వయంగా బలమైన శక్తిగా ముందుకు సాగినప్పుడే మిగతావాదాలు, మిగతా సంస్థలు తమలో వాటిని చేర్చుకుంటాయి. లేదా అందులోంచి బయటపడి ఈ సంస్థలను బలోపేతం చేస్తారు.

Dalithayugam-1

03-09-09

59

దళితసాహిత్యం ఒక ఆత్మవిమర్శ

ఇటీవల (1996) నేను సంపాదకత్వం వహించి, సేకరించి, ప్రచురించిన 'ప్రవహించే పాట ఆం.ప్ర. దళిత పాటలు' పుస్తకంలో అగ్రకులాలు రాసిన పాటలు ఉన్నాయి గనుక అది దళితపాటల సంకలనం కాదు అని భావించారు కొందరు. మరికొందరు ఆ పాటల పుస్తకంలో అగ్రకులాల పాటలే హెచ్చుగా ఉన్నాయని భావించారు. వారికి దళిత కవులెవరో, వారితో ఎంత పరిచయమో వారి మాటే స్పష్టం చేస్తోంది. ప్రజానాట్యమండలి మొదలుకొని, జననాట్యమండలి, అరుణోదయాల దాకా, వామపక్ష సాంస్కృతిక ఉద్యమంలోనూ తొంభయి శాతం కవులు, కళాకారులు దళితులే అనే చారిత్ర విషయం కూడా తెలియనంత అజ్ఞానంలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. తమ అజ్ఞానం పట్ల గల ఆత్మవిశ్వాసాన్ని వాస్తవాల పట్ల వినయం ఉంటే తప్ప సవరించుకోవడం సాధ్యం కాదు. ప్రవహించేపాటలో తొంభయి శాతం దళితులు రాసినవే. దళితుల జీవితంలోని విభిన్న కోణాలకు సంబంధించినవే. దళితు జీవితాలకు సంబంధించని అంశాలుగానీ, దళిత వ్యతిరేక దృక్పధం గానీ వాటిల్లో లేదు.

ఉద్యమ సాహిత్యాలకు వాటి దృక్పథమే ఒక పరిమితి, ఆయా ఉద్యమాలు ఫోకస్ చేయదల్చుకున్న అంశాలు మాత్రమే ఉద్యమ సాహిత్యం అనుకుంటారు కొందరు. దున్నే వాడిదే

దళిత వాదాన్ని, సాహిత్యాన్ని ఒక ప్రాపంచిక దృక్పథంగా విస్తరించే బదులుగా కొందరు తమ స్వీయ పరిమితులకు లోబడిన అస్తిత్వవాదంగా కుదించే ప్రయత్నాలు చాలా జరిగాయి. ఫూలే, అంబేద్కరిజాన్ని దాని ప్రాధాన్యతను తిరిగి నిర్ధారిస్తూ, విమర్శిస్తూ రాసిన వ్యాసం.

భూమి అనే అంశం ఏదో ఒక రూపంలో చెప్తేనే విప్లవకథ అనుకున్న కాలం 'విరసం' లో లేకపోలేదు. కాని ఆ తర్వాత అది తమ కలాలనే కట్టేసిన విషయం వారికే తెల్సి వచ్చింది. అది తెల్సుకున్నాకే విప్లవ కథ, కవిత వైవిధ్యభరితంగా జీవితంలోని పలు కోణాలని పట్టుకో గలిగాయి.

నేడు దళిత వాదం పేరిట అగ్రకులాన్ని తిట్టడమే దళిత సాహిత్యం అని కొందరు భ్రమపడుతున్నారు. మరాఠీ దళిత సాహిత్యకారుల్లో ప్రఖ్యాతులైన గంగాధర్ పంధావనే తన ప్రసంగాల ద్వారా తాను సంపాదకత్వం వహించే 'అస్మితాదర్శ్' అనే మరాఠీ సాహిత్య పత్రిక ద్వారా ఈ విషయాన్ని నిరంతరం ఖండిస్తూ వస్తున్నారు. అసమానతల్ని అణిచివేతల్ని, వ్యతిరేకంచడం, ప్రశ్నించడం అనేది దానికదే దళిత సాహిత్యం కాదని స్పష్టం చేశాడు. అది అన్యాయాన్ని ప్రశ్నించే సాహిత్యం అవుతుందేగానీ దళిత సాహిత్యం కాదు అన్నాడు. దళిత సాహిత్యం అంటే దళితుల జీవితంలోని సమస్యలను కోణాలని సాహిత్యం సజీవంగా చిత్రించే దళిత సాహిత్యం అని చెప్పాడు. ఈ మాట ఆలకించిన తర్వాతే మరాఠీలో సృజనాత్మక దళిత సాహిత్యం దళిత జీవితంతో వికసించింది.

అగ్రకులాల్ని విమర్శించడమే పనిగా పెట్టుకుంటే పాట, వచన కవిత ప్రక్రియల్లో తప్ప కథ, నవల నాటకం తదితర ప్రక్రియల్లో దళిత సాహిత్యం అభివృద్ధి చెందడం సాధ్యం కాదు. దళిత సాహిత్యానికి దళిత జీవితం ప్రాథమికం కావాలి. ప్రజల్లో 80 శాతం దళితులున్నపుడు వారిని ప్రేమించడం ప్రథమ కర్తవ్యం. ప్రజల్ని ప్రేమించడంలో కన్నా, శతృవుల్ని ద్వేషించడంలోనే కొందరు ఆనందం పొందుతున్నారు. ఇది పలాయనవాదం. ఏమంటే ప్రజల్ని ప్రేమిస్తే ఆచరణ అవసరం అవుతుంది. ఇతరుల్ని విమర్శించడంలో ప్రజలపట్ల ఆచరణలేకుండానే హాయిగా పేరు కొట్టేసేయవచ్చు.

చిక్కనవుతున్నపాట, పదునెక్కినపాట, అనే పేర్లతో దళిత కవితా సంకలనాలు వేస్తూ "పాట" అనే ప్రక్రియపేరును కొల్లగొడుతూ "పాట" అని పేరు పెట్టి కూడా దళిత పాటల్ని అంటరాని తనానికి గురిచేసిన వారు కొందరు ఇటీవల దళిత పాటల పుస్తకంపై దాడి చేయడం దుర్మార్గం. విరసం వాళ్ళు కూడా "పాట" అనే ప్రక్రియకు ఇంతద్రోహం తలపెట్టలేదు. కవితా సంకలనాల్లో వారు పాటల్ని, కవితల్ని కలిపే అచ్చేశారు. దళితుల్లోంచి వేరుపడి గ్రామీణ దళిత ప్రజలకు దూరంగా తమదైన జీవితం జీవిస్తున్నవారు ఈ ద్రోహం తలపెట్టారో తెలియదు. దళితులు ఎక్కువ మేరకు నిరక్షరాస్యులు కనక పాటే వచన కవితకన్నా ఎక్కువ సన్నిహితం అవుతుంది. అయినప్పటికీ "దళిత కవిత" సంకలనాల్లో దళిత పాటలు చేర్చలేదు. దళిత పాటల్ని చేర్చకుండా సాహిత్యానికి చేసిన ద్రోహం వల్లే విడిగా నేను దళిత పాటల పుస్తకం వెంటనే సాహిత్య చరిత్రకు అనివార్యమైంది. పాటయొక్క ప్రక్రియారూపమైన చరిత్ర

ఎక్కడ ఆగిపోయిందో ఆక్కన్నించి అందుకొని ముందుకు సాగడం చరిత్ర తెల్సిన వారు చేసేపని. చిక్కనవుతున్నపాట, పదునెక్కిన పాటలో దళితకవుల పాటలు చోటుచేసుకొని ఉంటే విడిగా వచ్చే పాటల సంకలనం మరో తీరుగా ఉండేది. విరసం నెలకొల్పిన చక్కని సంప్రదాయాన్ని వారు ఎందుకు కొనసాగించలేదో తెలియదు గానీ, తద్వారా పదేళ్లుగా దళిత ఉద్యమానికి సేవచేస్తున్న దళిత పాటల కవుల కృషిని, గుర్తింపుని వెనక్కి నెట్టి, దాని ఫలితాల్ని అనుభవించడానికి ముందుకు వచ్చినట్టయింది. తిరిగి ఇపుడు పట్టించుకొని దళిత పాటకవులకు తీరని అన్యాయమే చేశారు.

కొందరు "వీర వాదులు" వర్గశత్రువు రక్తంతో చేతులు ఎరుపెక్కిన వాడే విప్లవకారుడన్నారు. మార్క్సిజం – లెనినిజం– మావో ఆలోచనావిధానాన్ని అంగీకరించి రాసే వారే ప్రజా రచయితలు, లేదా విప్లవ రచయితలు అన్నారు. దాన్ని చూసి కొందరు అంబేడ్కరిజంలో భాగంగా రాసే సాహిత్యమే దళిత సాహిత్యం అని మొదలు పెట్టారు. దళితుల అభ్యున్నతి కోరి దళితుల జీవితాల్ని చిత్రించేది దళిత సాహిత్యం. కుల సమస్యను దాని కోణాలను వెలికితీయడం చిత్రించడం అందులో భాగంగా సాగాలి.

దళిత సాహిత్యానికి వర్గ దృక్పథం అవసరం లేదనే కుహనా దళిత వాదులు కొందరు బయల్దేరారు. వర్గ దృక్పథంలో దళిత దృక్పథం అవసరం లేదనే వాళ్ళు దళిత సాహిత్యానికి ఎంత ద్రోహులో, వీరూ అంతద్రోహులే. వర్గ దృక్పథం లేని దళిత సాహిత్యం దళితుల్లోని బూర్జువా, పెటీ బూర్జువా, నయాధనిక వాదులకు దళితుల్ని బానిసలుగా మార్చుతుంది. అలాగే స్త్రీవాద దృక్పథం లేని దళిత వర్గవాదాలు పురుషవాదులకు స్త్రీలను బానిసలుగా మార్చుతుంది. వెనకబడిన ప్రాంతాల దృక్పథం లేని దళిత, వర్గ, స్త్రీవాదాలు అప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల జాతుల, దళితులకు పీడితులకు, స్త్రీలకు, పీడిత ప్రాంతాల ప్రజల్ని బానిసగా మార్చుతుంది. వెనకబడిన ప్రాంతాల నుండి వర్గ దృక్పథంతో వచ్చినంతగా దళిత, స్త్రీ వాదాల సాహిత్యం రావడం లేదు. మరో మాటలో చెప్పాలంటే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఎంతో కొంత అభివృద్ధి చెందిన దళితుల, స్త్రీల ప్రయోజనాల పరిమితికి లోబడి నేటి దళిత, స్త్రీవాద ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ సోకాల్డు అభివృద్ధి చెందిన చైతన్యమే వెనకబడిన ప్రాంతాల్లోంచి దళితపాటలు రాసిన కవులను దళిత కవులుగా తమ సంకలనాల్లో, చర్చల్లో చేర్చుకోలేక పోయింది. అది నిత్యనిర్బంధాల్లో కునారిల్లుతున్న ప్రజలకు మద్దతుగా ఉద్యమాల్ని ఉద్యమ సాహిత్యాన్ని నిర్మించలేకపోయింది. మరోవైపు పీడిత వర్గ వాదం వెనకబడిన ప్రాంతాల్లోని దళితవాదుల్ని, స్త్రీవాదుల్ని పీడితవర్గ

సాహిత్యంలో భాగంగా తమ సంకలనాల్లోకి స్వీకరించలేకపోయింది. ఇలా ఆయా ఉద్యమాలు ఎక్కడికక్కడ గిరిగీసుకుని తన యింట్లో తన పెత్తనం ఉంటే చాలు అనే దశకు కుదించుకుపోయాయి. మరోవైపు మతతత్వం, అగ్రకులతత్వం విభిన్నరూపాల్లో మొత్తం సమాజం యొక్క సాహిత్యంగా క్రమక్రమంగా ప్రాచుర్యం లోకి వస్తోంది. ఇంకోవైపు మైనారిటీల పేరిట ముస్లిం మతత్వాన్ని సమర్థించడానికి ప్రగతిశీలవాదులు, తమ పదజాల వైచిత్రినంతా ప్రయోగిస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో ఇస్లాం మతం విప్లవాత్మకంగా మార్పులకు గురికాకుండా ఒక ప్రాంతానికి పరిమితమైన హిందూమత తత్వం తగ్గే అవకాశం లేదు. మహా అయితే హిందూమత తత్వం ఎస్సీ బీసీ ఎస్టీల ఐక్యతారూపంలో తలదాచుకోవచ్చు. ఇవేవీ పరిశీలించే ఓపిక సైతం లేనివాళ్ళు ప్రపంచ పరిస్థితుల గురించి, పరిణామాల గురించి తగుదునమ్మా అంటూ ఊదరగొడ్తుండడం మన ఉద్యమాలకు పట్టిన దౌర్భాగ్యం.

చారిత్రకంగా 'దళిత' అనే పదం మరెంతో కాలం ఎస్సీ, బీసీ, ఎస్టీలు అనే విస్తృత అర్థాన్ని మోయలేదు. మేం మాదిగ దండోరా పెట్టుకున్నాం. మాది మాదిగసాహిత్యం, మాది మాదిగ సాహిత్యపరిషత్తు అంటూ ఇక 'దళిత' అనే పదంలో మిగిలింది మాలలు, మాలల నాయకత్వం తప్ప మరేముంది అని ప్రశ్నించాడొక మాదిగ దండోరా నిర్మాత. ఆయన అన్నదాన్లో కొంత వాస్తవం లేకపోలేదు. దీనికి తోడు ఎస్సీల కోర్కెమేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రెస్‌గిల్డు ఎస్సీ, హరిజన అనే పదాలకు బదులుగా "దళిత" అనే పదం వాడ్డానికి ఉత్తర్వులు జారీ చేసి అమలు చేస్తున్నారు. మరోవైపు బీసీలు, ఎస్టీలు తమను దళితులుగా పిలవడానికి ఏ మాత్రం యిష్టపడ్డం లేదు. ఇది వాస్తవంలో ఎదురవుతున్న సమస్య. దళిత ఉద్యమం పేరిట ఎస్సీల సమస్యలు మాత్రమే స్వీకరించడం ప్రజల ముందున్న చరిత్ర. అందువల్ల అందర్ని కలుపుకుంటున్నట్టు కనపడే ఒక ఎత్తుగడగానే తప్ప "దళిత" అనే పదంతో ఎస్సీ బీసీ ఎస్టీ లందరు అనే దృక్పథాన్ని గాని అందుకు సంబంధించిన కార్యాచరణ గానీ దళిత మహాసభలు ఏనాడూ ఆచరణలోకి తేలేకపోయాయి. మరోవైపు కాన్షీరాం "దళిత" అంటే ప్రభుత్వాన్ని అడుక్కు తినడానికి అలవాటు పడ్డవారు అని అంటూ దళిత పదాన్ని ఈసడిస్తున్నారు. ఒకరిద్దరు బీసీలు దళిత నాయకత్వంగా ఎదగడాన్ని సైతం దళిత మహాసభలు సహించలేక పోయాయి. వాటి పర్యవసానాలను ఆ ఉద్యమ నాయకులు అనుభవిస్తూనే ఉన్నారు.

ఈ రోజు దళిత ఉద్యమం ఉద్యమ రూపంలోలేదు. ఆది పరిణామశీల ఉద్యమంగా సమాజంలో విస్తరిస్తూ ఉంది. అయితే అది స్వీయకుల చైతన్యాన్ని పెంచింది. స్వీయకుల సామాజిక అభివృద్ధికి పాటుపడుతూనే మొత్తం సమాజ

అభివృద్ధికి కృషి చేయడం అనే మలుపు తీసుకుంది. ఇతరులు గ్రహించినంతగా దళిత ఉద్యమ నాయకులు, దళిత సాహిత్యకారులు దీన్ని గమనించ లేకపోతున్నారు. కాని ఈ దృక్పధం 90 ఏళ్ళుగా ఆయా కులాలు, వాటి నాయకులు ఆచరిస్తూనే ఉన్నారు.

వాస్తవాల విషయానికి వస్తే భారతదేశంలో ఒకటిరెండు తప్ప అన్ని కులాలను తనతో, తన కులంతో సమానమైన కులాలుగా భావించి గౌరవించి, వాటిపై గల తమ పెత్తనాన్ని ప్రతికులం వదులుకోగలిగిన నాడే నిజమైన మానవీయ ఐక్యత ఏర్పడుతుంది. నాపైన ఉన్న కులాల పెత్తనం పోవాలి. నాకింద ఉన్న కులాలపై గల నా పెత్తన స్వభావాన్ని అదే సమయంలో మార్చుకోవాలి అనే దృక్పథాన్ని ప్రజలందరికీ అర్థం చేయించి ఆచరించేట్టు చెయ్యకుండా 'కులం' అనే దాన్లో గల అగ్రకుల స్వభావం అంతమయ్యే సమస్యే ఉత్పన్నం కాదు. ఇది ఎంతో బరువైన బాధ్యత. దీన్నించి పలాయనం చిత్తగించడం కోసం "అగ్రకులాలు" అనే బూచి చూపి ఎదుటివారిపై ద్వేషం రగిల్చి తమ పబ్బం గడుపుకుంటున్నారు. అసలు ముందు జరగవలసిందేమంటే నీకన్నా కింది కులాలవారిని నీ కులం వారు తమతో సమానంగా గౌరవించడం, పెళ్ళిళ్ళు చేసి కోవడం. ఇది జరిగి ఉంటే మాల మాదిగల మధ్య ఈ పోరాటాలు వచ్చి ఉండేవేకావు. దళిత ఉద్యమాల్లో కులాల పేర్లు పెట్టి తిట్టుకునే సమస్య ఉత్పన్నమై ఉండేది కాదు. ఈ విషయంలో వర్గ దృక్పథం అలవరచుకున్న సంస్కారం మేరకైనా దళిత దృక్పథం అలవరచుకోలేక పోతున్నదంటే వివిధ కులాల్లోంచి వచ్చిన వాళ్ళు తమ కులపెత్తనం ఇంకా సాగాలనే వారే దళిత ఉద్యమం పేర నాయకులుగా, రచయితలుగా వాటి స్థానాల్లో ఉన్నారని అర్థం. మరో మాటలో చెప్పాలంటే తామలా ఎదగడానికనువుగా ఆయా ఉద్యమాలను, సాహిత్యాలను తమకు సాధనాలుగా మార్చుకున్నారని అర్థం. ఇలాంటి విషయాలన్నిటిపై విస్తృత జరపాల్సిన చారిత్రక సందర్భం ఆసన్నమైంది.

కారంచేడు, కరీంనగర్

దళిత ఉద్యమాలు

నక్సలైట్ ఉద్యమ చరిత్రలో దళిత ఉద్యమ చరిత్ర కూడా ఉంది. అగ్రకుల నక్సలైట్, చరిత్రకారులు దాన్ని రాయలేరని, పాతిక ముప్పయి ఏళ్ళుగా స్పష్టం చేసుకొంటూనే ఉన్నారు. శ్రామికు కులాల చరిత్రకారులే ఇందుకు పూనుకోవాలి. సులభమైన పనికాదు. అది నక్సలైట్ ఉద్యమ నిర్మాణం కన్నా తక్కువేమీ కాదు. నక్సలైట్ ఉద్యమ చరిత్రను పునర్ లిఖించడమంటే నక్సలైట్ ఉద్యమ పునర్ నిర్మించడమే.

దళిత దృక్పథంతో నక్సలైట్ ఉద్యమాన్ని సమూలంగా మలుపు తిప్పడానికి ఆ చరిత్ర ఎంతో ఉపయోగపడుతుంది. సరిగ్గా ఇది ఇష్టంలేక నక్సలైట్ ఉద్యమంలోని దళిత ఉద్యమ చరిత్ర రెండో పార్శ్వాన్ని తన చరిత్రగా స్వీకరించలేకపోతోంది. మనశక్తి, పీపుల్స్ వార్ రెండూనూ, స్త్రీవాదులు ప్రచురించిన "మనకు తెలియని మన చరిత్ర"లో నక్సలైట్ ఉద్యమం నుంచి బయటకు వెళ్ళిన దళితుల్నించి ఉద్యమ చరిత్రను నిర్మిస్తే అది స్పష్టంగా దళితుల కారణంచే నక్సలైట్ చరిత్రను పునర్‌నిర్మించడం అవుతుంది. "సాహు ఇంటర్వ్యూ"తో మొదలైన ఈ క్రమం మధ్యలోనే ఆగిపోయింది. దాన్ని వేగంగా పూర్తి చేయటం ఎంతో అవసరం.

తెలంగాణా నక్సలైట్ చరిత్ర నుంచి దళితుల చరిత్ర విడిపోవడం 1978 నుంచే ప్రారంభమైంది. తెలంగాణా రెండు పాయలుగా దళితుల చరిత్ర సాగింది. ఒకటి నక్సలైట్ సిద్ధాంతంతో విభేదించి విడిపోయి దళిత నక్సలైట్లు బయటకు

రావడం. రెండు అలాంటి వారితో నిమిత్తం లేకుండా 1977 నుంచి కొనసాగిన అంబేద్కర్ యువజన సంఘాల నిర్మాణం. అంబేద్కర్ యువజన సంఘాల నిర్మాణానికి సిద్ధాంతం పునాదీ, మేధోనాయకత్వం అందించింది. ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్లే తప్ప నక్సలైట్లు కాదు.

దళితులు నిర్మించిన ఈ రెండు పాయల చరిత్ర మన సామాజిక చరిత్రలో రికార్డు కాకపోవడం అంటరానితనంలో భాగేమనని అర్థం చేసుకోవాలి. మొదటి నక్సలైట్ పాయ చరిత్రను పేర్కొంటాను.

నేటి పీపుల్స్‌వార్ పార్టీ ఉద్యమ నిర్మాణానికి "జగిత్యాల జైత్రయాత్ర" అనే మహా ప్రదర్శన నేపథ్యం ఒక ప్రధాన పునాది. ఆ పార్టీ డాక్యుమెంట్లనిండా దీన్నే స్పష్టం చేశారు. జగిత్యాల జైత్రయాత్ర చూశాకే నేటి దండకారణ్యం రూపుదిద్దుకుంది. అలాంటి మహత్తర ఉద్యమంతో ఎదిగి వచ్చిన దళిత నాయకత్వం ఏమైంది? ఎన్‌కౌంటర్లలో చావగా ఎవరూ మిగల్లేదు? అందరూ ఎన్‌కౌంటర్లలో చనిపోతే అదే ఉధృతంగా చావకుండా మిగిలిన దళిత నాయకత్వం నిరంతరం ఎన్నో రూపాల్లో అణచివేసింది. ప్రస్తుతం ఎక్కువ వివాదాల్లోకి పోను కొన్ని ఉదాహరణలు ఇచ్చి వదిలివేస్తాను.

కల్లూరి నారాయణ పల్లెమీద నారాయణ సారు అని కూడా వ్యవహరిస్తారు. అతడు "జగిత్యాల జైత్రయాత్ర" ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. వారిలో ప్రముఖుడు కూడా. ఆయన నాకు సడ్డకుడు (తోడల్లుడు) కూడా కావడం వల్ల ఆనాటి ఉద్యమ చరిత్రంతా లోతుగా దళిత దృక్పథంతో అర్థం చేసికొనే అవకాశం కలిగింది. ఎంతో సిద్ధాంత పోరాటం చేశాడు. సహజంగానే ఓడిపోయాడు.

దండకారణ్య ప్రాంతాన్ని గెరిల్లా జోన్‌గా మార్చాలనే ప్రయత్నాన్ని తొలి దశలోనే అడ్డుకున్నవాడు కల్లూరు నారాయణ. ఉద్యమంలోకి వచ్చిన వాళ్ళంతా తమ బతుకుల్ని మెరుగుపరచు కోవాలనే చైతన్యాన్ని మించి లేదని, అందుకనుకూలంగానే ఉద్యమాన్ని నిర్మిస్తూ ముందుకు సాగాలని అతడు డాక్యుమెంటు ప్రవేశపెట్టాడు. కోస్తా నుంచి దిగబడ్డ అగ్రకుల నాయకత్వం దాన్ని ఎగతాళి చేసింది. సీనియర్ నాయకత్వం చాకచక్యం ముందు ఎదురు నిలిచి గెలవడం అంత సులభమా! ఓడిపోయాడు. అయినా రాజీపడి ఆ పార్టీలోనే పనిచేస్తూనే ఉన్నాడు.

కరీంనగర్ జిల్లా పోరాటానికి జగిత్యాల పోరాటం ఒక ప్రతీక అయింది. పోరాటం ఉన్నచోటునుంచే రాష్ట్ర నాయకత్వం ఉండాలనే మహత్తర నిర్ణయం తీసుకుంది పీపుల్స్‌వార్ పార్టీ. దాంతో కరీంనగర్ జిల్లా పార్టీ కార్యదర్శియే పార్టీ కార్యదర్శి

అయ్యాడు. కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ఎవరు ఉండాలనే చర్చలో జగిత్యాల ఓడిపోయి, పెద్దపల్లి గెలిచింది. అందుకు కొండపల్లి సీతారామయ్యలో ఉన్న అగ్రకులతత్వమే కారణం.

కరీంనగర్ జిల్లా నాయకత్వం ఇవ్వాల్సి వచ్చినప్పుడు పోరాట ప్రాంతం నుండే నాయకత్వం అనే నిర్ణయం ప్రకారం జగిత్యాల ప్రాంత నాయకుడు జిల్లా కార్యదర్శి అయ్యాడు. కానీ పెద్దపల్లి నుంచి బ్రాహ్మణ యువకుడైన ఎం. కోటేశ్వరరావు (ప్రహ్లాద్) ను జిల్లా కార్యదర్శిని చేసింది పై నాయకత్వం. దాంతో ఆయన ఆటోమేటిక్‌గా రాష్ట్రకమిటీ కార్యదర్శి అయ్యాడు. ఇలా ఒకసారి జగిత్యాల దళిత నాయకత్వం నష్టపోయింది.

ఆ తరువాత జిల్లా కార్యదర్శిగా జగిత్యాల ప్రాంత నాయకుడిని నియమించాలని డిమాండ్ ముందుకు వచ్చింది. కోస్తా అగ్రకుల పైస్థాయి నాయకత్వం సరే అన్నది. కల్లూరి నారాయణను కాదని ముప్పాళ్ళ లక్ష్మణ్‌రావును (వెలమ అగ్రకులస్థుడిని) జిల్లా కార్యదర్శి చేసింది. పై నాయకత్వాన్ని ఎదిరిస్తూ, సొంతంగా ఆలోచించే కల్లూరి నారాయణను కార్యదర్శిచేస్తే ఏం జరుగుతుందో వారికి తెల్సు.

కల్లూరి నారాయణని తొలి అవకాశంలో జిల్లా కార్యదర్శిని చేసి ఉంటే బ్రాహ్మణ కోటేశ్వరరావు అగ్రకుల నాయకత్వం స్థానే రాష్ట్ర కమిటీ కార్యదర్శి కూడా 1980లో అయివుండేవారు. రెండో అవకాశంలో ముప్పాళ్ళ లక్ష్మణరావు (గణపతి) స్థానే కల్లూరి నారాయణని జిల్లా కార్యదర్శిని చేసిఉంటే పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ కార్యదర్శి దాకా అదే క్రమంలో ఎదిగి ఉండేవారు. ఈ రెండు దఫాలూ కల్లూరి నారాయణకు అవకాశం నిరాకరించబడింది. ఫలితంగా నక్సలైట్ ఉద్యమంలో దళిత దృక్పథంతోపాటు దళిత నాయకత్వం ఎదగకుండా ఆదిలోనే కుట్ర జరిగింది.

భవిష్యత్తులో పార్టీ ఎవరి చేతుల్లో ఏ విధంగా మారబోతున్నదో అర్థం చేసుకొని కల్లూరి నారాయణ ఉద్యమం నుంచి బయటకు వచ్చారు. అయితే అందుకుగాను రెండేళ్ళు జైల్లో ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం తన బతుకేదో దాను బతుకుతున్నాను. దళిత చర్చ వచ్చినప్పుడల్లా ఆయన విషాదంగా నవ్వుతాడు. అంతకన్నా ఘోరం ఏమంటే చరిత్రను పార్టీ వక్రీకరించడం.

పీపుల్స్‌వార్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు ఇవేవీ చెప్పకుండా, లైంగిక వాంఛలు తీరకపోతే నాకు కాళ్ళకు దురద వేస్తుంది అని చెప్పి వెళ్ళిపోయాడని, కల్లూరి నారాయణపై అవాకులూ, చెవాకులూ విసిరారు. నాకు చెప్పిన ఇదే మాటను అధ్యక్షుడు విమల్‌తో చెప్పాను "పదేళ్ళు ప్రాణాలకు తెగించి ఉద్యమాన్ని నిర్మించిన

నాయకుణ్ణి అలా వక్రీకరిస్తే ఎలా? వాళ్ళకు బుద్ధిఉందా! అసలు విషయాల కోసం ఎందుకు డిమాండ్ చేయలేదని" ఆయన గొడవ చేశాడు.

ఇది కేవలం కల్లూరి నారాయణ సమస్య కాదు. సాహు సమస్య అది. వేలాది లక్షలాది శ్రామిక కులాల నాయకత్వపు సమస్య. ఏమైతేనేం కోస్తా అగ్రకుల దృక్పథం దండకారణ్య గెరిల్లా జోన్ పర్‌ఫెక్టివ్‌గా రూపుదిద్దుకుంది. ఆ కోస్తా అగ్రకుల నాయకత్వం సేద తీరడానికి కోస్తా ప్రాంతాన్ని మాత్రం ప్రచార ప్రాంతంగా అట్టే పెట్టుకుంది.

కోస్తా అగ్రకుల నాయకత్వం బహుతెలివైనది. తెలంగాణా ప్రాంతంలో మేధావులు, నిజమైన నాయకులు ఎదగకుండా ద్విముఖ వ్యూహాన్ని రచించింది. అత్యంత నిర్బంధంలో ఇతర సంఘాలూ పని చేయలేని స్థితి రావడం వల్ల తమతో విబేధించిన తెలంగాణా ప్రాంతం నాయకత్వానికి ఉద్యమం నిర్మించే బహిరంగ అవకాశాలు లేకుండా చేసింది. ప్రజల్ని వదిలేసి కేవలం మిలిటెంట్లపై ఆధారపడి ఉద్యమాన్ని నిర్మించింది. ఈ రెండోదాన్ని పార్టీ పదేళ్లు ఆధారపడి ఉద్యమాన్ని నిర్మించింది. ఈ రెండోదాన్ని పార్టీ పదేళ్ల క్రితమే అంగీకరించినా మొదటిదాన్ని అంగీకరించలేకపోతున్నది.

తెలంగాణా ప్రాంత నాయకత్వం చేతిలోకి వచ్చినా ఎందుకా మాటను అంగీకరించడం లేదంటే, దాన్నంతా తవ్వితే దళిత దృక్పథం చర్చ కూడా వెలికివచ్చి తమ నాయకత్వం స్థానే దళిత నాయకత్వం వస్తుందని భయం. అందువల్ల తెలంగాణా అగ్రకుల నాయకత్వం కూడా దండకారణ్య గెరిల్లా జోన్ పర్‌ఫెక్టివ్ తిరిగి తోడకుండా అలానే ఆచరిస్తోంది. ఫలితంగా కోస్తా నాయకత్వం, కె.ఎస్. పార్టీ లోంచి బయటికి వెళ్ళిపోయినప్పటికీ ఇప్పుడు పీపుల్స్‌వార్ పార్టీ దృక్పథం కోస్తా ప్రాంత అగ్రకులతత్వ దృక్పథంలో భాగంగానేఏ కొనసాగుతోంది. నక్సలైట్ సిద్ధాంత, చర్చ, పార్టీ నిర్మాణ చర్చను ప్రస్తుతానికి ఇక్కడ ఆపేస్తాను.

1978 నుంచి నాకు పీపుల్స్ వార్ పార్టీతో ప్రత్యక్ష సంబంధం ఉంది. ఒకవైపు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఉద్యమాన్ని నిర్మిస్తూనే అంబేద్కర్ యువజన సంఘాల నిర్మాణాన్ని చేపట్టాను. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్‌నూ, అంబేద్కర్ సంఘాలను నిర్మిస్తూ, అవి పని చేసేలా మేం ముందుకు సాగాం. పీపుల్స్‌వార్ పార్టీ పైస్థాయి నాయకత్వానికి ఈ చరిత్ర కొంత తెలుసు. తమ పార్టీ ప్రమేయం ఏమీ లేకుండానే అంబేద్కర్ సంఘా కార్యకలాపాలు కొనసాగడం నక్సలైట్లు నాయకత్వానికి తెలుసు. వాటిని వ్యతిరేకిస్తే వచ్చే పరిణామాలూ తెల్సు. అందువల్ల ముప్పాళ్ళ లక్ష్మణ్‌రావు (గణపతి) గానీ, మరొకరుగానీ అంబేద్కర్ సంఘాల నిర్మాణం నుంచి అడ్డుకునే సాహసం

చేయలేదు.

కీ.శే. కొరివి ఎల్లయ్య అకుంఠిత దీక్షవల్ల కరీంనగర్ జిల్లాలో 1977 నుంచి అంబేద్కర్ యువజన సంఘాల నిర్మాణం గ్రామస్థాయి పునాదులను ఏర్పరచుకుంది. అందులో భాగంగా హుజూరాబాద్ ప్రాంతంలో నేనూ, సముద్రాల భూమయ్య (వార్డెన్ – మొగిలిపాలెం), చెల్పూరు దేవయ్య (ఉపాధ్యక్షుడు), ఎల్లయ్య మొదలైన ఎందరో ఉద్యోగస్తులు కర్తవ్య దీక్షతో కృషిచేశారు. నిజామాబాద్ పట్టణం నుంచి హుజూరాబాద్ కాకతీయ కెనాల్ క్యాంపు ఆఫీసుకు బయలుదేరి ఆయన యూడీసీ గంగారాం మాకు అంబేద్కర్ యువజన సంఘాల చరిత్రనూ, వారసత్వాన్ని అందించారు.

1977 నుంచి అంబేద్కర్ రచనల తెలుగు, ఇంగ్లీషు పుస్తకాల కోసం వేట మొదలుపెట్టాం. జలంధర్‌లోని భీ పత్రికా పబ్లికేషన్స్ నుంచి, 1979లో ఎన్నో పుస్తకాలు తెప్పించి చదివింప చేశామో. నిరంతరం ఆచరణ, అధ్యయనం మాపని. విశ్రాంతంగా కూర్చోవడం చాలా చిరాకుడా ఉండేది. ఏదో చేయాలి, ప్రజలకు పనికి వచ్చే అన్నిరకాల సామాజిక అచరణే అనే దృక్పథంతో కృషి చేశాం. అందువల్ల అంబేద్కర్ సంఘాల నిర్మాణం, అదే సమయంలో రాడికల్ విద్యార్థి యువజన సంఘాల, పౌరహక్కుల సంఘాల నిర్మాణాల్లో తలమునకలవడంతో నాకు వైరుధ్యం ఏమీ కనిపించలేదు.

వేలాది, లక్షలాది దళితులూ అంబేద్కర్ సంఘాల్లోనూ, నక్సలైట్ సంఘాల్లోనూ నాలాగే ఆలోచించారు, ఆచరించారు. నక్సలైటు సంఘాలు క్రమక్రమంగా కులసమస్యలను నిరాకరిస్తూ రావడంతో వైరుధ్యం మొదలైంది. నక్సలైటు సంఘాలు దళిత నాయకత్వాన్ని వెనక్కినెట్టి అగ్రనాయకుల నాయకత్వం పెరుగుతున్న క్రమంలోనే ఈ వైరుధ్యం మరింత పెరిగింది. అది పార్టీలో, సత్యమూర్తి, గద్దర్ కులచర్చ చేయడంతో మరో మలుపు తీసుకుంది.

సత్యమూర్తి దండకారణ్యం పర్‌స్పెక్టివ్ ప్రతిపాదనకూ, దళిత నాయకత్వం అణచివేతకూ మధ్యగల లింకును పట్టుకోలేక పోవడం వల్ల పార్టీలో ఘోరంగా ఓడిపోయారు. అంబేద్కర్ సంఘాల నిర్మాణంతోపాటు నక్సలైట్ సంఘాల నిర్మాణంలో ఏకకాలంలో పాల్గొన్న వాళ్ళు ఎన్నోవేల మంది ఉన్నారు. అందులో ఎన్నో దక్కాముక్కాలు తిని బయటపడి రాష్ట్రస్థాయిలో ఈ రెంటి నిర్మాణంలో లింకుగా మిగిలింది. నేనూ, నాతోపాటు మరికొంతమంది మాత్రమే లింకునుంచి చరిత్రను తెగగొట్టాలని పీపుల్స్‌వార్ పార్టీ అగ్రకుల నాయకత్వం సకల ప్రయత్నాలు చేసింది. ఈ లింకు శాశ్వతంగా తెగొట్టడం కోసమే "ఫ్రాంటియర్" వీక్లీలో పీపుల్స్‌వార్ కులసమస్యను గుర్తిస్తూనే కులసమస్యల కోసం పోరాడిన వారి చరిత్రను దిగజారిన

వాళ్ళుగానో విడిపోయిన వాళ్ళుగానో వక్రీకరించారు.

ప్రజల్ని "వాడుకోవడం" అనే సంస్కృతి విప్లవ పార్టీల్లో నరనరానా జీర్ణించుకు పోయింది. అలా దళిత సంఘాల దళిత నక్సలైట్ నాయకత్వం వాడుకున్నదే గానీ వాళ్ళంతా తనలో ఆ భాగం అనే తన చరిత్రలో భాగంలో భాగం స్వీకరించలేక పోయింది. పీపుల్స్ వార్ స్వీకరించి ఉంటే పై చరిత్రంతా తన చరిత్రగా రాసుకొని సొంతం చేసుకుని ఉండేది.

ప్రజల్ని "వాడుకోవడం" అనే సంస్కృతి అత్యంత దుర్మార్గమైనది. తన దృక్పథం వ్యూహం, ఎత్తుగడలకు అనువుగా ప్రజల్ని 'వాడుకుంటాడు' విప్లవ పార్టీలు, అలా "వాడుకోవాలి" అనే చర్చను పార్టీలో అన్ని శ్రేణులు నిస్సిగ్గుగా బహిరంగంగానే చేస్తుంటాయి. తద్వారా వారికి ప్రజలు ఆ సాధనలే తప్ప లక్ష్యం కాదని స్పష్టం చేసుకుంటాన్నాయి. వారు తమ సిద్ధాంతం ప్రాథమిక పునాది అని ప్రజలు సెకండరీ ప్రధానం కావాలని కోరుతున్నారని అర్థం. నేటికీ ఇదే ఆచరణ కొనసాగుతోంది. ఈ దృక్పథంలో తలమునకలు కావడం వల్లే సత్యమూర్తి 1978 నుంచి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్మాణమైన అంబేద్కర్ సంఘాల చరిత్రకూ, ఇక్కడి నక్సలైట్ చరిత్రకూ గల లింకును, రెండు పాయలుగా సాగిన దళిత చరిత్రను పట్టుకోలేకపోయారు. పీపుల్స్‌వార్‌లో ఘోరంగా ఓడిపోవడం జరిగింది. పదేళ్ళ తర్వాత కారంచేడు ఉద్యమం వచ్చాక ఈ క్రమం సరిదిద్దబడలేదు.

తెలంగాణా ప్రాంత దళిత చరిత్ర ఇదే తన చరిత్ర అంటూ గొంతు విప్పలేని స్థితిని తెచ్చింది. తెలంగాణా నక్సలైట్ ఉద్యమచరిత్ర అగ్రకుల నాయకత్వంలో సాగినప్పటికీ ప్రధానంగా దళితుల పోరాట చరిత్రే దానికి వర్గ దృక్పథంలో భాగంగా దళిత దృక్పథం ఉండేది. అదే సమయంలో దళిత దృక్పథంలో భాగంగా వర్గ దృక్పథంలో కొనసాగే అంబేద్కర్ సంఘాల నిర్మాణమూ సాగింది. ఈ రెండూ ఏకకాలంలోనే ఒకే శ్రేణి ప్రజల్లో కొనసాగాయి. ఈ రెండు దృక్పథాల లింకు తెలంగాణా ప్రజలే.

వ్యక్తీకరణ లేని ఆ అశక్తత వల్లే లిపిబద్ధంగా కానీ వేల ఏళ్ళ దళితుల చరిత్ర మరుగున దాగినట్టే. ఇటీవల ఈ చరిత్ర కూడా యువతరం వస్తున్న కొద్దీ మరుగున పడిపోతోంది. కర్ర, నోరు రెండూ ఉన్నవాడిదే బర్రెఅని తీర్పు చెప్పినట్టుగా కొందరు అగ్రకుల నక్సలైట్లు మరికొందరు దళిత నాయకులూ ఈ చరిత్రను మరుగున పరుస్తున్నారు. ఈ చరిత్రను మరుగునపరుస్తూ, దళిత నాయకత్వంలో కొందరు అగ్రకుల నక్సలైటు నాయకుల్తో రాసుకుని పూసుకుని తిరగడం ద్వారా లబ్దిపొందే

ప్రయత్నం చేస్తున్నారు.

1977 నుంచి నిజానికి అంతకు ముందునుంచే తెలంగాణా జిల్లాల్లో నిర్మాణమైన అంబేద్కర్ సంఘాల ఉద్యమాల చరిత్రను, దళిత ఉద్యమ చరిత్రను పునర్ చరిత్రను పునర్ నిర్మించాల్సి ఉంది. బొజ్జా తారకం కోస్తాలో పుట్టినా, నిజామాబాద్ దళిత ఉద్యమంలో భాగంగానే ఎదిగి వచ్చారు. తెలంగాణా దళిత ఉద్యమానికి బొజ్జా తారకం తొలితరం ముద్దుబిడ్డయితే, మలితరం కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల అంబేద్కర్ సంఘాలు ఉత్తర తెలంగాణాలో గత ఇరవై ఏళ్ళుగా సాగుతున్న దళిత ఉద్యమ చరిత్ర పునాది ఉంది కనుకనే చుండూరు దళితులకు మద్దతుగా కరీంనగర్‌లో పదివేల మందితో పొద్దంతా సభ జరిగింది. బహుశా ఇంత లోతైన సైద్ధాంతిక, తాత్విక, ఉద్యమ పునాది లేకపోవడంవల్ల తెలంగాణాలో నిత్యం దళితులపై సాగే హత్యాకాండ, అణచివేతపై కోస్తా దళిత చైతన్యం సంఘీభావం ఒక్కటైనా మహత్తర సభల్ని జరపలేకపోయింది.

ఇలా ఇక్కడి దళిత చైతన్యం అటు వర్గపోరాటంలో భాగంగా పని చేస్తూ పదునెక్కింది. ఇటు అదే సమయంలో దళిత దృక్పథంలో అంబేద్కరిజంలో భాగంగానూ పని చేస్తూ పదునెక్కింది. సత్యమూర్తి నుండి 1984లో మొదలైె కుల చర్చకు ప్రాంతలో ఈ రెండు పాయల దళితుల మధ్య ఒక వంతెన నిర్మించింది. ఈ చరిత్రతో సత్యమూర్తి ఘోరంగా నష్టపోయినా నావంటి వేలాది విప్లవ కార్యకర్తలకు ఎంతో కనువిప్పు కలిగించింది. తద్వారా దళిత దృక్పథం, వర్గపోరాటాలు, రెండూ ఒక్కటిగా కలిసిపోవాల్సిన చారిత్రక నేపథ్యం ఏర్పడింది.

ఈ నేపథ్యంనుంచే దళిత, ప్రజాస్వామికవాదుల ఐక్యవేదిక ఏర్పడింది. చారిత్రక దృష్టి కొరవడడం వల్ల దాన్ని కోస్తా ప్రాంత నాయకత్వం అప్పగించారు. తెలంగాణా దళితుల నాయకత్వ పోరాటంలో మరోసారి మరో తీరునా నష్టపోయారు. నక్సలైటు ఉద్యమం దళిత నాయకత్వాన్ని ఎదిరించడంలో ఘోరమైన వైఫల్యానికి గురైంది. సిరిసిల్ల నియోజక వర్గం నక్సలైటు అభ్యర్థిగా కరీంనగర్ జిల్లా స్థానికులైన పార్టీ అధికార ప్రతినిధిగా ఒక్కరూ ఎదగలేదని, ఎదిరించ లేకపోయారు. ఎస్.వి. కృష్ణయ్యను ఎమ్మెల్యేగా నిలబెట్టడమే ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. దళిత నాయకత్వం పేరిట అయిదేళ్ళకు మళ్ళీ అదే సిరిసిల్ల తాలూకాకే నెల్లూరు జిల్లా నుంచి అంబేద్కర్ అనే యువ అడ్వకేట్‌ను నిలబెట్టారు. నాయకత్వాన్ని అభివృద్ధి పర్చడంలో నక్సలైటు ఉద్యమం ఘోర వైఫల్యానికి ఇంతకన్నా ఉదాహరణ అక్కరలేదు.

Dalithayugam-1

03-09-09

65

తెలంగాణా మహిళ దళిత ఉద్యమ నేతలు

తెలంగాణా ప్రాంతం నుండి గత 20 ఏళ్ళుగా ఎదగాల్సిన సైద్ధాంతిక, తాత్విక నాయకత్వం, దళిత నాయకత్వం, విభిన్న పార్టీల్లో పోగా, ఎన్‌కౌంటర్‌లో చనిపోగా ఏకొద్దిపాటో అవశేషంగా మిగిలి పోయింది. నేడు అన్ని పార్టీల్లో తెలంగాణా నాయకత్వం గొప్పగా కొనసాగుతోన్నా తాత్విక సైద్ధాంతిక నాయకత్వం అదే స్థాయిలో ఎందుకనో ఎదగడం లేదు. పి.వి. నర్సింహారావు, కాళోజీ, సి. నారాయణరెడ్డి, దాశరథి సోదరులు మొదలుకొని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఉద్యమ నిర్మాత దాకా, అంతా తెలంగాణా వారే. నేటి నక్సలైట్ పార్టీల రాష్ట్ర నాయకత్వం ఈ జిల్లా వారిదే. చివరకు మొన్నటి ఎన్టీఆర్ దిగిపోయింది కూడా కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలపై తీసుకున్న దెబ్బతోనే.

ఇన్ని రంగాల్లో, ఇన్ని పార్టీల్లో ఎదిగి వస్తున్నప్పటికీ ఈ ప్రాంతం నుండి రాష్ట్ర స్థాయి నాయకత్వాన్ని అందించే దళిత నాయకత్వం ఎందుకని ఎదగడం లేదో చరిత్ర మూలాల్లోకి వెళ్ళి ఆరా తీయాల్సి ఉన్నది. ఆ లోపాల్ని సరిచేసుకుని ఇక్కడి దళిత ఉద్యమ నాయకత్వం ముందుకు ఉరకాల్సి ఉంది. అలాంటి రెండు పాయలు కలిసిన చరిత్ర రాయడం అవసరం.

ఈ పని నక్సలైటు పార్టీల్లోనూ, వాటి ప్రజాసంఘాల్లోనూ సాగాలి. దళిత సంఘాల్లోనూ సాగాలి. అప్పుడే దళిత చైతన్యం పురివిప్పి ఇక్కడే మహోన్నత సామాజిక ఉద్యమాల స్థాయికి,

సైద్ధాంతికంగా, నాయకత్వం పరంగా వేగంగా ఎదుగుతోంది.

ఇక్కడి నక్సలైట్ల ఉద్యమం స్త్రీలను లక్షలాదిగా కదిలించింది. నేటి స్త్రీవాదానికి నాయకత్వం మాత్రం పోరాట ప్రాంతంలోని దళిత స్త్రీలు ఎందుకు ఎదగలేకపోయారో కూడా వెలికి తీయాల్సి ఉంది. సృజన, అరుణతార, నలుపు, ఎదురీత, దళిత వాయిస్ పత్రికల పాఠకులు హైదరాబాద్ ఒక ట్రస్టు ప్రచురణల పాఠకులూ మెజార్టీ తెలంగాణా ప్రాంతమే అయినప్పటికీ, యువతరం నుండి స్త్రీవాద నాయకత్వం ఎదురు ఎదగలేకపోతున్నది.

విషాదం ఏమంటే అరవై ఏళ్ళనాటి తెలంగాణా సాయుధ పోరాట చరిత్రలోని చేదు కొత్త రూపాల్లో కొనసాగుతోంది. ఆనాటి అగ్రకుల కమ్మరెడ్ల కోస్తా నాయకత్వం, తెలంగాణా నాయకత్వాన్ని ఎంతగా అణిచివేయాలో అణిచివేసింది. నేడు తెలంగాణా దండకారణ్య ఉద్యమాల నుంచి కాకుండా, కోస్తా ప్రాంతం నుంచి సైద్ధాంతిక తాత్విక, భౌతిక పాలసీ నాయకత్వం పాలసీ నాయకత్వం వస్తోంది. స్త్రీవాదంతోనూ, దళితవాదంతోనూ వర్గవాద నక్సలైట్ల ఉద్యమాల్లోనూ కొట్టొచ్చినట్లు కనబడుతున్న విషాదం ఆచరణ అనుభవాలు ఒకరి జ్ఞానం నాయకత్వం మరొకరిది అయ్యే ఈ క్రమంలో తెలంగాణా కార్యకర్తల వల్ల, నాయకుల వల్ల తెలిసి, తెలియక జరుగుతున్న లోపాలెంతటి ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంది.

స్త్రీవాదానికి వెనకదన్నుగా నక్సలైట్లు ఉద్యమం ఉంది అనడంలో సందేహం ఏమీ లేదు. కానైతే అదే స్త్రీవాద నాయకత్వం ఎందుకు రాలేకపోయింది. నక్సలైట్లు ఉద్యమ వ్యూహం ఎత్తుగడల్లోనే లోపమే. చరిత్ర ఇంత సక్రమంగా విషాదంగా ఎక్కడినుంచో మొదలు కావడానికి కారణం కన్నతల్లి హృదయం మొత్తం ప్రపంచంలోని పిల్లలందర్నీ ప్రేమిస్తుంది. అయితే తన పిల్లల్లో గల తన రక్తమాంసాలు, అనుభూతులు కారణంగా తన పిల్లల్ని మరింత ప్రేమిస్తుంది.

అధ్యయనం చేస్తేనే అంతుతేలేది

ఈ ఆవేదనలో భాగంగానే నక్సలైట్లు దృక్పథం వ్యూహం ఎత్తుగడల్ని లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది. ఆనాడు తెలంగాణా సాయుధ పోరాటం కోస్తా కమ్మ, రెడ్డి, సన్నకారు రైతులను బూర్జువా పారిశ్రామికవేత్తలుగా కమ్యూనిస్టుల పేరుతో ఎదగడానికి ఉపయోగపడింది. ఇదే ప్రాంతం నక్సలైట్లయినా, దళితులైనా అలా పారిశ్రామికవేత్తలుగా ఎదగలేదేమి! నక్సలైట్లు మద్దతున్నదని చెప్పుకొని కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులు ఎదుటివార్ని భయపెట్టి, లాభపడ్డ ఘటనలు మాత్రం కోకొల్లలు. ఇదా మనం కోరుకుంటున్నది.

నక్సలైటు ఉద్యమాల్లో దళితుల త్యాగాలకి గుర్తింపు కోసం దళితుల జీవితం మెరుగుపడ్డం కోసం వారే అన్నిరంగాల్లో నాయకులుగా ఎదగడం కోసం మనం ఏం చేయాల్సి ఉంది. విప్లవం విజయవంతం అయ్యేదాకా నక్సలైట్లు, దళితులూ కేవలం రెక్కల కష్టంమీద ఆధారపడి బతకాలా! నక్సలైటు ప్రజాసంఘాల్లో పనిచేసే వారు. ఈ పాలకవర్గ ప్రభుత్వాన్ని నెలనెలా టంచనుగా పదివేల జీతాలు తీసుకోవచ్చుగానీ, ఉద్యోగాలు దొరక్క,దొరకడానికి విద్యార్హత లేక వ్యాపారాలు, చేసుకునేవారు మాత్రం పారిశ్రామికవేత్తలుగా ఎదగకూడదా? అగ్రకులాల మేధావులు పద్మభూషణ్‌లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులూ పొందుతూనే నక్సలైట్లతో మన్నన పొందవచ్చు. దళితులిలా ఎదగకూడదా!

1983 తరువాత తెలంగాణా పోరాట ప్రాంతాల్లో నిత్యా నిర్బంధం పోరాట ప్రజల దినచర్యలో భాగమైంది. 1978 విప్లవోద్యమం ఎందరినో రచయితలుగా, కళాకారులుగా వెలికి తెచ్చింది. అందులో అల్లం రాజయ్య ఒకరు. 1983 తరువాత బహిరంగ ఉద్యమాల కాలం నాడు వెలికి వచ్చిన వారు తప్ప కొత్త తరాలు తెలంగాణా ప్రాంతం నుండి విప్లవ సాంస్కృతికోద్యమంలో ఎందుకు ఎదిగి రావడం లేదు?

వరవరరావు, గద్దర్‌లు ఉద్యమం నుంచి ఎదిగి వచ్చిన వారు కాదు. వారు ఉద్యమ అవసరాలకు అందివచ్చిన వారే. ఉద్యమాల నుంచి ఎదిగి రావలసిన వారి తరువాత క్రమం ఎందుకు ఎదిగి రాలేకపోతున్నది. అందులో నిర్బంధం, వ్యూహం ఎత్తుగడల పాత్రేమీ లేదా?

నిత్యనిర్బంధమే సృజనాత్మకతకు సంకెళ్ళు

నిత్య నిర్బంధం శరీర మాధ్యంఖలు సాధనాలంటూ కనీసం బతికే హక్కు కోసం ఎన్నింటినో వదులుకునేట్టు చేసింది. భయం ఆవేశాన్ని, తిరుగుబాటునూ రేకెత్తించగలదేమోకానీ, సృజనాత్మకతను, ఎదగవలసిన నిర్మల హృదయాలను నిరంతరం గాయపరిచింది. నిర్బంధం కారణంగా వేలాది ప్రజల్లో సృజనాత్మకత, తాత్వికత ఎదుగుదల ఆగిపోయి నిత్యం నిర్బంధం చుట్టూ ఆలోచించే గానుగెద్దు హృదయాలుగా మారిపోయాయి. సరిదిద్దాల్సిన లోపం ఎక్కడుందో తెలిసిచావదు. తెలియాలంటే బోలెడు సిద్ధాంత పుస్తకాలు, ఉద్యమాల చరిత్రలూ అధ్యయనం చేయాలి. పుస్తకాలు కనబడితేనే చంపడానికి లైసెన్సులుగా మారిపోయిన దశలో ఏమని చదవడం? చదివితే అంత భయంలో, నిర్బంధంలో బ్యాలన్సుగా ఆలోచించి అర్థంచేసుకోవడం సాధ్యపడేదెలా!

1990 తరువాత ఈ స్థితి మారిపోయింది. నక్సలైట్లలోంచి వచ్చిన దళితులూ,

దళిత ఉద్యమంలోంచి దళితులూ, తిరిగి ఒక్కటయ్యే చరిత్ర పరిణామం మొదలైంది.

విషాదం ఏమంటే దళిత చరిత్ర ముక్కలు ముక్కలు చేయబడింది. 1977లో తెలంగాణాలో ప్రారంభమైన ఉద్యమాల చరిత్రను తొక్కిపెట్టి కారంచేడు ఉద్యమం తరవాతైనా కాకుండా, 1990 నుంచి మార్క్సిస్టు దృక్పథాన్నే ప్రపంచ వ్యాప్తంగా ప్రశ్నించడం మొదలద్రూక రచయితలు, స్త్రీవాదులు లేవనెత్తిన సమస్యలపై కదిలి 'అమూర్త' కాలంలో ఆయా సమస్యల్ని వాదాల్ని పట్టించుకొని తామే మొనగాడన్నాయి.

వరవరరావు నగరానికి వలస ఎందుకు పోయినట్టు?

కారంచేడుకూ, కరీంనగర్‌కూ లోతైన అంతర్గత సంబంధం ఉంది. అదేదో పొగాకు పండించే రైతులు కారంచేడు నుండి కరీంనగర్‌కు వలస రావడంగా బాలగోపాల్ అనుకోవడం నీటి అడుగును చూడకుండా, నీటిమట్టంపై తేలియాడే నూనె చమురు చందమే. వరంగల్ నుంచి వరవరరావు వలస పోయారు. ఇది పట్టి ఎదిగిన వారి సంగతి. అపుడే పట్టి ఎదగాల్సిన క్రమంలోకి రావలసిన యువతరం ఎదగకుండానే చరిత్ర ఆగిపోయింది.

అందువల్ల 1978 నుండి యువతరం ఉజ్వల భవిష్యత్తు భ్రూణహత్యకు గురి చేయబడింది. విప్లవం వారిని వదలిపెట్టినా, విప్లవాన్ని వారు వదిలేసినా వారి వీపుల మీద లాఠీ తూటాల ముద్రలు, అనుభూతులు వారి వెంటనే ఉన్నాయి. వారి అనుభవాలిచ్చిన జ్ఞానం ఎంతోకొంత వారి వెంటే ఉన్నది. కూల్చివేసిన ఇండ్లు, కాల్చేసిన శవాలు తిరిగి రాలేదు. యిచ్చిన ఉత్తేజం పదిలంగానే ఉన్నది.

అదే అవేదనగా ఎందరో మేదావులు, కళాకారులు, రచయితలు, లక్షలాది దళితులు తల్లడిల్లిపోతున్నారు. అంబేద్కరిజంలో భాగమైన మార్క్సిజం ఈ దేశంలో విప్లవాలకు దృక్పథం కావాలి. ఆ సమన్వయ దృక్పథం ఎన్ని సమూలమైన మార్పులు తెస్తుందో ఈ రెండు సమన్యాయాన్ని 1978 నుండే మహారాష్ట్రలో ప్రతిపాదిస్తూ, ఆచరిస్తూ వస్తున్న శరద్ పాటిల్‌కైనా ఊహకు అందినట్టు లేదు. ఏది బిఎస్పీ, బిజెపి కల్సి పని చేసినట్టుగా ఉండదు. అది నక్సలైట్లు, కమ్యూనిస్టులు బిఎస్పీ కలిసి పని చేసినట్టుగా ఉంటుంది.

జాతీయోద్యమ చరిత్రను దళిత దృక్పథంతో నేడు తిరిగి రాయవలసి వుంది. జాతీయోద్యమ చరిత్రను, 1800 నుంచి తిరిగి రాయడం అంటే ఆ చరిత్ర అధ్యయన పర్యవసానంగా తెచ్చిన నిన్నటి నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమం అనే హైపోథీసిస్‌ను, ప్రిడిక్షన్‌నూ సమూలంగా తిరిగి రాయడం అని కూడా అర్థం.

దళిత యువతరం ఇందుకు పురిటినెప్పులు పడుతోంది. ఇలాంటిది రూపొందించుకున్న నాడు నేను నాలాంటి వాళ్ళు ఎందరో తిరిగి వృత్తి, ఉద్యోగాలు వదిలేసి మహత్తర సామాజిక విప్లవంతో పూర్తి కాలం తమదైన పాత్రను తప్పకుండా నిర్వహిస్తారు. నూతన సమగ్ర సామాజిక విప్లవానికి తుపాకులతో, నిర్బంధం, రహస్య వ్యూహాలతో అంతగా పని ఉండదని అంబేద్కర్ చరిత్ర, పెరియార్ ఉద్యమ చరిత్ర స్పష్టం చేస్తున్నాయి.

చాలా దళిత సంఘాలు అప్పుడే కులాన్ని ఆచరించే క్రమాంతానికి వచ్చేశాయి. కులాన్ని ఆచరించడం అంటే మను ధర్మాన్ని ఆచరించడమే. నిజమైన మార్క్సిస్టులు దళితులు కులత్వాన్ని గుర్తించినా కులాన్ని ఆచరించడం కోసం కాదు. వారు కులాన్ని ఆచరణ నుండి తొలగించడం కోసం గుర్తిస్తారు. దళితవాదులకూ, దళిత మార్క్సిస్టులకూ మధ్య సంస్కృతి స్వభావంలో రోజు రోజుకు పెరిగిపోతున్నది. ఇది సంస్కృతి నిర్మాణంలో పరిగణింప తీసుకోనున్నది. కోపం వచ్చినప్పుడల్లా దళితుల్ని దళితులే కులం పేరుతో తిట్టుకోవడం ప్రబలుతున్నది. ఈ చెత్తనంతా కడిగి కులరహిత ఆచరణను సంస్కృతిని వేగవంతం చేయడానికి నక్సలైట్లు ప్రజాసంఘాలపై కూడా ఎంతో గురుతరమైన బాధ్యత ఉన్నది. నేటి దళిత సంఘాలకున్న పరపతిరీత్యా ఈ కర్తవ్యం వారి శక్తికి మించిన పని. ఈ ఆవేదనే ఆలోచనగా ఆయుధాలతో పనిలేని నక్సలైటు ఉద్యమాలు ఎదిగిరావాల్సిన రావాలని కోరుకుంటున్న దళితులెందరో శాంతియుత ఉద్యమాల ద్వారా ఎన్నైనా సాధించవచ్చని చరిత్ర నిర్ధారిస్తోంది.

Dalithayugam-1

03-09-09

68

దళిత సాహిత్యం

ఇటీవల ముంబాయిలోని ఆంధ్ర మహాసభవారు సాహితీ సౌరభాలు పేరుతో, సాహిత్య సదస్సు జరిపారు. 29-11-2003న జరిగిన ఈ సదస్సులో నేను, కసిరెడ్డి వెంకరెడ్డి, ఐతా చంద్రయ్య పాల్గొన్నాం. 1930లో ముంబాయిలో పనిచేస్తున్న తెలుగువాళ్లతో ఆంధ్రమహాసభ ఏర్పడింది. తెలుగు సాహిత్యం తీరుతెన్నుల గురించి సమకాలీన పరిణామాల గురించి తెలుసుకోవాలని వారికి ఎంతో ఉత్సాహం. అందులో భాగంగా మిమ్మల్ని ఆహ్వానించారు. విభిన్న భావధారల వారిని ఆహ్వానించడం ద్వారా వారొక సమగ్రతలో సాహిత్యం గురించి తెలుసుకోదలుచుకున్నారు. ఈ మీటింగ్ వార్తను, ఈనాడులో చూసి మూలనివాసి మాల మరికొందరు మిత్రులు మరుసటి రోజు కలవడానికి వచ్చారు. అప్పటికి మేము ముంబాయిలోని పలు ప్రదేశాలు సందర్శించాం. ఈసారి పర్యటనలో ముంబాయి రూపురేఖలు సుమారుగా తెలిశాయి అని అనుకున్నాను. మూలనివాసి మాల **“అంబేద్కర్ నివసించిన రాజగృహ”** చూశారా? **“అంబేద్కర్ సమాధి చైత్యాన్ని”** సందర్శించారా! అని అడిగారు. సరేపద అని బయలుదేరాం. ఆంధ్రమహాసభ భవనం ఎదురుగానే అంబేద్కర్ నివసించిన రాజగృహ ఉంది. అక్కడికి సుమారు 2 కి.మీ. దూరంలో అంబేద్కర్ సమాధి చైత్యం వుంది. అంబేద్కర్ సమాధి చైత్యం వద్ద నిరంతరం జనచైతన్య ప్రవాహం, సముద్రపు ఒడ్డున గల ఈ చైత్యాన్ని మరింత అభివృద్ధి పరుస్తున్నారు. అందుకు ప్రభుత్వం 2 కోట్లు కేటాయించిందని మూలనివాసి మాల చెప్పారు.

కళ్ళ ఎదురుగా వున్న **“అంబేద్కర్ రాజగృహ”**ను మళ్ళీ ఒక దళితుడు వచ్చి చూపించే దాక చూడలేకపోయాం. దళిత సాహిత్యం దళితుల చరిత్ర దళితుల సాహిత్య చరిత్ర కూడా ఇంతే. అది మనకళ్ళ ఎదురుగానే వుంటుంది. అది కనబడుతూనే వుంటుంది కానీ ఇదీ దళితుల చరిత్ర, దళితుల సాహిత్యం అని దాన్ని ప్రాధాన్యతలో చూపించడం జరగనంతకాలం దళిత సాహిత్యం మన కళ్ళ ఎదుట వుండి కూడా అజ్ఞాతంగా వుండిపోతుంది. ఇలా కళ్ళ ఎదుట వుంటూనే కనపడకుండా పోతున్న దళిత సాహిత్యాన్ని ఒక మూలవాసిగా వెలికితీస్తూ అచ్చువేస్తూ ఒక్క చోట చేర్చుతున్న లక్ష్మీనారాయణ ఒక దళిత సాహిత్య దిక్సూచి.

లక్ష్మీనారాయణ ఎవరు రాశారు అనే దానికన్నా ఏం రాశారు. ఎవరి గురించి రాశారనేది లెక్కలోకి తీసుకుంటారు. ఇది సరైన దృక్పథం కూడా. మానవతా దృక్పథంలో దళిత బహుజనుల గురించి ఎవరు రాసినా గౌరవించడం సాహిత్య సంప్రదాయం. దళిత బహుజనుల నుండి ఎదిగిన వారు తమ గురించి రాసుకున్నపుడు దాన్ని మరింత శ్రద్ధతో ప్రత్యేకతతో దళిత బహుజన సాహిత్యంగా గుర్తించడం జరగాలి.

1929లో సైమన్ కమీషన్ – గాంధీ – అంబేద్కర్

ఇది జరగకపోతే గాంధీజీ “హిందులందరికీ నేను నాయకుణ్ణి దళితులకు కూడా నేనే నాయకుణ్ణి” అని సైమన్ కమీషన్ సందర్భంగా వాదించినట్లుగా వుంటుంది. జాతీయోద్యమంలో అంబేద్కర్, మేదరి బాగయ్య, జగజ్జీవన్‌రాం, కుసుమ ధర్మన్న, జాషువా మొదలైన వారు దళిత ప్రతినిధులు. దళిత బహుజన ప్రతినిధులుగా ఇతర కులాలవాళ్ళు వుండటం దళితుల్ని అపహాస్యం చేయడం అవుతుంది. దళితేతరులు దళిత బహుజనులను ఎదిగించాలి. ఎదిగిన వారిని కనుక్కోగలగాలి. కళ్ళుండి గుడ్డివాల్లయ్యే ముద్దుకృష్ణలు, విశాలాంధ్రలు, అరసం, విరసంలు దిగంబర కవులు స్త్రీవాదులు ఎందరో మేం రాసిందంతా దళిత బహుజనుల కోసమే అని దబాయిస్తారు. కానీ దళిత బహుజనులు తమ గురించి తాము రాసుకున్న దాని సాహిత్య చరిత్రగా గుర్తించ నిరాకరిస్తారు. గుర్తిస్తే సాహిత్య చరిత్రలో వారి స్థానాన్ని ప్రాధాన్యత లేకుండా ఒక పాయలాగా చూపిస్తారు. ఇది ఒక దుర్మార్గమైన ప్రక్రియ.

దళిత సాహిత్యం సంస్కృతి

“బహుజన మందలో గత వందేళ్ళుగా ప్రజాపక్షం వహించిన సాహిత్యం పేరిట

డా|| కె.లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో 2004లో ప్రచురించిన ‘దళిత కవిత్వం-2’ సంకలనానికి 3-12-2003తేదీన రాసిన ముందుమాట.

రాసిన సాహిత్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ,ల జీవితం సంస్కృతి పరిణామాలు ఎంతమేరకు చిత్రీకరించబడ్డాయి అవి అడిగితే మాత్రం వీరికి కోపం వస్తుంది. మళ్ళీ తాను రాసిందంతా బడుగు, బలహీన వర్గాల కోసమేనని దబాయిస్తున్నారు. ఇలాంటి వారు బహుజన మందలో మేక తోలుకప్పుకున్న బ్రాహ్మణవాద తోడేళ్ళు.

బహుజన మందలో బ్రాహ్మణవాద తోడేళ్ళు

"కాళిదాసు నుండి బ్రాహ్మణవాద అలంకార శాస్త్రాల నుండి గురజాడ, శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, చలం, విశ్వనాథ సత్యనారాయణ, ఉప్పుల లక్ష్మణరావు, రంగనాయకమ్మ దాకా అందరూ బహుజనోద్ధారకులే అయితే బహుజనుల జీవితం సంస్కృతి భాష విలువలు వారి రచనల్లో ఎందుకు లేవు? వీళ్ళంతా నిర్దోషులైతే సమాజంలోని ఎనభై శాతం ప్రజల సాహిత్యంలో కనపడక పోవడంలో దోషులెవరు? ఎనభై శాతం తెలుగు ప్రజల గురించి రాయని ప్రతిఫలించని సాహిత్యం, సాహిత్యకారులు అశేష తెలుగు సాహిత్య చరిత్రకు జాతికి ప్రతినిధులెట్లా అవుతారు? వాళ్ళకు తెలిసిన జీవితమే చిత్రించినపుడు వారు దాని తాలుకు అగ్రకుల సాహిత్య ప్రతినిధులు కాకుండా బహుజన సాహిత్య ప్రతినిధులెట్లా అవుతారు.

బ్రాహ్మణవాద అలంకార శాస్త్రాలు రాజునో, సద్బ్రాహ్మణ్ణో కావ్యవస్తువుగా స్వీకరించాలన్నాయి. బహుజనవాద అలంకార శాస్త్రాలైన బౌద్ధ అలంకార శాస్త్రాలు సామాన్యున్ని కథావస్తువును చేశాయి. రెండువేల ఏళ్ళపైబడి ఈ రెండు రూపాయలు సాగుతున్నాయి. 7వ శతాబ్దం నుండి మొదలై 16 శతాబ్దం దాకా సాగిన భక్తి ఉద్యమాల కాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలుకూడా కథానాయకులయ్యారు. ప్రజల్లోకిచేరాలనుకున్న వాళ్ళు ఈ మార్పు తీసుకున్నారు. కానీ అచ్చుయంత్రం ఇంగ్లీషు చదువుల అందుబాటులకి వచ్చిన తర్వాత ఈ క్రమం తిరగబడింది. బ్రాహ్మణవాద అగ్రకులాలు తిరిగి కథా వస్తువులయ్యాయి. కావ్య వస్తువులయ్యాయి. మార్పువాదం, స్త్రీవాదం కూడా దీన్ని పూర్తిగా తొలగించలేకపోయింది. పైపెచ్చు సమర్ధించడం ద్వారా బ్రాహ్మణవాద అలంకార శాస్త్రాలను కొనసాగిస్తూ భక్తి ఉద్యమాల ముందుకు తెచ్చిన అంశాలను కొనసాగించ లేకపోయాయి.

"విద్యను ఇవ్వనిరాకరించిన బ్రాహ్మణవాదులు లిపి దొరక పుచ్చుకొని రాసింది మాత్రమే సాహిత్యం, సాహిత్య చరిత్ర అనడం బ్రాహ్మణవాదం తప్ప వేరుకాదు బహుజనులకు లిపి అందుబాటులోకి వచ్చే దాకా సాగిన చరిత్ర లిపిబద్ధ సాహిత్యం అగ్రకుల మనువాదుల సాహిత్య చరిత్ర కాకుండా మరేమవుతుంది. దళిత బహుజనులకు లిపి అందుబాటులోకి వచ్చాక వాళ్లు తమ స్వీయచైతన్యంలో రాసిన

దళిత బహుజన సాహిత్యంతోనే ఆధునిక సాహిత్య చరిత్ర మొదలవుతుంది. మిగిలినది అల్పసంఖ్యాకులైన దోపిడి కులాల బ్రాహ్మణవాదులు మైనారిటీ సాహిత్యమవుతుంది.

మెజారిటీ ప్రజల సాహిత్యం మౌఖిక సాహిత్యమే

మెజారిటీ సాహిత్యం వేల ఏళ్ళుగా ప్రజల నాల్కల మీద జానపద సాహిత్యంగా జానపద ప్రదర్శన రూపాల్లో సామెతలు నుడికారాలు సంస్కృతి ఆచార వ్యవహారాలు రూపాల్లో కొనసాగుతూ వస్తోంది. దీన్ని ఒక్కచోట చేర్చడం బహుజనుల కర్తవ్యం. అదే మెజారిటీ ప్రజల సాహిత్యం చరిత్ర. మిగిలినది దోపిడీ కులాల రాజాశ్రిత వర్గాల మైనారిటీ సాహిత్యం అందువల్ల కాళిదాసు, నన్నయ్య, ధూర్జటి, పోతన కందుకూరి, గురజాడ, విశ్వనాథ సత్యనారాయణ, చలం, శ్రీశ్రీ, కొకు, వట్టికోట, మహీధరల క్రమం లిఖిత సాహిత్యం పేరిట రుద్దబడి బ్రాహ్మణవాద మైనారిటీ సాహిత్య చరిత్రా తప్ప బహుజన మెజారిటీ ప్రజల సాహిత్య చరిత్ర కాదు. (ఉదయం దినపత్రిక సాహిత్య పేజి 18-07-1994 నుండి)

సాహిత్య చరిత్ర పునర్ మూల్యాంకనం

ఈ దృక్పథంతో బీసీ, ఎస్టీల సాహిత్య చరిత్ర పునర్నిర్మాణం చేయబడుతున్నది. ఆధునిక సాహిత్య చరిత్ర నూతన శతాబ్ది అవసరాల కనుగుణంగా ఇలా పునర్నిర్మాణం చేసిన వారే మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తారు. దళిత బహుజన సాహిత్యం మౌఖిక ప్రక్రియల నుండి వెలికి తీయాల్సి వుంది. ఈ పనిని ఈ సంకలనంలో లక్ష్మీనారాయణ చేపట్టలేకపోయారు. కత్తి పద్మారావు గారు కూడా **'భారతీయ సాహిత్యంలో స్త్రీ'** అనే గ్రంథంలో దళిత బహుజన స్త్రీల గురించి మౌఖిక సాహిత్యాన్ని సేకరించి వెలికితీసి విశ్లేషించలేకపోయారు. చాలామంది దళిత సాహిత్యవేత్తలు ఈ పని చేయలేకపోయారు.

వీరు లిఖిత సాహిత్య చరిత్రలో భాగంగా కొనసాగుతున్న బ్రాహ్మణవాద సాహిత్య చరిత్రలో స్థానంకోసం సంఘర్షించారు. దళిత బహుజనుల మౌఖిక మరియు లిఖిత సాహిత్య పునర్నిర్మాణంలో భాగంగా, పునర్మూల్యాంకనంలో భాగంగా వీరు తమ స్థానాన్ని వెతుక్కోలేకపోయారు. కొందరు దళిత సాహిత్య చరిత్రను తాము దళిత కవిగా మారిన తేది నుండి దళిత సాహిత్యం పుట్టిందనే ఒరవడిలో రాస్తూ వచ్చారు. తమ పుస్తకాలు తప్ప ఇతరుల రచనలను అచ్చు వేయలేని వీరు ఇతరులు తనవికాని దళిత రచనలను అచ్చువేసినపుడు కొండంతరాగం తీసి దాన్ని విమర్శించే ప్రయత్నాలు చేశారు అపుడు లక్ష్మీనారాయణలాంటి వారు పడ్డవేదన ఇంతా, అంతాకాదు.

రెండు వేర్వేరు సంస్కృతులు, రెండు ప్రత్యేక జాతి అస్తిత్వాలు

చరిత్రను, సాహిత్య చరిత్రను, తెలంగాణ, బ్రిటిష్ ఆంధ్ర రాష్ట్రాల పరిణామాల ననుసరించి వేర్వేరుగా రాయడం అవసరం. ఈ రెండు రాష్ట్రాల 300 ఏళ్ళ పరిణామాలు వేర్వేరుగా కొనసాగాయి. బ్రిటిష్ ఆంధ్ర దళిత సాహిత్యాన్ని, బ్రిటిష్ ఆంధ్ర చరిత్రలో భాగంగా చేర్చాలి. నిజాం రాజ్య దళిత సాహిత్య చరిత్రను తెలంగాణ రాష్ట్ర సాహిత్య చరిత్రలో భాగంగా చర్చించాలి. అలా చేసినపుడు రెండు రాష్ట్రాల ప్రజలకు, రచయితలకు, సంస్కృతికి ప్రత్యేక జాతీయ అస్థిత్వాలకు సరైన న్యాయం చేకూరుతుంది.

మొత్తం సాహిత్యం లాగే దళిత సాహిత్యం కూడా తెలంగాణాలో బ్రిటీష్ ఆంధ్రలో వేర్వేరు పాయలుగా కొనసాగింది. ఇవి రెండు ప్రత్యేక అస్థిత్వాలు కలిగిన ప్రాంతాలకు, రాష్ట్రాలకు సంబంధించినవి. అందువల్ల దళిత సాహిత్యాన్ని తెలంగాణ రాష్ట్ర పరంగాను, బ్రిటిష్ ఆంధ్ర రాష్ట్ర పరంగాను రెండు ప్రవాహాలను రెండు నిర్దిష్టతలను వేర్వేరుగా పరిశీలించాలి. రెండింటి యొక్క చరిత్రను వేర్వేరుగా అంచనా వేయాలి. అది జరగకపోతే ప్రధాన సాహిత్య స్రవంతిలో ఇప్పటిదాకా కొనసాగిన బ్రిటిష్ ఆంధ్ర ఆధిపత్యవాదమే దళిత సాహిత్యంలోనూ కొనసాగుతుంది.

ప్రస్తుతం దళిత సాహిత్యం పేరట బ్రిటిష్ ఆంధ్ర దళిత వాదుల దృక్పథం ఎజండా తెలంగాణ దళితుల మీద రుద్దబడుతున్నది. తెలంగాణాలోని దళిత ఉద్యమాల పట్ల బ్రిటిష్ ఆంధ్రదళిత ఉద్యమాలు దళిత సాహిత్యకారులు గత 20 సంవత్సరాలలో స్పందించలేకపోయారు. సంఘీభావం ప్రకటించలేకపోయారు. బ్రిటిష్ ఆంధ్ర ప్రాంతంలోని సమస్యల్ని మొత్తం రాష్ట్రంలో దళితుల సమస్యలుగా ప్రచారం చేశారు. అందువల్ల రెండు వేర్వేరు రాష్ట్రాల చరిత్రగానే కొనసాగుతున్నదని స్పష్టమవుతున్నది.

స్వాతంత్ర్యానంతరం నైజాం, బ్రిటిష్, ఆంధ్రరాష్ట్రాల ఉద్యమాలు

1950 నుండి నైజాం రాష్ట్రంలోనే బ్రిటిష్ ఆంధ్ర రాష్ట్రంలోనే దళిత దృక్పథంతో సాహిత్య సామాజిక రాజకీయ కార్యక్రమాలు పరిణామాలు కొనసాగాయి. అది స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి, కమ్యూనిస్టు, నక్సలైట్ చరిత్ర కన్నా తక్కువ కాదు. నాటి యువకులు ఇప్పుడు 80 ఏళ్ళ వయసులో పడ్డారు. నల్గొండ అంబేద్కర్, ఎమ్.ఎన్.బూసి, బోయ జంగయ్య, వరంగల్ అంబేద్కర్ సంఘాల నాయకుడు కట్టయ్య, కరీంనగర్ జిల్లా అంబేద్కర్ సంఘాల సీనియర్ నాయకులు కొమరయ్య, దళిత మేధావులుయండ్లూరి చిన్నయ్య, పురుషోత్తం, బి.హెచ్. తిరుపతి,

Dalithayugam-1
03-09-09
70

జ్ఞానేశ్వర్, బొజ్జా తారకం దళిత ప్రజల్లోకి వెళ్ళి లిపిబద్ధం కాని దళిత ప్రజల 50 ఏళ్ళ సామాజిక చరిత్రను, సాహిత్య చరిత్రను సేకరించి ప్రచురించడం వారి చారిత్రక బాధ్యత, కుమ్మరి కులంలో పుట్టిన లక్ష్మీనారాయణ పలు సంకలనాలు వెలువరించారు. దళితులు, అధికారం, డబ్బు, ఉన్న వాళ్ళు కూడా ఇప్పటిదాకా ఈ పనిని చేపట్టలేకపోయారు. కనీసం ఇకనుండైనా లక్ష్మీనారాయణ గారిని స్ఫూర్తిగా తీసుకొని తన రచనలు కాకుండా ఇతరుల రచనలు అచ్చువేయడంలో చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరుతున్నారు.

కొందరు దళిత సాహిత్య చరిత్ర అంబేద్కరైట్ దృక్పథంతో కారంచేడుతో ప్రారంభమైందనే అనే వాళ్ళు ఉన్నారు. వాళ్ళు అప్పటి నుండే రాయడం మొదలు పెట్టారు. ఇది ఇప్పటి దాకా కొనసాగుతున్న దళిత సాహిత్య చరిత్ర నిర్మాణ పద్ధతి. రాష్ట్రంలో అంబేద్కర్ కన్నా ముందే మేదరి భాగయ్య (భాగ్యరెడ్డి వర్మ) వంటి వారు దళిత దృక్పథంతో సామాజిక ఉద్యమాలను నిర్మించారు. పత్రికలు నడిపారు. సాహిత్యాన్ని సృష్టించారు. మేదరి బాగయ్య, బి.ఎస్. వెంకట్రావు కలిసి అంబేద్కర్ ఔరంగాబాద్‌లో కాలేజి పెట్టడానికి నిజాంరాజు చేత పది లక్షల రూపాయలు గ్రాంటు ఇప్పించారని కూడా వీరికి తెలియదు. సురవరం ప్రతాపరెడ్డి గారికి భాగ్యరెడ్డివర్మ గారికి పత్రికల్లో కుల సమస్య మీద భీకర పోరాటం జరిగిందని చాలామందికి తెలియదు. అంబేద్కర్ కన్నా ముందు భాగ్యరెడ్డివర్మ మహాత్మాజ్యోతిబా ఫూలే ఒరవడిలో పాఠశాల స్థాపించారు. ఆది హిందూ ఉద్యమాన్ని నిర్మించారు. అఖిల భారత షెడ్యూల్డ్ కులాల మహాసభలకు అధ్యక్షత వహించడంతో పాటు, పలుమార్లు ప్రిసిడియంలో సభ్యులుగా వున్నారు. ఉన్నవ లక్ష్మి నారాయణ రాసిన 'మాలపల్లి' నవలలోని ప్రధాన పాత్ర మేదరి బాగయ్య అని చాలా మందికి తెలియదు. అందువల్ల దళిత సాహిత్య చరిత్ర 1985లో ప్రారంభం కావాలా 1910ల నుండి ప్రారంభం కావాలా అని తెలుసుకోవాల్సి వుంది.

నైజాం రాష్ట్రంలో దళితుల సంఘసంస్కరణలు

కుసుమ ధర్మన్న కవి ఈ విషయంలో చాలా స్పష్టంగానే వున్నారు. 1921లో రాసిన కుసుమ ధర్మన్న శతకంలో 42 మంది సంఘ సంస్కర్తలను ప్రశంసిస్తూ పద్యాల్లో పేర్కొన్నారు. ఆ 42 మందిలో 40 మంది నైజాం రాజ్యానికి చెందినవారే కావడం గమనార్హం. ఈ శతకాన్ని ఇటీవల హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వాళ్ళు పునర్ముద్రించి అందుబాటులోకి తెచ్చారు. దళిత బహుజన సాహిత్య కారులందరూ దాన్ని కొని చదివి మనచరిత్రను మనం తెలుసుకోవాల్సి వుంది. 1920లో ఉన్నవ

లక్ష్మీ నారాయణ 'మాలపల్లి' నవల రాశారు. అది దళిత బహుజన సాహిత్యంలో భాగమని నేను భావిస్తున్నాను. మైనారిటీ అగ్రకులాల వాదనలు అలా వుంచి యస్సీలు ఎవరైనా, అది దళిత సాహిత్యంలో భాగం కాదని భావించే హక్కు వుంది. చరిత్రను కూడా అలా రాసుకోవచ్చు కానీ ఒక మరెవరూ దళితుల గురించి ఇతరులు రాయరు. రాయ నవసరం లేదని భావిస్తారు.

తద్వారా ఎవరికులం గురించి వాళ్ళు మాత్రమే కుల సంగాలకు పరిమితమైన దృష్టితో పరిమిత ప్రయోజనంతో సాహిత్యం కుదించుకుపోతుంది. అందువల్ల సాహితీ చరిత్రను రాశారు అనేది పరిగణనలోనికి తీసుకొని దళిత సాహిత్యంలో ఆధునిక సాహిత్య చరిత్రలో చేర్చవలసి వుంటుంది. అపుడే సాహిత్య కారులు మానవతావాదులుగా సాహిత్య చరిత్రల మానవీయ సాంస్కృతిక చరిత్రగా నూతన తరాలకు ఆదర్శమవుతుంది. డా॥కె.లక్ష్మీ నారాయణ ఈ దృష్టితోనే ఈ సంకలనంలో యస్సీల గురించి ఇతరులు రాసిన పద్యాలను పాటలను, వచన కవితలను ఇందులో చేర్చారు.

సంకలన కర్తగా లక్ష్మీ నారాయణ విశేష కృషి:

డా॥ కె.లక్ష్మీ నారాయణ గత పదేళ్ళుగా దళిత సాహిత్యాన్ని సేకరించి సంకలనాలుగా తీసుకురావడంలో నిరంతరం తలమునకలవుతున్నారు. 8 దళిత కథా సంకలనాలను ప్రచురించారు. వేల కొలది దళిత కవితలు సేకరించి పెట్టారు. ఆర్థిక సహాయం లభ్యమయిన క్రమంలో వాటిని ప్రచురిస్తున్నారు. అంతేగాకుండా డా॥ కె.లక్ష్మీనారాయణ స్త్రీల గురించి కథలను 1100 పై చిలుకు కథల సేకరించిపెట్టారు. ఆ సంకలనాలు వెలువడలేదు. త్వరలో వెలువడతాయని ఆశిద్దాం. లక్ష్మీనారాయణ గారి సేకరణ లక్షణాన్ని, లక్ష్యాన్ని గమనించి కొందరు ఉప్పేసి పొత్తు కూడినట్లుగా తమ పేరిట ఆ సంకలనాలను తెస్తే బాగుండునని భావిస్తున్నవారు లేకపోలేదు. ఎవరి కృషి వారిదిగా గుర్తింపునిచ్చి గౌరవిస్తే సాహిత్యంలో సత్సంప్రదాయం కొనసాగుతాయి.

గత శతాబ్దిలో దళిత సాహిత్యం :

"హేలావతి" అనే దళిత రాజకుమారి జీవితాన్ని చిత్రించిన నవలలో 1909 నుండి దళిత సాహిత్యంతో లిఖిత సాహిత్యం వేగం పుంజుకుందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో హరిజన కథానిక మీద డా॥ కె. లక్ష్మీనారాయణ, పి.హెచ్.డి. చేసి ప్రచురించారు. తెలుగు నవలల్లో, అస్పృశ్యతా సమస్య అనే అంశంపై డా॥

ననుమాస స్వామి పి.హెచ్.డి. చేసి ప్రచురించారు. డా॥ గద్దలభాను తెలుగు దళిత నవలపై పి.హెచ్.డి. చేశారు. డా॥ కల్లూరి ఆనందరావు హరిజనాభ్యుదయం ఆధునిక ఆంధ్రకవిత్వం అనే అంశంపై పి.హెచ్.డి. చేసి ప్రచురించారు. డా॥ వి.పోతన్న హరిజనాభ్యుదయం తెలుగు నాటకం పై పి.హెచ్.డి. చేసి ప్రచురించారు. జాషువాపై నెల్లూరు జిల్లా పరిషత్ తరఫున 400 పేజీల సావనీర్ ప్రచురించారు. జాషువపై 5 పి.హెచ్.డి.లు వచ్చాయి. భాగ్యరెడ్డి వర్మ గురించి తెలుగులో కాకుండా ఆంగ్ల సిద్ధాంత గ్రంథాల్లో సంక్షిప్తంగా పేర్కొన్నారు.

ఎవరు దళిత కవులు? దళిత వాదాన్ని కుదించే తీరు తెన్నులు:

కుసుమధర్మన్న, జాశువా దళిత కవులు కాదు. హరిజన కవులు అంటూ ద్వానా శాస్త్రిగారు. మరి కొందరు చర్చ చేశారు. దీనికి బొజ్జా తారకం గారు స్పందిస్తూ రాసిన వ్యాసం కూడా అసమగ్రంగా ఉంది. అంబేద్కర్ ఆలోచనా విధానం రూపుదిద్దు కున్న తర్వాత వచ్చిందే దళిత సాహిత్యం అనుకోవడం అమాయకత్వం లేదా చారిత్రక దృక్పథం లేకపోవటం అవుతుంది. దళితులు వేల ఏళ్ళుగా తమదైన స్పష్టమైన దళిత దృక్పథంతో సాహిత్యం కళలను నిర్మించుకుంటూనే వున్నారు. అందుకు సజీవ సాక్ష్యాలుగా చిందుభాగవతం. జాంబవంతుల కథ, డెక్కలి జాంబపురాణం మొదలైనవి నిలుస్తాయి. ఇవి తెలుగుభాష పుట్టినప్పటి నుండే ఉండే అవకాశం ఉంది తెలుగుకన్నా, పూర్వపు భాష అయిన తెలుగువారి పైశాచి తదితర భాషల్లో కూడా తెలుగు వారి దళిత సాహిత్యం మౌఖిక ప్రక్రియల్లో సాగుతూనే వచ్చింది. అణచివేత వున్నచోట ప్రతిఘటన వుంటుందని ఒక సిద్ధాంతం వుంది. చర్య వున్నచోట ప్రతిచర్య వుంటుందని నమ్మేవాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళు అంటరానితనానికి గురి చేసిన వారి చర్యలపై సామాజిక సంస్కృతిపై దళితులు తప్పని సరిగా బాణాలను ఎక్కుపెట్టి వుంటారు. వాటిని తమలో తాము ప్రచారం చేసుకొనే వుంటారు. అందులో భాగంగానే సింధుభాగవతం జాంబపురాణం మొదలైన వాటిని చూడాలి.

చరిత్ర పొడవునా దళిత సాహిత్యం :

అందువల్ల దళిత సాహిత్య చరిత్ర అంటరానితనం, కులవ్యవస్థ మొదలైనప్పటి నుండే మొదలైందని చెప్పవచ్చు. ఒక అరుంధతి, ఒక వీరబాహువు, ఇందుకు సాక్ష్యం. ఆది శంకరాచార్యుని ప్రశ్నించిన చండాలుడు మొదలుకొని మాజంగాలు, మాలదాసర్లు మొదలైన శైవ వైష్ణవ దళిత భక్త కవులు ఎందరో ఎన్నో కవితలు, పాటలు వెలయించారు. లిఖిబద్ధం కాకపోవడం వల్ల వాటిలో చాలా మేరకు నశించిపోయాయి.

బలసవని వైవ సిద్ధాంతం పాల్కురికి సోమన శైవ సాహిత్యం, బ్రహ్మనాయిని చాపకూడు సిద్ధాంతం ఇస్లాం ప్రభావంతో ఇస్లాంలో చేరుతున్న శూద్రులను, దళితులను అరికట్టి వర్ణ కుల సమాజాన్ని సంస్కరించాలని భావించింది.

గురు రవిదాస్ చెప్పులు కుట్టే దళితుడు. 12వ శతాబ్దంలో వీరి ప్రఖ్యాతిని విని ఢిల్లీ చక్రవర్తి సికిందర్‌లోడి కాశీకి వచ్చి జ్ఞానదీక్ష పొందారు. ఆ సందర్భంగా కట్టిన జ్ఞానవాసి మసీదు ఇప్పటికీ వుంది. దేశంలో భక్త మీరాబాయి గురించి తెలియనివారు వుండకపోవచ్చు. కానీ ఆమెకు జ్ఞానదీక్ష ఇచ్చిన గురువు భక్త రవిదాసు అని ఎందరికి తెలుసు. ఎందుకు ఆ చరిత్రను వదిలి వేశారు. మనకు కబీరు తెలిసి కబీరు ప్రాణస్నేహితుడైన గురు రవిదాసు ఎందుకు తెలియకుండా పోయారు. సాహిత్యచరిత్ర రచనలో పాఠ్యపుస్తకాల రూపకల్పనలో అగ్రకులతత్వం వుండటం వల్లనే గురురవిదాసు మనదాకా తెలియలేదు. సురవరం ప్రతాపరెడ్డి గురించి తెలిసిన మేరకైనా భాగ్యరెడ్డి వర్మ, బి.ఎస్. వెంకట్రావు, అరిగె రామస్వామిగార్లు మనకు తెలియకుండా పోయారు. అందువల్ల చరిత్ర రచనల్లో సాహిత్యరచనలో వర్ణ వాద కులాధిక్య అగ్రకులాల నీచదృక్పథం కొనసాగుతున్నది. దాని వల్ల మెజారిటీ ప్రజలు చదువుతున్న పాఠ్యపుస్తకాల్లో మైనారిటీ అగ్రకులాల నీచదృక్పథంతో రాసిన పాఠ్యాంశాలు చేరుతున్నాయి. తద్వారా మనచరిత్ర మనకు తెలియకుండా చేయబడుతున్నది. దీనికి పరిష్కారం మెజారిటీ ప్రజలైన బి.సి., ఎస్.సి., ఎస్.టి.లే చరిత్రను పాఠ్యపుస్తకాలను రాయాలి. అందుకు యువతరం చరిత్రను వినయంతో అధ్యయనం చేసి మనముందుంచే నూతన వైతాళికులుగా ఎదగాలి.

1850 నుండి ఆధునిక సాహిత్య చరిత్రలో :

ఆధునిక సాహిత్య చరిత్ర పునర్మూల్యాంకన విషయానికొస్తే 1850 నుండి దళిత సాహిత్యం, మౌఖిక ప్రక్రియల్లో కొనసాగుతు వస్తోంది. విసుర్రాయి పాటలు, మోటపాటలు, కోతపాటలు, హోళీ పాటలు, దసరా పాటలు, సంక్రాంతి పాటలు, రోకలిదంపుడు పాటలు, బర్రెలు కాసే పాటలు, నాట్లు వేసే పాటలు మొదలైన పాటల్లో దళిత జీవితం సంస్కృతి విస్తారంగా ఉంది. సామెతలు నుడికారాల్లో కూడా దళిత జీవితం సంస్కృతి విశ్వవ్యాప్తమైంది. అయితే తనకు ఇవ్వబడిన హోదాల్లో ఇమిడి దాన్ని అంగీకరించిన వాళ్ళు దాన్ని ప్రశ్నించలేరు. ప్రశ్నించడం వచ్చినపుడు అది ఉద్యమం అవుతుంది. ప్రశ్నించడానికి ముందు ప్రశ్నించిన తర్వాత సమాజంలో మార్పుకనబడుతుంది. దళితులు వర్ణకుల వ్యవస్థను కులాధిక్యతను ప్రశ్నించిన సాహిత్యం మాత్రమే దళిత సాహిత్యం అనే భ్రమల్లో కొందరున్నారు.

Dalithayugam-1
03-09-09
72

ఏది దళిత సాహిత్యం :

1996లో దసరారోజుల్లో నాగపూర్‌లోని "అంబేద్కర్ బౌద్ధదీక్ష భూమి"లో అఖిల భారత దళిత రచయితల సమ్మేళనం జరిగింది. అక్కడే పక్కనే దళిత స్త్రీ అఖిల భారత సమ్మేళనం కూడా జరిగింది. వీటిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగాధర్ పంథావనే అనే మరాఠీ సాహిత్యవేత్త సుదీర్ఘోపన్యాసంలో చాలా విషయాలు ప్రస్తావించారు. గంగాధర్ పంథావనే మరాఠీ దళిత సాహిత్యానికి భీష్మ పితామహుడు అంటారు. సృజన అరుణతార, ప్రజాసాహితి గబ్బిలం వంటి పత్రికలను మించిన స్థాయిలో గత 30 ఏళ్ళుగా "అస్మితాదర్శ్" అనే మరాఠీ దళిత సాహిత్య మాసపత్రికను వెలువరిస్తున్నారు. కొన్ని వందలమంది రచయితలను తీర్చిదిద్దారు. ఆయన తన ప్రసంగంలో కులవ్యవస్థను అంటరానితనాన్ని విమర్శించే సాహిత్యం దళిత సాహిత్యంలో భాగం కాదని అది సామాజిక అన్యాయాన్ని వ్యతిరేకించే సాహిత్యమని నాస్తిక హేతువాద మానవతావాద సాహిత్యంలో అది భాగమవుతుందని పేర్కొన్నారు. దళిత సాహిత్యం అంటే దళితుల జీవితం సంస్కృతి పరిణామాల చిత్రణ అని స్పష్టం చేశారు. తెలుగులో గత 15 ఏళ్ళుగా వెలువడిన దళిత వచన కవితా సాహిత్యం చాలా మేరకు అన్యాయాన్ని వ్యతిరేకించిన సాహిత్యమే. దళితుల జీవితం సంస్కృతి జీవన పరిమాణాలు చిత్రించిన కవిత్వం విస్తృతమయ్యే సమయంలోనే ఆగిపోవడం ప్రారంభించింది.

చరిత్ర తెలిసి కూడా కొందరు దళిత సాహిత్యానికి పునాదులు వేసిన వారిని కాలగర్భంలో కలిపేయాలనుకున్నారు. మేదరి భాగయ్య, ఆదయ్య, బి.ఎస్. వెంకట్రావు, కుసుమ ధర్మన్న, జాషువా, ఎండ్లూరి చిన్నయ్య, బోయి భీమన్న, ఆదయ్య, బి. హెచ్. తిరపతి, గనుమల జ్ఞానేశ్వర్, నమ్మికంటి జగన్నాథం, నూతక్కి అబ్రహాం, సలంద్ర, సుంకం వొద్దయ్య, బి.ఎన్.బి. మొదలైనవారు. దళిత సాహిత్యానికి వేసిన పునాది చిరస్మరణీయమైంది.

నేను ఎండ్లూరి చిన్నయ్య రాసిన అంబేద్కర్ జీవిత చరిత్ర, బోయి భీమన్న అనువదించిన కులనిర్మూలన గ్రంథాలు చదివి, బి.సి., ఎస్.సి., ఎస్.టి. దృక్పథం పట్ల 1976లో ఆకర్షితుణ్ణి అయ్యాను. జలంధర్‌లోని భీంపత్రిక పబ్లికేషన్స్ నుండి అంబేద్కర్ రచనలు తెప్పించేవాణ్ణి. 1977లో నుండి అంబేద్కర్ సంఘాలను దళిత సాహిత్య సంస్థలనూ నిర్మిస్తూ వస్తున్నాం. అదే సమయంలో విప్లవ కార్యాచరణ చేపట్టాం ఈ రెంటి మధ్య పొత్తు కుదరని దశను అగ్రకుల నీచత్వం తెచ్చిపెట్టింది. దాంతో 1986 నుండి నేను పీపుల్స్ వార్ పార్టీలో, విరసంలో వుంటూనే సైద్ధాంతిక

పోరాటం చేయడం అనివార్యమైంది.

మహత్తర కారంచేడు, చుండూరు ఉద్యమాలు :

1985 జులై 17వ తేదీన కారంచేడు దళితులపై అగ్రకులాల హత్యాకాండ సాగింది. దాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ స్థాయిలో దళిత ఉద్యమం వేగం పుంజుకుంది. చుండూరులో 1990 ఆగస్టు 6వ తేదీన దళితుల్ని ఊచకోత కోసారు. దీంతో దళిత చైతన్యం మళ్ళీ విజృంభించింది. సామాజిక ఉద్యమాలతో పాటు దళిత సాహిత్య ఉద్యమం కూడా వేగం పుంజుకుంది. వేలాది దళిత కార్యకర్తలు, నాయకులు ఎదిగారు.

అయితే కొందరు దళిత ఉద్యమాల చరిత్రను కారంచేడు నుండి చెపుతూ అంతకుముందటి దశాబ్దాల చరిత్రను వదిలేస్తున్నారు. గత 60 ఏళ్ళుగా లేదా 50 ఏళ్ళుగా స్వాతంత్ర్యం నుండి అంబేద్కర్ ప్రమేయంతో అంబేద్కర్ లేకుండాను దళిత సాహిత్యం కొనసాగుతూ వస్తున్నది. అది ఒక సామాజిక అవసరం. ముందు ఎదిగిన దళిత చైతన్యవాదులు మేధావులు, కళాకారులు పరిపాలనాధికారులు రాజకీయ నాయకులు దళితులకు సామాజిక ఉద్యమం గురించిన ఒక స్పష్టమైన ఎజెండాను కార్యక్రమాన్ని ఇవ్వలేకపోయారు. దానివల్ల దళితవాద అధ్యయనంతో కూడిన జ్ఞానం ఆచరణ లేకుండా పోయింది. దీనికి మొదట ఎదిగిన వారే కారకులు.

మనిషి తలచుకుంటే...

ఒక మహాత్మాపూలే భారతదేశ సామాజిక రాజకీయ సాంస్కృతిక దృక్పథాన్ని మలుపు తిప్పారు. అలాగే ఒక అంబేద్కర్ వొక పెరియార్ రామస్వామి ఒక నారాయణగురు, ఒక సాహుమహరాజ్, ఒక భాగ్యరెడ్డివర్మ, ఒక కుసుమధర్మన్న, ఒక జాషువా, ఒక కాన్షీరాం చరిత్రను దృక్పథాలను మలుపు తిప్పారు. ఇవాళ భారతీయ సమాజం వాటి ఫలాలను అనుభవిస్తున్నది. ఈ ఫలాలు అనుభవిస్తున్న తరాలు వారి కన్నా లోతుగా విస్తారంగా చరిత్రను జీవితాన్ని సంస్కృతిని అధ్యయనం చేసి సమాజంలో దాన్ని అంగీకరింపజేసే కృషి చేయాలి. ఇది తగ్గి తమ వృత్తి ఉద్యోగ రచనా రంగానికి పరిమితమవుతున్న వాళ్ళు ఎక్కువ. అంబేద్కర్ వాళ్ళను చూసి ఇందుకా నేను రిజర్వేషన్ల కోసం పోరాడింది అని వాపోయాడు.

కులం 30 ఏళ్ళలో అదృశ్యం అవుతుందా!

కుల సమస్యని కులవివక్షతనూ మానవ ప్రయత్నం సరిగ్గా సాగితే, కేవలం 30 ఏళ్ళల్లో పరిష్కరించుకోవడం సాధ్యమే. కులవివక్షతనూ, అస్పృశ్యతనూ,

పాటించడం మానేసి, నా కులం గొప్ప, నీకులం చిన్నది అనే భావాలు వదిలేసి ఏ కులమూ గొప్పది కాదు. ఏ కులమూ చిన్నది కాదు. అన్ని కులాలూ సమానమే. మనుష్యులందరూ సమానమే అని అందరూ ఆచరించినపుడు 30 ఏళ్ళలో కులవివక్ష అస్పృశ్యత అదృశ్యమవుతుంది. నిరంతరం అనుక్షణం ఆచరించడం వల్లనే కులమూ, కులవివక్షా అస్పృశ్యత మానవసంబంధాలు మధ్య సామాజిక విలువల మధ్య రాజకీయ ఆర్థిక ఉత్పత్తి అధికారం సంబంధాల మధ్య కొనసాగుతున్నది.

నువ్వు ఆచరించకపోతే కులంలేదు. మనం ఆచరించకపోతే కులం ఆచరణలో ఉండే అవకాశమే లేదు. కులం ఉన్నది అంటే దాన్ని మనం ఆచరిస్తున్నామని అర్థం. ఆచరించడం వల్లనే అది ఉనికిలో కొనసాగుతున్నది. ఆచరించని ప్రతిదీ ఉనికిని కోల్పోయి చరిత్రగా గతంగా మిగిలిపోతుంది. అందువల్ల కులం కులసమస్య ఉన్నదీ అంటే దానిని అందరూ ఆచరిస్తూ ఉనికిలో కొనసాగింప చేస్తున్నారని అర్థం. కనుక కుల సమస్యను ఎవరో సృష్టించడం లేదు. మన ఆచరణ ద్వారా కుల సమస్యను మనమే సృష్టిస్తున్నాం. దాని పరిష్కారాన్ని నిరాకరిస్తున్నాం. వాయిదా వేస్తున్నాం. అనగా మన ఆచరణనీ మన అలవాట్లనీ మన సంస్కృతినీ మార్చుకోవడానికి సిద్ధంగాలేం అని అర్థం. కులవ్యవస్థలో అత్యధిక విలువ పొందుతున్న బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ అగ్రవర్ణాలు శూద్ర అగ్రకులాలు కులాన్ని కులవివక్షనూ ఆచరించడం వల్లనే అది సమస్యగా ఉత్పన్నమవుతున్నది.

1984లో బి.ఎస్.పి. ఆవిర్భావం, 1985లో కారంచేడు, 1990లో చుండూరు, పోలాస ఉద్యమాల పునాదిగా ఒక కొత్త దళిత యువతరం బి.సి. యువతరం ఎదికివచ్చింది. వీరికి వర్గ స్పృహతో పాటు ఉత్పత్తి కులాల పీడిత కుల స్పృహ జండర్ స్పృహ పెరిగింది. అలా 1990 నుంచి రాష్ట్రంలో దళిత సాహిత్యం టేకాఫ్ తీసుకొని వేగం పుంజుకుంది.

ఈ సామాజిక నేపథ్యంలో ఒక చారిత్రక అవసరంగా దళిత రచయితల, కళాకారుల మేధావుల ఐక్యవేదిక 1992లో ఆవిర్భవించింది. దాంతో అంతదాకా 1000 ఏళ్ళు సాగిన అగ్రకుల దృక్పథం తాలూకు సాహిత్య చరిత్ర సిద్ధాంతఆల అలంకార శాస్త్రాలను ప్రశ్నించి తిరగరాసి బి.సి., ఎస్.సి. ఎస్.టి.ల అనగా మెజారిటీ ప్రజల జీవితాన్ని చరిత్రనూ సంస్కృతినీ చరిత్రలో, సాహిత్యంలో, కళల్లో వస్తువుగా మార్చడం జరిగింది. అలా 1990 నుండి బి.సి., ఎస్.సి., ఎస్.టి.ల ఆధునిక సాహిత్యం వేగం పుంజుకుంది. వందల వేల కవితలు, కథలు, వ్యాసాలూ ప్రసంగాలు పాటలూ సమాజాన్ని ముంచెత్తాయి. మెజారిటీ ప్రజల్లో కూడా పేరుకుపోయిన

బ్రాహ్మణీయ సంస్కృతినీ, దృక్పథాలని ఇన్ఫీరియారిటీలనూ కదిలించి స్వస్వరూప జ్ఞానాన్ని అందించాయి. అలా కొంతకాలం నీచంగా చూడబడ్డ వృత్తులూ పరికరాలూ సేవలూ అన్నీ వస్తువుగా సాహిత్య గౌరవం పొందాయి. 1990 తర్వాత తెలుగు సాహిత్య స్వరూప స్వభావాలు ఇలా దృక్పథంలో వస్తువులో మౌలికమైన మార్పులకు లోనయ్యాయి. ఒక ప్రతీకగా ప్రతినిధిగా దరకవే ఐక్యవేదిక ఇచ్చిన స్ఫూర్తితో గురజాడ మొదలుకొని ఆధునిక సాహిత్యవేత్తలందరూ పునఃపరిశీలనకు గురయ్యారు. కన్యాశుల్కాన్ని ఇపుడు ఎలా చూడాలి అనే వ్యాసం ఉత్పత్తి కులదృక్పథంతో సాహిత్య వస్తువును సాహితి విమర్శనూ సమూలంగా మార్చివేసింది.

దళిత క్రైస్తవ సాహిత్య ఉద్యమం

బ్రిటిష్ ఆంధ్రరాష్ట్రం నుండి వెలువడ్డ దళిత సాహిత్య ప్రధానంగా దళిత క్రైస్తవ సాహిత్యం. దళితులు క్రైస్తవం తీసుకోవడం జరిగింది. వారి అభివ్యక్తి, సంస్కృతిలో క్రైస్తవ ప్రతీకలు అభివ్యక్తి దృక్పథం కనపడతాయి. అందువల్ల ముస్లింవాద సాహిత్యంలాగే దళిత సాహిత్యం నుండి దళిత సాహిత్యాన్ని, దళిత క్రైస్తవ సాహిత్యాన్ని విడివిడిగా వర్గీకరించడం అవసరం. తద్వారా హిందూ మత ప్రభావంలో ఉన్న దళితులకు, క్రైస్తవ మతం తీసుకున్న దళితులకు గల ప్రత్యేకతలను, నిర్దిష్టతలను వెలికితీయడం సాధ్యం పడుతుంది.

బ్రిటీష్ ఆంధ్రలో క్రైస్తవంలో చేరడం వల్ల వారికి కొన్ని ప్రత్యేక విద్యా, ఉద్యోగ, సాంస్కృతిక అవకాశాలు పెరిగాయి. ఇవాళ బ్రిటిష్ ఆంధ్రాప్రాంతం నుండి దళిత సాహిత్యం గురించి మాట్లాడే వాళ్లలో చాలామంది దళిత క్రైస్తవులే.

తెలంగాణాలో దళితులు క్రైస్తవం తీసుకొన్నది తక్కువ. అందువల్ల తెలంగాణా దళిత ఉద్యమంలో దళిత సంస్కృతి వేదన హిందూ అగ్రకుల నైచ్యం దాని దేశీయతలో స్పష్టంగా కనబడుతుంది. ఈ రీత్యా తెలంగాణా ఎస్సీల చైతన్యంలో దళిత చైతన్యం ఎక్కువని చెప్పుకోవచ్చు.

దరకమే ఐక్యవేదిక కార్యవర్గ సమావేశాలను పండగ సెలవురోజుల్లో ఏర్పాటు చేసేవాళ్ళం. దసరా, దీపావళి, ఉగాదివంటి పండగ సెలవల్లో ఏర్పాటు చేసినపుడు బాగానే ఉంది. క్రిస్మస్ రోజుల్లో కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసినపుడు చాలా తీవ్రమైన అభ్యంతరాలు వచ్చాయి. నాకు ఆశ్చర్యం వేసింది. తేదీని మార్చుకున్నాం. అందువల్ల దళిత క్రైస్తవ సాహిత్యం పేరుతో ముస్లింవాద సాహిత్యంలాగే, బిసివాద సాహిత్యంలాగే ఒక ప్రత్యేక వర్గీకరణ, విశ్లేషణ అవసరం.

Dalithayugam-1
03-09-09
74

1993 నుండి మాదిగ సాహిత్యం

మాదిగ దండోరా ఉద్యమం రిజర్వేషన్ల పంపకాల గురించి ఒక సున్నితమైన చర్చను మనముందుంచింది. ఔను ఎవరి జనాభా నిష్పత్తి ప్రకారం వారికి కులాల వారిగా, ఉపకులాల వారిగా కేటాయించవలసిందే అని మానవతా దృక్పథంతో మిగతా సమాజం అంగీకరించింది. కానీ కొన్ని దళిత కులాలు దీన్ని వ్యతిరేకించాయి. తద్వారా వైషమ్యాలు పెరిగాయి. దాంతో మాదిగ సాహిత్యం ప్రత్యేక దృక్పథంతో అస్తిత్వంతో ముందుకువచ్చింది.

దళిత సాహిత్యం అంటే మాలల సాహిత్యమేనా!

మాదిగ ఉద్యమం, సాహిత్యం వచ్చాక వందలాది కొత్త రచయితలు, సిద్ధాంతవేత్తలు, నాయకులు ఎదిగారు. గోగు శ్యామల సంకలనం చేసిన దళిత స్త్రీల రచనల 'నల్లపొద్దు'లో వీటిని చూడవచ్చు. వందేళ్ళ దళిత స్త్రీ రచనల్ని గోగు శ్యామల ఇందులో పొందుపరిచారు.

మాదిగ సాహిత్యం తన ప్రత్యేక అస్తిత్వంతో ముందుకు వచ్చాక దళిత సాహిత్యమంటే మాలసాహిత్యం అనేదిగా, కుదించుకు పోయినట్లు కనపడుతుంది.

అయినప్పటికీ దళిత సాహిత్యం అనే పదాన్ని మొత్తం దళితుల సాహిత్యంగా ఒక ప్రతీకాత్మకంగా తీసుకోవడం జరుగుతున్నది. మాదిగలకు మద్దతిచ్చిన మిగతా సమాజంపై రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకించిన కులాలు ప్రతీకార వ్యతిరేక దృష్టితో పలు చర్చలు చేస్తున్నారు. చంద్రభాను ప్రసాద్, అతనికి ఆంధ్రప్రదేశ్ నుండి రిసోర్స్‌నందించే మల్లేపల్లి లక్ష్మయ్య, ఘంటా చక్రపాణి వంటివారు మిగతా సమాజం పట్ల తీవ్రమైన వ్యతిరేకతను ప్రచారం చేస్తు, అగ్రకుల నీచ రాజకీయ ఆధిపత్యంతో కలిసి వుండటం ఎక్కువ సౌకర్యమని ప్రచారం చేస్తున్నారు.

దశాబ్దాల వారీగా దళిత సాహిత్య చరిత్ర రాయాలి :

వందేళ్ల దళిత సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం ఎలా చేయాలి అనే ప్రశ్న మనముందు నిలుస్తుంది. కప్పగంతులు వేయకుండా తమ కిష్టమైన చోటు నుండి చరిత్రను ప్రారంభించకుండా కాలపట్టికననుసరించి దశాబ్దాల వారీగా పరిశీలించడం సరైన శాస్త్రీయ పద్ధతి. 1901-1910, 1911-20, 1920-30, 1930-40, 1950-60, 1960-70-80, 1980-90, 1990-2000 అనే దశాబ్దాల వారీగా సాహిత్య చరిత్రతో పాటు దళిత సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడం అవసరం. ఈ ముందుమాటలో అవన్నీ సాధ్యం కావు. స్థూలంగా చూద్దాం.

1901–1920 దాకా దళిత సాహిత్యం

1901 నుండి 1920 దాకా గల దళిత సాహిత్య చరిత్ర మౌఖికమౌంది. లిపిబద్ధమైన సాహిత్య చరిత్ర ఇంకా వెలికి తీయాల్సి ఉంది. కథలు, నవలలు 1909 నుండి వేగం పుంజకున్నాయని తెలుస్తున్నది. మేదరి బాగయ్య, కుసుమ ధర్మన్న, జాషువా, అరిగె రామస్వామి మొదలైన వాళ్ళు చలం, శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, బసవరాజు అప్పారావు మొదలైన వారికన్నా ముందురాసిన వాళ్ళు కావడమే కాకుండా జాతీయోద్యమాన్ని పట్టించుకున్న వాళ్ళు.

బ్రాహ్మణవాదులు అగ్రకుల సాహిత్యకారులు ఊహాప్రేయసి తాలుకు భావకవితా మద్యం మదుపులో మనకలేస్తున్న సమయంలో బి.సి.లు, ఎస్సీలు, సామాజిక చైతన్యంతో పాటలు, పద్యాలు వచన కవితలు రాశారు. కుసుమ ధర్మన్న చాలా స్పష్టంగా మాకొద్దీ నల్లదొరతనం అని 1921లో నిలదీశాడు. భాగ్యరెడ్డి వర్మ హిందువులు మీరైతే. అది హిందువులం మేమని నిలదీశాడు. భాషమీద అగ్రకులాల ఆధిపత్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. మీరేనా మేం కూడా పెట్టుకుంటాం అని మేదరి బాగయ్య రెడ్డి వర్మ పేర్లను కలుపుకొని భాగ్యరెడ్డి వర్మ అని పేర్లను మార్చుకున్నారు. నిజాం రాజు దగ్గర పనిచేసే రెడ్డి, మంత్రులు రెడ్డి భూస్వాములు సురవరం ప్రతాపరెడ్డితో సహా చాలా మంది మాలమాదిగలు రెడ్డి అనే పేరు తగిలిగించుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వ్యాసాలు రాశారు. 1921లో రెడ్డి జనసంఘం ఏర్పడింది. అప్పటి నుండి తమ పేర్లకు చివరన రెడ్డి అని చేర్చుకోవాలని ఒక ఉద్యమం నడిపారు. ఈ రెడ్డి అనే పదం ఇటీవల తెచ్చిపెట్టుకున్నదే. గౌడ్లు కూడా ఇలా తమ పేరు చివరన గౌడు అని చేర్చుకున్నారు. హైద్రాబాద్ రాష్ట్రంలో చాలా మంది దళితులు ఆకాలంలో రెడ్డిపేరుతో పిలువబడ్డారు. ఒక దళితుడు రాజిరెడ్డి పేరుతో కలెక్టర్‌గా రిటైర్డ్ అయ్యారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే పి.జనార్ధన్ రెడ్డి తన పేరులో రెడ్డి అని పెట్టుకున్న దళితుడు అని చాలామందికి తెలుసు. కోస్తాలో దళితులు రావు అనే పేరుతో తమ పేర్ల చివరన చేర్చుకున్నారు.

ముస్లింలలో కలిసింది మొదట బ్రాహ్మణులే

మొదట ముస్లింలలో బ్రాహ్మణులే కలిశారు. మతం మార్చుకున్నారు. దళితులు ముస్లిం రాజ్యాలు ఏర్పడ్డ తర్వాత సైన్యంలో విరివిగా చేరారు. ముఖ్యంగా మాదిగలు ఎక్కువగా చేరారు. తద్వారా 'దండు' అనే పదం శతాబ్దాల పాటు మాదిగలకు పర్యాయపదంగా కొనసాగింది. సైన్యంలో చేరిన వారికి కలిగే సౌకర్యాలు అందుకున్నారు. ఇంత వ్యవసాయ భూమి సామాజిక గౌరవం పొందారు. క్రమంగా ఇస్లాంను కూడా స్వీకరించారు. ఇవాళ భారతదేశంలో ముస్లింలు ఏ అరబ్బీస్థాన్‌లోనే పుట్టి వచ్చినవారు కారు. వారిలో మెజారిటీ బి.సి., ఎస్.సి., ఎస్.టి.లే.

Dalithayugam-1
03-09-09
75

ఆధునిక చరిత్ర నిర్మాతలు దళితులే

గత రెండు వందల ఏళ్ళుగా భారతదేశం పారిశ్రామికీకరణలో ఆధునిక పారిశ్రామిక పెట్టుబడిదారీ సమాజంలో బి.సి., ఎస్.సి., ఎస్.టిలు మూలస్తంభాలు. రైలు మార్గాలు, రోడ్డు మార్గాలు, ప్రాజెక్టుల నిర్మాణం అడవులు నరికి పరిశ్రమలు ఏర్పాటు చేయడం, ఇళ్ళ నిర్మాణం, బావుల త్రవ్వకం, నది ఆనకట్టలు మొదలైన పారిశ్రామిక ప్రాథమిక వనరులను బి.సి., ఎస్.సి., ఎస్.టి.లే అందించారు. కానీ అందులోని లాభాన్ని అభివృద్ధిని అందుకోవడానికి హిందూ అగ్రకులాల వాళ్లు అడ్డుకున్నారు. హస్తగతం చేసుకున్నారు. దళితులు, పారిశుధ్యం పనిలో ఎక్కువగా ఉండడానికి కారణం ఆధునిక విద్యలో వారి కృషికి తగిన వాటా అందించక పోవడమే. కొద్దిగా అందుకున్న వాళ్లు ముందుకు సాగారు. జాలారంగకవి, కుసుమ ధర్మన్న, జాషువా అలాంటి వారిలో కొందరు.

1921–1940 దళిత సాహిత్యం–జాషువా పద్యాలే ఎందుకు రాశారు

జాషువా పద్యం ఎందుకు రాశాడు అని ఇవాళ కొందరు ప్రశ్నిస్తుంటారు. వచన కవిత్వం ఎప్పుడు గౌరవించబడిందో చరిత్ర వారికి తెలిసినట్లు లేదు. 1960 దాకా గ్రాంధిక భాషావాదమే విభిన్నస్థాయిలో కొనసాగుతూ వచ్చింది. సంప్రదాయక దేశికవిత్వంలో నిరూపించుకోవడం కోసం దళితులు పద్యాన్ని ఆశ్రయించారు. బ్రాహ్మణవాదుల్లో కొందరు ముందు పద్యాన్ని వదిలేసి గేయ ఛందస్సుకు రాగానే మొత్తం సమాజం మారినట్లు కాదు. నేను ముందు రాశాను, నువ్వు రాయలేదు కాబట్టి నిన్ను ఆధునిక కవిగా గుర్తించను అనడం అహంకారం.

పద్యకావ్యాలు ఇప్పటికీ వెలువడుతూనే ఉన్నాయి. పద్యం సరళతను సాధించుకుంటున్నది. ఇవాళ వచన కవిత్వం అర్థం కావడం కన్నా నేటి పద్యం అర్థం కావడం చాలా సులభమైపోయింది. అర్థం కాని కవిత్వం వ్యర్థం. అర్థం కావడం కోసం ఛందోబంధాలను తెంపుకొన్న కవిత్వం అసలు అర్థంకాని దుర్దశలోకి మారిపోయి తన వ్యాప్తిని కోల్పోయింది. అయినప్పటికీ ఈ వచన కవిత్వంలో అగ్రకులాల వాళ్ళు దళితుల గురించి ఎన్ని కవితలు రాశారో వారికి దళితులు కవితా వస్తువు మేరకు అయ్యారో డా॥ కె. లక్ష్మీనారాయణ తెస్తున్న ఈ సంకలనాలు స్పష్టం చేస్తాయి.

1950–1970 దళిత సాహిత్య నేపథ్యం :

1950 నుండి స్వాతంత్ర్య ఫలాలతో పాటు నిశ్శబ్దంగా సాగుతున్న భావజాలం, అంబేద్కర్ విగ్రహాల స్థాపన, 1962లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కావడం, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు కావడం, బిసి అయిన కామరాజు నాడార్ తమిళనాడు నుండి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు కావడం, బిసి అయిన అన్నాదురై కరుణానిధి డిఎంకె నాయకులు కావడం మొదలైనవి జాతీయోద్యమ కాలం నుండి సాగుతున్న సామాజిక ఉద్యమాల ప్రతిఫలనాలనే. జాతీయోద్యమం కన్నా ఏ మాత్రం తక్కువ కాకుండా ఆయా కులసంఘాలు, కులవృత్తి సంఘాల వందలాది సామాజిక సంస్థలను, ఉద్యమాలను నిర్మించాయి. అవి కాంగ్రెస్ చరిత్రకు ఏమాత్రం తక్కువ కావు. అని గుర్తించుకుంటే మనం రాసే చరిత్ర, మార్క్సిస్టు, ఆరెస్సెస్ వాదులు, బ్రాహ్మణవాదులు రాసిందానికి భిన్నంగా అదనంగా తిరిగి కొత్తగా చరిత్ర మూలాల్లోకి వెళ్ళి అధ్యయనం చేయవలసి ఉందని తెలుస్తుంది. ఆయా కుల సంఘాల చరిత్రని సామాజిక ఉద్యమాల చరిత్రగా రాసే దృక్పథం అలవరచుకోవాలి. అందువల్ల దళిత ఉద్యమం, దళిత సాహిత్య ఉద్యమం కారంచేడుతోను, చుండూరుతోనూ పుట్టి పెరిగిందని చెప్పుకుంటూ మన గతాన్ని వదిలేయడం మన చరిత్రకు మనమే అపచారం చేయడం. కంచికచర్ల కోటేశును 1969లో అగ్రకులాలు చంపినపుడు పెద్ద ఉద్యమం వచ్చింది.

సమగ్ర సామాజిక చరిత్ర దృక్పథం :

చరిత్ర అంటే ఉద్యమాల చరిత్ర కాదు. ఉద్యమమే చరిత్ర కాదు. సమగ్ర సామాజిక చరిత్రలో ఉద్యమాలు ఒక భాగం. చరిత్ర నిరంతరం కాలాన్ని బట్టి సహజ పరిణామంలో ముందుకు సాగుతూ ఉంటుంది. దాన్ని శాంతియుత పరివర్తన అంటాం. బౌద్ధం శాంతియుత పరివర్తనను ప్రాథమికం చేసింది. ఉద్యమాల ద్వారా, ఉద్యమాల చరిత్ర ద్వారా నిర్మాణమయ్యేదే చరిత్ర అనేవాళ్ళు, వర్గపోరాటాల చరిత్రే చరిత్ర అన్న మార్క్స్ అసమగ్ర, అశాస్త్రీయ వాదానికి దృక్పథానికి కుదించుకుపోతారు. వర్గపోరాట చరిత్ర మొత్తం సమాజ చరిత్రకాదు. మొత్తం సమాజ చరిత్రలో వర్గపోరాటాలు ఒక భాగం. మానవ సంబంధాలు సైన్స్, టెక్నాలజీ ఉత్పత్తి సంబంధాలు, సాధనాలు వాటి పరిణామాలు, సంస్కృతి అన్ని కలిసి ఒక సమగ్రతలో చరిత్ర అవుతుంది. వర్గాల మధ్య ఐక్యత, వర్గాల మధ్య పోరాటం, ప్రకృతితో సహజీవనం, ప్రకృతితో పోరాటం అనే వాటి ద్వారా సమాజం నిరంతరం పరిణామశీలంగా ముందుకు సాగుతుంది.

తల్లి కూడా ఒక తల్లి కూతురే :

అందువల్ల ఉద్యమాలు ఆయా చారిత్రక నేపథ్యాల నుండి పునాదుల నుండి పుడతాయి. అనగా చారిత్రక పునాది తల్లే అయితే ఉద్యమాలు దాని పిల్లలు. అందువల్ల ఉద్యమాలు అనేవి ఉద్యమాల కన్నా ముందటి చరిత్ర యొక్క ఫలితాలే. ఉద్యమాల ఆధారంగా చరిత్రను నిర్మించే వారు తత్‌పూర్వ కారణాలను సామాజిక కారణాలను అప్రధానం చేస్తారు, వదిలివేస్తారు, అలా కార్యాన్ని కారణంగా మార్చి వ్యాఖ్యానిస్తారు. మార్క్సిస్టులు, కమ్యూనిస్టులు, నక్సలైట్లు, దళిత వాదులు, ఆర్‌ఎస్‌ఎస్ వాదులు ఈ పనే చేస్తున్నారు. తద్వారా చరిత్ర సమగ్ర అధ్యయనాన్ని, సమగ్ర పరిణామక్రమాలను పరిశీలించడాన్ని పాలకవర్గాల కర్తవ్యంగా వదిలి వేస్తున్నారు. ఇవాళ అసరం, విరసం, జనసాహితీ, జాతీయ సాహితీ పరిషత్ మొదలైనవి మరియు వారి స్కూల్ ఆఫ్ థాట్ పరిధిలోకి వచ్చేవాళ్ళు ఇదే పని చేస్తున్నారు. అందువల్ల సాహితీ చరిత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి వచ్చిన మౌఖిక సాహిత్యం లిఖిత సాహిత్యం ఎక్కడా కనపడక పోవడానికి కారణం ఇదే.

అందువల్ల సమగ్ర సామాజిక దృక్పథంతో చరిత్రను పునర్ అధ్యయనం చేయాలి. గత శతాబ్దంలో నేదునూరు గంగాధరం, బిరుదు రామరాజు, తూమాటి దోణప్ప, ఎల్దండ రఘుమన్న, ఆర్.వి.ఎస్. సుందరం, చిలుకూరు నారాయణరావు మొదలైన వారు సేకరించిన జానపద సాహిత్యంలో దళిత జీవితం ఏ మేరకున్నదో పునర్ అధ్యయనం చేయాలి. వారు జానపద పాటల్ని ప్రధానంగా బిసి, ఎస్సీల నుండి సేకరించారంటే బహుశా కైకట్టింది కూడా వారే అయి ఉండాలి. వాటిలో కులాన్ని వ్యతిరేకించే దృక్పథం లేకపోయినా మొత్తం సమాజం తాలూకు జీవితంలో భాగంగా వారి రోజు వారి జీవితం చిత్రణ, సంస్కృతి, ఆశలు, ఆరాటాలు, కష్ట-సుఖాలు అందులో నిక్షిప్తమై ఉన్నాయి. వాటిని వెలికితీయాలి.

దళిత పాట కవుల చరిత్ర

అలాగే ఇప్పటి జానపద పాట గ్రామీణ ప్రాంతాల్లో బి.సి., ఎస్సీ, ఎస్టీ కులాల్లోనే సహజంగా బతుకుంది. చదువుకున్న బీసి, ఎస్సీ, ఎస్టీలు పాటలు రాయడం చేతకాక కొంత తక్కువ స్థాయి ప్రక్రియ అనే దృష్టితో పాటలు రాయలేకపోతున్నారు. నిరక్షరాస్యులైన గడిపె బాలయ్య, అందెశ్రీ మొదలుకొని విద్యావంతులైన మాష్టార్జీ, కత్తి పద్మారావు, కలేకూరి ప్రసాద్, కె. రామలక్ష్మణ్, వంగపండు, ఎవై ప్రభుదాస్, గూడ అంజయ్య, గద్దర్, గోరటి వెంకన్న, గ్యార యాదయ్య, రాస భూమయ్య, దొడ్డి రామ్మూర్తి, అంబటి వెంకన్న, వేముల ఎల్లయ్య, రామచందర్ భీమవంశీ, రాకుమార, భీమసేన, నల్లాల లక్ష్మిరాజ్యం, పులి గోవర్ధన్, పోలిస్కర్ అడెల్లు, దామెర రాములు,

ఎ.పెద్ది రాజయ్య, కె. సీతారాములు, వల్లంపట్ల నాగేశ్వరరావు, శమశ్రీ మల్లయ్య, ఎర్రశ్రీ, మురళీ మధు, జయరాజ్ మొదలైనవారు తమ పేరుతోనే తమ పాటల్ని చెలామణి చేసుకుంటున్నారు.

వందల వేల దళితుల పాటలు :

అలా దళిత దృక్పథంతో వందల వేల పాటలు వెలువడ్డాయి. వాటిలో కొన్ని మాత్రమే అచ్చు అయ్యాయి. కొన్ని మాత్రమే క్యాసెట్‌లలో వచ్చాయి. దళిత దృక్పథాన్ని చైతన్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకువెళ్ళి ప్రజల్ని చైతన్యపరిచింది. పాట, ప్రసంగ ప్రక్రియలే. దళిత వచన కవిత్వం మౌఖిక సాహిత్యం లాగా ఎదగలేకపోయింది. అది సాంప్రదాయక ప్రధాన సాహిత్య స్రవంతిగా కొనసాగుతున్న సాహిత్యంలో తన స్థానం కోసం పోరాటం చేసింది. మరోమాటలో చెప్పాలంటే రాజకీయ, ఉద్యోగ రంగాల్లో తన స్థానంకోసం పోరాడటం వంటివి.

అంతేకాని మొత్తం దళిత బహుజన ప్రజానీకం కోసం పోరాడే స్థాయికి వాళ్ళు ఎదగలేకపోయారు. కనీసం దళిత పాట కవులను వారి కృషిని కలుపుకుంటూ సాహిత్య చరిత్రను రాయలేకపోయారు. పాట పేరు మీద కూడా వచన కవులే ఊరేగారు. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకున్న చందంగా అది మిగిలిపోయింది. చిక్కనవుతున్న పాటు, పదునెక్కిన పాట పేరుతో పాట అనే పదాన్ని కూడా పాట కవులకు అందకుండా హైజాక్ చేసి ఒక పాట కూడా ప్రచురించకుండా సంకలనాలు తెచ్చారు. "ప్రవహించే పాట, ఆం.ప్ర. దళిత పాటలు" 350 పాటల పుస్తకాన్ని కొంచెం అన్నం, కొంచెం పియ్యి కలిపి పెట్టినట్లుగా ఉందని ప్రవచించారు.

దశాబ్దాల సామాజిక చరిత్ర పరిణామ క్రమంలో భాగంగా 1992లో ఏర్పడిన దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మలుపు. దరకమే ఐక్యవేదిక వేలాది రచయితలను లక్షలాది ప్రజలను కదిలించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సాహిత్యం విస్తృతంగా సృజించడానికి ప్రేరణ అయింది. రాష్ట్రవ్యాప్తింగా భావజాల రంగంలో తీవ్రమైన చర్చ జరిగింది. సాహిత్య దృక్పథాలు, సాహిత్య పీఠాలు సమూలంగా కదలబారాయి.

ఈ సంకలనాలు సాహిత్యాన్ని ఒకచోట రికార్డు చేసి మనకు అందిస్తున్నాయి. లక్ష్మీనారాయణ మొదట తనకు అచ్చులో లభించిన వాటిని సంకలనాలుగా ఒకచోట పోగుచేస్తున్నారు. వాటి గుణగణాలు స్థల, కాల, దేశీయత చారిత్రక అంశాలను సాహితీవేత్తలను పరిశీలించాలి. ఆ పరిశోధనలను ఇది రిసోర్స్ అందిస్తుంది. ఒక యూనివర్శిటీ చేయాల్సిన పనిని లక్ష్మీనారాయణ చేస్తున్నారు. యూనివర్శిటీలు దీనిని నమూనాలుగా తీసుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీల సాహిత్యాన్ని విస్తారంగా సేకరించి తిరిగి అధ్యయనం చేయాలి. పరిశోధించాలి.

అంబేద్కర్‌ను అంగీకరించి జ్యోతిబా పూలేను నిరాకరించే దళితవాదులు కొందరున్నారు. అందువల్ల డా॥కె. లక్ష్మీనారాయణ భారతీయ ఆధునిక చరిత్రలో ఆధునిక సాహిత్యాన్ని దృక్పథాన్ని ప్రవేశపెట్టిన సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే ముఖచిత్రాన్ని ఈ సంకలనానికి ప్రచురించి సరైన శాస్త్రీయ చారిత్రక దృక్పథాన్ని కనబరచారు. తర్వాత సంకలనాల్లో అంబేద్కర్ జాషువా మొదలైన వారి ముఖచిత్రాలు ప్రచురిస్తారని ఈ క్రమం తెలియజేస్తున్నది.

ఈ రెండవ సంకలనాన్ని మూడు భాగాలుగా విభజించడం జరిగింది. మొదటి భాగంలో వెయ్యేళ్ల దళిత సాహిత్యాన్ని పదహారు కవితల్లో ప్రతీకాత్మకంగా చేర్చడం జరిగింది. ఈ భాగంలో పాల్కురికి సోమన, నష్కల్ డెక్కలివారు, మంగిపూడి వెంకటశర్మ, మాలపల్లి, ఉన్నవ లక్ష్మీనారాయణ, తిరునగరి వెంకటసూరి "మము వీడి స్వరాజ్యమందుట సాధ్యమా", జాషువా, గరిమెళ్ళ సత్యనారాయణ, జంధ్యాల పాపయ్యశాస్త్రి, అత్తోట రత్నకవి, బోయి భీమన్న, జ్ఞానానంద కవి వారి కవితలు చేర్చారు.

1970 తర్వాత 1970–90 దాకా రాసిన, పాడిన కవులను పైన పేర్కొన్న వారికి రెండవ భాగంలో పేర్కొనడం జరిగింది. మూడవ భాగం ప్రధానంగా 1990 నుండి వస్తున్న దళిత కవిత్వానికి సంబంధించినవి.

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి జీవితాన్ని కూడా త్యాగం చేస్తూ ఈ సంకలనాలను వెలువరిస్తున్న డా॥ కె. లక్ష్మీనారాయణ గారికి సాహిత్య చరిత్ర ఋణపడి ఉంటుంది. లక్ష్మీనారాయణ గారికి అభినందనలు.

దళిత సాహిత్యం ఒక సముద్రం అది చూసే వాళ్ళ చూపును బట్టి నిశ్చలంగా కనబడుతుంది. గంభీరంగా లోతుగా కనబడుతుంది. సముద్రంలో మహానదులున్నాయి. ఉప్పెనలున్నాయి. అన్నింటిని మించి సహనం ఉంది. భూమిలో మూడు పాళ్ళు సముద్రమే ఆక్రమించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీల సాహిత్యం కూడా మొత్తం భారతదేశ సాహిత్యంలో మూడుపాళ్ళు ఎదిగే దాకా ఈ కృషి నిరంతరం సమస్త రూపాల్లో కొనసాగించాలి.

దళిత సాహిత్య విమర్శ దృక్పథం-పరిణామం

ఇటీవల సాహిత్యం విరివిగా వెలువడుతున్నప్పటికీ సాహిత్య విమర్శ తగ్గిపోయిందని ఒక వాదన మొదలైంది. ఇది నిజం కాదు. పత్రికల్లో ఆ యా పుస్తకాలపై వచ్చే సమీక్షలకు సాహిత్య విమర్శ స్థాయిని ఆశించలేము. పత్రికల్లో వచ్చే సమీక్షలు, విమర్శలు సమీక్షకుల ఇష్టాయిష్టాల కనువుగా ఉంటున్నాయి. వారు మొత్తం సాహిత్యానికి మేలుచేసే బదులుగా కీడు చేయడానికి వెనుకాడ్డంలేదు.

ఇటీవలి కాలంలో దళిత సాహిత్య విమర్శ, స్త్రీ వాద విమర్శ, తెలంగాణా ప్రాంతీయ సాహిత్య విమర్శ, ప్రపంచీకరణ సాహిత్య విమర్శ, బీసీ సాహిత్య విమర్శ, ముస్లిం సాహిత్య విమర్శ అద్వితీయంగా ఎదిగింది. రాశిలోనూ, వాసిలోనూ గణనీయమైన మౌలికాంశాలను ముందుకుతెచ్చింది. వాటిని విస్తృతంగా ప్రత్యేక శాఖలుగా చర్చించడం అవసరం.

దళిత సాహిత్యం విస్తృతంగా ఎదిగింది. దళిత సాహిత్య విమర్శ కూడా 1980 నుండి అద్వితీయంగా ఎదుగుతూ వస్తున్నది. ప్రస్తుతం దళిత సాహిత్యం విమర్శకు పరిమితమౌతాను.

ఏ.వి.కాలేజి, లోయర్ ట్యాంకుబండ్, హైదరాబాద్‌లో డా॥ లక్ష్మణ చక్రవర్తి 'ఆధునిక సాహిత్య విమర్శ రీతులు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో సమర్పించిన వ్యాసం. సెమినార్ పత్రాల సంకలనం నుండి.

దళిత సాహిత్య విమర్శ అంటే ఈ ప్రపంచాన్ని సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక పరిణామాన్ని దళితుల దృష్టికోణంలో, దళితుల అలంకార శాస్త్రాల కోణంలో, దళితుల అభ్యున్నతి కోణంలో పరిశీలించటం, విశ్లేషించడం, వ్యాఖ్యానించడం.

దళితుల నిర్వచనం

దళితులు అంటే నిర్ధిష్ట అర్థంలో షెడ్యూలు కులాలు అని అర్థం. అంటరాని కులాలను షెడ్యూలు కులాల జాబితాలో చేర్చారు. అందువల్ల దళిత సాహిత్య విమర్శ అంటే వేల సంవత్సరాలుగా అణగారిన, అంటరాని కులాల జీవితం, సంస్కృతి, సమాజంలో వారి ఎదుగుదల, సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మ గౌరవం, సోదరత్వం, గురించి నొక్కి చెప్పేది. ఇందుకు అడ్డంకిగా ఉన్న విభిన్న పాత భావాలు, సంస్కృతి, జీవన విధానాలు కొన్ని కులాల ఆధిక్యత, వివక్షత, అసమానత, అన్ని రంగాల్లో ప్రశ్నించడం, ఖండించడం, దళితుల జీవితం, సంస్కృతి, చిత్రిస్తున్న తీరు తెన్నులు వారి పట్ల గల వివక్షతను ఖండించి, సమానత్వాన్ని నెలకొల్పి, సమాజం, దళితుల అభ్యున్నతికి అనువుగా మారేట్టు కృషి చేయడం.

అయితే సాహిత్య, సాంస్కృతిక భావజాల రంగాలలో దళితులు అనే పదాన్ని బి.సి, ఎస్.సి, ఎస్.టిలు అనే విస్తృత అర్థంలో కూడా వాడుతున్నారు. ఇది ముఖ్యంగా సాధారణ చర్చల్లో వాడుతున్నారు. నిర్దిష్టంగా వాడే బీసీ సాహిత్యాన్ని, ఎస్టీ సాహిత్యాన్ని, ముస్లిం మైనారిటీ సాహిత్యాన్ని కూడా కొంతకాలం దళిత సాహిత్యంగా చర్చించడం జరిగింది. 1998 నుండి ఇవి ప్రత్యేక అస్థిత్వంతో ప్రత్యేక శాఖలుగా విస్తరించాయి. 1994 నుండి దళిత సాహిత్యంలో మాదిగ సాహిత్యం విస్తరించి ప్రత్యేక శాఖగా కొనసాగుతూ వస్తున్నది. ఈ పరిణామాలను పరిశీలిద్దాం.

దళిత సాహిత్య విమర్శ ఆవిర్భావం

తెలుగు భాషా సాహిత్యంలో చాలాకాలంనుండి దళిత సాహిత్యం, దళిత సాహిత్య విమర్శ కొనసాగుతున్నది. కులవివక్ష పుట్టినప్పటి నుండి దాన్ని వ్యతిరేకిస్తూ సాహిత్యం, సాహిత్య విమర్శ ఆవిర్భవించాయి. ఆధునిక సాహిత్యంలో జాషువా, కుసుమ ధర్మన్న, ఉన్నవ లక్ష్మీ నారాయణ, శ్రీపాద, బొజ్జాతారకం, కొలుకలూరి ఇనాక్, బోయ జంగయ్య, అంటరాని కులాల జీవితాన్ని, సమస్యలను పలు ప్రక్రియల్లో ఆవిష్కరించారు.

దళిత సాహిత్యం ఏకకాలంలో దళిత సాహిత్య విమర్శగా కూడా

Dalithayugam-1
03-09-09
79

కొనసాగుతున్నది. జాషువా – గబ్బిలం, కుసుమ ధర్మన్న – మాకొద్దీ నల్ల దొరతనం, ఉన్నవ లక్ష్మీనారాయణ – మాలపల్లి నవలల్లో వ్రాసిన మూడు పాటలు, అలాగే "అందరూ పుట్టిరి హిందమ్మ తల్లికి" మొదలగునవి అవి ఏకకాలంలో దళిత సాహిత్యం – దళిత సాహిత్య విమర్శ కూడా.

ఇలా దళిత సాహిత్యం తన స్వభావరీత్యానే దళిత సాహిత్య విమర్శ కూడా. ఇలా దళిత సాహిత్యం ఏక కాలంలో రెండు కర్తవ్యాలను నిర్వర్తిస్తూ వస్తున్నది. రాజకీయాల్లో బి.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్ రాం, భాగ్యరెడ్డి వర్మ, దామోదరం సంజీవయ్య, తమ కులాల తాలూకు ప్రాతినిధ్యం, ఆత్మ గౌరవం, స్థానం సంపాదించే క్రమంలో, మొదట భావజాల రంగం, సాహిత్య విమర్శ వేగం పుంజుకున్నది. తరువాత పాటలు, పద్యాల్లో, ప్రసంగాల్లో, విస్తరించింది. అటు తర్వాత కథలు, నవలలు, సాహిత్య విమర్శలోకి విస్తరించింది.

చిందు భాగవతంలోని జాంబవ పురాణం, క్రీ॥ శ॥ 7వ శతాబ్ది నాటి దళిత ప్రదర్శన కళారూపం, దళిత సాహిత్యాన్ని దళిత సాహిత్య విమర్శను ఏక కాలంలో కొనసాగిస్తూ ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. దళిత సాహిత్య విమర్శ, వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ అంతరించాలని, అంతేగాక కులాల మధ్య అంతరాలు తొలగాలని మనుషులందరూ సమానమేనని, కులాతీత, మతాతీత, బౌద్ధ సంస్కృతి విస్తరించాలని అభిలషిస్తుంది.

అంబేద్కర్ ఒక గొప్ప సాహిత్య విమర్శకుడు

మేదరి భాగయ్య అను భాగ్యరెడ్డి వర్మ, డా॥ బి. ఆర్. అంబేద్కర్ పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు, ఉపనిషత్తులు మొ॥ సాహిత్యాన్ని దళిత దృక్పథంతో చాలా వివరంగా విశ్లేషించారు. ఇందుకు మహాత్మా జ్యోతిరావు పూలే మొదట బాటలు వేశాడు. అంబేద్కర్ రచనలు 16 సంపుటాలుగా తెలుగు అనువాదాలు కూడా వెలువడ్డాయి. అందులో 3 వ సంపుటం హిందూయిజం గురించి, 4వ సంపుటం హిందూ మతంలోని చిక్కుముడుల గురించి, రాముని, కృష్ణుని రహస్యాలు, భగవద్గీత పరిణామం మొ॥ దళిత సాహిత్య విమర్శను లోతుగా మనకు అందించారు. జ్యోతిరావు పూలే వ్రాసిన గులాం గిరి, షేర్ కార్యాంచ అసూడ్ (సేద్యగాని చెర్నాకోలా) గ్రంథాల్లోనూ, అంబేద్కర్ వ్రాసిన "శూద్రులెవరు?" అస్పృశ్యులెవరు? అనే గ్రంథాలు కూడా హిందూ పద్ధతులను పూర్వ పక్షం చేస్తూ, నూతన సాహిత్య దృష్టిని, చారిత్రక దృష్టిని, సామాజిక దృష్టిని అందించారు.

పై దృక్పథంతో సాహిత్యాన్ని సృష్టించడం, సాహిత్య విమర్శను వ్రాయడం,

దళిత సాహిత్యం, దళిత సాహిత్య విమర్శ అని చెప్పవచ్చు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సాహిత్య విమర్శ దృక్పథాన్ని నేటి కాలంలో అంబేడ్కరిస్టు దృక్పథం అని పిలువడం జరుగుతున్నది.

అంబేడ్కరిస్టు దృక్పథంతో పాటు సమాజాన్ని దళిత సాహిత్యాన్ని, దళిత సాహిత్య విమర్శను ఇతర దృక్పథాలతోను సృజిస్తున్నారు. కొనసాగిస్తున్నారు. వాటిని పరిశీలిద్దాం. ఇందులో గాంధీవాదం ముఖ్యమైనది.

గాంధీవాదం వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను, వాటి ఆధిక్యతను ప్రశ్నించకుండా, తొలగించకుండానే, దళితుల అభ్యున్నతిని గూర్చి వారికి అన్ని రంగాల్లో మెరుగైన స్థానం గూర్చి సంఘర్షణ కాకుండా సమన్వయ, మానవీయ దృష్టితో జీవితాన్ని సాహిత్యాన్ని చిత్రిస్తున్నది. గాంధీవాదం కాంగ్రెస్ పార్టీ, జాతీయోద్యమం విస్తరించినచోటల్లా వ్యాప్తి చెందింది. గాంధీ ధర్మ కర్తృత్వం సిద్ధాంతంలో శాంతి, అహింస, సహజీవనం, అమానుష సంస్కృతి ఖండన వాళ్ళూ మనుష్యులే అని దళితుల పక్షాన నిలబడడం జరిగింది. అందువల్ల భారతదేశంలోని పలు భాషల్లో గాంధీయిజం దృక్పథంతో దళిత సాహిత్యం, దళిత సాహిత్య విమర్శ విస్తరించింది. సామాజిక, రాజకీయ రంగాల్లోనూ, సాహిత్య కళారూపాల్లోనూ ఇది వ్యాప్తి చెందింది.

1909లో వచ్చిన దళిత నవల 'హేలావతి' మొదలుకొని ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, ఎన్.జి. రంగా నవల హరిజన నాయకుడు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వ్రాసిన కొన్ని కథలు, జాషువా, గాంధీవాదం పరిధిలోకి వస్తాయని చెప్పవచ్చు. కుసుమ ధర్మన్న, భాగ్యరెడ్డి వర్మ, మొదలగువారు అంబేద్కర్ దృక్పథం పరిధిలోకి వస్తారని చెప్పవచ్చు. అయితే ఇటు నుండి అటు, అటు నుండి ఇటు కూడా పరస్పర ప్రభావాలు కొనసాగాయి.

మహారాష్ట్ర దళిత పాంథర్స్ ఉద్యమం

1967లో మహరాష్ట్ర దళిత పాంథర్స్, దళిత సాహిత్య ఉద్యమం ప్రారంభించినప్పుడు దాని ప్రభావం తెలుగులో కూడా మొదలైంది. ఎండ్లూరి చిన్నయ్య, బి.హెచ్. తిరుపతి, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ మొదలగునవి బోయి భీమన్న, నోములకంటి జగన్నాధం, కొలుకలూరి ఇనాక్, బోయ జంగయ్య, మొదలుగువారు దీన్ని విస్తృత పరిచారు. 1969లో కంచికచర్ల కోటేశ్‌ను అగ్రకులాల వారు సజీవ దహనం చేశారు. అప్పుడు ప్రతిఘటన ఉద్యమం పెల్లుబికింది.

అటు తర్వాత తెలంగాణ జిల్లాల్లో 1977 నుండి అంబేద్కర్ సంఘాల నిర్మాణం, వేగం పుంజుకుంది. కుల వివక్షతకు వ్యతిరేకంగా అంబేద్కర్ సంఘాలు తెలంగాణలో

విస్తృతంగా కృషి చేశాయి. ఆ క్రమంలో ఆర్థిక, సామాజిక వర్గాలు కుల హెచ్చుతగ్గులు లేని సామాజిక భావజాలం వ్యాప్తి చెందింది. అది మౌఖిక సాహిత్యంలో బహుళ ప్రచారం పొందింది.

3

దళిత కళామండలి, దళిత మహాసభ, బిఎస్‌పి – సాహిత్య విమర్శ

1978లో మాష్టార్జీ ఆధ్వర్యంలో దళిత కళామండలి స్థాపించబడింది. ఇది ప్రధానంగా, ఆట, ప్రదర్శన కళారూపాలద్వారా తదనుగుణమైన సాహిత్యం ద్వారా ఏకకాలంలో సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను ఒకే ప్రక్రియలో కొనసాగించింది. తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరినీ కలుపుకొని అగ్రకులాలకు వ్యతిరేకంగా కాన్షీరాం భావజాలం, బహుజన సమాజ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది.

1984లో బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భవించింది. 1985 జులై 17వ తేదీన కారంచేడులో కమ్మ భూస్వాములు దళితులపై హత్యాకాండ కావించారు. అప్పుడు దాన్ని ప్రతిఘటిస్తూ ప్రజా ఉద్యమం కొనసాగింది. ఆ క్రమంలో దళిత మహాసభ ఏర్పడింది. దళిత మహాసభ నాయకులుగా బొజ్జా తారకం, కత్తి పద్మారావు ఇద్దరూ సాహితీవేత్తలు కావడం వల్ల సాహిత్యంలో దళిత సాహిత్యం, విమర్శ వేగం పుంజుకుంది. హేతువాద ఉద్యమంనుండి అంబేడ్కర్ దృక్పథంలోకి కత్తి పద్మారావు వంటి తరం పెద్ద ఎత్తున పరిణామం చెందారు. మాష్టార్జీ దళిత కళామండలి ద్వారా పలు ప్రక్రియల్లో ప్రజల్లోకి వెళ్ళారు. అదే సమయంలో జన నాట్య మండలి నాయకులు గద్దర్, "దళిత పులులమ్మ" పాటతో దళిత, చైతన్యాన్ని మార్క్సిస్టు చైతన్యంలోకి మార్చాలని ప్రవేశించారు.

అంతకు ముందే 1970లోనే వంగపండు ప్రసాదరావు జీవితాలను "ఉంద్రామాలపేట ఆ ఊరు చివర" అనే పాటలో చిత్రించారు. ఈ పాట దళితుల జీవితాన్ని అపూర్వంగా చిత్రించింది. మార్క్సిస్టు దృక్పథం తాలూకు కార్యక్రమానికి అనువుగా ఈ పాటలో ముగింపులు, పిలుపులు లేనందువల్ల దీన్ని దళిత సాహిత్యంలో భాగంగానే పరిగణించవచ్చు.

దళిత మహాసభ తర్వాత విస్తరించిన సాహిత్యం – సాహిత్య విమర్శ

దళిత మహాసభ, కారంచేడు దుర్ఘటనను వ్యతిరేకిస్తూ విశాఖపట్నం నుండి నెల్లూరు దాకా ఉవ్వెత్తున ఉద్యమాలు సాగించింది. తెలంగాణ నుండి వాటికి సంఘీభావ ఉద్యమాలు నడిచాయి. ఆ సమయంలో ప్రసంగం, పాటతో పాటు

జర్నలిజంలోనూ వచన కవిత్వంలోనూ, కథా ప్రక్రియలోనూ, దళిత అంబేద్కరిస్టు, దృక్పథం వ్యాప్తి చెందింది. అనేక రచనలు వెలువడ్డాయి. దళితులు ఎక్కువమంది నిరక్షరాస్యులు కావడంవల్ల వారి సాహిత్యం, సాహిత్య విమర్శ ప్రధానంగా మౌఖిక, శ్రవ్య, ప్రసంగ, ప్రదర్శన ప్రక్రియల్లో కొనసాగింది.

పాదిరికుప్పం, కారంచేడు, నీరుకొండ, చుండూరు, దుర్ఘటనల కులవివక్ష వ్యతిరేకిస్తూ దళిత ఉద్యమ చైతన్యంలో యువతరం ఎదిగింది. పాత తరం కొత్త జవసత్వాలతో వేగం పుంజుకుంది. అలా సాహిత్య ప్రక్రియలలో దళిత దృక్పథం విస్తరించింది. 1990 తర్వాత అంబేద్కరిస్టు దృక్పథంతో పాటుగా దళిత క్రైస్తవ సాహిత్య దృక్పథం కూడా బలం పుంజుకుంది. ఇది కారంచేడు నుండి మొదలైంది. కాని అప్పుడది దళిత క్రైస్తవ దృక్పథంగా ఒక స్పష్టమైన శక్తిగా ముందుకు రాలేదు. దళిత ధృక్పథంగానే కొనసాగింది. విదేశీ నిధులతో నడిచే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు కొన్ని దళిత క్రైస్తవ దృక్పథంతో సమాజాన్ని, సమస్యలను, సాహిత్యాన్ని పరిశీలించటం, విశ్లేషించటం, సాగించే క్రమంలో 'దళిత క్రైస్తవ దృక్పథం' బలమైన శాఖగా స్థిరపడింది. అది ఎంత బలంగా ఎదిగిందంటే బ్రిటిషాంధ్ర సాహిత్యమంతా దళిత క్రైస్తవ సాహిత్యమే అని కొందరు అనేదాకా విస్తరించింది.

కమ్యూనిస్టు, నక్సలైట్ల దళిత సాహిత్య విమర్శా దృక్పథం

అదే సమయంలో కమ్యూనిస్టులుగా, నక్సలైట్లుగా చీలిపోయిన మార్క్సువాదులు, మావో వాదులు పీడిత వర్గ దృక్పథంతో దళితుల సమస్యలను చూడాలని సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను వెలయించారు. త్రిపురనేని మధుసూధన మహీధర రామ్మోహన రావు - డాని: కళ్యాణ్‌రావు, గద్దర్, వంగపండు ప్రసాదరావు, గూడ అంజయ్య ప్రయత్నించారు. అభ్యుదయ రచయితల సంఘంనుండి ఎస్వీ సత్యనారాయణ వంటి వారుకూడా తమ తమ ధోరణిలో దళిత సాహిత్యం, విమర్శ చేశారు.

4

దరకమే ఐక్యవేదిక - సాహిత్య విమర్శలో మౌలిక పరిణామాలు

1992లో ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారులు, మేధావుల ఐక్య వేదిక ఏర్పడింది. దీని వ్యవస్థాపక అధ్యక్షులుగా నేను, ప్రధాన కార్యదర్శిగా మాష్టార్జీ, ఉపాధ్యక్షులుగా గూడ అంజయ్య, ఇంగిలాల రామచంద్రరావు, ఊ. సాంబశివరావు, కంచ ఐలయ్య మొ॥వారు "దరకమే ఐక్యవేదిక" సాహిత్యాన్ని, దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్ళారు. ఇది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యవేదికగా కొనసాగింది. అది

సాహిత్య దృక్పథాన్ని ఇలా నిర్వచించుకుంది. "సమస్త వర్ణ, వర్గ, లింగ, కుల, జాతి, మత, ప్రాంత, భాష వివక్షతలకు, అసమానతలకు, బ్రాహ్మణవాదానికి, మను ధర్మానికి వ్యతిరేకంగా పోరాడుతుంది. చార్వాకులు మొదలుకొని బుద్ధుడు, వేమన, పూలే, అంబేద్కర్ వారసత్వాన్ని స్వీకరిస్తుంది." వీరందరి భావజాలాన్ని కలిపి అంబేద్కరిజంగా కొత్త నిర్వచనం ఇచ్చింది.

అలా దళిత సాహిత్యాన్ని పునర్విశ్లేషించే క్రమంలో సాహిత్య చరిత్రను తిరగరాసింది. "కన్యాశుల్కంను ఎలా చూడాలి?" చలంను, శ్రీశ్రీని ఎలా అంచనా వేయాలి? "జాషువాను ఎక్కడ నిలపాలి?" మొదలగు సాహిత్య విమర్శ సరికొత్త దృక్పథంతో సరికొత్తగా చరిత్రను తిరగరాసింది. రాజారామ్మోహన్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, చలం సంఘసంస్కర్తలు కాదని వారు బ్రాహ్మణ కుల సంస్కర్తలని, మొత్తం సమాజాన్ని వాళ్ళు పట్టించుకోలేదని అంబేద్కర్ సంఘ సంస్కర్తే కాకుండా సామాజిక విప్లవకారుడని నిర్ధారించారు. సాహిత్య చరిత్రను వ్రాయడం ప్రారంభించారు. "కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి?" అనే సాహిత్య విమర్శ రాకముందటికి, అది వచ్చిన తర్వాతకి మధ్య ఒక స్పష్టమైన విభజనరేఖ ఏర్పడింది. ఆ విభజన రేఖ నుండి దళిత సాహిత్య విమర్శ దృక్పథం ప్రధాన సాహిత్య స్రవంతిలో తన స్థానాన్ని సుస్థిరపరచుకుంది. గతి తర్క తత్వ దర్శన భూమిక, అంతటి గ్రంథం సాహిత్య విమర్శకు తాత్విక భూమిక నందించింది.

1990 నుండి పెరిగిన వామపక్ష దళిత సాహిత్య విమర్శ

అదే సమయంలో గాంధీవాదంతోపాటు గాంధీవాదులు, గాంధీ సాహిత్యం వెనుకబడిపోయింది. హిందూ మత వాదులు అంతర్లీనంగా దళిత వ్యతిరేకతావాదాన్ని ఆశ్రయించారు. 1965 నుండి గాంధీవాదుల స్థానాన్ని మార్క్సిస్టులు పూరించే ప్రయత్నం చేశారు. దళిత సాహిత్యంలో 1990 నుండి సాహిత్య విమర్శ పేరిట కొందరు సాయుధ పోరాటం దళిత సమస్యకు పరిష్కారమని భావించారు. ఇలాంటి దృక్పథం మౌలికంగా మార్క్సిస్ట్ దృక్పథమే తప్ప దళిత దృక్పథం అనడం కుదరదు. అయినా దళిత సాహిత్యంలో చొరబడి దళిత సాహిత్య విమర్శ పేరిట కూడా కొంత కృషి చేశారు. దళిత మేనిఫెస్టో అనే పేరిట దళిత కవితా సంకలనం వెలువరించాక మళ్లీ అలాంటి ప్రచురణలు ఏవీ తెచ్చే ప్రయత్నాలు మానుకున్నారు. అనగా మార్క్సిస్ట్ దృక్పథంతో రాసే దళిత సాహిత్యం, కులవివక్షా వ్యతిరేక సాహిత్యం, ఆ యా కులాల జీవితం, సంస్కృతి, చిత్రిస్తూ దోపిడీ కులాల ఆధిక్యత ఎన్ని రూపాల్లో కొనసాగిస్తున్నారో చెప్పే కృషిని సాహిత్యంలో, సాహిత్య విమర్శలో వదిలేశారని అర్థం. కళ్యాణరావు

వంటి కొందరు మాత్రం దళితులు దళిత జీవితాన్ని మావో వాద సాయుధ పోరాట వాద దృక్పథంతో చిత్రిస్తున్నారు. దాన్ని ప్రధానంగా దళిత క్రైస్తవ సాహిత్యంగా పేర్కొంటున్నారు.

మార్క్సిజం, అంబేద్కరిజం - సాహిత్య విమర్శా దృక్పథం

1992 నుండి మార్క్సిజం, అంబేద్కరిజం కలిపి దేశీయ మార్క్సిజం అవుతుందని కొందరు అనుకున్నారు. ఐతే మార్క్సిజం, అంబేద్కరిజం రెండింటికి సమాజాన్ని ప్రశ్నించే తీరులో, దాన్ని మార్చాలనే తీరులో పని పద్ధతుల్లోనూ, ప్రాధాన్యతల్లోనూ అంతరాలు ఉన్నాయి. దీనివల్ల అంబేద్కరిజమే దేశీయ మార్క్సిజం అని కొందరు అన్నారు. అంబేద్కరిజాన్ని దేశీయ మార్క్సిజం అని ఎందుకు పిలవాలో అర్థం కాదు. అంబేద్కరిజం అంబేద్కరిజమే, మార్క్సిజం మార్క్సిజమే, గాంధీవాదం గాంధీవాదమే. ఇది మరొకటిగా ఎలా మారుతుంది? వీటి మధ్య సంపర్కం, సమన్వయం, కలిసి పనిచేయడం సాధ్యపడవచ్చు. కాని సమాజాన్ని పరిశీలించేతీరు, మార్చాలనికొనే పనిపద్ధతులు, ప్రాధాన్యతలు - దేని దారి దానిదే.

5

ఇంతదాకా దళిత సాహిత్య విమర్శ దృక్పథం, దాని నిర్వచనం, పరిణామం స్థూలంగా చూసాము. ఇపుడు నిర్దిష్టంగా పరిశీలిద్దాము.

జాషువా శతజయంతితో పదునెక్కిన దళిత సాహిత్య విమర్శా దృక్పథం :

1993లో జాషువా శతజయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు జరిగాయి. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రగతిశీల సాహిత్యం రూపంలో కొందరు బ్రాహ్మణీయ భాషా సంస్కృతిని, శ్రీశ్రీని తలకెత్తుకొని, జాషువాను పక్కకు నెట్టడంలోగల బ్రాహ్మణ కులతత్వాన్ని విశదీకరించారు. దళిత వాయిస్, ఎదురీత, దళితరాజ్యం మొ॥ పత్రికల్లో పలు వ్యాసాలు ప్రచురించారు. సాంప్రదాయక, బ్రాహ్మణ కులతత్వ వాది అయిన విశ్వనాథ సత్యనారాయణకు దాన్ని వ్యతిరేకించే నిజమైన దృక్పథం, జీవితం, సాహిత్యం జాషువా చిత్రించిందేనని వందలాదిమంది ప్రసంగాలు చేశారు. జాషువాకు సాహిత్యంలోగల స్థానం గురించి, ఆతడి విశిష్టత గురించి కత్తి పద్మారావు ఒక గ్రంథం ప్రచురించారు. జాషువా సాహిత్యంపై ఐదారు పి. హెచ్‌డి లతోపాటు నెల్లూరు జిల్లా పరిషత్‌వారు బృహత్తర సావనీర్ వెలువరించారు.

1991లో విశాఖపట్నం నుండి ప్రొ॥ కొండపల్లి సుదర్శన్ రాజు 'దళిత కవిత'

అనే సంకలనం వెలువరించారు. ఇందులో గురజాడ మొదలుకొని సుమారు 125 కవితలు అన్ని కులాలలవారు వ్రాసినవి చేర్చారు. ఇందులో దళితుల గురించి ఎవరు వ్రాసినా దళిత సాహిత్యమే అనే దృక్పథం, విస్తృతి కనబడుతుంది. ఇదే దృక్పథంతో గద్దల భాను, ననుమాస స్వామి, డా॥కె.లక్ష్మినారాయణ మొ॥వారి పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. దళిత కథల సంకలనాలుకూడా ఈ దృక్పథంతోనే వెలువరించారు.

శివసాగర్, సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్ మొ॥వాళ్ళు పురాణ ప్రతీకల అర్థాల్ని తిరగరాశారు. జి.లక్ష్మినర్సయ్య ఆంధ్రజ్యోతి దినపత్రికలో దళిత అలంకారశాస్త్ర విశిష్టతను విశ్లేషిస్తూ కొన్ని ఖండికలు రాశారు.

దళితులు - నిరక్షరాస్యులు - పాట ప్రాధాన్యత

ఐతే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలందరూ దళితులే అనే దృక్పథంలో నేను 1993లో కరీంనగర్ జిల్లా దళిత పాటలు సంకలనాలను అలాగే 1996లో 'ప్రవహించే పాట' 'ఆంధ్రప్రదేశ్ దళితపాటలు' అనే సంకలనాలను 2003లో 'విశాలసాహితి' 'బీసీ, ఎస్సీల పాటలు' అనే సంకలనాలను వెలువరించాను. ఇలా సుమారు 700 దళిత పాటలను ప్రచురించటం జరిగినది. ఇదే దృక్పథంతో వీటికన్నా కొంతముందు 1991లో జయధీర్ తిరుమలరావు. కె.పి.అశోక్‌కుమార్ సంపాదకత్వంలో దళిత గీతాలు పేరుతో సంకలనం ప్రచురించారు. మాష్టార్జీ దళిత గీతాల సంకలనం వెలువరించారు. మాష్టార్జీతోపాటు మరికొందరుకూడా అంబేద్కర్ జీవిత చరిత్రను బుర్రకథలుగా వెలువరించారు. కె.రామలక్ష్మణ్ దళిత పాటలు, గోరటి వెంకన్న పాటలు, భీమవంశి పాటలు, చెమటచుక్కలు, గడిపె బాలయ్య పాటలు, జి.వై.గిరి పాటలు, వల్లంపట్ల నాగేశ్వరరావు పాటలు, శమశ్రీ దళిత పాటలు, కె. సీతారాములు పాటలు, ఎర్రశ్రీ కవితలు మొదలైనవి వెలువడ్డాయి. ఇవన్నీ స్థూలంగా దళిత సాహిత్యంలో భాగమే. వచన కవితల గురించి చాలా ఎక్కువ సాహిత్య విమర్శ వచ్చింది. అందువల్ల పాటల గురించి ఇక్కడ తడిమాను. ఇవన్నీ దళిత సాహిత్యంతోపాటు దళిత సాహిత్య విమర్శను కూడా కొనసాగించినవే.

గ్రామ గ్రామాన అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పటంకూడా దళిత సాహిత్య దృక్పథంలో ఒక భాగమే. ఎందుకంటే నిరక్షరాస్యులైన దళితులకుకూడా అంబేద్కర్ విగ్రహం 'బ్రెయిలీ' లిపిలోని సాహిత్యంలా స్ఫూర్తిని, దృక్పథాన్ని అందిస్తుంది.

6

దళిత దృక్పథంతో వేల కవితలు, పాటలు - వందల పుస్తకాలు

వందలాది కవులు, వేల పాటలను, కవితలను దళిత సాహిత్య విమర్శ దృష్టితో వెలువరించారు. ఆకుల గంగాధర్, దళిత భారతి, దార్లరామచంద్ర 'కిర్రుచెప్పులు', జి.ఆర్. కుర్మె 'పునాదిరాయి', మునిమడుగుల రాజారావు 'అనాగరిక గేయం' వెలువరించారు. నల్లగొండ జిల్లా నుండి 'గోసంగి' కవుల పేరిట పలు ప్రచురణలను వెలువరించారు. వీటికికూడా అన్ని కులాలవారి సహకారం లభించింది. వచన కవిత్వంలో తెలంగాణలో నల్లగొండజిల్లా దళిత కవులు కొంతకాలం గొప్ప స్ఫూర్తిని రాష్ట్రానికి అందించారు. కారంచేడు, చుండూరు ప్రతిఘటన ఉద్యమాలనుండి కలేకూరి ప్రసాద్, ఎ.వై.ప్రభుదాస్ మొదలైనవాళ్లు ఎందరో గొప్ప పాటలు రాసి చైతన్యం రగిలించారు. కలేకూరి ప్రసాద్ పత్రికల్లో విస్తారంగా దళిత సాహిత్య విమర్శను వెలయించారు.

1980 తరువాత దళిత సాహిత్యవేత్తలు – సాహిత్య విమర్శ

బ్రిటీషాంధ్ర ప్రాంతం నుండి పాతతరం బోయి భీమన్నతోపాటు జ్ఞానానంద కవి, నూతక్కి అబ్రహం, బొజ్జా తారకం మొదలుకొని కత్తి పద్మారావుదాకా ఒక పరిణామం సూచిస్తుంది. కత్తి పద్మారావు రాష్ట్రవ్యాప్తంగా చేసిన వేల ప్రసంగాలు దళిత సాహిత్య విమర్శలో భాగమే. అదంతా అంబేద్కరిస్టు దృక్పథంతో సాగిన సాహిత్యవిమర్శ. కత్తి పద్మారావు తర్వాత దళిత మహాసభ ఉద్యమ విస్తృతితో వందలాది యువతరం కవులు ఎదిగారు. చాలామంది కవులు దళిత దృక్పథంలోకి విస్తృతి చెందారు.

అలా శివసాగర్, ఉ. సాంబశివరావు, సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, జి.లక్ష్మినర్సయ్య, జి.కళ్యాణరావు, త్రిపురనేని శ్రీనివాస్, నేను, సాహు, కాలువ మల్లయ్య వి.జి.ఆర్.నారగోని, సౌదా, మొ॥ వారిని ఇలా పరివర్తన చెందినవారిలో చెప్పవచ్చు.

ఐతే వీరందరి సాహిత్య విమర్శ దృక్పథం ఒక్కటికాదు, వేర్వేరు శాఖలకు వీరు ప్రతినిధులు. నేను ప్రధానంగా బుద్దిస్టు, అంబేద్కరిస్టు, మానవతావాద దళిత సాహిత్య దృక్పథానికి చెందిన School of thought ను ముందుకు తీసుకెళ్తున్నాను. శివసాగర్ మార్క్సిజం, అంబేద్కరిజంలను కలగలిపి తీసుకెళ్ళాలని, అలాగే ఉ. సాంబశివరావు, జె.గౌతమ్‌లతోపాటు బహుజన శ్రామిక విముక్తి కవులు మార్క్సిజం అంబేద్కరిజం తమ దృక్పథంగా ముందుకు నడుస్తున్నారు.

స్పార్టకస్ పేరుతో మోహన్‌రావు రాసిన ఖాకీ బతుకులు నవల తెలుగు సాహిత్యంలో కొత్తకోణాల్లో సాహిత్య విమర్శ విస్తరించడానికి దోహదం చేసింది.

Dalithayugam-1
03-09-09
83

అంతదాకా సాహిత్యానికెక్కని జీవితాలు ఇంకా చాలా వున్నాయని సాహితీవేత్తలు భావించడానికి స్ఫూర్తినిచ్చింది. అంటరాని వసంతం నవల వెలువడ్డానికి కూడా స్ఫూర్తి అయింది.

డా॥ కేశవరెడ్డి దళితుల గురించి వ్రాసిన నవలలపై సాహిత్య విమర్శవాదోపవాదాలు చాలాకాలం కొనసాగాయి. 2004లో వార్త దినపత్రికలో అమానుషమైన జోగిని వ్యవస్థ దాని తీరు తెన్నులగూర్చి, వారి జీవితాల గూర్చి వి.శాంతి ప్రబోధ అపూర్వమైన నవల వెలువరించారు. అది పుస్తక రూపంలోకూడా వెలువడింది.

జి.కళ్యాణరావు 'అంటరాని వసంతం' పేరుతో వందయేళ్ళ దళిత క్రైస్తవ జీవితాలను, వారి పరిణామాలను చక్కగా చిత్రించారు. ఈ నవలలో సాహిత్యంతోపాటు దళిత సాహిత్య విమర్శకూడా సహజ పద్ధతిలో కనబడుతుంది. ఈ అనేక ముద్రణలు పొందుతున్నది. పలు భాషల్లోకి అనువాదమౌతున్నది. పలు సాహిత్య విమర్శలకు ప్రాతిపదిక నిస్తున్నది. ఈ నవల తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి.

7

మాదిగ దండోరా – మాదిగ సాహిత్య విమర్శా దృక్పథం

దళిత అనే పదం మాదిగ దండోరా వచ్చిన తర్వాత మాదిగ సాహిత్య పరిషత్, మాదిగ తాత్వికత, మాదిగ సాహిత్యవేదిక మొ॥ వాటి ద్వారా మాదిగ సాహిత్యం ఒక ప్రత్యేక 'శాఖగా' ప్రత్యేక అస్థిత్వం కోరుకుంటూ 1994 నుండి ముందుకు వచ్చింది. వందలాది కవితలు, పాటలు, పదుల సంఖ్యలో కథలు, కొన్ని నవలలు, మాదిగ సాహిత్యం పేరుతో వెలువడ్డాయి. దీనివల్ల దళిత సాహిత్యం అనేది అప్పటి నుంచి మాలల సాహిత్యంగా, దళిత క్రైస్తవ సాహిత్యంగా పరిమితమైంది.

నాగప్ప సుందరరాజు – మాదిగ సాహిత్య విమర్శా దృక్పథం

మాదిగ సాహిత్యంలో నాగప్ప సుందరరాజు, మాదిగోడు కథలు, మావూరి మైసమ్మ కథల సంపుటిని వెలువరించారు. మాష్టార్జీ, గద్దర్ దళితుల రిజర్వేషన్‌ను ఏ, బి, సి, డి లుగా వర్గీకరించాలని కోరుతూ పాటలు వ్రాశారు. కొలుకలూరి ఇనాక్, బోయ జంగయ్య, ఎండ్లూరి సుధాకర్ మొ॥వారు నాగప్ప సుందరరాజు, గుండెడప్పు కనకయ్య ఆధ్వర్యంలో సాగిన మాదిగ సాహిత్య పరిషత్ సభల్లో పాల్గొని నైతిక మద్దతు తెలిపారు. గుండెడప్పు కనకయ్య మాదిగ సాహిత్యంలో భాగంగా గూటందెబ్బ, మొదలయిన కవితా సంపుటాలను వెలువరించారు.

గుండెడప్పు కనకయ్య రెండు కథా సంకలనాలను ప్రచురించారు. ఎండ్లూరి సుధాకర్ ఆంధ్రజ్యోతి వీక్లీలో వ్రాసిన కథలను మల్లెమొగ్గల గొడుగు మాదిగ కథలు పేరుతో మాదిగ దండోరా నాయకులు కృపాకర్ మాదిగ ప్రచురించారు. నాగప్ప సుందరరాజు వ్రాసిన మాదిగోడు కథల సంపుటికి డా॥ చిరంజీవి వ్రాసిన ముందుమాట దళిత సాహిత్య విమర్శలో కొన్ని మౌలికమైన విషయాలను ముందుకుతెచ్చి సాహిత్య విమర్శలో మైలురాయిగా నిలిచిపోయింది.

వేముల ఎల్లయ్య వ్రాసిన కక్క నవల దళిత సాహిత్యంతోపాటు మాదిగల భాషను, నుడికారాన్ని అద్వితీయంగా సాహిత్యీకరించింది. నల్లగొండ జిల్లాకు చెందిన మాదిగల భాషలో ఇది వ్రాయబడింది. నల్లగొండజిల్లావారికికూడా అది అర్థంకావటానికి కష్టమైనది. అనగా మాదిగల జీవితం, అభివృద్ధి, భాషా నుడికారం, ప్రత్యేక అస్థిత్వంతో ఎలా కొనసాగుతున్నాయో తెలుస్తుంది. నాగప్ప సుందరరాజు వ్రాసిన మాదిగోడు కథలలో ఒక ప్రత్యేకమైన మాదిగ తాత్విక శిల్పాన్ని, దృష్టిని రాయలసీమ మాదిగల నుడికారాన్ని, దృక్పథాన్ని అపూర్వంగా సాహిత్యీకరించింది.

గుండెడప్పు కనకయ్య కథల సంపుటి కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాంతంలోని మాదిగ భాషని, అభివ్యక్తిని దృక్పథాన్ని తిట్లతోసహా చిత్రించింది. బోయజంగయ్య బోజ కథలు ఉప్పునీరు, ఇప్పపూలు, చీమలు, మొదలైన కథా సంపుటాలు వెలువరించారు.

బోయ జంగయ్య 2004లో జగడం అనే నవలను ప్రచురించారు. ఈ నవలలో 1940లో పుట్టిన మాదిగల నుండి ప్రభుత్వ హాస్టల్లో, స్కూళ్లల్లో విద్యద్వారా ఉన్నతస్థాయికి ఎదిగిన పరిణామం మొత్తం సమాజం వారిపట్ల స్పందించినతీరు, సహకరించినతీరు మొ॥వి బ్రిటీషాంధ్ర పత్రికా భాషల్లో చిత్రించారు.

ఎండ్లూరి సుధాకర్ 2004 చివర్లో దళిత రిజర్వేషన్‌ను ఏ, బి, సి, డి లుగా వర్గీకరించాలని కోరుతూ "వర్గీకరణీయం" దీర్ఘ కవితను ప్రచురించారు. ఇందులోకూడా సాహిత్యంలో భాగంగానే సాహిత్య విమర్శనుకూడా ఏకకాలంలో చూడవచ్చు. అనేక కవితా సంపుటాలు ప్రచురించారు. కొత్త గబ్బిలం దీర్ఘ కవితని పుస్తకంగా ప్రకటించారు. గ్యార యాదయ్య పాటల పుస్తకాన్ని, ఎర్కోషి దీర్ఘ కవితని ప్రచురించారు. వీటిలో సాహిత్యంతోపాటు దళిత సాహిత్య విమర్శ కూడా ఉందని ప్రత్యేకంగా గుర్తుచేయనవసరంలేదనుకుంటాను.

కొలుకలూరి ఇనాక్‌గారి సాహిత్య విమర్శా సూత్రం - గ్రంథం

కొలుకలూరి ఇనాక్ విద్యావేత్తగా, రచయితగా, వైస్ ఛాన్సలర్‌గా సుప్రసిద్ధులు. ఆయన సాహిత్య విమర్శ సూత్రం అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఇది దళితులు మొత్తం సమాజాన్ని సాహిత్యాన్ని ఎలా చూడాలో తనదైన కోణంలో సూత్రీకరించారు. వీరు అస్పృశ్యగంగ కథల సంపుటిని వెలువరించారు.

గుండెడప్పు కనకయ్య తులనాత్మక అధ్యయనంలో భాగంగా "దళితుల సమస్యలు" అనే పి.హెచ్‌డి సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా రిటైర్డ్ అయిన రచయిత గద్దల భాను 1998లో తెలుగు నవల 'దళిత జీవితం' అనే అంశంపై పి.హెచ్‌డి గ్రంథాన్ని ప్రచురించారు. ననుమాస స్వామి ఉస్మానియా యూనివర్సిటి ప్రొఫెసర్ "తెలుగు నవలల్లో అస్పృశ్యతా సమస్య" అనే అంశంపై పి.హెచ్‌డి గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో తెలుగు నవల పుట్టినప్పటి నుంచి వెలువడిన 70 నవలలను అందులోని హరిజన జీవితాలను చక్కగా విశ్లేషించారు.

డా॥ కె.లక్ష్మీనారాయణ దళిత సాహిత్య విమర్శ

డా॥ కె. లక్ష్మి నారాయణ హరిజన కథానికపై పరిశోధన చేసి పి.హెచ్‌డి. గ్రంథాన్ని ప్రచురించారు. వందేళ్ల తెలుగు సాహిత్యంలో ఇలా దళిత కథానవలపై వాటి పరిధి పరిమితులపై లోతైన సాహిత్య విమర్శ వెలువడింది. డా॥కె.లక్ష్మినారాయణ తన పరిశోధనలో పెరిగిన ఆసక్తి, పట్టుదలతో వందలాది కథలను సేకరించి దళిత కథలను ఎనిమిది సంకలనాలుగా ప్రచురించారు. ప్రతి సంకలనంలో ముందు మాటల రూపంలో మరియు తర్వాత వాటి సమీక్షల రూపంలోను ఎంతో సాహిత్య విమర్శ వెలువడినది. అలాగే కె. లక్ష్మీనారాయణ కొన్ని దళిత నవలలను తీసుకుని వాటిపై విమర్శ రాయించి ఒక సంకలనంగా ప్రచురించాయి. వ్యాసకర్తలు అందులో సమాజంలో దళితుల జీవితాలు వాటి పరిణామాలను విశ్లేషించారు.

8

ప్రేమ అంటే ఏమిటి? - దళితుల ప్రేమ దృక్పథం

నేను బుద్దిస్ట్ మానవీయ, కరుణార్ద్ర దృక్పథంతో ప్రేమంటే ఏమిటి? పుస్తకాన్ని ప్రచురించాను. ద్వేషరసం స్థానంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, ప్రజలు అందరూ పరస్పర కరుణార్ద్ర ప్రేమ దృక్పథాన్ని అలవరచుకోవడం గురించి ఒక ప్రాపంచిక దృక్పథంగా ప్రేమను చర్చించాను. దీన్ని అంగీకరించకుండా కొందరు దళిత కవులు దళిత ప్రేమ ఎలా వుంటుందో సాహిత్య విమర్శను, కవితలను వెలువరించారు. ఇవి రెండూ సమన్వయించే దృక్పథం ఇంకా రూపొందించవలసే వున్నది. దీని తాలూకు

Dalithayugam-1
03-09-09
84

పర్యవసానాలు, సంఘర్షణ, వైరుధ్యం, వైవిధ్యం దళిత సాహిత్య విమర్శా దృక్పథంగా కొనసాగుతున్నది.

లక్ష్మీనర్సయ్య, త్రిపురనేని శ్రీనివాస్ - దళిత సాహిత్యం, విమర్శ

జి.లక్ష్మీనర్సయ్య ఒక ఉద్యమంగా దళిత వచన కవితా ఉద్యమాన్ని కొంతకాలం ముందుకు తీసుకువెళ్లారు. వీరు బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు రాసిందే దళిత సాహిత్యం అవుతుందని సాహితీ విమర్శ వెలయించారు. మిగతా కులాలవారు రాసే దళిత సాహిత్యాన్ని సానుభూతి సాహిత్యం అని వ్యవహరించారు. అలా ఇతర కులాలవాళ్లు రాసిన సానుభూతి సాహిత్యంతో "ఒళ్లు కడుక్కుందాం రండి" అనే కవితా సంపుటి వెలువడింది. జి.లక్ష్మీనర్సయ్య దళిత సాహిత్యానికి ప్రత్యేకమైన భాష, అభివ్యక్తి, అలంకారశాస్త్రం ఎలా వుంటాయో పత్రికల్లో పలు వ్యాసాలు ప్రచురించారు.

మద్దూరి నగేష్‌బాబు, ఎండ్లూరి సుధాకర్, సతీష్ చందర్, శివసాగర్ మొదలైనవాళ్లు ఈ కోణంలో చక్కని కృషి చేశారు. మద్దూరి నగేష్‌బాబు దళిత క్రైస్తవ సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను, దళిత క్రైస్తవ అలంకారశాస్త్రాన్ని తన సాహిత్యంలో నిక్షిప్తం చేశారు.

నేను కథల బడి, కథా సాహిత్య అలంకారశాస్త్రం గ్రంథం పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీల సాహిత్య విమర్శ దృక్పథాన్ని అలంకారశాస్త్రాన్ని వెలువరించాను.

''చిక్కనవుతున్న'' పాట, ''పదునెక్కిన'' పాట కవితా సంకలనాలను జి.లక్ష్మినర్సయ్య, త్రిపురనేని శ్రీనివాస్‌లు వెలువరించారు. వీటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు వ్రాసిన వచన కవిత్వాన్ని ప్రచురించారు. పాటపేరుపెట్టి ఒక్క పాట ప్రచురించలేదు. వాటి ముందుమాటల్లో అంబేద్కరిజం దేశీయ మార్క్సిజం అని ప్రతిపాదించారు. మార్క్సిజంపట్ల గల భ్రమలను అంబేద్కరిజం పట్లగల చిన్నచూపును "దేశీయ మార్క్సిజం" అని అంబేద్కరిజాన్ని నిర్వచించటంలో స్పష్టమవుతుంది.

9

బీసీ, ఎస్సీలను చీల్చిన ఊరు దళితులు, వాడ దళితుల చర్చ

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు కలిసి దళితులు అనే పదం వెనుక ఒకటి కావటం కొందరు సహించలేకపోయారు. వారు ఊరు దళితలు వాడ దళితులు అనే వర్గీకరణను సాహితీ విమర్శలో ప్రవేశపెట్టారు. ఈ సిద్ధాంత వాదోపవాదాలను డా॥

ఎస్.వి. సత్యనారాయణ 'విశాలాంధ్ర' ప్రచురణాలయం తరుపున పుస్తకంగా వెలువరించారు. ఐతే ఈ గ్రంథం దళిత సాహిత్య విమర్శ దృక్పథం అన్ని శాఖలకు ప్రాతినిధ్యం వహించలేకపోయినది. దళిత సాహిత్య విమర్శ దృక్పథం ఇప్పటికి సమగ్ర రూపంలో వెలువడలేదు.

విరసం ఉత్సాహవంతులు కొందరు మార్క్సిస్టు తీవ్రవాద దృక్పథంతో కొంత సాహిత్య విమర్శను వెలువరించారు. కొన్ని కవితలను, పాటలను చేర్చి దళిత మానిఫెస్టో పేరిట సంకలనం ప్రచురించారు. త్రిపురనేని మధుసూదనరావు, రంగనాయకమ్మ వంటివారు కొందరు అంబేద్కరిస్టు, దృక్పథాన్ని విమర్శించారు.

వర్గదృక్పథం కుంటిది - కులదృక్పథం గుడ్డిది అనే దళిత సాహిత్య విమర్శ

ఏటుకూరి బలరామమూర్తివంటి సీనియర్ సి.పి.ఐ భావజాల నాయకులు అంబేద్కరిజాన్ని సానుకూల దృష్టితోచూసే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా అరసం ప్రధానకార్యదర్శి ఎస్.వి. సత్యనారాయణ వర్గ దృక్పథంలేని కులదృక్పథం గుడ్డిదని, పీడిత కులదృక్పథంలేని వర్గదృక్పథం కుంటిదని ఒక నినాదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

వచన కవిత్వమే మొత్తం సాహిత్యమయినట్టు అంతదాకా దళిత పాటలు వ్రాస్తున్నవారిని వదిలేయటం పట్ల ఖిన్నుడైన ఎస్.వి.సత్యనారాయణ, మాష్టార్జీ, గోరటి వెంకన్న, గూడ అంజయ్య, గ్యార యాదయ్య మొ॥ పాట కవుల కృషిని, విశిష్టతను నిర్ధారిస్తూ ఎస్.వి. సత్యనారాయణ దళిత సాహిత్య విమర్శ వెలయించారు.

కుదించుకుపోయిన దళిత సాహిత్యా విమర్శా దృక్పథం

సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి మద్దూరి నగేష్‌బాబు, కోయి కోటేశ్వరరావు మొ॥ యువతరం కవులు, కత్తి పద్మారావును కూడా వదిలేసి ఆ తర్వాత దళిత సాహిత్య చరిత్రకు, సాహిత్యవిమర్శకు పరిమితం చేశారు.

ఇలాంటి పలు హ్రస్వదృష్టి గల సాహిత్య విమర్శవల్ల తోటివారిని స్వీకరించే ఔదార్యం లోపించడంవల్ల, సాహిత్యం విస్తృతంగా ఎదగడంవల్ల ఈ రెండు కారణాలరీత్యా ఆ తర్వాత దళిత సాహిత్య విమర్శ మాల, మాదిగ, బీసీ, గిరిజన, ముస్లిం సాహిత్య విమర్శగా, ప్రత్యేక శాఖలుగా అస్థిత్వంలోకి వచ్చాయి.

బీసీ సాహిత్య విమర్శా దృక్పథం

జూలూరి గౌరీశంకర్, 'వెంటాడే కలాలు - వెనుకబడిన కులాలు' పేరుతో

కొన్ని కవితల సంకలనం వెలువరించి, దళితులు అనే పదం క్రింద బీసీలు అస్థిత్వం కోల్పోయారని, బీసీల సాహిత్యం, బీసీల సాహిత్య విమర్శ ప్రత్యేక శాఖగా గుర్తించాలని ప్రతిపాదించారు. అంతకన్నా ముందే నేను పలుపత్రిక ఇంటర్వ్యూలో కొంతకాలం బీసీ సాహిత్య ఉద్యమం అవసరమని నొక్కిచెప్పటం జరిగింది.

ఆ తరువాత బీసీ సాహిత్య విమర్శను, దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్తూ పత్రికల్లో వ్యాసాలు వెలువరించాను. సమగ్ర సామాజిక కథ 50 ఏళ్ళ తెలుగు కథా తీరుతెన్నులు, గ్రంథంలలోనూ, కథలబడి, కథా సాహిత్య అలంకార శాస్త్రం గ్రంథంలోనూ భారతీయ-సాహిత్యం-తెలుగుకథలు గ్రంథంలోనూ, దళిత కవిత్వం 2వ సంకలనంలోనూ బీసీ, ఎస్సీల తెలంగాణా ప్రాంతంవారి సాహిత్య విమర్శా దృక్పథం, చరిత్రను వివరంగా గ్రంథస్తం చేశాను. సమీక్షలు, ముందుమాటలు వ్యాసాలరూపంలో 100కు పైగా దళితసాహిత్య విమర్శ దృక్పథం పరిణామాలను విశ్లేషించాను.

ఎస్సీల్లో మాలలకు పరిమితమైన దళితపదం

ప్రస్తుతం దళిత పదం ఎస్సీలకు పరిమితమైపోయింది. ప్రధానంగా మాల సాహిత్యంగా పరిమితికి లోనైనది. బీసీ, ఎస్సీ, ఎస్టీలు అందరు దళితులే అనే నిర్వచనం ఉన్నప్పుడు నేను 1993లో 'దరకమే వారసత్వం' అనే వ్యాసంలో చరిత్ర పొడుగునా దళిత సాహిత్య విమర్శ ఎలా ఉంటుందో విశ్లేషించాను. ఎస్సీ, బీసీలు మళ్లీ ఎప్పటిలా ప్రత్యేక వర్గీకరణతో ముందుకు వచ్చాక ఎస్సీ, బీసీలను కలిపి చెప్పటానికి దళిత బహుజనులు అనుపదం ప్రాచుర్యంలోకి వచ్చింది. గిరిజన సాహిత్య విమర్శ దృక్పథం ఇంకా ఒక శాఖగా ప్రత్యేక అస్థిత్వంతో ముందుకు రాలేకపోతున్నది. ముస్లిం సాహిత్యం, సాహిత్య విమర్శ ప్రత్యేక శాఖగా స్థిరపడింది. ఈ కారణాలరీత్యా ఈ సెమినార్ పత్రంలో ఎస్సీల సాహిత్యానికి పరిమితమయ్యాను.

అయితే ఎస్సీలు భౌగోళికంగా అభివృద్ధి చెందిన దశల వారిగా ప్రత్యేక పరిశీలనకూడా అవసరం. దీన్ని మొదటే గుర్తించి కాసుల ప్రతాపరెడ్డి తన 'కొలుపు' వ్యాసాల సంపుటిలో విశ్లేషించారు. కె.కె.రంగనాధాచార్యులు వంటి కొందరు సీనియర్ సాహిత్య వేత్తలు ఇండియాటుడేవంటి పత్రికల్లో దళిత సాహిత్య విమర్శను కొంత వెలువరించారు. అది విహంగవీక్షణానికి పరిమితమైనది. సామాజిక ఆచరణలోగాని, దళిత జీవితంలోగాని లేనందువల్ల వారి పరిశీలన గాఢత కోల్పోయిందని చెప్పవచ్చు.

Dalithayugam-1
03-09-09
86

10

తెలంగాణా దళిత సాహిత్య విమర్శా దృక్పథం

అదేసమయంలో కాసుల ప్రతాపరెడ్డి తెలంగాణ దళిత వాదానికి, బ్రిటీషాంధ్ర దళిత వాదానికి మధ్య గల అంతరాలను విశ్లేషించారు. బ్రిటీషాంధ్ర వచన కవిత తాలూకు దళితవాదం అప్పటికే అందుకున్న అభివృద్ధిలో మరొక మెట్టు ఎదగడానికి పరిమితమైన సాహిత్యమని, తెలంగాణ దళిత సాహిత్యం అట్టడుగు కులాల సామాజిక ఉద్యమ చైతన్యంతో, సామాజిక పరిణామాల్ని కోరుతూవచ్చిన సాహిత్యమని నిర్దిష్టంగా ప్రతాపరెడ్డి విశ్లేషించారు. బ్రిటీషాంధ్ర దళిత సాహిత్యాన్ని బ్రిటిషాంధ్ర దళితక్రైస్తవ సాహిత్యమనికూడా కొందరు అంటున్నారు.

విస్తరించిన దళిత సాహిత్య విమర్శా - దృక్పథం

దళిత సాహిత్య విమర్శ దృక్పథం మరింత ముందుకు సాగింది. బ్రిటిషాంధ్ర తెలంగాణ, ప్రత్యేక దళిత సాహిత్య అస్థిత్వ శాఖలతోపాటుగా బ్రిటీషాంధ్ర దళిత స్త్రీవాద సాహిత్య విమర్శ దృక్పథం, తెలంగాణ రాష్ట్ర దళిత స్త్రీవాద సాహిత్య విమర్శ దృక్పథం ప్రత్యేక శాఖలుగా అభివృద్ధి చెందాయి. జె. సుభద్ర, జాజుల గౌరి, గోగుశ్యామల, మొ॥వారు తెలంగాణ దళిత స్త్రీవాద, దళిత సాహిత్య విమర్శ దృక్పథాన్ని ముందుకు తెచ్చారు.

'పంచమం, అద్దంలో చంద్రుడు' వంటి దళిత నవలలను వ్రాసిన చిలుకూరి దేవపుత్ర, రాయలసీమ దళిత సాహిత్యానికి ఒక ప్రతినిధి. నాగప్ప సుందరరాజు, చిలుకూరి దేవపుత్ర, శాంతి నారాయణ, జూపల్లి ప్రేమ్‌చంద్, డా॥కె.లక్ష్మినారాయణ, రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మొ॥వారు రాయలసీమ నుండి దళిత సాహిత్యవిమర్శను ముందుకు తీసుకెళ్తున్నారు.

పాఠ్యాంశాలుగా దళిత సాహిత్యం - విమర్శ

దళిత సాహిత్య విమర్శ దృక్పథం ఇవాళ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా మారాయి. పత్రికల ద్వారానూ గ్రంధాలద్వారానూ దళిత సాహిత్య విమర్శ దృక్పథం మొత్తం సమాజం, సాహిత్యవిమర్శ, దృక్పథంలో భాగమవుతున్నది. ఇది ఇంకావేగంగా ముందుకు సాగాల్సిఉంది. యువతరం నేను పైన మొదటి అధ్యాయం చివరలో పేర్కొన్న వర్గీకరణను అనుసరించి నిర్దిష్టంగా దళిత సాహిత్యాన్ని, విమర్శనా దృక్పథాన్ని పరిశీలించి పరిణామాలను వింగడించవలసి ఉంది.

11

దళిత సాహిత్యాన్ని, దళిత సాహిత్య విమర్శను, పరిణామాలను, దృక్పథాలను ఇలా క్రోడీకరించవచ్చు :

ఇంకా విస్తృతంగా చెప్పవచ్చు. కానీ, ఇక్కడితో ముగిస్తాను. ప్రస్తుతం తెలుగులో దళిత, సాహిత్య విమర్శ, దళిత సాహిత్యం ఈ క్రింది విధంగా కొనసాగుతున్నదని చెప్పవచ్చు.

1. షెడ్యూలు కులాలకు పరిమితమయిన అంబేద్కరిస్టు దృక్పథం.
2. మాదిగ దండోరా, తర్వాత షె.కు. వర్గీకరణ వారిగా కొనసాగుతున్న అంబేద్కరిస్టు మాదిగ, మాల సాహిత్య దృక్పథం.
3. అంబేద్కరిస్టు దృక్పథం స్థానంలో దళిత క్రైస్తవ దృక్పథం.
4. గాంధేయవాద దళిత దృక్పథం.
5. అరసం, పరిమితులకు లోనైన మార్క్సు వాదం – దళిత దృక్పథం.
6. విరసం పరిమితులకు లోనైన మార్క్సు, మావో వాద దళిత దృక్పథం.
7. ఫెమినిస్టు పరిమితులుకు లోనైన దళిత వాద – సాహిత్య విమర్శ.
8. దళిత స్త్రీవాద సాహిత్య దృక్పథం.
9. తెలంగాణా ప్రాంతీయ వాద దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
10. బీసీ, ఎస్సీ. ఎస్టీ, లందరినీ తన పరిధిలోకి తీసుకొనే సాధారణ దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
11. 1996నుండి అంబేద్కరిస్టు దృక్పథంతో ప్రత్యేక శాఖగా రూపు దిద్దుకున్న బీసీ వాద దళిత సాహిత్య విమర్శా దృక్పథం
12. వర్ణ వాద, హిందూ వాద దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
13. మానవతావాద దృష్టిలో భాగంగా దళిత సాహిత్య విమర్శ దృక్పథం
14. 1993నుండి దళిత వాద మధ్యతరగతి పరిమితులకు లోనైన దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
15. 1993నుండి వచన కవితకు పరిమితమైన మధ్య తరగతి దళిత సాహిత్య విమర్శ దృక్పథం.

Dalithayugam-1
03-09-09
87

16. దళిత నాటక సాహిత్య విమర్శ దృక్పథం.
17. బుద్ధిస్టు దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
18. అంబేద్కరిస్టు గిరిజన వాద దళిత సాహిత్య దృక్పథం.
19. అంబేద్కరిస్టు ముస్లిం వాద సాహిత్య విమర్శ దృక్పథం.
20. నక్సలిస్టు, మావోయిస్టు దళిత వాద సాహిత్య విమర్శ దృక్పథం.

ప్రతిదీ పరస్పరపూరకాలే

ఇలా దళిత సాహిత్య విమర్శ – దళిత సాహిత్యం పలు కోణాలలో వెలువడుతున్నది. ప్రతీదీ సమాజంలోని జీవితంలోని కనీసం ఏదో ఒక కోణాన్ని వీలైతే మరిన్ని కోణాలను ప్రాధాన్యతతో మునుముందుకు తెస్తున్నవే. అందువల్ల సాహిత్య విమర్శ రంగంలో సంఘర్షణ ఉండవచ్చు. కానీ ఆయా దృక్పథాలతో సృష్టించే సాహిత్యం మధ్య సమన్వయమే తప్ప సంఘర్షణ ఉండే అవకాశం తక్కువ. ఎందుకంటే ఇవన్నీ పరస్పర పూరకాలు.


మొత్తం సమాజం మారడంకోసమే దళిత సాహిత్యం – విమర్శ :

నా దృష్టిలో దళిత సాహిత్య విమర్శ, దళిత సాహిత్యాన్నే కాకుండా మొత్తం సాహిత్యాన్ని అన్ని రకాల దృక్పథాల సాహిత్యాలను కూడా పైన చెప్పిన కోణాలతో, దృక్పథాలతో విశ్లేషిస్తుంది. విమర్శిస్తుంది. పూర్వపక్షం చేస్తుంది. సరికొత్త అంచనాలను మనముందుకు తెస్తుంది. అలాగే భారత రాజ్యాంగ లక్ష్యాల సాధనం కోసం అందరూ దళిత సాహిత్యం సృష్టించడం అవసరం.

అందరూ దళిత సాహిత్య విమర్శ – దృక్పథం అలవరచుకోవాలి

భారత రాజ్యాంగం ఆదేశించిన లక్ష్యాలను సాధించుకోవడానికి దళిత సాహిత్య విమర్శ – దళిత సాహిత్యం దృక్పథం అందరికీ తప్పనిసరి. భారత రాజ్యాంగ లక్ష్యాల సాధన కోసం అందరూ దళిత దృక్పథంతో దళిత సాహిత్యం సృష్టించాలి.

ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు. ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు, అన్ని కులాలు సమానమే. స్వేచ్ఛ సమానత్వం, సోదరత్వం అందరిలో వెల్లివిరియడానికి కుల, వర్గ, మత, లింగ, భాష, వివక్షతలను, అసమానతలను, తొలగించటానికి, అంబేద్కరిస్టు, బుద్దిస్టు, దళిత సాహిత్య దృక్పథం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరు ఈ దృక్పథాన్ని స్వీకరించి, అన్వయించి వ్రాసినప్పుడే రాజ్యాంగం లక్ష్యాలను గౌరవించిన వారవుతారు, ముందుకు తీసుకెళ్ళినవారవుతారు.



సామాజిక దర్శనాలు కులం-వర్గం-మతం

భారతీయ ఫ్యూడల్ రాజకీయ అర్థశాస్త్రం పేరే కులవ్యవస్థ

కులవ్యవస్థ నిర్మూలించబడకుండా

మనదేశంలో ఫ్యూడలిజం నిర్మూలించబడదు

చాల్రోజుల తర్వాత విద్యార్థుల్ని సంబోధిస్తూ మాట్లాడే అవకాశం కలిగింది. 1984 నుండి విరసం కార్యవర్గసభ్యుడిగా, రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నప్పటినుండి గ్రామాలు మొదలుకొని అఖిలభారత పర్యటనదాకా పని చేసిన ఆచరణ క్రమంలో వేలాదిమంది విద్యార్థులను, ఎన్నో విద్యార్థి సంఘాలను కలిశాను.

డా॥ మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 1990 ఏప్రిల్ రెండోతేదీన ఆర్‌వైఎల్ కరీంనగర్ జిల్లా మహాసభల్లో మంథనిలో బహిరంగ జీవితంలోకి వచ్చాక నా కార్యరంగం వేరైపోయింది. సాహిత్య, తాత్విక రంగాల్లో దృష్టిని కేంద్రీకరించాను. తాత్వికరంగంలో గల వెలితిని పూర్తి చేయాల్సిన చారిత్రక కర్తవ్యం కారణంగా నా కథా రచనారంగం కుంటుబడి పోయింది.

(ఈ ప్రసంగ వ్యాసం పిడిఎస్‌యు వీరయ్య నాయకుడుగా ఉన్నప్పుడు విద్యార్థి సంఘంలో రెండు వర్గాలు, రెండు భావజాలాలతో సంఘర్షిస్తూ చర్చిస్తున్న సందర్భంలో అంబేద్కరిజం ప్రాధాన్యతను వివరిస్తూ, మహాత్మా జ్యోతిబాపులే, డా॥ బి.ఆర్.అంబేద్కర్ భారతదేశ సామాజిక విప్లవకారులు అని నిర్ధారిస్తూ ఈ ప్రసంగ వ్యాసం రాయడం జరిగింది. మార్క్సిస్టు భావజాలం పేరుతో అగ్రకులతత్త్వానికి ఆమోదముద్ర వేయించుకోవాలనుకుంటున్న వారికి సూటిగా, స్పష్టంగా వేసిన ప్రశ్నలు, ఇచ్చిన జవాబులు ఇందులో చూడవచ్చు. దీన్ని సంక్షిప్తంగా తిరుగుబాటు పిడిఎస్‌యు మాసపత్రికలో 1993-94 సంవత్సరంలో ప్రచురించారు. దాని పూర్తి పాఠాన్ని కొద్ది వివరణలతో)

అంబేద్కర్ శతజయంతి పులే శతవర్ధంతి సభలు దేశంలో తెచ్చిన పరిణామాలు

అంబేద్కర్ శతజయంతి, జ్యోతిబాపులే శతవర్ధంతి సందర్భంగా "కులవ్యవస్థకు, సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుదాం! జ్యోతిరావు ఫులే, అంబేద్కర్‌ల పోరాటస్ఫూర్తిని స్వీకరిద్దాం!" అనే శీర్షికతో పిడిఎస్‌యు వీరయ్య (విజృంభణ) డిఎస్‌ఒలు వెలువరించిన కరపత్రం రావడంలో నా పరోక్ష ప్రమేయం వున్నది. నాతోపాటు కంచ అయిలయ్య, బొజ్జా తారకం, బహుజన సమాజ్‌పార్టీ, కాన్షీరాం, కారంచేడు, చుండూరులు, దళితమహాసభ, గద్దర్, కె.జి.సత్యమూర్తి, కత్తి పద్మారావు, మాష్టార్జీ, బొజ్జా విజయభారతి, సత్యశోధక శాస్త్రవేత్తల ప్రకటన, మండల కమిషన్, విప్లవోద్యమంతో పీడితకులాల్లో పెల్లుబికిన అశేష ప్రజాచైతన్యం ప్రమేయంకూడా వున్నది. వీరందరి తాత్విక, భావజాల, సామాజిక, చారిత్రక కృషి నేపథ్యంలో ఆ కరపత్రం వెలువంది. అందువల్ల ఆ కరపత్రంలోని అంశాలపై వచ్చే సందేహాలు నేను సైతం తీర్చవలసి వున్నది.

ఒక జ్ఞాన జ్వాలగా విద్యార్థులు

విద్యార్థుల్లో ఉత్సాహం ఉంటుంది. ఎరువు వేస్తే తీగబారి అల్లుకుపోయే నవనవోన్మేష వయస్సుమీది. అందువల్ల మనస్సులో రగిలి రగిలి భగ్గునమండే మీలోని జ్ఞాన జ్వాల ఏమరుపాటున చూసినపుడు ఒకోసారి అకస్మాత్తుగా అంటుకున్నట్టు కనపడుతుంది.

కాని ప్రతిదానికి ఒక క్రమం ఉంటుంది. పరిమాణాత్మక మార్పు, గుణాత్మక మార్పు అభావ దశలుంటాయి. ప్రపంచంలో హఠాత్ సంఘటనలేవీ వుండవు. క్రమాలు తెలియనపుడు అలా కనపడతాయి.

నామటుకు నాకు విజృంభణ, తిరుగుబాటుగా పిడిఎస్‌యు విద్యార్థులు ఎందుకు విడిపోయారో హఠాత్ సంఘటనలా కనపడింది. దాని సైద్ధాంతిక చర్చ, ఆచరణక్రమం లోలోపల సాగుతున్న విషయం నాకు తెలియలేదు, కనక అలా కనపడింది. కాని అదంతా ఒక క్రమంలో జరిగింది. అలాగే ఎన్నో ఏళ్ళ నిరంతర అధ్యయనం, చర్చ, జ్ఞానం పరస్పర మార్పిడి క్రమంలో పిడిఎస్‌యు, డిఎస్‌ఒలు "అంబేద్కర్ సామాజిక విప్లవకారుడు" అనే అవగాహనకు రావడం సాధ్యపడింది.

విద్యావంతులైన బి.సి., ఎస్సీ, ఎస్టీ, దళితుల సంఖ్య అనగా వేల ఏళ్ళుగా నిజమైన శ్రామికులైన బి.సి., ఎస్సీ, ఎస్టీ, ల సంఖ్య విప్లవోద్యమంలో గణనీయంగా పెరగడంతోపాటు, వారు విప్లవోద్యమంలో, తాత్విక, భావజాల, సైద్ధాంతిక స్థాయిలో

ఎదిగిన క్రమంవల్ల అది సాధ్యపడింది. అలా యిది ఆ సంస్థల్లో నిజమైన శ్రామికవర్గానికి చెందినవారి పిల్లలు, యువకులు, మేధావులు, విప్లవకారులు సంఖ్యరీత్యాను, సైద్ధాంతిక స్థాయి రీత్యాను పాలసీ నిర్ణాయక స్థానంలో మెజారిటీ సాధించిన క్రమాన్ని కూడా తెలియజేస్తుంది. ఆయా సంస్థల స్వభావంలో అంతర్గత పోరాటంద్వారా కలిగిన మార్పు యిది. ఆ క్రమం తెలియకపోతే జ్యోతిబాపులే, అంబేద్కర్‌లను, ఆ సంస్థలు ''సామాజిక విప్లవకారులు'' అని హఠాత్తుగా గౌరవించినట్టుగా కనపడవచ్చు.

విప్లవకారులు చేసిన "ఘోరపాపం" నుండి విముక్తం కావాలి

కరపత్రం రాసిన వాళ్ళు అన్నట్టు "భారత విప్లవ విద్యార్థి ఉద్యమం" పూలే, అంబేద్కర్‌లను విప్లవకారులుగా గుర్తించకుండా చేసిన ''ఘోర పాపాన్నుండి'' బయటపడి పశ్చాత్తాప పడవలసేవుంది.

వేల ఏళ్ళుగా నిజమైన శ్రామికవర్గమైన మాకు సమాజ గతిక్రమం అనగా సామాజిక పరిణామక్రమం అందజేసిన జ్ఞానక్రమం అది. మాకు కలిగిన సమస్యలు, అనుభవాలు లేనివారికి, కులం తాలూకు అణిచివేతకు గురికాని వారికి, నిజమైన శ్రామికవర్గంగా ఆచరణ లేనివారికి, అగ్రవర్ణ, అగ్రకులాలవారికి కలిగే అవకాశంలేదు. కనక వారికి వేల ఏళ్ళ నిజమైన శ్రామిక వర్గమైన మాకు కలిగేలాంటి జ్ఞానక్రమం ప్రత్యక్షంగా కలిగే అవకాశం వుండదు. వారు మాలాంటివారికి ప్రత్యక్షంగా కలిగిన జ్ఞానక్రమంపై ఆధారపడి పరోక్షంగా యీ విషయంలో జ్ఞానం సంపాదించగలుగుతారు.

ఇలా మా ద్వారా కలిగిన జ్ఞానంతోనే వేలఏళ్ళ నిజమైన శ్రామికవర్గమైన శూద్రులకు వ్యతిరేకంగా దాన్ని భావనీకరించడం అనేది ప్రత్యక్ష బాధితుల్ని, పరాయీకరించడం, అణిచివేయడమే. ప్రత్యక్ష జ్ఞానంగలవారినించే జ్ఞానాన్ని స్వీకరించి వారినే ఓడించడం అనేది సహజంగానే అశేష పీడిత కులాల ప్రజలను పీడితవర్గాలుగా, శూద్రకులాలుగా మార్చుకోవడం, తాను పాలక కులంగా, పాలక వర్గంగా మారడం అవుతుంది. అందువల్ల యిలాంటి సున్నితమైన సందర్భాలలో వాదనలోని రెండుపక్షాలూ పీడిత కులాలవాళ్లే నిలబడడంవల్ల సమస్య చాలా సులువుగా సమన్వయపూర్వకంగా పరిష్కరింపబడే అవకాశం వుంటుంది.

ఈ దేశ జనాభాలో 70 శాతం పైగా పీడిత కులాలవాళ్ళే. వీళ్ళు వందలఏళ్ళుగా అణిచివేతకు గురిచేయబడ్డారు. వీరి శ్రమఫలితంమీదే ఈ దేశంలోని సమస్త కళలు, శాస్త్రాలు, సంస్కృతులు విలసిల్లాయి. అయితే శ్రమ ఒకరిది, ఫలితం–పేరు–ప్రఖ్యాతులు మరొకరివైపోయాయి. ఇకనుండి యీ క్రమం

సాగనీయకూడదనుకున్నారు వాళ్ళు. ఇకనుండి తమ పేరిటే తమ నాయకత్వంలోనే చరిత్ర, సంస్కృతి, నిర్మాణం కావాలని, నిశ్చయించుకున్నారు. వేలఏళ్ళుగా నిజమైన శ్రామికవర్గం కనక విప్లవోద్యమంలోను, సామాజికరంగాల్లోను సమస్త స్థానాల్లో, సమస్త స్థాయిల్లో వాళ్ళే ఎదిగివచ్చి మహాప్రవాహంలా ప్రవహించడం అవసరం.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకే విప్లవం అవసరం

మనదేశంలో ఎవరికన్నా ఎక్కువగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకే విప్లవం అవసరం. ఈ దేశంలో తేవాల్సింది పెట్టుబడిదారీ విప్లవమైనా, ఫ్యూడల్ వ్యతిరేక విప్లవమైనా, నూతనప్రజాస్వామిక విప్లవమైనా, నయావలస వ్యతిరేక విప్లవమైనా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యమైనా, సోషలిస్టు ప్రజాస్వామ్యమైనా బీసీ, ఎస్సీ, ఎస్టీల నాయకత్వాన్ని మహోధృతంగా వేగవంతం చేయవల్సి ఉంది.

2

కొందరు "కులం అనేది బాహ్య సంబంధం, అది మానసిక సమస్య. సమాజంలోవున్న ఆంతరిక సంబంధాలచేత ఉత్పత్తిశక్తులచేత నిర్ణయింపబడ్డం లేదు" అంటారు. దీన్నే తిరగేసి ఇలా అనవచ్చు. "వర్గం అనేది బాహ్య సంబంధం అది మానసిక సమస్య. సామాజంలో ఉన్న అంతరిక సంబంధాలచేత నిర్ణయించబడడం లేదు. అయా పార్టీల నాయకత్వంలో నడిచే ట్రేడ్ యూనియన్‌ల దృష్టి ననుసరించి నిర్ణయించబడుతున్నది. అందువల్ల ప్రపంచ కార్మికులందరు ఒక్కటి కాలేకపోగా, ఒకే సంస్థలోని కార్మికులు పలు కార్మిక సంఘాలుగా చీలిపోయారు. ఈ మానసిక సమస్య వల్ల కార్మికవర్గం అంత ఒకటిగా పనిచేయలేకపోతున్నది". బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలు కూడా ఇలానే కల్సి పని చేయలేకపోతున్నాయి. ఇలాంటి వాదనలు మార్క్సిజానికి విరుద్ధమైనవి. వాస్తవాలకు దగ్గరైనవి.

భారతీయఫ్యూడల్ రాజకీయ అర్థశాస్త్రం గా కులవ్యవస్థ

మన దేశంలో ఉత్పత్తి సంబంధాలను, రాజకీయార్థిక, నైతిక, సామాజిక, సాంస్కృతిక సంబంధాలను అనగా పునాది ఉపరితల అంశాలను, రెంటిని నిర్ణయించేది కులమే. ఏ కులం ఏ వృత్తి చేయాలి ఏఏపనులు చేయాలో ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తిసకు మనదేశంలో యిలా ఫ్యూడల్ వ్యవస్థ కులవ్యవస్థ రూపం ద్వారా ఆచరణలో వున్నది. అందువల్ల కులం తాలూకు ఉత్పత్తి సంబంధాలను, నిర్మూలించకుండా మనదేశంలో ఫ్యూడల్ వ్యవస్థ నిర్మూలించబడదు.

నేను గత 10 ఏళ్ళుగా పదే పదే చెప్తూ వస్తున్నాను. మన విద్యార్థి యువజనులకు

మన భారతీయ తత్వశాస్త్రాల్ని పరిచయం చేయాలని. కాని పార్టీలు ప్రజాసంఘాలు గతితర్కం, వైరుధ్య సూత్రాలు ఒకరోజు, చారిత్రక భౌతికవాదం ఒకరోజు, రాజకీయ అర్థశాస్త్రం, నూతన ప్రజాస్వామిక విప్లవం, శాస్త్రీయ విద్యావిధానం, పనివిధానం రెండురోజులు క్లాసులు నిర్వహిస్తూ వస్తున్నారేగానీ భారతీయ తత్వశాస్త్రాలు, భారతీయ రాజకీయ అర్థశాస్త్రం గురించి చెప్పడం లేదు.

దానివల్ల విద్యార్థి యువజనుల్లో అన్వయ క్లిష్టత ఏర్పడుతున్నది. నిత్య జీవితంలో ఉన్నది వేరు. వింటున్నది వేరు అవుతున్నది. తద్వారా మన జీవితానుభవాలకు మన నిర్దిష్ట తత్వశాస్త్రాలకు, మన నిర్దిష్ట రాజకీయ అర్థశాస్త్రాలకు వాటిని ఎట్లా అన్వయించాలో తెలియడంలేదు. అంతేకాదు మన స్థల కాల నిర్దిష్ట పరిస్థితుల్ని మనవైన భారతీయ శాస్త్రాలద్వారా, జ్ఞానం ద్వారా చేరుకోలేని స్థితి ఉత్పన్నమవుతున్నది. ఇంగ్లాండులో చదువుకుని పల్లెల్లో పంతులు పనిచేస్తే అవగాహనలో, ఆచరణలో ఏర్పడే అంతరమే మన భారతీయ జ్ఞానశాస్త్రాల ద్వారా తత్వశాస్త్రాల ద్వారా విద్య పొందకపోతే ఏర్పడుతున్నది.

మన దగ్గర వున్న తాళంచెవులు, వస్తువులు పనికిరాకపోతే పొరుగువారిని అడిగి తీసుకుంటాం. మన దగ్గర గల వాటిని ముందు వాడి చూడాలి. రైస్ డేవిడ్, రాహుల్ సాంకృత్యాయన్, ఎస్.ఎన్. దాస్ గుప్తా, స్టేర్ బాట్స్కీ, దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ వంటి తత్వవేత్తలు భారతీయ తత్వశాస్త్రాల్లో గల గతితర్కాన్ని అది ఎంత గొప్పగా అభివృద్ధి చెందివుందో వెలికి తీసుకువచ్చారు. దాన్ని విద్యార్థి సంఘాల క్లాసుల నిర్వహణలో ఉపయోగించలేకపోవడంవల్ల మన విద్యార్థులకు యువకులకు చాలా నష్టం జరిగింది. అందువల్ల సంక్షిప్తంగా యిక్కడ కొంత తెలుసుకుందాం.

మనదేశంలో వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను బ్రాహ్మణిజం అంటారు. బ్రాహ్మణ అనే పదం ఒక కులానికి పరిమితమైనది కాదు. అది అంతకన్నా ఎన్నో రెట్లు విశాలమైనది. వేదఆర్యులు ఎంత విస్తృతిపొందారో అంత విస్తృతి పొందినది బ్రాహ్మణపదం.

బ్రాహ్మణిజం సకల సాంఘిక పీడనలకు కారణం అని జ్యోతిబా ఫులే ఎలుగెత్తి చాటాడు. దోపిడి పీడనలు బ్రాహ్మణిజం రూపంలో కొనసాగుతు న్నాయని నిర్ధారించాడు.

దీని అర్థం ఏమిటి? మనం బానిస వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ అని పిలుస్తున్నట్టుగానే బ్రాహ్మనిస్టు వ్యవస్థ అని పిలుస్తుంటాము. మనదేశంలో బానిస వ్యవస్థ ఫ్యూడల్ వ్యవస్థ బ్రాహ్మణిజం తాలూకు వర్ణ వ్యవస్థ, కులవ్యవస్థ రూపంలో

వున్నాయి. ఏ రూపంలో వున్నా దోపిడి ఒకటేకాదు. దేని రూపం దానిది. దేని దోపిడి విధానం దానిది. అందువల్ల ఆ దోపిడీ రూపం, విధానం, స్వభావం పోవడానికి ఆయా ప్రత్యేక కార్యక్రమాలు, విప్లవాలు అవసరమవుతాయి.

ఉదాహరణకు, మనదేశంలో కొందరు పెట్టుబడిదారీ దోపిడీ విధానమే ప్రధాన వైరుధ్యం అంటారు. వీళ్ళు తీసుకునే పోరాట రూపాలు, ఆశించే విప్లవం పెట్టుబడిదారీ రూపాల దోపిడిని నిర్మూలిస్తూ సోషలిజాన్ని లక్ష్యం చేసుకుంటుంది. అందువల్ల కార్మికవర్గం ఎక్కువ వున్నచోట, పట్టణ ప్రాంతాల్లోను వీరు కేంద్రీకరించవచ్చు. మరికొందరు ఈ దేశంలో నయావలస దోపిడీ విధానం ప్రధానవైరుధ్యం అంటారు. అందుకనువుగా పోరాట రూపాలు, వ్యూహం, ఎత్తుగడలు ఆచరణను తీసుకుంటారు. ఇంకొందరు ఈ దేశంలో – అర్థ భూస్వామ్య, అర్థవలస, దోపిడీ విధానం ప్రధాన వైరుధ్యం అంటారు. అందుకు అనువైన పోరాటరూపాలు, వ్యూహం ఎత్తుగడలు తీసుకుంటారు.

అందువల్ల దోపిడి రూపాన్ని అనుసరించి పోరాట రూపాలుంటాయి. మనదేశంలో వర్ణవ్యవస్థపై బుద్ధుడు చేసిన విప్లవం కులవ్యవస్థకు దారితీసిం దంటారు. బ్రాహ్మణీయ భావజాలం బతికి బట్టకట్టడానికి వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ, వాటిద్వారా కొనసాగే దోపిడి విధానం కారణం. అందువల్ల యీ రూపాల్లోని దోపిడిని, అణిచివేతను, అసమానతను తొలగించడానికి యిందుకు సంబంధించిన నిర్దిష్ట రూపాలు, వ్యూహం, ఎత్తుగడలు ఆచరణ అవసరమవుతాయి.

వర్గ దృక్పథం ద్వారానే వర్గాలు అదృశ్యమయ్యే క్రమం అంచనా వేయబడింది. వర్గదృక్పథంతో ఆచరిస్తే వర్గాలు అదృశ్యం కావడం ఎలా సాధ్యమో అలానే కుల తాత్వికతను స్త్రీ తాత్వికతను లెక్కలోకి తీసుకోవడం, ఆచరించడం ద్వారానే కులసమస్య, స్త్రీ సమస్య అదృశ్యమయ్యే క్రమాలు ఉత్పన్నమవుతాయి.

మార్క్సిజం ప్రకారం దేని పరిష్కారం దానిలోనే ఉంటుంది

కులం పరిష్కారం వర్గంలో ఎలా ఉంటుంది? కులంలోనే ఉంటుంది. ఏమంటే గతితర్కం, మార్క్సిజం ప్రకారం ప్రతి వస్తువులో అది అయినదీ వుంటుంది, అది కానిదీ వుంటుంది. అనగా ప్రతి వస్తువులో విరుద్ధాంశాలుంటాయి. వాటిమధ్య ఐక్యత వుంటుంది పోరాటం వుంటుంది. ఏదైనా సరే దాని పరిష్కారం దానిలోపలే వుంటుంది. దాని వెలుపలది బాహ్యా వాతావరణంగా పనిచేస్తాయి. ఉదాహరణకు మార్క్సిజం ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు, కార్మికులు అనే రెండు విరుద్ధాంశాలుంటాయి. కార్మికవర్గం ఈ వైరుధ్యాన్ని పరిష్కరిస్తుంది. ఇది

యింతదాకా చెప్పుకొస్తున్న గతితార్కిక ప్రాథమిక సూత్రం. అందువల్ల కులం యొక్క పరిష్కారం కులానికి వెలుపల వర్గదృక్పథంలోనో మరి దేన్లోనో వుండదు. కులంలోనే వుంటుంది. అందువల్ల వర్గదృక్పథంలో కుల దృక్పథాన్ని, కుల తాత్వికతలో వర్గదృక్పథాన్ని సమన్వయించి చూడాల్సివుంటుంది. స్త్రీ సమస్య కూడా యింతే. కులం యొక్క దృక్పథంలో ఆచరణలో కులం కాని అంశాల్ని వెలికితీసుకువచ్చి వర్గ, కుల పోరాట రూపాల్ని, వ్యూహం, ఎత్తుగడలు ఆచరణల్ని కొనసాగించడంద్వారా ఏకకాలంలో వర్గదృక్పథం రూపంలో దాగివుండే అగ్రకుల దోపిడీ స్వభావంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కుల దృక్పథాల రూపంలో దాగివుండే పాలకవర్గాల స్వభావం తేటతెల్లమౌతుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కులం గురించి, వర్గం గురించి రెండు దశల పోరాటాలు చేయవలసి వస్తున్నది. కులం లేకుండా వర్గాలు ఒకటే ఉంటే అందరికన్న ఎక్కువగా సంతోషించేది బీసీ, ఎస్సీ, ఎస్టీలే!

మహాత్మా జ్యోతిబా ఫులే "నిమ్న వర్గాల కులాల ప్రజలకై దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ భావజాలం కోసం జరిగే అన్వేషణకు భూమిక సిద్ధం చేశాడు". కొందరు 150 సంవత్సరాలక్రితం మార్క్సు దాన్ని శాస్త్రీయంగా చెప్పాడుకదా! అనుకుంటారు.

మార్క్సు ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు మ్యానిఫెస్టో రాస్తున్న సమయంలోనే యీ దేశంలోని దోపిడిని, కులవ్యవస్థను, సామాజిక అణిచివేతను వ్యతిరేకిస్తూ రచనలు చేయడంతోపాటు ఆచరణను కూడా ప్రారంభించాడు ఫూలే. మార్క్సు, ఫులేలు సమకాలికులు. ఇద్దరు వేర్వేరు పరిస్థితులలో పనిచేసారు.

అభివృద్ధి చెందిన దేశాల భావజాలాలు

ఆసియా, ఆఫ్రికా, అమెరికా ఆస్ట్రేలియా దేశాల నుండి దోపిడి చేసి కూడబెట్టిన సంపదతో రూపుదిద్దుకున్న యూరప్ దేశాల పారిశ్రామిక విప్లవం, దానినుంచి స్థిరపడిన పెట్టుబడిదారి విధానం, ప్రజాస్వామ్యం గల వ్యవస్థలో, దేశాల్లో వాళ్లు జీవించారు. అనగా మార్క్సిజం ఆసియా దేశాల దోపిడి నుండి పుట్టిన అభివృద్ధి తాలూకు ఉత్పత్తిలో ఒక భాగం. మహాత్మా జ్యోతిబాఫూలే దోపిడి చేయబడుతున్న వలస దేశంలో పుట్టారు. ఆసియా దేశాలలోని ఉత్పత్తిదారులైన శూద్రుల శ్రమశక్తులనుండి రక్తమాంసాల నుండి 350 ఏళ్లు జరిగిన దోపిడి నుండి యూరప్ పారిశ్రామిక విప్లవం పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెందింది. అందువల్ల నిజమైన పీడిత దృక్పథం ఆసియా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అమెరికాలోని రెడ్ ఇండియన్స్ నుండి రావల్సి ఉంది. ఇతర దేశాలను అణిచివేసి, దోపిడిచేసి అభివృద్ధి చెందిన

ప్రాంతాల, దేశాల దృక్పథంలో భాగమే మార్క్సిజం. పెట్టుబడిదారి విధానంలాగే మార్క్సిజం కూడా పెట్టుబడిదారి దేశాల కార్మిక వర్గ నాయకత్వ కేంద్రంగా విస్తరణను ప్రపంచ వ్యాప్త ఉద్యమాన్ని కోరుకుంది. అది అభివృద్ధి చెందిన దేశాల రెండవ పక్షమే. అక్కడి పెట్టుబడిదారులు అధికార పక్షమైతే, కార్మికులు ప్రతిపక్షం. ఒక దేశంలోని అధికార ప్రతిపక్షాలు అక్కడి అంతర్గత పరిణామాల పర్యవసానాలు. ఒక దేశంలోని ప్రతిపక్షం మరోదేశంలో అధికారపక్షం కావాలని కోరుకోవడం వంటిదే యూరప్ కార్మిక వర్గం నాయకత్వంలో విప్లవం జరగాలని కోరుకోవడం.

పీడిత ప్రాంతాలకు దేశాలకు, అభివృద్ధి చెందిన ప్రాంతాలకు, దేశాలకు మధ్య జీవితంలో, అవగాహనలో తేడాలు ఉంటాయి. అవి ఆయా దేశాల తత్త్వ శాస్త్రాల్లో సామాజిక ఉద్యమాల్లో ప్రతిఫలిస్తాయి. మార్క్సు, ఎంగెల్స్‌లు పెట్టుబడిదారీ, ప్రజాస్వామ్య దేశాల్లో, ఫులే నేమో వలస, కుల, ఫ్యూడల్ వ్యవస్థ గల దేశంలో జీవించిన సమకాలికులు. జ్యోతిబా ఫులే, మార్క్సు, ఎంగెల్స్, ప్రౌదాన్‌లు కలుసుకునే అవకాశం వచ్చివుంటే వాళ్ళ ఆచరణలో భావజాలంలో మార్పు జరిగివుండేది. మార్క్సు కూడా ఫులేలాగా ఆలోచించి వుండేవాడు.

మార్క్సు, ఎంగెల్స్‌లు పెట్టుబడిదారీ, ప్రజాస్వామ్య దేశాల్లో జీవించారు. కనుక దాని తరువాయి క్రమమైన సోషలిస్టుక్రమాన్ని ఆశించారు. సోషలిజం భావన మార్క్సు, ఎంగెల్స్‌కు ముందే వ్యాప్తిలో వుంది.

మార్క్సు, ఎంగెల్స్ ప్రతిపాదన శాస్త్రీయ సోషలిజం కాదు అది తార్కిక సోషలిజం మాత్రమే !

జ్యోతిబాఫులే సోషలిజాన్ని ఊహించే అవకాశంలేదు. ఎందుకంటే అతడున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ కాదు. అతడున్నది వలస, ఫ్యూడల్, బ్రాహ్మణిజపు కులవ్యవస్థలో. ఫ్యూడల్, బ్రాహ్మణిజపు కులవ్యవస్థ కరుడుగట్టి అశేష ప్రజల్ని అణిచివేస్తూ అభివృద్ధిని వెనక్కి లాగుతున్నాయి. కొందరి సుఖాలకోసం ఎందరినో బలిపశువులను గావిస్తున్నాయి. తోటమాలి కులంలో పుట్టిన శూద్రుడైన మహాత్మా జ్యోతిబా ఫులే కులవ్యవస్థ చేసిన కట్టడులను, అణిచివేతను, అమానుషత్వాన్ని స్వయంగా అనుభవించి వున్నాడు. దాన్నించి ఆయన ఈ దేశంలోని నిజమైన శ్రామికవర్గ ప్రత్యామ్నాయ దార్శనికతను మనకు అందించాడు. ఎవరో అన్నట్టు అన్ని సృష్టించడానికి మార్క్సు, ఎంగెల్స్‌లు యింద్రజాలికులు కారు! అట్లే ఫులే ఇంద్రజాలికుడు కాడు.

మార్క్సు, ఎంగెల్స్ చేసిన అన్వేషణేమిటంటే సోషలిజం తాలూకు ఊహలను తార్కిక సత్యాల ఆధారంగా పునర్‌నిర్మించడం. శాస్త్రీయ సోషలిజం అని దానికి

పేరుపెట్టారు. నిజానికి శాస్త్రీయ సోషలిజం అనకూడదు. అది తప్పుడు అవగాహన. దాన్ని "తార్కిక సోషలిజం" అనాలి. ఎందుకంటే ప్రయోగాల ద్వారా నిరూపణ కాకముందు దేన్నైనా శాస్త్రీయం అనడం శాస్త్ర విరుద్ధం. అందువల్ల మార్క్సు ఎంగెల్స్‌ల ప్రతిపాదనలు అన్ని తార్కికసోషలిజంకు, హేతుబద్ధ సోషలిజంకు సంబంధించినవే.

శాస్త్రీయ విద్యావిధానం కాదు దాన్ని హేతుబద్ధ విద్యావిధానం అనాలి!

అలాగే ఒకదాన్ని "శాస్త్రీయ విద్యావిధానం" అని అనాలంటే ప్రయోగ పూర్వకంగా నిర్ధారించిన తర్వాతే సాధ్యం!. తార్కిక సత్యాల ఆధారంగా ప్రతిపాదించే విద్యావిధానం శాస్త్రీయ విద్యావిధానం కాదు. ఏమంటే అది ఆచరణలో నిరూపించబడలేదు. దాన్ని తార్కిక విద్యావిధానం అనాలి. లేదా హేతుబద్ధ విద్యావిధానం అనాలి.

వందలఏళ్ళుగా చదువే నిరాకరించబడిన పీడిత కులాలకు, పైగా బాలికలకు ఎన్నో కష్టాలకోర్చి బడి పెట్టి నడిపిన మొదటి భారతీయుడు ఫూలే. అణగారిన కులాల బాలికలకు విద్య గరపడంవల్ల ఆ కులాలన్నీ విద్యావంతం అయ్యే అవకాశం వుందని భావించాడు. భారత విద్యారంగంలో అతడు చేసిన యీ కృషిరీత్యా, భారతీయ విద్యార్థులకు అతడు మార్క్సు కన్నా ఎక్కువ గౌరవనీయుడు.ఎంగెల్స్, మార్క్సులు, లెనిన్, మావోలు మనకిట్లా చేసిందేమీలేదు.

కనీసం విప్లవం విజయవంతం అయ్యాక, సోషలిజం వచ్చాక రష్యా, చైనా వాళ్లు మనదేశంలో స్కూళ్లు పెట్టడం కాని, పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు ఉచితంగా ఇవ్వడం గాని స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం గాని చేయలేక పోయారు. వారి సోషలిజం, వారి అభివృద్ధి వారికే పనికొచ్చింది. ధనవంతుల సొమ్ము ధనిక దేశాల సొమ్ము వాళ్ల వద్దే ఉన్నప్పుడు పేదవాళ్లకు ఒరిగేదేముంది?

మనకు ఇపుడున్నట్టుగా 150 ఏళ్ళక్రితం స్కూల్లు వుండేవికావు. ఏ బ్రాహ్మణ అయ్యవారో తన యింటి అరుగుమీదో, పాకలోనో చెప్పించే చదువు. అదీ ఏవో శ్లోకాలు, ఏవో నాలుగు లెక్కలు చెప్పే చదువు. అందులోకి బ్రాహ్మలు, కోమట్లు వంటివాళ్ళకు తప్ప ప్రవేశం వుండేదికాదు. అమావాస్య, పౌర్ణమి, పాడ్యమి వంటివి సెలవులుండేవి. ఇతర కులస్థులెవరైనా చదువు నేర్చుకోవడానికి వస్తే చెప్పడానికి నిరాకరించేవారు. ఒకవేళ చెప్పినా అస్పృశ్యత పాటించి దూరాన వుంచి చెప్పేవారు.

శూద్రులైన సాతానిఅయ్యవార్లు (చాత్తాద వైష్ణవులు) శూద్రులకు అతి శూద్రులకు చదువు చెప్తుండేవారు. అలాంటి కాలంలో నిత్యజీవితంలో పనికివచ్చే చదువు అనగా

శాస్త్రీయ విద్యా విధానాన్ని ఉన్నంతలో ఆచరించి చెప్పిన మహనీయుడు జ్యోతిబా ఫులే, అతని సతీమణి సావిత్రీబాయి ఫులే.

మార్క్సు భారతదేశంలో పుట్టివుంటే జ్యోతిబాఫులే చేసిన పనినే చేసేవాడు. మనకు 1857 తిరుగుబాటు ఎలా మొదటి స్వాతంత్ర్య పోరాటం అయిందో, అలాగే జ్యాతిబా ఫులే ఆధునిక భారత చరిత్రలో మొట్టమొదటి సామాజిక విప్లవకారుడయ్యాడు. రాజారామ్మోహన్‌రాయ్, బాలగంగాధర్ తిలక్, కందుకూరి వీరేశలింగం, గురజాడ వంటి వాళ్ళు సంఘసంస్కర్తలు కారు. వాళ్లు బ్రాహ్మణ కుల సంస్కర్తలు. వారు వాళ్ళ కులాలని సంస్కరించుకోగా ఫులే సమాజాన్ని పునర్‌నిర్మించే ప్రయత్నాన్ని ప్రారంభించాడు. అందుకే వర్ణ, కులవ్యవస్థ అలాగే కొనసాగాలని కోరే బాలగంగాధర్ తిలక్ ఫులేని నిరంతరం వ్యతిరేకించాడు. ద్వేషించాడు.

మనిషి నిరంతరం అన్వేషిస్తుంటాడు. అన్వేషణ మానవ సహజ స్వభావం. అన్వేషణ నుంచే సైన్స్ కళలు రూపొందాయి. అభివృద్ధి చెందాయి. ఏ అన్వేషణ లేకపోతే మానవసమాజం అంతరిస్తుంది. లెనిన్, స్టాలిన్, మావో మొదలైన వాళ్ళంతా అన్వేషించినవాళ్ళే, ఏ అన్వేషణా లేకపోతే మార్క్సిజం-లెనినిజం మావో ఆలోచనా విధానం అని ఎందుకంటాం? అంబేద్కరిజం, బుద్ధిజం అని ఎందుకంటాం?

జీవితం నిరంతరం కొత్త సమస్యల్ని, కొత్త పరిష్కారాల కోసం ముందుకు తెస్తుంది, వాటి కారణాలను, పరిష్కారాలను అన్వేషించి ఆచరిస్తూ పరిష్కరిస్తూ ముందుకు సాగడమే మనిషి జీవితం. అదే చరిత్ర పరిణామం.

అందువల్ల సత్యాన్వేషణ నిరంతరమైనది. అన్నీ మార్క్సులోనే వున్నాయిష! అనుకుంటే పూర్వం అన్నీ వేదాల్లోనే వున్నాయిష! అనే విశ్వాసంలోకి వెళ్లిపోతాము. నిరంతర సత్యాన్వేషణలో కలిగిన "జ్ఞానక్రమం, తదితర కారణాలవల్లే" ఈ దేశంలో విప్లవ పార్టీలు అవిభక్త కమ్యూనిస్టు పార్టీ నుండి మూడు పువ్వులు ఆరు కాయలుగా చీలికలవుతూ అభివృద్ధి చెందుతున్నాయి!

మార్క్సిస్టులు - అంబేద్కరైట్లు

అంబేద్కర్‌ను యాంటి మార్క్సిస్టు అని కొందరు మార్క్సిసుల్టు, నక్సలైట్లుభావిస్తారు. అందుకు అంబేద్కర్‌నుండి కొన్ని ఉల్లేఖనలు తీసుకుంటారు. దీన్ని భారతదేశం కేంద్రం చేసి పరిశీలిస్తే "మార్క్సిస్టులు, నక్సలైట్లు యాంటీబుద్ధిస్టులు, యాంటీ అంబేద్కరైట్లు, యాంటీఫూలేయైట్లు, యాంటీబీసీ, ఎస్సీవాదులు" అని చెప్పాల్సి వస్తుంది.

1992 జూన్‌లో విజయవాడలో చేసిన శరద్‌పాటిల్ ప్రసంగ పాఠం

"అంబేద్కరిజం- మార్క్సిజం"ను నేను అనువదించి "నలుపు" పక్షపత్రిక ఆగస్టు 1992 రెండు సంచికల్లో ప్రచురించాను. దాన్ని మార్క్సిజంపై ఆసక్తి గలవాళ్ళందరూ చదవడం అవసరం. అందులో ఆయన ఫులే, అంబేద్కర్‌లను బూర్జువా డెమోక్రాట్లు అని అర్థం యిచ్చేవిధంగా ప్రస్తావించాడు.

బూర్జువా డెమోక్రాట్లయిన ఫ్యూర్‌బా, హెగెల్‌ల తత్వశాస్త్రాలను సమన్వయిస్తే నేటి విప్లవకర మార్క్సిస్టు తత్వశాస్త్రం సాధ్యమైనపుడు ఫులే, అంబేద్కర్‌ల తాత్విక దృక్పథంను మార్క్సిజంతో సమన్వయించడంద్వారా విప్లవకర భారతీయ మార్క్సిస్టు తత్వశాస్త్రం రూపొందుతుంది అని నిర్ధారించాడు.

ఆ మాటకొస్తే క్రీ॥శ॥ రెండవ శతాబ్దానికి చెందిన ఆచార్య నాగార్జునుడి శూన్యవాదం, బౌద్ధం తాలూకు మాధ్యమిక వాదం స్థాయికి యూరప్ దేశాలు ఎదగడానికి కాంట్, హెగెల్, ఫ్యూర్‌బాలు పుట్టేదాకా (1500 ఏళ్లు) ఆగాల్సి వచ్చింది. అనగా భారతీయ తత్త్వశాస్త్రం , భారతీయ గతితర్కం రెండవ శతాబ్దం నాటికి అభివృద్ధి చెందిన స్థాయికి ఎదగడానికి యూరప్ దేశాలు పదిహేను వందల సంవత్సరాలు తీసుకున్నాయి. యూరప్ గతితర్కం కన్నా దాని మౌలికాంశాలను అందించిన గ్రీకు తత్త్వశాస్త్రం కన్నా, గ్రీకు గతితర్కం కన్నా భారతీయ గతితర్కం, ముఖ్యంగా బౌద్ధ గతితర్కం, ప్రతీత్య సముత్పాదవాదం ఎంతో సంపన్నమైనవి. సమగ్రమైనవి. స్టాలిన్ కాలంలో సంపాదకత్వం వహించి స్టేర్ బాట్స్‌స్కీ వెలువరించిన ఆసియా దేశాల తత్త్వశాస్త్రాలను చదివితే యిది ఎరుకవుతుంది.

ప్రపంచంలో మొట్టమొదట సోషలిజాన్ని ప్రతిపాదించి నిర్మించింది బుద్ధుడు. బౌద్ధసంఘ నిర్మాణం, అష్టాంగ మార్గం, ప్రేమ, కరుణ, ప్రజ్ఞ శీలం మొదలైనవి బౌద్ధ సోషలిజం ఆచరించి చూపింది. బౌద్ధ సోషలిజం నుండి క్రైస్తవం పుట్టింది. ఇస్లాం పుట్టింది.

శరద్ పాటిల్ చెప్పినట్టు వలసగా మారిన ఫ్యూడల్ కులవ్యవస్థలో బూర్జువా డెమోక్రాట్‌గా జ్యోతిబా ఫులే ఆచరణ సాగించాడని కాసేపు అనుకుందాం. అయితే అతడు విప్లవకారుడు కాకుండాపోడు. స్పార్టకస్ బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. అలా అతడు విప్లవకారుడయ్యాడు. జ్యోతిబాఫులే కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. అలా అతడు విప్లవకారుడయ్యాడు.

కులవ్యవస్థ అంటే ఏమిటి? అదొక తాత్విక రాజకీయ అర్థశాస్త్రం. అది ఫ్యూడల్, రాజకీయ అర్థశాస్త్ర ఉత్పత్తి సంబంధాలను, సామాజిక ఉత్పత్తి సంబంధాలను ప్రతిపాదిస్తూ ఆచరించే గొప్ప తాత్విక రాజకీయ అర్థశాస్త్రం. అది యితర దేశాల్లోని

అర్థశాస్త్రాల్లాగా కేవలం ఒక రాజకీయ అర్థశాస్త్రంగా మిగిలిపోలేదు. అది సమస్తరంగాల్లో, కళల్లో, శాస్త్రాల్లో, దృక్పథాల్లో, విలువల్లో తన ఆచరణను ఉత్పన్నం చేసింది. అది తత్వశాస్త్రంగా, రాజకీయ అర్థశాస్త్రంగా, సంస్కృతి శాస్త్రంగా విడి ఉనికిని కోల్పోయి సామాజిక దృక్పథంలో ఆచరణలో భాగమై కొనసాగుతున్నది.

కమ్యూనిజం ఏర్పడే క్రమంలో తత్వశాస్త్రం తన విడి ఉనికిని కోల్పోయి ప్రాపంచిక దృక్పథంలో భాగంగా కొనసాగుతుందని ఎంగెల్స్ అంటాడు. ఆ పనిని కులవ్యవస్థ అనే రాజకీయార్థిక, తత్వశాస్త్రం మనదేశంలో ఎన్నడో సాధించింది. అందువల్ల అది దృక్పథంలో, ఆచరణలో భాగంగా కొనసాగుతూ ఒక శాస్త్రంగా తన విడి ఉనికిని కోల్పోయింది.

గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ అంటే కులవ్యవస్థే

కులవ్యవస్థ అనే నిర్దిష్ట భారతీయ తాత్విక రాజకీయ అర్థశాస్త్రం యొక్క సృష్టే. భారతీయ నిర్దిష్ట గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ. సోషలిజంలోని సోవియట్లు, కమ్యూన్లు అని ఏవైతే పిలిచారో ఏ లక్షణాలతో పిలిచారో దాదాపు అవన్నీ కులవ్యవస్థ అనే తాత్విక, రాజకీయ అర్థశాస్త్రం, దాని ఆచరణ నిర్మించిన గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థలో ఫ్యూడలిజం పరిమితులకు లోబడి వున్నాయి. కులవ్యవస్థగా కరుడుగట్టక ముందటి రూపం గురించి చెప్పాల్సివస్తే అది ఆనాటి ప్రపంచంలోనే అత్యున్నతమైన మహోన్నతమైన తాత్విక, రాజకీయ, అర్థశాస్త్రం.

"చారిత్రక భౌతికవాదం ప్రకారం వాస్తవ జీవితంలోని ఉత్పత్తి పునరుత్పత్తే అంతిమంగా నిర్ణాయక శక్తులవుతాయి. మార్క్సు గానీ, నేను గానీ యింతకు మించి ఏమీ చెప్పలేదు. అందుచేత దీనికి ఆర్థికాంశం ఒక్కటే నిర్ణాయక శక్తి అని అర్థం తీస్తే, అర్థరహితమైన శుష్కవాదంగా దానిని మార్చివేసినవారవుతారు." అని అంటాడు ఎంగెల్స్.

అంబేద్కర్ దీన్ని తన మాటల్లో స్పష్టం చేశారు. "అధికారం అంటే ఆర్థికాధికారం ఒక్కటే అనే సిద్ధాంతాన్ని మానవ సమాజ పరిశోధకులెవరూ అంగీకరించరు" అంబేద్కర్ మాట ఎంగెల్స్ మాటలకు సన్నిహితమైన వ్యక్తీకరణ.

అంబేద్కర్ "సోషలిస్టుల వాదనలో భ్రమ ఎక్కడ వున్నదంటే – ఐరోపాలోని ప్రస్తుత సమాజంలో ఆస్తే అధికారానికి మూలాధారంగా వుంటున్నది కాబట్టి. ఇండియాలో కూడా అలాగే వుంటుందని వూహిస్తున్నారు..." అని స్పష్టం చేస్తారు. కాని ఎంగెల్స్ ఎంత వద్దని చెప్పినా మార్క్సిస్టులు, నక్సలైట్లు విచిత్రంగా ఆర్థికాంశాలకే పరిమితమైయ్యారు. ఇలా చారిత్రకభౌతికవాదం మనదేశంలో అగ్రకులతత్వ

Dalithayugam-1
03-09-09
94

చారిత్రకభౌతికవాదంగా మార్చబడింది. దాన్ని శ్రామికకుల,శూద్ర చారిత్రకభౌతికవాదంగా మార్చాలి.

కొందరు కులసమస్య పరిష్కారం గురించి ఇలా అంటారు. ఆర్థికంగా బలపడితే, పేదరికం తొలగిపోతే కులసమస్య పరిష్కారమౌతుంది అని ! ఇది తప్పుడు అవగాహన. దీని అర్థం పేదవాళ్లను, ఆర్థికంగా లేని వారిని గౌరవించనవసరం లేదని కులవివక్షతతో చూడడం సరైనదే అని చెప్పడమే! ఇది దోపిడి వర్గాల, దోపిడి కులాల దృక్పథం. ఇది మార్క్సిజం ఎలా అవుతుంది? భారతదేశంలో మార్క్సిజం బ్రాహ్మణిజానికి ముసుగుగా, రక్షణకవచంగా ఎలా పనికొస్తున్నదో చెప్పడానికి ఇదొక రుజువు. పేదలైనా గౌరవించాల్సిందే. ఆర్థికంగా లేకపోయినా ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అని రాజ్యాంగం రాసుకున్నాం. భారతరాజ్యాంగం కన్నా వెనుకబడిపోయారు మార్క్సిస్టులు. ఆర్థికంగా బలపడ్డ తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలను, పేదలను వివక్షలేకుండా గౌరవిస్తారనడం ఆర్థికవాదం కాక మరేమిటి? సమాజానికి వాళ్లు అందిస్తున్న సందేశం ఇది !

నిజానికి భారతదేశంలో ఆస్తి వ్యవస్థ యూరపులోలాగా లేదు. బ్రిటిష్‌వాళ్ళు ప్రవేశించాక చాలారోజులదాకా మనదేశంలో మార్క్సిస్టు అర్థంలోని "వ్యక్తిగత ఆస్తి" విధానంలేదు. బ్రిటిష్‌వాళ్ళు పన్నుల వసూళ్ళ కోసం చేపట్టిన విధానం క్రమంగా భూమిని వ్యక్తిగత ఆస్తిగా మార్చింది. ఇది క్రీ.శ. 1840 సం॥ నుండి 1860 సం॥ మధ్య జరిగింది.

అటు తర్వాత 1907లో వైశ్యులు వైశ్య సంఘం పెట్టుకున్నారు. ఆ తరువాత రెడ్డి సంఘం, కమ్మ సంఘం పెట్టుకున్నారు. కులసంఘాల ద్వారా వాళ్లు సంఘటితమయ్యారు. రెడ్డి కులానికి కట్టమంచి రామలింగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి మొదలైనవాళ్లు నాయకత్వం వహించారు. కమ్మ కుల సంఘానికి త్రిపురనేని రామస్వామి చౌదరి నాయకత్వం వహించారు. ఇలా ఈ మూడు కులాలు సంఘటిత పడి 1910 నుంచి 1950 వరకు ఆర్థికంగా, సాంఘికంగా బలపడ్డారు. 1920 నుండి శూద్రుల నుండి కమ్మ, రెడ్లు అగ్రకులాలుగా చెప్పుకోవడం ప్రారంభించారు. ఆస్తులు, పొలాలు సంపాదించుకున్నారు. కొత్తవ్యాపారాల్లోకి, రాజకీయాల్లోకి, పరిశ్రమల్లోకి దిగారు. అగ్రకులాలు ఎదిగిన క్రమం అంతా ఇటీవలిదే. వెనుకట ఇంత వ్యత్యాసాలు లేవు. ఇన్ని ఆస్తులు లేవు. భూముల మీద ఎవరి హక్కు ఉండేది కాదు. ఈ విషయం తెలిసే అంబేద్కర్ కేవలం 60, 70 ఏళ్లల్లో వ్యక్తిగత ఆస్తిగా మారిన భూములను భూస్వాములనుండి, జమీందార్ల నుండి నామమాత్రపు ధర కట్టి ఇచ్చి మొత్తం భూమిని జాతీయం చేయాలని కోరారు. కమ్యూనిస్టులు దీనికి వ్యతిరేకంగా భూమిని వ్యక్తిగత

ఆస్తిగా మార్చే పోరాటాలను తీసుకున్నారు.

ఆస్తి హక్కులేని సోవియట్ రష్యాలో పెట్టుబడిదారి విధానం ఎలా వచ్చిందో ఆశ్చర్యం! సోవియట్ విప్లవం రివిజనిజంగా మారిపోయింది అని అంటున్నారు. ఇటీవలి సోవియట్ పరిణామాలు దేన్ని తెలియజేస్తున్నాయి? విప్లవం వచ్చాక వ్యక్తిగత ఆస్తి వ్యవస్థ దాదాపు నిర్మూలించబడిందన్నారు. మరి కొత్తగా వ్యక్తిగత ఆస్తి వ్యవస్థ మళ్ళీ ఎలా ప్రారంభమైనట్టు? దానికి మూలాధారం ఏమిటి?

పదార్థం చైతన్యంగా చైతన్యం పదార్థంగా మారుతుందన్నారు. చైతన్యం యొక్క ఒక వ్యక్తీకరణే పదార్థం అనీ, పదార్థం యొక్క ఒక రూపమే చైతన్యం అనీ మనం శాస్త్ర విజ్ఞానక్రమంలో తెలుసుకున్నాం.

భావాలు కూడా ఆస్తి రూపాలే

భావాలు కూడా ఆస్తి రూపాలే. ఆస్తి అనేది ఒక భౌతిక పదార్థరూపం. అది చైతన్యరూపంలోనూ వుంటుంది. అనగా జ్ఞానం అతని ఆస్తి అని అంటాం. అంటే ఏమిటి? పదార్థం, పదార్థ విజ్ఞానం, జ్ఞానం రూపంలో అతని ఆస్తిగా వుందని! మరిన్ని వివరాలకు నా "గతితర్క తత్వ దర్శనభూమిక" చూడండి. భౌతికరూపంలో వున్నది మాత్రమే ఆస్తి కాదు. అది భావాల రూపంలో సంస్కృతి రూపంలో, అధికారరూపంలో కూడా ఉంటుంది. చైతన్యంయొక్క ఎన్ని రూపాల్లోనైనా ఆస్తి వుండవచ్చు. చైతన్యం, నిర్వహణ సామర్థ్యం. జ్ఞానం, భావజాలం, అధికారం అనేది కూడా ఒక పదార్థమే.

మనదేశంలోనే నూరుకు పైన వివిధ రకాల మార్క్సిజాలున్నాయి. ప్రతి ఒకరు మరొకర్ని యాంటి మార్క్సిస్టులని ఆధారాలతోసహా నిరూపించ గలుగుతున్నారు. తమ వెంట జనాన్ని సమకూర్చుకో గలుగు తున్నారు.

అందువల్ల అంబేద్కర్‌ను యాంటి మార్క్సిస్టు అనే నిరూపించడానికి పెద్ద శ్రమపడనక్కరలేదు. తోటి విప్లవకారుల్నే యాంటీ మార్క్సిస్టులుగా నిరూపించ గలిగినపుడు యిది ఎంతో సులువు. ఈ స్థితిలో నాది కూడా మార్క్సిజమే అని నిర్ధారించుకునే హక్కుంది. కానీ, నాది మాత్రమే మార్క్సిజం అనే హక్కు లేదు. ప్రపంచ కార్మికుల్లారా ఏకం కండి! అనే ప్రపంచంలోని కమ్యూనిస్ట్ పార్టీలన్నీ ముందు తాము ఒక్కటైయ్యే దాక అంబేద్కర్‌ను మార్క్సిజానికి సోషలిజానికి చెందినవాడని చెప్పే ప్రయత్నం చేసే హక్కుంది గానీ యాంటి మార్క్సిస్టు అని చెప్పే హక్కు ఎవరికీ లేదు. ఇదొక అంశం. అంబేద్కర్ ప్రపంచ సోషలిస్టు నిర్మాతల్లో ఒకరు. నేను దీన్ని "అంబేద్కరిజం - సోషలిజం" వ్యాసంలో వివరంగా చర్చించాను.

Dalithayugam-1
03-09-09
95

అంబేద్కరిజంతో మార్క్సిస్టులను పోల్చిచూడ్డం ద్వారా అగ్రకుల స్వభావం స్పష్టమౌతుంది. అంబేద్కరిజాన్ని, బీసీ వాదాన్ని వ్యతిరేకించే వాళ్ళంతా యాంటీ అంబేద్కరైట్లు , యాంటీ బీసీవాదులు.

యాంటి బీసీవాదులంతా బీసీవాదాన్ని వ్యతిరేకిస్తారు. అయితే యాంటి మార్క్సిస్టులంతా మార్క్సిజాన్ని వ్యతిరేకించేవాళ్ళనే సూత్రీకరణ సరైనది కాదు. మార్క్సిజం - మార్క్సిజం రూపంలోనూ, యాంటీ మార్క్సిజం రూపంలోనూ కొనసాగుతుంది. ఉదాహరణకు భావవాదంలో భౌతికవాదం వున్నట్టే భౌతికవాదంలో భావవాదం వుంటుంది. స్త్రీలో పురుషుడుంటాడు, పురుషుడిలో స్త్రీ వుంటుంది. అందువల్లే స్త్రీలో పురుషుడు ఉత్పన్న కాగలుగుతున్నాడు. పురుషుడి ద్వారా స్త్రీ ఉత్పన్నం కాగలుగుతున్నది. అది ఎలా జరుగుతున్నదో సైన్సు విద్యార్థులకు, ఎక్స్, వై క్రోమోజోముల చర్చతో వివరంగానే తెలుసు.

యాంటి మార్క్సిజంలో మార్క్సిజం కూడా వుంటుంది. మార్క్సిజంలో యాంటి మార్క్సిజం వుంటుంది. చాలామంది ఎదుటివారిలోని మార్క్సిజంలో గల యాంటి మార్క్సిజాన్ని వెతికే ప్రయత్నం చేయడమే తప్ప మార్క్సిజాన్ని వెతకడంగాని, యాంటీ మార్క్సిజంలోని మార్క్సిజాన్ని వెలితికీసి కలుపు కోవడం గాని చేయడంలేదు. తద్వారా మార్క్సిజం చీలికలు పీలికలై ప్రతి దాన్లో నిజం యొక్క ఒక ముక్క వుంటున్నది. దాన్ని మాత్రమే మొత్తం మార్క్సిజం అంటున్నారు,

అందువల్ల ప్రతిదీ వాస్తవమే. ఆ వాస్తవాలలో గతితార్కిక చలనసూత్రాలున్నాయి. ముందే చెప్పినట్లు మార్క్సిజం ప్రకారం ప్రతి వస్తువులో పరస్పర విరుద్ధ అంశాలుంటాయి. ప్రతి వస్తువులో అది అయినదీ వుంటుంది. అది కానిదీ వుంటుంది. మార్క్సిజంలో కూడా పరస్పర విరుద్ధ అంశాలుంటాయి.

అందువల్ల కొటేషన్లు నాది కూడా మార్క్సిజమే అని వివరించు కోవడానికి పనికివస్తాయి. కానీ నాది మాత్రమే మార్క్సిజం నాది మాత్రమే సత్యం అని దబాయించడానికి ఉపయోగించకూడదు. అందువల్ల ఇరుపక్షాలు కూడా మార్క్సిజం తాలూకు కొటేషన్లతో చేసే యుద్ధం మార్క్సిజంరూపంలో సాగే యాంటీ మార్క్సిస్టు యుద్ధం. అందులోనూ కొంత మార్క్సిజం వుంటుంది.

ప్రతిసారీ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోల కొటేషన్ల కోసమో వారి అభిప్రాయాల కోసమో పరిగెత్తితే యింకా పాలుతాగే దశలో వున్నారని అర్థం. పిల్లలు ప్రతిసారీ మా అమ్మకు చెప్తా చూడు అని తోటిపిల్లల్ని హెచ్చరిస్తారు. కొటేషన్లివ్వడం అనేది "ఆc! మా మార్క్సు తాతయ్యకు చెప్తా చూడు" అని పిల్లలు చెప్పే కోవలోనిది.

పెద్ద పెరిగాక కూడా యిదే అలవాటయితే మరోసారి మీరు సొంత విచక్షణ కోల్పోయిన వారవుతారు. విద్యార్థి యువజనులురా! మీరు నిరంతరం సొంత విచక్షణని, వ్యక్తీకరణని, జ్ఞానక్రమాన్ని అభివృద్ధి పరుచుకోవలసివున్నది. విద్యార్థి దశలో వున్న మీకు యిది మరింత వర్తిస్తుంది.

ఎవరినీ గుడ్డిగా నమ్మకండి. మీ నాయకుల్ని, మీ పత్రికలు చెప్పేవాటిని కూడా గుడ్డిగా నమ్మకండి. ప్రతిదాన్నీ ప్రశ్నించండి. మార్క్సిజాన్నీ ప్రశ్నించండి. అన్నీ వినండి. మీ సొంత నిర్ణయాలకు రండి. పాతవాళ్ళ భావాలు వాళ్ళ జీవితంలాగే పాతపద్ధతికి అలవాటుపడి వుంటాయి. మీరు కొత్త పద్ధతుల్ని, కొత్త జీవిత లక్ష్యాల్ని అలవరచుకోవలసి వున్నది.

మీరీ సమాజాన్ని పాతతరంకన్నా అభివృద్ధికరమైన ఆలోచన, ఆచరణ ద్వారా ముందుకు తీసికెళ్ళవలసివున్నది. మీరొక సమగ్ర ప్రాపంచిక దృక్పథంను ఏర్పరచుకోవలసివున్నది. మీరు సమస్త రంగాల్లో సమగ్ర సామాజిక వికాసాన్ని సాధించాల్సి వున్నది. సమగ్ర సామాజిక వికాసమే సమగ్ర సామాజిక విప్లవం. ఇందులో భాగంగా "బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజాస్వామిక విప్లవం" కోసం ముందుకు కదలాలి. మా పాతతరం సృష్టించిన యీ చీలికల పేలికల ఉద్యమాల చరిత్రకు ఫుల్‌స్టాప్ పెట్టి ప్రేమ, స్నేహం, సహృదయత, పరస్పర సహకారం, పరస్పర గౌరవం ప్రాతిపదికగా మనిషి ప్రాథమికంగా, మీరు ఒక్కటిగా కలిసి కృషిచేయవలసివున్నది. మనవాళ్ళు చెప్పింది వింటే పాత పద్ధతిలోనే పరస్పర విద్వేషాలు, సంహారకాండ మన రక్తంలోకి ప్రవహిస్తాయి.

కొందరు హిందూమతం కొనసాగినంతకాలం కులం, కులం కొనసాగినంతకాలం, సామాజిక అసమానతలు కొనసాగుతాయని అనడంలో ఒక ధర్మాగ్రహం ఉంది. వాస్తవం వుంది. అయితే అది పూర్తి సత్యం కాదు. రాజకీయ అధికారం సాధించకుండా మతంమారినా పెద్దగా ప్రయోజనంలేదని చరిత్ర నిరూపిస్తున్నది. రాజకీయ అధికారమే బౌద్ధం, ఇస్లాం, వీరశైవ, క్రైస్తవ మతాలవ్యాప్తికి, వాటి గౌరవానికి కూడా కీలకంగా పనిచేసింది. అందువల్ల మతం మార్పిడి గురించి కాకుండా రాజకీయ అధికారం కోసం పోరాడాలి. ఒకాయన అన్నట్లు రాజకీయ అధికారం ముందు అగ్రకులాలే కాదు, 33 కోట్ల దేవతలు కూడా దాసోహం అంటారు.

కులవివక్ష అంతరిస్తే కుల అసమానతలు తగ్గుతాయి. తద్వారా కులాతీత దృక్పథం, సంస్కృతి విస్తరిస్తుంది. నేను "కులం, వర్గం , లింగం, సోషలిజం" అనే వ్యాసంలో చెప్పినట్టు ఇవి తనలో తాను, తన కొరకు తాను సోషలిజాన్ని ఆచరిస్తాయి. ఆ సోషలిస్టు ఆచరణ లేకపోతే అవి అవిగా నిర్మాణాలు అదృశ్యమౌతాయి. మార్క్సిజం

Dalithayugam-1

03-09-09

96

కూడా "క్లాస్ ఫర్ ఇట్ సెల్ఫ్, క్లాస్ ఇన్ ఇట్ సెల్ఫ్ " మాత్రమే ఉంటుందని అంటుంది. "క్లాస్ ఫర్ అదర్స్" ఉండదని అంటారు. భారతీయ తత్త్వశాస్త్రాల్లో తనలో తాను, తన కొరకు తానుతో పాటు ఇతరుల కొరకు తాను కూడా ఉంటుందని పరోపకారం చేస్తూ జీవించాలని చర్చించారు. కులం ఇలా తనలో తాను, తనకొరకు తాను సోషలిజాన్ని ఆచరిస్తున్నది. మరింత వివరంగా కులవర్గం సోషలిజం వ్యాసంలో చూడవచ్చు.

కులసమస్య జాతుల సమస్య వంటిదే

కులం ఒక జాతి వంటిది. తెగ వంటిది. జాతికి ఉండే లక్షణాలు కులానికి కూడా ఉన్నాయి. స్వభావంలో కులాలు తెగల్లాగా, జాతుల్లాగా కొనసాగుతున్నాయి. జాతుల మధ్య, తెగల మధ్య సమానత్వం, సహజీవనం సాధ్యమే! వాటిమధ్య అసమానతలు అణిచివేత ఉండాల్సిన అవసరం లేదు. పరస్పర గౌరవంతో, స్వేచ్ఛ సమానత్వం సౌభాతృత్వంతో కలిసి జీవించడం సాధ్యమే. ఐక్యరాజ్య సమితి నేతృత్వంలో అట్టి ఆదర్శాలు లక్ష్యాలు ఏర్పరుచుకోవడం జరిగింది. కుల అసమానతలు లేకపోయినా, కులాలు లేకపోయినా, "హిందూ మతం" కొనసాగవచ్చు. అప్పుడది అది బౌద్ధ మతమే కావచ్చు. బౌద్ధమే హిందూ మత రూపంలో కొనసాగవచ్చు.

కులం అనేది అంబేడ్కర్ చెప్పినట్టు ఒక శ్రమ విభజన. అదే సమయంలో అది శ్రామికుల విభజన కూడా. పెట్టుబడి కులాన్ని పెంచింది- పెట్టుబడి ఫ్యూడల్ కుల స్వభావాన్ని సంతరించుకుంది. మార్క్సు ఆశించినట్టు ఆధునిక పారిశ్రామికీకరణ కులాన్ని తుడిచిపెట్టలేకపోయింది. కులం పెట్టుబడిలోకి కూడా ప్రవేశించి అది పెట్టుబడిదారీ స్వభావాన్ని పొందింది. అదేసమయంలో పెట్టుబడి కూడా కులం స్వభావాన్ని పొందింది. ఉదా॥కు ఒకడు ఒక పరిశ్రమ పెట్టుకుని సాధ్యమైనంతవరకు తన కులంవాళ్ళని పనిలోకి తీసుకుంటే అది పెట్టుబడి కులం స్వభావాన్ని పొందడం. ఆపరిశ్రమ లాభాలు, ప్రతిష్ట, రాజకీయ విరాళాలు, రాజకీయ పార్టీల నాయకత్వం ఏకులానికి, చెందితే పెట్టుబడి, అధికారం ఆ కులస్వభావాన్ని పొందడం. ఇలా మనదేశంలోని పెట్టుబడి అగ్రకుల స్వభావాన్ని పొందింది. ఆ పెట్టుబడిదారుడు, తన కులంవారినే పెళ్లి చేసుకోవడం కూడా పెట్టుబడి కులస్వభావాన్ని పొందడం. ఈ దేశంలో ఒక శాతం మేరకైనా కులాంతర వివాహాలు జరగడంలేదు.

పెట్టుబడి అగ్రకుల స్వభావం పొందింది. అనగా పెట్టుబడిదారీ అభివృద్ధి ఫలితాల్ని అనుభవిస్తున్నవాళ్ళు కూడా కులస్వభావాన్ని పొందారు. దీన్నంతా ఒక్కమాటలో చెప్పాలంటే పెట్టుబడి అనేది కులవ్యవస్థ ఆచరణలో, స్వభావంలో

చక్కగా యిమిడిపోయి, కులవ్యవస్థకనువుగా మనదేశంలో తన నడకను ప్రారంభించింది. "విప్లవాలు సోషలిజం కూడా యిలా అగ్రకుల స్వభావం పొందాయి". పాలసీ నిర్ణాయక స్థానంలో అగ్రకులాల వాళ్ళుండడం వల్లే అలా జరిగింది.

జ్యోతిబాపులే, అంబేద్కర్‌ల ఆచరణని సంస్కరణవాదమనో మరొకటనో యింతదాకా అన్నవాళ్ళంతా అగ్రకులస్థులే కావడం అందుకు మరో సాక్ష్యం. పాలసీ నిర్ణాయక స్థానాల్లోకి పీడిత కులస్థులు రావడం జరిగిన విప్లవ సంస్థల్లో ఫులే అంబేద్కర్‌లను సొంతం చేసికోవడం అందుకు యింకో సాక్ష్యం. మహోన్నతమైన సామాజిక విప్లవకారులైన ఫులే, అంబేద్కర్‌లను పీడిత కులస్థులు పాలసీ నిర్ణాయక స్థానంలోకి వస్తేనే గుర్తించడం మొదలవడం అనేది పాలసీ నిర్ణాయక స్థానంలో అగ్ర కులాలవాళ్ళు వుండకూడదని స్పష్టం చేస్తున్నది.

పునాది ఉపరితల అంశాలను నిర్ణయిస్తున్నది కులమే. కులం అనేది మానవులమధ్య ఉత్పత్తి, పునరుత్పత్తి సంబంధంగా కొనసాగుతున్నది. తద్వారా సామాజిక సంబంధాలను నిర్దేశిస్తున్నది. ఉత్పత్తి సంబంధాలు రెండు. ఒకటి ప్రకృతిలో ఉత్పత్తిసంబంధం. రెండు మానవుల పునరుత్పత్తి సంబంధం. ఇతర దేశాల్లోని ఆర్థిక సామాజిక వ్యవస్థ మొదటిదాన్ని ఒకదాన్నే నిర్దేశిస్తుండగా మనదేశంలోని కులం అనే తాత్విక, రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థ యీ రెంటినీ నిర్దేశిస్తున్నది. అందువల్ల కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుధర్మ శాస్త్రం, మన కులవ్యవస్థ, అనే ఫ్యూడల్, తాత్విక, రాజకీయ, ఆర్థిక శాస్త్రం యితర దేశాలకన్నా ఎంతో లోతైనదీ బలమైనదీ.

కులం ఫ్యూడల్ వ్యవస్థ అయినప్పుడు కులవ్యవస్థ పోకుండా సోషలిజం ఎలా సాధ్యం?

కులం ఫ్యూడల్ వ్యవస్థ అయినప్పుడు కులవ్యవస్థ పోకుండా సోషలిజం ఎలా సాధ్యం? ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించడంద్వారానే "పెట్టుబడిదారీ సోషలిస్టు" వ్యవస్థలు ఏర్పడతాయి అని అందరంటున్నదే. అందువల్ల కులవ్యవస్థ అనే రూపంలో గల తాత్విక, రాజకీయ, ఆర్థిక, సామాజక వ్యవస్థను ఫ్యూడలిజం నిర్మూలనలో భాగంగా నిర్మూలించవలసివున్నది. పెట్టుబడిదారీ అభివృద్ధి కన్నా ముందే మనం యీ పనిచేస్తూ రావాలి. అనుమానం వుంటే పైన యిచ్చిన ఎంగెల్స్ కొటేషన్లు మరోసారి చూద్దాం. "చారిత్రక భౌతికవాదం ప్రకారం వాస్తవ జీవితంలోని ఉత్పత్తి, పునరుత్పత్తులే అంతిమంగా నిర్ణాయక శక్తులవుతాయి. మార్క్సు గానీ నేను గానీ యింతకుమించి ఏమీ చెప్పలేదు."

అందువల్ల కులం తాలూకు ఉత్పత్తి విధానాన్ని, స్వకులంలోని పెళ్లి తాలూకు పునరుత్పత్తి విధానాన్ని చర్చకు తీసుకోవడం ప్రాతిపదిక అవుతున్నది. అందువల్లే కులాలమధ్య వివాహాల ద్వారా, అందరిని కులవృత్తుల్నించి విముక్తం చేయడం ద్వారా ఆ పాత ఉత్పత్తి విధానం మారుతుందని చెప్పడం జరుగుతున్నది.

అందరిని ఐదేళ్ళలో కులవృత్తి నుంచి విముక్తుల్ని చేయాలి. కులవృత్తులు వదిలేసి కొత్తవృత్తులు చేపట్టకుండా, కులాలమధ్య పరస్పర పెళ్లిళ్లు జరగకుండా అన్నీ సంకర కులాలు కాకుండా కులం ఎలా నిర్మూలించబడుతుంది? యింతకన్నా మంచిదీ, తేలికయినదీ మరేదైనా పద్ధతి కుల నిర్మూలనకు మనం కనుక్కోగలిగితే మరీ మంచిది.

కులవ్యవస్థలోని ఉత్పత్తి సాధనాల్లో, ఉత్పత్తి సంబంధాల్లో కులం నిర్ణాయక ప్రాతిపదిక అంశం. ఉత్పత్తి సాధనాలు, వాటి అభివృద్ధి ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తుందని మార్క్సిజం చెప్తుంది. కాని భారతదేశంలో ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి సంబంధాలను అనగా పునాది ఉపరితల అంశాలను రెంటిని నిర్ణయించేది కులమే. అందువల్ల కులం ఒక తత్వశాస్త్రం అయింది, అందువల్లే కులం ఒక రాజకీయ అర్థశాస్త్రం అయింది. అందువల్లే అది సంస్కృతి అయింది. విలువల శాస్త్రమయింది, అలంకార శాస్త్రమైంది. ఇలా కులం అనేది ఏకకాలంలో మతమూ, శాస్త్రమూ, కళా, సంస్కృతీ కూడా. అది సమస్త శాస్త్రాల్ని నిర్దేశించిన తత్వశాస్త్రం అయింది. ప్రాపంచిక దృక్పథం అయింది.

బౌద్ధమత స్వీకారం గురించి, బౌద్ధం గురించి దాన్ని వ్యతిరేకించిన హిందూమతం ద్వారానే మనకు ఎక్కువ తెలుసు. బౌద్ధాన్ని గురించి మనం బాగా అధ్యయనం చేయవలసివున్నది. బౌద్ధం గురించి రాహుల్ సాంకృత్యాయన్ చెప్పినట్టు "సామాజిక ఆర్థిక వ్యవస్థను ప్రశించకుండా, మార్చడానికి ప్రయత్నించ కుండా శాంతిని స్థాపించాలనే వారిపట్ల పాలకవర్గం, ధనికవర్గం స్నేహ భావాన్ని ప్రకటిస్తాయి! గౌరవిస్తాయి! బుద్ధుడి పట్ల అదే జరిగింది."

ప్రపంచంలోని మొట్టమొదటి సోషలిస్టు సమాజ నిర్మాత బుద్ధుడు. "బౌద్ధం సోషలిజం" వ్యాసంలో దీన్ని నేను వివరంగా చర్చించాను. చరిత్రను అధ్యయనం చేయకుండా మాట్లాడటం సరయినది కాదు. ఈ దేశంలో సామాజిక, ఆర్థికవ్యవస్థ కులమే. దాన్ని ప్రశ్నిస్తున్నది, మార్చాలంటున్నది మేమే. కులవ్యవస్థను మార్చడానికి సిద్ధంగా లేనిది వాళ్ళే. పోతే చరిత్రలో బుద్ధుడి పట్ల అదే జరిగిందో మరేమి జరిగిందో యిటీవలే కంచ అయిలయ్య పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథంలో బుద్ధుడిని రాజకీయ ఆర్థిక సామాజిక విప్లవకారుడుగా నిర్ధారించిన తాజా విశ్లేషణ వెలుగుతో

నిర్ణయించవచ్చు.

బాధాకరమైన విషయం ఏమంటే రాహుల్‌జీ మాటలు విప్లవ పార్టీల నిర్ణయాలకు, విప్లవ సాహిత్య సాంస్కృతిక సంఘాలకు, పౌరహక్కుల సంఘాలకు వర్తించడం! వాళ్ళు చెప్పే మాటల్నీ, ఆర్థిక వ్యవస్థనూ అవగాహననూ ప్రశ్నించకుండా, మార్చడానికి ప్రయత్నించకుండా శాంతిని స్థాపించాలనే వారిపట్ల పార్టీలు, సంస్థలు స్నేహభావాన్ని ప్రదర్శిస్తాయి. వారి అవగాహనని, ఆచరణని ప్రశ్నిస్తే గొంతు నొక్కేయబడుతుంది. స్థలం దొరకదు. ఏదో ఒక పార్టీలో పూర్తికాలపు విప్లవకారుడివైతే నిన్ను విప్లవద్రోహిగా చిత్రిస్తారు. విప్లవకారుడుగా చీలికదారుగా ప్రకటిస్తారు. ఇంతదాకా జరిగిన కమ్యూనిస్టు, నక్సలైట్ పార్టీలక్రమం యిదే. వాళ్ళను వ్యతిరేకించే రచనలను, వారి పార్టీలోని వారే రాసినా వారి పత్రికల్లో ప్రచురించడం ఎక్కడైనా కనబడిందా!

స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం అంటే భిన్నాభిప్రాయాలు కలవారిని కూడా తమతో సమానంగా గౌరవించడం. చర్చల్లో ఎదుటివారిని గౌరవించే సంస్కారం లోపించడం అనేది ఎంత గొప్ప సిద్ధాంతమైనా వారిలో సభ్యతా సంస్కారం లేని దశను స్పష్టం చేస్తాయి. వారి ఆర్థిక సామాజిక అవగాహనను ప్రశ్నించి కొంచెం కొత్తదో, మరికొంచెం అదనంగానో చెప్పడంవల్లనే కదా వారు విభేదిస్తున్నది.! అందువల్ల తేలుతున్నదేమిటి? అది ఏ ఆధిపత్యమైనాసరే, ఆధిపత్యంలో వున్నవారు మిగతావారిని తమ అనుభవాల్ని, తాకట్టుపెట్టి పార్టీ నాయకుల నిర్ణయాలకు బానిసత్వంగా, అనుచరులుగా కొనసాగాలని కోరుకుంటారు. ప్రశ్నించే స్వభావాన్ని నిరసిస్తారు. ఈ అన్యాయమైన క్రమాన్ని మనం సరిచేయవలసివున్నది. ఎందుకంటే అది జ్ఞానద్వారాల్ని మూసి వేస్తుంది. కొత్తను అడ్డుకుంటుంది, అభివృద్ధిని నిరోధిస్తుంది. యథాతథవాదాన్ని కొనసాగిస్తుంది. యథాతథవాదాన్ని తాత్విక పరిభాషలో జడాత్మక భ్రామకం అంటారు .దాన్నే ఆదిశంకరాచార్యులు అద్వైతం, మాయావాదంగా ప్రచారం చేసారు.

మార్పు రచనల్ని పాఠ్యాంశాల్లో భాగంగా చర్చిస్తున్నారు. అలాగే పులే, అంబేద్కర్‌ల రచనలు, బీసీ రచనలు కూడా చర్చించబడాలి

అంబేద్కర్ కులబానిసల ప్రతినిధి. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి బానిసల ప్రతినిధి జ్యోతిబా ఫులే. ఈ ఒక్క కారణమే వారిని ప్రపంచంలోని మహోన్నత సామాజిక విప్లవకారులుగా ఎలుగెత్తి చాటడానికి సరిపోతుంది. స్పార్టకస్, బిర్సాముండా, కొమురం భీమ్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్‌లను ఏ ప్రాతిపదికపై పూర్వీకులుగా సొంతం చేసికొన్నామో అదే ప్రాతిపదికపై కుల బానిసల ప్రతినిధులైన సామాజిక విప్లవకారులు జ్యోతిబా ఫులే, అంబేద్కర్, భాగ్యరెడ్డి వర్మలను సొంతం చేసికోవడం జరిగింది.

అగ్రకుల తత్త్వం కులబానిస యజమానుల తత్త్వం

కుల బానిస యజమానులు అగ్రకులాల వాళ్లు. కుల బానిస యజమానులు మార్క్సిస్టులుగా, హిందూత్వవాదులుగా కొనసాగడం వల్ల కులబానిసల ప్రతినిధులను ప్రతీకల్ని, ఆశల్ని, కించపరుస్తున్నారు. వ్యతిరేకిస్తున్నారు. బానిసల ప్రతినిధులు పాలసీ నిర్ణాయక స్థానంలోకి వచ్చే క్రమంలో యిది ఆచరణలోకివస్తున్నది.

భారత రాజ్యాంగంలో దళితులకు రక్షణలు లేకపోయివుంటే, అంబేద్కర్ పోరాటం చేసివుండకపోతే ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు వచ్చివుండేవి కావని మండల కమీషన్‌ను వ్యతిరేకించే ఉద్యమాలు స్పష్టం చేస్తున్నాయి. అంతేకాదు సార్వత్రిక వోటుహక్కు ద్వారా భారత రాజ్యాంగం తన ప్రణాళికలో మనుషులందర్నీ సమానం చేసింది. మార్క్సు కాలం నాటికి యీ సార్వత్రిక వోటుహక్కు లేదు. సార్వత్రిక వోటు హక్కు వెనకగల తాత్విక ప్రాతిపదికరీత్యా అది మహోన్నతమైనది. అది బానిసల్ని కూడా మనుషులుగా గుర్తించాల్సిన అవసరాన్ని కలిగించింది. రిజర్వేషన్లే లేకపోయి వుంటే దళితులు ఎంత వెనకబడివుండేవారో వేరేచెప్పాలా? రాజ్యాంగరచనలో పాల్గొనడం ద్వారా అంబేద్కర్‌కు వీటిని పొందుపరిచే అవకాశం దక్కింది.

మన రాజ్యాంగం ఏర్పడిన క్రమాన్ని బట్టి చూస్తే ఒక విషయం బోధపడ్తుంది. అది రైతుకూలీలకూ భూస్వామికి, కార్మికులకూ, యజమానికీ పోరాటానంతరం జరిగే ఒప్పందంలాంటిది. అందులో ఆదేశిక సూత్రాలున్నాయి. మనం కార్మిక ఒప్పందాల్లో రెండేళ్ళదాకా సమ్మె చేయకూడదు వంటివి చూడవచ్చు. ఇది అణిచివేతను రెండేళ్ళదాకా స్వయంగా అంగీకరించడమే. కొత్త రాజ్యాంగాన్ని రాసుకోవాలంటే కొత్త ఒప్పందం చేసికోవాలి అనే అర్థమే తప్ప దానికి అంతకన్నా అదనంగా విలువ లేదని గుర్తుంచుకోవడం అవసరం. విప్లవం విజయవంతమయ్యే క్రమంలో ఆ కొత్త ఒప్పందం రూపొందుతుంది. అంతదాకా ఏదో ఒక ఒప్పందంపై పనిచేయాలికదా! అలా అంబేద్కర్ కులబానిసల ప్రతినిధిగా ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆయనకు విధించబడిన చారిత్రక, సామాజిక పరిమితుల్ని వదిలేసి మాట్లాడితే అది చారిత్రక భౌతికవాదమవదు. అలాగైతే పెట్టుబడిదారుల్తో, భూస్వాముల్తో, ప్రభుత్వాల్తో డిమాండు చేసి కుదుర్చుకునే విప్లవ పార్టీల, వాటి ప్రజాసంఘాల ఒప్పందాలన్నీ పాలకవర్గ, యజమానుల తరఫున చేసికొన్న ఒప్పందాలనవలసి వస్తుంది.

మానవతావాదం పట్ల చులకన కూడదు

కమ్యూనిస్టు ప్రణాళికనుండి ఒకాయన ఒక పేరా ఉదహరించాడు. అది ఇలా వుంది – "పెట్టుబడిదారీ సమాజం చిరస్థాయిగా ఉండేట్టు చేయడం కోసం పెట్టుబడిదారీ వర్గంలోని కొందరు ప్రజల బాధలను నివారించాలని కోరుతారు. ఆర్థికవాదులూ, పరోపకార పరాయణులూ, విశ్వమానవ శ్రేయోభిలాషులూ, కార్మికజనబాంధవులూ, జీవకారుణ్య వాదులూ, మద్యనిషేధ ప్రచారకులూ, అన్నదాన సామాజికులూ, చినిగిపోయిన పాత బొంతకు అతుకులువేసే సంస్కర్తలూ, ఈ తరగతికి చెందినవారే..." ఫులే, అంబేద్కర్‌లను అలాగే చూడాలని అతని అవగాహన.

వాదనకే నిలబడితే మరోమాట చెప్పవలసివస్తుంది. ఎంగెల్స్‌లో పరోపకారాయణుడు, విశ్వమానవ శ్రేయోభిలాషి, కార్మిక జనబాంధవుడు, అన్నదాన సామాజికుడు లేకపోయి వుంటే (ఎంగెల్స్ పీడిత వర్గం నుండి వచ్చినవాడు కాదు – ఆయన మార్క్సిస్టుగా మారాల్సిన అవసరాన్ని మార్క్సిజం కలిగించింది కాదు. అది మార్క్సిజానికి వెలుపలిది) మార్క్సు కుటుంబం ఆకలితో మలమలమాడి చచ్చివుండేది. లేదా మార్క్సు మరెవరో పెట్టుబడిదారునికింద పనిచేస్తూ వారి సేవచేస్తూ తన రచనలు తను చేసికొనే నేటి ప్రజాస్వామికవాదుల, ప్రజా రచయితల స్థితికి చేరివుండేవాడు.

అయితే ఈరోజు ఆ అవగాహన మారింది, పరిస్థితి మారింది. ఫులే , అంబేద్కర్‌లు మహోన్నత పౌరహక్కుల ఉద్యమ నిర్మాతలు. మానవహక్కుల కోసం పోరాడిన యోధులు. ఈరోజు శంకర్‌గుహనియోగి మొదలుకొని భారతదేశంలోని పలు విప్లవ పార్టీలు కూడా మద్యనిషేధ ప్రచారకులుగా మారిపోయారు. రూపాయి కూలి పెంచు! నోటుబుక్కుల ధరలు దించు ! వంటి పాత బొంతకు అతుకులువేసే డిమాండ్లు కూడా విప్లవంలో భాగంగానే సాగుతున్నాయి. విశ్వమానవ శ్రేయోభిలాషులీరోజు వివిధ దేశాల్లోని ప్రజాపోరాటాలపై జరిగే అణిచివేతను ఖండిస్తూ ఉద్యమిస్తున్నారు.

నిజానికి కార్మికవర్గం గురించి చెప్పడానికి, దానికి సైద్ధాంతిక నాయకత్వం వహించడానికి మార్క్సు, ఎంగెల్స్‌లకున్న అర్హతలేమిటి? బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఇలా చేయండి, అలా చేయండి అని చెప్పడానికి అగ్రకుల నాయకత్వాలకున్న అర్హతలేమిటి? వాళ్ళేమీ కార్మికవర్గం నుండి రాలేదు. మార్క్సు, ఎంగెల్స్‌లు చెప్పిన సిద్ధాంతాల ప్రకారం చూస్తే కార్మికవర్గ సిద్ధాంతాలు, కార్మికవర్గ నాయకత్వం కార్మికుల నుండి రావాలి. పరిశ్రమల వల్ల వృత్తులు కోల్పోయినవారే విధిలేక కార్మికులయ్యారు. జెన్నినూలు వడుకు యంత్రంతో పారిశ్రామికీకరణ మొదలైంది. అందువల్ల మొదట ఉన్న వృత్తులు కోల్పోయి కార్మికవర్గంగా మారిందెవరు? చేనేత పనివాళ్ళు! వాళ్లు

విధిలేక ఉన్న వృత్తి కోల్పోయి కార్మికవర్గంగా మారిన మొదటి తరం వాళ్ళు. వారి నాయకత్వంలో లేదా వారి పిల్లల నాయకత్వంలో వారి భాషలో వారి అనుభవాల్తో మార్క్సు, ఎంగెల్స్ చెప్పిన సిద్ధాంతాలు చెప్పాలి. కాగా బట్టలమిల్లు యజమాని అయిన ఎంగెల్స్ మిల్లు కార్మికుల శ్రమశక్తితో సృష్టించబడిన సంపదను మార్క్సుకు ఆర్థిక సహాయరూపంలో అందించారు. అనగా కార్మికుల నుండి కాకుండా కార్మికవర్గ యజమాన్యవర్గం నుండి బట్టలమిల్లు కార్మికుల శ్రమశక్తి సంపద నుండి మార్క్సు, ఎంగెల్స్‌లు ఎదిగారు. ఇలా మార్క్సు, ఎంగెల్స్ నిజమైన కార్మికవర్గం నుండి రాకుండా వీళ్ళే ముందు చెప్పారు. తద్వారా కార్మికుల నుండి సిద్ధాంతవేత్తల ఎదుగుదల అరికట్టబడింది.

అందువల్ల మార్క్సిస్టులు యితరులపై చేసే విమర్శ మార్క్సు, ఎంగెల్స్, లెనిన్, మావోలకే పూర్తిగా వర్తిస్తుంది. మనదేశ కమ్యూనిస్టు, నక్సలైట్ పార్టీలకు సంస్థలకు, అగ్రకుల నాయకులకు ఇది రెట్టింపు వర్తిస్తుంది. వీరెవరూ కార్మికుల్నించి, కార్మికవర్గం నుండి రాలేదు. తమ పార్టీ కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందని ప్రకటించుకున్నారంతే. అలా అని వారిని తీసిపారేయ నవసరంలేదు. వారి సిద్ధాంతాలను, ఆచరణను అవసరమైన మేరకు గుర్తించి, గౌరవించాల్సి ఉంది. వాళ్ళంతా మానవతావాదంలో భాగంగానే మార్క్సిస్టుల య్యారని, మహనీయులైయ్యారని గ్రహించడం అవసరం.

రాజకీయాలకోసమే సిద్ధాంతలైనప్పుడు, సిద్ధాంతాలు రాజకీయ ఎత్తుగడలకు గురి కాకుండా లేదా బలి కాకుండా ఎలా వుంటాయి? ఎంత గొప్ప సిద్ధాంతమైనా, మతమైనా, సంస్థ అయినా, పార్టీ అయినా అది ఎవరి రాజకీయాలకు ఉపయోగపడుతున్నది అనేది ముఖ్యం. తమను, తమ నాయకత్వాన్ని, తమ లక్ష్యాలను, అభివృద్ధిని వ్యతిరేకిస్తూ హింసించే, అణిచివేసే, కించపరిచే ఆయుధాలను, నిర్మాణాలను, నాయకులను ఎవరైన ఎలా ప్రేమిస్తారు? బంగారు కత్తితో మెడ కోస్తానంటే.. బంగారం అని కత్తిని ప్రేమించాలా? పాలకవర్గాలకు, అగ్రకుల దోపిడికులాలకు, వారి ఆధిపత్యానికి, అణిచివేతకు ఆయుధంగా, సాధనంగా ఉన్నంతకాలం మార్క్సిజాన్నైనా, హిందూవాదాన్నైనా, మరోయిజాన్నైనా, నిర్మాణాలనైనా, పార్టీలనైనా బీసీ, ఎస్సీ, ఎస్టీలు తిరస్కరించకుండా ఎలా ఉంటారు? బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టే సమస్త భావజాల ఆయుధాల్ని, భౌతిక నిర్మాణాలను, సంస్థలను, పార్టీలను నిర్వీర్యం చేయడమే వారి తక్షణ కర్తవ్యం అవుతుంది. అందువల్ల అగ్రకులాలు నాయకత్వం నుండి ఎంతగా తప్పుకుంటే అంతగా మార్క్సిజానికి, హిందూవాదానికి, కాంగ్రెస్‌కు, బిజెపికి మేలు చేసినవారు అవుతారు.

మనిషిలోని ప్రేమించే గుణాన్ని, మానవతను హేళన చేయడం తగదు. రాసేనాటికి మార్క్సు, ఎంగెల్స్ యువకులైనా కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలోని శిల్పం రీత్యా ఐడెంటీక్రైసిస్‌తో అప్పుడే గొంతు విచ్చుకుంటున్న తీరు స్పష్టంగా కనపడుతుంది. మార్క్సు, ఎంగెల్స్‌ల క్రమం దాన్ని దాటి ముందుకు సాగింది. ప్రపంచం కూడా ఎంతో ముందుకు సాగింది. జ్యోతిబా ఫులేని డిస్కవరీ చేయలేక పోయిన మార్క్సు ఎంగెల్స్‌లు వలసదేశాల పట్ల చిన్నచూపు గల పడక్కుర్చీ, యిగోయిజపు రాజకీయవాదులు కారా అని కూడా ప్రశ్నించే యువతరం ముందుకు వచ్చింది. అయినా ఒక ప్రతీకగా మహనీయులైన మార్క్సు ఎంగెల్స్‌లను గౌరవిద్దాం.

వందలాది కోట్ల ప్రజల ఆచరణతో విశ్వవ్యాప్తంగా వేలఏళ్ళుగా సాగిన నిరంతర ఆచరణనుండి పుట్టిన జ్ఞానాన్ని మార్క్సు పేరిట మార్క్సిజం అని పిలువడం అంత అపచారం, పరాయీకకరణ మరొకటి లేదు. కానీ ఒక ప్రతీకగా మార్క్సిజం అని పిలుస్తున్నాం. అలాగే భారత సామాజిక విముక్తి సిద్ధాంతాలనందించిన పూలే, అండేద్కర్‌ల కృషిని అంబేద్కరిజం అని పిలుస్తున్నాం.

మంచిని గౌరవిద్దాం – మనిషిని ప్రేమిద్దాం, ఎక్కడున్నా మనం మంచిని గౌరవిద్దాం. మనకు మనిషి మానవత మానవ సంబంధాలు మానవీయ విలువలు ప్రాథమికం. పీడిత కులాల కోట్లాది ప్రజల ఆశల, జీవితాల ప్రతీకలైన జ్యోతిబా ఫులే, అంబేద్కర్‌లను విప్లవోత్తేజంతో సొంతం చేసుకుందాం. మన హృదయాలను విశాలం చేసికుందాం.

Dalithayugam-1

03-09-09

100

సామాజిక పెట్టుబడిగా పరిణామం చెందిన కులం

కులం ఒక అమీబా. ఎన్ని రూపాల్లోనైనా ఉంటుంది.

“ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొకొక్కడై తోచు... ఎందెందు వెతికిచూచిన అందందే కలదు కులం సర్వోపగతుండు?”

కులం శతాబ్దాలుగా కొందరికి ఫ్యూడల్ పెట్టుబడిగా కొనసాగుతున్నది. కులం అనేది కొన్ని కులాలకు పైసా ఖర్చులేకుండా వేల కోట్ల రూపాయల పెట్టుబడిగా పనిచేస్తున్నది. కేవలం కులం రీత్యా ఆధిపత్యంలో ఉండడం వల్ల మంచి వృత్తులతో పాటు, మంచి ఉన్నత విద్యను, రాజకీయ అధికారాన్ని ఆర్థిక సంపదను, పరిశ్రమల్లో పెట్టుబడిని సామాజిక మద్దతును సాధించుకుంటున్నారు. కొన్ని కులాలకు గల అధికగౌరవం వల్ల ఇవన్ని సాధ్యపడుతున్నాయి.

వెనుకట రాజులు గుళ్ళ నిర్వహణ పేరిట ఊళ్ళకు ఊళ్లను బ్రాహ్మణులకు, పూజార్లకు దానం చేశారు. అలా భూమిపై పంటపై, గుళ్ళమీద ఆదాయంపై హక్కుఏర్పడి భౌతిక పునాది ఏర్పడింది. తద్వారా అన్నిరంగాల్లో ఉన్నతస్థాయి పొందారు. తరువాత బ్రిటిష్ వాళ్ళు భూమిశిస్తు వసూళ్ళు కోసం ఏర్పాటు చేసిన యంత్రాంగం భూస్వాములుగా, జమీందార్లుగా మారారు. అలా కొన్ని శూద్రకులాలు భూమిమీద 1850 నుండి హక్కు సంపాదించుకుని 1900 నుండి అగ్రకులాలుగా రూపాంతరం

చెందాయి.

ఇలా రాజరిక కాలంనుండి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి కులం పునాదిగా కొన్ని కులాలు అధికగౌరవాలను, రాజకీయ అధికారాన్ని, అధికసంపదను కలిగిఉన్నాయి. వీటికి పునాది కులవ్యవస్థ ఇచ్చిన గౌరవంలో ఉంది. అందువల్ల కులమనేది ఒక పెట్టుబడిగా పనిచేస్తున్నది. ఫలానాకులం అనగానే పిలిచి పీట వేయడం అనేక సౌకర్యాలు కలిగించి ఎదిగించడం అనేది పైకులాలవాళ్ళే కాకుండా కింది కులాలు వాళ్ళు కూడా చేస్తున్నారు. ఇది వేలకోట్ల రూపాయల ఆర్థిక సంపదపై, రాజకీయ అధికారంపై పెత్తనాన్ని అనివార్యం చేస్తున్నది. తద్వారా తిరిగి వాళ్ళే అన్నిరంగాలను ఆక్రమించడం సాధ్యపడుతున్నది.

అందువల్ల అమర్త్యసేన్ సంక్షేమ అర్థశాస్త్రం కన్నా 'సోషల్ క్యాపిటల్' – ఎకానమీ ('సామాజిక పెట్టుబడి' – అర్థశాస్త్రం) ఎంతో సమగ్రమైనది. ఇది సోషలిస్టు దృక్పధానికి వాస్తవరూపం. పెట్టుబడి కులంలాగా ఎన్ని రూపాల్లో ఉంటుందో 'సామాజిక పెట్టుబడి – అర్థశాస్త్రం' చర్చిస్తుంది. కులాధికృత, వర్ణధర్మం, కీర్తి ప్రతిష్టలు, ట్రేడుమార్కు విలువలు, గౌరవాలు, సినీతారలకు, క్రికెటర్లకు ఉండే విలువ, కులం విలువ, పెద్దలపట్ల గౌరవం, మతం, సంస్కృతి మొదలైనవన్ని సామాజిక పెట్టుబడి రూపాల సంచయాలే.

పెట్టుబడి రూపాల సంచయాలు

మనదేశ కులవ్యవస్థలోని ఉత్పత్తి సాధనాల్లో, ఉత్పత్తి సంబంధాల్లో కులం నిర్ణాయక ప్రాతిపదిక అంశం. ఉత్పత్తి సాధనాలు, వాటి అభివృద్ధి ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తాయని మార్క్సిజం చెపుతుంది. కాని భారతదేశంలో ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి సంబంధాలను అనగా పునాది ఉపరితల అంశాలను రెంటిని నిర్ణయించేది కులమే. మార్క్సిస్టులు ప్రతిపాదించిన ఆదిమ కమ్యూన్ వ్యవస్థ ఎప్పుడూ ఎక్కడా అస్తిత్వంలో లేదని చరిత్రకారులు, ఆంత్రోపాలజిస్టులు నిర్ధారించారు. కాగా యూరపు సోషలిస్టులు, కమ్యూనిస్టులు వాస్తవంగా అస్తిత్వంలో ఉండిన బౌద్ధ సోషలిస్టు సమాజాల అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరించారు.

రాజకీయ అధికారం అన్ని సామాజిక పెట్టుబడులపై అధికారం చెలాయిస్తుంది

రాజకీయ అధికారం అన్ని సామాజిక పెట్టుబడులపై అధికారం చెలాయిస్తుంది. అందువల్ల రాజకీయాలకు, రాజకీయ అధికారానికి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. అంబేద్కర్ అందుకే రాజకీయ అధికారాన్ని అన్ని తాళాలను తెరిచే మాస్టర్‌కీ అని వర్ణించారు. ఐతే "రాజకీయాలంటే కులమో, వర్గమో, ధనమో, మతమో, సాంఘిక విప్లవమోకాదు. ఇందులో ఏ ఒక్కటీ లేదు. దేనికో పరిమితం కాదు. వీటన్నిటిని సమన్వయిస్తూ సమాజాన్ని దాని చలన సూత్రాల్ని రెగ్యులేట్ చేస్తూ మెజారిటీ ప్రజల సమ్మతితో వీలైనంత మేరకు, సమాజాన్ని ముందుకు నడిపేటట్టు చేయడం రాజకీయం." అందువల్ల దార్శనికులైన రాజకీయ నాయకులకు, వారి ముందు చూపుకు, సమకాలీన వాస్తవికతకు, వాస్తవిక ఆచరణకు మధ్య నిరంతరం వైరుధ్యం వుంటుంది. అందువల్ల తనలో తానే సంఘర్షించడం వుంటుంది. చాలా మంది అర్థశాస్త్రవేత్తలు రాజకీయ అధికారం గురించి, సామాజిక వర్గాల, కులాల రిజర్వేషన్ల గురించి వాటి అవసరం గురించి పట్టించుకోలేక పోయారు.

కులవ్యవస్థను పట్టించుకోని వాళ్ళు ఈ దేశంలో అర్థశాస్త్ర వేత్తలు కాలేరు

కొంతమంది ఆధునికులు ప్రపంచ అర్థశాస్త్రాలు చదివి అర్థశాస్త్రంలో, రాజనీతి శాస్త్రంలో, విలువల శాస్త్రంలో, ఉత్పత్తి సంబంధాల్లో 'కులం' నిర్వహించే పాత్రను మరిచిపోతుంటారు. అంబేద్కర్ గొప్ప ఆర్థికవేత్త అయి వుండి కూడా కుల నిర్మూలన తత్వవేత్తగా ఎందుకు పరిణామం చెందాడో చాలా మందికి తెలియదు. అంబేద్కర్ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త కావడం వల్లే కుల నిర్మూలనా తత్వవేత్తగా ఎదగడం సాధ్యమైంది. కుల నిర్మూలనా తత్వవేత్తగా కాకుండా ఎవరూ గొప్ప అర్థశాస్త్రవేత్త కాలేరీ దేశంలో. ఏమంటే కుల వ్యవస్థగొప్ప అర్థశాస్త్రం కూడా. కులం ఈ దేశంలో ఉత్పత్తి శక్తులను, ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి సంబంధాలను, పంపిణీని నిర్దేశిస్తుంది. అనగా వర్గాలను రూపొందించే పునాది వ్యవస్థ కులం. వర్గాలను కన్నతల్లి పేరు కులం.

సామాజిక పెట్టుబడిగా కులం, మతం, కుటుంబం

మొదటే చెప్పినట్టు కులం ఒక ఫ్యూడల్ పెట్టుబడి. అది ఫ్యూడల్ వ్యవస్థ నిర్మించి ఇచ్చిన పెట్టుబడి. కులం మానవ సంబంధాలకు కూడా విలువ కట్టే వ్యాపారం చేస్తుంది. కులం బ్రాహ్మణీయ అధిపత్యవాదులకు పైసా ఖర్చులేకుండా పొందే పెద్ద పెట్టుబడి. అందువల్లే వర్గ దృక్పథంతో కోట్లమందిని ఆర్గనైజ్ చేసినా కమ్యూనిస్టులు ఆయా వర్గాల, మతాల ప్రజల మధ్య కులం, మతం తాలూకు అంతరాలు పోగొట్టలేకపోయారు. అన్ని కులాలూ సమానమే అనే దృక్పథాన్ని ప్రజలకు అలవరచలేకపోయారు. అందువల్లే వాళ్ళ అడుగుజాడల్లో నడిచే రైతాంగ కార్మిక వర్గాల్లో, ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాల్లో కుల ప్రసక్తి లేని పెళ్ళిళ్ళు సర్వసాధారణం కాలేకపోయాయి. అనగా వర్గంకన్నా కులమే ప్రాథమికమని, ప్రధానమని ప్రజలు ఆచరిస్తున్నారు. కులం వదులుకోలేని అగ్రకుల మధ్యతరగతి సంస్కృతే అందరి

సంస్కృతి అని భ్రమ పెంచారు.

గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ అంటే మనుధర్మ కుల వ్యవస్థే

పల్లెల్లో గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ ఉన్నంతకాలం, కుల వృత్తుల్ని ఆయా కులాల వాళ్ళే వంశపారంపర్యంగా చేస్తున్నంత కాలం కులం అణచివేత, అసమానతలు పోవు. ఫ్యూడల్, రాజరికాల నాటి గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ అంటే మరేమిటో కాదు. చారిత్రక, సామాజిక తాత్వికార్థంలో అది మనుధర్మ బ్రాహ్మణీయ కులవ్యవస్థ. ఈ మాటని యింత స్పష్టంగా చెప్పలేకపోయారు చరిత్రకారులు, అర్థశాస్త్రవేత్తలు. అంబేడ్కర్ దీన్ని అర్థశాస్త్రవేత్తగా అర్థం చేసుకోవడం వల్లే అర్థశాస్త్రం నుండి కుల తత్వశాస్త్ర, బ్రాహ్మణీయ భావజాలాన్ని తన పరిధిలోకి తీసికొని చర్చించి పరిష్కారాలు వెతికారు.

బుద్ధుడు, అంబేడ్కర్ సమగ్ర సామాజిక విప్లవకారులు

ఉత్పత్తి సంబంధాల నిర్దిష్టదశల్ని, కోణాల్ని, వర్గం, కులం, మతం, జాతి, జెండర్‌లు తెలుపుతాయి. కులమా, వర్గమా అనే చర్చ సరైనదికాదు. ఉత్పత్తి సంబంధాల్లోని వర్గం యొక్క నిర్దిష్ట నిర్ణాయక రూపమే కులం. దీన్ని అర్థం చేసుకున్న పూలే, అంబేడ్కర్‌లు ఇలా సమగ్ర సామాజిక విప్లవం కోసం కృషి చేశారు. వాళ్ళు కొందరిలా భౌతిక అవసరాలకో, ఆర్థిక నియతివాదానికో, రాజ్యాధికారవాదానికో పరిమితం కాకుండా, నీతి, న్యాయం, ధర్మం, శీలం, వ్యక్తిత్వం, సంస్కృతి, కరుణ, మొదలైన సమస్త సామాజికాంశాల్ని ఏకకాలంలో పట్టించుకొని కృషి చేయడం భారతీయులు చేసుకున్న అదృష్టం.

ఇలా అంబేడ్కర్ అర్థశాస్త్రం నుండి తత్వశాస్త్రానికి, సామాజిక శాస్త్రాలకు పయనిస్తే, మార్క్స్ తత్వశాస్త్రం నుండి రాజకీయ ఆర్థిక శాస్త్రంవైపు ప్రయాణించాడు. ప్రతి శాస్త్రానికి తనదైన పరిభాష ఏర్పడ్డం వల్ల పరిభాష వెనక గల దృక్పథంలో గల ఏకత్వాన్ని పట్టుకోవడం కష్టమవుతుంది. అయినా ఆ పని తప్పదు.

స్వాతంత్ర్యం అనంతరం మారిన సామాజిక వర్గాలు

"ప్రాథమిక, సెకండరీ విద్యకు మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించిన బడ్జెటుతో పల్లెల్నించి మొదటితరం అక్షరాస్యులు కొత్తగా ఏర్పడడం మొదలైంది. పారిశ్రామికాభివృద్ధిలో బీసీల చొరవ పెరిగింది. దాన్ని చూసి రామమనోహర్‌లోహియా మన రాష్ట్రంలో బీసీలు త్వరలో అధికారంలోకొస్తారని అన్నాడు. తాలుకా కేంద్రాల్ని విద్యాకేంద్రాలుగా పరిశ్రమల అభివృద్ధి కేంద్రాలుగా వికేంద్రీకృత అభివృద్ధి విధానం అమలు జరిగి ఉంటే లోహియా కల నిజమయ్యేది. కాని అలా జరుగలేదు. పరిశ్రమలు, విద్యాకేంద్రాలు కొన్ని సిటీ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమయ్యాయి.

నెహ్రూ హయాంలో భిలాయ్, రూర్కెలా, నాగార్జునసాగర్ వంటి కేంద్రీకృత భారీ పరిశ్రమల్ని, భారీ ప్రాజెక్టుల్ని చేపట్టారు. వాటికి కావల్సిన స్కిల్‌గానీ, పెట్టుబడిగానీ బీసీల స్తోమతకు మించినవి. అందువల్ల దాన్ని అందుకోలేకపోయారు. భారీ ప్రాజెక్టుల వల్ల భూములున్న భూస్వామ్య, వ్యవసాయకులాల వాళ్ళపంట, రాబడి,స్తోమతపెరిగి వాళ్ళేతిరిగి రాజకీయ నాయకులుగా పై స్థాయి అధికారులుగా, పారిశ్రామిక వేత్తలుగా రూపాంతరం చెంది అభివృద్ధి చెందారు. ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలవల్ల ఎస్సీ, బీసీ, ఎస్టీలు కార్మికులుగా మారిపోవాల్సి వచ్చింది. ఎందుకంటే వాళ్ళ వద్దసరైన సర్‌ప్లస్‌గానీ, పెట్టుబడిగానీ, వ్యవసాయ భూములుగానీ చాలా తక్కువ. చైనాలో జరిగినట్టు వికేంద్రీకృత అభివృద్ధి జరిగివుంటే బీసీలు, ఎస్సీలే అన్ని రంగాల్లో తమ వాటా తాము పొందేవారు. అది యితరుల పరమైంది.

సామాజిక అర్థశాస్త్రం లాభనష్టాల దృష్టితో కాకుండా సామాజిక అవసరాలు సామాజిక వర్గాల అభ్యున్నతి దృష్టితో ఆలోచిస్తుంది. నేను మమతలు, మలుపులు, ప్రేమికులు, పంజరం, కథల్లో సామాజిక అర్థశాస్త్రం ఎలా ఉంటుందో కుటుంబసంబంధాల్లో భాగంగా సామాజిక పరిణామాల్లో భాగంగా విశ్లేషించడం జరిగింది. ముందే చెప్పినట్టు అమర్త్యసేన్ సంక్షేమ అర్థశాస్త్రంకన్నా సామాజిక అర్థశాస్త్రం అర్థవంతమైనది, సమగ్రమైనది, అభివృద్ధి కనువైనది. సంక్షేమ అర్థశాస్త్రం అదనపు మిగులును వాడుకునే సబ్సిడీ అనే భావాన్ని కలిగిస్తుంది. అందువల్ల అది అభివృద్ధి నిరోధకం అనుకునేవాళ్ళు కూడా ఉంటారు. సామాజిక అర్థశాస్త్రం అదే పని చేసినప్పటికి అంతకన్న ఉన్నతంగా సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంటుంది.

కులం నీరువంటిది

ఇలా కులంవంటి సామాజిక పెట్టుబడి సంచయాలను వాటి చరిత్రను, ప్రాధాన్యతలను, పరిష్కారాలను పట్టించుకున్నప్పుడే ఒక అర్థశాస్త్రం సామాజిక అర్థశాస్త్రంగా సమగ్రమవుతుంది. అలా విశ్లేషించిన వారినే భారతదేశంలో అర్థశాస్త్రవేత్తలుగా పరిగణించడం జరుగుతుంది. కులం నీరు వంటిది. ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర రూపం ధరిస్తుంది. నీరులా కులం విస్తరించి, ఎన్నిరూపాల్లోకి మారుతూ ఉంటుందో పరిశీలిస్తూ వాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాలను విశ్లేషించే వారే నిజమైన భారతీయ ఆర్థశాస్త్రవేత్తలు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రణాళికాసంఘం, రాజకీయ పార్టీలు "సామాజిక పెట్టుబడి"గా కొనసాగుతున్న కులాధిక్యతను దృష్టిలో ఉంచుకొని రాజకీయ సామాజిక ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇతరుల కులాధిక్యతను అధిగమించి ఎదిగేవిధంగా అన్నీ రూపాల్లో ప్రణాళికలు, ప్రోత్సాహాలు, రిజర్వేషన్లు, రక్షణలు రూపొందించి ఆచరించాలి.

అందువల్ల విద్యార్థి యువజనులారా!

ఉన్నతవిద్యను అందుకొండి. ఉన్నత ఉద్యోగాలను పొందండి. ఆదర్శవంతమైన పారిశ్రామికవేత్తలుగా, కాంట్రాక్టర్లుగా, వ్యాపారులుగా ఎదగండి. రాజకీయ, సామాజిక రంగాల్లో ఉద్యమించండి. అగ్రకుల నాయకత్వాలను అన్ని రంగాల్లో ప్రశ్నించండి ! వారిని అగ్రకులాలుగా గుర్తించడం మానెయ్యండి. మీతో సమానంగా మాత్రమే గౌరవించండి. వాళ్ళ నాయకత్వాల్ని నిరాకరించండి. మీరు నాయకులుగా, మేధావులుగా, అధికారులుగా సమాజనిర్మాతలుగా ఈ దేశ భవిష్యత్తు నిర్దేశించే వాళ్ళుగా ఎదగండి. మీరు ఎదుగుతూ సమాజం కోసం త్యాగాలు చేయండి.

బహుజన సమాజం కుల నిర్మూలన

విద్యార్థి దశ అనేది జీవితంలో మళ్లీరాని మరపురాని ఒక అధ్యాయం. మానవులు సమాజంగా ఏర్పడి వేల ఏళ్ళుగా సాధించిన జ్ఞానం పలు శాస్త్రాల రూపం తీసుకుంది. వాటిని అధ్యయన రూపంలో సొంతం చేసుకుని నూతన సమాజాన్ని నిర్మించడానికి తానూ ఒక మొక్కయి మొలకెత్తడమే విద్యార్థి దశ. మొక్క వృక్షంగా విస్తరించడమే యువజన దశ.

పట్టుదలే ప్రపంచంలో అన్నిటికన్నా గొప్ప పెట్టుబడి

వ్యక్తిత్వం, ఆలోచనావిధానం, జీవిత లక్ష్యాలు, ఆదర్శాలు విద్యార్థి దశలోనే రూపుదిద్దుకుంటాయి. విద్యార్థి జీవితం ఒక గొప్ప జీవితం. అది గడిచినకొద్ది దాని ప్రాధాన్యత తెలుస్తుంది. యువజన జీవితం తమ జీవితాదర్శాలకనువుగా ముందుకు సాగే దశ. అందువల్ల సరిగ్గా ఈ విద్యార్థి యువజన దశలోనే ఉదాత్తమైన, ఉన్నతమైన లక్ష్యాల కోసం స ంకల్ప బలంతో మీరు ముందుకు సాగాలి. పట్టుదలే ప్రపంచంలో అన్నింటికన్న గొప్ప పెట్టుబడి. చిత్తశుద్ధి నిరంతర శ్రమ, క్రమశిక్షణ మన లక్ష్యాలను సాకారం చేస్తాయి.

అందువల్ల విద్యార్థి యువజనులారా! మీరు ప్రపంచ విద్యార్థి యువజన ఉద్యమాలను అధ్యయనం చేయాలి. వాటి నుంచి స్ఫూర్తి పొందాలి. విద్యార్థి యువజనులు తలచుకుంటే

కలసికట్టుగా ప్రపంచంలో సాధించలేనిదంటూ ఏదీ లేదు. ప్రపంచ రాజకీయాలను, ప్రభుత్వాలను మార్చిన చరిత్ర విద్యార్థి యువజన ఉద్యమాలది. వ్యవస్థను మార్చిన చరిత్రలో విద్యార్థి యువజనుల పాత్ర మహోన్నతమైనది. మనదేశంలోని కులవ్యవస్థను, కులవివక్షను, సామాజిక, ఆర్థిక అసమానతలను, అవినీతిని నిర్మూలించడంలో విద్యార్థి యువజనుల పాత్ర ప్రధానమైనది. అందువల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి యువజనులు ఎలా ఈ సమాజాన్ని అర్థం చేసుకోవాలో తెలుసుకోవడం అవసరం.

భావజాల చర్చలో మీరు అందరికన్నా ముందుండాలి. ఈ సమాజాన్ని అర్థం చేసుకోవడం కోసం ఆయా సందర్భాల్లో విద్యార్థుల కోసం చేసిన ప్రసంగాలను, రచనలను కొన్నింటిని ఈ చిన్న పుస్తకంలో అందిస్తున్నాను. విద్యార్థి యువజన ఉద్యమాల్లో మీ అవగాహన పెంచుకోవడానికి ఇవి ఉపకరిస్తాయి. దేశం మీకోసం, మీ నాయకత్వం ఎదగడం కోసం ఎదురుచూస్తున్నది ! ఈవిశాల ప్రపంచం మీరు గెలుచుకోవడం కోసమే ఉంది. పరోపకారం అనే లక్ష్యంతో ధైర్యంగా ఎదుగుతూ త్యాగశీలంగా ముందుకు సాగండి. జీవితంలో గెలుపుమీదే!

చేసే పనికి ఆలోచనకు మధ్య సంబంధం

చేసే పనికి ఆలోచనకూ మధ్య సంబంధం ఉంది. ఏ పని చేస్తే ఆ పనికి సంబంధించిన అనుభవాలు, ఆలోచనలు విస్తరిస్తాయి. మనదేశంలో సమస్త సంపదలు సృష్టించే పనులన్నీ శూద్ర-అతి శూద్ర కులాలు, గిరిజనులు చేసినవే. వీరు ఎదిగించిన కళలు, శాస్త్రాలే సమాజాన్ని ముందుకు నడిపాయి. సంపద్వంతం చేశాయి. అవే ఈ దేశంలోని సంపద యితర దేశాల వారిని యిక్కడికి రావాలనీ, బతకాలనీ ఉవ్విళ్ళూరించాయి. ఎడారి కోసం పోటీపడి పరిగెత్తరు. సస్యశ్యామలంగా, సమస్త సంపదల్తో తులతూగే దేశంలోకి ఎవరైనా పోటీపడి పరిగెత్తాలనుకుంటారు. అలా భారత ఉపఖండం ప్రపంచంలోని ఎన్నో తెగలను, జాతులను ఆకర్షించింది.

ఇక్కడ విలసిల్లిన సింధునాగరికతకు చరిత్రకందిన ప్రపంచ నాగరికతల్లో ఒక గొప్ప స్థానం ఉంది. పశువుల కాపర్లుగా, తండాలు తండాలుగా బయలుదేరిన ఆర్యులు సింధూ నాగరికత సమాజాన్ని విచ్ఛిన్నం చేశారు. బ్రాహ్మణవాద వర్ణ వ్యవస్థను కులవ్యవస్థను ఏర్పరిచారు.

శూద్రులు, అతిశూద్రులు అప్పటినుండి శ్రమను నమ్ముకుని, భూమిని నమ్ముకుని, అడవిని నమ్ముకుని నిరంతరం శ్రమించారు. వేలరాజుల, రాణుల, మంత్రుల, బ్రాహ్మణుల గుడుల గోపురాల వైభోగం అంతా బీసీ, ఎస్సీ, ఎస్టీల రక్తం చెమటలనుండి పుట్టినవే. రాజుల మధ్య యుద్ధాలుగానీ, బ్రాహ్మణ, క్షత్రియ,

వైశ్యకులాలు పొందికగా కూర్చుని మేసిన సంపదగాని, కూడబెట్టిన ధనంగానీ శూద్ర, అతి శూద్రులు శ్రమను, కష్టాన్ని దోపిడీ చేసిందే. రాజులు వేల పెళ్ళాలను చేసుకున్నా, గానాభజానాలకు ఖర్చుచేసినా, బ్రాహ్మణులకు భూరి దానాలిచ్చినా, అదంతా శూద్ర, అతి శూద్రుల కష్టార్జితాన్ని, కాయకష్టాన్ని దోపిడీచేసి అనుభవించిందే. సంపదలు సృష్టించడం, కష్టపడడం బహుజనులవంతు, దాన్ని దోపిడీ చేయడం, అనుభవించడం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల వంతు అయింది.

పొలాల్లో, ఎండల్లో కష్టపడ్డ శూద్ర, అతిశూద్రులచర్మం నల్లబారింది. కూర్చుని తిని బొర్రలు పెంచిన అగ్రవర్ణాల చర్మం నిగనిగలాడింది. తోలు చూసుకొని మురిసిపోయే బ్రాహ్మణ క్షత్రియులెందరో బహుజనుల రక్తాన్ని తమ – ఒంటి రంగుగా మార్చుకున్నవారే.

ఆవు ఉచ్చను పవిత్రం అంటూ తాగారు బ్రాహ్మణవాదులు. తోటి మనిషిని పశువుకన్నా హీనంగా చూశారు. బ్రాహ్మణవాదుల భూతదయ బహుజనుల్ని పశువులకన్నా హీనంగా చూడ్డమేనా?. రెండు మూడు కులాల సుఖంకోసం వేలమంది జీవితాల్ని బలిపెట్టిన వర్ణవ్యవస్థ, కులవ్యవస్థలు ఎలా మంచివవుతాయి? సింధు నాగరికత దశ మొదలుకొని వైదిక పశుపాలక దశ దాకా ఎందరో మహనీయులు, ఎందరో మార్గదర్శకులున్నారు.. చార్వాకులు, లోకాయతులు, అజిత కేశ కంబళి, మక్కలి గోశాలుడు, వర్ధమాన మహావీరుడు, బుద్ధుడు, అశోకుడు మొదలైన ఎందరో మహనీయులు బ్రాహ్మణవాద వైదిక వ్యవస్థకు వ్యతిరేకంగా బహుజన తాత్విక ఉద్యమాలు నడిపారు. బుద్ధుడు నడిపిన సామాజిక ఆర్థిక రాజకీయ విప్లవం విజయవంతమైంది. మనుషులందర్నీ సమానంగా చూడాలని, స్నేహం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ మనుషులందరినీ కలిపిఉంచే గొప్ప సూత్రాలని ఆచరించి చూపాడు బుద్ధుడు.

బుద్ధుడు బౌద్ధం నడిపిన మహోన్నత రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక విప్లవం వెయ్యేళ్ళు మన ఉపఖండాన్ని సంపద్వంతం చేసింది. దేశదేశాలకు యిక్కడి బౌద్ధ జ్ఞానం, బౌద్ధ విప్లవం వెలుగు నందించింది. కళలు శాస్త్రాలు ఎంతో గొప్పగా అభివృద్ధి చెందాయి.

బహుజనేతరులైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు ఏర్పరుచుకున్న వృత్తులు, పనులు వారి పనికి సంబంధించిన అనుభవాలను, ఆలోచనలను అందుకనుగుణంగానే అభివృద్ధి పరిచాయి. అందువల్ల వారు ప్రజల్ని మభ్యపెట్టి అజ్ఞానంలో ముంచి సంపదల్ని కాజేసే విద్యలను, శాస్త్రాలను, కళలను, అర్థంకాని తాత్విక మాయావాదాలను ప్రచారం చేశారు. కర్మ, పునర్జన్మ అని ప్రజల్ని మోసగించి వాళ్ళ

మాత్రం ఈ జన్మలోని సుఖాలన్నీ అనుభవించారు.

వారి మాటల్లోని డొల్లతనం వెల్లడి అవుతుందనే ముందుచూపుతోనేమో బహుజనులకు వేదవేదాంగ ఉపనిషత్తుల అధ్యయనం, అందుబాటు లేకుండా చేశారు. అందులోనే ఏదో వుంది అని ప్రజల్ని మోసగించడం కోసం బహుజనులు, స్త్రీలు వేదం చదివితే వింటే నాలుక కోస్తాం, చెవుల్లో సీసం పోస్తాం అని అన్నారు. వేదవేదాంగ ఉపనిషత్తులు వారి రోజువారీ జీవితాలకు ఎలాపనికి రాకుండా పోయాయో, వారీరోజు వాటిని కాకుండా, ఇంగ్లీషు విద్యలనభ్యసించి డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు కావాలని కోరు కోవడమే స్పష్టం చేస్తున్నది.

అయినప్పటికీ శంకరపీఠాలు, మఠాలు, మొదలైనవి యిప్పటికీ లక్షలాది మంది పైసాకష్టం చేయకుండా సమాజం సంపాదించే సంపదను మెక్కుతున్నారు. సమాజ సంపద తిని బతుకుతూ దాన్ని సృష్టిస్తున్న బహుజనులకు వ్యతిరేకంగా లక్షలాది బ్రాహ్మణులు, హిందూ సన్యాసులు, మఠాలు, పీఠాలు పనిచేస్తున్నాయి. వీరంతా ప్రజలకోసం పనిచేసే సమాజాన్ని మనం నిర్మించాల్సి వుంది.

ఈ రోజుల్లో కూడా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, వారి స్త్రీలు, పొలం దున్నడం, కట్టెలు కొట్టి అమ్ముకోవడం, నాట్లేయడం, రోడ్లూడ్చడం, చాకలి వృత్తి చేపట్టడం, లెట్రిన్లు శుభ్రంచేసే వృత్తులు చేపట్టడం, బావులు త్రవ్వడం, పునాదులు తీయడం, మట్టిమోయడం మొదలైన పనులు చేయడంలేదు. ఈ పనులు చేయాల్సిన అవసరంగానీ, పేదరికంగానీ వారికి లేదని దీంతో స్పష్టం అవుతుంది.

బ్రాహ్మణీకరణ పొందుతున్న శూద్రులు

శతాబ్దాలుగా బహుజనులు విప్లవాలు చేస్తున్నారు. అధికారం, సంపద సాధించిన గిరిజనులు, శూద్రులు, అతిశూద్రులు రాజులయ్యారు. వీరిలో కొందరు ఇటీవల (1920 నుండి) అగ్రకులాలుగా మారిపోయారు. కాలం గడిచినకొద్దీ చరిత్ర మరచిపోయి వీరు కూడా బహుజనులను నానా బాధలకు గురిచేస్తున్నారు. మన ప్రాంత విషయానికి వస్తే బహుజన విప్లవాల నుండి ఎదిగి అధికారం, అంతస్తు సాధించుకున్న శూద్రులైన రెడ్లు, వెలమలు, కమ్మలు, మొదలయినవాళ్ళు బహుజనేతర బ్రాహ్మణ క్షత్రియుల్లాగే బహుజనుల్ని కించపరిచారు. దోచుకున్నారు. హింసించారు. వారి స్వార్థం కోసం వాళ్ళు తమను కించపరిచిన బ్రాహ్మణుల్ని, బ్రాహ్మణవాదుల్ని కూడా గౌరవించి తలకెత్తుకున్నారు. ఈనాడు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో శూద్ర అగ్రకులాల్లో కొందరు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. శూద్ర సమాజం నుండి ఎదిగిన కులాల్లో కొందరు బ్రాహ్మణీకరణ పొందారు. దాంతో పుట్టు బ్రాహ్మణులు

తాత్విక బ్రాహ్మణవాదులకు ప్రతీకలయితే శూద్ర అగ్రకులాలు ఆర్థిక బ్రాహ్మణవాదానికి, భూస్వామ్య బ్రాహ్మణులకు ప్రతీకల య్యారు. బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యుల్తోపాటు శూద్ర అగ్రకులావాళ్ళే మన ప్రాంతంలో ఘరానా భూస్వాములుగా, పారిశ్రామివేత్తలుగా విస్తరిస్తున్నారు.

పని అంతరిస్తుంది కాని దానినుండి పుట్టిన అనుభవం, జ్ఞానం విస్తరిస్తుంది

పని అంతరిస్తుంది కాని దానినుండి పుట్టిన అనుభవం, జ్ఞానం విస్తరిస్తుంది. మనిషిలో ఎదిగిన మెదడు, చేతులు, ఆలోచన మనిషిని జంతువుల నుండి వేరుచేశాయి. సంఘ జీవితం జంతువుల్లో కూడా వుంది. ఆలోచన అనేది అస్తిత్వంకన్నా ఉన్నతమైనది. భౌతిక పదార్థంకన్నా ఉన్నతమైనది. ఆలోచన పని నుండే పుట్టినా పనికన్నా ఉన్నతంగా ఎదిగింది. పని అంతరిస్తుంది. కాని దాన్నిండి పుట్టిన జ్ఞానం విస్తరిస్తుంది. వారసత్వంగా కొనసాగుతుంది. అందువల్లనే భావజాల, జ్ఞాన, శాస్త్రరంగాల్లో పనిచేసేవారికి గౌరవం పెరిగింది. మనం చార్వాకులను, బుద్ధుడిని గౌరవించినా, మన ఉపాధ్యాయులను గౌరవించినా అదంతా అందులో భాగమే.

ఉదాహరణకు చార్వాకులు ఏ వస్తువును ఎలా తయారుచేయాలో నేర్పలేదు. బుద్ధుడు ఏ సంపద ఎలా సృషించాలో నేర్పలేదు. మనం ఎలా ఆలోచించాలి? మనం సమాజాన్ని ఎలా నిర్మించుకోవాలి అని చెప్పారు . మన ఆలోచనలు, జ్ఞానం ఎలా సాగాలో నిర్ణయించేది మన దృక్పథం. బ్రాహ్మణవాదులు ఈ దేశాన్ని సర్వనాశనంలోకి నెట్టిన బ్రాహ్మణవాద దృక్పథాల్ని ప్రచారం చేశారు. చేస్తున్నారు. సంపదలు సృష్టించే పనిలో వున్నారు గనక బహుజనులు ఈ దేశాన్ని నిరంతరం అభివృద్ధిపరిచే ఆలోచనలు చేశారు. బహుజనుల దృక్పథం తాటాకుల్లో కాకుండా వారి యింగిత జ్ఞానంలో, సంస్కృతిలో, ఆచరణలో మిళితమై వుంది. అది సామెతల్లో నుడికారాల్లో కూడా కనపడుతూ వుంటుంది.

ఆలోచనాశాస్త్రాలను బహుజనులు ఎంతో గొప్పగా అభివృద్ధి పరిచారు. కోటివిద్యలు కూటికొరకే అనే సామెతలో బహుజనుల భౌతికవాద, హేతువాద శాస్త్రీయ దృక్పథం యిమిడి వుంది. బ్రాహ్మణవాదులు విద్యలు, కళలన్నీ దేవుని కొరకే అని అంటారు. దేవుని పేరిట బ్రాహ్మణవాదులు ప్రజలను దోపిడి చేయడానికి పూనుకున్నారు.

దేవతలకు ఆపాదించిన మంచితనం, మనిషిలోనిదే. మానవత్వంలోని మంచితనమే దైవత్వానికి ఆపాదించారు. ఇతర దేశాల్లో ఏమోగానీ మనదేశంలో

బ్రాహ్మణవాదుల దేవతలు వేరు. బహుజన దేవతలు వేరుగా ఉన్నారు. బహుజన దేవతలంతా మనకోసం పాటుపడి సమాజాన్ని ముందుకు నడిపిన బహుజనులే అయివుంటారు. పెద్దల్ని గౌరవించే పద్ధతి ఆరాధనా సంప్రదాయంలోకి మారి వ్యవస్థీకృతం అయ్యాక మన పూర్వీకులే మనకు దేవతలయ్యారు. చారిత్రక వ్యక్తులైన క్రీస్తు, బుద్ధుడు దేవుళ్ళయినట్లుగానే చెరువుకట్టలు నిర్మించిన స్త్రీ కట్టమైసమ్మ అయింది. ఊరిని కాపాడిన స్త్రీ పోచమ్మ పోలేరమ్మ అయింది. కాకతీయుల నెదిరించి పోరాడి మరణించిన సమ్మక్క – సారక్కలు దేవతలయ్యారు. నిన్నటి బిర్సాముండా, కొమురంభీం చారిత్రక వ్యక్తులు ఈ రోజు పూజలందుకుంటున్నారు.

బ్రాహ్మణదేవతలు యిందుకు విరుద్ధం. వాళ్ళు బ్రాహ్మణవాదం సమర్థించి బహుజనులను సర్వనాశనం చేయడంకోసం కత్తులు దూసినవాళ్ళు. కులవ్యవస్థ, వర్ణధర్మ వ్యవస్థ స్థాపించి మనల్ని అణచివేయడంకోసం దండయాత్రలు చేసినవాళ్లు. మన బహుజన దేవతల పరపతిని చూసి కొందరిని బ్రాహ్మణదేవతలుగా కూడా మార్చారు వాళ్లు. తద్వారా కొందరు మన దేవతలు కూడా వాళ్లకు సాధనాలయ్యారు. ఈ దేవతలు శూద్ర అగ్రకులాలవాళ్ళు బ్రాహ్మణవాదంలో చేరిన వాళ్ళలాంటివారు. బౌద్ధ ఆరామాలు బహుజనులకు విద్యాలయాలయితే – హిందూ దేవాలయాలను బ్రాహ్మణులు సంపాదన సమకూర్చుకునే తమ దుకాణాలుగా, బ్యాంకులుగా మార్చుకున్నారు. అవి యిప్పటికీ బ్రాహ్మణులకు దుకాణాలుగా, బ్యాంకులుగానే పనిచేస్తున్నాయి. శూద్ర అగ్రకులాలు బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా ఆయా చారిత్రక దశల్లో ఉద్యమాలు నిర్వహించారు. కొంతకాలానికి వారితో కలిసిపోయారు. రెడ్లు, కమ్మలు 1910 నుంచి బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. భూస్వాములు బహుజనుల్తో పనిచేయించి సంపద సృష్టించి, దోచి, అణిచివేసి బతికారు. కాని బ్రాహ్మణులు, బ్రాహ్మణవాద శంకరమఠాలు, పీఠాలు, హిందూ సన్యాసులు కనీసం భూస్వాముల్లా పని చేయించడంలోనైనా పాల్గొనకుండా, మనిషిని మానసికంగా అణచివేసి, హింసించి, దోపిడిచేసి తిని బతుకుతున్న పరాన్నభుక్తులు.

ఎవరూ అగ్రకులాలు కారు – అందరూ శూద్రులే !

పుట్టు బ్రాహ్మణులు ఎవరు లేరు – పుట్టుకతో అందరూ శూద్రులే. శూద్రులుగా పుట్టిన కొందరు తమకు తామే బ్రాహ్మణులమని అగ్రకులాలమని ప్రకటించుకుంటున్నారు. "జన్మనా జాయతే శూద్ర" అని అన్నారు. అంటే పుట్టుకతో అందరూ శూద్రులే అని అర్థం.

మనదేశంలో పనిచేయించుకొని హింసించి సంపాదించిన భూస్వాములను వర్గశత్రు నిర్మూలన పేరిట చంపేసిన వాళ్ళున్నారు. కానీ ఏ పనీ చేయకుండా ఏ

సంపద సృష్టించకుండా ప్రజల ఆలోచనల్ని పక్కదారి పట్టిస్తూ సమాజాన్ని సర్వనాశనం చేస్తున్న శంకరమఠ పీఠాధిపతుల్ని భూస్వాములకన్నా ప్రమాదకారులని గుర్తించి వర్గశత్రునిర్మూలన పరిధిలోకి తీసుకోలేకపోయారు. కారణమేమంటే వారి కమ్యూనిస్టు, నక్సలైటు దృక్పథాల్లో బ్రాహ్మణవాదం చాపకింద నీరులాగా కొనసాగుతూనే వున్నది. నేటి కమ్యూనిస్టు, నక్సలైట్ల వాదాలు పుట్టుబ్రాహ్మణుల తాత్విక బ్రాహ్మణవాదులకు, శూద్ర అగ్రకులాల ఆర్థిక బ్రాహ్మణుల, భూస్వామ్య బ్రాహ్మణుల వాదాలకు, వారి అధికారానికి నిలయాలయ్యాయి. కమ్యూనిస్టు, నక్సలైటు పార్టీల్లో త్యాగాలు బహుజనులవి, నాయకత్వం కీర్తిప్రతిష్టలు, సుఖం అగ్రకులాలవా? అని బహుజనులు చేసిన పెనుగర్జన వారిని నిద్రపోనివ్వడంలేదు.

భారతదేశంలో కాంగ్రెసు సెక్యులర్ రూపంలో కనపడే బ్రాహ్మణవాద పార్టీ అయితే బిజెపి వంటివి ప్రత్యక్షంగానే బ్రాహ్మణవాద పార్టీలు. అగ్రవర్ణ, అగ్రకుల, నాయకత్వాన గల పార్టీలు ఈ దేశంలోని బ్రాహ్మణవాదం యొక్క విభిన్న ప్రతీకలే. వాళ్లు నిర్మించే పోరాటాలు కులాన్నిగానీ బ్రాహ్మణవాదాన్నిగానీ సరళీకరించవచ్చు గానీ నిర్మూలించలేవు.

కొందరిని దేవుళ్లతో సమానం అంటూ బహుజనుల్ని పశువులతో సమానంచేస్తూ మనుషుల్ని కులాలుగా, అంతస్తులుగా, నిచ్చెన మెట్లుగా విభజించిన ఈ మనుధర్మ వర్ణవ్యవస్థను, కుల వ్యవస్థను కూకటివేళ్ళతో సహా కూల్చాల్సి వుంది. అపుడే మనుషులంతా సమానమనే మహోన్నత ఆచరణ వెల్లివిరుస్తుంది. అందుకు మొదటగా మనం బహుజన కులాల మధ్య ఐక్యత పెంపొందాల్సి వుంది. బహుజన కులాల మధ్య విరివిగా కులాతీత వివాహాలు జరగాల్సి వుంది. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ బహుజనులారా మనలో ప్రతి ఒక్కరు కులాతీత వివాహాలు చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయండి. ఆచరించి ఆదర్శంగా నిలవండి.

సమస్త వర్గ, కుల, లింగ, జాతి, మత, భాష, ప్రాంత విచక్షణలను, అసమానతలను నిర్మూలించేందుకు మనం నడుం బిగించాలి. మనలో మనకు కలతలు లేపే విచ్ఛిన్నకారులు, మార్క్సిస్టులు, బ్రాహ్మణవాదులు మన చుట్టూ వున్నారు. స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని, అన్ని కులాల మధ్య, జాతుల మధ్య సమానత్వాన్ని సాధించేందుకు బహుజనులం అందరం ఒక్కటి కావాల్సి వుంది. వివిధ పార్టీల్లో, విద్యార్థి యువజన, ఉద్యోగ సంఘాల్లో పనిచేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బహుజనులంతా ఒక ఐక్యాచరణను రూపొందించుకోవాల్సి వుంది. ఏ విద్యార్థి యువజన సంఘాల్లోవున్నా, బహుజన విద్యార్థులు అన్ని రంగాల్లో గెలుపొందే విధంగా నాయకత్వంలోకి వచ్చేవిధంగా ఒక్కటి కావాలి. మనుషులంతా ఒక్కటై కుల ఆధిక్యతవల్ల

జంతువుల స్థాయికి దిగజారిన అగ్రకులాలను మనమంతా కల్సి మనుషులుగా మార్చాలి.

సకల సంపదలు సృష్టించింది మన పూర్వీకులు. వాటిని మనమంతా కల్సి అధికారం కైవసం చేసుకోవడం యెంతో అవసరం. మన సంపదల్ని మనం తిరిగి కైవసం చేసుకోవాలి. నూతన బహుజన సమాజాన్ని నిర్మించాలి. ఆ సమాజంలో సమానంగా స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యయుతంగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది.

ఆధునిక అభివృద్ధి ఆధునిక విద్య ద్వారానే సాధ్యపడుతుంది. ఎందుకంటే ఆధునిక అభివృద్ధి క్రమాన్ని అనుసరించి విద్యావ్యవస్థ రూపొందింది. మీరు ఉన్నత చదువుల్ని బాగా చదవాలి. గ్రామాల్లోని బహుజన పిల్లలనందర్నీ బడికి పంపాలని మనం ఉద్యమాలు చేపట్టాలి.

అందరికి ఉన్నత విద్య అందినపుడు అది ఒక గొప్ప నిశ్శబ్ద విప్లవం అవుతుంది. మనం యెన్నో కళల్లో శాస్త్రాల్లో నిపుణులం. అయినప్పటికీ బ్రాహ్మణవాదుల క్రూర హత్యాకాండతో బౌద్ధం అణచివేయబడ్డాక మనకు బ్రాహ్మణవాదం అక్షరాలు అందకుండా చేసింది. బౌద్ధం వున్నంతకాలం మనకు లిపి చదువు అందుబాటులోనే వుండేది. లిపితో పెద్దగా పనిలేని భావజాల రంగాల్లో భక్తి ఉద్యమాల్లో పాటల ద్వారా ఉపన్యాసాల ద్వారా యెంతో గొప్ప భావుకులు, తత్వవేత్తలు బహుజనులు ఎదిగారు. వారి చరిత్ర మనకు తెలియకుండా బ్రాహ్మణవాదం సకల విధాలుగా ప్రయత్నించింది. మన పూర్వీకుల చరిత్రను మనం తిరిగి నిర్మించాల్సి వుంది.

మధ్య యుగాల్లో ముస్లింలు బహుజనులకు ఎన్నో విషయాల్లో గొప్ప సేవలు చేశారు. మోటబావి, రాటు బొక్కెనల టెక్నాలజీ వాళ్లు ప్రవేశపెట్టిందే. పోస్టాఫీసు విధానాన్ని మొదట ముస్లిం పాలకుడైన షేర్‌షా ప్రారంభించారు. సాదరంగా చేయూతనిచ్చి మనల్ని మనుషులుగా గుర్తించి సమాన హోదానిచ్చి తమలో కలుపుకున్నారు.ముస్లింలలో మెజారిటీ ప్రజలు హిందూ మతంలోని కులవివక్ష, అణిచివేతల నుండి విముక్తం కావడానికి రాజుల మతమైన ఇస్లాంలోకి మారిన శూద్రులే.

అచ్చు యంత్రం పుట్టాక అక్షర విద్య ప్రాధాన్యత మునుపెన్నడూ లేనంతగా పెరిగింది. బ్రిటిష్ వాళ్లు క్రైస్తవులు కొందరు మన బహుజనులను కూడా అక్షర విద్య అందేందుకు కృషి చేశారు. ఆధునిక భారతజాతి నిర్మాతల్లో ఒకరయిన మహాత్మా జ్యోతిరావు పూలే, బహుజనులకు విద్య కోసం యేంతో కృషి చేశారు. సాహుమహరాజ్, పెరియార్ రామస్వామి, నారాయణగురు, అంబేద్కర్‌లు యెంతో కృషి చేయడంవల్ల బహుజనులు ఎన్నో రంగాల్లో అభివృద్ధి చెందారు.

బి.ఎస్.రాములు

Dalithayugam-1

03-09-09

107

నేటి విద్యావిధానం రూపొంది రెండువందల యేళ్లయినా కాలేదు. ప్రజా బాహుళ్యాన్ని లెక్కల్లోకి తీసుకుంటే మనకు జిల్లాపరిషత్ పంచాయితీ సమితి స్కూళ్లు ఏర్పడ్డంనుంచి గ్రామస్థాయిలో బహుజనులకు విద్య అందుబాటులోకి వచ్చింది. అనగా 1950 నించే మనకు విద్య విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. అయినప్పటికీ పేదరికం కారణంగా, దోపిడి కారణంగా నిరక్షరాస్యులైన 70 శాతం జనాభాలో 90 శాతం బహుజన కులాలవారే ఉన్నారు.

ఇలాంటి దశలో కొందరు ఇది అశాస్త్రీయ విద్యా విధానమని ఈ చదువులు మనకొద్దని ప్రచారం ప్రారంభించారు. వారి దృష్టిలో వృత్తికీ చదువుకూ మధ్య సంబంధం వుండాలని! నిరుద్యోగ సమస్య, ఆర్థిక అసమానతలు ఈ చదువులవల్ల పెరుగుతాయని వారు భావించారు.

మన బహుజనులం వేల ఏళ్ళుగా వృత్తికి, ఉపాధికి సంబంధం గల విద్యలే నేర్చుకున్నాం. వేల ఏళ్లుగా పని చేసిందంతా కులవృత్తులే గదా! అయినా అధికారం మన చేతుల్లో లేదు. బ్రాహ్మణవాదం అధికారం చెలాయించింది. వాటినే కులవృత్తులని పిలిచారు. వాళ్లు కులం ప్రాతిపదికలేని వృత్తివిద్యలు కోరుతున్నారు. భావజాల రంగంలో, రాజకీయ సామాజిక రంగంలో నాయకత్వం వహించడానికి అధికారం హస్తగతం చేసుకోవడానికి వృత్తివిద్యల్లో యిరుక్కుపోయిన వారికి సమయం, అవకాశం దుర్లభం అవుతున్నది. బ్రాహ్మణవాదులు తీరిక వర్గంగా మారి అందరికీ తగరాని, తీరికలేని వృత్తుల్ని ఆదర్శీకరించారు. దండం ప్రయోగించారు.

శాస్త్రీయ విద్యావిధానం కావాలని ప్రచారం చేయబడుతున్నది. ఇది అశాస్త్రీయ విద్యా విధానం అని ప్రచారం చేసే నాయకులెవరూ నిరాక్షరాస్యులు కాదు. ఈ చదువులు చదివి, ఈ చదువుల ఆసరాతోనే ఇంకా అదనపు జ్ఞానాన్ని, ఉద్యోగాల్ని సంపాయించుకొని బతుకుతున్నారు వాళ్లు. పోనీ వారి పిల్లల్నయినా చదువు మాన్పించి రోడ్లూడ్చే పనిలోగానీ, మట్టిమోసే పనిలోగాని పెడుతున్నారా? అబ్బే! ఎంచక్కా ఇంగ్లీషు కాన్వెంటు స్కూళ్ళల్లో వేసి పిహెచ్.డీల దాకా చదివిస్తున్నారు. తిరిగి చదువుమీద ఆధారపడే ఉద్యోగాల కెక్కిస్తున్నారు. అందువల్ల వీళ్లు నూతన మనుధర్మవాదులు. నాడు భయపెట్టి చదువుకోనీయకపోతే నేడు సిద్ధాంతం పేరు చెప్పి మంచి మాటల్తో చదువు వదిలి పెట్టేటట్టు చేస్తున్నారు. ఇది బ్రాహ్మణవాదుల, అగ్రకులాల కుట్ర. ఇది అశాస్త్రీయమైన చదువైతే ఇంగ్లాండులో, అమెరికాలో ఇదే చదువుతో పోయి సంపాదించి కోట్లకు ఎలా పడగెత్తుతున్నారు? రష్యా, చైనాల్లో ప్రవేశపెట్టిన శాస్త్రీయ విద్య పాఠ్యపుస్తకాల్ని ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేసి స్థానికీకరించి తామే స్కూళ్లను తెరిచి ఎందుకు నడపడంలేదు? ఇది అశాస్త్రీయ విద్యా విధానం అనే

వారినల్లా ముందు వారి డిగ్రీ కాగితాన్ని చింపేయమనండి. ఏ చదువుల వల్ల హోదా, ఉద్యోగం వచ్చాయో, వాటిని వదిలేయాలని నిలదీయండి. ఇది అశాస్త్రీయ విద్యావిధానమైతే ఈ విషయాన్ని అగ్రకులాల వారికి అర్థం చేయించి వారిని చదువు మాన్పించి వారిని దున్నుకునేట్టుగానీ, మురిక్కాల్వలు తీసే పనిగాని చేసేందుకు ఒప్పించి బీసీ, ఎస్సీ,ఎస్టీల చదువులకు, ఉద్యోగాలకు, రాజకీయ అధికారానికి పోటీ రాకుండా కృషిచేయాలని స్పష్టం చేయండి.

Dalithayugam-1

03-09-09

108

"విప్లవాల" మీద భ్రమలు, ఆశలు దేనికి?

కొందరు మార్క్సిస్టులు, విప్లవ రచయితలు, నక్సలైట్లు విప్లవం వచ్చేదాకా ఈ చదువులు, ఉద్యోగాలు, అధికారాలు, రాజకీయ అధికారం గురించి చర్చ అవసరం లేదని అంటుంటారు. దున్నుకోవడానికి చారెడు భూమి గురించి ఇప్పుడు మాట్లాడితే చాలంటారు. ఇలా అనేవాళ్ళు లెనిన్ రాసిన "రాజ్యం – విప్లవం" పుస్తకాన్ని మరోసారి చదవడం అవసరం. విప్లవం వచ్చాక కూడా యిపుడున్న ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు విద్యావంతులనే మరింత శిక్షణయిచ్చి విప్లవప్రభుత్వ అవసరాలకనువుగా మార్చుకుంటాం అని లెనిన్ "రాజ్యం విప్లవం"లో స్పష్టం చేశాడు. విప్లవం వచ్చాక సోషలిస్టు ప్రభుత్వంలో అలాగే చేశాడు. మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చాక కూడా యిదే పద్ధతిని అనుసరించారు. బ్రిటిష్‌ప్రభుత్వఉద్యోగులను, నైజాంప్రభుత్వఉద్యోగులను స్వాతంత్ర్యం వచ్చాక అలాగే కొనసాగించారు. అందువల్ల విప్లవప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కూడా అంతదాకా అన్ని అర్హతలు సంపాదించుకున్నవారికే ఉద్యోగాలు, రాజకీయాధి కారం ఉంటాయి. అందువల్ల ఇపుడు అన్ని రంగాల్లో అన్నిస్థాయిల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు జనాభాశాతం ప్రకారం ఎదిగే ప్రణాళికలతో లక్ష్యాలు నిర్ణయించుకున్నపుడే రేపటి సమాజంలో వారికి సరైన స్థానం లభిస్తుంది. లేని ఎడల ఇదే అగ్రకులాలు, అన్నీ హక్కు భుక్తం చేసికొంటాయి.

ఈ దేశంలో 23 కోట్ల జనాభా సోషలిజం స్థాయిలో మధ్య తరగతిగా జీవిస్తున్నారు. వీరిలో 15 కోట్ల మంది సోషలిజాన్ని అనుభవిస్తున్నారు. ఈ 15 కోట్లుగానీ, 23 కోట్లుగానీ ఈ చదువుల వల్లనే ఆ స్థాయికి యెదిగారు. ఈ 23 కోట్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు తక్కువనీ, అగ్రకులాలే ఎక్కువనీ మళ్లీ చెప్పాల్సిన పనిలేదు. అగ్రకులాలవాళ్లు తమ వృత్తి, ఉద్యోగాలకు, అధికారానికి బహుజనులు పోటీ కాకుండా వుండేందుకు కుట్ర పూరితంగా ఇది అశాస్త్రీయ విద్యా విధానమని వారి వారి ప్రతినిధులైన అగ్రకుల మేధావులు కమ్యూనిజం, విప్లవం పేరుతో ఊదరగొడుతున్నారు.

ఈ విద్యా విధానంలో అశాస్త్రీయ అంశాలున్నాయి. బ్రాహ్మణవాదం పాఠ్య

పుస్తకాల్లో పడగవిప్పి నాట్యం చేస్తున్నది. శ్రమను, బహుజనులను, స్త్రీలను కించపరిచే అంశాలు యెన్నో వున్నాయి. చరిత్ర, సామాజిక శాస్త్రాల్లో అగ్రకుల తత్వం, హిందూ మత తత్వం బుసలుకొడుతున్నది.

అయినప్పటికీ రెండు రెండ్లు నాలుగు అనే సత్యాలు కూడా ఈ చదువులోనే వున్నాయి. పదార్థ విజ్ఞానం, టెక్నాలజీ, సైన్సు, దాదాపు ప్రపంచవ్యాప్తంగా నేడు ఒకే తీరుగా బోధించబడుతున్నది. మనం బహుజన కులాలను ముస్లింలను, క్రైస్తవులను, సిక్కులను, స్త్రీలను కించపరిచే అంశాలను పాఠ్య పుస్తకాల్లో తీసేయాలని ఉద్యమించాలి. తెలుగు, హిందీ, సంస్కృతాది పాఠ్యాంశాల్లో బ్రాహ్మణవాద పద్యభాగాలను తీసేయాలని, జానపద ప్రజల పాటలను బీసీ, ఎస్సీలు, ఎస్టీల జీవితాల గురించి రాసిన వాటిని పాఠ్యాంశాలుగా చేర్చాలని, ఛందస్సు వగైరా భారాల్ని తొలగించాలని కోరాలి. అందుకు ఉన్నత విద్యల్ని ఉత్సాహంగా చదువుతూ ఉద్యమించాలి. శారీరక శ్రమను కించపరిచే పాఠ్యాంశాలను తొలగించే ఉద్యమాలు చేపట్టాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలను కించపరిచే పాఠ్యాంశాలను తొలగించాలి.

ఇప్పుడు ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్నది 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే. మరికొంత మంది మైనార్టీలే. అందువల్ల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అగ్రకుల ఉపాధ్యాయులను నియమించకూడదని, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను, లెక్చరర్లను, స్త్రీలను నియమించాలని ఉద్యమించాలి. పాఠ్యపుస్తకాలను బహు జనులే రాయాలి. కులాలను తిట్లుగా వాడే సంస్కృతిని నిర్మూలించాలి.

కులవివక్షను పరిష్కరించడం ఎంతో సులువు

కులవివక్షను పరిష్కరించడం ఎంతో సులువు. తమకు తాము అగ్రవర్ణాలుగా, అగ్రకులాలుగా చెప్పుకుంటున్నవాళ్ళు తమ కుల అహంకారాన్ని, అభిజాత్యాన్ని వదిలేసి సహృదయ మానవులుగా మారితే కులసమస్య, కులవివక్షత దానంతట అదే అదృశ్యమౌతుంది. అందుకు వారిని, వారిలోని చెడును సంస్కరించాలి. అన్నిరంగాల్లో, రాజకీయాల్లో, బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను, అధికారాన్ని ఆమోదించేవారు అగ్రకుల అహంకారాన్ని వదులుకొని ప్రజాస్వామ్యవాదులుగా ఎదిగినట్టే. వారిని గౌరవించాలి.

అగ్రకులాలను తిట్టేది లేదు, కొట్టేది లేదు. మనం చేయవలసిందల్లా వాళ్లను గౌరవించడం, గుర్తించడం మానుకోవడమే. వాళ్ల నాయకత్వం చెత్త అని గుర్తించి మన నాయకత్వాన్ని అభివృద్ధి పరుచుకోవాలి. మన తల్లులను, అక్కలను, చెల్లెల్లను, తండ్రులను, అన్నలను వాళ్లు "అసే ఒసే, అరే ఒరే" అనడాన్ని యెదిరించి వాళ్లు యెలా పిలుస్తారో మనం అలాగే వారిని పిలవాలి. వాళ్ళు హలో అంటే మనం హలో

అనాలి. వాళ్లు మనల్ని గౌరవిస్తూ నమస్కరిస్తే, మనం కూడా నమస్కరించాలి.

అగ్రకులాల వాళ్ల ఎదుగుదల అంతా ఇటీవలిదే. 1940-50 నుండే ఎదిగారు. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చాకే కాంట్రాక్టర్లయ్యారు. రాజకీయ నాయకులయ్యారు. పారిశ్రామికవేత్తలయ్యారు. ప్రజాస్వామ్యంలో అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని వాడుకున్నారు. వాళ్లు ఎదగడంతో వారిలోని కులతత్వం పెరిగింది. కుల అధికారం పెరిగింది. మీరు తలచుకుంటే దీన్నంతా పదేళ్ళలో మార్చడం సాధ్యమే! కుల వృత్తులనుంచి అందర్ని విముక్తం చేయాలి. అందరికి విద్య అందించాలి.

అగ్రకులాలవాళ్ల మెప్పుల కోసం ఎదురుచూసే వాళ్లంతా వారి నాయకత్వాన్ని ఆమోదిస్తున్నట్లే. మన మెప్పుకోసం వాళ్లు తహతహలాడేట్టుగా మనం మల్చుకోవాలి. ఓటుహక్కు వల్ల రాజకీయాల్లో బీసీ ఎస్సీ,ఎస్టీల మెప్పుకోసం తహతహలాడే స్థితి ఏర్పడింది. అందువల్ల ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అని మానవీయ తత్వాన్ని రాజ్యాంగబద్ధం చేసిన రాజ్యాంగం ఎంతో విలువైనది. మౌలికమైనది.

జాతుల సమస్య చిన్న రాష్ట్రాలు

ప్రజలు సామాజిక సమస్యలకోసం పోరాడుతుంటే వాటిని వెంటది వెంట రాజకీయ సమస్యలుగా రూపాంతరం చెందించి లబ్ధిపొందే ప్రయత్నంలో అది జాతుల సమస్యగా ప్రాచుర్యంలోకి వస్తుంది. సామాజిక సమస్యల కోసం పోరాడే సెక్షన్లు కింది వర్గాల కులాల నుండి వస్తుంటే, రాజకీయ సమస్యలుగా వాటిని మార్చే వర్గాలు సెక్షన్లు అంతకు కొంచెం పై సెక్షన్ల నుండి వస్తుంటాయి. మరోవైపు సామాజిక సమస్యలు పరిష్కారం కాకుండా ప్రతిష్టంభనకు గురవుతుంటే అవి తమకుతామే రాజకీయ సమస్యలుగా ముందుకు తెస్తాయి. మరెన్నో రీతుల్లో జాతుల సమస్యలు ముందుకు వస్తాయి.

జాతి-ఉపజాతి-సంస్కృతి-మానసిక ఐక్యత

ఈ క్రమంలో కొందరు భారత జాతీయత అనేదే లేదంటూ వివరిస్తున్నారు. ఆసియా, యూరపు వంటివి ఎంత వాస్తవమో భారతదేశం కూడా అంతే వాస్తవం ఆసియా జాతుల సంస్కృతి యూరపు జాతుల సంస్కృతి దేనికది ప్రత్యేకమైనవి. అట్లే భారత జాతులకు ఒక ఉమ్మడి మానసిక ఐక్యత, ఉమ్మడి జాతీయత కూడా వుంది. అది మతం రూపంలో, కలం రూపంలో కూడా కొనసాగుతున్నది. రైల్వేలు, రవాణా, ప్రచారం, ప్రసార సాధనాలు, సినిమాలు, విద్యావ్యవస్థ, 150 ఏళ్లుగా గల కేంద్రీకృత కేంద్రప్రభుత్వం, దానికి వ్యతిరేకంగా అన్ని జాతులు ఐక్యమై పోరాడాల్సిన అనివార్యత ఉత్పన్నం

కావడం ద్వారానూ జాతులమధ్య ఐక్యతే పెరగడం, మొదలైన వాటి ద్వారా భారత జాతీయత అనే ఉమ్మడి అంశం కొనసాగుతున్నది.

అలాగే అదే సమయంలో తెలుగు జాతీయత వంటివి కూడా వున్నాయి. మళ్ళీ యిందులో రాయలసీమ, తెలంగాణా, కోస్తా, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణా వంటి మానసిక ఐక్యతలు జాతుల సమస్య స్థాయిలో ఏక కాలంలో కొనసాగుతున్నాయి.

కుటుంబంలోని పిల్లలస్థాయి మానసిక ఐక్యత, పెద్దల మానసిక ఐక్యత వేరుగా వుంటాయి. ఇరుగు పొరుగు పిల్లలు ఎంచక్కా ఆడుకుంటుంటే, పెద్దలు వారి వారి సామాజిక గౌరవాలో, గతాలోరీత్యా విడదీస్తూ వుంటారు. అదీయిదీ నూరిపోస్తూ వుంటారు. అలాగే ఒక వూళ్ళో పాత పొరుడు, ఇటీవలే స్థిరపడిన కొత్త పొరుడు మధ్య వైరుధ్యం వుంటుంది. భర్త జనతాపార్టీకి వేయినోటు అంటాడు. భార్యవెళ్ళి ఇందిరాగాంధీకి వోటువేసి వస్తుంది. ఇదొక స్త్రీ మానసిక ఐక్యత. భర్తమీద నిరసన కూడా కావచ్చు.

Dalithayugam-1
03-09-09
110

పర్టికులర్-యూనివర్సల్

ఇట్లా ప్రతి సమస్యలో మానసిక ఐక్యత, సంస్కృతి, చిన్నదానిలా కనపడుతూనే జాతుల సమస్య స్థాయిలో కొనసాగు తుంటాయి. ఫలానా మతం వారిని పొడిచేశారట. అనగానే అది మీరటో, భీవండో, అది తనజాతో, కాదో అనే దాంతో నిమిత్తం లేకుండా ఆవేశకావేశాలు పెరిగిపోతాయి. అలాగే కారంచేడులో, చుండూరులో ఇంద్రవెల్లిలో జరిగిందానిపట్ల ఆయా కులాలు, ప్రజలు మనదేశంలో ఎంత చిన్న సమస్యైనా దానికి గల యావద్దేశ మానసిక ఐక్యత కారణంగా జాతుల సమస్యగా, భారత జాతీయ సమస్యగా రూపం తీసుకుంటుంది. అందువల్ల మనదేశంలో జాతుల సమస్య ఏకఖండం కాదు. అది పార్లమెంటు వోటుహక్కు, అసెంబ్లి వోటుహక్కు, మునిసిపాలిటి వోటుహక్కు, జిల్లా పరిషత్ చోటుహక్కు, మండలవోటుహక్కు, గ్రామ పంచాయితీ వోటుహక్కు, వ్యవసాయ పరపతి సంఘం వోటు హక్కు, వృత్తి ఉద్యోగ సంఘం వోటుహక్కు, కులంలోని వోటుహక్కు, జాతిలోని వోటుహక్కు, పత్రంలోని వోటుహక్కు, వంటి స్థాయిల్లో పలు పర్టికులారిటీల్లోకి మార్పిడి పొంది ఉనికి కొనసాగిస్తున్నది.

ఈ సమస్య రకాల పర్టికులారిటీల్లోకి ఒదిగిపోయి అస్తిత్వం కొనసాగుతున్న జాతుల సమస్యను సమాన స్థాయిలో ఉద్యమంగా, నిర్మించడం, సమన్వయ పరచడం జరిగినపుడే పూర్తిస్థాయిలో అన్ని రంగాల్లోని ప్రజలు జాతుల సమస్యగా కదులుతున్నారని అర్థం. ఇది సాధ్యమైనపుడు జాతుల పోరాటాలు సాధారణంగా

నిరాయుధంగానే సాగుతాయి. ఏమంటే ప్రజల సంఖ్యే ఒక పెద్ద ఆయుధాగారంగా పాలకవర్గాల్ని బెంబేలెత్తిస్తుంది. ఈశాన్య రాష్ట్రాల జాతుల సమస్య మితిమీరిన నిర్బంధాలకు గురికావడానికి అవి ఒక మూల వుండడం, మిగిలిన భారత ప్రజలతో సాంస్కృతిక సంబంధాలు బాగా నీరసించి వుండడం, జనసంఖ్య తక్కువ వుండడం, ప్రజలందరు కదలక పోవడం, సరిహద్దు ప్రాంతాల్లో వుండడం అనేవి అదనపు కారణాలయ్యాయి. కాగా ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంగా ఏర్పడలేకపోవడానికి కేంద్ర ప్రభుత్వ నిర్బంధం కన్నా, రాష్ట్ర ప్రభుత్వం, దాని లబ్దిదారుల నిర్బంధమే ఎక్కువ కారణమయ్యింది.

స్థలకాలాల నిర్దిష్టత్వం-పరిణామాలు

గోర్ఖాలాండ్ ఉద్యమంలోనూ కేంద్ర నిర్బంధం కన్నా రాష్ట్ర నిర్బంధమే హెచ్చుగా సాగింది. దండకారణ్య, గోదావరిలోయ పీడిత ప్రజల ఆదివాసుల పోరాటాల్లోనూ కేంద్ర నిర్బంధం కన్నా రాష్ట్రప్రభుత్వ నిర్బంధమే ఎక్కువ సాగింది. రాయలసీమ ఉద్యమంలోనూ యిదే జరిగింది. అదువల్ల రాష్ట్రాలకు ఇతోధికాధికారాలు, స్వయం నిర్ణయాధికారహక్కు వంటివి అత్యంత మనోహరమైనవి నినాదాలేమీ కావు. జాతులవారీగా, ప్రాంతాలవారీగా చిన్నరాష్ట్రాలుగా విభజన జరగడం ముందు జరగాలి. అందుకు హిందూ మత సమైక్యతను కోరుతున్నందువల్ల బి.జె.పి. వంటి పార్టీలు కూడా సుముఖంగా వున్నాయి. ఆదివాసీ ప్రాంతాలను కలుపుతూ మొట్టమొదట రాష్ట్రాల పునర్ విభజన జరగాలి. ఆదివాసీ ప్రాంతాల్లోని వనరులు, అటవీ సంపద మీద ఆశతో కేంద్రం కన్నా ఆయా రాష్ట్రాలే రాష్ట్రాల పునర్ విభజనని వ్యతిరేకిస్తున్నాయి. ఆ మధ్య రాజీవ్ గాంధీ దేశంలోని జిల్లా కలెక్టర్లరినీ సమావేశ పరిచాడు. కలెక్టర్లతో పాటు గ్రామ పంచాయితీలకు కూడా లేఖలు రాసినట్టున్నాడు.

సంకీర్ణ ప్రభుత్వాలు-జాతులు

ఎన్డీయే, యూపిఏ ప్రభుత్వాల ఏర్పాటులో స్థానిక పార్టీల జాతుల సంకీర్ణతను చూడవచ్చు. బెంగాల్, తెలుగు, తమిళ, మరాఠీ గుజరాతీ, తదితర ప్రాంతీయ జాతులు బలం పుంజుకొంటున్న కొద్దీ దాన్నిఏ సమతౌల్యంలోకి తేవడానికి గూర్ఖాలాండులో ఎదగ దల్చుకున్న జాతులకూ మధ్య గల వైరుధ్యంలో కేంద్రం తన అవసరాల రీత్యా తనదోపిడీకి శాంతి భద్రతల అనివార్యత రీత్యా అభివృద్ధికరమైన పాత్ర నిర్వహించగలదు. బ్రిటీష్ ప్రభుత్వం నుండి అంబేద్కర్ సాధించిన విజయాలు ఈ వైరుధ్యానికి సంబంధించినవే. అందువల్ల పెద్ద జాతుల్లోని అగ్రకులాల జాత్యహంకార విస్తరణ వాదానికి వ్యతిరేకంగా, కుల సమస్య, వర్గసమస్య, ప్రాంతీయ

అసమాన అభివృద్ధి సమస్య, ఆదివాసీ సమస్యలతో కలిసి కట్టుగా ఉద్యమాలు నిర్మించాలి. ఉదాకు. గోండ్వానా రాష్ట్రం కొరకు, కోస్తాలోని దళితులు ఉద్యమాలు నిర్మించాలి. అట్లే ఉదాకు, ఎస్సీ, ఎస్టీ, బీసీల నాయకత్వంలో జరిగే తెలంగాణా, రాయలసీమ ప్రత్యేక రాష్ట్రాల కొరకు లేదా రాష్ట్ర ప్రతిపత్తి కొరకు కోస్తా దళితులు కలిసి ఉద్యమించాలి.

ఇలా అభివృద్ధి చెందిన జాతులలో కుల సమస్య ద్వారా ముందుకు సాగే మానసిక ఐక్యతను అభివృద్ధి చేయడం అవసరం అవుతున్నది. వెనకబడిన ప్రాంతాలలో ప్రాంతీయ మానసిక ఐక్యత జాతుల మానసిక ఐక్యత గుర్తించి సహకరించ వలసి వస్తున్నది. పాకిస్తాన్ విభజన చాలా మంది మత ప్రాతిపదికపై జరిగిందనడంలో నాకు కొంచెం భిన్నాభిప్రాయం వుంది. పంజాబీ, బెంగాలీ జాతుల పెరుగుతున్న ఆధిపత్యాన్ని తెగ కోయడానికి భారత దళారీ పాలక వర్గాలు నిశ్చయించుకోవడం ద్వారా పాకిస్తాన్ ఏర్పడింది. వాళ్ళుంటే మద్రాసీల్లాగా ఎప్పటికీ పోటీయేనను కున్నారు. మద్రాసీలతో రాజీపడి తమ శ్రేణుల్లో చేర్చుకున్నారు. పాకిస్తాన్ విభజన క్రమంలో జాతిని రెండుగా చీల్చడంలో బ్రాహ్మణ కుల ఐక్యత కూడా పనిచేసింది. ఆ రాష్ట్రీయ స్వయం సేవకసంఘం, బి.జె.పి. వంటివి అఖండ భారత్‌ను నినదిస్తున్నాయి కానీ అదిఉత్త కాలక్షేపం కబుర్లు మాత్రమే. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యత, బహుజన పార్టీ తాత్వికత వంటివి పెరిగే క్రమంలో అఖండభారత్‌ను మొట్టమొదట వ్యతిరేకించింది ఆరెస్సెసే.

విభిన్న జాతుల కూటమి బలపడకుండా కేంద్రం రాష్ట్రాల్లో జిల్లాను ప్రాతిపదిక యూనిట్‌గా తీసుకునే అవకాశం వుంది. ఇలా వైరుధ్యంలోని అంశాలన్నింటినీ పరిశీలిస్తూ, వైరుధ్యంలోని ఏ అంశం పీడితులకు వెంటనే సాధించే అవకాశం వుందో వాటిని సాధిస్తూ పోవాలి.

ఒకసారి నిర్ణయించి అదే పద్ధతిలో నిరంతరం సాగడం జడత్వం. నిరంతరం పరిస్థితుల్ని బేరీజు వేస్తూ ఆలోచన, ఆచరణ, మార్చుకోవడానికి, జీరో ప్రాతిపదిక బడ్జటులా, రొటేటింగ్ పంచవర్ష ప్రణాళికలా ఒక ఏడు, రెండేళ్ళు, వంటి కాలపరిమితిలోని ఆయా తీర్మానాలకు విధించాలి. అవి కాల పరిమితి తీరగానే ఆ తీర్మానం దానంతట అదే రద్దయ్యే విధంగా (నేటి ఉద్యోగ సంఘాల ఎన్నికల లాగా) ముందే రాసుకోవాలి. ఒక తీర్మానం చేసి దానికి ఎపుడూ తలలు తాకట్టు పెట్టకూడదు. ఇదొక బానిస మనస్తత్వ అవశేషం. కొంచెం శాస్త్రీయంగా చెప్పాలంటే "తీర్మానాన్ని" సరుకును చేయడం. అటు తర్వాత ఆ సరుకుపై, దాన్నించి ఉత్పన్నమై పరాయీకరించే రాజ్యాధికార సమస్య కోసం దాన్ని ఆరాధించడం అవుతుంది.

Dalithayugam-1
03-09-09
111

నిర్మాణం–రాజ్యం–అరాజ్యం పర్టిక్యులర్ యూనివర్సల్

రాజ్యం ఎపుడో పుట్టి ఇపుడు కొనసాగుతోంది అనుకోవడం జడత్వం. రాజ్యం వర్తమానంలోని ఆచరణలో భాగంగా పుడ్తోంది పెరుగుతోంది. అనేది చలనం–గతితర్కం. పురుషాధిపత్యం ఇపుడు ఆచరణలో ఉండడం వల్లనే అది కొనసాగుతోంది. నీ ఆచరణే పురుషాధిపత్యాన్ని సృష్టించు కుంటున్నది. పెంచుకుంటున్నది. (ఈ.హెచ్.కార్–చరిత్ర అంటే ఏమిటి పుస్తకం చూడండి). అలాగే నీ ఆచరణలో అగ్రకుల ఆధిక్యత ఉండడం వల్లే అది కొనసాగుతోంది. నీ ఆచరణ అగ్రకులాధిపత్యాన్ని సృష్టించుకుంటున్నది. పెంచుకుంటున్నది. అంతేగానీ అది గతం కాదు. భవిష్యత్తుకు సంబంధించినది కాదు. రాజ్యం, పరాయీకరణ ఈ క్షణంలో పుడుతున్నాయి. అది ఈ క్షణంలోనే ఉంది. దాన్ని పరిష్కరించాలి.

"రాజ్యం", అణిచివేత, పరాయీకరణ పురుషాధిపత్యం, అగ్రకులాధిపత్యం, వర్గాధిపత్యం ఈ క్షణంలోనే పుడుతున్నాయి. అవి వర్తమానంలో ఈ క్షణంలోనే పరిష్కరించబడాలి. ఇవి ఎప్పుడో అదృశ్యం కావడాన్ని నిర్మాణాలకు పరిమితమై ఆలోచించ కూడదు. జ్ఞానం, జ్ఞాన శాస్త్రాలు రూపొందే క్రమాల మూలాలకు వెళ్ళి పరిశీలించాలి. అందులో భాగంగా ఎంగెల్స్ రాసిన "వ్యక్తిగత ఆస్తి – రాజ్యం పుట్టుక", లెనిన్ రాసిన "రాజ్యమూ–విప్లవమూ" మొదలుకొని ఎన్నో మార్క్సిస్టు మౌలిక రచనలను కొన్నిటినైతే 50 సార్లు చదివాను. పాశ్చాత్య, ప్రాచ్య తత్వశాస్త్రాలను ఈ కోణంలో తిరిగి పరిశీలించి చూస్తే

పాశ్చాత్య తత్వశాస్త్రాల్లో "రాజ్యం" అదృశ్యం కావడం గురించిన ఆసక్తి పెద్దగా కనపడలేదు. ప్రాచ్యతత్వశాస్త్రాల్లో అది విస్తారంగాపరుచుకొని ఉంది. బుద్ధుడు మొదలుకొని ఇటీవలి జిడ్డు కృష్ణమూర్తి ఓషోలదాకా తమదైన రీతుల్లో "రాజ్యం" అదృశ్యం కావడం గురించి విస్తారంగా చర్చలు చేశారు. పరిష్కారాలు కనుగొన్నారు. అయితే వారు సూచించిన పరిష్కారాలు ప్రజలు ఆచరిస్తుంటే వాటిని పాలకవర్గాలు, బ్రాహ్మణవాదులు, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల్లోకి విస్తరించి "రాజ్యం" అదృశ్యం అయ్యే క్రమాల ద్వారానే "రాజ్యం" అణిచివేతలను కొనసాగించారు.

దాంతో ప్రశ్న మళ్ళీ మొదటికొచ్చింది. జ్ఞానం, తర్కం, తత్వశాస్త్రం, దృక్పథం అనేవి స్వయంగా ''రాజ్యం'' గా అణిచివేత సాధనాలుగా కొనసాగుతున్నాయనిపించింది. దీన్ని చర్చిస్తూ "వాస్తవం ఒక్కటే దృక్పథాలు అనేకం" అనే వ్యాసం రాశాను. ''రాజ్యం'' అదృశ్యం కావడం గురించి పరిష్కారం దొరికిందనుకోవడం లేదు. దొరికిందని ఎవరైనా చెప్తే అది అబద్ధమే.

జ్ఞానం ఆచరణ నుండి పుడుతుంది. ఆచరణ నుండి పుట్టే జ్ఞానాన్ని ప్రత్యక్ష జ్ఞానం అంటారు. ఒకరి ఆచరణ ద్వారా పుట్టిన జ్ఞానాన్ని మరొకరు స్వీకరిస్తే ఆ జ్ఞానం పొందిన క్రమాన్ని పరోక్షజ్ఞానం అంటాము. ఎవరి ప్రత్యక్ష ఆచరణ నుండి పరోక్ష జ్ఞానంగా పొందారో వారిపైనే ఆ జ్ఞానంతో ఆధిపత్యం చెలాయించడం పరాయీకరణ. ఈ పరాయీకరణను స్థిరపరిచే నిర్మాణం రాజ్యం, నిర్మాణం, ఉంటే దాన్ని ఎలా పరిష్కరించాలి. ప్రత్యక్ష ఆచరణలో ఉన్న వారి కనువుగా పరిష్కరించాలి. కార్మిక వర్గ విప్లవం ద్వారా ప్రత్యక్ష ఆచరణలో గల రైతు కూలీలుగా, కార్మికులకనువుగా రాజ్యం, నిర్మాణం సాగాలి అని కోరుకోవడం జరుగుతున్నది. శ్రామిక కులాల ద్వారా, మహిళల ద్వారా నిర్మాణాలు, ఉద్యమాలు సాగినప్పుడు ప్రత్యక్ష ఆచరణ, జ్ఞానం కలవారే నాయకత్వంలో వున్నట్టు.

పార్టీ, ప్రజాసంఘాలు వాటి నిర్మాణాలు, నిర్మాణసూత్రాలు కార్మికవర్గ విప్లవ రాజ్యం యొక్క స్వభావాన్ని బీజప్రాయంగా తెలుపుతాయి. ప్రజలకు, ప్రజా సంఘాలకు, పార్టీకి మధ్య సంబంధాలు విస్తరించడమే విప్లవపార్టీ రాజ్యక్రమం.

నిర్మాణాలు, నిర్మాణసూత్రాలు ఆ నిర్మాణంలో ఆధిపత్యంలో ఉన్నవారి కనువుగా అదే నిర్మాణంలో పని చేసే ఇతరులను అణిచివేసే సాధనంగా మారితే దాని పరిష్కారం ఎలా అనేది ప్రశ్న చర్చించాను. రాజ్యాన్ని అదృశ్యం చేయబోయి తానే అంతకన్నా పెద్ద రాజ్యంగా మారడమే జరిగితే అపుడు పరిష్కారం ఏమిటి? అని లెనిన్ "రాజ్యం–విప్లవం"లో వాపోయాడు. పాశ్చాత్య శాస్త్రాలు ఎక్కువ మేరకు ఇలాగే భావించాయి. నేను చర్చిస్తున్న విషయం అర్థం అవుతుందా...! అందుకని "రాజ్యం"ను, నిర్మాణాల

Dalithayugam-1
03-09-09
112

చర్చను అమూర్త స్థాయిలోంచి వాటి ఫంక్షన్స్ లోకి మార్చి ఉదాహరణల రూపంలో చర్చిస్తాను.

ప్రభుత్వం, రాజ్యం, అనే నిర్మాణాలు మనపట్ల అణిచివేత సాధనాలుగా పనిచేస్తున్నప్పుడు వాటి అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరించడం ద్వారా దాని ఆధిక్యతను గుర్తించనిరాకరిస్తున్నాం. ఎమర్జెన్సీ పూర్వం కొన్ని నక్సలైటు పార్టీలు ఈ ప్రభుత్వాన్ని గుర్తించం అన్నట్టుగానే ఆదిశంకరుడు ఈ సమాజాన్ని గుర్తించం అన్నాడు. అంతిమసత్యం వేరే ఉందని కూడా ఇరు పక్షాలూ అన్నారు. అయితే వారు చెప్పిన అంతిమసత్యాలు ఒకటి కావు.

ఆదిశంకరుడు సమాజం, రాజులు, తనపై నెరిపే ఆధిపత్యాన్ని గుర్తించనిరాకరించాడు. నక్సలైట్లు ప్రభుత్వం, నెరిపే ఆధిపత్యాన్ని ఎన్నికల వ్యవస్థను గుర్తించ నిరాకరించాడు. నిర్మాణ రూపాలను గుర్తించనిరాకరించడం అనేది ఆయా నిర్మాణాల ఆధిక్యతను నిరాకరించడం కోసం చేస్తారని అవగతం అవుతున్నది. నేను పార్టీనో, విరసాన్నో, గుర్తించ నిరాకరించడంలో వాటి ఆధిక్యతను గుర్తించ నిరాకరించడంకోసమే నన్నమాట. అలాగే నీవు నన్ను తత్వవేత్తగా గుర్తించ నిరాకరించడంలో తత్వవేత్తగా నా ఆధిక్యతను నిరాకరించడంకోసమే నన్నమాట.

నిర్మాణాల ఆధిక్యతను నిరాకరించడంకోసం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తారు. అవి మిధ్య కాకపోయినా వాటి విలువను మిధ్యగా భావించడం ఇది. కాని ఆదిశంకరుడిని ఏనుగు వెంటాడింది. పారిపోయాడు. అలాగే పోలీసులు, నక్సలైట్లను వెంటాడారు. పారిపోయారు. రహస్య నిర్మాణం చేపట్టారు. ఆదిశంకరుడు గజం మిధ్య–పలాయనం మిధ్య అన్నాడు. 33 ఏళ్ళకే చనిపోయాడు. బతికుంటే ఈ ఆటను అతను మార్చుకొని ఉండేవాడు. మావోలా చెప్పి ఉండేవాడు. పాలకవర్గాలు కాగితం పులే. కాని వ్యూహం, ఎత్తుగడల రీత్యా అది నిజం పులిగానే లెక్కించాలన్నాడు మావో. అలానే ఆదిశంకరుడు ఈ సమాజం సత్యం కాదు గానీ వ్యావహారిక సత్యం అని వుండేవాడు. ఆదిశంకరుని తత్వానికి ఈ ప్రభుత్వం ఈ ఎన్నికలు సత్యంకాదు అనే నక్సలైట్ల తత్వానికి ఇలా చాలా దగ్గరి పోలికలున్నాయి. బౌద్ధ ఆరామాలకు పోటీగా ఆది శంకరుడు ఆరు పీఠాలు నిర్మాంచాడు. అంటే వ్యవహారిక సత్యంలో మావోలాగే ఆదిశంకరుడు నిజం పులే అని వ్యూహం, ఎత్తుగడలు తీసుకున్నాడు.

ప్రాచ్య తత్వశాస్త్రాల్లో రాజ్యాన్ని, నిర్మాణాల్ని, నిరాకరించే రూపంలో రాజ్యం అణిచివేతను తనకుతాను తొలగించుకోవడం ఎలా అనే వ్యక్తిగత సమస్యగా చర్చించారు. అందుకు సామాజిక ఉద్యమాల్ని కూడా నిర్మించారు. బౌద్ధం, భక్తి, ఉద్యమాలు, యోగం, ధ్యానం ఈ కోవలోకి వస్తాయి.

ప్రభుత్వాన్ని నక్సలైట్లు గుర్తించ నిరాకరించినా, వారిని ప్రభుత్వం నిర్బంధించింది, కాల్చివేసింది. అలాగే ఎన్నో ప్రాచ్యతత్వ శాస్త్రాలు రాజ్యంను గుర్తించ నిరాకరించినా పాలకవర్గాలు, బ్రాహ్మణ వాదాలు కర్మ, పునర్జన్మ, వర్ణం, కులం, రాజు దైవాంశుడు, వగైరాల ద్వారా ప్రజల్ని నిర్బంధించాయి. వాటిల్లో పెట్టి వారిని మానసికంగా కాల్చివేసారు.

బుద్ధుడు రాజ్యాన్ని ప్రజాస్వామికరించాల్సిన ఆవశ్యకతను గుర్తించాడు. వ్యక్తి, వర్గం, వర్ణం, కులం, సమాజం, ప్రభుత్వం, రాజ్యం, వేర్వేరుగా కాకుండా ఏక కాలంలో రాజ్యం అదృశ్యం అయ్యేక్రమాలు తీసుకోవాలని అభిలషించాడు. అందుకనువైన నిర్మాణాలను చేపట్టాడు. సంఘం శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మ శరణం గచ్ఛామి అన్నాడు. కరుణ, ప్రేమ, ప్రజ్ఞ, అష్టాంగమార్గాలు చెప్పి ఆచరించి చూపాడు.

అతడు పోయాక బౌద్ధమహాసభలు జరిగాయి. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ వంటివే ఆ సభలు. బౌద్ధ సంగీతి లాగే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కూడా రద్దయిపోయాయి. వేరు వేరు నిర్మాణాలు, భావజాల ప్రత్యేకతలు సంతరించుకున్నాయి. రాజ్యాన్ని అదృశ్యం చేయడానికి ప్రారంభమైన నిర్మాణాలు రాజ్యంగా మారడంతోనే విచ్ఛిన్నతకు బీజాలు పడుతున్నాయని చరిత్ర చెప్తోంది.

కొందరు స్త్రీవాదులు దీన్ని లోతుగా అధ్యయనం చేశారు. సమస్త నిర్మాణాలు రాజ్య వ్యక్తీకరణలే అని అభిప్రాయానికి వచ్చారు. సమస్త నిర్మాణాలు రాజ్య వ్యక్తీకరణలే అనే అభిప్రాయం కొత్తది కాదు. ఈ విషయం ప్రాచ్య తత్వశాస్త్రాల్లో మూడువేల ఏళ్ళుగా ఒక బలమైన దృక్పథంగా చర్చించబడుతూ వస్తూనే ఉన్నది. ఆచార్య నాగార్జునుడు తత్వశాస్త్రం, తర్కం దృక్పథం కూడా రాజ్యంగానే కొనసాగుతున్నాయి అని తెల్సుకున్న క్రమం నుండి రాజ్యం అదృశ్యం కావడాన్ని కనుక్కోబోయి శూన్యవాదానికి చేరుకున్నాడు. ఆదిశంకరుడు మిధ్యావాదానికి చేరుకున్నాడు. ఇవి రెండూ ప్రస్తుతం మన ఆచరణలో వున్నాయని పైన చూశాం. అలాగే తనను అణిచివేసే వాడిని కోపంతో వాడెంత వాని బతుకెంత అని ఈసడించడంలో, ఈ కోవలోకి చేరే పాలకవర్గాలమీద విసిరే వ్యంగ్యంలోనూ ఈ శూన్యవాద, మిధ్యా వాదాలున్నాయి. పాలకవర్గాలనేవి కాగితం పులి అన్నమావో మాట శూన్యవాద తత్వశాస్త్రం ద్వారానే సాధ్యపడుతుంది.

ఆచార్య నాగార్జునుని కాలం నాటికే ప్రాచ్య తత్వశాస్త్రాల్లో, పాశ్చాత్య కాంట్, హెగెల్‌లు బలమైన శక్తిగా ఎదిగారు. కాంట్ హెగెల్‌ల తత్వశాస్త్రాల నుండే మార్క్సిజం రూపొందించబడిందని కొందరికైనా తెలుసుననుకుంటాను. ప్యూర్‌బా నుండి కొంత

Dalithayugam-1

03-09-09

113

గ్రహించారు. బుద్ధుడు చెప్పిందాన్తో పోలిస్తే ప్యూర్‌బా చాలా వెనక బడి ఉంటాడు. మరో మాటలో చెప్పాలంటే గతితర్కం, రాజ్యం అదృశ్యం కావడం, భౌతిక వాద ప్రాపంచిక దృక్పథం అనేవి నాగార్జునుని కాలం నాటికే కాంట్ హెగెల్‌ల కాలంనాటి స్థాయి నందుకున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనదేశంలో నాగార్జునుని తర్వాత రావలసింది మార్క్సిజమే. కాగా ఆదిశంకరుల అద్వైతం వచ్చింది. భక్తి ఉద్యమాలు వచ్చాయి. మార్క్సిజం వంటిది మాత్రం రాలేదు? కారణం ఏమంటే ఇక్కడి వర్ణవ్యవస్థ కుల వ్యవస్థ ప్రత్యక్షజ్ఞానం, పరోక్షజ్ఞానం అనే రెండు క్రమాల మధ్య సమన్వయం లేకుండా చేసింది.

పాలకవర్గాలు, బ్రాహ్మణవాదులు, అగ్రవర్ణాలు శ్రమజీవులు కాదు. వారికి ప్రత్యక్ష ఆచరణ ద్వారా జ్ఞానం అందే ఆచరణలేదు. కాని మానవ సమాజం సాధించిన జ్ఞానం అంతా పరోక్ష జ్ఞానంగా వారివద్ద జత పడి వున్నది. ప్రజల వద్ద ఇది ఇంగితజ్ఞానం రూపంలో మాత్రమే ఉన్నది. ప్రజలవద్ద గల ఇంగిత జ్ఞానం, ప్రత్యక్ష ఆచరణ ద్వారా కలిగే జ్ఞానం కలిసి ప్రజలజ్ఞానం అభివృద్ధి అయ్యేది. కాని దాన్ని మైక్రో విశ్లేషణచేసే ప్రత్యేక తత్వశాస్త్రలు వారికి నిరాకరించబడ్డాయి. ప్రజలజ్ఞానం సామెతలు, నుడికారాలు రూపం తీసుకొంది. శతక కవులు, గురు రవిదాస్, కబీరు, గురు నానక్, వేమన, పోతులూరి వంటి వారి రచనలు ప్రజల ఇంగితజ్ఞానం, ప్రత్యక్ష జ్ఞానం కలిసి సమన్వయం పొందిన స్థాయికి చెందినవి. పెరియార్ రామస్వామి, త్రిపురనేని రామస్వామి, అలాగే చార్వాకులు చెప్పిన జ్ఞానం ఇంగితజ్ఞానం, ప్రత్యక్షజ్ఞానం పరస్పర సమన్వయానికి సంబంధించినవి.

శాస్త్రానికి ఒక పరిభాష దానివంటూ కొన్ని నిర్మాణ పద్ధతులు, చర్చ, తీరుతెన్నులుంటాయి. పైన చెప్పిన ఇంగితజ్ఞానం, ప్రత్యక్షబౌద్ధం గల వారికి ఈ దేశంలోని వర్ణవ్యవస్థ కులవ్యవస్థ వల్ల అలాంటి శాస్త్రాలు, వాటి శాస్త్ర పరిభాష విశ్లేషణ పద్ధతి, చర్చ తీరుతెన్నులు అందలేదు. దానివల్ల రెండు క్రమాలు జరిగాయి.
1. ప్రత్యక్ష జ్ఞానం, ఇంగితజ్ఞానం నిరంతరం ఎదుగుతూ మారుకుంటూ పోవడం.
2. పరోక్ష జ్ఞానం బ్రాహ్మణవాదాలు నిరంతరం వెనకబడి పోతూ తిరిగి సవరించుకొని తనలోకి చేర్చుకొంటూ, తన ఆధిపత్యం విషయంలో ఏ మార్పు లేకుండా స్టేట్‌గా కొనసాగడం.

బ్రాహ్మణవాద శాస్త్రకారులు శూద్రకులవృత్తుల వంటి ప్రత్యక్ష ఆచరణలో ఉంటూ జ్ఞానం సంపాదించినా ఈ స్థితి ఉండేదికాదు. శూద్ర కులవృత్తుల వంటి ప్రత్యక్ష ఆచరణలో ఉన్నవారు శాస్త్రకారుల స్థాయి జ్ఞానం సంపాదించుకొన్నా ఈ స్థితి ఉండేది కాదు. ప్రత్యక్ష జ్ఞానం, ఇంగితజ్ఞానం, పరోక్షజ్ఞానంల మధ్య సమన్వయం లేని డిలింకు

దశ ప్రపంచంలో మరెక్కడా లేదు. కులవ్యవస్థ కారణంగానే ప్రపంచంలో ఎక్కడా లేని ఈ స్థితి యిక్కడ ఉత్పన్నమైంది. గుప్తుల కాలంలో బౌద్ధాన్ని దెబ్బదీసి బ్రాహ్మణవాద మనుధర్మ హిందూవ్యవస్థను పటిష్టం చేయడంతో శాస్త్రాల్లో ఈ స్థితి మరింత కరుడుగట్టుకు పోయింది. నేటి భారతరాజ్యాంగ ప్రాతిపదికలు రూపు దిద్దుకొనే కాలం దాకా ఇదే స్థితి కొనసాగింది.

సరుకుల ఉత్పత్తిలో నాణ్యతలో 1810 దాకా ప్రపంచంలో భారతదేశ శూద్రులే ఆధిపత్య స్థానంలో వున్నారు. భారతదేశానికి సంభవించిన దండయాత్రలు, వలసలు అన్నీ (నేటి నయావలస వాదుల్తో సహా) దేశంలోని శూద్రుల ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సరుకుల సంపదలు, ప్రకృతి సంపదల కారణంగానే అని చెప్పవచ్చు. ప్రాచీన ప్రపంచానికి ఆస్ట్రేలియా, అమెరికా, ఆఫ్రికా ఖండాలు తెలియవు. అభివృద్ధి చెందిన ప్రాచీన ప్రపంచం అంటే మొత్తం ఆసియా, కొంతమేరకు యూరప్ మాత్రమే. గ్రీకు ఫిలాసఫీ యొక్క చరిత్ర క్రమాన్ని పాశ్చాత్య తత్వశాస్త్రాలు అని, ఇండియా చైనా ఫిలాసఫీ యొక్క చరిత్ర క్రమాన్ని ప్రాచ్య తత్వశాస్త్రాలు అని వ్యవహరించబడుతున్నాయి. పాశ్చాత్య తత్వశాస్త్రాలు నేనుత్వంకు ప్రాధాన్యతనిచ్చి నేను ను రాజ్యంగా మార్చాయి. ప్రాచ్యతత్వశాస్త్రాలు "నేనుత్వం" అదృశ్యం కావడానికి కోల్పోవడానికి ప్రాధాన్యతనిచ్చి "నేను"లోని రాజ్యం అదృశ్యం అయ్యే విధంగా అభివృద్ధి చెందాయి. రాజ్యం అదృశ్యం కావడాన్ని ఆధ్యాత్మికంగా వర్గీకరించారు కొందరు.

నేటి పాశ్చాత్య తత్వశాస్త్రాల మూలాలు గ్రీకులో ఉన్నాయి. గ్రీకు ఫిలాసఫీ, ఇండియన్ ఫిలాసఫీ పరస్పరం ప్రభావితమయ్యాయి. తత్వశాస్త్రాల కుదురు ఇండియా, చైనా, గ్రీకుల్లో ఉంది. ఒక్క గ్రీకు తత్వశాస్త్రమే ఇపుడు ప్రపంచ తత్వశాస్త్రంగా చర్చించబడుతోంది. ఇండియా చైనా తత్వశాస్త్రాలు గ్రీకుకన్నా తక్కువేమీ కావు. ఎక్కడి నైసర్గిక స్థితుల్లో అక్కడి ఆచరణ తత్వశాస్త్రాలు రూపొందాయి. ఇండియన్ ఫిలాసఫీని, గ్రీకుక్రమం నుండి వచ్చిన ఫిలాసఫీని 1930ల్లో స్టేర్ బాట్స్కీ అనే తత్వవేత్త చర్చించి సోవియట్ యూనియన్‌లో పుస్తకాలు ప్రచురించాడు. దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ ఆ చర్చని సుసంపన్నం చేసే బదులుగా బౌద్ధాన్ని వదిలేసి బ్రాహ్మణ వాదుల రచనల నుంచి భౌతికవాదాన్ని, గతితర్కాన్ని వెలికి తీసేపని పెట్టుకున్నాడు.

శ్రమజీవులది ప్రత్యక్షజ్ఞానం. బ్రాహ్మణవాదులది పరోక్షజ్ఞానం. కులవ్యవస్థ ఈ రెంటి సమన్వయాన్ని అసాధ్యం చేసింది. శాస్త్రం శాస్త్రంగానే ఉండిపోయింది. ప్రత్యక్షజ్ఞానం ఇంగితజ్ఞానంగానే శాస్త్ర ప్రతిపత్తిలోకి మార్చబడకుండా మిగిలిపోయింది. కమ్యూనిస్టు పార్టీకి, ప్రజా సంఘాలకు మధ్యకూడా ఇపుడు ఈ స్థితే కొనసాగుతున్నది. అందువల్లే పైన అదంతా వివరించాల్సి వచ్చింది.

Dalithayugam-1

03-09-09

114

ప్రజాసంఘాలు శ్రమజీవులు, వారిది ప్రజలతో పెనవేసుకున్న ప్రత్యక్షజ్ఞానం, ప్రత్యక్ష ఆచరణ. పార్టీ నాయకత్వం ఇతరుల అనుభవాల నుండి తన జ్ఞానాన్ని రూపొందించుకుంటుంది. పార్టీ అగ్రనాయకత్వం పరోక్షజ్ఞానం ద్వారానే జ్ఞానం పొందుతుంది. ప్రత్యక్ష జ్ఞానం కార్యకర్తలది. ప్రజాసంఘాలది. దీన్లో పార్టీపై నాయకత్వానిదే అంతిమ నిర్ణయం అయ్యేదైతే పరోక్ష జ్ఞానానికి ప్రత్యక్ష ఆచరణ లోబడి ఉండాలని కోరడం అవుతుంది. అంటే మనదేశంలో బ్రాహ్మణవాదులు కుల వ్యవస్థలో పొందిన స్థానంలో పార్టీపై నాయకత్వం ఉంటుంది. తద్వారా పరోక్షజ్ఞానం గలవాడు ప్రత్యక్ష ఆచరణలోగల వారిపై ఆధిపత్యంగా, రాజ్యంగా పరిణమించడం జరుగుతున్నది.

ప్రత్యక్ష జ్ఞానం, ప్రత్యక్షాచరణ అనేవి చైతన్యానికి, సృజనాత్మకతకు సంబంధించినవి. సృజనాత్మకత, జ్ఞానాభివృద్ధి అనేవి ప్రత్యక్ష ఆచరణ నుండి ఉత్పన్నమవుతాయి అని నేను బలంగా విశ్వసిస్తాను. మార్క్సిస్టులు కూడా యిదే చెప్తారు. పరోక్షజ్ఞానం గలవారు ప్రత్యక్ష ఆచరణను, నిర్దేశిస్తే సృజనాత్మకత నశిస్తుంది. గిడసబారుతుంది. బ్రాహ్మణవాదం ఎలాగైతే స్టేట్‌గా మళ్ళీ మళ్ళీ అదే ఉచ్ఛరించినట్టుగా ఆచరణ గానుగెద్దులా మారుతుంది. ఈ పాయింటుపై పార్టీ వ్యతిరేకించడం సహజం. కాని సృజనాత్మకతే ప్రాణం అయిన రచయితలు, కళాకారులు కూడా వ్యతిరేకిస్తే వారిలో సృజనాత్మకత గానుగెద్దులా భూభ్రమణంలా జడత్వ భ్రామకంగా మారిపోయిందని అర్థం.

పరోక్షజ్ఞానాన్ని అంతా కలబోసి ఇంజనీర్ ఒక చక్కని యంత్రం తయారు చేస్తాడు. దాన్ని నడిపేది కార్మికుడు. కార్మికుడు దానిపై పనిచేసే అనుభవంతో ఆ యంత్రం ఇంకెలా ఉంటే బావుంటుందో కొన్ని ఊహలు కలుగుతాయి. వాటిని ఇంజనీర్ స్వీకరిస్తే కొత్తయంత్రం తయారు చేస్తాడు. స్వీకరించకపోతే? ఆ యంత్రం అలాగే పాతమోడల్‌లోనే ఉంటుంది. ఇక్కడ ఇంజనీరు పార్టీ నాయకత్వం. కార్మికుడు కింది కార్యకర్తలు, ప్రజాసంఘాలు.

భావ వ్యక్తీకరణలో నిర్మాణరూపాలు అడ్డంకిగా మారినపుడు ఏర్పడే ప్రతిష్టంభనను కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సూత్రాల్లో, పార్లమెంటరీ పార్టీల నిర్మాణ సూత్రాల్లో పరిష్కరించబడవలసే ఉన్నది. దీన్ని పరిష్కరిస్తే కామన్ కాజ్ కోసం ప్రపంచంలోని పార్టీలు ఎన్ని విభేదాలున్నప్పటికీ కల్సిపని చేసే కనీస కార్యక్రమం ప్రాతిపదికగా (ఐక్యరాజ్య సమితిలా) "వేదిక", "నిర్మాణం" ఏర్పడుతుంది.

నిర్మాణం పేరిట భావవ్యక్తీకరణని అడ్డుకోవడం కన్న పాశవిక నిర్బంధం ఏముంటుంది? ఒకరికి కొన్ని భావాలు బలంగా ఏర్పడం నుండే మార్క్సిస్టు దృక్పథం

రూపుదిద్దుకొంటుంది. వారికి పార్టీలో చేరాక కలిగే అనుభవాల నుండి కలిగే భావాల్ని కూడా అలాగే బలంగా వాస్తవం అని విశ్వసిస్తారు. అవి తప్పు అని, వ్యక్తీకరించడానికి వీల్లేదని అన్నాక అ నిర్మాణంలో ఆ భావజాలాన్ని బలంగా విశ్వసించేవారు లాకప్పు బాధితుడిలాగే ఫీలవుతారు. బయటకు వెళ్ళిపోతారు. లేదా అందులో రాజీపడ్తారు. ఈ రెండూ తప్పే, కాని అది తప్ప వేరే నిర్మాణం లేదు. కనక బయటకు వెళ్ళక తప్పదు. లేదా రాజీపడకా తప్పదు. ఉద్యమకారులు తమ విప్లవ ఆచరణలో భాగంగా కలిగిన అనుభవాలను విప్లవం స్వీకరించాలని కోరుకుంటారు. అలా స్వీకరించినపుడే జ్ఞానం, భావాలు, దృక్పథం పరిణతి చెందే 'నిర్మాణం' నిర్మాణసూత్రాల్లో ఆచరణలో ఉన్నట్లవుతుంది. లేనట్లయితే తన అనుభవాల నుండి పుట్టే జ్ఞానాన్ని, తాను చెప్పే జ్ఞాన సిద్ధాంతాన్ని తానే నిరాకరించినట్లవుతుంది.

ఇపుడు మన సమాజంలో ఒక "న్యాయం" ఆదర్శంగా ఉంది. పేదవాడివైపు నిలబడడమే "న్యాయం". నడిచేమనిషి-సైకిల్ మనిషికి మధ్య ఆక్సిడెంటు అయితే సాధారణంగా సైకిల్ మనిషిని తప్పు పడ్తాం. సైకిల్‌కు స్కూటర్‌కు మధ్య అయితే సైకిల్ మనిషిని సమర్థిస్తాం. మనిషికి కారుకు మధ్య ఆక్సిడెంటు అయితే మనిషిని సమర్థిస్తాం. కారుమీద కేసుపెడ్తాం. కాగా ఇందుకు భిన్నంగా పార్టీలో పై వారికి కింది వారికి మధ్య తేడాలొస్తే పైవారిని సమర్థించడం సాధారణం అవుతున్నది. కేంద్ర కమిటీకి ఒక చిన్న కార్యకర్తకు ఆక్సిడెంటు అయితే కింది కార్యకర్తను తప్పుపడ్తే ఆ నిర్మాణ సూత్రాలు వాటిలోని ప్రజాస్వామ్యం ఎవరికి అనుకూలంగా ప్రవహిస్తోంది. చిన్నవారికనుకూలంగానా? పెద్దవారికనుకూలంగానా?

ఏ పార్టీలో నైనా గమనించండి. ఆ పార్టీ నుండి భిన్నాభిప్రాయాలతో గానీ, తన నాయకత్వ అభివృద్ధి కోసం గానీ, బయటకు వెళ్ళిపోయినప్పుడు ఆ ఒక్కడిని, పార్టీలో గల వేలమంది, లక్షలాది మందితో కూడిన అనేక ప్రజాసంఘాల బలంతో విమర్శిస్తుంటారు. ఖండిస్తుంటారు.

సానుభూతి ఒక్కడివైపు ఉండాలా? వేలాది, లక్షలాది మందితో కూడిన బలమైన పార్టీ వైపు ఉండాలా? పార్టీ వైపు ఉండాలి అని గనక అంటే అది నిర్మాణంలోని ఆధిపత్యానికి, రాజ్యానికి అనువుగా మాట్లాడడమే. అది రాజ్యహింసను, రాజ్య ఆధిక్యాన్ని నిర్మాణ సూత్రాల రూపంలో సమర్థించడమే తప్ప ప్రజాస్వామిక విలువలను, సూత్రాలను రాజ్యం అదృశ్యమయ్యే క్రమాలను ఏ మాత్రం సూచించదు.

పార్టీనే సమర్థించాలి అనే సూత్రమే గనక అన్ని రంగాల్లో ఆచరించేదైతే అదే సూత్రంతో ఎంతో బలం గల ప్రభుత్వాన్ని సమర్థించి, ఒక్కరొక్కరుగా చేయబడి వేటాడబడుతుండే ప్రజాసంఘాలను, ఉద్యమాలను, నాయకులను, ఇతర ప్రతిపక్ష

పార్టీలను నిర్బంధాల పాలు చేస్తూ అణచివేయడం సమర్థించినట్లవుతుంది. అలాగే ప్రభుత్వం క్రూరంగా చేపట్టిన ప్రజాఉద్యమకారుల హత్యాకాండను, ఎన్‌కౌంటర్లను సరియైనవే అని చెప్పాల్సి వస్తుంది. పార్టీని సమర్థించే పేరిట చాలామంది తాత్వికంగా చేస్తున్న తప్పు ఇదే.

ఇలా నిర్మాణాన్ని నిర్వహించడంలో భాగంగా రాజ్యం ప్రతిక్షణం పుట్టిపెరుగుతున్నది. ప్రత్యక్ష ఆచరణ, ప్రత్యక్షజ్ఞానంపై దాన్ని పరోక్షంగా సాధించి దానిపైనే ఆధిపత్యం చెలాయించడం నుండి రాజ్యం పుడుతున్నది. వ్యక్తిగత ఆస్తిహక్కు రద్దయి సమిష్టి ఆస్తిహక్కు నిర్మాణాలు ఏర్పరచుకుంటే దాన్ని నిర్వహించే నిర్వహణలో భాగంగా రాజ్యం పుట్టి పెరుగుతున్నది. మన సహకార రంగం, ట్రేడ్ యూనియన్లు పార్టీలు, మానవ సంబంధాల్లో భాగంగా రాజ్యం పుడ్తున్నది. మానవ సంబంధాల్ని మానవీయం చేసే నిర్మాణ సూత్రాలు కావాలి.

పౌరహక్కులు-నిర్మాణం-పర్టికులర్ యూనివర్సల్

రాజ్యానికి, నిర్మాణానికి, దాని ఆధిపత్యభోక్తలకూ, దానిలోని ఇతర సభ్యులకు (పౌరులకు, పార్టీ సభ్యులకు) మధ్య జరిగే పౌరహక్కుల పోరాటంలో, భావ ప్రకటనా హక్కుల పోరాటంలో నిర్మాణంలో ఆధిపత్యంలో వున్న వారి వైపు నిలబడేవారు పాలకవర్గాలు. ఇండివిద్యువల్ సభ్యుని ప్రాథమిక హక్కులకై నిలబడే వారు ప్రజాస్వామిక విప్లవవాదులు, పోరాట హక్కుల వాదులు, పీడిత వర్గ వాదులు. యూనివర్సల్ విలువలు, పౌరహక్కులు, వ్యక్తి హక్కుల రూపంలోను అంతిమంగా ఆచరణలో ఉంటాయి.

పౌర సమాజం, ప్రభుత్వాలు, రాజ్యాంగాలు ఎన్ని ఆదర్శాలు చెప్పినప్పటికీ పౌరులు వ్యక్తిగతంగా అనుభవించేవి, పొందేవి మాత్రమే నిజమైన స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం. చెట్టుత్వం అనే యూనివర్సల్ విడిగా ఎక్కడా వుండదు. వేపచెట్టు, మామిడి చెట్టు నిర్దిష్ట పర్టికులర్ రూపాల్లోనే చెట్టుత్వం కొనసాగుతుంది. నిర్దిష్టమైన పర్టిక్యులర్ సమస్త చెట్ల సార్వజీన లక్షణాలనే చెట్టుత్వంగా సూత్రీకరిస్తాం. అంతే తప్ప చెట్టుత్వం అంటూ ప్రత్యేకంగా ఎక్కడా వుండదు. అడవి అనేది ఎక్కడా వుండదు. అనేక రకాల చెట్లు, చేమలు, జంతువులు కలిసి వుండే ప్రాంతాన్నే అడవి అంటారు. ఇది ఫలానా చెట్టు అంటూ నరికేసుకుంటూ వెళితే అడవి ఎక్కడా మిగలదు. ప్రతి వ్యక్తి హక్కులను ఇది ఫలానా సామాజిక వర్గానిది, ఫలానా భావజాలానిది, ఫలానా కొందరిది మాత్రమే అంటూ వారి హక్కులను నరికేసుకుంటూ వెళితే ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, భావ ప్రకటనా స్వేచ్ఛ, నిర్మాణంలోని స్వేచ్ఛ, రాజ్యాంగంలోని స్వేచ్ఛ ఎక్కడా మిగలదు.

అన్ని చెట్లను నరికి వేస్తే అడవి ఎలా అదృశ్యమవుతుందో అందరి గురించి చెప్పే ఆదర్శాలు, విలువలు, హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ అదృశ్యమవుతాయి.

ప్రతి వ్యక్తికి అందేది మాత్రమే నిజమైన స్వేచ్ఛ. నిర్మాణంలో, రాజ్యాంగంలో ఆధిపత్యంలో గల వారి స్వేచ్ఛ అందులోని సభ్యులస్వేచ్ఛ కాదు. ఈ రెంటి మధ్యన గల తేడాయే రాజ్యం-అణిచివేత. పరాయీకరణ. నేటి ప్రభుత్వ వర్గాలు -ఓటు-పౌరుడు, పౌరహక్కులు రాజ్యాంగ నిర్మాణంతో దాన్ని పోల్చి చూసుకుంటే పలు విషయాలు తేలికగా అవగతం అవుతాయి.

అందువల్ల నా భావాలు వ్యక్తం చేయడానికి పార్టీలో, ఉద్యమంలో, నిర్మాణంలో అవకాశం లేనప్పుడు వాటిని వదిలేశాను. నా భావజాల చర్చను ముందుకు తీసుకెళ్లాను.

Dalithayugam-1

03-09-09

116

3

చారిత్రక పత్రాలు

ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదికకు

"అరసం" సందేశం

Dalithayugam-1
03-09-09
117

ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ప్రథమ మహాసభల్లో సందేశం ఇవ్వవలసిందిగా ఆహ్వానించినందుకు మొదటగా "అరసం" పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే ఈ మహాసభలు విజయవంతం కావాలని, ప్రయోజనకరమైన చర్చలు ప్రారంభమై దళిత సాహిత్య దిశను నిర్దేశించే దశలో ఎంతో ముందడుగును సాధించాలనీ మనసారా కాంక్షిస్తున్నాను.

దళితుల అనుభవాలను, అనుభూతులను, కష్టనష్టాలను, సంవేదనలనూ చిత్రించడంతోపాటు, దళితుల పురోగతిని, దళితుల సుఖమయ జీవితాన్ని, సామాజిక న్యాయాన్ని, సమసమాజ నిర్మాణాన్ని కాంక్షించేంది 'దళిత సాహిత్యం' అని 'అభ్యుదయ రచయితల సంఘం' అభిప్రాయపడుతున్నది. కేవలం రచయిత పుట్టిన కులం ప్రాతిపదికపై మాత్రమే కాకుండా, అతని 'ఓరియంటేషన్' ప్రాతిపదికపై అతని ప్రాపంచిక దృక్పథం ప్రాతిపదికపై అతను రాస్తున్న సాహిత్యం 'దళితానుకూల సాహిత్యమా?', 'దళిత వ్యతిరేక సాహిత్యమా?' అని నిర్దేశించవలసిందిగా 'అరసం' కోరుతున్నది. దళిత సాహిత్యం కుల విద్వేషాలను రెచ్చగొట్టే అన్యకుల ద్వేషం దిశగా పయనించకుండా, కులనిర్మూలన దిశగా ప్రయాణం చేస్తూ, కులాతీత, మతాతీత, వర్గాతీత సమాజ నిర్మాణం కోసం కృషిచేస్తున్న విస్తృత ప్రగతిశీల సాహిత్యోద్యమంతో స్నేహపూర్వక వైఖరిని ప్రదర్శించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

నిజమే. దళితుల సమస్యలను దళితులే ప్రతిభావంతంగా చిత్రించగలరు. దళితుల స్వానుభవం నుండి దళిత చైతన్యాన్ని ప్రదీపింపజేయగలరు. తమ కష్టసుఖాలను సమర్థవంతంగా ప్రతిబింబింపచేయగలరు. నేడు దళితులు విద్యావంతులౌతున్నారు. సంఘటితపడుతున్నారు. ఉద్యమిస్తున్నారు. సాటి దళిత సోదరులను చైతన్యపరచడానికి సాహిత్యాన్ని ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. ఇది హర్షించదగిన, ఆహ్వానించదగిన పరిణామంగా 'అరసం' భావిస్తున్నది.

జాతీయోద్యమ కాలంలో 'నిరసన'గా ప్రారంభమైన దళిత సాహిత్యం, తెలంగాణా సాయుధ పోరాటం కాలంలో ప్రతిఘటన చైతన్యాన్ని ప్రదర్శించింది. వామపక్ష సాహిత్యోద్యమంలో తిరుగుబాటు స్ఫూర్తిని చిత్రిస్తున్నది.

1977లో దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తూ సెప్టెంబర్ 1న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహించింది. ఆ సందర్భంగా హరిజన, గిరిజన, బలహీనవర్గాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ 'అరసం' రచయితలు రాసిన గీతాల సంకలనం 'ఉప్పెన' వెలువడింది. ఆ సంకలనంలోని అనేక గీతాలు ఈనాటికీ దళితుల నాల్కలపై కదలాడుతున్నాయి. అలాగే 'అరసం' ప్రచురించిన 'అగ్గిచిగుళ్ళు', 'కవితాభ్యుదయం' వంటి అనేక సంకలనాల్లో, సంపుటాల్లో 'అభ్యుదయ రచయితలు' నిర్దిష్టమైన పీడితజన పక్షపాతాన్ని, దళితానుకూల భావజాలాన్ని వ్యక్తీకరించారు. ఈనాటికీ తమ రచనల్లో వ్యక్తీకరిస్తున్నారు.

గత సంవత్సరం నవంబరు 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగిన అరసం రాష్ట్ర మహాసభలు 'దళిత సాహిత్యం', 'స్త్రీవాద సాహిత్యం', 'సాహిత్యంలో సిద్ధాంతరాహిత్యవాదం' అనే అంశాల మీద కూలంకషంగా చర్చలు జరిపాయి. దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యాల పట్ల సానుకూల వైఖరిని ప్రదర్శించవలసిందిగా ప్రగతిశీల రచయితలను నిర్దేశించాయి. సాహిత్యంలో సిద్ధాంత రాహిత్య వాదాన్ని చీల్చిచెండాడవలసిందిగా పిలుపునిచ్చాయి.

ఏ ఉద్యమానికైనా కలిసివచ్చే మిత్రులెవరో, కలహించే శత్రువులెవరో స్పష్టంగా నిర్వచించుకోవలసిన అవసరం ఉంటుంది. మిత్రపూర్వక వైరుధ్యాలను సంయమనంతో పరిష్కరించుకోవడం, శత్రుపూర్వక వైరుధ్యాల మీద సమీరం ప్రకటించడం సరైన పోరాట వైఖరికి నిదర్శనం.

ఇవ్వాళ 'దళిత సాహిత్యం' విస్తృత ప్రగతిశీల సాహిత్యోద్యమంతో స్నేహపూర్వక సత్సంబంధాలు కలిగిఉండడం పీడిత దళిత వర్గ ప్రయోజనాలను పరిరక్షించడానికి తోడ్పడుతుంది. అలాగే ప్రగతిశీల సాహిత్యోద్యమం దళిత ఉద్యమం వల్ల, దళిత సాహిత్యోద్యమం పట్ల సానుకూలంగా స్పందించడం, దళిత చైతన్యంతో సాహిత్యరూపాలను సృష్టించడం అభ్యుదయోద్యమ విస్తృతికి దోహదం చేస్తుంది.

నేటి 'సామాజిక వాస్తవికత'గా ఉన్న 'కులం'పై నిర్విరామ నిరంతర పోరాటాన్ని మనమంతా కలిసి నిర్వహించవలసిన అవసరం ఉంది. కులం పునాదులమీద లేచిన మతాన్ని, మతోన్మాద శక్తుల విధ్వంసకర విన్యాసాలను మన రచనల ద్వారా ఎండగట్టాల్సి ఉంది.

సంఘసంస్కరణ, ఆర్థిక పోరాటం, రాజకీయ విముక్తి లక్ష్యాలుగా త్రిముఖ పోరాటాన్ని మనమంతా కొనసాగించవలసి ఉంది.

మహాత్మా జ్యోతిబాపూలే, నారాయణగురు, పెరియార్ రామస్వామి నాయకర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్, కారల్ మార్క్స్, లెనిన్ సిద్ధాంతాల సమన్వయంతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ దోపిడీలను తుదముట్టించాల్సి ఉంది.

1987 అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 'అఖిలభారత దళిత రచయితల ప్రథమ మహాసభలు రూపొందించిన ప్రణాళికలో ఇలా పేర్కొనడం జరిగింది ..... "మానవ విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై ఆధారపడవలసిన వర్గరహిత సమాజ నిర్మాణం మన లక్ష్యం. దళితుల విముక్తి కోసం సాహిత్యాన్ని సృష్టిస్తూనే సకల మానవాళి విముక్తి కోసం కూడా కలాలను అంకితం చేయడం మన ధ్యేయం. దళిత సాహిత్యం కేవలం దళితుల జీవితాలను చిత్రించడంతోనో, దళితులను ప్రేరేపించడంతోనో దీని కర్తవ్యం పూర్తికాదు. దళిత చైతన్యాన్ని వారిలో రగిలించి దోపిడీపై పోరాడే ధైర్యాన్ని వారిలో మేల్కొల్పాలి."

ఈ ప్రణాళిక నిర్దేశించిన మార్గంలో ఈనాడు దళిత రచయితలు, కళాకారులు, మేధావులు సమైక్యంగా సాంఘిక అసమానతలపై పోరాడుతూ ఆర్థిక దోపిడీనుండి విముక్తిని కాంక్షిస్తూ రాజకీయ అధికారం కోసం ఉద్యమించాల్సి ఉంది. ఈ ఉద్యమాలు పీడిత దళితవర్గ చైతన్యంతో కొనసాగించే నిర్దిష్టమైన తాత్విక దృక్పథాన్ని దళిత రచయితలకు, కళాకారులకు, మేధావులకు నేటి రాష్ట్ర మహాసభలు కలిగించాలని కాంక్షిస్తూ రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన దళిత సాహిత్య సోదరులకు "అరసం" పక్షాన అభినందనలు తెలుపుతున్నాను.

"పీడిత ప్రజాసాహిత్యం, ప్రజాకళలు వర్ధిల్లాలి"

డా॥ ఎస్వీ సత్యనారాయణ
ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల
సంఘం, ఎస్ఆర్‌టి 23, ముషీరాబాద్,
హైదరాబాద్

పార్టీలో అంతర్గత సమస్య

కా॥ పి.సి. కమిటీ సభ్యులకు,

నా రచనలు "అరుణతార"లో అచ్చు వేయకుండా కా॥ చెంచయ్య గారికి, ఆదేశాలు జారీ చేయడం ద్వారా, విరసం ఫ్యాక్షన్ సభ్యులకు సూచించడం ఆదేశాలు జారీచేయడం ద్వారా, విరసం సభ్యుల్లో, అరునతార పాఠకుల్లో నా రచనల పట్ల వ్యతిరేకతను ప్రచారం చేయడం ద్వారా అరుణతారలో ప్రచురణ కాకుండా ఒత్తిడి తేవడం ద్వారా వగైరా వివిధ పద్ధతుల్లో "అరుణతార"లో నా రచనలు అచ్చువేయకుండా విధించి అమలు చేసిన నిషేధపు ఉత్తర్వులు, పద్ధతులు, యింకా అమలులోనే వున్నాయా? ఏమైనా రచనలు అరుణతారకు, సృజనకు, పంపవచ్చునా? తెలుపగలరు.

నేను రాసిన మూడు వ్యాసాలకు అజ్ఞాత సూరీడు కా॥ చెంచయ్య నించి అడిగి తెప్పించుకుని ఏడాది అయిపోయి వుంటుంది. కా॥ఆయన గారి వివాదాస్పద కథ పంపడానికి, దాన్ని రాయడానికీ సమయం చిక్కి, సొంత కవితలు రాయడానికి సమయం చిక్కి నా రచనలు చదవడానికి సమయం చిక్కక చెంచయ్య గారికి పంపలేదా? నిషేధం యింకా కొనసాగుతుండడం వల్ల చెంచయ్య గారికి పంపలేదా? చెంచయ్య గారికి పంపారా? అచ్చయ్యాయా? నాకు అరుణతార జులై 89 తర్వాత ఒక రెండు సభ్యులు మాత్రమే అందాయి. గమనించాలి.

ఈ సందర్భంగా ఒక విషయం వివరించవలసి వున్నది. 'అరుణతార'లో ప్రచురణకు ఎన్నిక చేయనట్టైతే చెంచయ్యగారే నాకు డైరెక్టుగా వాపసు చేసివుండే వారు అని అజ్ఞాతసూరీడు గారికి పిసిలో విరసం ఫ్యాక్షన్నూ, విరసంనూ చూసే సభ్యులకూ గ్రహించడం అవసరం అవి మీకు పంపారంటేనే ప్రాథమికంగా ఎన్నిక చేశాకే పంపుతారని అర్థం ఏమంటే ప్రతి చెత్తనూ కా॥ చెంచయ్యగారు మీకు పంపి మీ టైంను తినాలను కోరు.

ఇటీవల గద్దర్ – పేరుతో "సాంస్కృతికోద్యమంలో నిర్మాణ సమస్యలు" పేరుతో సృజన ప్రచురణలుగా ఓ పుస్తకం బజార్లో కనపబడింది. గతంలో 4 ఏళ్ళ క్రితం 'జంగ్‌కీపుకార్' అనే హిందీ పాటల పుస్తకం వచ్చింది. ఈ రెండు పుస్తకాలు నాకు అందలేదు. ఇటీవలి పుస్తకం సంగతి సరే –అలు వుంచుదాం. 'జంగ్‌కీ పుకార్' కూడా యిప్పటి వరకు అంలేదు. ఇది ఎఐఎల్ఆర్‌సి పేరిట వెలువడింది. దీనికి డబ్బు ఎవరు పెట్టారు. మొన్నటి గద్దర్ పుస్తకానికి డబ్బు ఎవరు పెట్టారు?

"సాంస్కృతికోద్యమంలో నిర్మాణ సమస్యలు" అనే పుస్తకం పార్టీ సాహిత్యంలో భాగమా? గద్దర్ పార్టీ సభ్యుడే కదా! అయినపుడు మిగిలిన సికాస, దండకారణ్య ఆర్ఎస్‌వి, ఆర్‌విఎల్ వగైరా నిర్మాణ సమస్యలు పుస్తకాలుగా అచ్చేస్తే ఎవరిపేరు లేదు. దీనికి మాత్రం గద్దర్ పేరుంది. అందువల్ల ఇది పార్టీతో సంబంధం లేని డాక్యుమెంటు అని భావించాలా? పార్టీతో సంబంధం లేకపోతే అజ్ఞాతంలో వున్న గద్దర్ రచనకు, సృజనకు ఎవరు పంపారు. డబ్బులు సృజన వాళ్ళ దగ్గర అంతవున్నాయా?

విప్లవాభినందనల్తో

పెద్దం ప్రభాకర్

29–1–88

Dalithayugam-1

03-09-09

120

రహస్యోద్యమంలో చివరి లేఖ

డియర్ పి.సి.కామ్రేడ్స్,

రెడ్ సెల్యూట్స్

1) మారిన పరిస్థితుల తర్వాత మనపార్టీ పనిగురించి, నా పని గురించి నాకేదైనా ఉత్తరాలు రాస్తారని ఎదిరిచూస్తున్నాను. మీ నుండి యింకా అలాంటిదేమీరాలేదు. అపాయింటుమెంటు పెట్టగలరు. మాట్లాడుకుందాం.

2) అపాయింటుమెంటు పెట్టడంతో సంబంధం లేని విషయాలు కొన్ని రాస్తున్నాను.

ఇప్పుడు పరిస్థితి మారింది కనక –నా భార్యాపిల్లల్ని "పార్టీ" బాధ్యులు–"పార్టీ" తరపున ఒకటిసార్లు కలిసి ఎదురుగా మాట్లాడండి. "ఆయన(నేను) బతికున్నపుడే పలికించేగతి లేనపుడు, ఆయన చచ్చిపోయాక యింకేం దుఃఖం చూపిస్తారు పార్టీవాళ్లు, ప్రజాసంఘాల వాళ్ళు" అనే వంటి తీవ్రమైన కోపంతో వున్నట్టున్నారు వాళ్ళు.

"గోపి రాజన్న ఎంతటోడో నీ పార్టీ అంతటిదే అవసరం వున్నంత వరకు మాట్లాడుతారు. మన అవసరానికి ఏ లంజాకొడుకూ మాట్లాడడు" అనే కోపం వాళ్ళల్లో వుంది.

1) నన్ను అరెస్టు చేసినపుడు 20 రోజుల బాలింత పసిగుడ్డును ఎత్తుకొని వలవలా ఏడుస్తూ గోపిరాజన్న యింటికి వెళ్తే పిరికి పంద గోపిరాజన్న ఇంట్లో ఎవడుండమన్నాడు అని నన్ను యిరగతిట్టి ××× మాటలు మాట్లాడి కళ్ళనీళ్ళు పెట్టించి నయాపైసా పని బాధ్యత తీసుకోకుండా పంపించాడని నా భార్యాపిల్లలు చెప్పారు. చెప్తారా చెప్పరు. ఇతరులతో అంటే వాళ్ళ నోటిద్వారా నేను వినాల్సిందే. అందరికోపం నా మీద తీయకపోతే వాళ్ళకు మాత్రం ఎవరున్నారని? –ఇవి మిగిలిని పి.సి.సభ్యులకు తెలియవు కనుక రాస్తున్నాను –అన్నట్టు గోపిరాజన్న మీద ఈ కోపం నాది కాదు నేను అతను పాల్గొనని ఎఫ్.ఎఫ్?సి. "ప్రయాణం" కథను అతను పాల్గొనక పోయినా అతనికి అంకితం యిచ్చాను.

వాళ్ళపట్ల పార్టీ స్వభావం, ఆచరణ "అవసరం వున్నంతవరకు మాట్లాడుతారు. మన అవసరానికి ఏ లంజాకొడుకూ మాట్లాడడు" అనే వాళ్ళ కోపాన్ని, భావాన్ని మరింత కలిగించిందే గానీ, తొలగించలేకపోయింది. దీనికి తోడు ఎ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్. సభల్లో కలిసిన రైతుకూలీ సంఘం కాIIరాఘవులు తన భార్యాపిల్లలకు పార్టీ అన్యాయం చేసిందని చెప్పివున్నాడాయే. ఇద్దరూ కల్సి 3, 4 గంటలు భోరుభోరున చెల్లే, అన్నా అనుకుంటూ ఏడ్చిరాయె. ఆ విషయాలన్నీ తమ పట్ల కూడా అలాగే వుండడంతో మరింత బలపడవూ పెళ్లికాక ముందట్నించీ పల్లెమీదినారాయణ (కల్లూరు నారాయ సారు) నా భార్య మేనబావ– గతి తార్కిక ఆచరణను చూస్తూ–తెనాలి రామలింగని పిల్లిలా ప్రతి దానికీ భయపడ్డం వగైరాలు ప్రస్తుత పార్టీ ఆచరణ స్వభావం వాళ్ళ దృష్టిలో పునాది వుపతరం అన్నీ అయ్యే వుంటాయి.

ఆ కోపతాపాల్ని తగ్గించాల్సిన బాధ్యత పార్టీది, అది ఆ జిల్లా శాఖదా పిసి దా అనే విషయం మీలో మీరు తేల్చుకోవలసిన విషయం.

ఆ తర్వాత బాధ్యత ప్రజాసంఘంగా కొంత విరసానిది. అయితే నువ్వు ఆర్వైఎల్ కు వెళ్ళాకు నిన్ను సొంతం చేసికొని మాట్లాడ్డం ఎట్లా కుదురుద్దీ? అని విరసం ఎన్నడో ప్రశ్నించింది. కనక విరసాని సమస్య కాకుండా పోయింది.

3) నేను నా భార్యాపిల్లల్ని, నా తల్లిని కలవాలనుకుంటున్నాను. "వేసెక్టమీ" అని గత ఉత్తరంలో రాసిన విషయం మీకు అర్థం కాకుండా వుండదు. ఆ వుత్తరం రాసేనాటికి లీగల్ అవకాశాలు గురించి పెద్ద ఆశమేలీ లేనపుడే రాసిందనుకుంటా– సరిగ్గా గుర్తులేదు. పార్టీ నాపట్ల విశ్వాసంగా ప్రవర్తించడం లేదు. ఈ స్థితిలో భార్యాపిల్లల్ని కలిస్తే దిగజారుడుగాడు అని అనుకోవడానికి ఆస్కారమిచ్చిన వాణ్ణవుతానని పార్టీకి నామీద విశ్వాసం వుంది, అని నా విశ్వాసం కలిగే దాకా కలవకూడదనుకున్న విషయం మనస్సులోనే వుంచుకున్నాను అన్ని విషయాలూ ఆకాశంలో సగమైన పెళ్ళాంతోనే మాట్లాడలేనపుడు "యాంత్రిక సంబంధం ఫీలింగ్"తో బాధితుడిగా నా బాధ పడుతున్నవాణ్ణి పార్టీతో యిలాంటి విషయాలుకలిసి పంచుకోవడానికి సిద్ధంగా వుండడం అనేది కుదరని విషయం. అందువల్ల ఎపిసి ప్రసాద్‌తోగానీ, పిసిఎస్ శ్రీనివాస్‌తో గానీ, అజ్ఞాత సూరీడుతోగానీ అసలు విషయం దాచి ఏ పూటకు తోచిన సమాదానం ఆ పూట ఎప్పానో –చెప్పినట్టు మనస్సులోనే

అనుకున్నానో గుర్తు లేదు. నవంబర్ 89. ఆత్మవిమర్శ తర్వాత ముఖ్యంగా శ్రీనివాస్ వల్ల కాకుండా, కాIIమహదేవ్ గారి వల్ల పార్టీపై పోయిన విశ్వాసం కొంత కలిగింది. అందుకే వెంటనే వేసెక్టమీ అని రాశాను. క్లాసులు నంబరువన్ అని రాస్తే అవి మరింతలో యిచ్చేవి కావు చచ్చేవికావు –పదేళ్ళల్లో లేనిది యింత తొందరలో ఏం చేస్తారుగానీ – వేసెక్టమీ ప్రోగ్రామ్ ముందుకు వస్తుందని అలారాశాను. లేదా వెనకబాటు చైతన్యం కారణగా అలారాశానేమో –ధైర్యంగా నా పెళ్ళాం పిల్లల్ని కలుస్తా అని రాయకుండా అలా ఎందుకు రాశానో యిప్పుడు గుర్తులేదు. నేను వెంట ఇలాంటి విషయాలు మర్చిపోతేగానీ నా వ్యాసపరంపర రాయడం వీలుకాదు కనక వెంటనే మర్చిపోతున్నా–

ఈ మతి మరుపులో భాగంగానే కిడ్నాపులపై ఆంధ్రజ్యోతి డేలీలో 26–12–89న పొట్టు పొట్టు తిట్టుకుంటూ సంపాదకీయం రాస్తే అదేరోజున లేఖ రాసి పంపా–ఆ లేఖ మీకు పంపుదా మనుకున్నా మర్చిపోయా యిపుడు పంపుతున్నా.

నా పిల్లలు నా ఉత్తరాలకు సరిగ్గా జవాబు రాయలేదు అని శ్రీనివాస్‌కు చెప్పింది పూర్తి నిజం కాదు. ఆయన్ని కాస్త నిజం కూడా 5 ఏళ్ళల్ల నా భార్యాపిల్లల్ని పార్టీ కాంటాక్టు చేయకపోవడం నించి ఉత్పన్నమైన వ్యవహారం కనక నాపై పిల్లలకు ప్రేమ తగ్గలేదు కానీ ఒకవేళ తగ్గినా పిల్లలకు పార్టీ పట్ల ద్వేషం పెరిగినా దానికి పార్టీ ప్రధాన కారణం. ఏమని ఆత్మ విమర్శ చేసుకున్నారో తెలిపితే సంతోషం.

మనిషిని మనిషి కలిసి మాట్లాడే విషయం ఒకరకంగా వుంటుంది. మనిషిని కలవకపోతే ఒకరకంగా వుంటుంది. పార్టీ ఈ అయిదేళ్ళల్లో ఎన్నిసార్లు కలిసిందో, ఎందుకు కలవలేక పోయిందో అనే దానిపై చర్చ తర్వాతైనా చేయవలసి వున్నది. నా కోసం కాకుండా నలుగురికే విషయం తెలిసిపార్టీలో అర్థం కావడం కోసం మాత్రమే ఇది అవసరం. ఇది మానవ సంబంధాల వ్యవహారం. వాళ్లు ప్రజల్లో భాగమే అని అనుకుంటున్నాను. పార్టీ అలా అనుకుంటే కలవకుండా వుండడాన్ని ఏశక్తి ఆపగలరు?

నాకేయింత అసహ్యంగా విషయం కనపడుతుంటే నా భార్యాపిల్లలకు ఎంతకోపం వుందో నాకేంతెల్సు? అందువల్ల నాభార్యా పిల్లలకు పార్టీ పట్ల వున్న కోపాన్ని నామీది కోపంగా మార్చి ప్రదర్శించే అవకాశం వుంది. ఒక తండ్రిగా ఒక భర్తగా నేను అందుకు సిద్ధంగా లేను. ఒక పార్టీ సభ్యుడుగా కూడా నేను అందుకు సిద్ధంగానేను ఏమంటే అది నా బాధ్యతలకు సంబంధించినది కాదు కనక.

గద్దర్ సంజీవి, వగైరాలు, వరవరరావు, బయటకు వచ్చాక నా భార్యాపిల్లలు

పైకి అన్నా అనకపోయినా నాపైనీపై, పార్టీపై, అందరిపై అగ్గిలా మండి పడుతూ వుండవచ్చు.

ఇంకా ఇలా మరిన్ని కారణాలు రీత్యా.

ముందుగా పార్టీ తరపున బాధ్యులు ఒకటి రెండుసార్లు నా భార్యాపిల్లల్ని కలవండి. వాళ్ళ బాగోగులు తెలుసుకొండి. వాళ్ళు ఆప్యాయంగా –నాన్నే వచ్చాడన్నంత సంతోషిస్తే అందరికీ సంతోషమే.

ఇలా ఒకటిరెండు సార్లు పార్టీవాళ్ళు కలవడం పూర్తయ్యాక మాత్రమే నేను నా భార్యాపిల్లల్ని కలుస్తాను. మీరే వెళ్ళి మాట్లాడ్తారా విరసం వాళ్ళను మీరు పంపించుకుంటారా మొIIవన్నీ మీకు సంబంధించిన విషయం కాదుకూడా. నాకు సంబంధించిన ప్రజా సంఘాల గద్దర్ సంజీవి వగైరాల గురించే నాతో సంప్రదించనపుడు నాకు సంబంధించని విషయమైన నా భార్యాపిల్లల్ని ఎవరు కలవాలి– అనే విషయం నన్ను అడుగాలనుకోవడం టైం వేస్టు పని. డిలే టాక్టిక్సు వ్యవహారం కిందకు వస్తుంది.

4) ఇలా 5 ఏళ్ళల్లో పార్టీవాళ్ళు ఎవ్వరూ కలవకుండానే నన్నే డైరెక్టుగా ఇపుడు నా భార్యా పిల్లల్ని పిలిపించుకొమ్మని సలహా యిస్తే అంగీకరించను. అదే గనక మీ సలహా అయితే ఇదే లెటర్‌ను సిసికి అపీల్ చేసుకొన్న లెటర్గఆ పంపండి. ఏమంటే అలాగనక కలవాల్సి వస్తే అంతకన్నా హీనమైన, హేయమైన పార్టీ విదానం వుండదు. (20 రోజులు జైల్లో వుంటే బేల్ మీద వచ్చాక ఒంటరిగా యింటికి వెళ్ళొద్దని ఒకరోజు కరీంనగర్‌లోనే ఆపి నలుగురు కలిసి జగిత్యాల యింటిదాకా వచ్చి తిట్లు, కోపతాపాలు, ఏడ్పులతో వున్న భార్యాపిల్లల్ని జాపలక్ష్మారెడ్డి తదితరులు సముదాయించారు. విప్లవంతో మానవ సంబంధాలంటే అలా వుండాలి అంతకన్నా ఉన్నతంగా వుండాలి అని ఎన్నో విధాలుగా మానవ సంబంధాల గురంచి, కుటుంబ సంబంధాల గురించి కన్నతండ్రిలా చెప్పిన జాపలక్ష్మారెడ్డి లాంటి వాళ్ళు మనలో ఎందరున్నారో నాకైతే తెలియదు. (నాకెవరూ పార్టీలో కృష్ణమూర్తితో సహా అలాటి వాళ్ళు ఎవరూ కనపడలేదని నిర్మొహమాటంగా చెప్పడానికి ఈ డొంక తిరుగుడెందుకు) వినయమా? మనస్సులో దాచుకొని నీలో నీవు మనోవ్యధతో మునిగి పోవడం కన్నా స్పష్టంగా చెప్పేయలేవా ప్రభాకర్!)

5) ప్లస్ – ఈ మూడు నెలలు పార్టీ నిర్ణయాల్లో నాకు నీసం ప్రేక్షకుడి పాత్రకూడా లేదు. గద్దర్‌వార్త– బెల్లంపెల్లి డేట్‌లైన్‌తో 22-1-91న చూడగానే నాకు మొన్నటి ఆత్మవిమర్శ ద్వారా మీరు తగ్గించిన ఫీలింగ్ మళ్లీ కొంచెం పెరిగింది. అనగా

“వాడుకోవడం” ఫీలింగ్ కలిగింది. అయితే అది మీ పిసి అయిదు తలకాయల మీదో సిసితో కలపి 9 తలకాయల మీదో కోపంగా కలగలేదు. వాడుకోవడం రూట్సుల్లోకి వెళ్ళి వెంటనే సినాప్సిస్ తయారు చేశాను. “ఆత్మవిమర్శ అంటే నాలోనేను” మొక్క 5వ భాగంలోలా కొంచెం తొందరగా రాయబడ్డానికి నాలో కలిగిన కోపాన్ని “వాడుకున్నాను”. గద్దర్ వార్త విన్న తర్వాత నాలో “వాడుకోవడం ఫీలింగ్” పార్టీ కలిగించింది అనే భావం అందులో మీకు ఎక్కడా కనపడదు. నమ్మరు కూడా, ఏమంటే అంత థర్డుపర్సన్‌గా విషయాల్ని డీల్ చేసే ప్రయత్నం చేశాను. అయినా ఆ కోపం ఎంతో కొంత కషాయంలా వ్యాసంలో దిగేవుంటుంది. సరిచేయగలరు. పంపుతున్నాను– నేను రాసినవన్నీ మార్చిలో సూచనల్తో పంపిస్తారుగా!

6) గద్దర్ పుస్తకం ఒకటి సృజన ప్రచురణలుగా అచ్చయింది గదా! నాకూ యితర వ్యాసాలున్నాయి గదా. అలాంటి ఏర్పాట్లు చేయగలరు–డబ్బు గురించి డబ్బు పార్టీ పెట్టిందోలేదో సృజన పెట్టిందో లేదో తెలియదు మీకు విషయం తెల్సు కనుక పార్టీ డబ్బు పెట్టి వుంటే నాకూ కేటాయించండి. సృజనే పెట్టివుంటే సృజనకి నా వ్యాసాలూ అచ్చుకై వీలవుతుందేమో పిసి తరపున లెటర్ రాసి దాని కాపీ నాకూ పంపండి. తలావొక ప్రమాణం వుండదను కుంటా. త్వరలో కలిసే అపాయింటుమెంటు పెట్టండి.

7) నా భార్యా పిల్లల దారి ఖర్చులకూ దిన ఖర్చులకూ డబ్బు పంపగలరు. నాతో కలిసి మొత్తం 7 మంది నేను, భార్య, తల్లి, నలుగురు పిల్లలు. 5 ఫుల్ టికట్లు 2 హాఫ్ టికట్లు ఇందులో ఎంతమందికి పర్మిషన్ యిస్తారో మీరు మీ యిష్టం. మీరు 7 మందిని కలవండి అంటే 7 మందిని కలుస్తా– సంఖ్య తగ్గించితే ఎవర్ని తగ్గించాలో కూడా సూచించగలరు. ఈ ఉత్తరంలో కోపం కనపడ్డానికి కారణం లీగల్ అవకాశాలు పరిస్థితులు మారుతున్నాయి అని గమనించి అవి రాసిన శ్రమకు మరి యిక పెండ్లాం పిల్లలను కలవొచ్చు కదా అని ఎందుకు రాయలేదు అనే కోశ్చన్ వచ్చింది.

ఈ ఉత్తరంలో నా బాధ మీకు కోపంలా కనపడ్డానికి కారణాలు:

1. పరిస్థితులు మారుతున్నాయి – బయటకు బయల్దేరే ముందు తొందరలో రాస్తున్నా– అని– పాయినవాళ్లే అడవిలోంచి బయటకు వచ్చే మార్పులు నిర్ణయాలు పార్టీ తీసుకున్న వేళ– నన్ను అడవికి పొమ్మని రాయడం చాతనైంది కానీ– పరిస్థితులు మారాయి కదా– మరి నీ భార్యా పిల్లల్ని ఇప్పుడైనా ఓ సారి కలిసే ప్రయత్నం చేయవచ్చు గదా అని రాయనందుకు.

2. ఇప్పటికీ అలాంటి జాబు గానీ రానందుకు

3. పరిస్థితులు మరొక మళ్ళీ మనవాడితో ఓసారి మాట్లాడితే బావుండుననే ఆలోచన పిసికి కలగనందుకు– కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూస్తామని ఆత్మవిమర్శలో హామీ యిచ్చిన పిసి ఆ విషయాన్ని అసలు ఖాతరు చేయకుండా, దానికి నయాపైసా విలువ యివ్వకుండా– ఈ మూడు నెలల నిర్ణయాల గురించి ఆచరణ గురించి ఉత్తరాల ద్వారా గానీ, సర్క్యులర్ల ద్వారా గానీ నాకు ఏమీ తెలుపనందుకు. ఇలా ఈ మూడు నెలల పార్టీ ఆచరణలో కూడా నాకు పార్టీలో కనీసం ప్రేక్షకుడి పాత్రయినా లేనందుకు ఇక పార్టీ నిర్ణయాల్లో నాలో సంప్రదించడం జరిగిందా– అనే మాట చాలా పెద్దమాట పిచ్చివాడు మాత్రమే అడగాల్సిన ప్రశ్నగా వుండి పోయినందుకు గద్దర్ వంటి ప్రజాసంఘాల వాళ్ళ పట్ల నిర్ణయాలు తీసుకునేటప్పుడైనా –ప్రజాసంఘాల నుండి వచ్చిన నాతో కూడా కలిసి చర్చించాల్సి వుంటుందని పిసి కి తోచనందుకు పోనీ నన్ను నాపార్టీ– తనలో భాగంగా ఈ 5 ఏళ్ళల్లో భావించిందా అంటే అది ఎంతో మీకు తెల్సు, నాకు తెల్సు అంతరంగాల్లో ఇలానన్ను నా భావాల్ని పార్టీలో భాగం కాకుండానూ ప్రజా సంఘంలో భాగంగా కాకుండానూ, బలిచేసిన ఆచరణే –ఆత్మవిమర్శ తర్వాత కూడా ఆచరించినందుకు.

4. నా భార్యా పిల్లలను కలవడం గురించి –ఎదుటివాడు నావాడు అనుకునే వాడికి ×××××××××నిత్య నిర్బంధంలో పనులు నిర్వర్తించగలుగుతున్నది– అలాంటి నా వాడు అని అనుకునే వాడు ‘ఏమాయె పోవూ నీ భార్యా పిల్లల్ని దగ్గరికి పిలిపించుకోవూ’ అని ప్రేమతో బలవంతం చేసి నీ భార్యా పిల్లల్ని పిలిపించుకో అని ఒక్కడంటే ఒక్కడ పిసి సభ్యుడు గట్టిగా –యిన్నేళ్ళల్లో ఒక్క సారైనా అడిగినందుకు, యిప్పుడు మారిన పరిస్థితుల్లో నైనా ఏ పిసి సభ్యుడికి ఈ విషయం గురించి ప్రభార్‌కు రాస్తే బావుంటుందని మిగతా పిసి సభ్యులకు చెప్పాలనే ఆలోచనే కలనందుకు.

5. పరిస్థితులు మారినా– నేనే నా నోటితో అడుగవలసిన అతి హేయమైన అతినీచమైన పరిస్థితి నాపట్ల పార్టీ సృష్టించి నన్ను క్యారక్టర్ అసాసినేషన్ స్థాయి ఫీలింగ్‌కు నెట్టివేసిన నెట్టివేయబడ్డ స్థితిలో అడగాల్సి వచ్చిన పరిస్థితులు ఏర్పడినందుకు.

నాకు తీవ్రమైన బాద కలిగింది. మీకు ఈ లేఖ తగిలింది.

విప్లవాభివరాల్తో

మీ పెద్ద ప్రభాకర్

భావజాల యుద్ధమా? భావజాల పరిణామమా?

Dalithayugam-1
03-09-09
123

జీవితం పరిణామ శీలమైనది. వయస్సు పెరుగుతున్న కొద్దీ అనుభవాలు పెరుగుతాయి. అధ్యయనం పెరుగుతుంది. కర్తవ్యాలు పెరుగుతాయి. లక్ష్యాలు విస్తరిస్తాయి. బాల్యం నుండి యవ్వనానికి యవ్వనం నుండి సామాజిక ఉద్యమాలకు మలుపు తిరిగినప్పుడు అనుభవాలు, ఆలోచనలు, అధ్యయనం జీవితాన్ని అనేక మలుపులు తిప్పుతుంది. జీవితం ఒక ప్రవాహం. ఒక జీవనది. ఎన్నో కాలువలు, ఉపనదులు కలుస్తాయి. మహానదిగా విస్తరిస్తుంది. ఒక్కరుగా ప్రారంభించిన ప్రయాణం సామాజిక ఉద్యమంలో వందలు, వేలు కలిసి నడిచే ఉద్యమంగా విస్తరిస్తుంది.

సంఘజీవిగా జీవితం మొదలైనప్పటి నుండి నేను ఏదో ఒక సంస్థలోనో, సంఘంలోనో, ఉద్యమంలోనో కార్యకర్తగా పనిచేస్తూ వస్తున్నాను. పదవుల పోరాటం గానీ, ఆరాటం గానీ లేకుండా అందరితో కలిసి పనిచేయడమే ముఖ్యం అనుకునే వాళ్లు నాలాగా నాకు ఎందరో తారసపడడం వల్లనే నిరంతరం సంస్థల్లో, ఉద్యమాల్లో కలిసి పనిచేయడం, ముందుకు నడవడం సాధ్యపడుతూ వచ్చింది.

సంఘ జీవితం మానవీయ విలువలతో, సంస్కృతితో ఆనందమయంగా మారడానికి ఆచరణలో కొన్ని ఆశయాలు ముందుంచుకొని లక్ష్యం వైపు సాగిపోతుంటాము. ఆశయాలు, లక్ష్యాల్లో ప్రాధాన్యత మారినప్పుడు, వాటిపట్ల అవగాహన మారినప్పుడు అవి మలుపు తిరుగుతాయి. మనిషి మారిపోయాడంటారు. భావజాలంలో పరస్పర భిన్నంగా ముందుకు సాగాడంటారు. వాటన్నిటి మధ్య ఒక జీవనది వంటి నిరంతర ప్రవాహ శీలత కలిగిన ఆచరణ, ఆశయం, సామాజిక లక్ష్యాలు కొనసాగుతునే వుంటాయి. ఇది అర్థమయినప్పుడు భిన్న భావజాలాల మధ్య పనిచేయడం వైచిత్రిగా గాని, వైరుధ్యంగా గాని కనిపించకుండా సహజమని అర్థమవుతుంది.

నేను పద్మశాలి కులంలో పుట్టాను. పద్మశాలి అనే పేరుకూడా ఒక సామాజిక

ఉద్యమంలో భాగంగా కొత్తగా సృష్టించుకున్న పేరే. శాలోల్లు, శాలీలు అనే పేరు శతాబ్దాలుగా కొనసాగుతూ వచ్చిన కులవృత్తి పేరు. చేతితో వడికిన నూలుతో బట్టలు నేయడం వీరి కులవృత్తి. తరువాత నూలు మిల్లులు వచ్చాక కూడా మిల్లు నూలుతో బట్టలు నేస్తున్నప్పటికీ చేనేత కులాలు అని పిలిచే వాళ్లు. పెద్దబట్టల మిల్లులు వచ్చాక బొంబాయి, సూరత్, భివండి, సోలాపూర్, మాలెగాం వలసలు వెళ్లి అదే వృత్తి చేస్తున్నప్పుడు వీరిని పవర్‌లూం కార్మికులని పిలిచారు. మరమగ్గాల కార్మికులుగా పిలవబడినప్పటికీ జీవితంలో, సామాజిక వర్గాల్లో శాలోల్లుగా, పద్మశాలీలుగా సంస్కృతి, జీవన విధానం, భాష, నైపుణ్యం కొనసాగిస్తూ వచ్చారు. శతాబ్దాలుగా అబ్బిన నైపుణ్యం విశ్వకర్మ, చేనేత కులాల్లో ఆధునిక వృత్తుల్లోని నైపుణ్యం, కళాత్మకత తొందరగా పట్టుకొని ఎదిగడానికి ఉపయోగపడింది. కులవృత్తి బట్టల మిల్లులకు బదిలీ అవడం వల్ల ఇతర వృత్తులు వెతుక్కోవాల్సిన అనివార్యత నుండి శాలోల్లు, విశ్వకర్మ, బ్రాహ్మణ తదితర కులాల వాళ్లు కళాకారులు, రచయితలు, మేధావులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రేడియో, వాచి, టీవీ, మెకానిక్‌లు మొదలైన రంగాల్లో ఎదిగారు.

మా పెదనాన్న కీ.శే. మిట్టపెల్లి రాజయాఖ్య (1900–87) అచలతత్వ దీక్ష పొంది గుజరాత్, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అచలతత్వ గురువుగా యాభయ్యేళ్లకు పైగా శిష్యులకు జీవితాన్ని అంకితం చేసి పర్యటించారు. సంత్ కబీరు, సంత్ రవిదాస్, వేమన వంటి జీవితం మా పెదనాన్నది. ఆచార్య వినోభా భావే, మా పెదనాన్న ఇద్దరు సొంత అన్నదమ్ములేమో అనిపించేట్టుగా వాళ్ల వ్యక్తిత్వం, రూపం, గడ్డం, తల, మాటతీరు, నడక తీరు అన్నీ ఒకేలా ఉండేవి. అద్వైతం సామాన్యజనంలో అచలతత్వంగా శతాబ్దాలుగా ప్రచారంలో కొనసాగుతున్నది. మా పెదనాన్న కొన్ని పుస్తకాలను వెలువరించాడు. పద్యం, పాట కలయికతో అనేక తత్వాలు మా పెదనాన్నతో పాటు, అతని మిత్రులు, శిష్యులు పాడుతుండేవారు. మాజీమంత్రి అరిగె రామస్వామి తదితరులు కూడా అచలతత్వాన్ని జీవితంలో భాగం చేసుకున్నట్టుగా మా పెదనాన్నను కలుసుకున్నప్పుడు తెలిసింది.

మా పెదనాన్న ఎంతోమంది శిష్యులకు దీక్షనిచ్చి వాళ్లు కూడా గురువుగా గురూపదేశం చేసే అనుమతిని ఇచ్చారు. ఆ శిష్యులు అచలతత్వాన్ని మిట్టపెల్లి రాజయోగిని వారి తత్వాలను మరింత విస్తరింప చేశారు. మా మేనమామ కీ.శే. బేతి రాములుగారి ఇంట్లో పురాణ సాహిత్యం గృహ గ్రంథాలయంలో చాలా పుస్తకాలుండేవి. వాటన్నిటిని చదువుతుండే వాడిని. నా విద్యార్థి దశలో మా పెదనాన్న పెద్దకొడుకు కీ.శే. మిట్టపెల్లి లింబగిరిగారు మెట్‌పెల్లి ఖాదీగ్రామోద్యోగ ప్రతిష్టాన్,

జగిత్యాల బ్రాంచికి బదిలీ అయినప్పుడు మా ఇంట్లో, మా పొరుగింట్లో ఉండేవారు. అలా బాల్యంలో పెదనాన్న ప్రభావం నాకు తెలియకుండానే నాపై పడింది. అయితే 1960లలో అరిగె రామస్వామి, పిన్నంశెట్టి చిన్నయ్య, జగిత్యాల మోచిబజార్ మార్కెట్ రోడ్డులోని హనుమాండ్ల చిన్నరాజం, చిన్నులు గారింట్లో కలిసినప్పుడు నేను రాసిన పద్యాలు చూపిస్తే మెచ్చుకుంటూనే కాస్త భయపెట్టారు. బీజాక్షరాలుంటాయని ఆరవ అక్షరంగా, 10వ అక్షరంగా ఫలానా ఫలానా అక్షరాలు పెట్టి రాస్తే అది జరిగి తీరుతుందని తమకున్న నమ్మకాలను, పరిజ్ఞానాన్ని నాకు పంచేసరికి భయం వేసింది. దాని కొనసాగింపుగా మా పెదనాన్న కూడా అలాంటివి చెప్తుండేవారు. ఒక పదం ఇప్పటికీ గుర్తు. ఒక కవిని కష్టపెట్టి మోసం చేసిన వ్యాపారిని 'ఓరోరి దొంతుల మల్లా! నీ యింట్లో పీనుగెల్లా!' అని రాసి పాడిన తరువాత దొంతుల మల్లయ్య నెలలోపే చనిపోయాడని చెప్తుండేవారు. మిడిమిడి జ్ఞానం పనికిరాదని వారు చెప్పిన దాని సారాంశం. స్కూల్లో ఈ బీజాక్షరాల గురించి ఏమి చెప్పలేదు.

ఇలా మా పెదనాన్న జీవితమంతా భావజాల రంగంలో హోల్‌టైమర్‌గా, తత్వగురువుగా వేలాది శిష్యులతో బతికిన క్రమం నాపై తెలియకుండానే ప్రభావం వేసింది. వారి భావజాల యుద్ధం తత్వాల పాటల రూపంలో సాగేది. చనిపోయిన సందర్భంగా, పెద్దకర్మల సందర్భంగా ఆయా సందర్భాల్లో ఇలాంటి పోటీ గంటల తరబడి సాగేది. పాడినప్పుడు ఒక అర్థం స్ఫురిస్తే వేరే అర్థాలను మళ్లీ విప్పి చెపుతుండేవారు. దాన్ని మార్మిక సాంప్రదాయం అని అంటుండేవారు. సామాన్యులకు కేవలం పైపై అర్థమే స్ఫురిస్తుందని లోతుల్లోకి వెళ్లి గురుబోధను అర్థం చేసుకున్న వారే సార్థక జన్ములని, గురుబోధ రహస్యమని అంటుండేవారు.

అదే సమయంలో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ కార్యక్రమాలు పరిచయమయ్యాయి. జగిత్యాలలో మా ఇంటిముందు దీని కార్యక్రమాలు సాగుతుండేవి. 1963లో తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు ఆరెస్సెస్ శాఖలో చేరాను. అప్పుడు కీ.శే. కళ్లెపు విద్యాసాగర్‌జీ ముఖ్యశిక్షక్‌గా, కీ.శే. శ్రీధర్‌జీ ప్రచారక్‌గా ఉండేవారు. విద్యాసాగర్‌జీ ప్రచారక్‌గా మారిన తరువాత గడ్డం సంజీవరావు ముఖ్యశిక్షక్‌గా బాధ్యతలు నిర్వహించారు. తరువాత ఆయన కాలేజి, విద్యార్థి సంఘం నాయకుడిగా, ఆ తరువాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తలమునకలయ్యారు. నాయకత్వం వహించి జిల్లాలో, రాష్ట్రంలో కలియ తిరిగారు. నేను 1967నుండి ఆరెస్సెస్ ముఖ్యశిక్షక్‌గా బాధ్యతలు స్వీకరించాను.

నేను నా 14వ ఏట 1963లో 9వ తరగతి నుండి మా ఇంటి పరిసరాల్లోకి వచ్చిన ఆరెస్సెస్ శాఖకు వెళ్లడంలో ప్రత్యేక ఆకర్షణలు కొన్ని ఉండేవి. ఉదయం

వ్యాయామం, సూర్య నమస్కారాలు, లాఠీ తిప్పడం నేర్పే వాళ్లు. దాంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. సాయంత్రం శాఖలో పాటలు, ఆటలు, చర్చలు కొద్దిపాటి వ్యాయామం, ప్రార్థన సాగేవి. ఇలా భిన్నమైన వ్యక్తులు కలిసే వాళ్లు. స్నేహాలు పెరిగాయి. పరస్పరం ఆదరణ పెరిగింది. దాంతో శాఖకు వెళ్లాలనే ఆసక్తి పెరుగుతూ వచ్చింది.

స్వచ్ఛందంగా ఇతరుల కోసం పనిచేసే వాళ్లు ఆరెస్సెస్‌లో ముఖ్యశిక్షక్‌లుగా, ప్రచారక్‌లుగా వచ్చేవారు. ఒక స్వచ్ఛంద సంస్థ మనుషులను పట్టించుకొని వ్యక్తిత్వాలను మలచాలనుకోవడం అప్పటికి ఒక నూతన విషయం. దాని ప్రాధాన్యత, గాఢత తొలుత అర్థం కాలేదు. అయితే అది వారిపట్ల అభిమానంగా వ్యక్తమవుతూనే వచ్చింది.

ఆ క్రమంలో నాలుగేళ్ళకు 1967 మార్చిలో 12వ తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. అప్పటి నుండి ఆరెస్సెస్ ముఖ్యశిక్షక్‌గా పనిచేయడం ప్రారంభించాను. నా కన్నా ముందు సంజీవరావు కొంతకాలం ముఖ్య శిక్షక్‌గా పనిచేశారు. నేను స్నేహితులందరినీ అందులోకి కూడగట్టాను. తొలుత నన్ను చూసి సందుగొందుల వెంట పారిపోయిన మిత్రులు క్రమంగా శాఖలో చేరి నేటికీ కొనసాగుతున్నారు. అలా 1967 నుండి 1972 దాకా జగిత్యాలలో, ధర్మపురిలో ఆరెస్సెస్ ముఖ్యశిక్షక్‌గా పనిచేశాను. తురగా రాజిరెడ్డి, సామిరెడ్డి, ఉప్పులంచ శంకర్, కప్పల దామోదర్, ఆర్.గంగాధర్, లింగంపేట లక్ష్మారెడ్డి, ఖాదీబండార్ రమేష్, ఆర్.గంగాధర్, మ్యానపురి రాజనర్సయ్య, గుర్రం నరహరి, సురేందర్, తదితర మిత్రులను ఆరెస్సెస్ శాఖలోకి రెగ్యులర్‌గా వచ్చే కృషి చేశాను. దాంతో కొందరు నేను వాళ్లింటికి రావడం చూసి తప్పించుకునే వాళ్లు. స్థానిక వ్యాపార ప్రముఖులైన కొత్త శంకరయ్య, దారం పురుషోత్తం, జిడిగె కిషన్, రాయంచ ప్రభాకర్, తదితరులను కలుస్తుండేవాడిని. జాగృతి వారపత్రికను, ఆర్గనైజర్ ఇంగ్లీష్ వారపత్రికను, అటల్ బిహారీ వాజ్‌పేయి సంపాదకత్వంలో లక్నో నుండి వెలువడే పాంచజన్యం వారపత్రికను తెప్పించి అందరితో చందాలు కట్టించి చదివించే వాడిని.

ఆరెస్సెస్ కార్యక్రమాలను కళ్లెపు విద్యాసాగర్‌జీ, శ్రీధర్‌జీలతో పాటు నాలుగు జిల్లాల ఇన్‌ఛార్జి అల్దెకర్‌జీ, ప్రాంతీయ విభాగ ఇన్‌ఛార్జి సోంపల్లి సోమయ్య తదితరులు పర్యవేక్షిస్తుండే వారు, సూచిస్తుండే వారు. లంగర్ బీడీని తయారు చేసే ఠాకూర్ బీడీ కంపెనీ మేనేజర్ ఆడెపు గంగారాం, ఖాదీ బండార్ మేనేజర్‌గా పనిచేసే మా పెద్దన్న మిట్టపెల్లి లింబగిరి, మొదలైన వాళ్లుకూడా శాఖకు వస్తుండే వారు. పెద్ద వాళ్లు ఉదయం శాఖకు వచ్చే వాళ్లు. ఉదయం శాఖలో కర్ర సాము నేర్చుకునే వాళ్లు. సాయంత్రం గంటసేపు జరిగే శాఖ కార్యక్రమాలు నాలుగు విభాగాలుగా ఉండేవి. ఒకటి ప్రార్థన, భారతమాత స్తుతి, రెండు ఆటపాటలు, మూడు చర్చా గోష్ఠి, ప్రపంచ విషయాలు, నాలుగు. కాస్త ఎన్.సి.సి. వలె కదంతాల్, ఎక్సర్‌సైజ్, ప్రార్థన వుండేవి.

ఒక పాటను కొద్ది రోజుల పాటు వరుసగా అందరూ నేర్చుకునే విధంగా సామూహికంగా అభ్యాసం జరిగేది.

ఆరెస్సెస్‌లో నచ్చిన అంశాలు

ఆరెస్సెస్‌లో నాకు బాగా నచ్చిన అంశం దేశభక్తి, త్యాగశీలత, అందరినీ సమానంగా గౌరవించుకోవడం, ఉత్తమ సంస్కారం, క్రమశిక్షణ. ఆటపాటలు, ప్రాపంచిక జ్ఞానం పెంపొందించే చర్చలు కూడా నాకు ఎంతగానో నచ్చిన అంశాలు. జాగృతి, ఆర్గనైజర్ వంటి పత్రికలు, పుస్తకాలు చదవడంతో పాటు అందర్నీ చదివించే వాన్ని. అందుకు చర్చలు చేసే వాన్ని. చర్చలు వారి అధ్యయనాన్ని అనివార్యం చేసేవి.

ఆనాడు ఆరెస్సెస్‌లో నేడున్నంత ముస్లిం వ్యతిరేకత లేదు. అది సైద్ధాంతిక అవగాహనకే పరిమితం తప్ప భౌతిక ద్వేష ప్రచారం, ఆచరణ లేదు. అప్పుడు చెప్పిన ముస్లిం వ్యతిరేకత నమ్మడానికి స్థానిక ముస్లింలు నిజాం వారసులమన్నట్టు, రూలింగ్ క్లాస్ వారం అనే ఆధిక్యతను ప్రదర్శిస్తూ దాష్టికం చెలాయించడమే కారణం.

ఆరెస్సెస్ హిందూ జీవన విధానం పట్ల అభిమానం పెంచింది. అది బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్య, వానప్రస్థ ఆశ్రమాల జీవిత దశలను ఆకర్షింప చేసింది. హిందూ జీవనంలో ఆరు మత శాఖలున్నాయని, హిందూ మతం అనేది ఒక మతం కాదని, ఒక జీవన విధానమని చెప్పేవారు. శైవం, వైష్ణవం, శాక్తేయం, బౌద్ధం, జైనం, నాస్తికత్వం అంటూ ఆరు మతాలు కలిసి హిందూ మతమని చెప్పేవారు. సిక్కులు కూడా హిందూ మతంలో భాగమేనని చెప్పేవారు. కాని ఆ తరువాత విగ్రహారాధనకే ప్రాధాన్యత ఇచ్చారు. నిరాకార, ఏకేశ్వరోపాశనను మాటలకే పరిమితం చేశారు. బౌద్ధం గురించి మౌనం వహించే వారు. కాలక్రమంలో బౌద్ధం పట్ల తీవ్రమైన వ్యతిరేకతను ప్రచారం చేస్తూ వచ్చారు.

ఆరెస్సెస్ గురూజీతో గోష్టి

1969-70లో ఆరెస్సెస్ గురూజీ ఎమ్.ఎస్.గోల్వాల్కర్ కరీంనగర్‌లో జరిగిన రెండు రోజుల సభలకు హాజరయ్యారు. అప్పుడు జరిగిన చింతన, బైటక్‌లో అనేక విషయాలను ఆయన తన హాస్య చతురతతో మేళవించి చక్కగా వివరించారు. అదొక గొప్ప అనుభూతిని, అనుభవాన్ని మిగిల్చింది. ఆయన అప్పుడు చెప్పిన హిందూ వారసత్వం, సంస్కృతి నిర్వచనం ఇప్పటికీ మరిచిపోలేను. గురూజీ దీనికి 'కత్తి-పిడి' కథ చెప్పారు. ఒకాయన మంగళిషాపులో గడ్డం గీయించుకుంటూ ఈ కత్తి బాగుందని మెచ్చుకున్నాడట. ఆ మంగళి ఇది 60ఏళ్ళ నాటి కత్తి, మా తాత కాలం నుంచి వాడుతున్న కత్తి అందుకే ఇంత బాగుందన్నాడట. పిడి చూస్తే కొత్తగా ఉందని అడిగితే ఆర్నెళ్ళ కింద కొత్త పిడి వేయించిన అన్నాడట. కత్తి వైపు చూసి ఇది కూడా బాగా అరిగినట్టు లేదే అని అంటే రెండేండ్ల కింద కొత్త తునక వేయించిన అన్నాడట. ఇలా కత్తి కొత్తదే, పిడి కొత్తదే. కాని అది 60 ఏళ్ళ కత్తిగా పేరు తెచ్చుకుంది. మన హిందూ సంస్కృతి, వారసత్వం కూడా ఈ కత్తి, పిడి వారసత్వం వంటిదే. అన్నీ కొత్తవే. కానీ వేల సంవత్సరాల నుండి కొనసాగుతున్న వారసత్వం, సంస్కృతి అని ఆపాదించుకొంటాము. పాత వాటికి విలువ ఎక్కువ అని ఇలా చేస్తుంటాము. అంతా కొత్తదే. పాతది మారుతునే ఉంటుంది. కొత్తది వస్తునే ఉంటుంది అని వివరించారు.

ఆరెస్సెస్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మతా మానవతా వాదం ఆనాడు బాగా నచ్చిన అంశం. అందరిలో వున్న ఆత్మ ఒక్కటే అని అనగా అందరిలో వున్న మనిషి ఒక్కడే అని భావించే తాత్వికత ఇది. నేను మనుషులందరూ సమానమే అనే అర్థంలో దీన్ని స్వీకరించాను.

అర్థశాస్త్ర పరిచయం

అయితే అదే కాలంలో ఆర్థిక రంగంలో అర్థశాస్త్రం, మార్క్సిజం నన్ను ఆకర్షించింది. 10వ తరగతిలో 1964లో అర్థశాస్త్రంలో భాగంగా మార్క్సిజం ప్రాథమికాంశాలు, పెట్టుబడి, శ్రమశక్తి, అదనపు విలువ, లాభం, మొదలైనవి పరిచయం చేశారు. ఆ క్రమంలో ఒక టీచరు పని చేయని వారిని రష్యా, చైనాల్లో చంపేస్తారని సోషలిజం గురించి, కమ్యూనిజం గురించి భయపెట్టడానికి చెప్పిన అంశమే అందుకు వ్యతిరేకంగా నన్ను ఎంతగానో ఆకర్షించింది. పనిచేసే వారికే జీవితం, పనిచేసే వారికే గౌరవం అనే మాట నాకు ఎంతగానో నచ్చింది. బీడీ కంపెనీలలో కార్మికులకు కూలీ పెరగాలని సిపిఐ నాయకులైన సి.ప్రభాకర్, కొక్కుల బుచ్చక్క తదితరుల నాయకత్వంలో సమ్మెలు జరిగాయి. అలా వామపక్ష భావజాలం, ఆర్థిక పోరాటాల్లో భాగస్వాముల మయ్యేవాళ్లం. అప్పుడు చేస్తున్న డిమాండ్లు ఎక్కువ వున్నట్టు అనిపించేవి. ఎక్కువ డిమాండ్ చేస్తే కొంతైనా ఇస్తారని అలా డిమాండ్లు పెట్టేవాళ్లు.

కొడుకు మంచిగా చదువుకుంటే నౌకరి వస్తుంది అని అమ్మ ఆశపడింది. చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో కొడుకుగా అమ్మ కష్టపడటం చూసి ఇంటిపని, బయటపని అన్నీ చేసుకుంటూ చదువుకున్నాను. 12వ తరగతి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాను. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనేది ఎంత నిజమో ఉద్యోగం వచ్చేదాకా నిరంతరం ఎదురు చూస్తూ నిరుద్యోగిగా బ్రతకడం అంతే నిజం.

ఉద్యోగం రావాలంటే ఎంప్లాయిమెంటు కార్డు తీయాలి. అది జిల్లా కేంద్రంలో ఉంటుంది. ఎంప్లాయిమెంటు ఎక్చేంజిలో నమోదయ్యాక ప్రతి 3 నెలలకు రెన్యువల్ కోసం జగిత్యాల నుండి కరీంనగర్‌కు బస్సుపై వెళ్ళాల్సి వచ్చేది. రు.1-50పై. ఛార్జీ కరీంనగర్‌కు పోతే కనీసం 5రూ. ఖర్చు ఒకరోజు బీడీపనిపోతుంది. ఆర్.ఎస్.ఎస్. శాఖ పని పోతుంది. పైగా మూడు నెలలు ఎప్పుడు అయిందో పని ఒత్తిడిలో గుర్తుండేది కాదు. ఇలా ఎంప్లాయిమెంటు కార్డు తీయడం అది లాప్స్ కావడం చాలాసార్లు జరిగింది.

పై చదువులు ఆగిపోవడానికి కారణాలు

నేను డిగ్రీ చదవకుండా పోస్టల్ ఉద్యోగం కోసం ఎదురు చూడ్డానికి పేదరికంతో పాటు ముఖ్యమైన కారణం మరొకటి ఉంది. డిగ్రీ చదవాలనుకుంటే చదివే వాన్నే. మా చిన్నాన్న దేవనపెల్లి చిన్నగంగారాం డిగ్రీ ఫీజు కట్టడానికి సరిపడ రెండు వందల రూపాయలు వడ్డీలేని చేబదులు ఇచ్చారు. అవి దగ్గర ఉండి కూడా డిగ్రీలో జాయిన్ కాలేదు. డిగ్రీ చదివిన తరువాత కూడా ఉద్యోగం కష్టమని అప్పటికే తెలిసింది. ఆ తరువాత బి.ఇడి. చేస్తేనే టీచర్ ఉద్యోగం. ఎస్.జి.బి.టి. చేసి టీచర్‌గా పనిచేస్తున్న వారికి 86 రూపాయలు జీతం మాత్రమే ఉండేది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోస్టల్, టెలిగ్రాఫ్, టెలిఫోన్ శాఖల్లో క్లర్కు ఉద్యోగానికి అన్ని కలిసి 240 రూపాయలు జీతం వచ్చేది. నా సీనియర్లు కొందరు పోస్టల్ ఉద్యోగాన్ని సంపాదించారు.

జీతం ఎక్కువ గనుక రాష్ట్ర ప్రభుత్వం కన్నా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం గొప్పదని భావించాము. ఆనాటి పరిస్థితులు అలాగే ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో ఉద్యోగ భద్రత లేకుండేది. జీతం అంతంత మాత్రమే. చాలామంది ఈ ప్రభుత్వ ఉద్యోగాల కన్నా బొంబాయిలో బట్టల మిల్లులో, ప్రైవేటు రంగంలో 200 రూపాయలకు పైగా సంపాదించవచ్చునని బొంబాయికి వలస వెళ్లే వాళ్లు. పోస్టాఫీసుల్లో ప్రథమ శ్రేణిలో పాసైన వారికి ఉద్యోగాలు వస్తే ఆర్టీసి కండక్టరు ఉద్యోగానికి, పోచంపాడు కెనాల్స్‌పై ఎన్.ఎమ్.ఆర్. తదితర ఉద్యోగాలకు కనీస చదువు, ఫెయిలైన వారిని కూడా తీసుకున్నారు. దాంతో ఆ ఉద్యోగాల పట్ల చిన్నచూపు ఏర్పడింది. కొందరు క్లాసు మేట్లు కండక్టర్లుగా, ఎన్.ఎమ్.ఆర్.లుగా ఉద్యోగాలకు ఎక్కారు. నేను బీడీలు చేస్తూ పోస్టల్ ఉద్యోగం వస్తుందని ఎదురు చూస్తూ గడిపాను.

1970 వరకు జగిత్యాలలో ముఖ్య శిక్షక్‌గా చేసి 1970 నుండి 1975 వరకు సాయంకాల కళాశాల విద్య కోసం ధర్మపురిలో వున్నప్పుడు రెండేళ్ల పాటు ముఖ్యశిక్షక్‌గా పనిచేశాను. తరువాత కోరుట్లకు చెందిన మామిడిపెల్లి గంగరాజం, బైరి నర్సయ్య, ధర్మపురికి చెందిన కీ.శే. కృష్ణమాచారి, కె.సత్యనారాయణ, తదితరులు ఈ బాధ్యతలను స్వీకరించారు.

దాంతో నేను సాహిత్యం, కవి సమ్మేళనాలు మొదలైన వాటికి ప్రాధాన్యత నిచ్చాను. ధర్మపురిలో ఎమ్మెస్కో, యువభారతి తదితర ప్రచురణల పుస్తకాలను తెప్పించే వాడిని. నాలుగు పుస్తకాలు తెప్పించి మూడింటిని అమ్మితే ఒక పుస్తకం నాకు మిగిలేది. అది నా గ్రంథాలయంగా వుండేది. డబ్బులకు ఇబ్బంది అయినప్పుడు ఆ గ్రంథాలయంలోని పుస్తకాలను ఏదో ఒక ధరకు అమ్మేశాను. యువభారతి వాళ్లు రెగ్యులర్‌గా కరస్పాండెన్స్‌తో స్పందిస్తుండేవారు. సుధామ, తాళ్లపల్లి మురళీధర్ గౌడ్, అనుముల కృష్ణమూర్తి మొదలైన వారి ఉత్తరాలతో పాటు ప్రాచీన సాహిత్యంపై వారు నిర్వహించే ప్రసంగాల పుస్తకాలు ఎంతో ఆకర్షించేవి. ఎమ్.శేషాచలం అండ్ కో వాళ్లు ఎమ్మెస్కో పాకెట్ బుక్స్ పేరిట రెండు రూపాయలకు ఒక పుస్తకం చొప్పున నెలకు నాలుగు నవలలు విడుదల చేసేవారు. పత్రికల కోసం ఎదురు చూసినట్లుగా వాటికోసం ఎదురు చూసేవాళ్లం.

ధర్మపురిలో చాలామంది స్నేహితులయ్యారు. వనమాల సహదేవ్, జగిత్యాల నుండి నాకన్నా కొంతకాలం ముందే వచ్చి ఆయుర్వేద మందుల షాపు పెట్టి ఆర్.ఎమ్.పి. డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తుండేవాడు. ఆయన, నేను మూడు తరాల కిందటి చుట్టాలం. క్లాస్‌మేట్. వాళ్ల అమ్మమ్మ, మా అమ్మమ్మ అక్క చెల్లెల్లు. సహదేవ్, నేను కలిసి ఒకే రూమ్‌లో వుండేవాళ్లం. డా॥ సంగనభట్ల నరసయ్య, డా॥ మంచాల గంగాధర్, డా॥ జయధీర్ తిరుమలరావు, ఆర్టిస్ట్ ఆగాచార్య, కనపర్తి లక్ష్మీకాంతం, సత్యనారాయణ, చిలకముక్కు నరహరి, భీమనాతి ప్రభాకర్, కాకుస్తం మధుసూదన్, దేవళ్ల గుండయ్య, పెండ్యాల రాములు, సెక్రటరీ నరహరి, ముత్యాల విశ్వనాథం కరెంటు నరహరి, చంద్రమౌళి, చందుపట్ల జనార్ధన్‌రెడ్డి, కొరిడె రాజన్న శాస్త్రి, కాశయ్యసార్, మొదలైన వాళ్లు సాహిత్య బృందంగా నిరంతరం చర్చలు, భావజాల యుద్ధాలు చేస్తూ కలిసి వుండేవాళ్లం. భావాల మధ్య వైరుధ్యం మా స్నేహానికి ఎప్పుడూ అడ్డు కాలేదు. సహృదయ స్నేహమే తప్ప ఆధిక్యతా భావం ప్రదర్శించాలనే తత్వం లేకపోవడం వల్ల స్నేహాలు అలా కొనసాగాయి.

ధర్మపురిలో గోదావరి ఒడ్డున ఇసుక తిన్నెలపై వెన్నల రాత్రుల్లో కలిసి చర్చించిన విషయాలు ఎన్నో... కవి సమ్మేళనాలు ఎన్నో... ముత్యాల విశ్వనాధం గారి ఇల్లు కృష్ణదేవరాయల భువన విజయంలా భాసించేది. విశ్వనాథ సత్యనారాయణను, శ్రీశ్రీ, తదితరులను మహాకవులుగా భావించినప్పటికీ ఏదో ఒక పక్షానికి పూర్తిగా ఒరిగి పోలేదు. అందర్నీ చదివే వాళ్లం. చర్చించే వాళ్లం. దిగంబర కవిత్వం చదివి నేను

కూడా ఆ రీతిలో కొన్ని కవితలు రాశాను. రాసిన వాటిని పత్రికలకు పంపినప్పుడు అచ్చు కాలేదు. ఎప్పుడూ సీనియర్ల రచనలే పత్రికల్లో కనపడుతుంటే సీనియర్ కవులను విమర్శిస్తూ ఒక కవిత రాశాను. పిల్లలమర్రి వాణే నా రాణి అని ప్రకటించుకున్న స్ఫూర్తితో కావ్యకన్యను ముసలి తొక్కలు చెరబెట్టారని పత్రికలనే డాక్టర్‌లారా! ముసలి తొక్కల రక్కుల నుండి కావ్యకన్యను విడిపించండి. అని కవిత్వంగా రాసి పడేసాను.

అంతకుముందు జగిత్యాల మల్టీపర్పస్ హైస్కూలులో చదువుకుంటున్నప్పుడు 1966-67లో పాఠశాల సంచిక 'స్రవంతి'లో ప్రకృతిలో అంటూ ప్రకృతి గురించి కంద పద్యాలు రాశాను. కంద పద్యాలు రాయడం చాలా కష్టమని ఉపాధ్యాయులు అన్నందుకు వాటినే రాయాలని పూనుకొని రాశాను.

"కిలకిల" యను రావముతో
కులుకుచు సంగీత సుధను కోమల గళమున్.
కలిగిన ఖగములు పలుతా
వుల కందించుచు నెగెసెను నుదుమార్గమునన్.

అని మొదటి పద్యం రాసి ..... చివరి నాల్గవ పద్యంగా ఇలా రాశాను.

చల్లని వాయువు భువిపై
మెల్లగా వీవగ నలసిన మృగములు, మనుజుల్,
నల్లరుల నన్ని మఱచియు
నుల్లాసము పొందునప్పు దుత్తమ రాత్రిన్.

అదే సంచికలో నా సహధ్యాయి ముప్పాళ లక్ష్మణరావు (నేటి మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి) పేదల గురించి కవిత రాశాడు. నేను పేదవాడినై వుండి ప్రకృతి గురించి రాశాను, ఆయన వెలమ కులస్థుడై వుండి పేదల గురించి రాయడం విశేషం.

"పూరి గుడిసెల్లో, చెట్టు నీడల్లో,
కట్టబట్టలేక, నోట బెట్ట బుక్కలేక
అలమటించు వారు కొందరు
బంగారపు మేడల్లో, సింగారపు మిద్దెల్లో
రాజులై, భోగపు మోజులై
వైభవముగ నుండువారు కొందరు" .... అని ధనికులు, పేదల వ్యత్యాసాలను మానవుల్లో దానవులు, మాధవులు అని రెండు రకాలుగా వుంటారని ఇవి నగ్న సత్యాలని ముగించాడు. అప్పటికి విప్లవ పార్టీలు పుట్టలేదు.

నేనెందుకు పేదరికం గురించి రాయలేదు అని ఇటీవల ప్రశ్నించుకొన్నాను. నేను ఇతరుల పేరిట కవితలు పంపినా, నా పేరిట రాసినా అలంకార శాస్త్రాలను అనుసరించి, కావ్యనాయికల గురించి, ప్రకృతి గురించి రాశాను. పేదరికానికి బయట ఉండడం వల్ల పేదరికం అంటే ఆయనకు తెలిసింది. నేను పేదరికంలోనే జీవిస్తున్నాను కనుక జీవితం అంటే అదే కనుక అది పేదరికమని దాని గురించి రాయాలని అనిపించలేదేమో... నన్ను పేదవాడు అని ఎవరైనా అన్నప్పుడల్లా ఉక్రోషం వచ్చేది. కోపం వచ్చేది. పేదవాడు అనే పదం ఆత్మగౌరవాన్ని కించపరచడానికే అనిపించేది.

నిజానికి నేను పేదవాడినా? మా నాన్న బొంబాయి బట్టలమిల్లు కార్మికుడు. అప్పుడు నాన్న నెల జీతం ప్రభుత్వ టీచర్ల కన్నా మూడు రెట్లు ఎక్కువ. అక్కడ సంపాదించి జగిత్యాలలో ఇల్లు కట్టించాడు. మా అన్న కీ.శే. మిట్టపెల్లి రాజనర్సయ్య (1946-74)కు మా నాన్న ఏ నగలు చేయించాడో గుర్తు లేదు కాని, నాకు వెండి మొలతాడు, మెడలో వెండి కంటె, కాళ్లకు వెండి కడియాలు, అమ్మకు వెండి కడియాలు, వడ్డాణం, బంగారు నగలు మొదలైనవి ఉండేవి. మా మేనమామ ఎలా బతుకుతున్నాడో మేము కూడా అలాగే బతుకుతుండే వాళ్లం.

పేదరికం అనేది మానసికంగా ఇతరులపై రుద్దబడేది మాత్రమే. అడవుల్లో జీవిస్తున్న గిరిజనులు పేదలుగా తమకు తాము ఎన్నడూ భావించరు. అది వారి జీవన విధానం. కాని ఎస్సీలను పేదలుగా భావిస్తారు. మిగతా సమాజంతో కలిసివున్నప్పుడు పేదలుగా, చిన్న కులాలుగా వేసే ప్రభావం ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరుస్తుంది. అదే అన్ని సమస్యలకు మూలం. పేదరికాన్ని అధిగమించినా, కులం రీత్యా, పేదరికం రీత్యా ఇతరులు వేసే ప్రభావాలు వారి జీవితాన్ని వెంటాడుతునే వుంటాయి.

నేను కులం రీత్యా అవమానాలకు గురికాలేదు. అసలు ఒక కులం గొప్ప, ఒక కులం తక్కువ అనే భావన మా పెరుగుదలలో లేదు. కొందరు మా పట్ల చిన్నచూపు చూసేవారేమో... కానీ మేము దాన్ని కేర్‌లెస్ చేసి ముందుకు సాగేవాళ్లం. నాకు సొంత కులంలోనే అవమానాలు ఎదురయ్యాయి. చిన్నప్పుడు చుట్టాలు భోజనాలకు పిలిచే వారు. మంచినీళ్ల కోసం ఎవరి చెంబు వాళ్లు తీసుకొని వెళ్లాల్సి వుండేది. అప్పుడు టెంట్ హౌస్‌లు వుండేవి కావు. కొందరు పెద్దవారి ఇళ్లల్లో పెద్దగిన్నెలు వుంటే అందరు వాటిని ఫంక్షన్లకు అడిగి తెచ్చుకునే వాళ్లు.

భోజనాలకు వాకిట్లో కూర్చోబెట్టేవారు. కొందరిని అరుగుపై, మరికొందరిని

ఇంట్లో కూర్చోబెట్టే వాళ్లు. దానిక్కూడా బాధపడే వాళ్లం కాదు. గోకర్ణం అని పిలిచే పాత్రతో చిక్కని మాంసం కమ్మని వాసనలు ఎగజిమ్ముతుంటే మా ముందునుండి అరుగు మీదికి, ఇంట్లోకి తీసుకొని వెళ్తూ మాకు వేయమని అడిగితే వినబడనట్లు వెళ్లేవాళ్లు. మాకు రెండు ముక్కలు వేసి బొక్కల చారు (ఎముకల పులుసు) పోసేవాళ్లు. ఇది చాలాసార్లు జరిగింది. ఇది పెట్టిన హింస, అవమానం మనసులో దశాబ్దాల పాటు కొనసాగింది.

ఆ భోజనాలకు మా తాత వెంట, అమ్మమ్మ వెంట వెళ్లకపోతే ఈ అవమానాలు వుండేవి కాదు. అలాగే నాకన్నా వున్నతంగా బతికే వాళ్లతో సావాసం, సంబంధం లేనప్పుడు అవమానాల సమస్య ఉత్పన్నం కాదు. మాకన్నా సంపన్నులు మా కులంలో వున్నప్పటికీ చుట్టాలు కావడం వల్ల వాళ్లు గొప్పవాళ్లు, మేము చిన్నవాళ్లం అనే భావన ఎదురు కాలేదు. రాకపోకల సంబంధాలు లేనివాళ్లతో మాకు సంబంధాలే వుండేవి కావు.

స్వాతంత్ర్యానంతరం జీవితంలో స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, సమానత్వాన్ని అనుభవిస్తూ పెరిగిన తరం మాది. అవమానాలు మాకు లేవని కాదు. కాని వాటిని లెక్కలోకి తీసుకోలేదు. అవమానించే వారినే వాడెంత అని ఈసడించుకొనే వాళ్లం. చందమామ, బాలమిత్ర కథల్లోని వీరుల్లాగా, సినిమాల్లోని హీరోలతో పోల్చుకొని మాకు మేమే హీరోలుగా ఫీలయ్యే వాళ్లం.

ఇలా భావజాల యుద్ధంలో, వ్యక్తిత్వ వికాసంలో అనేక ప్రభావాలు పడ్డాయి. ఇరుగు పొరుగు ప్రభావాలు, కులం ప్రభావం, విద్య ప్రభావం ఎక్కువగా ఉండవచ్చు. ఇరుగు, పొరుగు వాళ్లు నాకన్నా ఒక తరం ముందు... ఇరవయ్యేళ్ల ముందు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు వుండేవారు. వారి ప్రవర్తన ద్వారా పడిన ఇన్ఫిరియార్టీ తక్కువేమీ కాదు. మేము ఎదిగాము అనే అహంకారం వల్ల ఇతరులను చిన్న చూపు చూసే చూపు వల్ల మా వ్యక్తిత్వాలపై ఆ ముద్ర పడింది. అయితే ఇది ఒక పార్శ్వం మాత్రమే.

ధర్మపురిలో వున్నప్పుడు కులం పట్ల చిన్నచూపు అనేది ఏమిటో మొదటిసారిగా తెలిసివచ్చింది. చాలా మంది మిత్రులు బ్రాహ్మణులే. నేను పెళ్లికాని బ్రహ్మచారిని. దినపత్రికల ఏజెన్సీ, బీడీల కంపెనీ నడిపిస్తూ సాయం కళాశాలలో చదువుతున్న వాడిని. అందువల్ల వంట చేసుకునే టైమ్ వుండేది కాదు. విజయవాడ నుండి వచ్చే ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక దినపత్రికల కోసం ప్రతి బస్సులో ఎదురు చూస్తూ వుండాల్సి వచ్చేది. ఇలాంటి కారణాల రీత్యా స్నేహితులు వీలైనప్పుడల్లా వాళ్లింట్లో భోజనం చేయమనే వాళ్లు. భోంచేశాక విస్తరిని తీయమనే వాళ్లు. ఆ

తరువాత విస్తరి వేసిన చోట నీళ్లుచల్లి అలుకమనే వాళ్లు. కాస్త పైనుంచి వడ్డించే వాళ్లు. ఇదంతా చాలా అవమానకరంగా వుండేది. మిత్రులు చాదస్తంలే అని పట్టించుకోకని చెప్పేవాళ్లు. కాలక్రమంలో అది నిజంగానే సాంప్రదాయక చాదస్తమని, కేవలం అవమానించడం కోసం కాదని అర్థమై రొటీన్‌గా తీసుకున్నాను.

మెట్‌పల్లి తాలూకా పైడిమడుగు గ్రామంలో బీడీ కార్మికురాలైన శ్యామలతో 1973 మే 17వ తేదీన జరిగిన పెళ్లికి వచ్చిన స్నేహితుల్లో బ్రాహ్మణులే ఎక్కువ. వారిద్వారా వేదాలు, పురాణాలు, ప్రాచీన సాహిత్యం, వారి పూజలు, పునస్కారాలు, పెళ్లిళ్లు, పెళ్లి సంబంధాలు, వైవాహికేతర సంబంధాలు మొదలైనవి ఎన్నో తెలిసాయి. ధర్మపురి గోదావరి నదిలోంచి అవతలి ఒడ్డు నుండి కాశిపేట తదితర గ్రామాల నుండిపాలు పెరుగు, కూరగాయలు తెస్తుండే వాళ్లు. గోదావరి నదిలో రెగ్యులర్‌గా స్నానానికి వెళుతుండే వాళ్లం. నదిలో గంగమ్మ పూజలు, తర్పణలు, సంకల్పాలు చెప్పడం, మొదలైనవి సాగుతుండేవి. హోళి పండుగ నాడే ధర్మపురి లక్ష్మి నర్సింహస్వామి జాతర సాగుతుండేది.

ధర్మపురి చుట్టూతా వున్న 20–30 గ్రామాల్లోని వెలమ దొరలు, భూస్వాములు పోస్టురన్నర్ ద్వారా పత్రికను తెప్పించుకునే వాళ్లు. అప్పుడే వేగం పుంజుకొన్న పోచంపాడు కెనాల్ పనుల కోసం కొందరు ధర్మపురిలో కూడా నివాసం ఏర్పర్చుకున్నారు. ధర్మపురిలో ఇంజినీర్ స్టాఫ్‌తో, క్వార్టర్లతో పోచంపాడు క్యాంపు ఏర్పడింది. వీరందరికీ నేనే దిన, వార, మాస పత్రికలను సప్లయ్ చేసేవాడిని. నేను ఏజెంట్‌లాగా కాకుండా వారందరికీ సమాచారాన్ని, జ్ఞానాన్ని అందిస్తున్న వాడిగా గర్వంగా ఫీలయ్యే వాడిని. వాళ్లు కూడా పండగలకు చేసుకున్న పిండిపదార్థాలు మొదలైనవి ఆత్మీయంగా ఇస్తుండే వాళ్లు.

పేపర్ బిల్లు వసూళ్ల కోసం గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేది. వారు డబ్బులు ఇవ్వకపోతే వడ్లు, ధాన్యం కొలిపించుకొని తెచ్చుకునే వాడిని. అలా మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు, సాగర్‌రావు, ఆగమరావు, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ మొదలైనవాళ్లు తిమ్మాపూర్ గ్రామం నుండి పరిచయమై స్నేహితులయ్యారు. ధర్మపురిలో లొత్తునూర్ సాగర్‌రావు (నా కన్నా ఒక సంవత్సరం సీనియర్ విద్యార్థి) పోచంపాడు కెనాల్ కాంట్రాక్టులు చేస్తూ వుండేవాడు. వారికి కూడా పత్రికలు ఇస్తుండేవాడిని. భీమనాతి ప్రభాకర్ తండ్రి భీమనాతి గంగారం గారిది లొత్తునూరే. ఎమర్జెన్సీ తర్వాత రైతు కూలీ సంఘాల ఉద్యమంలో లొత్తునూర్‌లో పోశెట్టి అనే ఆయన చనిపోయాడు. దానికి కారకుడు లొత్తునూర్ సాగర్‌రావు అని కరపత్రాలు వేసారు. పరమ భీకరంగా, భయంకరంగా దొరలను చిత్రిస్తూ ప్రచారం చేస్తుంటే నాకు చిత్రమనిపించేది. ఆరు

నెలల దాకా ఒక్కొక్కసారి, ఏడాది దాకా నెలకు నాలుగు రూపాయలు డైలీ పేపర్ బిల్లు కూడా సక్కగా ఇవ్వలేని వాళ్ళు, పైసల్లేక ధాన్యం తీసుకుపొమ్మంటే ధాన్యం తెచ్చుకున్న వాణ్ణి వీళ్లా భయంకరమైన దొరలు అని అనుకునే వాణ్ణి.

రాజారం గ్రామానికి సంబంధించిన దొరలను రాజారం బాపు అని పిలిచే వాళ్లు. ఈ గ్రామం ధర్మపురికి నాలుగైదుకిలోమీటర్ల దూరంలో వుంటుంది. రాజారం బాపు కుటుంబానికి స్థానికులతో కాకుండా విజయనగరం రాజులతో పెళ్లి సంబంధాలు సాగుతుండేవి. ఈ రాజారాం బాపు ఒక్కడే రెగ్యులర్‌గా డైలీ పేపర్ బిల్లు అడిగిన వెంటనే ఇచ్చే వాడు. దొరగడికి సంబంధించిన పెద్ద గుమాస్తా ఒకరు వుండేవాడు. అతడే ఇస్తుండే వాడు. అతని కొడుకు సత్యనారాయణ రెడ్డి నాతోపాటు ధర్మపురి కాలేజీలో చదువుతుండేవాడు. కాలేజీలో రెండు నెలల పాటు సమ్మె నడిపాను. కాలేజికి అటెండ్ కాకుండా చెట్ల వెంట, గుట్టల వెంట ఊళ్లు తిరిగాము.

ఇలా జీవితంలో బ్రాహ్మణులు, వెలమలు, భూస్వాములు పరిచయమయ్యారు. వారి జీవన విధానం, సంస్కృతి, ఆదాయ, వనరులు, ఆదాయం కోసం బ్రాహ్మణులు బొంబాయిలో పూజలు చేయడానికి వలసలు వెళ్లడం, మధ్యాహ్నం భోంచేసి ఊగే చెక్కబల్లపై కాస్త నిద్రతీసి నాలుగు గంటలకు లేచి మొఖం కడుక్కొని ఒక చాయ్ కొట్టి ఇంటి ముందు గద్దెల మీద కూర్చుని ఆనాటి దినపత్రిక విశేషాల గురించి లోకాభిరామాయణం గురించి మాట్లాడుకోవడం మొదలైనవి ఎన్నో విషయాలు... జీవితంలో భాగమయ్యాయి.

ఒక కొత్త వూరికి వెళ్లి జీవిస్తూ పదిమందిలో గౌరవం పొందుతూ స్నేహాలను పొందుతూ బతకడమనేది ధర్మపురిలో మొదలైంది.

అంతకుముందు అవ్వమీది బువ్వగా జీవితాన్ని సాగించిన వాన్ని. ధర్మపురికి వచ్చాక నాకు నేను బతకడంతో పాటు అమ్మ గురించి తమ్ముడి చదువు గురించి, అన్న పెళ్లి గురించి కూడా ఆలోచించే వాడిని. అన్నకు మొదటి పెళ్లి విచ్చుకుపోయింది. బొంబాయి, భివండి, మాలెగాంలలో పవర్‌లూమ్స్‌లో పనిచేస్తున్నప్పటికీ ఇంటికి ఉత్తరాలు రాయకపోవడం, డబ్బులు మనియార్డర్ చేయకపోవడం వల్ల ఆయన పట్ల ఎవరికీ సదభిప్రాయం వుండేది కాదు. మా అన్న పైసలు పంపిస్తే నేను జగిత్యాలలోనే డిగ్రీ చదివే వాడిని కదా అని ఎన్నోసార్లు తిట్టుకున్నాను. అమ్మకూడా అన్న గురించి ఎక్కడున్నడో తెలియక చాలాసార్లు ఏడుస్తుండేది. ఒకసారి వచ్చి ఇక ఇక్కడే వుంటాను, మళ్లీ వలస పోను అని చెప్పడంతో అమ్మ ఒకచోట చుట్టాల వద్ద పనికి కుదిర్చింది. పెళ్లి సంబంధాలు వెతికింది. మల్యాల నుండి సంబంధం ఖాయమైంది. నేను ధర్మపురి

నుండి పెళ్లి పందిరికి కావలసిన వెదురు తడకలు, ధాన్యం వగైరా సమకూర్చాను. ఉన్నంతలో కూడబెట్టినదంతా పెళ్లికి ఖర్చు చేసాను. ఆ పెళ్లి నెలరోజుల్లోనే విడాకులైంది. దానికి మా మేనమామ పెళ్లి పిల్ల వారికి చెప్పిన అబద్దాలు, దుష్ప్రచారాలు ప్రధాన కారణం. ఆ తరువాత మా అన్న జగిత్యాలలో వుండను అని వెళ్లిపోయి అనారోగ్యంతో అవసాన దశలో ఇంటికి వచ్చి 1974లో చనిపోయాడు.

ధర్మపురిలో పరిచయమైన స్నేహితుల్లో టి.లక్ష్మినారాయణ ఒకరు. ఆయన నేను కిరాయికున్న చింతామణి చెరువు కట్టకింది దూస రంగయ్య గారి ఇంట్లో నా పక్కగదిలో కిరాయికి వుండేవాడు. నా ఉద్యోగ వేటను గమనించాడు. వాళ్ల డిపార్టుమెంట్‌లో ఉద్యోగాలుంటే చెప్పమన్నాను. అలా 1975 డిసెంబర్ 17న ఎలుగందుల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరాను. అప్పటికే ఎమర్జెన్సీ కాలం నడుస్తున్నది. ఆరెస్సెస్ వారిని జైల్లో వేస్తున్నారు. ధర్మపురిలో వున్నప్పుడే 25 జూన్, 1975రాత్రి ఎమర్జెన్సీని ఇందిరాగాంధీ ప్రకటించింది. ఆ సమాచారాన్ని పత్రికల ద్వారా అందరికీ నేనే చేరవేసిన వాడిని. ధర్మపురిలో వున్నప్పుడు నా గురించి అందరికీ తెలుసు. కనుక పోలీసులు నా వెంట పడ్డట్టు అనిపించలేదు. అయితే భీమనాతి గంగారాం పట్వారి మా అన్న కావడంతో ఆయనకు ధర్మపురిలో చాలా పరపతి ఉండడంతో పోలీసులు ఒకటి రెండు సార్లు నా గురించి అడిగితే మా వాడు అని చెప్పాడని తెలిసింది. కానీ ఎలుగందులకు ఉద్యోగరీత్యా వెళ్లిన తరువాత ఒకటి రెండు సార్లు పోలీసులు బిక్షగాళ్ల వేషంలో, సైకిల్ మీద అవి, ఇవి అమ్మేవాళ్ల వేషంలో నాకోసం వచ్చారు. అరెస్టు చేస్తారని భయపడ్డాను. ఉద్యోగం వదిలేసి ఎక్కడికి పోలేను కదా. అక్కడే వున్నాను. అరెస్టు లాంటివి జరగలేదు.

1974లో మా తోడల్లుడు ద్వారా వామపక్ష భావజాలం, వాటి ఉద్యమాలు కొంత పరిచయంలోకి వచ్చాయి. హాస్టల్ వార్డెన్ ఉద్యోగంలో చేరాక హాస్టల్ లైబ్రరీలో వున్న అంబేద్కర్ గ్రంథాలు చదివాను. ముఖ్యంగా కుల నిర్మూలన, ఎండ్లూరి చిన్నయ్య రాసిన 'అంబేద్కర్ జీవిత చరిత్ర', బోయి భీమన్న రాసిన 'ధర్మంకోసం పోరాటం' గ్రంథాలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి.

1976లో హాస్టల్ విద్యార్థులకు భోజన ఖర్చులకు నెలకు 30 రూ.లు బడ్జెట్ కేటాయించే వారు. సబ్బులు, తలనూనెలకు నెలకు 2 రూ.లు. 15 ఆగస్టు, 26 జనవరి, పండగలకు స్వీటు కోసం ఒక రూపాయి. నా జీతం 250 రూ.లు.

నెలకు పది రూపాయలు ఇల్లు కిరాయి. ఇల్లు కిరాయికి అడిగితే కులం పేరు అడిగే వాళ్లు. మీ పద్మశాలీలు ఫలానా వాళ్లు వున్నారు. వాళ్ళింట్లో దొరకవచ్చు అని

చెప్పే వాళ్లు. అలా పద్మశాలీలైన ఇంజనీరు గాలి అనంతం ఇంట్లో కిరాయికు ఉండేవాన్ని. బ్రాహ్మణ కులానికి చెందిన తెలుగు పండిట్ పద్మనాభం అదే ఇంట్లో మరో పోర్షన్‌లో కిరాయికి ఉండేవారు. వారితో స్నేహం పెరిగింది.

'ఎలుగందుల' జిల్లా కేంద్రంగా, రాజధానిగా కొనసాగి 1906లో జిల్లా కేంద్రం కరీంనగర్‌కు తరలిపోయాక పాడుబడుతూ వచ్చింది. ఎలుగందుల ఖిల్లా ఒక చారిత్రక కట్టడం. దాని వైభవం పూర్తిగా కోల్పోయింది. అక్కడికి వెళితే చెడు జరుగుతుందని నమ్మకం. అందువల్ల బదిలీ కావాలని కోరుకునే వాళ్లు ఎలుగందుల ఖిల్లా చూడడానికి కొండమీదికి ఎక్కడానికి ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారు. నన్ను స్థానికులు ఖిల్లా ఎక్కవద్దని హెచ్చరించేవారు. అయినా ఒక కెమెరా తీసుకొని వెళ్ళి మొత్తం తిరిగి అనేక ఫొటోలు దిగాము.

కొత్తగా ఉద్యోగంలో చేరిన అనుభవ రాహిత్యానికి తోడు ఎలుగందుల హాస్టల్ సమస్యలకు నిలయం. ఆ సమస్యల నుండి పారిపోవడానికి అక్కడున్న కీ.శే. వెంకటయ్య వార్డెన్ కొత్తగా ఏర్పడిన చొప్పదండి హాస్టల్‌కు బదిలీ చేయించుకున్నారు. నా పోస్టు చొప్పదండి హాస్టల్ ఏర్పాటులో భాగంగా పుట్టిన పోస్టు. నన్నే అక్కడికి వేయాలి. కాని వెంకటయ్య పైరవీతో ఆయనను అక్కడ వేసి సమస్యలున్న హాస్టల్లోకి నన్ను అపాయింట్ చేశారు.

హాస్టల్ విద్యార్థులపై, సిబ్బందిపై కొందరు స్థానికులు పెత్తనం చెలాయించే వాళ్లు. వారి స్వార్థాల కోసం, వారి చేత పనులు చేయించుకోవడం కోసం హాస్టల్లో సమస్యలను సృష్టించే వారు. సిబ్బందిని, విద్యార్థులను రెచ్చగొట్టే వారు. హాస్టల్ ఇంటి ఓనర్ కూడా వారి వైపే మొగ్గు చూపేవాడు.

హాస్టల్ విద్యార్థులు ఇతరుల ఇళ్లల్లో చిన్న చిన్న పనులు చేయడం నాకు గిట్టేది కాదు. వారిని నిరోధించడంతో ఊర్లో వ్యతిరేకత మొదలైంది. ప్రత్యేకంగా పనిగట్టుకొని విద్యార్థులను వార్డెన్‌పై ఉసిగొలుపుతూ అసంతృప్తిని పెంచేవారు. వార్డెన్‌ని అవినీతిపరుడుగా ప్రచారం చేసేవారు. ఊర్లోని గ్రూపులు గూండాలు, రాజకీయ నాయకులు తమ తమ ప్రయోజనాలకు వీటన్నిటిని వాడుకునే వారు. రోజుకు ఒకటి, రెండు సార్లు కరీంనగర్‌కు వెళ్లి రావడం, కరీంనగర్‌లో కూడా ఆధిపత్యం చెలాయించడం ఎలుగందుల ప్రజలకు అలవాటు. అందువల్ల ప్రతి విషయాన్ని చిలవలు, పలవలు చేసి వెంటదివెంట జిల్లా సాంఘిక సంక్షేమ అధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసే వారు. ఈ బాధలు భరించలేకే వెంకటయ్య బదిలీ చేయించుకొని వెళ్లాడని తెలిసింది.

ముందు సిబ్బందిని కంట్రోల్ చేశాను. విద్యార్థులు 25 మందే. అందులోంచి సరిగ్గా రాని, క్రమశిక్షణ లేని ఒకరిద్దరు విద్యార్థులను తొలగించాను. తొలగించే అధికారం మీకెక్కడిదని స్థానికులు ఘర్షణ పడ్డారు. స్థానిక విద్యార్థులను తీసుకోకూడదు. కాని ఇరుగు, పొరుగు ఊర్ల నుండి సర్టిఫికెట్ తెచ్చి కొందరు చేరారు. వారి ద్వారా అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యేవి. వేళకు ప్రార్థనకు ఉండేవారు కాదు. ఆలస్యంగా వచ్చి అందరికీ మారు అన్నం పెట్టేశాక అన్నం కావాలంటూ వచ్చేవారు. వారి తరపున తల్లిదండ్రులు పోట్లాటకు దిగేవారు.

30 రూ.ల బడ్జెట్ సరిపోయేది కాదు. 25 మంది వంటలోనే నలుగురు సిబ్బంది కూడా భోజనం చేయడం వల్ల కూడా సరిపోయేది కాదు. మొదట వారిని హాస్టల్లో తినడాన్ని అడ్డుకున్నాను. అది సంఘర్షణకు దారి తీసింది.

ఎలుగందుల మానేరు నదీ తీరాన ఉంటుంది. తాగే మంచినీళ్ల కోసం అప్పుడు నల్లాలు ఉండేవి కావు. మానేరు నదికి వెళ్లి నీళ్లు తీసుకురావాల్సి వచ్చేది. హాస్టల్‌లో మంచినీళ్లకోసం ముగ్గురు సిబ్బంది తలా ఒక బిందె తీసుకొని నీళ్లకు బయల్దేరి గంటల తరబడి అటే వుండేవారు. వంట మనిషి బొగ్గుల కోసం ఉపాయం చేసేవాడు. వంట పూర్తయ్యేముందు కట్టెలు మరిన్ని పొయ్యిలో దూర్చి సగం కాలగానే నీళ్లు చల్లి బొగ్గులు చేసుకునే వాడు. బొగ్గులు అమ్ముకునే వాడు. కట్టెల బిల్లు పెరిగిపోయేది. వంటమనిషికి పెద్ద పైరవీలు. ఎమ్మెల్యేలు కరీంనగర్ రాజకీయ ప్రముఖులు అతనికి మద్దతు ఇచ్చేవారు. ఇక ఏం చేయలేక ఎలుగందులలోని కట్టెల మండిలో ఖాతా మానేసి మూడు కిలోమీటర్ల దూరంలో వున్న బావుపేటకు వెళ్లి కట్టెలు తెప్పించే వాన్ని. కాస్త తక్కువ రేటు వున్నప్పటికీ ఈ బొగ్గుల కారణంగా బిల్లు పెరుగుతునే వుండేది. దాంతో కర్రపొట్టుతో వండే పొయ్యిని తయారు చేయించి పొట్టుపొయ్యిపై వంట చేయించడం ప్రారంభించాను.

ఆ వంటమనిషి తనకు అనుకూలమైన హాస్టల్‌కు కరీంనగర్ పట్టణానికి బదిలీ చేయించుకున్నాడు. 1950ల నాటి సీనియర్ తరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బుట్టి రాజారాంగారి సొంత బావ హాస్టల్ కుక్‌గా బదిలీ అయి వచ్చాడు. బుట్టి రాజారామే తనను ఈ ఉద్యోగంలో పెట్టించాడని చెప్పాడు. ఎమ్మెల్యే సొంత బావ వంటమనిషిగా పనిచేయడం ఆశ్చర్యం వేసింది. దళితుల జీవితాలు ఇలా అట్టడుగు స్థాయి నుండి ఒక్కొక్కరు ఎదిగే క్రమం అని అనిపించింది. వంటమనిషి పందుగు నర్సయ్య, కొడుకు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తాడు. కరీంనగర్‌లో మంచి ఇల్లు కట్టుకున్నాడు. ఈ వంటపని ఎందుకు అని అడిగాను. ఎవరి జీవితం వారిదే అని తన ఉద్యోగం పట్ల పిల్లలకు వంట చేసిపెట్టడం పట్ల ఎంతో అభిమానం కనబరిచాడు. ఆయన వచ్చాక వంటమనిషితో వచ్చే ఇబ్బందులు తొలగిపోయాయి. ఆయన గంభీరమైన పెద్దమనిషిగా

పిల్లలను కంట్రోల్‌లో పెట్టేవాడు.

హాస్టల్ ఇంటి ఓనర్ ఎద్దుమాంసం ముక్కలను దండలా గుచ్చి హాస్టల్ ఆవరణలో, వాకిట్లో ఎండనిచ్చే వాడు. నిజానికి మొత్తం ఇల్లు కిరాయికు ఇచ్చినట్టుగా రాసినప్పటికీ రెండు గదులు వారే ఉంచుకున్నారు. వారు ఖాళీ చేయలేదు. ఆ ఇంటిముందు నుండి స్కూలుకు వెళ్లే తొవ్వలోనే ఇబ్రహీం అనే యువనాయకుడి ఇల్లు ఉండేది. చిన్నపాటి దొరలాగా వచ్చి పోయే వారిని పలకరిస్తూ ఆధిపత్యం చెలాయించే వాడు. ఏ పూట విషయాలు ఆ పూట విద్యార్థుల నుండి తెలుసుకుంటూ వార్డెన్‌కు సమస్యలు ఎలా సృష్టించాలో ఆలోచించి వారిని తనవైపు తిప్పుకునే వాడు.

కొంతకాలానికి కిరాయి ఇల్లు మార్చాలని దాంతోనే ఈ పీడ విరగడ అవుతుందని భావించాను. ఆ ఇల్లు దళితవాడకు వెళ్లే తొవ్వలో వుంది. వచ్చిపోయే వాళ్లు ఆసక్తి చూపేవాళ్లు. దాంతో రకరకాల సమస్యలను సృష్టించే వాళ్లు. చివరకు ఇల్లు ఖాళీ చేయించాను. తొలుత కిరాయికి వున్న యజమాని బంధువుల ఇంటిలోకి కాస్త దూరంలోకి అవతల వాడలోకి మార్చాను. దాంతో సగానికి పైగా సమస్యలు తీరిపోయాయి. నేను కూడా నాకు మద్దతు ఇచ్చే వారిని పెంచుకున్నాను. అందులో భాగంగా స్నేహాలు పెరిగాయి. రోజు సాయంత్రం మిత్రులతో చదరంగం ఆడుతూ గడిపేవాళ్లం.

అదే సమయంలో ధర్మపురి మిత్రుడైన ఖాసీంరజా తెలుగు పండిట్‌గా అపాయింట్ అయి ఎలుగందుల వచ్చాడు. ఎలుగందుల హైస్కూలు హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు హాస్టల్ నిర్వహణలో విద్యార్థుల క్రమశిక్షణకు సహకరించే వాళ్లు.

ఎమర్జెన్సీలో 20 సూత్రాల పథకం కింద హాస్టళ్లలో సీట్లు పెంచి విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి జలగం వెంగళరావు భావించారు. నేనున్న హాస్టళ్లలో 25 సీట్లే పరిమితి. 100 సీట్ల దాకా పెంచవచ్చని అధికారులు చెప్పారు. చెప్పడమే కాకుండా సీట్లు నింపాలని వెంటపడి తరిమారు. అలా ఎలుగందుల నుండి వేములవాడ, సిరిసిల్ల దాకా వున్న గ్రామాలన్నింటిని సైకిల్‌పై తిరిగాను. నాతో పాటు హాస్టల్ సిబ్బందిలో ఒకరిని వెంట తీసుకుని వెళ్లేవాడిని. గ్రామాల్లో దళితుల పట్ల, వారి చదువు పట్ల సర్పంచ్‌లకు, భూస్వాములకు, టీచర్లకు ఒకరకమైన చిన్నచూపు ఉండేది. స్కూల్లో సంఖ్య తగ్గుతుందని ఉపాధ్యాయులు హాస్టళ్ల గురించి పురుగుల అన్నం పెడతారని రకరకాలుగా భయపెట్టే వాళ్లు. ఊర్లో దళితుల చదువు గిట్టని వాళ్లు అప్పుడే కడుతున్న లోయర్ మానేర్ డ్యాం కట్టకు బలివ్వడం కోసం తీసుకుపోవడానికి వచ్చారని దుష్ప్రచారం చేశారు. పిల్లల తల్లిదండ్రులను కలవనిచ్చే

వారు కాదు. ఇది ఒకటి రెండు సార్లు చూసి నేనే స్వయంగా దళిత వాడలకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి టీసీ తీసుకొని ఎలుగందుల స్కూల్లో, హాస్టల్‌లో చేర్పించాను. అలా వందమందిని నింపాను. అలా నింపిన వారిలో ఎందరో ఉన్నత చదువులకు ఎదిగారు. అందులో లోయర్ మానేర్ డ్యాం ప్రాజెక్టులో మునిగిపోయిన యాస్వాడ గ్రామానికి చెందిన ప్రొ॥ ఘంటా చక్రపాణి ఒకరు.

అప్పుడు దళితులు అంటే ఏమిటో గ్రామాల్లో వాళ్ల స్థితిగతులేమిటో, ఎంత పేదరికంలో బతుకుతున్నారో, ఎన్ని అవమానాలలో జీవిస్తున్నారో, ఎంత మంది, ఎన్ని కులాలు వారిని అణచివేయడానికి అనునిత్యం పనిచేస్తున్నారో మొదటిసారిగా తెలిసి వచ్చింది. నా క్లాస్‌మేట్స్, స్నేహితులు ఎస్సీలున్నప్పటికీ వారిని ఎప్పుడు చిన్న చూపు చూడలేదు. వారు ఇలాంటి సమస్యలుంటాయని చెప్పలేదు. ఆ మిత్రులు స్కూల్లో అద్భుతంగా పాటలు పాడి అందరి అభిమానాన్ని పొందారు. అంతేగాని వారి ద్వారా అంటరాని సమస్య లోతుపాతుల గురించి, దళితుల దయనీయ జీవితాల గురించి తెలియలేదు.

ఇలా జగిత్యాలలో పద్మశాలీలు, ఇతర కులాల వాళ్లు, ఇరుగు, పొరుగు, ధర్మపురిలో బ్రాహ్మణులు, వెలమలు, భూస్వాములు, కాలేజి జీవితం, మొదలైనవి పరిచయమైతే ఎలుగందులకు వచ్చాక దళిత విద్యార్థులతో పాటు గ్రామాలకు తిరగడం వల్ల దళితుల జీవితాలు బాగా తెలిసి వచ్చాయి. విద్యార్థుల ద్వారా రెగ్యులర్‌గా వారి జీవితాల గురించి తెలుస్తుండేవి. విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చినప్పుడు అనేక విషయాలు అడిగి తెలుసుకునే వాడిని.

ఎలుగందులకు వెళ్లి 1976–77ల్లో గ్రామాలను పర్యటించాక దళితుల సమస్య ఎంత తీవ్రమైనదో అర్థమయ్యాక కులవ్యవస్థ, కులవివక్ష ఎంత ఘోరమైనవో మొదటిసారి అనుభవంలోకి వచ్చింది. దాన్ని విశ్లేషించుకునే శక్తి, సామర్థ్యాలను అంబేద్కర్ రచనలు అందించాయి. 'కులనిర్మూలన' గ్రంథం చదివి కొన్నాళ్ల పాటు ఆవేదనతో, ఆవేశంతో ఉడికిపోయాను. సమాజం మార్పు కోసం ఏదో ఒకటి చేయాలి అని అనిపించింది.

అంబేద్కరిజం ఆకర్షించడానికి కారణాలు

అంబేద్కరిజం నన్ను ఆకర్షించడానికి ఈ ప్రత్యక్ష అనుభవాలే ప్రధాన కారణం. దళిత విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో సంబంధంలో ఉండడం వల్ల వారి జీవితాలు, వారి కష్టాలు, సుఖాలు, వారి సంస్కృతి అతి సన్నిహితంగా పరిశీలించాను. క్రమంగా వారిలో ఒక్కడిగా మారే దృక్పథం ఎప్పుడు ప్రవేశించిందో తెలియదు. అలా దళిత

వాదం 1976-77 నుండి నా జీవితంలో, అవగాహనలో, ఆచరణలో భాగమై కొనసాగుతూ, విస్తరిస్తూ వచ్చింది. అదే క్రమంలో ఆరెస్సెస్ భావజాలం దూరమవుతూ వచ్చింది.

1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక విప్లవోద్యమ కార్యక్రమాలు పెరిగాయి. తొలుత పేదల విముక్తి, పేదల రాజ్యం, సోషలిజం అనే స్థూలమైన అవగాహనే ఉండేది. చదివే క్రమంలో సిద్ధాంత గాఢత పెరుగుతూ వచ్చింది. తెలంగాణలో ఆచరణ ఎక్కువగా సిద్ధాంత అధ్యయనం తక్కువగా సాగుతూ వచ్చింది. జనం ఆయా సమస్యలకు ఉద్యమించడంలో భాగంగా ముందుకు సాగింది.

1976-77లో నాస్తిక గోరా, సి.వి. హేతువాద రచనలు అనేకం చదివాను. ఉద్యోగంలో చేరిన తరువాత ఆ ఉద్యోగం ఎప్పుడూ భయపడేదిగా మనిషిని మార్చింది. నిరంతరం భయం వెన్నాడేది. స్థానికులతో పాటు ప్రభుత్వ అధికారుల తీరు కూడా ఈ భయాన్ని పెంచాయి. దైవ భావన మరింత భయాన్ని కలిగింప చేసేవి. వీటన్నిటి నుండి నాస్తిక, హేతువాదాలు విముక్తిని కలిగించాయి. స్వేచ్ఛను అనుభవించాను. అదే సమయంలో సి.నరసింహారావుగారి 'రేపు' మాసపత్రిక కూడా ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి ఎంతగానో ఉపయోగపడింది. అలా దైవభావన నుండి, భయం నుండి విముక్తి పొంది నాస్తికుడిగా, హేతువాదిగా, స్వేచ్ఛావాదిగా పరిణామం చెందాను. సామాజిక భావజాలంలో మార్క్సిజం, అంబేద్కరిజం రెండూ ఏక కాలంలో నాలో కొనసాగుతూ వచ్చాయి. రెంటి మధ్యన నాకు వైరుధ్యమేమీ కనిపించలేదు.

నాస్తిక గోరా, హేతువాద సి.వి. పుస్తకాలు, పత్రికలు తెప్పించి ఇతరుల చేత కూడా చదివించేవాడిని. అంబేద్కరిజానికి ఆచరణ తక్కువై విప్లవ భావజాల, విప్లవ ఉద్యమాల ప్రభావం ఎన్నో రెట్లు పెరిగాయి. అలా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం, విప్లవ సంస్థల పరిధిలోకి చేరాను. రకరకాల కార్యక్రమాలు, పనులు నిర్వహిస్తూ వచ్చాను. కొండపల్లి సీతారామయ్య గ్రూపు, చంద్రపుల్లా రెడ్డి గ్రూపు అంటూ రెండు వుండేవి. వాటి మధ్య వుండే విభేదాలు అర్థమయ్యేవి కావు. మాది కరెక్టు, మాది కరెక్టు అంటూ ఎవరికి వారు వాదిస్తుంటే కన్ఫ్యూజన్‌గా వుండేది. తెచ్చి పెట్టిన కృత్రిమ విభేదాలు అన్పించేవి. వారితో వాదించడం వల్ల ఉపయోగం లేదని భావించే వాడిని. ఆచరణలో ఇరు గ్రూపులతో కలిసి పనిచేసేవాడిని. క్రమంగా ఏదో ఒక వైపు ఉండాలని డిమాండ్ చేసే క్రమం పెరిగింది.

ఇలా 1977-80ల మధ్య నాపై నాలుగు వాదాలు ప్రభావం వేసాయి. వాటి ప్రభావంతో నాలుగు క్షేత్రాల్లో ఏకకాలంలో పనిచేసాను.

1. అంబేద్కరిజం
2. విప్లవ భావధార, విప్లవ ఉద్యమాలు, కులాతీత, మతాతీత దృక్పథం
3. బలహీనంగానైనా ఆరెస్సెస్ చెప్పిన దేశభక్తి, త్యాగశీలత, క్రమశిక్షణ
4. నాస్తిక హేతువాదాలు

నాలో 1979 నాటికి అంబేద్కరిజం, మార్క్సిజం, నాస్తిక హేతువాదాలు, కులాతీత, మతాతీత దృక్పథాలకు పరిణామం చెందాను. ఈ సిద్ధాంతాల మధ్య కొంత వైవిధ్యం, కొంత వైరుధ్యం, ఆచరణలో భిన్న మార్గాలు వున్నాయని, వాటి మధ్య వుండే సంఘర్షణ ఉందనే అంశం చాలా కాలం దాకా ప్రత్యక్షంగా ఎదురు కాలేదు. 1980లో రామజన్మభూమి, బాబ్రీమసీదు ప్రచారాన్ని, రథ యాత్రలను ప్రారంభించాక బొజ్జా తారకం వంటి వారి ప్రసంగాలు ఆరెస్సెస్ పట్ల ఉండే భ్రమలను పటాపంచలు చేసాయి. దాంతో 1980 నుండి ఆరెస్సెస్ భావజాలాన్ని పూర్తిగా వదిలించుకున్నాను. ప్రచార దశలో విప్లవోద్యమం ఆరెస్సెస్, బిజెపి భావజాల ప్రచారాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కోలేదు. అంబేద్కరిజం నుండి వచ్చిన వారే వారికి సీరియస్‌గా జవాబు ఇచ్చారు. నేను అంబేద్కర్ సంఘాల నిర్మాణాన్ని, పౌరహక్కుల సంఘ నిర్మాణాన్ని చేపట్టాను. విప్లవ విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణాన్ని, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల నిర్మాణాన్ని ఏకకాలంలో ముందుకు నడిపాను.

ఉద్యోగ సంఘాల నిర్మాణం

హాస్టల్ వార్డెన్ ఉద్యోగం అనేక ఒత్తిళ్ళతో కూడుకున్నది. అనేక సమస్యలు చుట్టుముట్టేవి. స్థానికసమస్యలు, విద్యార్థుల సమస్యలు, అధికారుల సమస్యలు, రాజకీయ నాయకుల సమస్యలు ఇలా ఎన్నో రకాల సమస్యలు, ఒత్తిడిలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అదంతా ఒక పెద్ద అనుభవం. అది రాజకీయ సామాజిక ఉద్యమాల అనుభవాల కన్నా తక్కువైనదేమీ కాదు.

ఉద్యోగంలో చేరిన తరువాత, ఉద్యోగంలో ఉండే అభద్రత, నిరంతర భయం వల్ల వార్డెన్‌ల సంఘాన్ని ఆర్గనైజ్ చేయాలని భావించాను. డిఫంక్ట్‌గా వున్న సంస్థను పునరుద్ధరించాలనుకున్నాను. ఎమర్జెన్సీ కాలంలోనే హాస్టల్ వార్డెన్ల సమస్యలు చాలాకాలం నుండి అలాగే కొనసాగుతున్నాయని వార్డెన్ల సంఘాన్ని పునర్నిర్మించాను. సీనియర్లను కలుపుకొని వారికి సరియైన పదవులను కట్టబెట్టి అన్ని పనులు నేను చేసే వాడిని. హాస్టల్‌లో అంబేద్కర్ సాహిత్యం చాలా వుండేది. వాటిని బాగా చదివాను. బౌద్ధం పట్ల, అంబేద్కరిజం పట్ల ఆకర్షణ బాగా పెరిగింది. దాంతో 'సంఘమిత్ర' అనే పేరుతో 'రాంజీ' అనే కలం పేరు పెట్టుకొని 1977లో హాస్టల్ వార్డెన్ల కోసం

ఒక మాసపత్రికను తీసాను. నాలుగు సంచికలు వెలువరించాను. తెలంగాణ వార్డెన్స్ అసోసియేషన్ మహాసభను కరీంనగర్‌లో నిర్వహించాను. అధికారులపై చేసే తీవ్రమైన విమర్శలు పత్రికలో ప్రచురించడంతో పాటు దినపత్రికలకు ప్రకటనలుగా ఇచ్చే వాళ్లం. తెలంగాణ వార్డెన్స్ అసోసియేషన్ మహాసభలకు మహబూబ్‌నగర్ నుండి ఒక బస్సు వేసుకొని వచ్చిన వార్డెన్లు సముదాయించారు. ఈ ఆఫీసరు మా వద్ద పనిచేసి మీ దగ్గరకు వచ్చాడు. చాలా మంచివాడు. మీరు మాట్లాడుతున్న తీరు చేస్తున్న ఉద్యమం తీరు అంతా నక్సలైట్ల వలే వుంది. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు అలా నడవవు అంటూ మహాసభ అయిపోయాక వివరంగా చెప్పారు.

1967-75ల తొమ్మిది సంలల నిరుద్యోగం నా జీవిత దృక్పథాన్ని మార్చివేసింది. ఈ అస్తవ్యస్త సమాజాన్ని మార్చాలనుకున్నాను. అలా ఆరెసెస్ నుండి నక్సలిజం వైపుకు నడిచాను.

ఉద్యోగం దొరికాక చాలామంది ఉద్యమాల నుండి ఆగిపోతుంటారు. **'స్టూడెంట్ లైఫ్ బై'** అప్పుడు ఏదో చేశాం. ఇది ఉద్యోగం. భార్య పిల్లలు, కుటుంబం చూసుకోవాలి. మునపటిలాగా ఉద్యమాల వెంట తిరుగుడు ఎలా కుదురుతుంది అంటారు. నేను ఉద్యోగం వచ్చాక ఆత్మవిశ్వాసంతో ఉద్యమాల్లో ముందుకే కదిలాను. పేదరికం బాధ తీరింది. ఆకలి తీరిన తరువాత మరింత గట్టిగా అరవవచ్చు. అందువల్ల సంస్కరణ ఉద్యమాలు ఎంతో అవసరం అని లెనిన్ ఒక చోట అన్నట్టు ఉద్యోగం వచ్చాక మరింత నూతనోత్సాహంతో ఉద్యమాల్లో ప్రవేశించాను.

అలా విద్యార్థులను, ఉద్యోగులను, రచయితలను ఆర్గనైజ్ చేశాను. ఈ సమాజం కోసం ఏదో ఒకటి చేయాలనే తపన నిరంతరం వెన్నాడుతూ వుండేది. నాలాంటి పేద బతుకులకు జీవితం పట్ల ఆశ, విశ్వాసం కలిగించే విధంగా సామాజిక ఏర్పాటు రావాలని అభిలషించాను.

అన్ని సమస్యలకు వ్యవస్థ మారడమే పరిష్కారమని నక్సలైట్ ఉద్యమ రాజకీయాలను, సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి ప్రచారం చేశాను. 1978 నుండి పౌరహక్కుల సంఘం, అంబేద్కర్ సంఘం, రాడికల్ విద్యార్థి సంఘం మొదలైన రాజకీయ, సామాజిక కార్యకలాపాలను నిర్వహించాను.

ఉద్యమం కోసం ఉద్యోగంలో సస్పెన్షన్

తెలంగాణ వార్డెన్స్ మహాసభ నిర్వహించినప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ వార్డెన్స్ చెప్పిన విషయాలను అప్పుడు నాకు సలహాలిస్తూ వుండిన కూర రాజన్నకు వివరించాను. ప్రభుత్వ ఉద్యోగులకు చాలా పరిమితులుంటాయట అని చెప్పాను. ఆయన వారిని తప్పని మనదే రైటని చెప్పుకుంటూ వచ్చాడు. ఆ తరువాత అధికారులు నన్ను సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేసే ముందు కూడా అధికారులు రాయబారాలు నడిపారు. సస్పెండయితే ఉద్యమాన్ని విస్తృతం చేయవచ్చు అని కూర రాజన్న సలహా ఇచ్చాడు. దాంతో సస్పెండ్ కావడానికే సిద్ధపడ్డాను.

సస్పెండ్ అయ్యాక 1978 మార్చిలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలొచ్చాయి. కేంద్రంలో జనతా పార్టీ ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల సందర్భంగా విమోచన, పుల్లారెడ్డి పార్టీ తరఫున సిరిసిల్లలో చలపతిరావు ఎన్నికల్లో నిలబడ్డాడు. దివిటి గుర్తు అంటూ మనం ప్రచారం చేద్దామన్నాడు రాజన్న. రాజన్నతో పాటు విద్యార్థి నాయకుడుగా శాత్రాజ్‌పల్లెకు చెందిన మురళీధర్ రాజు వస్తుండే వాడు. అలా ఎన్నికల కోసం తిరగడం పూర్తయ్యాక రాజన్నను, మురళీధర్ రాజును ఉద్యోగం గురించి, ఉద్యమం గురించి అడిగాను. ఇష్యూ పాతబడ్డది గదా అన్నారు. ఇష్యూ పాతబడడం అంటే నేను తిరిగి ఉద్యోగంలోకి ఎక్కడం. అంతేగాని ఇష్యూ ఎలా పాతబడుతుంది అని చర్చించాను. వాదాలు పెరిగాయి. సీరియస్‌గా వాదించాను. వారిని వదిలేశాను. ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఆనాడు పనిచేస్తుండిన జనార్ధనరావుని కలిసి వివరించాను. ఉద్యోగ సంఘాన్ని నిర్మించే క్రమంలో ఎలా సస్పెండ్ చేశారో, ఎందుకు సస్పెండ్ చేశారో, తప్పుడు కారణాలు ఎలా చెప్పారో చెప్పాను. కలెక్టర్‌ని కలుద్దామన్నాడు.

అలా ఎన్జీవోల సంఘం తరఫున ప్రాతినిధ్యం ఇవ్వడం ద్వారా పోరాడి చివరకు 8 నెలలకు తిరిగి ఉద్యోగంలో ఆన్‌డ్యూటీలో చేరాను. సస్పెన్షన్ కాలానికి పూర్తి జీతం తీసుకున్నాను. ఆ పైసలతో జగిత్యాలలో ఇంటిస్థలం కొన్నాను. ప్రభుత్వ ఉద్యోగంలో సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీగా పరిగణించి పూర్తి జీతం తీసుకోవడం ఆ రోజుల్లో అరుదైన విషయం. సాధారణంగా ఏదో ఒక చిన్న పొరపాటు జరిగిందని నిర్ధారించి ఒక ఇంక్రిమెంటు కోసి, సస్పెన్షన్ కాలాన్ని సెలవు కింద పరిగణించి తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటారు. అలాంటి పొరపాటును ఏ కాస్త చూపించినా నా ఉద్యోగం టెంపరరీ కనుక టెర్మినేట్ చేయాలని అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు. ఆ విషయాన్ని ఎంక్వయిరీ అధికారులకు, ఎన్జీవోల సంఘం నాయకులు స్పష్టం చేయడం వల్ల ఆన్‌డ్యూటీలోకి తీసుకునే విధంగా సిఫార్సు చేశారు.

ఎలుగందులలో సస్పెండ్ అయ్యాక ఎనిమిది నెలలు జగిత్యాలలో ఇంటివద్దే వున్నాను. జగిత్యాలకు వచ్చాక శ్యామల ఇంటి వద్ద వుంటూ మళ్లీ బీడీలు చేయడం

ప్రారంభించింది. ఏదో కొంత ఆదాయం. బీడీలు చేయకుండా కూర్చుంటే మా అమ్మ తిడుతుంది. అంతపెద్ద వయస్సులో కూడా మా అమ్మ బీడీలు చేస్తుండేది. నేను ఇచ్చిన నెలవారీ ఖర్చులు కూడా తీసుకునేది. అందులోంచి మనుమలకు అవీఇవీ తెచ్చేది.

సస్పెండ్ అయిన తీరిక కాలంలో ఇంట్లో నాపరాయి (షాబాద్ బండ) పరిపించాను. మా సందులో కరెంటు పోల్స్ లేకుండేవి. రెండు కరెంటు పోల్స్ వేయించి ఇంటికి కరెంటు తీసుకున్నాము. అలాగే మున్సిపల్ నల్లా కనెక్షన్ అప్పుడే తీసుకున్నాము. మా కరెంటు మీటరు నెంబరు నాలుగువేల రెండువందల పైన ఉండేది. అలాగే నల్లా కనెక్షన్ నెంబరు నాలుగు వందల ఇరవై ఒకటి వచ్చింది. దాంతో ఊర్లో ఎంతమందికి కరెంటు వుంది, ఎంతమంది నా కన్నా ముందు కరెంటు, నల్లా తీసుకున్నారో తెలిసింది. షాబాద్‌బండ పరవడంతో పాటు తమ్ముడికి, నాకు, అమ్మకు తొమ్మిది గజాల ఇల్లును పార్టిషన్స్ చేసుకున్నాము. ఇంటిముందు, ఇంటివెనుక కూడా షాబాద్ బండ పరిపించాను.

జగిత్యాల జైత్రయాత్ర పేరుతో ప్రసిద్ధమైన 1978 జులైలో రైతుకూలీల సభ జరిగినప్పుడు నేను సస్పెన్షన్‌లో వుండి జగిత్యాలలోనే వున్నాను. జగిత్యాల జైత్రయాత్ర సభలకు ప్రేక్షకుడిగా వెళ్లాను. ఆ తరువాత వాటిని నిర్వహించింది మా తోడల్లుడు కల్లూరు నారాయణ, సాయిని ప్రభాకర్ తదితరులని తెలిసింది. నవంబరు, 1978లో సస్పెన్షన్ ఎత్తివేసి ఎనిమిది నెలల కాలాన్ని ఆన్‌డ్యూటీగా లెక్కిస్తూ హుజూరాబాద్‌కు బదిలీ చేశారు. అక్కడ సముద్రాల భూమయ్య, విన్సెంట్ సాల్మన్‌రాజు, శంకరాచారి, ఉప్పలయ్య, ఇ.సరోజ, కాంతయ్య, సాగర్‌రావు తదితర వార్డెన్లు పరిచయమయ్యారు. వార్డెన్ల సంఘాన్ని బలోపేతం చేశాము. కె.పోచయ్య, జె.పోచయ్య, చందర్‌రావు, ఎస్.నరసయ్య, ఎమ్.వెంకటయ్య, తదితర వార్డెన్‌లము కలిసి అనేక కార్యక్రమాలను తీసుకున్నాము.

ఎలుగందులలో ఉద్యోగం వచ్చాక పండుగ నారాయణ అనే మిత్రుడు పరిచయమయ్యాడు. ఆయన కోరుట్ల హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగం చేస్తుండే వాడు. వేములవాడ సమీపంలోని శాబాజిపల్లి వారి సొంత ఊరు. ఆఫీసు పనిమీద వచ్చి ఇంటికి పోతూ, వస్తుండే తోవలో ఎలుగందుల వుండేది. అలా ఆఫీసులో, ఎలుగందులలో, శాబాజిపల్లిలో కలుసుకుంటూ దళితుల కోసం, వార్డెన్ల కోసం ఏం చేయాలో చర్చిస్తుండే వాళ్లం. ఆయన నా చినమామ అల్లుడైన కల్లూరి నారాయణ విప్లవోద్యమంలో పనిచేస్తున్న విశేషాలను చెప్తుండేవాడు. అప్పుడు రహస్య నిర్మాణం లేకుండేది. కల్లూరి నారాయణ నాకు పెళ్లయిన కొత్తలో, వేసవి సెలవల్లో ఒకసారి

కలిసాడు. విప్లవోద్యమం గురించి చాలా మాట్లాడుకున్నాం. వాటి తరువాయి భాగాన్ని పండుగ నారాయణ చెప్తుండేవాడు.

ఎమర్జెన్సీని 1977 ఫిబ్రవరిలో ఎత్తివేశారు. కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. నిర్బంధాలన్నిటిని ఎత్తివేసింది. ప్రధానమంత్రి మురార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వం ఎమర్జెన్సీలో జైళ్ల పాలు చేసిన వారందరినీ విడుదల చేసింది. విప్లవకారులకు బహిరంగంగా ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్మించే అవకాశాలు వచ్చాయి. పండుగ నారాయణ కూర రాజన్నను శాత్రాజుపల్లి మురళీధర్‌రాజు తదితరులను పరిచయం చేశాడు. కల్లూరి నారాయణ కొండపల్లి సీతారామయ్య గ్రూపులో పనిచేస్తుండే వాడు. కూర రాజన్న చంద్రపుల్లారెడ్డి గ్రూపులో పనిచేస్తుండేవాడు. రెండూ ఒకటే అని కొద్దికొద్ది తేడాలు అని పండుగ నారాయణ చెప్తుండేవాడు. అలా మూడు రోజుల పాటు మా ఇంట్లో ఎలుగందులలో చంద్రపుల్లారెడ్డి పార్టీ తాలూకు శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ క్లాసుల్లో పుల్లారెడ్డి, వేములపల్లి వెంకట్రామయ్య, కూర రాజన్న తదితరులు క్లాసులు చెప్పారు. ఈ క్లాసులకు అటెండ్ అయిన వారిలో మల్లేపల్లి లక్ష్మయ్య, కె.రామలక్ష్మణ్, కూర దేవేందర్ (అమర్) తదితరులు కూడా ఉన్నారు. అప్పుడు వాళ్లు బహుశా విద్యార్థులు.

ఇలా భావజాల రంగంలో ఎలాంటి యుద్ధం లేకుండానే ఆరెస్సెస్ భావజాలం నుండి అంబేద్కరిజానికి, అంబేద్కరిజం నుండి వామపక్ష భావజాలానికి ప్రయాణించాను. వామపక్ష భావజాలం నిజానికి మాకు కొత్త కాదు. బీడీ కార్మికులుగా నేను, అమ్మ, కొక్కుల బుచ్చక్క తదితరులు పనిచేస్తున్నప్పుడు సిపిఐ ఆధ్వర్యంలో బీడీ కార్మిక సంఘం తరపున సి.ప్రభాకర్ బీడీ కార్మికులను ఆర్గనైజ్ చేస్తుండేవాడు. సి.ప్రభాకర్ ఇంట్లో కోరుట్లలో అమ్మ, మేము బీడీలు చేయడానికి 1956-60ల మధ్య కొంతకాలం కిరాయికున్నట్టు జ్ఞాపకం. (ఆ తరువాత సి.ప్రభాకర్ గారి బావమరిది వుసికెల శంకరయ్య గారి చిన్నబిడ్డ సులేఖ మా ఇంటి పెద్దకోడలైంది.) అయితే వామపక్ష భావజాలం, విప్లవ భావజాలం రెండు ఒక్కటే అనిపించలేదు. సిపిఐ భావజాలం ప్రధానంగా ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలతో పరిచయమైంది. విప్లవ భావజాలం ప్రభుత్వాలను మార్చాలని, వ్యవస్థను మార్చాలని, విప్లవం చేయాలనే భావజాలంతో పరిచయమైంది.

భావజాల యుద్ధం ఎప్పుడు ప్రారంభమైంది అని ఆలోచిస్తే ప్రధానంగా భావజాల పరిణామమే అనేక పాయలను, కాల్వలను, ఉపనదులను కలుపుకొని ప్రవహించే మహానదిలాగే జీవితంలో భావజాల పరిణామం సాగుతుందనిపించింది. ఒక మొలక ఎప్పుడు మొక్క అయిందో, మొక్క ఎప్పుడు చెట్టు అయిందో, చెట్టు ఎప్పుడు మహావృక్షం

అయిందో గీత గీసి చెప్పడం సాధ్యం కాదు. అలాగే శిశువు బాలకుడిగా, కౌమారంలోకి, యవ్వనంలోకి, వృద్ధాప్యంలోకి ఎప్పుడు వచ్చారో గీతగీసి చెప్పడం సాధ్యం కాదు. సమాజంలో ఏ మార్పు ఎప్పుడు వచ్చిందో సంస్కృతిలో, భాషలో మార్పులు ఎప్పుడు వచ్చాయో గీతగీసి చెప్పడం సాధ్యం కాదు. సమాజం పరిణామ శీలమైనది. శరీరం పరిణామ శీలమైనది. భావాలు కూడా పరిణామ శీలమైనవి.

రోజూ చూసే వారికి ప్రతి మార్పు కూడా పరిణామ శీలంగానే కనబడుతుంది. అమ్మకు తన పిల్లలను రోజు చూస్తూనే వుంటుంది. ఒక్క పన్ను వస్తే అదిగో వచ్చె అంటుంది. అడుగు వేస్తే సంబరపడుతుంది. చాలా కాలం తరువాత చూసే వాళ్లకి అబ్బ అన్ని పళ్లు వచ్చినయ్ అని ఆశ్చర్యపోతారు. అలాగే అయిదేళ్లకో, పదేళ్లకో ఒకసారి చూస్తే అరె.. ఎంత ఎదిగిపోయావురా! అంటారు. అలాగే ఈ వూరు ఎంత మారిపోయింది! అంటారు. ఇది జొన్నకర్రలా అప్పుడే పెళ్లికి ఎదిగింది! అంటారు. చెట్లను కూడా అబ్బ ఎంత ఎత్తు పెరిగాయి! కొమ్మలు అందడం లేదు, మేము మా చిన్నప్పుడు దీని కొమ్మలు పట్టుకొని ఊగుతూ కోతికొమ్మచ్చి ఆటలాడేవాళ్లం! అని చెపుతుంటారు.

ఇలా ప్రతినిత్యం జరిగే పరిణామాలను, మార్పులను గమనించకుండా ఎప్పుడో ఒకసారి వాటిని గమనించే వాళ్లు అవి పరిణామాత్మక మార్పులు కావని గుణాత్మక మార్పులని వర్ణిస్తుంటారు. పదేళ్ల తరువాత కలిసిన మిత్రులను చాలామారిపోయారు అని స్టూడెంట్ లైఫ్‌లో వున్న మనిషి కాదు ఇతడు అని అంటుంటారు. ఈ మార్పు ఒక్కరోజులో వచ్చేది కాదు. చూసే వాళ్లు చాలా కాలం తరువాత ఒక్కరోజులో చూడ్డం వల్ల అలా అనిపిస్తుంది. సమాజంలోని పరిణామాలన్నీ చాలా మేరకు ఇలాంటివే. ప్రతి నిమిషం గమనించని వాళ్లు వాటిని గుణాత్మక మార్పులని, మౌలిక మార్పులని భావిస్తుంటారు.

ఉదాహరణకు 1947 ఆగస్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని అంటుంటాము. కానీ భారతీయులు బ్రిటీష్ వారి చట్టాలకు లోబడి 1870 నుండే మున్సిపాలిటీ మొదలైన స్థానిక సంస్థలు మొదలుకొని చట్టసభలదాకా ఎన్నికల్లో పాల్గొంటున్నారు, నామినేటెడ్ పదవులను పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. 1947 ఆగస్టు 15వతేదీన బ్రిటీష్ వాళ్లు కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ నేతలకు అప్పగించారు. ఇదంతా సామాజిక పరిణామమే.

నా భావజాలంలో కూడా ఇలా సామాజిక పరిణామంలో భాగంగా భావాల

పరిణామం కొనసాగుతూ వచ్చింది. ఆరెస్సెస్ వాళ్లు తమలోకి తిరిగి రమ్మన్నప్పుడు వారి భావాల పట్ల స్పష్టత ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. కొంతమందితో భావజాల యుద్ధం చేయాల్సి వచ్చింది. అలాగే అంబేద్కరిజంలోకి తిరిగి రమ్మన్నప్పుడు కొంతమందితో భావజాల యుద్ధం చేయాల్సి వచ్చింది. కొండపల్లి సీతారామయ్య గ్రూపుతో కలిసి పనిచేస్తున్నప్పుడు తిరిగి చంద్రపుల్లారెడ్డి గ్రూపుతోనే ఉండాలని కోరినప్పుడు రెండు సిద్ధాంతాలు, ఆచరణల పట్ల భావజాల యుద్ధం చేయాల్సి వచ్చింది. కొండపల్లి సీతారామయ్య గ్రూపులో వున్నప్పుడు కె.జి.సత్యమూర్తి తదితరులు అనేక విషయాలతో పాటు కుల సమస్యను, కులవివక్షను కూడా 1984–85లో చర్చకు తెచ్చినప్పుడు అటో, ఇటో తేల్చుకోవాల్సి వచ్చింది. నేను కొండపల్లి సీతారామయ్య గ్రూపులోనే కొనసాగాను. వీటన్నిటి మధ్య నా జీవితానుభవాల్లో, నాతో వారు వ్యవహరించిన తీరు, ఇతరులతో వ్యవహరించిన తీరు వారి సంబంధాలు, ఆలోచన, అంచనాతోనే నిర్ణయాలకు వచ్చాను.

ఉదాహరణకు విరసంలో చంద్రపుల్లారెడ్డి, కూర రాజన్న గ్రూపు తరఫున హెచ్ఆర్‌కె, రత్నమాల, వై.కాశీపతి తదితరులతో కలిసి పనిచేయాలని కోరినప్పుడు ఆ పార్టీ ఆచరణని గీటురాయిగా తీసుకొని నిరాకరించాను. ఒకటి. వారి సంబంధంలో వున్నప్పుడు నా ఇంట్లో విప్లవ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినప్పుడు విరసం సభ్యుడిగా చేరమని చెప్పలేదు. నా రచనల పట్ల ఉత్సాహం చూపలేదు. రెండు. జగిత్యాలలో చాంద్ పాషా అనే పిడియస్‌యు విద్యార్థిని ఎబివిపి వాళ్లు చంపేస్తే కొద్ది రోజులు మా సభ్యుడే కాదు అని ప్రచారం చేస్తే కూర దేవేందర్‌ను బాగా తిట్టిన తరువాతే మా వాడని ప్రకటించారు. మీ మాటలు విని వార్డెన్ ఉద్యోగం నుండి సస్పెండ్ చేస్తే జిల్లా స్థాయిలో విద్యార్థులో పెద్ద ఉద్యమం నిర్మిస్తామని సస్పెన్షన్ ఉద్యమానికి ఎంతో ఉపకరిస్తుందని అంటే నమ్మాను. అధికారులు ఎన్నో రకాలుగా రాజీ పడ్డానికి సిద్ధపడినప్పటికీ రాజీపడకపోవడం వల్ల సస్పెండ్ చేశారు. తరువాత ఉద్యమమే నిర్మించలేదు.

ఆ తరువాత ఇష్యూ పాతబడ్డది కదా అన్నారు. నేను ఉద్యోగంలోకి చేరితేనే ఇష్యు పాతబడినట్టు. అంతదాక ఇష్యు పాతబడ్డట్టుఎలా అవుతుంది? ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రావు గారిని కలిశాను. ఆయన విషయాలన్నీ విని ఆన్‌డ్యూటీలో తిరిగి ఉద్యోగంలోకి తీసుకునేట్టుగా కలెక్టర్‌ని కలిసి మాట్లాడారు. అది జరిగి వుండకపోయి వుంటే నా ఉద్యోగం టెంపరరీ కనుక ఉద్యోగం రెగ్యులరైజ్ కాలేదు కనుక ఏ కాస్త పొరపాటు జరిగిందని రాసినా ఉద్యోగం నుండి తొలగించే వారు. కాకతీయ యూనివర్సిటీలో 1980, జనవరి 26న జాతీయ జెండాను అవమాన

పరిచారని ఏబివిపి, పోలీసులు వెంటపడిన తరువాత సుబ్బారావును, వినాయకరెడ్డిని ఆదుకున్న తీరేమిటో తెలుసు.

ఇలా ప్రతిసారీ కష్టాల్లో కార్యకర్తలకు, అభిమానులకు మద్దత్తు నిలబడే బదులుగా సమస్య నుండి పలాయనం చిత్తగించారు. అందుకు నా జీవితమే సాక్ష్యం. ఇక సిద్ధాంతాలంటారా! మీవి గొప్ప అని మీరు చెపుతారు. వాళ్లవి గొప్ప అని వాళ్లు చెపుతారు. మీతో వాదించి నేను గెలవడం ఎలా సాధ్యం? మీ వాదన కొండపల్లి సీతారామయ్యతో చేసుకోవాలి. వారితో వాదించి మాదే రైటని ఒప్పించుకోవాలి. కలిసి పనిచేయాలి. అంతేగాని ఇప్పుడేదో రచయితగా, పౌరహక్కుల సంఘం కార్యకర్తగా పనిచేస్తుంటే మీ వైపు రమ్మని అడిగినంతనే రావడం, మీ సిద్ధాంతాలను అంగీకరించడం సాధ్యం కాదు. మీ సిద్ధాంతాలు గొప్పవే కావచ్చు. కానీ మీ ఆచరణే నాకు గీటురాయి. కష్టాల్లో వదిలేసి, పారిపోయే మీవైపు వుండాలని ఎలా కోరుతున్నారు? అని ప్రశ్నించాను.

అలాగే ఆరెస్సెస్ వాళ్లు అడిగినప్పుడు కుల సమస్య పట్ల, కుల వివక్ష పట్ల డా॥ బి.ఆర్.అంబేద్కర్, గాంధీజీ తదితరులు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత నిచ్చి కృషి ఎందుకు చేయడం లేదు? వర్ణ వ్యవస్థను, కుల వ్యవస్థను ఎందుకు వ్యతిరేకించడం లేదు? వాటిని నిర్మూలించడానికి ఎందుకు భావజాల ప్రచారం చేయడం లేదు? ఆచరణలో కార్యక్రమాలు ఎందుకు తీసుకోవడం లేదు? హిందువులందరూ ఒక్కటే అయినప్పుడు కులాల మధ్య, కులాతీతంగా పెళ్లిళ్లను ఎందుకు ఆరెస్సెస్ ప్రాధాన్యతతో ముందుకు తీసుకురావడం లేదు? గుళ్లల్లో కేవలం బ్రాహ్మణులు మాత్రమే ఎందుకు పూజారులుగా వుంటున్నారు? అంబేద్కర్ చెప్పినట్టు కులనిర్మూలన కోసం ఎందుకు కృషి చేయడం లేదు? ఈ కృషి చేస్తే వీటివెంట నేను కలిసి నడుస్తాను. హిందూమతం మతం కాదని అది ఆరు మతాల కలయిక అని శైవం, వైష్ణవం, శాక్తేయం, నాస్తికత్వం, బౌద్ధం, సిక్కు మొదలైనవని చెపుతుండేవాళ్లు. కేవలం విగ్రహారాధనను ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఏకేశ్వరోపాసన పేరిట విగ్రహారాధన లేని భక్తిని ఎందుకు ప్రచారం చేయడం లేదు. విగ్రహారాధన ప్రచారం వర్ణ వ్యవస్థను, బ్రాహ్మణ పూజారి వ్యవస్థను, పాత భావాలను కొనసాగింపు చేయడానికే! బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆరెస్సెస్‌లో ఉన్నత స్థాయి నాయకులుగా ఎందుకు ఉండడం లేదు? బిజెపి, తదితర ఆరెస్సెస్ పరివారంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎందుకు నాయకత్వ స్థానంలో ఉండడం లేదు? బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం తీసుకుంటున్న ప్రణాళికలేవి? అని ప్రశ్నించాను. భావజాల యుద్ధం ఇలా ఆచరణ కార్యక్రమాల నుండి సాగించాను.

అలాగే అంబేద్కరిజం నుండి మార్క్సిజానికి మారినప్పుడు అంబేద్కరిజంలోనే

Dalithayugam-1
03-09-09
136

ఉండాలని కోరే వారితో మీరు తీసుకుంటున్న కార్యక్రమాలేవి? కేవలం జయంతులు, వర్ధంతులు, పైరవీలు, బదిలీలు మొదలైన వాటికే పరిమితమైతే ప్రజల గురించి పట్టించుకున్నట్టు ఎలా అవుతుంది? మీకున్న కార్యక్రమాలేవి? అని విప్లవోద్యమంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం ఈ సమాజం మారడం కోసం అనేక కార్యక్రమాలను తీసుకుంటున్నారు... ఇలా అంబేద్కరిజం నుండి 1977-78లో విప్లవ ఉద్యమంలోకి వచ్చినప్పుడు భావజాల యుద్ధం చేశాను.

అది స్నేహపూరిత భావజాల చర్చ. కాని అంబేద్కర్ సంఘాల్లో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్‌లతో అందరం కలిసి పనిచేస్తుండే వాళ్లం. ఒకవైపు విప్లవ విద్యార్థి యువజనసంఘాలు నిర్మాణం, మరోవైపు పౌరహక్కుల సంఘ కార్యక్రమాలు, ఇంకోవైపు వార్డెన్ల సంఘం, అంబేద్కర్ సంఘాలు, వెట్టిచాకిరీ నిర్మూలన కృషి కోసం కలిసి పనిచేస్తుండేవాళ్లం. వీటి మధ్య వైరుధ్యం రాలేదు.

ప్రతి సంస్థ కొన్ని కార్యక్రమాలనే తీసుకొనేది. ఆరెస్సెస్ వాళ్లు కూడా ముఖ్యమైన కార్యక్రమాలకు రమ్మని పిలిస్తే ఒకటి, రెండు సార్లు వెళ్ళాను. పంజాబ్‌లోని జలంధర్ నుండి భీమ్‌పత్రిక పబ్లికేషన్స్ వాళ్లు ఇంగ్లీషులో అంబేద్కర్ రచనలు ప్రచురిస్తుండే వాళ్లు. వాటిని తెప్పించి చదువుతూ, చదివిస్తూ చర్చిస్తుండే వాళ్లం. విప్లవ ఉద్యమ అవగాహనకు, కార్యక్రమాలకు అంబేద్కర్ అవగాహనకు, కార్యక్రమాలకు మధ్య చాలా తేడా వుంటుందని తెలియదు. ఆచరణలో ఎదురుకాలేదు. అలాగే ఆరెస్సెస్ ఈ రెంటికి వ్యతిరేకమని తెలియదు.

హుజూరాబాద్‌లో ఉద్యమాలు, ఉద్యోగం

1978 నవంబర్‌లో సస్పెన్షన్ తొలగించి ఉద్యోగంలోకి తీసుకుంటూ హుజూరాబాద్‌కు బదిలీ చేశారు. హుజూరాబాద్ హన్మకొండకు 30 కి.మీ. దూరం కావడంతో కాకతీయ యూనివర్సిటీకి, సృజన, వరవరరావు సాహితీ మిత్రులతో సంబంధాలు బాగా పెరిగాయి. ధర్మపురిలో బట్టల షాపు నడుపుతూ డిఓఎల్, బిఓఎల్ చేసిన మిత్రుడు మంచాల గంగాధర్ కాకతీయ యూనివర్సిటీలో ఎమ్.ఏ. తెలుగు చదువుతున్నాడు. ఆయన ద్వారా వందలాది మంది పిడిఎస్‌యు, ఆర్ఎస్‌యు విద్యార్థులు, కార్యకర్తలు పరిచయమయ్యారు. స్నేహితులయ్యారు.

హుజూరాబాద్ హన్మకొండకు దగ్గర కావడంతో కాకతీయ యూనివర్సిటీకి, సృజన, వరవరరావు ఇంటికి వీలైనప్పుడల్లా వెలుతుండేవాడిని. ధర్మపురి స్నేహితుడు మంచాల గంగాధర్ కాకతీయ యూనివర్సిటీలో తెలుగు ఎమ్.ఏ. చదువుతుండే వాడు. అతని ద్వారా యూనివర్సిటీలోని విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విరసం

కార్యక్రమాలు సన్నిహితమయ్యాయి. అతని క్లాస్‌మేట్ హుజూరాబాద్ తాలూకా అంబాల గ్రామానికి చెందిన లింగమూర్తి, వరంగల్ జిల్లా జఫర్‌గడ్‌కు చెందిన మల్లేశం, తదితరులు నాక్కూడా స్నేహితులయ్యారు. లింగమూర్తి రాడికల్ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడై జన్ను చిన్నాలు సంస్మరణ సభలో పైడిపల్లిలో ఉపన్యాసం ఇచ్చిన తరువాత వరవరరావు చివరి ఉపన్యాసం వినకుండానే సగం మంది లేచారు. అంతగా లింగమూర్తి వక్తగా ఎదిగాడు.

ఉపాధ్యాయ శిక్షణ లేదని నాకు ఏటా ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు ఇచ్చేవారు కాదు. నాకు వార్డెన్ ఉద్యోగం వదిలేసి తెలుగు పండిట్‌గా వెళ్లాలని కోరిక. విప్లవోద్యమాలతో హన్మకొండలో కలిసి తిరగవచ్చు అని మరో కోరిక. ఈ మూడు కలిసి తెలుగు పండిట్ శిక్షణకు అప్లయ్ చేశాను. 1979 డిసెంబర్ నుండి 1980 మే వరకు ఆరు నెలలు తెలుగు పండిట్ శిక్షణను బి.ఇడి. కాలేజీలో పూర్తి చేశాను. ఆ సందర్భంగా లింగమూర్తి, మల్లేశం కూడా తెలుగు పండిట్ శిక్షణకై చేరారు. ధర్మపురి రామ్‌కిషన్, పెన్నా శివరామకృష్ణ మొదలైన వాళ్లు కూడా నా క్లాస్‌మేట్స్‌గా చేరారు. బి.ఇడి. కాలేజీలో తెలుగు పండిట్ శిక్షణ విభాగంలో విద్యార్థి సంఘానికి మేము పోటీ చేయాలనుకోలేదు. గెలిచిన వాళ్లు అవకతవకలకు పాల్పడడంతో నాలుగు నెలలోనే వారిని ఇంపీచ్‌మెంట్ చేస్తూ అందరం కలిసి తీర్మానించి తొలగించాము. అలా శిక్షణా విద్యార్థులను ఆర్గనైజ్ చేశాము. వార్షికోత్సవంలో 'కొండలు పగలేసినం బండలను పిండినం' అనే చెరబండరాజు పాటను నృత్యరూపకంగా ప్రదర్శించాము.

1979లో లీవ్ పెట్టి హన్మకొండ బి.ఇడి కాలేజీలో తెలుగు పండిత శిక్షణలో చేరాను. దాంతో మొత్తంగా కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ విప్లవోద్యమాలతో కలిసి తిరిగాను. పనిచేశాను. అలా లింగమూర్తి, పులి అంజయ్య, ఐలయ్య, వినాయకరెడ్డి, కె.రామ్మోహన రాజు, దామెర రాములు వంటి ఎందరో పరిచయమయ్యారు. అలా విరసంలో చేరాను.

1978 నవంబరులో హుజూరాబాద్‌లో ఉద్యోగంలో చేరాక నేడు మావోయిస్టు పార్టీకి కేంద్ర కమిటి కార్యదర్శిగా పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణరావు (గణపతి) వచ్చేవారు. కలిసే వారు. కొంతకాలం విరసంలో చేరకుండా ఉండండి అని చెప్పడంతో రెండేళ్లు ఆలస్యంగా విరసంలో చేరాను.

బతుకుపోరు నవల రాసి మాచర్ల విరసం సభల్లో 1982లో ఆవిష్కరించిన తరువాత కూర రాజన్న విరసంలో తమ వైపు నుండి హెచ్‌ఆర్‌కె, రత్నమాల, కాశీపతి గ్రూపులో ఉండాలని రాయబారాలు పంపారు. కష్టాల్లో వదిలేసిన వాళ్ళు అని వారిని తీవ్రంగా ఖండించాను. సిద్ధాంతాల చర్చలో మిమ్మల్ని గెలవకపోవచ్చు. కాని మీ ఆచరణే గీటు రాయి. కష్టాల్లో వదిలేసే వారిని నేనెలా నమ్ముతాను అని ఖరాఖండిగా చెపుతూ కష్టాల్లో ఎవరెవరిని ఎలా వదిలేశారో అనేక ఉదాహరణలను ఇచ్చాను. నీ సిద్ధాంతం కరెక్టు అయితే నాతో కాదు చర్చించాల్సింది, నేను బలహీనుడిని కావచ్చు, నీకు బలం ఉంటే కొండపల్లి సీతారామయ్యతో, వరవరరావుతో అలాంటి వారితో చర్చించి ఒప్పించుకో, నేను వారిని నమ్ముతున్నాను అని చెప్పాను. అలా చంద్ర పుల్లారెడ్డి విమోచన గ్రూపును విభేదించాను.

మేము బి.ఇడి. కాలేజీలో చదువుతున్నప్పుడే దేవులపల్లి కృష్ణశాస్త్రి చనిపోయాడు. ఆ సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించడంతో పాటు చెరబండరాజు ఆరోగ్య నిధి కోసం విరాళాలు సేకరించాము. నేను, లింగమూర్తి, మల్లేశం హన్మకొండ కొత్తపేటలోని వరవరరావు ఇంటికి ఎదురుగా కిరాయికున్నాము. మా ఇల్లు విప్లవ విద్యార్థి యువజన రాజకీయాలకు కేంద్రంగా సాగింది. వారిలో చాలామంది విప్లవ కార్యకర్తలుగా పార్టీలో రహస్య నిర్మాణంలోకి తరువాత వెళ్లారు. పులి అంజయ్య, ఐలయ్య, రామకృష్ణ, ఎన్.కె., కె.రామ్మోహన్‌రాజు, డా॥ దామెర రాములు, డా॥ చక్రధారి, ఎన్.వేణుగోపాల్, సి.వి.సుబ్బారావు, కె.బాలగోపాల్, డా॥ రామనాథం, బుర్ర రాములు, తదితరులు ఎందరో ఆ సమయంలోనే సంబంధంలోకి వచ్చారు. లింగమూర్తి కర్నూలు జిల్లా పీపుల్స్ వార్ పార్టీ (నేటి మావోయిస్టు పార్టీ) కార్యదర్శిగానో, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగానో పనిచేస్తూ నది దాటుతూ పడవమునిగి చనిపోయాడు. కొంతమంది ఎన్‌కౌంటర్ పేరిట చనిపోయారు.

హన్మకొండలో సృజన, వరవరరావు ఇల్లు సృజన పత్రిక రచనల ఎన్నిక సందర్భంగా జరిగే సృజన సాహితీ మిత్రుల కలయిక, చర్చలు అవగాహనలో అనేక కోణాలను అర్థం చేయించాయి. ఎంపిక చేయాల్సిన రచనలపై చర్చ సాహిత్య సిద్ధాంతాల, శిల్ప చర్చతో పాటు విప్లవ భావజాల చర్చగా పలు పార్శ్వాల్లో విస్తరిస్తూ సాగుతుండేది. తెలుగు పండిట్ శిక్షణ చేస్తున్నప్పుడు తెలుగులో సంస్కృత పదాల ఆధిక్యతను వ్యతిరేకిస్తూ నిత్య జీవితంలో అచ్చ తెలుగు పదాలు మాత్రమే ఎలా వాడుతున్నామో, పుట్టుక నుండి ఐదేళ్ల దాకా తల్లి నేర్పే పదాలను, పిల్లలు నేర్చుకునే పదాలను వివరిస్తూ ఎమ్.ఎస్.ఆచార్య సంపాదకత్వంలో వెలువడే వరంగల్ వాణి, జనధర్మ పత్రికల్లో వ్యాసాలు రాశాను.

విద్యార్థులు ఉద్యమిస్తూ పూర్తికాలం కార్యకర్తలుగా మారే క్రమాన్ని చిత్రిస్తూ ఒక కథ కూడా రాశాను. విప్లవోద్యమం గురించి మధ్యతరగతి దృక్పథం ఎలా వ్యతిరేకత నుంచి అనుకూలతకు మారుతూ వచ్చిందో 'వాసనలేని పూలు' (ఎవరికి

వారే) పేరుతో వరంగల్‌వాణి, జనధర్మ పత్రికలో కథ రాశాను. ఇలాంటి కథలను సృజన ప్రచురించదని చెప్పారు. విప్లవించే వారి గురించి రాసేవి మాత్రమే ప్రచురిస్తామన్నారు. దాంతో హుజూరాబాద్‌లో మేము పరిష్కరించిన సమస్యను తీసుకొని పాలమూరు, అనంతపూర్ లేబర్ గురించిన కథను రాసి సృజనకి ఇచ్చాను. సృజనలో 'తిరుగుబాటు' పేరుతో అచ్చయింది. హుజూరాబాద్‌లో వున్నప్పుడు ముప్పాళ్ళ లక్ష్మణరావు (మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి), మాణిక్యాపూర్ చంద్రమౌళి, తదితరులు కలుస్తుండేవారు. హుజూరాబాద్‌లో వున్నప్పుడే విప్లవ రచయితల సంఘంలో సభ్యుడిగా చేరటానికి దరఖాస్తు ఇచ్చాను.

హుజూరాబాద్‌లో నేను, సముద్రాల భూమయ్య కలిసి హాస్టల్ విద్యార్థులను ఎక్స్‌కర్షన్ (విజ్ఞానయాత్ర)కు తీసుకెళ్ళాము. నాగార్జునసాగర్, శ్రీశైలం, విజయవాడ, తిరుపతి, శ్రీకాళహస్తి మద్రాసు దాకా వేసవి సెలవల్లో టూర్ చేసి వచ్చాము. విజ్ఞాన యాత్రలో దేవాలయాల పరిసరాల్లో జరిగే అవినీతి గురించి, మోసాల గురించి వందయాభై మంది విద్యార్థులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించాము. ఆ విజ్ఞాన యాత్ర మాక్కూడా ఎంతో విజ్ఞానదాయకంగా సాగింది. మా వెంట నూటయాభైమంది సైన్యం వున్నట్టుగా అన్ని చోట్లా బేరం గురించి, ప్రదేశాల గురించి, తొవ్వల గురించి గర్వంగా బోర విరుచుకొని తెలుసుకుంటుండేవాళ్లం.

తెలుగు పండిట్ శిక్షణ పూర్తయ్యాక తిరిగి హుజూరాబాద్‌లో డ్యూటీలో చేరాను. ధరలు పెరుగుతున్న కొద్దీ విద్యార్థులకు బడ్జెట్ పెంచలేదు. చాలాకష్టంగా వుండేది. విద్యార్థుల్లో భోజనం సరిపోవడం లేదని, రుచికరంగా, చాలినంత కూరలు ఉండడం లేదని అసంతృప్తి మొదలైంది. విద్యార్థులకు ఎలా ఉద్యమించాలో చెప్పే పెద్దలుగా మేమే వున్నందున ఈ సమస్యను వార్డెన్ల సంఘం తరపున కూడా పరిష్కరించాలని భావించాను. రేషన్ షాపుల ద్వారా కిలో రూపాయి ఎనభై పైసలకు బియ్యం ఇస్తుండే వారు. మార్కెట్లో నాలుగైదు రూపాయలుండేది. రేషన్ షాపులకిచ్చే సివిల్ సప్లయిస్ బియ్యాన్ని హాస్టళ్లకు కూడా సప్లయ్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వార్డెన్ల సంఘం తరపున మెమోరాండం ఇచ్చాము.

అప్పుడు కరీంనగర్‌లో శర్మారావు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. మా వాదన వినిపించాము. హాస్టల్‌లో వుండేది పేదవారి పిల్లలే. కనుక పేదవారికి ఇచ్చే కంట్రోల్ బియ్యం హాస్టళ్లకు కూడా ఇవ్వాలి అని నా వాదనను వినిపించాను. అలాగే కంట్రోల్‌పై వచ్చే పామాయిల్ కూడా సప్లయ్ చేయాలని కోరాము. 1980 జులైలో శర్మారావు అందుకు అంగీకరించి జిల్లాలోని అన్ని హాస్టళ్లకు రేషన్ షాపు బియ్యాన్ని కేటాయించారు. 1983లో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలోని

అన్ని హాస్టళ్ళకు ఈ పథకాన్ని విస్తరింప చేశారు. ఇప్పటికీ హాస్టళ్లకు కిలో నాలుగు రూపాయల పది పైసలకు బియ్యం సప్లయ్ చేస్తున్నారు. అలా ఒక దళితుడు ఐ.ఏ.ఎస్. ఆఫీసర్‌గా శర్మారావుగారు వుండడం వల్ల మేము విజయం సాధించడం జరిగింది. అది కాలక్రమంలో రాష్ట్రంలోని విద్యార్థులందరికీ అమల్లోకి వచ్చింది.

బియ్యం కోటాను కేటాయించడం సందర్భంగా జాయింట్ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు చెప్పిన విషయాల్లో మా సోషల్ వెల్ఫేర్ అధికారులపై అనేక ఫిర్యాదులు కూడా వున్నాయి. దాంతో వారు మాపై పగబట్టారు. కసి తీర్చుకోవాలనుకున్నారు. నన్ను వేములవాడ హాస్టల్‌కు బదిలీ చేశారు. వేములవాడ హాస్టల్‌లో ఒకే సంవత్సరంలో అయిదుగురు వార్డెన్లు బదిలీ కావడమో, సస్పెండ్ కావడమో చేసిన విద్యార్థులు, స్థానిక రాజకీయాలు కొనసాగుతున్న ఊరు. ఇక్కడయితే సస్పెండ్ చేసి బొంద పెట్టవచ్చుననుకున్నారు. నేను సామాజిక దృక్పథం గల ఉద్యమ స్వభావం గల వార్డెన్‌నని నా రాకకు ముందే వేములవాడలో తెలిసిపోయింది.

వేములవాడలో రుద్రారం గ్రామానికి చెందిన రేగులపాటి పాపారావు (మాజీ ఎమ్మెల్యే), పంచాయితీ సమితి అధ్యక్షుడుగా వుండేవాడు. హాస్టల్, పంచాయితీ సమితి కార్యాలయం, సిబ్బంది క్వార్టర్లు ఒకే కాంపౌండులో వుండేవి. హాస్టల్ విద్యార్థుల లొల్లి వారికి వశపడేది కాదు. సార్, మీరయినా ఈ హాస్టల్‌ను బాగుపరచండని వీడ్కోలు, స్వాగత కార్యక్రమంలో పాపారావు కోరారు. నిరంతర కృషితో హాస్టల్‌ను సక్రమ మార్గంలో తెచ్చాను. వేములవాడకు వచ్చాక తిరిగి పిడిఎస్‌యు, చంద్రపుల్లారెడ్డి, కూరరాజన్న గ్రూపుకు సంబంధించిన విప్లవ విద్యార్థి యువజన రాజకీయాలు సమీపంలోకి వచ్చాయి. నేను వారిని దూరం వుంచాను. దాంతో నన్ను సస్పెండ్ చేయించాలని అనేక ప్రయత్నాలు చేశారు. స్థానికుల సహకారంతో, విద్యార్థుల సహకారంతో వాటన్నింటిని పూర్వపక్షం చేశాను.

అదే సమయంలో నూతన సాహితీ పేరుతో సిరిసిల్ల, వేములవాడ మిత్రులతో అనేక కార్యక్రమాలను తీసుకున్నాము. తోటమహదేవ్, నేను చురుకుగా పనిచేస్తూ జూకంటి జగన్నాథం, చంద్ర ఆంజనేయులు, కిరణ్, పి.ఎస్.రవీందర్, గజభీంకార్ దేవరాజ్, మొదలైన యువసాహితీ వేత్తలను కూడగట్టి సాహితీ సమావేశాలను నిర్వహించాము. విరసానికి చెందిన హెచ్చార్కే, రత్నమాల తదితరులు ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా వస్తుండేవారు. సిరిసిల్ల పక్కన గల తంగళ్లపల్లిలో జూకంటి జగన్నాథం, తదితరుల చొరవతో కథా శిక్షణా శిబిరాన్ని 1980లో నిర్వహించడం జరిగింది. జ్వాలాముఖి వంటి ప్రముఖ రచయితలు శిక్షణను ఇచ్చారు. సిరిసిల్ల నుండి మిత్రుడు నిజాం వెంకటేశం దిక్సూచి అనే వచన కవిత బులెటెన్‌ను

వెలువరించాడు. నేను 'అల' పేరుతో కథలకు సంబంధించిన బులెటెన్ ప్రారంభించాలని తొలి సంచిక అచ్చు వేశాను. ఎందుకో నిజాం వెంకటేశం దీన్ని నిరంతరం నిరుత్సాహ పరుస్తుండేవాడు. దాంతో అది ఆగిపోయింది. తోట మహదేవ్ 'వెల్లువ' అనే పేరుతో బులెటెన్ వెలువరించాడు. అది ఇద్దరం కలిసి నిర్వహించాము.

కుటుంబంలోకి కొత్త సభ్యులు వస్తుంటారు. పోతుంటారు. పెళ్లితో కొత్త కుటుంబం ఏర్పడుతుంది. కొత్త కుటుంబం ఏర్పడ్డం అంటే, కొత్త ఇల్లు ఏర్పడ్డట్టే. 1973లో పెళ్లయ్యాక మా కొత్త కుటుంబం ఏర్పడింది. 1978లో మా కొత్త ఇల్లు ప్రయత్నం మొదలైంది. కొత్త సంసారానికి, కొత్త ఇంటి నిర్మాణానికి ఎన్నో పోలికలు.

ఎక్కడెక్కడి నుండో పల్లెటూళ్ళకెల్లి వచ్చి మా జగిత్యాలలో జాగలు కొని ఇండ్లు కట్టుకుంటున్నారు. ఊరు పెరిగిపోతున్నది. పల్లెల్లో ఉండలేక కొందరు దొరలు, మోతుబరులు నక్సలైట్ల భయానికి మరికొందరు జగిత్యాలకు వచ్చి ఇండ్లు కట్టుకొని రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. కొందరు హోటళ్ళు పెట్టుకున్నారు. కొందరు ఆటోమొబైల్ షాపులు పెట్టుకున్నారు. కొందరు షాపులు పెట్టుకున్నారు. పల్లెల్లో ఏమి లేదని జగిత్యాలలో అన్నీ దొరుకుతాయని, పిల్లల చదువులు బాగుంటాయని ఇంకా రకరకాల కారణాలతో జగిత్యాలకు రావడం పెరుగుతూనే ఉన్నది. పెరండ్లు, పొలాలు పోయి ఇళ్ళ స్థలాలు అయ్యాయి. ఇండ్లు కడుతున్నారు.

ఇల్లు కట్టి చూడు పెళ్ళి చేసి చూడు అని ఊరికే అన్లేదు పెద్దలు. పెళ్ళంటే ఏడాది కష్టపడితే నెల రోజుల్లో పెళ్ళి అయిందనిపించవచ్చు. కాని యిల్లు పని అలా కాదు. అన్ని పనులు మన చేతిలో ఉండవు. స్థలం కొనడానికి పెద్ద ప్రయత్నం కావాలి. దానికి అన్ని కాగితాలు చూసుకోవాలి. పైసలు సమకూర్చుకోవాలి. రిజిష్టేషన్ చేయించుకోవాలి. అదంతా ఒక పెళ్ళికన్నా తక్కువ కష్టం ఏమి కాదు.

వేములవాడలో ఉద్యోగం చేస్తూ వారానికోసారి జగిత్యాలకు వస్తూ కొత్త ఇల్లు పనులు చూసుకున్నాను. అటూ ఇటూ రెండు ఊర్లు తిరుగుతూనే 1981లో 'పాలు' కథలు రాశాను. 1982లో 'బతుకుపోరు' నవల రాశాను. వేములవాడ సిరిసిల్ల రెండు తాలూకాల రచయితలతో నూతన రచయితల వేదిక ఏర్పాటు చేశాను. జూకంటి జగన్నాథం, తోట మహదేవ్, చంద్ర ఆంజనేయులు మొదలైన రచయితలను సమీకరించాను. గ్రామాలకు తరలండి అని గ్రామాలను అధ్యయనం చేయాలని విప్లవ రచయితల సంఘం పిలుపునిచ్చింది. ఆ పిలుపుతో మేం నలుగురం సిరిసిల్ల తాలూకా కోనరావు పేట గ్రామాలకు బయలుదేరాము. బస్సు దిగి హోటల్లో చాయతాగుతున్నప్పుడు అటు జీపు వచ్చింది. ఎందుకు వచ్చినారని ఎస్.ఐ దాష్టీకం ప్రదర్శించాడు. ప్రభుత్వ ఉద్యోగస్తులం అని, ఊరు పరిశీలించడానికి వచ్చాం అని

చెప్పాం. వాళ్ళు జీబులోకి ఎక్కించి వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌లో పడేశారు. చిత్రహింసలు పెట్టారు. అదే రోజు రాత్రి లక్ష్మారెడ్డి అడ్వకేట్‌కు విషయం చెప్పి పంపాము. తెల్లవారి కోర్టుకు హాజరుపరిచి విడుదల చేశారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారమైంది. ఎక్కడికక్కడ పోలీసు చర్యలను ఖండించారు. కానీ జూకంటి జగన్నాథం బాగా భయపడిపోయాడు. విరసానికి రాజీనామా ఇచ్చాడు.

నూతన సాహిత్యవేదిక తరఫున జరిగే సదస్సులకు, సమావేశాలకు హెచ్చార్కె, రత్నమాల, కూర దేవేందర్, సహదేవ్ మొదలైనవాళ్ళు హాజరయ్యేవారు. రత్నమాల బతుకుపోరు రాతప్రతి చదివి ఎంతో సంతోషించింది. కొన్ని వివరాలు రాస్తే నాలాంటి వారికి తెలుస్తుంది అని కొన్ని సూచనలు చేసింది. తన సంపాదకత్వంలో వెలువడుతున్న నూతన మాసపత్రికలో నేను రాసిన 'ఇంటర్వ్యూ' అనే కథను ప్రచురించింది.

కరీంనగర్‌లో మంకమ్మ తోటలో అలిశెట్టి ప్రభాకర్, శిల్పి ఫోటో స్టూడియో పెట్టుకొని నడిపిస్తున్నాడు. గిరాకీ చాలా ఉంటుంది. అది పెద్ద సెంటర్. కరీంనగర్ జిల్లా కేంద్రం కనుక నేను జగిత్యాల, వేములవాడ తిరుగుతుంటాను గనుక నువ్వే ఉండు అని బలవంతం చేసి విరసం జిల్లా కన్వీనర్‌గా ఒప్పించాను. పనంతా నేనే చూసుకుంటానని హామీ ఇచ్చాను. విరసం సభ్యులను చేర్చుకోవడం చిన్న చిన్న సాహిత్య సమావేశాలు ఏర్పాటు చేయడం, పోలీసుల దౌర్జన్యాలను ఖండించడం చేసేవాళ్ళం. అలిశెట్టి ప్రభాకర్ వేసిన మంటల జెండాలు పుస్తకానికి సృజన, అరుణతార పత్రికల్లో ప్రోత్సహించే పద్ధతిలో సమీక్షలు రాలేదు. బయటి పత్రికల్లో చక్కని సమీక్షలు వచ్చాయి. దాంతో అలిశెట్టి ప్రభాకర్ విరసంలో ఎందుకు పనిచేయాలి అని అన్నాడు. కనీస మర్యాద పాటించకుండా ఎలా పడితే అలా సమీక్షలు రాయడం ద్వారా విరసం చాలా మందిని దూరం చేసుకుంది. నా విషయంలో కూడా ఇంతే జరిగింది. 'బతుకుపోరు' నవల 1982 జూన్‌లో మాచెర్లలో జరిగిన విరసం సాహిత్య పాఠశాలలో ఆవిష్కరించబడింది. సృజన, అరుణతారలో వచ్చిన సమీక్షలు ప్రోత్సహించే బదులు చాలా నిరుత్సాహం కలిగించాయి. ఆంధ్రజ్యోతి వార పత్రికలో ఒక పూర్తిపేజి సమీక్ష సూరంపూడి సీతారాం రాశాడు. నవలను ఆకాశానికి ఎత్తేశారు. లూసన్ గోర్కితో పోల్చారు. అలా తిరిగి ఉత్సాహంగా రచనలు చేయడానికి ప్రోత్సాహం అందింది.

శ్రీశ్రీ 1983, జూన్‌లో చనిపోయినప్పుడు పెద్ద ఎత్తున సంస్మరణ సభను కరీంనగర్ కళాభారతిలో నిర్వహించాము. ఆ సభకు వరవరరావు ముఖ్య అతిథిగా విచ్చేశాడు. అప్పుడు మేము బి.బాలగంగాధర్ సంపాదకత్వంలో కలిసి తీస్తున్న 'చాటింపు' పక్ష పత్రికను శ్రీశ్రీ సంస్మరణ ప్రత్యేక సంచికగా వెలువరించాము. వరవరరావు కరీంనగర్ ప్రసంగాన్ని టేప్ చేసి టేప్ నుండి కాగితం మీద పెడితే 70 పేజీలయ్యింది. రిపిట్‌నెస్

తీసివేస్తూ సంక్షిప్తం చేసుకుంటూ వచ్చేసరికి పది పేజీల కన్నా తగ్గింది. దాన్ని అచ్చు వేద్దామని చూసేసరికి శ్రీశ్రీ ప్రత్యేక సంచికగా వేసిన సృజనలో వి.వి. వ్యాసం ఎలా వుందో అదే వ్యాసం రీప్రింట్ చేసినట్టుగా వచ్చింది. మాకు ఆశ్చర్యం వేసింది. ఎనిమిది పేజీల శ్రీశ్రీ వ్యాసాన్ని వరవరరావు గంట ప్రసంగంగా మార్చి చెప్పాడని అర్థమైంది.

1982 డిసెంబర్‌లో వేములవాడ నుండి జగిత్యాల సమీపంలోని మల్యాలకు బదిలీ చేయించుకున్నాను. ఇందుకు నిజాం వెంకటేశం సహచర్యంలో మిత్రుడైన గంగారెడ్డి ఇంజినీర్ ద్వారా ఆనాటి మంత్రి వెంకటేశ్వరరావు ఫోను ఒత్తిడి ప్రధాన కారణం. ఇంటి వద్ద ఉంటే మరింత ఎక్కువ సామాజిక, సాహిత్య రంగంలో కృషి చేయవచ్చునని భావించాను. వేములవాడలో వున్నప్పుడే జగిత్యాలలో సొంత ఇల్లు నిర్మాణం ప్రారంభించాను. హుజూరాబాద్‌లో వున్నప్పుడే జగిత్యాలో కొన్న ఇంటిస్థలంలో మల్యాలకు వచ్చాక ఇంటిపని చురుకుగా నడిపించాను. గోపి రాజన్న, గోవిందుల రాజన్నతో కలిసి జగిత్యాలలో పౌరహక్కుల సంఘాల నిర్మాణం మహాసభలు చేపట్టాను. అప్పటికి ఏబివిపి, పోలీసుల నిర్బంధం బాగా పెరిగిపోయింది.

కొందరు విప్లవ విద్యార్థి యువజనులను, నక్సలైట్లను ఆరెస్సెస్, బిజెపి, ఎబివిపి కార్యకర్తలు, నాయకులు పనిగట్టుకొని పోలీసులకన్నా ఎన్నో రెట్లు వెంట పడి చిత్రహింసల పాలు చేశారు. అరెస్టులు చేయించారు. ఎన్‌కౌంటర్‌లు చేయించారు. పిడిఎస్‌యుకు చెందిన చాంద్ పాషాను ఎబివిపి వాళ్లు చంపిన తరువాత చంద్రపుల్లారెడ్డి, రాజన్న గ్రూపు ప్రతీకారం తీర్చుకోకపోవడంతో నక్సలైట్లంటే వారికి భయం లేకుండా పోయింది. చాంద్ పాషాను చంపినందుకు వాళ్లు ప్రాణాలు అరచేత పట్టుకొని చాలాకాలం గజగజ వణుకుతూ బతికారు. భయం తేలిపోవడంతో విజృంభించారు. అది రాడికల్ విద్యార్థులపై ప్రభావం పడి గ్రామాలకు విస్తరించింది.

జగిత్యాల తాలూకా చుట్టపక్కల గ్రామాల్లో రాడికల్, రైతుకూలి సంఘాలు బలంగా వుండేవి. జగిత్యాల కాలేజీలో మాత్రమే పిడిఎస్‌యు బలంగా వుండేది. నిర్బంధం రాడికల్స్‌పై పెరిగింది. దాంతో రామన్న, గోపన్న అని పిలిచే రామచంద్రరావు, గోపాల్‌రెడ్డిలను గోవిందు పల్లెలో ఒక పెళ్లికి వెళ్లివస్తుండగా నక్సలైట్లు దారికాచి చంపేశారు. దానికి ప్రతీకారంగా మా ఇంటి సమీపంలోనే వున్న అడ్వకేట్ గోపి రాజన్నను చంపేశారు. రెండో టార్గెట్‌గా నన్ను చంపాలని ప్రయత్నిస్తున్నారు. నేను ఆరెస్సెస్ ముఖ్య శిక్షక్‌గా పనిచేసి వందలాది మందిని వారికి కార్యకర్తలుగా, నాయకులుగా అందించిన కృషిని వారు గుర్తించలేదు. నాతో కలిసి పనిచేసిన వారి మాట ఆ సంస్థల్లో సాగలేదు. కొత్తగా చేరిన వెలమ, రెడ్డి భూస్వాముల, వారి సంబంధీకుల మాటనే ఆరెస్సెస్, బిజెపి, ఏబివిపి మాటగా చెలాయించారు. దాంతో ఆరెస్సెస్ రాష్ట్ర వ్యాప్తంగా చాలా నష్టపోయింది. చివరకు 1988లో నక్సలైట్లతో ప్రత్యక్ష పోరాటం వద్దని కేంద్ర స్థాయిలో నిర్ణయించుకొని వదిలివేశారు. అప్పటికే నేను, మిన్నేని విద్యాసాగర్‌రావు ఆరెస్సెస్‌లో కలిసి పనిచేసిన వాళ్లం జగిత్యాలను వదిలిపెట్టాల్సి వచ్చింది.

1983 అక్టోబర్‌లో ఢిల్లీలో విప్లవ రచయితల సంఘం వంటి ఇతర రాష్ట్రాల రచయితల సంఘాలతో ఏర్పడిన అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి ప్రథమ మహాసభలు జరిగాయి. రైల్లో ఢిల్లీ వెళ్లివచ్చాను. ఆగ్రాలో తాజ్‌మహల్ చూడ్డం కోసం అందరం కలిసి వెళ్లినప్పుడు విరసం వ్యవస్థాపక సభ్యులు కె.వి.ఆర్. తాజ్‌మహల్ నిర్మాణ విశేషాలను, ఫతేపూర్ సిక్రీ కోట నిర్మాణ విశేషాలను ఎన్నో విప్పి చెప్పారు. ఢిల్లీ సభల్లో 'ఊరు మనదిరా' గూడ అంజయ్య పాట, 'సుత్తి కొడవలి గుర్తు'గా వున్న పాణిగ్రాహి పాట అనేక భాషల్లో ఒకే ట్యూన్‌తో పాడడం ఒక పరమాద్భుతం.

ఢిల్లీకి వెళ్లివచ్చాక మల్యాల హాస్టల్ విద్యార్థులను సమీపంలోని కొండగట్టుకు వనభోజనానికి తీసుకెళ్ళినప్పుడు టేప్‌రికార్డర్‌లో అన్ని విప్లవ పాటలే వినిపించడం జరిగింది. ఇలా అందరి దృష్టి బహిరంగంగానే పనిచేయడం వల్ల అవకాశం కోసం చూస్తున్నారు. పౌరహక్కుల సంఘం తరపున కొందరి అరెస్టులు, నిర్బంధాల గురించి అడ్వకేట్ పాపారావు, అడ్వకేట్ గుణవంత్‌సింగ్, జాప లక్ష్మారెడ్డి, పల్లె రాజేశం, వెదిరె మల్లారెడ్డి, తాడిగిరి పోతరాజు, జనతా పార్టీ ఆంజనేయులు మొదలైన వాళ్లం కలిసి పోలీస్ ఎస్.పి.ని, కలెక్టర్‌ను కలిసి వివరించి ఆ తరువాత పోలీసు చర్యలను ఖండిస్తూ పత్రికా ప్రకటనలను ఇస్తుండే వాళ్లం. ఆయా గ్రామాలకు వెళ్లి నిజనిర్ధారణ చేసి రిపోర్టును పత్రికలకు విడుదల చేస్తుండే వాళ్లం. ఇది వాళ్లకు కంటగింపుగా వుండేది. విప్లవ రచయితగా పనిచేసినప్పుడు ఇంత నిర్బంధం వుండేది కాదు. పౌరహక్కుల సంఘంలో అనుక్షణం పోలీసుల నిర్బంధాలను ఖండిస్తూ వచ్చే సరికి మాపై తీవ్ర నిర్బంధం పెరిగింది.

1984లో జనవరి సంక్రాంతి సెలవుల్లో శ్రీకాకుళం జిల్లా మాకి వలసలో విరసం మహా సభలు జరిగాయి. విరసానికి మార్క్సిజం,లెనినిజం మావో ఆలోచన విధానం దృక్పథంగా ఉండాలా లేదా? నూతన ప్రజా స్వామిక విప్లవమే సరిపోతుందా అనే అంశంపై సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. ఓటింగ్ కూడా జరిగింది. విమోచన పుల్లారెడ్డి గ్రూపు తరపు విరసం సభ్యులు మైనార్టీ అయ్యారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం ఉండాలనేది అంగీకరించబడింది. ఆ సభల్లోనే నన్ను విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తీసుకున్నారు. అప్పటికే నేను కరీంనగర్ జిల్లా

విరసం కన్వీనర్‌గా, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నాను. పౌరహక్కుల సంఘం తరపున పనిచేస్తూ హుజురాబాద్, సుల్తానాబాద్, పెద్దపెల్లి, కరీంనగర్, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల తాలూకాలో సభలు పెట్టడం, గ్రామాలు తిరగడం రోజురోజుకూ పెరుగుతున్నది. పెద్దాయన జాప లక్ష్మారెడ్డి, సుప్రసిద్ధ రచయిత తాడిగిరి పోతరాజు, జనతా పార్టీ నాయకులు, జై తెలంగాణ ఉద్యమ నాయకులైన ఆంజనేయులు, హుస్నాబాద్‌కు చెందిన కరీంనగర్ అడ్వకేట్ పాపారావు, లెక్చరర్ పల్లె రాజేశం, మల్లికార్జున్, గుణవంత్ సింగ్, రాజేశ్వర్ రావు, అనుమల్ల భీమయ్య, గోపి రాజన్న, గోవిందుల రాజన్న, ఎల్లారెడ్డిపేటకు చెందిన మల్లారెడ్డి మొదలైనవాళ్ళం పెద్ద టీంగా తిరుగుతున్నాం. ఎక్కడ అరెస్టు జరిగినా, పోలీసులు దాడులు చేసినా కలెక్టర్‌ను, జిల్లా ఎస్.పిని కలవడం, విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేయడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, నిజ నిర్ధారణ కమిటీగా ఆయా గ్రామాలకు వెళ్ళి రిపోర్టులను పత్రికలకు, జిల్లా కలెక్టర్‌కు అందించడం మొదలైన పనులతో ఇల్లు గురించి, పిల్లల గురించి తీరిక దొరికేది కాదు. విరసం పనులకన్నా పౌరహక్కుల సంఘం పనులే ఎన్నో రెట్లు ఎక్కువ. ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాల్సి వస్తుందో తెలియదు. పోలీసులకు పౌరహక్కుల సంఘం సింహస్వప్నం. జిల్లా అధ్యక్షులుగా పల్లె రాజేశం లెక్చరర్‌గా పని చేసుకుంటూ అందరినీ కూడగడుతుంటాడు. ఇరవై ఏళ్ళు అలుగునూరుకు సర్పంచ్‌గా పని చేసిన జాప లక్ష్మారెడ్డిని అందరూ బాపు అని పిలుస్తూ తండ్రిలాగా గౌరవిస్తుంటారు. రాష్ట్ర అధ్యక్షుడు కన్నభిరాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ పౌరహక్కుల సంఘం పని చూస్తుంటారు. విరసానికి కార్యదర్శిగా కె.వి.ఆర్. పని చేస్తుంటారు.

కరీంనగర్ జిల్లా అంతటా రాడికల్ విద్యార్థి యువజన సంఘాలు, రైతుకూలి సంఘాలు పెద్ద ఎత్తున కదులుతున్నాయి. 1983 మే 22, 23 తేదీల్లో రైతుకూలి సంఘం రాష్ట్ర మహాసభలు కరీంనగర్‌లో బస్టాండ్ సమీపంలో గొప్పగా జరిగాయి. కొందరు నక్సలైట్ల ప్రభుత్వమే వచ్చేటట్టు ఉన్నదని అన్నారు. సభలకు వచ్చేవారిని అడ్డుకుంటూ నిర్బంధాల పాలు చేశారు. మంటలు, చాటింపు పత్రికల్లో వీటి గురించి వివరంగా వార్తలు వచ్చేవి. వరవరరావు ఈ సభలు స్ఫూర్తితో 'భవిష్యత్ చిత్రపటం' అనే దీర్ఘ కవిత రాశారు. ఈ సభల ఏర్పాట్లలో నా వంతు కృషి నేను చేశాను. విరాళాల సేకరణలో ఎదురైన అనుభవాల గురించి 'అసమర్థుడి జీవయాత్ర' సభలకు వచ్చే వారిపై సాగించిన నిర్బంధాలను, హింసను గురించి మరొక కథను రాశాను. స్వామి అగ్నివేశ్ ఢిల్లీ నుండి ఈ సభలకు వచ్చి ఈ ప్రజల పాద ధూళిని నా నొసట ధరిస్తాను అని అన్నాడు. ఈ సభలను విచ్ఛిన్నం చేయాలని ఎన్టీఆర్, టీడీపీ ప్రభుత్వం

చేయని ప్రయత్నం లేదు. ఆ తరువాత ఎన్టీరామారావు నక్సలైట్లు, దేశభక్తులు అని విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల అభిమానం చూరగొన్నాడు. కానీ ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత వెంటనే అమాయకులను ఎన్‌కౌంటర్‌ల పేరిట చంపడం మొదలైంది. నిర్బంధాలు పెరిగాయి.

ఆ తరువాత కొత్తగూడెంలో సింగరేణి కార్మిక సమాఖ్య రాష్ట్ర మహాసభలు జరిగాయి. బొగ్గుపొరల్లో పుస్తకాన్ని సకాలంలో తెచ్చి అక్కడ ఆవిష్కరించాము. రైళ్ళల్లో ప్రయాణం చేస్తున్న విద్యార్థులను, యువకులను వేలాది మందిని అరెస్టు చేశారు. ఎలాగోలా ఇల్లు చేరాను. తరువాత ఢిల్లీ ఎ.ఐ.ఎల్.ఆర్.సి సభలకు వెళ్ళాను.

ఢిల్లీలో పరిచయమైన పౌరహక్కుల సంఘం ఇతర సంఘాల నాయకులు జిల్లాను పర్యటిస్తానన్నారు. నేను వారిని వెంట తీసుకొని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ తాలూక కనుకులగిద్ద, కేశవపురం, అంబాల మొదలైన గ్రామాలు తిరిగాము. జగిత్యాలలో జగదేవ్ పేట, లొత్తునూరు మొదలైన గ్రామాలు తిరిగాము.

చివరకు 1984 జనవరిలో శ్రీకాకుళం జిల్లా మాకివలసలో జరిగిన విరసం మహాసభలకు వెళ్లివచ్చిన తరువాత వారం రోజులకే పోలీసులు అరెస్టు చేశారు. దాని వెనుక మరెన్నో కారణాలున్నాయి. వేములవాడలో వున్నప్పుటి నుండే ఈ ఉద్యోగం వదిలేసి తెలుగు పండిట్‌గా వెళ్లాలని డి.ఇ.ఓ., జిల్లా పరిషత్ కార్యాలయాల చుట్టూ దరఖాస్తులిచ్చి తిరిగాను. కొత్తవాళ్లను తీసుకుంటే వేలల్లో లంచాలు వస్తాయి. నాది ఒక డిపార్టుమెంట్ నుండి మరో డిపార్టుమెంట్‌కు బదిలీ కనుక వారికేమి లాభం కనిపించలేదు. అందువల్ల తెలుగు పండిట్‌గా తీసుకోలేదు. దాంతో ఈ ఉద్యోగం వదిలేయాలని పత్రికా రంగంలోకి వెళ్లాలని, నిర్బంధాన్ని తట్టుకొని నిలబడడానికి పత్రిక బలమైన సాధనమని అనిపించింది. ఆ సమయంలో విజయ్ కుమార్‌తో కలిసి ఒక స్థానిక దినపత్రిక పెడదామని నిర్ణయానికి వచ్చాను. న్యూస్‌పేపర్స్ రిజిస్ట్రార్, న్యూఢిల్లీకి పంపిన ప్రతిపాదనల్లో 'జీవగడ్డ' అనే పేరు కేటాయిస్తూ లెటర్ పంపించారు. ఈ జీవగడ్డ పేరు ఆరెస్సెస్ పేరులాగా వుందని గొణిగాడు విజయ కుమార్. 'మంటలు', ఇంగ్లీష్‌లో 'బ్లిడ్జ్' అనే పేర్లతో వచ్చే పత్రికలు వాటి అర్థాలను ఇస్తున్నాయా లేక వాటిలోని వార్తలు, వ్యాఖ్యలననుసరించి వాటిని ఫీలవుతున్నామా అని సముదాయించాను. దానికి వేల రూపాయల పెట్టుబడి పెట్టాక సాయిని ప్రభాకర్, ముప్పాళ్ళ లక్ష్మణరావు విజయకుమార్‌తో కలిసి పనిచేయడానికి వీలులేదని ఇది పార్టీ నిర్ణయమని చెప్పారు. దాంతో నీవే నడుపుకొమ్మని విజయకుమార్‌కు చెప్పాను. అల్లం నారాయణ, చారి మొదలైన వారితో జీవగడ్డ పత్రికను విజయకుమార్ నడపడం

ప్రారంభించి చివరకు జీవగడ్డ విజయకుమార్‌గా ప్రసిద్ధి చెందాడు.

నా ప్రయత్నాన్ని పార్టీ అలా అడ్డుకోవడంతో ఏం చేయడం? ఇంతలో అరెస్టు జరిగింది. రెండు రోజులకు పైగా జ్యుడిషియల్ కస్టడీలో వుంటే ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేయాలని రూలు. దాంతో నేను 20 రోజులు జైల్లో ఉండి బయటకు వచ్చిన తరువాత తిరిగి ఉద్యోగంలోకి తీసుకోలేదు. ఉదయం దినపత్రికలో ఏబికె ప్రసాద్ ఈ విషయంపై సంపాదకీయం రాస్తూ ఈ రూల్‌ను ఎత్తివేసారని పేర్కొన్నాడు. నేను అధికారులతో ఆ విషయం చెబితే ఆ సర్కులర్ ఏదో తీసుకురమ్మన్నారు. అలాంటి సర్క్యులర్ వెలువడనే లేదు. సస్పెండ్ చేస్తే సగం జీతం వస్తుంది. అందుకని సస్పెండ్ చేస్తూ ఆర్డరైనా ఇమ్మని కలెక్టర్‌ను, సోషల్ వెల్ఫేర్ అధికారులను వార్డెన్ల సంఘం తరపున కోరాము. అలా సస్పెన్షన్ ఆర్డర్ ఇచ్చారు. ఇంతలో అనంతపురంలో 1984 జులైలో రాడికల్ యువజనసంఘం రాష్ట్ర మహాసభలు జరిగాయి. రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేయాలని మల్లోజుల కోటేశ్వరరావు, ఎమ్.లక్ష్మణరావు, సాయిని ప్రభాకర్, తదితరులు కోరారు. దాంతో అనంతపురంలో రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డిక్లేర్ చేశారు.

జైల్లోంచి 1984 ఫిబ్రవరి మూడవ వారంలో బయటకు వచ్చాక జాప లక్ష్మారెడ్డి, అడ్వకేట్ మల్లికార్జున్, పాపారావు, రాజేశ్వరరావు, తదితరులు ఇంటిదాకా వచ్చి, దిగబెట్టి శ్యామలకు రాముడు, కృష్ణుడు, వగైరా ఎందరో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని చాలా సేపు సముదాయించి, ఊరడించి వెళ్ళారు. తన తండ్రి కన్నా పెద్ద వయస్సులో వున్న జాప లక్ష్మారెడ్డివంటి వృద్ధులు కూడా ఇందులో తిరుగుతారా అని శ్యామల ఆశ్చర్య పోయింది.

జైలు నుండి వచ్చాక జగిత్యాలలో వుండడం వీలుకాలేదు. ఉంటే ఏదో ఒకనాడు ఆరెస్సెస్ బీజెపి, ఏబివిపి వాళ్లు చంపేసి రామన్న, గొప్పన్న హత్యలకు ప్రతీకారం తీర్చుకోడానికి సమయం కోసం చూస్తున్నారు. ఈ విషయం పార్టీలో తెలుసు. అందుకని జగిత్యాల వదిలేసి కొంతకాలం కరీంనగర్‌లో వుండమన్నారు. అలా గణేష్ పేరిట జగిత్యాల డిగ్రీ కాలేజి సమీపంలో ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేయబడ్డ హుస్నాబాద్‌కు చెందిన పులి రాములుతో కలిసి వుంటూ కరీంనగర్ జిల్లాలో విప్లవ యువజన రైతుకూలి కార్యకర్తలపై పెట్టిన పోలీసు కేసులకు బెయిల్ గురించి, షూరిటీల గురించి, పౌరహక్కుల సంఘం కార్యక్రమాల గురించి, పూర్తికాలం పనిచేయడం ప్రారంభించాను. బొంబాయి, కోల్‌కత్తాల నుండి వచ్చే జర్నలిస్టులకు, అలాగే ఇతర ప్రాంతాల నుండి వచ్చే పౌరహక్కుల సంఘాల వారికి ఉద్యమం సాగుతున్న తీరుపై వివరిస్తూ గ్రామాలకు

తీసుకెళ్లి చూపిస్తుండే వాన్ని. వరంగల్‌లో వరవరరావు ఎలాగో, కరీంనగర్ జిల్లాలో నేను అలా విప్లవ సాహిత్య, సామాజిక, రాజకీయ, ప్రజాసంఘాలకు, పార్టీకి సంబంధించిన విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తుండేవాడిని.

నక్సలైట్ అని ప్రభుత్వాన్ని కూల్చేయడానికి కుట్ర చేస్తున్నాడని అరెస్టు చేసి లాకప్‌లో పెట్టి చిత్రహింసలు పెట్టారు. ఏదో కేసు పెట్టి కరీంనగర్ జైలుకు పంపాక బెయిల్‌పై విడుదలయ్యాక జీవితం యధావిధిగా సాగుతుందనుకున్నాను.

బెయిల్‌పై బయటికి వచ్చాక జీవితం తారుమారు అయింది. నిర్బంధం రెండు వేపులా విరుచుకుపడింది. పోలీసులతో పాటు ఆరెసెస్, ఎబీవీపీ కార్యకర్తలు వారి నాయకులు హతులైన సందర్భంగా ప్రతీకారంగా ఎవరినో ఒకరిని బలి తీసుకోవాలని చూశారు. గోపీరాజన్న అడ్వకేటు హత్యకు గురయ్యాడు. మా పెద్ద కొడుకు పాణిగ్రాహి ఏడో తరగతి, నాలుగోవాడు అయిదు నెలల పిల్లవాడు, భార్య శ్యామల నలుగురు పిల్లల తల్లి. జీతం లేదు. ఇల్లు గడవదు. భార్యా పిల్లలను వదిలి, ఇల్లు విడిచి జనంలో పడ్డాను.

ఇది ఎంతోకాలం సాగలేదు. పార్టీ హైదరాబాద్‌కు మకాం మార్చమని చెప్పింది. దాంతో హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ డి హాస్టల్‌లో రూమ్ నెం.57 కేంద్రంగా రాడికల్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా కార్యక్రమాలను నిర్వహించాను. రాడికల్ విద్యార్థి సంఘం కార్యకర్తలుగా శాంతి సాగర్, తూర్పు మల్లారెడ్డి తదితరులు పనిచేస్తుండే వాళ్లు. క్రాంతి, రాడికల్ మార్చ్ పత్రికల ప్రింటింగ్, పంపిణి వ్యవహారాలను పట్టాభి చూస్తుండే వాళ్లు. అందరం కలిసి విద్యార్థి యువజన, విప్లవ రచయితల సంఘాల రకరకాల పనులను చూస్తుండే వాళ్లం. ఆ సమయంలో రైతుకూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రాఘవయ్య గౌడ్ కూడా మాతో కలిసి వుండేవాడు. అలా విప్లవ విద్యార్థి, యువజన, రైతుకూలి సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఒకేచోట కలిసి అనేక పనులను, సభలను, శిక్షణా తరగతులను నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాము.

1985లో నిర్బంధం మరింత పెరిగింది. భార్యా పిల్లలతో కలిసి విజయవాడలో వుంటూ పార్టీ పుస్తకాలు, పత్రికలు, ప్రింటింగ్ చూసుకుంటూ వుండమని పార్టీ సూచించింది. అయితే శ్యామల అందుకు అంగీకరించలేదు. నేను జగిత్యాలలో వుండే అవకాశం లేదు. పోలీసుల్తో, ఏబివిపి వాళ్లో ఏదో ఒక సమయంలో చంపేస్తారు అని ఎంత చెప్పినా ఆమె వినలేదు. దాంతో నేను హైదరాబాద్‌లోనే వుండిపోయాను. 1985 జూన్‌లో పార్టీ ఒక సందేశం పంపింది. అప్పటికే పార్టీలో సత్యమూర్తి,

మహారాష్ట్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ పార్టీ, కొండపల్లి సీతారామయ్యకు మధ్య విభేదాలతో తీవ్రమైన చర్చ సాగుతున్నది. 1977 నుండి 1985 కాలం గురించి పార్టీ... "ఇప్పటి దాకా చేసిందంతా విప్లవ ప్రచారమే తప్ప విప్లవం కాదు. ఇక నుండి విప్లవం చేయాలని పార్టీ నిర్ణయించింది. బహిరంగ జీవితంలోని సానుభూతిపరులు, మేధావులు జైళ్లలోకైనా వెళ్లాలి. లేదా పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా మారాలి." అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

కోర్టు కేసులకు అటెండ్ కాకపోవడం వల్ల సస్పెన్షన్ అలవెన్స్‌గా వచ్చే సగం జీతం ఆగిపోయింది. శాంక్షన్ చేసిన జీతం కూడా సంతకం పెట్టలేదని వాపసు చేశారు. నేను జగిత్యాలకు వెళ్లలేని స్థితి. పేదరికంలో కుటుంబం అనే ఇల్లు నిట్టాడు కోల్పోయి కూలిపోయింది. శ్యామల బీడీలు చేసుకుంటూ అన్నంలో నీళ్లు, ఉప్పు కలుపుకొని తింటూ పిల్లలు పాత చీరలు పక్క బట్టలుగా కప్పుకుంటూ ఎప్పుడు వస్తాడో తెలియని నా కోసం ఎదురుచూశారు. కుటుంబం లాగే ఇల్లు కూడా శిథిలమైంది. సగం కట్టిన ఇల్లు కూడా కొందరికి కంటగింపు అయింది. దొరలు గడీలు, పల్లెలు వదిలి పారిపోతుంటే నువ్వు ఇల్లు కట్టుకొని ఇంట్లో సుఖపడదామనుకున్నావా? ఎంత అమాయకుడివి నువ్వు అని ఎవరో అన్నట్టనిపించింది. ఆ యింట్లో ఉండటానికి వీలు లేదన్నారు. కూలగొట్టడానికి పలుగు పారలు తెచ్చారు. వాడకట్టువాళ్ళు ఎదురు తిరిగారు. కొన్నాళ్ళకు వాళ్ల భయానికి కొత్తిల్లు వదిలి పాత ఇంటికే చేరారు పిల్లలు. దొరల పాత గడీల్లా సగం పూర్తయిన మా కొత్తిల్లు పాడుపడిపోయింది...

అదే సమయంలో దేశవ్యాప్తంగా రాష్ట్రంలోని విప్లవోద్యమాల గురించి, ప్రజల చైతన్యం గురించి వాటిపై అమలవుతున్న నిర్బంధాల గురించి ప్రచారం చేసి ఆయా పార్టీల, సంస్థల, ప్రజల, ప్రజాస్వామిక వాదుల మద్దతు కూడగట్టాలని పార్టీ ఒక ప్రతిపాదన చేసింది. నేను, గద్దర్, వరవరరావు, సంజీవ్‌తో పాటు డోలకిస్ట్ రాజు కలిసి ఒక బృందంగా తయారయ్యాం. అందుకు సంబంధించిన కొన్ని పుస్తకాలను ఇంగ్లీషులో అచ్చువేసుకొని బయలుదేరాం. మొదట నాగ్‌పూర్ చేరాము. అక్కడ అనురాధ గాంధి ఇంట్లో బస చేశాము. నాగపూర్, వార్ధా, తదితర నగరాల్లో, పట్టణాల్లో అనేక సభలు, సమావేశాలు నిర్వహించాము. నాగ్‌పూర్‌లో బాబా ఆమ్టే ఆ సభల సందర్భంగా పరిచయమయ్యారు.

స్వామి అగ్నివేష్, సుమంత బెనర్జీ, దేవవ్రత పాండా, రాజ్‌కిషోర్ సింగ్, అహ్మదాబాద్ శుక్లా మొదలైన వారితో పాటు పౌరహక్కుల సంఘాల నేతలు, విప్లవ రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు ఎందరో ఎన్నో విషయాలను ప్రశ్నించారు,

చర్చించారు. ఈ క్రమంలో పై సమస్యలు విప్లవోద్యమం విజయవంతం అయ్యేదాకా ప్రజలతో కలిసి పని చేయడానికి ఎంతో అవకాశం ఉందనే అవగాహనకు రావడం జరిగింది.

అఖిల భారత పర్యటనలో స్వామిఅగ్నివేశ్, సుమంతా బెనర్జీ, శంకర్ గుహ నియోగి, కేరళ వేణు అతని సహచరులు, శిబ్దాస్ ఘోష్ అనుచరులు, వేసిన ప్రశ్నలు యింకా అలాగే ఉండిపోయాయి. "నేను, జార్జి ఫెర్నాండేజ్ కలిసి మీ ఉద్యమానికి మద్దతును సంపూర్ణంగా అందించాము. నిర్బంధాల గురించి గవర్నర్‌ను కలిశాము. కరీంనగర్ రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో మీ పాద ధూళిని నానొసట ధరిస్తాను అని ప్రకటించాను. మీరు కోరగానే నేను రెండుసార్లు ఏకపక్షంగా మీకు మద్దతు యిచ్చాను. ఇప్పుడు మీరు ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో మీకోసం, మీ ఉద్యమ ప్రచారంకోసం మీటింగులు ఏర్పాటు చేయండి అంటున్నారు. చేస్తాను. అయితే నా వెంటవున్న వెట్టి కార్మికుల విముక్తి సంఘటనకు మీరున్న ప్రాంతాల్లో వీలైనచోట్ల మీటింగులు పెట్టి మద్దతు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నారా? తేల్చుకొని రండి." అన్న స్వామి అగ్నివేష్ ప్రశ్న ఇరవై ఏళ్లయినా అలాగే వెంటాడుతోంది.

శంకర్‌గుహ నియోగి రాజ్‌నంద్‌గాంలో నిర్మించ తలపెట్టిన నూతన సమాజం, నూతన సంస్కృతి సోవియట్, కమ్యూన్‌లవలే తీర్చిదిద్దిన ఆదర్శ సామాజిక సంబంధాలు మానవీయ సంస్కృతి... "మీరు ఎలా నిర్మాణం చేస్తున్నారని"

మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల్లో శిబ్దాష్ ఘోష్ పార్టీవారు మా కోసం సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి వీడ్కోలు సమయంలో "కామ్రేడ్స్! మా నాయకత్వంలోఉన్న కార్మికుల కోసం మీరు కూడా మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. మా నాయకత్వంలో ఉన్న కార్మికులు పోలీసు కాల్పుల్లో చనిపోయినపుడైనా ఖండిస్తూ వారికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. కలకత్తాలో సిపిఎం ప్రభుత్వం మా కార్మికుల సమ్మెపై కాల్పులు జరిపి 12 మందిని చంపేసింది. ఆ సంఘటనను ఖండించి మద్దతు తెలుపుతారని ఆశిస్తున్నాము అని మనమంతా కలిసి పనిచేయాలని" కన్నీరు పెట్టుకున్నారు.

"నక్సల్‌బరి వెలుగులో" అనే గ్రంథం రాసిన సుమంతాబెనర్జి కలకత్తాలో అడిగిన ప్రశ్నలు పదే పదే గుర్తొస్తున్నాయి. "మీ దండకారణ్య ఉద్యమం గురించి నక్సల్‌బరి వెలుగులో పుస్తకానికి రెండవ భాగంగా రాయాలనుంది. ఈ ప్రశ్నలకు సమాచారం తీసుకురాగలిగితే ఆ పని చేస్తాను." ఆ ప్రశ్నలకు సమాచారం ఇప్పటికైనా ఉందా ? అని అనిపిస్తున్నది. అందువల్ల ఆ పుస్తకమే రాలేదు. రాయలేదు.

బతికున్న నక్సలైట్లలో అందరికన్నా కాస్త ముందుగా ఆలోచిస్తాడని పేరుబడిన నాయకుడు కేరళవేణు "అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాల్లో మనం చేసే విప్లవ ఉద్యమం అభివృద్ధిని అందుకోవడానికి కొంత ఉపయోగపడవచ్చు. కానీ అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పని చేయడానికి, అభివృద్ధి చెందడంలో పోటీపడి ముందుకు సాగడానికి ఉపయోగపడదు. అందువల్ల మనం ఇప్పటిదాకా ఆచరిస్తున్న పోరాటాలు ఒక దశకు చేరాక ఆగిపోతాయి. అప్పుడు ఏం చేయడం? మా ఉద్యమాలన్నీ ఇలాగే ఆగిపోయాయి. అందువల్ల ఆలోచనలో పడ్డాము. డంకెల్, గాట్ ఒప్పందాల తరువాత దేశం నయావలసగా మారిందని, నయావలస విధానాలకు వ్యతిరేకంగా జాతుల పోరాటాలు చేయడం అవసరమని భారతదేశం భారత సంయుక్త రాష్ట్రాల సమాఖ్యగా ఏర్పడాలని" అన్నారు. ఆ తర్వాత ఐదేళ్ళకు కొద్ది మార్పులతో కేరళవేణు చెప్పిన పద్ధతిలో ఉద్యమాలు నడవడం... ఆసక్తికరమైన విషయం.

అలా దేశ వ్యాప్తంగా తిరిగే క్రమంలో మధ్యలో వరవరరావు కోర్టు కేసులకు అటెండ్ కాకపోవడంతో అరెస్టు వారెంట్లు జారీ కావడం వల్ల కె.బాలగోపాల్, కన్నాభిరాన్, హరగోపాల్, హేమలత, కె.వి.ఆర్., కాకరాల, తదితరుల సూచనలతో జైలుకు వెళ్లాడు. జైలుకెళితే, సస్పెండ్ చేస్తారు, తద్వారా సగం జీతమైనా వస్తుంది, కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని చెప్పాడు వరవరరావు. ఆయన వాదన ఆయనది. నేను జైలుకు వెళ్లను అని స్పష్టం చేసి ఆయన లేకుండానే దేశ వ్యాప్త పర్యటనకు మిగతా వాళ్లం బయల్దేరి తిరిగాము. ఎన్నో అనుభవాలు...

ఆ తరువాత పార్టీలో కుల సమస్యపై చర్చ మరింత పెరిగింది. అప్పటికి కె.జి.సత్యమూర్తి, మహరాష్ట్ర మైదాన పార్టీ, కోబాడ్ గాంధి, అనూరాధా గాంధీ వేరయిపోయారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహరాష్ట్ర ఫారెస్ట్ కమిటి కొండపల్లి సీతారామయ్య వైపు ఉండిపోయాయి. విరసంలో కూడా ఈ విషయంపై సీనియర్లతో పార్టీ సుదీర్ఘంగా చర్చించింది. చాలామంది సత్యమూర్తి వైపే వున్నప్పటికీ కొండపల్లి సీతారామయ్య క్రమక్రమంగా వారందర్నీ తనవైపు తిప్పుకోగలిగారు. సత్యమూర్తి ప్రవర్తన కూడా అతనికి దూరం కావడానికి ప్రధాన కారణమని విరసం సీనియర్లు అభిప్రాయపడ్డారు.

'అఖిల భారత ప్రజాసమాచార, సాంస్కృతిక యాత్ర'ను ఏడు విప్లవ సంఘాల తరఫున నిర్వహించాక రహస్య నిర్మాణంలోకి వెళ్లాను. విజయవాడలో ఈ రెండు పంథాలకు సంబంధించిన పుస్తకాలను అచ్చు వేయించాను. జాతుల సమస్య, మూడు ప్రపంచాల సిద్ధాంతం, మిన్నంటుతున్న మన్యం గిరిజన పోరాటాలు, మార్క్సిస్టు అర్థశాస్త్రం మొదలైన అనేక పుస్తకాలను ప్రూఫ్‌రీడింగ్ చేస్తూ అచ్చు వేయిస్తుండే

వాడిని. ప్రూఫ్‌రీడింగ్ చేయడం వల్ల ఒకటికి పదిసార్లు చదివిందానికన్నా ఎక్కువ మనస్సులో ముద్రపడేది. అలా అధ్యయనానికి కూడా అది ఎంతో ఉపయోగపడింది. 'మిన్నంటుతున్న మన్యం గిరిజన పోరాటాలు' పుస్తకాన్ని కోస్తా ప్రాంత పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న అజ్ఞాత సూర్యుడు రాసి పంపించాడు. నేను అల్లూరి సీతారామరాజు గురించి ఒక వాక్యమైనా ఎందుకులేదని పార్టీకి లెటర్ రాశాను. చర్చించాను. అల్లూరి సీతారామరాజును మనం వ్యతిరేకిస్తున్నామా? అని ప్రశ్నించాను. పెద్ద పొరపాటు జరిగింది అని ఏం చేద్దామని అడగడంతో ముందుమాట రూపంలో అదంతా వివరంగా రాసి చేర్చితే సరిపోతుంది అని చెప్పాను. అలా ముందుమాట రూపంలో ఆ పుస్తకంలో అల్లూరి సీతారామరాజు, ఆనాటి పోరాటాలు చేరాయి.

అలాగే రాయలసీమ పార్టీ కార్యదర్శి రెడ్డప్ప నాయకత్వంలో రాయలసీమ తాగునీటి, సాగునీటి అవసరాల గురించి నిర్మించాల్సిన ప్రాజెక్టుల గురించి 'కన్నీటి కోన రాయలసీమ' పుస్తకాన్ని రూపొందించి ఎలా వుందని అడిగారు. మనకు రాజకీయ గతితర్కం తప్ప ప్రకృతి గతితర్కం, ప్రకృతి చలన సూత్రాలు అక్కరలేదా? అని ప్రశ్నించాను. అదేమిటి? అలా అంటే అర్థమేమిటని రాష్ట్ర కమిటి నాయకులు అడిగారు. రాయలసీమ అనేది ఒక రాజకీయ, భౌగోళిక దృక్పథం.

కానీ నది, నదీ ప్రవాహం అనేది ప్రకృతి, భౌగోళిక చలన సూత్రాలను అనుసరించి సాగుతుంది. మహబూబ్ నగర్ జిల్లాలో 170 కి.మీ. కృష్ణానది ప్రవహిస్తుంటే, అక్కడి ప్రజలు లక్షలాది మంది పాలమూర్ లేబర్‌గా తిండికి లేక దేశ వ్యాప్తంగా పొట్ట చేత పట్టుకొని వలసలు వెళుతుంటే మహబూబ్‌నగర్ ప్రజల భూముల సాగునీటి, తాగునీటి అవసరాల గురించి మాట్లాడకుండా రాయలసీమ వాళ్లు కోరుతున్నారని ఈ పుస్తకాన్ని ఉన్నదున్నట్టుగా అచ్చువేయడమేనా? తెలంగాణ వాళ్లుగా మనం మహబూబ్‌నగర్ ప్రయోజనాలను పట్టించుకోనక్కర్లేదా?

ప్రకృతి చలన సూత్రాలకు విరుద్ధంగా రాయలసీమ ప్రాజెక్టుల గురించి ప్రతిపాదించడం సరైనదేనా? రాయలసీమకు చెందిన సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీరాంరెడ్డి రాసిన పుస్తకంలో వున్నదంతా మన పుస్తకంలో యధాతథంగా దించారు. మనం కృష్ణానది నీళ్ల గురించి మహబూబ్‌నగర్ జిల్లా నీటి అవసరాల గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన అవసరం వుంది అని చెప్పాను. ఇప్పుడు ఏం చేయాలి?, రాయలసీమ కమిటి దీన్ని ఖచ్చితంగా పార్టీ డాక్యుమెంటుగా అచ్చువెయ్యాలన్నారు అని అన్నారు. దాంతో ముందుమాటగా మహబూబ్‌నగర్ జిల్లాకు రావలసిన కృష్ణానది నీటి గురించి వివరంగా రాసి చేర్చి అచ్చు వేస్తే సరిపోతుందని చెప్పాను. అలా అచ్చువేశాం. వై.యస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేపట్టిన ప్రాజెక్టులు

Dalithayugam-1

03-09-09

145

శ్రీరాంరెడ్డి ఇంజినీర్ 1983లో తన పుస్తకంలో ప్రతిపాదించినవే. వాటిలో పెద్దగా కొత్తదనం ఏమీ లేదు.

తూర్పుగోదావరి జిల్లాలో ఒక ఎన్‌కౌంటర్‌లో నలుగురు మరణించారు. అందులో ఒక కామ్రేడ్ శివరాజం అనే ఆయన విరసం సభ్యుడిగా వుండేవాడు. అతని స్మృతి కోసం ఒక పుస్తకం వెలువరించడానికి అజ్ఞాత సూర్యుడు పూనుకొని కొన్ని రచనలు పుస్తకంగా రూపొందించారు. ఇదేమి అన్యాయం అని ప్రశ్నించాను. భగత్‌సింగ్‌తో పాటు రాజగురు, సుఖదేవ్‌లు బాంబు విసిరిన సంఘటనలో కార్యకర్తలుగా పాల్గొన్నారు. ఉరి తీయబడ్డారు. భగత్‌సింగ్ నాయకుడు, వాళ్లు కార్యకర్తలు. అయినప్పటికీ దశాబ్దాల తరువాత కూడా భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు అని స్మరించుకుంటున్నాం. చనిపోయి ఏడాది కాలేదు. మిగతా ముగ్గురిని వదిలేసి ఒక్కరిమీద సంస్మరణ పుస్తకం తెస్తారా? ఇదేమి పెటిబూర్జువా, మిడిల్‌క్లాస్ మెంటాలిటీ? వాళ్లవి ప్రాణాలు కావా? అని తీవ్రంగా మందలించాను. దాంతో అజ్ఞాత సూర్యుడు నలుగురిపై ఒక పాట రాసి ఆ పుస్తకాన్ని వారికి అంకితం ఇచ్చారు. అయితే ఆ ఒక్కరి గురించి ఉషాయస్ దాని రాసిన ముందుమాటను నలుగురికనువుగా మార్చమని ఎంత చెప్పినా మార్చలేదు. ఆ ముందుమాట, ఆ కవితలు ఒక్కరిగురించే ఉన్నాయి. పుస్తకం అలా రూపొందింది. ఈ సందర్భంగా పార్టీలో పైస్థాయి నాయకుల పట్ల అట్టడుగు నుండి వచ్చి విప్లవంలో పనిచేస్తున్న వారి పట్ల వున్న వివక్షపై గట్టిగా చర్చించాను.

ఈ పుస్తకాల ప్రచురణను రాష్ట్ర కమిటి తరపున శ్రీనివాస్ చూస్తుండే వాడు. ఎన్.టి.రామారావు బీసీలకు రిజర్వేషన్లను 44 శాతం చేసినప్పుడు బీసీ వ్యతిరేక ఉద్యమాలు బాగా ముందుకు వచ్చాయి. ఆ సందర్భంగా పార్టీ తన నిర్ణయాన్ని, మద్దతును ప్రకటించాల్సిన సందర్భం. అది గుర్తు చేసి రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నేను రిజర్వేషన్లకు మద్దతుగా కరపత్రం రాసి, పత్రికా ప్రకటన ఇస్తానన్నాను. దాన్ని కోటేశ్వరరావు వ్యతిరేకిస్తూ చర్చించాడు. ప్రజా ఉద్యమాల వెంట మనం నడవాలని, ప్రజలు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని అందువల్ల వాళ్లకు ఎందుకు మద్దతు ఇవ్వకూడదని ప్రశ్నించి చివరకు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమించే వారికి మద్దతు ఇవ్వవచ్చు అని నా చేత కూడా అనిపించాడు. నా భావాలకు వ్యతిరేకమైన భావాన్ని తన లాజిక్ ద్వారా ఒప్పించిన ప్రహ్లాద్ కోటేశ్వరరావుపై చాలా కోపం వచ్చింది. ఆ తరువాత అందుకు విరుద్ధంగా పెంచిన బీసీ రిజర్వేషన్లను సమర్థిస్తూ రాడికల్ యువజన సంఘం తరపున కరపత్రం రూపొందించి ప్రింట్ కోసం నాకు పంపారు. ఆశ్చర్యపోయాను.

ఈ సంఘటన జీవితంలో ఒక మలుపు. అంతదాకా సిద్ధాంత చర్చలు పార్టీ

పై నాయకత్వం చూసుకుంటుంది మనకెందుకులే మనం ప్రజల కోసం, సమాజం కోసం పనిచేస్తూ వెళ్లాలి అని అనుకునే వాన్ని. ఎప్పుడైతే నాకు వ్యతిరేకమైన భావాన్ని నా చేత లాజికల్‌గా ఒప్పించాడో అప్పుడే సీరియస్‌గా ఒక నిర్ణయం తీసుకున్నాను. ఎంత గొప్పవాళ్లయినా సరే పార్టీలో ఎంత వున్నత స్థానంలో వున్నా సరే వారి మాటలను యథాతథంగా తీసుకోనక్కర్లేదు. సొంత మెదడుతో ఆలోచించి ముందుకు సాగాల్సిందే అని నిర్ణయించుకున్నాను. ఏదో పార్టీ హోల్‌టైమర్స్ కదా అని సొంత తెలివి ఉపయోగించకుండా వారిని గౌరవించడం చాలా పెద్ద పొరపాటు అని నా వివేచన శక్తిని పూర్తిగా తిరిగి ఉపయోగించడం ప్రారంభించాను. అప్పటికే రెండు పంథాల మధ్య సత్యమూర్తికి, కొండపల్లి సీతారామయ్యకు మధ్య భావజాల చర్చ సాగుతున్నది. కోస్తా ప్రాంతంలోని లీగల్ ప్రజాసంఘాల వారికి తెలిసిన విషయాలు పార్టీలో పూర్తి కాలం పనిచేసే వారికి కూడా ఎందుకు తెలియడం లేదని చాలా కాలం నుంచి బాధిస్తుండేవి. అంతకుముందే పార్టీకి, దాని అవగాహనకు ఉన్న పరిమితులు తెలిసినవే. దాంతో ఇక వెనుదిరిగి చూడలేదు.

అధ్యయనంలో ముందుకు సాగుతునే వున్నాను. లెనిన్ వైరుధ్యంలో రెండు అంశాలుంటాయని చెపుతూ...

1. గణితంలో ప్లస్ - మైనస్
2. విద్యుత్తులో రుణ విద్యుత్తు-ధన విద్యుత్తు, ఎలక్ట్రాన్-ప్రోటాన్
3. రసాయనిక శాస్త్రంలో సంయోగం- విచ్ఛిత్తి
4. ప్రకృతిలో ఐక్యతా-ఘర్షణ అని చెపుతూ
5. సామాజిక రంగంలో వర్గపోరాటం...

వుంటుందని చెప్పారు.

దీన్ని మావో కూడా యథాతథంగా పేర్కొన్నాడు. సామాజిక రంగంలో రెండవ అంశం ఏమిటి? అని ప్రశ్నించాను. పార్టీలో రాష్ట్ర కమిటీ నుండి మొదలుకొని కేంద్రకమిటి కార్యదర్శి కొండపల్లి సీతారామయ్యదాకా ఎవరూ జవాబు ఇవ్వలేకపోయారు. 'అరుణతార' మాసపత్రికలో కలం పేరుతో 'ఆలోచన-ఆచరణల మధ్య వైరుధ్యం' అనే వ్యాసం 1988లో రాశాను. దానిపై విరసం, పార్టీ నాయకులు ఏడాదిన్నర పాటు తీవ్రంగా చర్చించారు.

సామాజిక రంగంలో రెండు అంశాలు ఏమిటి? ప్రతిదాంట్లో రెండు అంశాలున్నప్పుడు లెనిన్, మావోలు సామాజిక రంగంలో రెండవ అంశాన్ని ఎందుకు

వదిలేశారు? అని ప్రశ్నించుకున్నాను. ఐక్యత, ఘర్షణ సూత్రాన్ని వర్తింప చేస్తే సామాజిక రంగంలో వర్గాల మధ్య ఐక్యత– వర్గాల మధ్య ఘర్షణ, పోరాటం అవుతుంది. ఇదే విషయం పార్టీ నాయకులకు వివరించాను. సామాజిక వర్గాల మధ్య ఐక్యత అంటే సమ్మె చేసిన తరువాత ఒప్పందం కుదుర్చుకొని కలిసి పనిచేస్తూ పాలకవర్గాల ప్రయోజనాలను తిరిగి నెరవేర్చే క్రమమే. అందులో పోరాడే, బేరం చేసే శక్తిననుసరించి కార్మికవర్గాల ప్రయోజనాలు సిద్ధిస్తుంటాయి అని చెప్పాను. లెనిన్, మావోలు చెప్పలేదు కనుక వాళ్లు అంగీకరించలేదు.

అలాగే త్రిపురనేని మధుసూదనరావు గతితార్కిక సాహిత్య భౌతికవాదం, 'అవయవి అవయవ' సిద్ధాంత చర్చను ముందుకు తెచ్చాడు. అది 1980 తిరుపతి విరసం సభల్లో ప్రసంగం వ్యాసంగా మొదలై 1986లో పార్టీ సీరియస్‌గా చర్చించే రహస్య డాక్యుమెంట్‌గా విస్తరించింది. దీన్ని కూడా నేనే ప్రూఫ్‌రీడింగ్ చేసి అచ్చు వేశాను. దాంతో ఆ చర్చల్లో పాల్గొన్న వారికన్నా ఎక్కువ విషయాలు అర్థమయ్యాయి. కొండపల్లి సీతారామయ్య పార్టీ తరపున త్రిపురనేని మధుసూదనరావును వ్యతిరేకిస్తూ రాసిన వ్యాసాలన్నీ దూదిలా తేలిపోతున్నాయని కొండపల్లి సీతారామయ్యతో చెప్పాను. దాంతో మరో వ్యాసం రాసి పుస్తకంలో చేర్చమన్నాడు. అది కూడా టిఎమ్ఎస్ ప్రతిపాదనలోని మౌలికాంశాలను పూర్వపక్షం చేయలేక పోయిందని చెప్పాను. దాంతో కొండపల్లి సీతారామయ్యకు నేనంటే భయం పట్టుకుంది.

నేను సిద్ధాంత చర్చను చర్చ కోసమే అంటూ చర్చించే వాడిని కాదు. నా పని నేను చేసుకుంటూ చర్చించే వాడిని. త్రిపురనేని మధుసూదనరావు పర్టిక్యులర్–యూనివర్సల్ మధ్య అనగా సమాజానికి మిగతా ప్రజా శ్రేణులకు మధ్య 'అవయవి–అవయవ' పద్ధతిలో నిరంతరం సంబంధం వుంటుందని ఏదీ విడిగా ఉండదని ప్రతిపాదించాడు. సమాజాన్ని ఒక శరీరంతో పోల్చి ఆయా సెక్షన్లు సమస్యలు, పరిష్కారాలు అన్నీ శరీర అవయవాల అని చెప్పాడు. అలంకార శాస్త్రాల్లో, రస, ధ్వని సిద్ధాంతాల్లో అంగిరసం, అంగరసాలు అని చర్చించారు. అంగి అంటే శరీరం, సుందరాంగి అంటే సుందరమైన శరీరం కలది. అంగాలు శరీర భాగాలు. కావ్యంలో ప్రధాన రసాన్ని అంగిరసమని, మిగతా రసాలను అంగరసాలని వర్ణించారు. ఈ అంగి, అంగ పదాలను త్రిపురనేని మధుసూదనరావు అవయవి, అవయవ అని మార్చాడు.

మొత్తం పర్టిక్యులర్స్ → యూనివర్సల్ సంబంధం నుండే సమగ్ర, సామాజిక వికాసం, సమగ్ర సామాజిక విప్లవం, సమాజంలోని అన్ని సమస్యలను, వర్గాలను సామాజిక అభివృద్ధికనువుగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగడం అనే దృక్పథం

విస్తరించింది. ఇది పార్ట్, హోల్ గురించిన చర్చ కూడా. ఒక సమగ్రతలో సమాజాన్ని పరిశీలించడం కూడా. వస్తువు తనలో తాను, తన కొరకు తాను వుంటుంది అని పాశ్చాత్య తత్వశాస్త్రాలు చర్చించాయి. బీయింగ్ ఫర్ అదర్స్ అనేది వుండదు అని జీన్‌పాల్ సాత్రే దాకా అభిప్రాయపడుతూ వచ్చారు. అదే కోవలో లెనిన్, మావోలు క్లాస్ ఇన్ ఇట్‌సెల్ఫ్, క్లాస్ ఫర్ ఇట్‌సెల్ఫ్ అనేవి రెండు మాత్రమే వుంటాయని, క్లాస్ ఫర్ అదర్స్ అనేది ఉండదని బల్లగుద్ది చెప్పారు. అయితే బానిస వ్యవస్థలో బానిసలు క్లాస్ ఫర్ అదర్స్‌గా జీవించారు. ఫ్యూడల్ వ్యవస్థలో అర్ధ బానిసలు, క్లాస్‌ఫర్ అదర్స్‌గా జీవించారు. జోగినీ, దేవదాసీ తదితరులు, బౌద్ధ భిక్షువులు, సన్యాసులు మొదలైన వారు క్లాస్ ఫర్ అదర్స్‌గా ఇతరుల కోసం జీవించారు. పరోపకారం కోసం జీవించే వారిని, సమాజం జీవించే వారిని క్లాస్ ఫర్ అదర్స్ అని చెప్పవచ్చు. పాశ్చాత్య తత్వశాస్త్రాల్లో పరోపకారానికి సంబంధించిన అంశం విస్తారంగా లేకపోవడం వల్ల క్లాస్ ఫర్ అదర్స్ అనేది వుండదని లెనిన్, మావోలు భావించారు. ఉద్యమకారులు, పరోపకారులు క్లాస్ ఫర్ అదర్స్‌గా జీవితాలను త్యాగం చేస్తున్న వాళ్లు. పాలకవర్గాలు పాలిత వర్గాలను, బానిసలను, అర్ధబానిసలను క్లాస్ ఫర్ అజ్‌గా మార్చుకుంటాయి. ప్రయోజనాలు నెరవేర్చుకుంటాయి. అలాగే థింగ్ ఫర్ అజ్‌గా ప్రకృతిని మనం మార్చుకుంటాము. ప్రకృతిని మనకనువుగా థింగ్ ఫర్ అజ్‌గా ఎలా మార్చుకుంటున్నామో ఏంగెల్స్ విస్తారంగా చర్చించాడు.

ఇలా పర్టిక్యులర్–యూనివర్సల్, పార్ట్–హోల్, క్లాస్ ఫర్ ఇట్‌సెల్ఫ్–క్లాస్ ఫర్ అదర్స్, థింగ్ ఫర్ ఇట్‌సెల్ఫ్–థింగ్ ఫర్ అజ్ పరస్పరం సంబంధాల్లో కొనసాగుతుంటాయి. వస్తువులోని ఐక్యత, ఘర్షణలో ఘర్షణ పెరిగిన తరువాత ఆ వస్తువు స్వరూప స్వభావాలు మారతాయి. అప్పుడు ఆ వస్తువుగా ఉండదు. అందులోని ఐక్యత, ఘర్షణ రెండూ మారతాయి. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులు, పెట్టుబడి దారులు అనే రెండు వర్గాల మధ్య ఐక్యత, ఘర్షణలో కార్మిక వర్గం గెలిచి విప్లవం విజయవంతమయ్యాక కార్మికవర్గ పార్టీ కూడా అదృశ్యం అవ్వాలి. పెట్టుబడి దారులు అదృశ్యమై కార్మికవర్గం ఒక్కటే ఎలా మిగులుతుంది? ఒక వస్తువులోని ఐక్యత, ఘర్షణల్లో ఘర్షణ ఆధిక్యతలోకి వచ్చాక ఆ వస్తువు స్వరూప, స్వభావాలు ఆ కొత్త వస్తువులోని ఐక్యత, ఘర్షణ తిరిగి కొత్త స్వరూప, స్వభావాల్లో కొత్త కేటగిరీల్లో వుంటుంది. అనగా కార్మికవర్గ పార్టీ విప్లవం విజయవంతం కావడంతోటే రద్దయిపోవాలి. కానీ దాన్ని కొనసాగిస్తూ కార్మికవర్గ నియంతృత్వం వుంటుందని కొనసాగుతుందని చెప్పడం వైరుధ్యం సూత్రంలో, గతితర్కం సూత్రంలో వున్న మౌలికాంశాలకు వ్యతిరేకమైనది.

అలాగే శ్రమశక్తి నుండి పుట్టే అదనపు విలువ అంతా కేవలం కార్మికుడికి సంబంధించినది కాదు. అది మొత్తం సమాజానికి సంబంధించినది. ప్రకృతి వనరులకు సంబంధించినది. అది కార్మికుడి అవసరాలకు పోను మిగిలినదంతా సమాజానికి చెందవలసినదే. అందువల్ల కార్మికవర్గ నియంతృత్వం అనే భావననే వుత్పన్నం కాదని ఇంతకు ముందు చూశాం.

అవయవి-అవయవ సిద్ధాంతం విషయంలో త్రిపురనేని మధుసూదనరావు చూపు అధ్యయనంతో కూడుకున్నది. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్‌లతో పాటు, సోవియట్ గ్రంథాలు పార్ట్సు-హోల్ పేరిట ఇలాగే చర్చించాయి. ఆ విషయం కొండపల్లి సీతారామయ్యతో సహా పార్టీలో ఎవరికీ అర్థం కాలేదు. పార్టీ నాయకులు నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిజం, క్యాపిటల్ పెట్టుబడిదారీ విధానం, అదనపు విలువ దోపిడి, శ్రమశక్తి విలువ, కమ్యూనిస్టు మ్యానిఫెస్టో, కుటుంబం వ్యక్తిగత ఆస్తి, రాజ్యం, పుట్టుక ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, సోవియట్ యూనియన్ చరిత్ర మొదలైన రాజకీయ ఉద్యమ చైతన్యానికి సంబంధించిన గ్రంథాలు, సిద్ధాంతాలు ఎక్కువ చదివారు. మార్క్సిజంలోని చలన సూత్రాలను, తత్వశాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయలేదు. చేసిన వాళ్లు వామపక్ష పార్టీల్లో చాలా తక్కువ. సీనియర్లు మాత్రమే కొంతమంది చదివారు. అర్థం చేసుకున్నారు.

నా అధ్యయనంలో త్రిపురనేని మధుసూదనరావు కావాలని ఒక పెద్ద మోసం చేశాడని అర్థమైంది. సులభంగా అంగీకరించే విషయాలను సొంత కవిత్వం కొంత జోడించి కొత్త పదాలతో ఏదో కొత్తగా చెబుతున్నట్టుగా సిద్ధాంతాలను గుప్పిస్తున్నట్టుగా చెప్పి ఎటు తీసుకుపోతున్నాడో పార్టీ నాయకులను అని భయభ్రాంతులను చేశాడు, కన్‌ఫ్యూజ్ చేశాడు. హోల్-పార్ట్, పర్టిక్యులర్-యూనివర్సల్ చర్చను మహోపాధ్యాయులు ఎలా చేశారో దాన్నంతా క్రోడీకరించి ఇలా మనం మన ఆలోచనను, ఆచరణను అన్ని రంగాల్లో సమగ్రం చేసుకోవాలి అని చెప్పి వుండాల్సింది.

అందుకు గతితార్కిక భౌతికవాదం, గతితార్కిక చారిత్రక భౌతికవాదం వలెనే గతితార్కిక సాహిత్య భౌతికవాదం కూడా అవసరం అవుతుంది. అది మరేమిటో కాదు. మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని, కళలను అర్థం చేసుకొనే, విశ్లేషించే, నిర్దేశించే మార్క్సిస్టు అలంకార శాస్త్రంగా ఉంటుంది. అంతే తప్ప కొత్తది కాదు. పేరు మాత్రమే కొత్తది అని చెప్పి వుంటే అందరూ అంగీకరించి వుండేవాళ్లు. త్రిపురనేని మధుసూదనరావు చేసిన ప్రతిపాదనల్లో ఇంతకు మించిన సిద్ధాంతాలేవీ లేవు. ఆ విషయం నా కర్థమైంది. పార్టీ నాయకులు, విరసం నాయకులు మార్క్సిస్టు తత్వశాస్త్రాలను, అలంకార శాస్త్రాలను, సోవియట్ యూనియన్ ప్రచురించిన దీనికి సంబంధించిన గ్రంథాలను చదవకపోవడం వల్ల త్రిపురనేని మధుసూదనరావు ఏదో కొత్తగా చెబుతున్నాడని, తప్పు దారి పట్టిస్తున్నాడని తాడును చూసి పాము అని భయపడిపోయారు.

త్రిపురనేని మధుసూదనరావు సులభంగా అర్థమయ్యే దాన్ని కుప్పుస్వామి అయ్యర్ 'మేడ్ డిఫికల్ట్', అర్థం కాకుండా చెప్పగలిగినప్పుడు సులభంగా చెప్పడం దేనికి అనుకుని ఆయన సిద్ధాంతాన్ని ఎవరికి అర్థం కాని బ్రహ్మ పదార్థం చేశాడు. ప్లేటో, అరిస్టాటిల్, పర్టిక్యులర్, యూనివర్సల్ పేరిట చేసిన చర్చను, పార్ట్-హోల్ చర్చను, మరికొన్ని కేటగిరీలను కాస్త మార్చి అవయవి-అవయవ సిద్ధాంతంగా ముందుకు తెచ్చాడు. పర్టిక్యులర్-యూనివర్సల్ చర్చను న్యాయవైశేషిక దర్శనాలు విస్తారంగా చేసాయి. రెండున్నర వేల యేళ్లుగా ఇండివిడ్యువల్, పర్టిక్యులర్, యూనివర్సల్ మధ్య గ్రీకు ఫిలాసఫీలోను, బౌద్ధ ఫిలాసఫీలోను, బ్రాహ్మణ ఫిలాసఫీలోను, ప్రతితరం కొత్తకొత్తగా మళ్లీమళ్లీ చర్చిస్తూనే వస్తున్నదని స్పష్టమైంది.

బౌద్ధులు ఒక దశలో పర్టిక్యులరే ముఖ్యమని స్పష్టం చేశారు. ప్లేటో యూనివర్సల్ ముఖ్యమన్నారు. అరిస్టాటిల్ పర్టిక్యులరే ముఖ్యమన్నారు. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావోలు పర్టిక్యులర్‌ను కాకుండా యూనివర్సల్‌నే ముఖ్యమన్నారు. యూనివర్సల్‌ని ముఖ్యమని చెప్పడం భావవాదమని, అరిస్టాటిల్ తన గురువైన ప్లేటోను ఎప్పుడో ఖండించి నిర్ధారించారు.

ప్రధాన వైరుధ్యం ఏది? అనే చర్చ పర్టిక్యులర్ యూనివర్సల్ అనే తాత్విక సిద్ధాంతాల నుండి సామాజిక రంగానికి అన్వయించిన సూత్రమే అనే విషయం స్పష్టమయింది. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావోలు యూనివర్సల్ ప్రధానం, ప్రధాన వైరుధ్యమే ప్రధానం అనడం భావవాదమే తప్ప భౌతికవాదం కాదు, అధి భౌతికవాదం అవుతుందనే విషయం స్పష్టమైపోయింది. రాజకీయాల్లో ప్రధాన వైరుధ్యం చర్చ చాలా ముఖ్యమైనది. అది రాజకీయ కార్యక్రమాలను, వ్యూహం, ఎత్తుగడలను, ఉద్యమ స్వరూప స్వభావాలను నిర్ణయించుకోవడంలో మౌలికమైనది.

అందువల్ల వామపక్ష రాజకీయ పార్టీలన్నీ ప్రధాన వైరుధ్యం గురించి తీవ్రంగా పరస్పరం సంఘర్షిస్తూ విభేదిస్తు తమ ప్రత్యేక అస్తిత్వానికి పోరాట రూపాలకు సైద్ధాంతిక ప్రతిపత్తిని ఇచ్చే ప్రయత్నం చేస్తుంటారు. ప్రధాన వైరుధ్యం అనే మాట రాజకీయ పార్టీలకు అంత ముఖ్యమైనది. అయితే అది మౌలికంగా తత్వశాస్త్రానికి సంబంధించిన చర్చ. తత్వశాస్త్రంలో రాజకీయ పార్టీలు ఈ చర్చను చేయవు. చేయలేదు. రాజకీయ అవసరాలకు పరిమితమై ప్రధాన వైరుధ్యం చర్చను కొనసాగిస్తుంటారు. ఇలా

Dalithayugam-1
03-09-09
147

చర్చించడానికి తత్వశాస్త్రంలో ఎక్కడో లోపం జరిగింది. ఆ లోపాన్ని ఆసరా చేసుకొని రాజకీయ రంగంలో చర్చిస్తున్నారు. ఆ లోపమెక్కడ అని అన్వేషణ సాగించాను.

ఆ క్రమంలో లెనిన్ సామాజిక రంగంలో రెండు అంశాలుంటాయంటూ రెండో అంశాన్ని ఎందుకు వదిలేశాడో అన్వేషిస్తూ ముందుకు సాగాను. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని కాకుండా మార్క్సిస్టు రాజకీయ, సామాజిక దృక్పథాన్ని ప్రధానం చేసుకొని దాన్నే తత్వశాస్త్రంగా ముందుకు తేవాలని ఆయన తత్వశాస్త్రం యొక్క ఆసరాను తీసుకున్నాడు. అలా సామాజిక రంగంలో వర్గపోరాటం అనే పదాన్ని ఒక్కదాన్నే చెప్పి 'వర్గాల మధ్య ఐక్యత' రెండవదాన్ని వదిలివేశాడు.

అలా లెనిన్ మార్క్సిస్టు సిద్ధాంతాలను తమ దేశంలో స్వాతంత్ర్యాన్ని సాధించడానికి తమ దేశ జాతీయోద్యమానికి ఉపకరిస్తుందని స్వీకరించి దానికనువుగా తన రాజకీయ ఉద్యమాల అవసరాన్ని అనుసరించి మార్క్సిజంలో అనేక సవరణలు ప్రవేశ పెట్టాడని... దాన్నే లెనినిజం అని పిలుస్తున్నారని తెలిపోయింది. ఓహో! ఇలా తమ దేశాల స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ లెనిన్, మావోలు మార్క్సిజం పేరిట తమవైన సవరణలు ప్రతిపాదించి జాతీయ విప్లవాలను, స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నారని అర్థం చేసుకున్నాను. అవి మార్క్సిజం చెప్పిన సోషలిస్టు విప్లవాలు కావని, సైద్ధాంతికంగా అర్థమైంది.

అయితే ఈ మాటను పార్టీలో వుండి చర్చించడం ఎలా సాధ్యం? పైగా లెనినిజం, మావో ఆలోచనా విధానం సరైనదని, ఆ మార్గంలో విప్లవం చేయాలని భావించి పనిచేస్తున్న క్రమంలో ఇంత సీరియస్ చర్చ పార్టీ ఎలా స్వీకరిస్తుంది? ఎలా భరిస్తుంది? అందువల్ల కేవలం తాత్విక చర్చకు పరిమితమై చర్చించడం అవసరమని భావించి అయిదు వందల పేజీల డాక్యుమెంట్లను పార్టీకి పంపించాను. మాకు అర్థం కాలేదన్నారు. పార్టీలో కనీసం జిల్లా కమిటీ దాకా చర్చకు పెట్టమని కోరాను. మాకే అర్థం కానప్పుడు కమిటీలలో వివరణలు అడిగితే మేం చెప్పడం ఎలా సాధ్యం? మేము మీ వాదాలను ఖండించే స్థాయికి చేరలేదు కనుక వాటిని కిందిదాకా చర్చకు తీసుకెళ్ళడం సాధ్యం కాదు అని అన్నారు. సరే అని వదిలేశాను.

పోరాట రూపాల పట్ల, కార్యక్రమాల పట్ల, ప్రజలందరినీ సమీకరించే పద్ధతిలో ఉద్యమాల్లో అందరు పాల్గొనే పద్ధతిలో ఉండాలని చర్చించాను. దీనికి జవాబుగా మీలో వుండే లీగలిజం కారణమని అన్నారు.

"సారాంశాలు" నవల

1982లో బతుకుపోరు నవల రాశాక రెండేళ్లకు 1984లో "సారాంశాలు" అనే నవల రాశాను. "వ్యవసాయ విప్లవం" అనే పీపుల్స్ వార్ పార్టీ సైద్ధాంతిక గ్రంథాన్ని, కార్యక్రమాన్ని ప్రజల్లో ఆచరణలోకి తీసుకెళుతున్న తీరును ఆ నవలలో చిత్రించాను.

పోచంపాడు (శ్రీరామ్‌సాగర్) ప్రాజెక్టు కెనాల్స్‌తో కరీంనగర్ జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, పెద్దపల్లి, ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం అందించ బడింది. దాంతో పనికిరాని భూములు, బంజరు భూములు కూడా పంట భూములుగా మార్చుకునే అవకాశం వచ్చింది. భూముల విలువ పెరిగింది. దాంతో ప్రజల్లో భూమిపట్ల మునుపెన్నడూ లేని ఆసక్తి పెరిగింది. పూర్వం శిస్తు కట్టలేక భూములను వదిలేసుకునే వాళ్లు. దొరలు, భూస్వాములు, బ్రాహ్మణులు, కోమట్లు, పట్వారీలు, పోలీసు పటేళ్లు, బాకీల కింద, దండగల కింద, రకరకాల పంచాయితీల పేరిట ప్రజల భూములను ఆక్రమించారు. నీటి సౌకర్యాలు పెరగడంతో అవన్నీ తిరిగి వెనక్కి తీసుకుంటే బాగుంటుందని ప్రజలు భావించారు. అలా భూమి పట్ల పెరిగిన ఆసక్తిని భూదాహం అంటారు.

పోచంపాడు ప్రాజెక్టు వల్ల ప్రజల్లో భూదాహం పెరిగింది. సమాజంలో కదలిక మొదలైంది. సంఘ సంస్కరణల ఆవశ్యకత ముందుకు వచ్చింది. వర్గాల పొందికలో సంఘర్షణ మొదలైంది. స్వాతంత్ర్యం వచ్చాక 1960 దశకం నుండి గ్రామీణ స్వరాజ్యం, స్వపరిపాలనలో భాగంగా ప్రజలకు అంది వచ్చిన వయోజన ఓటు హక్కు ద్వారా తమ గ్రామ సర్పంచ్‌లను, మెంబర్లను ఎన్నుకొనే స్వేచ్ఛ వచ్చింది. దాంతో బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో చైతన్యం పెరిగింది. ఎక్కడికక్కడ ఒక్కటై మైనార్టీగా కొద్ది కుటుంబాలుగా వున్న వెలమ, రెడ్డి, బ్రాహ్మణ కులాల, దొరల, భూస్వాముల, పోలీసు పటేల్, పట్వారీల పెత్తనాన్ని ఎదిరిస్తూ తమ ప్రతినిధులను, ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించుకున్నారు. దొరలపై సాంఘిక బహిష్కరణ విధించారు. దొరలు అవమాన భారంతో ఊళ్లు వదిలి పారిపోయారు. ఎక్కడో మళ్లీ భూములు కొనుక్కొని, తాలూకా, జిల్లా, రాజధాని కేంద్రాల్లో కాంట్రాక్టర్లుగా, వ్యాపారులుగా, పారిశ్రామిక వేత్తలుగా, బస్సు ఓనర్లుగా, సినిమా టాకీసు ఓనర్లుగా, ఆయా కంపెనీల ఉత్పత్తుల మార్కెట్‌దారులుగా తమకు వీలైన రంగాల్లోకి ప్రవేశించారు.

గ్రామాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల నుండి చిన్న కాంట్రాక్టర్లు, వ్యాపారులు, ఎదుగుతూ వచ్చారు. రాజకీయంగా చైతన్యమవుతూ శాసనసభ్యులను ఎన్నుకోవడంతో తమ చైతన్యాన్ని, ఓటు హక్కును ఉపయోగించుకునే దశకు ఎదిగారు. అలా మెట్‌పెల్లి, బుగ్గారం, జగిత్యాల, కరీంనగర్ శాసనసభ, పార్లమెంటు నియోజకవర్గాల్లో 1952

నుండి బీసీలు, ఎస్సీలు పోటీచేస్తూ గెలుస్తూ వస్తున్నారు. గ్రామాల్లో సాగే ఈ శాంతియుత పరివర్తనకు సిపిఐ, సోషలిస్టు పార్టీలు కొంతమేరకు సహకరించాయి. కాంగ్రెస్‌లో పార్టీ టిక్కెట్లను అగ్రకుల భూస్వామ్య వర్గాలు పైరవీ చేసి తెచ్చుకుంటే బీసీ, ఎస్సీలు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేశారు. క్రమంగా పార్టీలు బలపడుతూ రావడంతో ఇండిపెండెంట్‌లు గెలవడం కష్టమైంది. దాంతో పంచాయితీ సమితి ఎన్నికల వరకే బీసీ, ఎస్సీలు నిర్ణయాత్మక శక్తిగా పరిమితం కావాల్సి వచ్చింది. రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పుతూ వెలమ, రెడ్డి, బ్రాహ్మణ కులాల భూస్వాములు, దొరలు, ధనిక రైతులు మొదలైన వాళ్లు రాజకీయాల్లో, తద్వారా కాంట్రాక్టు రంగంలో, ఉద్యోగ రంగంలో సింహ భాగం ఆక్రమించారు. వందల వేల కోట్ల ఆస్తులను సంపాదించారు. పారిశ్రామిక, రాజకీయ, వ్యాపార, సామాజిక రంగాల్లో ఎదిగి వాటిని శాసించే నిర్ణయాత్మక స్థాయికి విస్తరించారు.

శాంతియుతంగా ఈ పోరాటాలు సాగుతుండగా అకస్మాత్తుగా విప్లవ రాజకీయాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించాయి. దున్నే వాడికే భూమి అనే నినాదంతో గ్రామాలకు తరలండి కార్యక్రమంతో ప్రసంగాలు, పాటలతో ఆకర్షించడంతో వారు పెట్టే సభలకు ప్రజలు తండోపతండాలుగా హాజరయ్యారు. అదే జగిత్యాల జైత్ర యాత్ర. పెద్దపెల్లి, మంథని, సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, మెట్‌పల్లి, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల్లో కూడా ఇలాంటి బహిరంగ సభలు విజయవంతమయ్యాయి. తమ భూములు తమకు ఇప్పిస్తారని పోచంపాడు కెనాల్ నీళ్లతో భూములు సాగుయోగ్యం చేసుకోవచ్చని, భూస్వాముల బంజరు భూములను గుంజుకొని తమకు కేటాయిస్తారని ప్రజలు భావించారు.

ఇలా పోచంపాడు ప్రాజెక్టు నీళ్ల వల్ల వ్యవసాయంపై ఆధారపడే కులాల వాళ్లు ఆశలు పెంచుకున్నారు. ఉద్యమంలో ముందుకు వచ్చారు. వాళ్లు ప్రధానంగా ఎస్సీలు, కొంతమంది బీసీలు. అయితే రాజకీయ ఆధిపత్య పోరు కోసం దొరల, భూస్వాముల, పోలీస్ పటేల్, పట్వారీల ఆధిపత్యం స్థానంలో తమ ఆధిపత్యం పెంచుకోవచ్చనే సెక్షన్లు ముఖ్యంగా ధనిక రైతాంగ స్థాయికి చెందిన రెండవ శ్రేణి పాలకవర్గాలు, దోపిడీ కులాలు వెలమ, రెడ్డి, బ్రాహ్మణ, తదితర కులాల నుండి నాయకత్వంగా ముందుకు వచ్చారు. ఉద్యమాల్లో వారే ముందు చేరారు. వారిని చూసి ఎస్సీ, బీసీలు కొంత వెనుకంజ వేసినప్పటికీ తమ డిమాండ్ల కోసం, భూస్వామ్య పెత్తనం వదిలించుకోవడం కోసం ఉద్యమంలో క్రమక్రమంగా చేరవచ్చారు. వారు వచ్చే క్రమంలో తొలుత వచ్చిన ధనిక రైతాంగ సెక్షన్ నాయకత్వంతో యుద్ధం మొదలైంది. భూస్వాములను వెళ్లగొట్టి తామే చెలాయించాలనుకోవడం వల్ల ఉద్యమం అంతదాకా

కలుపుకుంటూ, కలిసి పనిచేసినప్పటికీ వారిని ఎండగడుతూ వచ్చింది. అలా భౌతిక దాడులకు కూడా గురి అయ్యారు. గ్రామంలోని స్థిరంగా కొనసాగుతున్న ఆధిపత్య వర్గం, కులం దాన్ని కూలదోసి తాను ఎదగాలనుకున్న ఆధిపత్య వర్గం, కులం రెండూ ఉద్యమ రెండవ దశలో విప్లవ వ్యతిరేకంగా మారుతూ వచ్చాయి. గ్రామాల్లో ఈ రెండు సెక్షన్ల కన్నా తక్కువ స్థాయిలో వుంటూ గ్రామీణ మధ్యతరగతి, వ్యవసాయ కులాలు, భూమిలేని ఎస్సీలు, రైతుకూలీలు, ఆధునిక అభివృద్ధిలో చైతన్యం అందుకున్న విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామీణ మొదటి, రెండవ శ్రేణి ఆధిపత్య వర్గాలకు, కులాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి వచ్చింది. వీరందరూ ఒక్కటిగా ఉండడానికి ఉద్యమంలో బలమైన నినాదాలు లేవు. దున్నే వాడికే భూమి అనేది ప్రధానంగా ఎస్సీలకు పరిమితమైన ప్రయోజనంగా ఉండేది. చేతివృత్తి కులాలకు, ఆధునిక విద్య అందుకొని అన్ని రంగాల్లో ఎదగాలనుకునే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, అగ్రకులాల్లోని మధ్య తరగతికి, పేదలకు ఉద్యమంలో భౌతిక ప్రయోజనాలు ఉండే కార్యక్రమాలు ఏవీ లేవు. అందువల్ల రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యాన్ని వదిలించుకున్నాక ఉద్యమం వెంట కలిసి నడిచే కార్యక్రమాలు, ఆవశ్యకత లేకుండా పోయాయి. దాంతో గ్రామంలోని వెయ్యి మందిలో ఎనిమిది వందల మందిని ఆకర్షించిన ఉద్యమం రెండవ దశలో రెండొందల మందికి పరిమితమైన కార్యక్రమాలుగా మారిపోయాయి. మరోవైపు భూస్వాములు, దొరలు, పట్వారీలు, బ్రాహ్మణులు, వెలమలు, రెడ్లు, సమాజంతో పాటు మారాలనుకుంటూ ఆలోచించారు. రోజులు గడుస్తున్న కొద్దీ యూనివర్సిటీ స్థాయి విద్యను అందుకున్న ఈ వర్గాలు, కులాల వాళ్లు ఆధునికంగా ఆలోచిస్తూ, ఆధునిక అభివృద్ధిలో ముందుకు సాగాలని అనుకున్నారు. ఇలాంటి వారికి ఉద్యమం ఎలాంటి కార్యక్రమాలను, మద్దతును ఇవ్వలేకపోయింది.

అయితే "వ్యవసాయ విప్లవం" పుస్తకంలో గ్రామాలను చైతన్యవంతం చేసి విముక్తం చేస్తూ పట్టణాలకు విస్తరించాలని, సామ్రాజ్యవాద దేశాలతో కలిసి సాగుతున్న దళారీ బూర్జువాలకు వ్యతిరేకంగా దేశభక్త జాతీయ బూర్జువాలతో ఐక్యసంఘటన కట్టి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని, అలా విజయవంత మవుతుందని విశ్లేషించారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ఉద్యమ బాధితులు, వారి సంతానం, వారసులు, తమకు తాము జాతీయ బూర్జువాగా ఎదగాలనుకున్నప్పుడు ఉద్యమంలో కార్యక్రమాలు లేవు. నిరంతరం గ్రామీణ ఆధిపత్య వర్గాలను, కులాలను అనుమానంతో పోలీసు ఏజెంట్లుగా పనిచేస్తున్నారని చూసేవారు. కొంతమంది ఇళ్లల్లో ఉద్యమకారులు షెల్టర్లు

తీసుకొన్నప్పటికీ వారి కోసం భవిష్యత్ మార్గదర్శనం చేయలేకపోయారు.

రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యాక ఈ విషయాలపై తీవ్రంగా ఆలోచిస్తూ ఇలాంటి వారికి కొన్ని కార్యక్రమాలు ఇవ్వాలని భావించాను. నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో చెరుకు రైతులకు గిట్టుబాటు ధర కావాలని పెట్టిన బహిరంగ సభను పోలీసులు విచ్ఛిన్నం చేశారు. అక్కడి దాకా వెళ్ళి పోలీసులకు దొరక్కుండా నేను వెనుదిరిగాను. ఇలా ధనిక రైతాంగం కోసం, గ్రామీణ, పట్టణ, జాతీయ బూర్జువాల కోసం అనేక కార్యక్రమాలను తీసుకోవడం అవసరం అనుకున్నాను. సారా పోరాటం ఉధృతంగా సాగుతుంటే దానిపై నిర్బంధాలు పెరిగాయి. ఎందుకు పెరిగాయంటే, ఉద్యమం వెంట ప్రజలు లేరు. కొద్దిమంది మాత్రమే కలిసి వస్తున్నారు. మిలిటెంట్లపై ఆధారపడే దశకు ఉద్యమం విస్తరణ కోల్పోయింది, ఆకర్షణ కోల్పోయింది. దాంతో పార్టీ దళాలు, మిలిటెంట్లు మాత్రమే సారా పోరాటాన్ని నడిపించారు. సారా అమ్మకాలను బంద్ పెట్టారు. సారా కాంట్రాక్టర్లంతా గ్రామీణ, పట్టణ ఆధిపత్య కులాల నుండి వచ్చిన వాళ్లే. వాళ్లు తమకున్న పలుకుబడితో, లంచాలతో రాజకీయ, పోలీసు యంత్రాంగాలతో నిర్బంధాలను తీవ్రం చేశారు. పోలీసులు గ్రామీణ మహిళలను, సామూహిక మానభంగాలకు గురి చేశారు. ప్రతిఘటన లేకుండా పోయింది. ఉద్యమం వెంట మెజార్టీ ప్రజలు లేకపోవడం వల్ల ఇలా జరిగింది.

ఈ నేపథ్యంలో నేను "సారాంశాలు" అనే నవలను రాశాను. ఒక వెలమ భూస్వామి దొరకు నలుగురు కొడుకులు. విప్లవోద్యమంతో దొర కరీంనగర్ సెంటర్‌కు పారిపోతాడు. పెద్దకొడుకు సుధాకర్‌రావు దొర కరీంనగర్‌లో వుంటూ కాంట్రాక్టులు చేస్తుంటాడు. రెండవ కొడుకు విజయరామారావు అగ్రికల్చర్ బి.ఎస్సీ చేసి గ్రామంలో వ్యవసాయం చేయాలనుకుంటాడు. మూడవ కొడుకు ఈ ఉద్యమాలతో, నిర్బంధాలతో ఎవరు పెట్టుకుంటారని బ్యాంకు పరీక్షలు రాసి జాతీయ బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకొని దూరంగా ఉంటాడు. నాల్గవవాడు రాష్ట్రంలో లా కాలేజీలో సీటు రాకపోతే మహరాష్ట్రలోని నాందేడ్‌లో లా చేస్తుంటాడు. పెళ్లి చేసుకొని అత్తగారి తరఫు నుండే బంధుత్వం కొనసాగిస్తుంటారు. సొంత వూరికి రాడు. కానీ ఈ ముగ్గురు ఏడాదికోసారి గ్రామానికి వచ్చి రెండో ఆయన పండించిన పంట నుంచి తమ వాటాని తీసుకుపోతుంటారు.

వారికి 150 ఎకరాల భూమి ఉండేది. కొంత భూమి పోచంపాడు కెనాల్ కింద పోతుంది. కొంతభూమి రైతు కూలీ సంఘాల వాళ్లు ఆక్రమించి దున్నుకుంటారు. చివరకు 50 ఎకరాలు మిగులుతుంది. నలుగురికి తలా పంద్రెండు ఎకరాలు వస్తుంది. అందరి భూమిని రెండవ వాడైన విజయరామారావు సాగు చేస్తుంటాడు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ట్రాక్టర్‌తో వ్యవసాయం చేయిస్తుంటాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా 1982లో బొంబాయిలో దత్తా సామంత్ నాయకత్వంలో ఏడాదిన్నర పాటు సాగిన బట్టల మిల్లు కార్మికుల సమ్మెతో పనికోల్పోయి పల్లెటూరుకు చేరిన కార్మికుడు పనిచేస్తుంటాడు. అతడు ట్రాక్టర్ రిపేర్ చేస్తూ ఈ ట్రాక్టర్ మనదిరా, దొర ఏందిరా అని పాట పాడుతుంటారు. ఆ పాట వినవస్తున్నప్పటికీ అక్కడికి పోలేక సైకిల్ మోటార్ హారన్ ఇచ్చి అది విననట్టు నటిస్తుంటాడు. అతని వద్ద పనిచేసే కూలీలు, పాలేర్లు విప్లవకారులతో సన్నిహిత సంబంధాలు వుంటూ ఉద్యమాలు నడిపిస్తుంటారు. విజయ రామారావు వాటిని వ్యతిరేకించడు. సమర్థించినట్టుగా కూడా కనపడడు. తటస్థంగా వుంటాడు. విజయరామారావు హైదరాబాద్ రాజేంద్రనగర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నప్పుడు విప్లవ విద్యార్థి సంఘాలతో, పౌర హక్కుల సంఘాలతో కలిసి తిరిగిన వాడు. దాని భావజాలం, లక్ష్యం తెలిసినవాడు. అందువల్ల గ్రామాల్లో ఉద్యమానికి వ్యతిరేకంగా ఎట్టి పరిస్థితుల్లోను ఉండకూడదని నిర్ణయించుకుంటాడు. కానీ గ్రామంలోని మిలిటెంట్లు ఎప్పుడూ అతన్ని అనుమానిస్తూ అతనికి వ్యతిరేకంగా పోస్టర్లు వేస్తుంటారు.

సారా పోరాటం సాగుతుంది. గ్రామీణ, రాడికల్ యువజన సంఘం యువకులు, రైతు కూలి సంఘం నాయకులు, మహిళలు కలిసి సారాకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటారు. ఇలా నవల సాగుతూ వుంటే ఇంతమంది ఉద్యమంలో పాల్గొని పోలీసులను, కాంట్రాక్టర్లను నిలదీస్తే నిర్బంధం ఎలా వుంటుంది? వుండే అవకాశం లేదు అని ఆయా పాత్రల చిత్రీకరణతో సమస్య ముందుకు వచ్చింది. సారా పోరాటం గురించి రాసిన ఈ నవలలోని మూడు ప్రసంగాలను, చర్చలను కలిపి అరుణతార మాసపత్రికలో 'ఇల్లు' (సుత్తికొడవలి, అక్కాచెల్లెల్లు అయినవేళ) పేరిట కథగా రాశాను. 'తేనెటీగలు' కథల సంపుటిలో చేర్చాను. అయితే పార్టీ రాష్ట్ర కమిటీతో ఆ రెండవ కొడుకుకు ఏం కార్యక్రమం ఇస్తున్నాము? ప్రజలు నిజంగా సారా పోరాటంలో పాల్గొంటున్నారా? కేవలం పార్టీ ఫండు కోసం పార్టీ దళాలే సారా ఉద్యమాన్ని నడిపిస్తున్నాయా? జాతీయ బూర్జువాల కోసం మనం ఇచ్చే కార్యక్రమం ఏమిటి? ఆ రెండవ కొడుకు విజయరామారావు ఏం చేయాలి? అని ప్రశ్నించాను. సార్, మీరు నవల రాసి ఏం చేయాలో మమ్ములను అడిగితే ఎలా అని అన్నారు. నవల సరే... ముందు ఆ పాత్రకు కార్యక్రమం చెప్పండి అతడు విప్లవంలో కలిసి రావాలను కుంటున్నాడు. అతడు నగరంలో వున్నప్పుడు విప్లవోద్యమాలతో కలిసి పనిచేసిన వాడే అని అడిగితే వారి దగ్గర జవాబు లేదు. మీ మేధావులతో మేము వాదించుకుంటూ

వుండలేం సార్... అంటూ వదిలేశారు.

ఢిల్లీ నుండి రీసెర్చ్ పనిపై వచ్చి హైదరాబాద్‌లో కొంతకాలం వున్న ఢిల్లీ పౌర హక్కుల సంఘం నాయకుడు, విరసం సభ్యుడు సి.వి. సుబ్బారావు, ఐ.సి.ఎస్.ఆర్.లో ఉస్మానియా యూనివర్సిటీ గ్రంథాలయంలో కనిపిస్తుండే వాడు. ఆయనతో పాటు హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ కలిసారు. నా నవల గురించి చర్చించాను. సి.వి.సుబ్బారావు మీరు రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వున్నారు. మీరే నాకు జవాబు చెప్పాలి. విప్లవాన్ని ఎలా నడిపిస్తున్నారో మాకే మీరు అర్థం చేయించాలి అని అన్నాడు. నీవు రాడికల్ విద్యార్థి సంఘం తొలి అధ్యక్షుడివి. నీవెలా జనానికి చెప్పావో అది చెప్పు అని అన్నాను. అలా చర్చించుకున్నాక అసలు విషయం చెప్పాడు. నేను ఏడేళ్లుగా ఇదే విషయంపై ఆలోచిస్తున్నాను. ఈశాన్య రాష్ట్రాల ప్రజల సమస్య ప్రత్యేకమైనదని అధ్యయనం చేసి పుస్తకం వెలువరించాను. 'వ్యవసాయ విప్లవం' పుస్తకంలో రైతు కూలీల గురించి, భూమి లేని పేదల గురించి తప్ప మరెవరికి ఏ కార్యక్రమం లేదు. జాతీయ బూర్జువాలకుగాని, మధ్య తరగతి ప్రజలకు గాని ఎలాంటి కార్యక్రమాలు లేవు. భూమిలేని వారి కోసం చేసే ఉద్యమాలకు మద్దతుగా నిలబడడం తప్ప వేరే కార్యక్రమం ఏం లేదు అని చర్చల తర్వాత ఇద్దరం కలిసి ఏకాభిప్రాయానికి వచ్చాం.

సి.వి. సుబ్బారావు (సురా) జాతుల సమస్య విషయంలో పీపుల్స్ వార్ పార్టీకి అవగాహన లేదని స్వయంగా 'దగా పడ్డ ఏడుగురు అక్క చెల్లెల్లు' పేరిట ఈశాన్య రాష్ట్రాల ఉద్యమాల గురించి, జాతుల పోరాటాలుగా వాటిని గుర్తించాల్సిన కోణాల గురించి సురా పుస్తకం తెచ్చాడు. వ్యాసాలు రాసాడు. మధ్యతరగతి రైతులకు, ధనిక రైతులకు, మధ్యతరగతికి, జాతీయ బూర్జువాలకు, ప్రాంతీయ బూర్జువాలకు, స్త్రీలకు, బీసీలకు విప్లవోద్యమంలో కలిసి రాగలిగే ఆర్థిక, రాజకీయ సామాజిక కార్యక్రమాలు వ్యూహం, ఎత్తుగడలు లేవని అర్థం కాసాగింది. నా 'సారాంశాలు' నవలలోని పాత్రల చిత్రీకరణ ద్వారా అది స్పష్టంగా, ప్రధానమైన సమస్యగా ముందుకు వచ్చింది. నా నవల ముగింపు లేకుండా ఆగిపోయింది.

సరే, మనమైనా కార్యక్రమాలను గురించి అధ్యయనం చేసి రూపొందించడం అవసరమని సురా, నేను, వకులాభరణం రామకృష్ణ, తదితరులం చర్చించాము. అయితే దేశ వ్యాప్తంగా వామపక్షాల్లో, నక్సలైట్లలో, మార్క్సిస్టు మేధావి వర్గాల్లో వైవిధ్య పూరితమైన అంచనాలు, విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ఏదైనా సరే రాజకీయ పార్టీ తన కార్యక్రమంగా స్వీకరిస్తేనే వాటికి విలువ, ఆచరణలో భాగమవుతాయి. అంతదాకా చర్చల మీద చర్చలు సాగుతునే వుంటాయి. అలా జాతుల సమస్య,

పితృస్వామిక సమస్య, ఫెమినిజం సమస్య, భాషా సమస్య, మైనార్టీ సమస్య, ప్రాంతీయ అసమానతల సమస్య, మధ్యతరగతి సమస్య, జాతీయ బూర్జువాల సమస్య, కుల సమస్య, కులవృత్తుల సమస్య, ఆధునిక అభివృద్ధిని అందరికి అందించడం సమస్య మొదలైనవి ఏ కార్యక్రమాలు లేకుండా మిగిలిపోతున్నాయి.

ఈ సందర్భంగా వకుళాభరణం రామకృష్ణ తన పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథంలో ప్రతిపాదించింది కరీంనగర్‌లో కూడా నిజమైంది అని అన్నాడు. ఆయన తన సిద్ధాంత గ్రంథంలో కోస్తా ప్రాంతంలో సర్‌ఆర్థర్ కాటన్ కట్టించిన నీటిప్రాజెక్టుల వల్ల, భూమి సాగులోకి రావడంతో సంఘ సంస్కరణలు మొదలయ్యాయని, నీటి పారుదల సౌకర్యాలకు, సంఘ సంస్కరణలకు, సామాజిక మార్పులకు, పరిణామాలకు సంబంధం ఉందని పేర్కొన్నాడు. నేను కూడా నా 'సారాంశాలు' నవలలో పోచంపాడు కెనాల్స్ రావడం వల్లనే భూదాహం పెరిగి విప్లవోద్యమాల వాళ్లు భూమి ఇప్పిస్తానంటే వెంట కదిలి వచ్చిన తీరు గురించి రాశాను. దాంతో వి.రామకృష్ణ తెలంగాణ లోని ఇతర ప్రాంతాల్లో పేదరికం వున్నప్పటికీ ఎంత వెనుకబడినప్పటికీ విప్లవోద్యమాలు విస్తరించక పోవడానికి కారణం సాగునీటి సౌకర్యాలు పెరగకపోవడమే. ఎమర్జెన్సీ కన్నా ముందు మెదక్ జిల్లాలో ప్రారంభించిన ఉద్యమం ఆగిపోవడానికి, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో ఉద్యమం వేళ్లూనుకోకపోవడానికి సాగునీటి సౌకర్యాలు పెరగకపోవడమే ప్రధాన కారణం. కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్ ప్రాంతాల్లో నూతనంగా సాగునీటి ప్రాజెక్టులు రానందున అక్కడి చంద్రపుల్లారెడ్డి గ్రూపు ఉద్యమం తక్కువ స్థాయిలో నడుస్తున్నది. ఇలా ప్రాజెక్టులకు నీటి పారుదల సౌకర్యాలకు, సంఘ సంస్కరణలకు, ఉద్యమాలకు మధ్య సంబంధం ఉంది. పదేళ్ల ముందే ఎందుకు ఉద్యమం రాలేదో, అప్పుడే ఎందుకు ప్రజలు కదలబారారో అనడానికి నీటి పారుదల సౌకర్యాలు పెరిగి, భూమి విలువ పెరిగి భూమి సాగు యోగ్యం కావడమే ప్రధానం అని విశ్లేషించాము. నేను ఏ సిద్ధాంతాల జోలికి పోకుండా నా చుట్టూతా వున్న జగిత్యాల ప్రాంతంలోని పరిణామాలను, నేను చూసినవి నవలలో చిత్రించడం ద్వారానే ఇన్ని విషయాలు వెలికి వచ్చాయి అని ఆశ్చర్యం వేసింది. ఆనందం కలిగింది. నా పరిశీలనా శక్తికి వారు ఆశ్చర్య పోయారు. పార్టీ నాయకులు, ఉద్యమ నాయకులు మీ కన్నా ఎక్కువగా ఆ ప్రాంతంలో తిరుగుతారు. వారికెందుకు ఈ విశ్లేషణ అందలేదు అని అడిగారు.

ఇలా 'సారాంశాలు' నవలలో అనేక అంశాలు, సన్నివేశాలు, సంఘటనలు, సమస్యలు, పాత్రలు చిత్రించాను. చివరకు ఆయా సమస్యలకు, పాత్రలకు పరిష్కారం కోసం అన్వేషించాను. అందుకు పౌరహక్కుల సంఘం మిత్రుడు ఒక పరిశోధన

చేస్తుంటాడు. అది ఏడేళ్ల విప్లవోద్యమం – సమాజంలో వచ్చిన మార్పులు, మానవ సంబంధాల్లో వచ్చిన పరిణామాలు అనే అంశంపై పరిశోధన చేస్తుంటాడు. అందుకు తన మిత్రుడైన రెండవ కొడుకు విజయరామారావు ఇంటికి వస్తాడు. కొద్ది రోజులు ఉండి కొన్ని గ్రామాల్లో విషయ సేకరణ చేస్తుంటాడు. సాయంత్రానికి వచ్చి పడుకొంటాడు. రాత్రుళ్లు అడవుల్లోకి షికారుకి వెళుతుంటారు.

విజయరామారావు పౌరహక్కుల లెక్చరర్‌తో తన సమస్యను చర్చిస్తాడు. నేను ఎవరికి కాని వాన్ని అయ్యాను. మిగతా దొరల్లాగా నేను గ్రామం మీద పెత్తనం చేయలేను. నా స్వభావం అది కాదు. అందుకని పోలీసులు, మా బంధుమిత్రులు నన్ను పనికి రాని వాడని, విప్లవ కారులకు రహస్యంగా సాయం చేస్తూ, షెల్టర్ ఇస్తున్నాడని తమ గుట్టుమట్లు చెబుతున్నాడని అపనమ్మకంతో చూస్తుంటారు. సహాయ నిరాకరణ చేస్తుంటారు. ఇటు చూస్తే ఉద్యమ కారులు నన్ను పోలీసులకు, మా బంధుమిత్రులకు ఎప్పటికప్పుడు విషయాలు చేరవేస్తూ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడని పోస్టర్లు వేస్తుంటారు. రకరకాల నష్టాలకు, కష్టాలకు గురి చేస్తున్నారు.

నేను అగ్రికల్చర్ బి.ఎస్సీ చేసి పొరపాటు చేశానా అనిపిస్తున్నది. ఇంత భూమి ఉండి ఉద్యోగం చేయడం ఎందుకని ఆధునిక వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేస్తూ ఈ ప్రాంతానికి అనేక విషయాలు నేర్పుదామని వ్యవసాయంలో దిగబడితే ఇందులో లాభమేమి కనబడ్డం లేదు. మా అన్నదమ్ములు ఏడాదికోసారి తమ పాలు అని ధాన్యం పట్టుకుపోతారు. ఎవ్వరూ ఎరువులకు గాని, గ్రామ కమిటీలు వసూలు చేసే విరాళాలు గాని, చందాలుగాని ఇవ్వరు. ఏ విషయంలో వాళ్లు ఒక్క పైసా కూడా పంపరు. ఇప్పుడు బ్యాంకులో పని చేసే పెద్ద తమ్ముడు హైదరాబాద్‌లో ఇల్లు కొంటున్నానని ఒక ఐదు లక్షలు సర్దమని తరువాత ఇస్తానని ఉత్తరం రాశాడు. అంటే ఏమిటి? ఇన్నాళ్లు తన భూమిలో పండించిన దానికిగాను ఐదు లక్షలు అడుగుతున్నాడన్నమాట! వ్యవసాయంలో నేను ఏం బావుకున్నాను?

మా అన్న కరీంనగర్‌లో వుండి కాంట్రాక్టులు చేస్తూ యాభై కోట్లకు ఎదిగాడు. చెల్లె పెళ్లి చెయ్యాలంటే ఎవరూ ముందుకు రారు. నువ్వే పూనుకో అంటారు. అంటే అర్థం ఏమటి? వున్న ఆస్తి అంతా నేను అనుభవిస్తున్నానని ఆ పెళ్లి ఖర్చులు అన్నీ నువ్వే భరించాలని వారి ఉద్దేశ్యం. ఎవరి సంపాదన వాళ్లు సంపాదించుకుంటున్నారు. ఈ భూమిలో, పంటలో వాటా కూడా కావాలంటున్నారు. ఈ ఊళ్లో ఏం చేయాలి? జగిత్యాలకు పోయినా, కరీంనగర్‌కు పోయినా అక్కడ మాత్రం నక్సలైట్లు లేరా! పైగా ఊరు విడిచిపోతే వర్గ శత్రువుగానే భావిస్తారు. ఏం చేయాలి? అని ప్రశ్నిస్తాడు.

ఇటు చూడబోతే పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలుండవు. కూలీలకు,

Dalithayugam-1
03-09-09
152

పాలేర్లకు అన్నలు చెప్పినంత కూలీలు, జీతాలు పెంచి ఇవ్వడం వల్ల ఆ ఖర్చు కూడా పెరిగింది. నాలాంటి వాళ్లకు ఊరు విడిచి వెళ్లిపోవడం, వ్యవసాయం వదిలేసి ఇతర వృత్తులు, వ్యాపారాలు వెతుక్కోవడం తప్ప వేరే మార్గమేమి లేదా! విప్లవాన్ని నేను వ్యతిరేకించడం లేదు. వీలైన మేరకు సహకరిస్తాను. అయినా నా బతుకు ఇలా ఎందుకు అయింది? అసలు పార్టీ ఏమనుకుంటున్నది? నీవేమనుకుంటున్నావు? నన్ను ఏం చేయమంటావు? అని ప్రశ్నిస్తాడు.

ఆ పౌరహక్కుల లెక్చరర్ నవ్వుతాడు. నాకిదే పనా అని ఎదురు ప్రశ్నిస్తాడు. కాని ఒకరోజు ఆయన రాసుకుంటూ రాసుకుంటూ కరెంటు పోవడంతో టేబుల్‌పై తలపెట్టి అలాగే నిద్రపోతాడు. అర్థరాత్రి ఎప్పుడో కరెంటు వస్తుంది. ఫ్యాను గాలికి అతడు రాస్తున్న కాగితాలు గాలికి కొట్టుకుపోతాయి. వాటన్నిటినీ మడత పెడతాడు. అందులో తన పేరు, తన సమస్యల గురించి కూడా ప్రశ్నలు, పరిశీలనలు దృష్టికి రావడంతో ఆసక్తిగా చదువుతాడు. అక్కడితో నవల రాసి ఆగిపోయాను. ఆ తరువాత ఏం రాయాలో పరిష్కారాలు తోచలేదు. నాకు తెలిసిన కొందరు వెలమ దొర మిత్రులు, తెలిసిన వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి విప్లవోద్యమంలో వాళ్ల స్థానమేమిటి? బతుకేమిటి? అని వారందరి ప్రతినిధి పాత్రగా విజయరామారావు పాత్రను మలిచాను.

ఆ పాత్ర గ్రామం సరిహద్దులు దాటితే జాతీయ బూర్జువాగా మారవలసిందే తప్ప వేరే మార్గం లేదు. వ్యవసాయదారుడుగా గ్రామంలో ఉండాలంటే పోలీసులు, నక్సలైట్ల మధ్య ఎలా జీవించాలి? ఊరు విడిచి వస్తే జాతీయ బూర్జువాగా అతడు ఎదగడానికి కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి వంటి పార్టీలు సహకరిస్తాయి. అప్పుడు అతని రాజకీయ అనుబంధం ఆ పార్టీలతోనే వుండాల్సి వుంటుంది. అయినప్పుడు విప్లవ ఉద్యమాలకు జాతీయ బూర్జువా మిత్రులు ఎక్కడ వుంటారు? ఎలా వుంటారు? ఎదిగే ప్రతి జాతీయ బూర్జువా విప్లవ వ్యతిరేకంగా, పాలకవర్గ పార్లమెంటరీ పార్టీల్లోనే ఉండిపోవాల్సి వస్తుంది. తద్వారా విప్లవోద్యమాలపై అనివార్యంగా నిర్బంధాలను పెంచుతూ పోతారు. ఈ సమస్యకు అంతెక్కడ, పరిష్కారమెక్కడ?

ఇలా నిర్బంధం యొక్క మూలాలు గ్రామీణ సామాజిక వర్గాల కదలిక ద్వారా సంఘర్షణకు గురవుతున్న వర్గాలు, కులాలు, ఆధిపత్యాలు, మొదలైన వాటిలో ఎలా వున్నాయో చిత్రించాను. ఈ నవలను చదివి దీన్ని సరిచేయాలి, ఆయా పాత్రలు ఎలా ప్రవర్తించాలో, ఏమేం కార్యక్రమాలు తీసుకోవాలో చెప్పాలని పార్టీ వారిని అడిగాను. వాళ్లు నవల మీరు రాసి పరిష్కారాలను మమ్మల్ని అడిగితే ఎలా? అని అన్నారే తప్ప వారికి ఈ సమస్యలేవీ లోతుగా అర్థమైనట్టు లేదు. అందువల్లే ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ పార్టీతో కలిసి మావోయిస్టు

పార్టీగా ఏర్పడ్డం సాధ్య పడింది. ఎమ్‌సిసికి ఇలాంటి ఆలోచన లేదు. గ్రామీణ ప్రజలను, ఆదివాసీ ప్రజలను కదిలించడం గుంపులు, గుంపులుగా కదిలి భూస్వాములపై పోలీసు బృందాలపై, క్యాంపులపై దాడులు చేయడం, చంపడం, చావడం, దళాల్లోకి చేరడం తప్ప మధ్య తరగతిని ఎదిగించే కార్యక్రమం గాని, జాతీయ బూర్జువా ఐక్యసంఘటన దృక్పథంగాని లేదు. బెంగాల్, యుపి, బీహార్ రాష్ట్రాల్లో ఎమ్‌సిసి ప్రాబల్య ప్రాంతాలను, గ్రామాలను అనేకం చూశాను. ఉద్యమ కారులతో చర్చించాను. వాళ్లు విప్లవ విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, విప్లవ రచయితల సంఘాలు మొదలైన ప్రజా సంఘాలు అంత పెద్ద ఎత్తున ప్రాధాన్యతతో కొనసాగించడం పనికిమాలిన పని అని భావించారు. దానివల్ల పెటీబూర్జువాలు తయారవుతారు తప్ప కార్మికవర్గ దృక్పథంతో డిక్లాస్ అయ్యే వాళ్లు రారు అని వారి నిశ్చితాభిప్రాయం. అందువల్ల వాళ్లు తొలి దశలో ఆంధ్రప్రదేశ్ ఉద్యమాలను చూసి విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ఉద్యోగ, రచయితల సంఘాలను నిర్మించినప్పటికీ వాటిని కుదించారు. కేవలం తమకు సహకరించే వారిగా పరిమితం చేశారు.

‘వ్యవసాయ విప్లవం’ పుస్తకంలో రాసిన అవగాహన నుండి మావోయిస్టు పార్టీ అవగాహన చాలాదూరం వెళ్లిపోయింది.

సరే, అది అలా వుంచుదాం. 1984–86లో విప్లవ పార్టీల్లో కుల సమస్య, జాతుల సమస్య, ఫెమినిజం సమస్య సీరియస్‌గా ముందుకు వచ్చింది. నిధుల దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, ఆరు చెడులు మొదలైనవి చర్చకు వచ్చాయి. అయినప్పటికీ జాతుల సమస్యకు కార్యక్రమాలు రూపొందించలేకపోయారు. దండకారుణ్య గెరిల్లా జోన్, విముక్తి ప్రాంతం అనే చర్చలు చేశారు. నేను గిరిజనులు ఆధునిక అభివృద్ధిలో వాటా కోరతారని వాళ్లు ఆధునిక అభివృద్ధిని అందుకోవాలని అందువల్ల అందులోంచి ఒక మధ్యతరగతి, ఒక జాతీయ బూర్జువా పెట్టుబడిదారీ వర్గం ఎదుగుతుందని, ఎదగాల్సి వుంటుందని అలా ఎదిగే క్రమంలో దండకారణ్యం, విముక్తి ప్రాంతం అనే దాని స్థానంలో గోండ్వానా రాష్ట్రం ఏర్పాటు చేయాలనే ఉద్యమం ముందుకు వస్తుందని చెప్పాను. ఈ విషయాన్ని అరుణతార మాసపత్రికలో 1987లో రాసిన ‘ఊబి’ కథలో స్పష్టం చేశాను.

అయితే గోండుల నుండి, గిరిజనుల నుండి జాతీయ బూర్జువా వర్గం, పెట్టుబడిదారీ, పారిశ్రామిక వర్గం ఎదగలేదు. విప్లవోద్యమం, అగ్రకులాలు, పాలక వర్గాలు, పార్లమెంటరీ పార్టీలు, కాంగ్రెస్, టిడిపి, బిజెపి, సిపిఐ, తదితరులు ఎవరూ వారిని ఎదగనీయలేదు. దాంతో గోండ్వానా రాష్ట్ర ఉద్యమం నినాదంగా ముందుకు

వచ్చి మొలకదశలోనే నిలిచిపోయింది. ఛత్తీస్‌ఘడ్‌లో శంకర్‌గుహ నియోగి నాయకత్వంలో సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఆయన చనిపోయిన తరువాత కూడా ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. పీపుల్స్ వార్ పార్టీ ఇలాంటి పోరాటాలకు సిద్ధంగా లేదు. అందువల్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి 1980ల్లో నాయకత్వం వహించి ముందుకు రాలేకపోయింది.

‘సారాంశాలు’ నవలలో రాడికల్ యువజన సంఘం తరఫున పదిమంది, రైతు కూలి సంఘం తరఫున పది మంది, మహిళలు ఇరవైమంది ముందుకు వస్తే సారా పోరాటాలపై నిర్బంధాలు ఇలా వుండే అవకాశమే లేదు. బలవంతంగా ఎవరు సారా తాగించలేరు. ఈ విషయాలను నవలా చిత్రణ ద్వారా స్వయంగా కనుక్కున్నాక కొంతకాలానికి పార్టీలో కూడా ఇదే చర్చ జరుగుతున్నదని దాని సారాంశాన్ని వినిపించారు. సారా పోరాటాలు నిజంగానే ప్రజాపోరాటాలైతే సారా వ్యతిరేకంగా వందల పాటలు వచ్చేవి. ఒకటి రెండు పాత పాటలు తప్ప సారా ఉద్యమంపై పాటలే రాలేదు, రాయించలేదు. ఇది కూడా సారా పోరాటం పార్టీ ఫండు కోసం చేస్తున్న పోరాటమని నిర్ధారిస్తున్నది. తునికి ఆకు పోరాటం కూడా పార్టీ ఫండు కోసం చేస్తున్న పోరాటమే. నిజంగా తునికి ఆకు తెంపే గ్రామీణ ఆదివాసీ ప్రజల కోసం ఆ పోరాటం చేస్తే తునికి ఆకు ద్వారా ప్రభుత్వానికి జమ అవుతున్న తొమ్మిది కోట్ల రూపాయలకు మరికొంత చేర్చి వారికి ప్రావిడెంట్ ఫండ్ ఖాతా ప్రారంభించాలని కోరే వాళ్లం. ఇలా పార్టీ నాయకులతో అనేక విషయాలు చర్చించాను.

సురా, వి.రామకృష్ణ, తదితరులు ‘సారాంశాలు’ గొప్ప నవల అని ప్రశంసించారు. కానీ అది నేను బహిరంగ జీవితంలోకి వచ్చేప్పుడు వెంట తెచ్చుకోలేదు. ఎక్కడో వదిలేయడం వల్ల పోయింది. అయినా దాన్ని ఉన్నది వున్నట్టుగా మళ్లీ రాద్దామను కున్నాను. కానీ తాత్విక చర్చల కారణంగా, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనల కారణంగా నవలను అప్రధానమనుకున్నాను. అందులోని విషయాలను ఎవరితో చర్చించాలి? పార్టీ నుండి బయటికి వచ్చాక పార్టీ వెలుపలి వారికి, సానుభూతి పరులకు, విరసం వారికి అది ఏం అర్థమవుతుంది? అవన్నీ చెప్పి, చర్చించి ఏం చేయాలి? అందుకని ఎవరితోను చర్చించలేదు. పార్టీ నాయకత్వానికే అర్థం కానప్పుడు పుస్తకంగా రాసి చర్చ చేస్తే ఏం ఉపయోగం? కార్యక్రమాలు తీసుకునే ఒక సంస్థగాని, ఉద్యమం గాని ఉన్నప్పుడే వాటికి విలువ, ఉపయోగం. ఇలా ఆలోచించి పోనీ పార్టీ లేదా ఉద్యమాన్ని ప్రారంభిద్దామా అని కూడా అనుకున్నాను. అదంత తేలికైన విషయం కాదు. 450 మంది హోల్‌టైమర్స్ రావడానికి, పని చేయడానికి సిద్ధంగా వున్నప్పటికీ వారిని ప్రజాస్వామిక, లీగల్, చట్టబద్ధ ఉద్యమాల ద్వారా పెంచిపోషించే ఫండు

ఎలా సేకరించాలో మార్గం తోచక వదిలేశాను.

బీసీ, ఎస్సీ, ఎస్టీల నుండి జాతీయ బూర్జువా

అయితే కుల సమస్య చర్చకు వచ్చాక జాతీయ బూర్జువాలుగా, పెటీ బూర్జువాలుగా, మధ్యతరగతిగా, అగ్రకులాల వాళ్లను కాకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీల నుండి ఎదిగించే కార్యక్రమాలు తీసుకోవాలని చెప్పాను. జాతుల పోరాటాలు ఆయా జాతుల, ప్రాంతాలలోని బూర్జువాలు, పారిశ్రామిక వేత్తలు మరింత ఎదగడానికి సంబంధించినవి. బీసీ, ఎస్సీ, ఎస్టీల నుండి జాతీయ బూర్జువాలను, పెట్టుబడి దారులను, పారిశ్రామిక వేత్తలను, పెటీబూర్జువాలను, మధ్య తరగతిని, మేధావులను, విద్యావంతులను, ఉద్యోగులను, ప్రభుత్వ ఉన్నత అధికారులను, డాక్టర్లను, ఇంజినీర్లను, సైంటిస్టులను, మేనేజ్‌మెంట్ నిపుణులను ఎదిగించకుండా జాతుల సమస్యపై ఉద్యమించడం అగ్రకులాల ప్రయోజనాలకే! అందువల్ల అలాంటి పోరాటాల్లో అనివార్యంగా తమ ప్రయోజనాల కోసం అగ్రకుల నాయకత్వం ముందుకు వస్తుంది. అగ్రకుల ప్రయోజనాలే జాతుల సమస్య రూపంలో జాతి ప్రయోజనాలుగా, సంస్కృతి ప్రయోజనాలుగా, ప్రాంతీయ ప్రయోజనాలుగా ప్రచారం చేయబడతాయి. మద్దతు పొందుతాయి. అలాగే ఫెమినిజంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళల సమస్యలను, జీవితాలను, సంస్కృతిని, చైతన్యాన్ని పెంచకుండా ఉద్యమాలు సాగితే అగ్రకుల మహిళలే నాయకత్వంగా ముందుకు వస్తారు. ఫెమినిజం పేరిట అన్ని ప్రయోజనాలు వారే పొందుతారు. ప్రాంతీయ ఉద్యమాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల నాయకత్వం లేకపోతే అది అగ్రకులాల ప్రయోజనాలకు పరిమితమై కొనసాగుతుంది. 1984లో రాయలసీమలో ఉద్యమం సాగినప్పుడు నేను బీసీ, ఎస్సీ, ఎస్టీల నాయకత్వం చర్చ చేయగానే ఉద్యమం చల్లారింది.

జాతీయ అభివృద్ధి పేరిట, జాతుల సమస్య పేరిట, ఫెడరలిజం పేరిట, ఫెమినిజం పేరిట, ప్రతిభ పేరిట, రిజర్వేషన్ వ్యతిరేకత పేరిట అగ్రకుల ఆధిపత్యం, ప్రయోజనాలు ముందుకు వస్తాయి. ప్రధాన సామాజిక పరిణామంలో, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ స్థానాన్ని, అధికారాన్ని, అభివృద్ధిని, వాటాను అందుకోడానికి కృషి చేయకుండా జాతీయ బూర్జువాగా, పారిశ్రామిక వేత్తలుగా, మేధావులుగా, విద్యావంతులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఎదగడం సాధ్యం కాదు. ఎన్నికలను బహిష్కరించడం, ఉద్యమంలో పాల్గొనే వారు పోటీ చేయకపోవడం, పోటీ చేయనీయకపోవడం అనేవి అగ్రకుల పాలకవర్గాలకు, బూర్జువాలకు, పారిశ్రామిక వేత్తలకు, భూస్వాములకు రాజ్యాధికారాన్ని నిరంతరం రిజర్వు చేసి వారి చేతుల్లోకి అప్పగించడం. ఆ తరువాత వారి చేతే బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు

నిర్బంధాల పాలు కావడం జరుగుతున్నది.

డా॥ బి.ఆర్.అంబేడ్కర్ ఎస్సీ రిజర్వేషన్లతో పాటు బడ్జెట్‌ల కేటాయింపును రాజ్యాంగ బద్ధం చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీల నుండి మధ్య తరగతి ఎదుగుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. మేధావులుగా పరిపాలనా దక్షులుగా పలు రంగాల్లో విస్తరించారు. విప్లవోద్యమం ద్వారా ఎంతమందిని మధ్యతరగతిగా, ఎస్సీ, బీసీ, ఎస్టీల నుండి ఎదిగించాము? విప్లవం వచ్చే దాకా బీసీ, ఎస్సీ, ఎస్టీలు విద్యను ఆధునిక అభివృద్ధిని, ఉద్యోగాలను అందుకోడానికి మనం చేస్తున్న కృషి ఏమిటి? వాళ్లు అలాగే పేదరికంలో కూరుకు పోవాలా? గిరిజనులు మధ్య తరగతిగా, జాతీయ బూర్జువాగా, పెటీబూర్జువాగా ఎదిగే కార్యక్రమాలు లేకుండా వారిని విప్లవోద్యమంలోకి సమీకరించడం అంటే వారిని కేవలం మధ్యయుగాల్లో లాగా కేవలం సైనికులుగా మార్చుకోవడమే! ఇలాంటి అనేక విషయాలను గతితర్కం–అంబేద్కరిజం–మార్క్సిజం, అంబేద్కరిజం–సోషలిజం, జీవితం అంటే ఏమిటి? అనే గ్రంథాల్లో వివరంగా చర్చించాను. కనుక ఆ గ్రంథాలను అధ్యయనం చేయడం అవసరం.

పార్టీ రహస్యంగా నడుస్తుంది, జీవిస్తుంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు రహస్యంగా జీవిస్తారు తప్ప ప్రజలు రహస్యంగా జీవించరు. వారి సమస్యలు రహస్యంగా పరిష్కరించబడవు. వారి జీవితాలు బహిరంగం. వారి సమస్యలు బహిరంగమైనవి. అవి సమాజం, ప్రభుత్వం, పాలకవర్గాలు, భూస్వాములు, పారిశ్రామిక యజమానులు మొదలైన వాళ్లు బహిరంగంగానే పరిష్కరించడానికి ఒప్పుకోవాల్సిన సమస్యలు. అందువల్ల బహిరంగ పోరాటాలు ఎప్పటికీ అవసరమే.

కేవలం పార్టీ నాయకుల భద్రత కోసం, సౌకర్యం కోసం రహస్య ఉద్యమాలు అంటూ నిర్మిస్తూ దాని నిర్బంధ భారాలను ప్రజలు అనుభవించే విధంగా నెట్టివేయడం సరైంది కాదు. మనం ఇరవైరోజులకు ఒకసారి ఆయా గ్రామాల, తండాల, గూడాల ప్రజలను కలిసి ఒక పూట వున్నందుకు వాళ్లు జీవితమంతా నిర్బంధాలను, అత్యాచారాలను ఎదుర్కోవాలా? నేను అంగీకరించను అని స్పష్టం చేశాను. కె.వి.ఆర్,. గద్దర్, వరవరరావు, ఆకుల రాఘవయ్యగౌడ్‌తో సహా ప్రజాసంఘాల్లో పనిచేసే రాష్ట్ర నాయకులు, ప్రతినిధులం లీగల్ అవకాశాల గురించి ఇలాగే ఆలోచిస్తున్నాం అని చెప్పాను. మీదంతా లీగలిజం, పెటీబూర్జువా, మిడిల్ క్లాస్‌వర్గతత్వం అని పదాలు వాడి విమర్శించారు తప్ప వివరంగా తమది రైటని చెప్పలేకపోయారు.

విప్లవోద్యమ పాలసీ నిర్ణాయక నాయకులు నిర్బంధాలు అనివార్యమయ్యే విధంగా ఎందుకు పోరాట రూపాలను తీసుకుంటారు? ప్రజల సమస్యలను తేలికగా పరిష్కరించ గలిగినప్పుడు పనిగట్టుకొని విమర్శిస్తూ తిట్టుకు ఒక దెబ్బ అన్నట్టు నిర్బంధాలను

అనివార్యం ఎందుకు చేస్తుంటారు? నిర్బంధాలుంటే పార్టీలోకి రిక్రూట్‌మెంట్ పెరుగుతుంది. నిర్బంధాలు లేకపోతే ప్రజలు ఉద్యమాల్లో పనిచేస్తారు గాని పార్టీ హోల్‌టైమర్‌గా ముందుకు రారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి 1977-86 మధ్య కాలంలో పండ్రెండు వందల మంది హోల్‌టైమర్లుగా వచ్చారు. కోస్తాంధ్ర ప్రాంతంలో కూడా 1977-84 మధ్య తెలంగాణ కన్నా ఎక్కువగా సభలు, సమావేశాలు, శిక్షణా తరగతులు, ఉద్యమాలు సాగాయి. అయితే వాటి నాయకత్వం నుండి కేవలం 25 మంది మాత్రమే హోల్‌టైమర్లుగా వచ్చారు. వాళ్లు కూడా అడవుల్లో, దళాల్లో ప్రజల మధ్య విప్లవం చేయడానికి కాకుండా పత్రికల నిర్వహణ, సిద్ధాంత క్లాసుల నిర్వహణ వంటి టెక్నికల్ పనిచేయడానికే పరిమితమయ్యారు. ఇలా కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి, వినోద్ మిశ్రా, ఎమ్‌సిసి కిషన్ ప్రసాద్, రవూఫ్, చంద్రపుల్లారెడ్డి, సత్యనారాయణసింగ్, తదితరులు **'మనిషి సైకాలజీ'**ని అధ్యయనం చేసి నిర్బంధాలను, కోర్టు కేసులను నిరంతరం వర్గ శత్రువుతో శత్రుత్వాన్ని అనివార్యమయ్యే విధంగా వ్యూహం, ఎత్తుగడలు, కార్యక్రమాలు తీసుకున్నారు. వర్గ శత్రువు రక్తంతో చేతులు తడిసినవాడే నేటి హీరో అని కవిత్వాలు రాశారు. ఇందులో మూడు అంశాలు ఇమిడి వున్నాయి. ఒకటి పార్టీ ఫండ్ సేకరించడానికి వర్గ శత్రు నిర్మూలన మనీయాక్షన్‌గా ఉపయోగపడుతుంది. రెండు ప్రజల్లో విప్లవకారుల పట్ల వీరారాధన పెరుగుతుంది. ప్రజల్లో స్థానం లభిస్తుంది. మూడు ఈ యాక్షన్‌లలో పాల్గొన్న వారు, అనుమానితులతో సహా అందరిపై నిర్బంధాలు కేసులు సాగుతాయి. పోలీసులు వెంటాడతారు. విధిలేక పార్టీలోకి చేరతారు.

ఇలా మనస్తత్వ శాస్త్రం భావవాదం అంటూనే దాన్ని అనుసరించి నక్సలైట్ అగ్రశ్రేణి నాయకత్వం ప్రజలను నిర్బంధాలకు గురి చేయడానికి సిద్ధపడ్డారు. లెనిన్, మావోలు ఇలా నిర్బంధాలకు గురి చేసి లక్షలాది మంది చనిపోవడానికి కారకులయ్యారు. లాంగ్‌మార్చ్ పేరిట సాగించిన యాత్ర వెనక మావోలో కొనసాగిన మనస్తత్వం దానికి దారితీసిన వ్యూహం, ఎత్తుగడలు, కార్యక్రమాలు అన్నీ నిర్బంధాలను పెంచడానికి ప్రజలను తమ వైపు తరుముకోవడానికి సంబంధించినవి. వేటలో వలలు వేసి పెట్టి వేటగాళ్లు అవతలి వైపు నుండి తరుముతుంటారు. జంతువులు పారిపోతూ వలల్లో పడుతుంటాయి. ఇదే ఆటవిక వేట విధానాన్ని నిర్బంధం అనివార్యం చేసి తమ వలల్లో పడేట్టుగా చేస్తుంటారు. తత్వశాస్త్రంలో అనివార్యతను స్వీకరించడం ఇందుకు కారణం.

ఆసక్తి-చైతన్యం-అనివార్యత కేటగిరీలో, వైరుధ్యంలో వీరు అనివార్యత సిద్ధాంతాన్ని, డార్విన్ సిద్ధాంతాన్ని, రాజులు ఇతరులపై యుద్ధం చేయడానికి సైన్యాన్ని

సమకూర్చుకునే విధానాలను స్వీకరించారు. అనివార్యత సిద్ధాంతను అనుసరించి ముందుకుసాగడం తప్పనిసరి అయితే మీరు, నేను ఏ అనివార్యత ఉందని విప్లవంలోకి వచ్చాము? చైతన్యం పెంచుకొని సామాజిక కర్తవ్యంగా విప్లవకారులుగా మారాము. అలాంటి సెక్షన్లు చైతన్యం నుంచి వస్తాయి. అందుకు ప్రజాస్వామిక, బహిరంగ అవకాశాలు, సభలు, సమావేశాలు అవసరం. రహస్య నిర్మాణంలో అనివార్యత సిద్ధాంతం నుండి వచ్చే వాళ్లే వస్తారు. కనుక మేథో నాయకత్వం ఎదిగే అవకాశం లేదు.

కామ్రేడ్! ఇంత క్రూరంగా, నీచంగా విమర్శించడం తగదు అని ముప్పాళ్ల లక్ష్మణరావు లాంటి వాళ్లు వ్యాఖ్యానించారు. అయితే వీటికి జవాబు చెప్పండి. కోస్తాంధ్ర ప్రాంతం నుండి హోల్‌టైమర్లు తెలంగాణలో లాగా ఎందుకు రాలేదు? నక్సల్‌బరీలో చారు మజుందార్, సరోజ్ దత్తా పేర్లే వినబడతాయి. సంతాళ్ గిరిజన నాయకుల పేర్లు ఎందుకు వినబడవు? శ్రీకాకుళ పోరాటం సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటాపు సత్యం పేర్లే వినబడతాయి. పోరాడిన గిరిజన నాయకుల పేర్లు ఎందుకు వినబడవు? అంటే మైదాన ప్రాంత మేథావులు, వెనుకబడిన ప్రాంతాల, అటవి ప్రాంతాల ప్రజలపై తమ నాయకత్వాన్ని, సిద్ధాంతాలను, వ్యూహం, ఎత్తుగడలను, కార్యక్రమాలను రుద్దుతున్నారు. కొందరు వెంట రావడంతో ఇది ప్రజల పోరాటం అని అంటున్నారు. ఏ గిరిజన ప్రజలు దండకారణ్యం విముక్త ప్రాంతం కావాలని కోరారు? మన లక్ష్యాలకు వారిని నిర్బంధాల పాలు చేయడం లేదా?

ప్రేమ్‌చంద్ 1912లో 'రంగభూమి' నవల రాశాడు. అది మహాభారతం వంటి ఒక గొప్ప ఇతిహాసం. అందులో జాతీయోద్యమం నడుస్తుంది. జాతీయోద్యమంలో అగ్రకులస్థుడైన వినయుడు తన నాయకత్వం కోల్పోయి ప్రజల చేతుల్లోకి నాయకత్వం రావడంతో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా మారతాడు. విప్లవాన్ని ధ్వంసం చేస్తాడు. ఒకసారి ఆ నవల చదువు. అగ్రకులాల వాళ్లు, విప్లవం అవసరం లేని వర్గాల నుండి, కులాల నుండి వచ్చి కార్మికవర్గ నాయకత్వంగా నాయకత్వం వహించే వాళ్లు తమ నాయకత్వం పోగానే విప్లవానికి వ్యతిరేకంగా మారతారు. నాయకత్వం కోసమే విప్లవంలో వుంటారు. దీన్ని ప్రేమ్‌చంద్ 1912లో పసిగట్టి వినయుడి పాత్ర రూపంలో చెప్పడం ద్వారా గొప్ప దార్శనికుడయ్యాడు. ఈ చర్చతో లక్ష్మణరావు మూలాలు కదిలిపోయాయి. నా మాట మీద నేను నిలబడతాను. ముందు ఆ నవల చదువు అని చెప్పాను.

కొండపల్లి సీతారామయ్య విరసం కార్యదర్శిగా వుండమని కోరాడు. అప్పటికి విరసం సభ్యులు 35 మంది కూడా లేరు. రాడికల్ యువజన సంఘం అంత పెద్ద

సంస్థ నుంచి ఇంత చిన్న సంస్థకు రాబుద్ధి కాలేదు. విరసంలో ఒక్కొక్కరిది ఒక తలతిక్క. పైగా వాళ్ల దగ్గరికి వెళ్లడం అరెస్టులకు దారితీస్తుంది. దాంతో నేను వి.చెంచయ్యను దళితుడని విరసం కార్యదర్శిగా ప్రతిపాదిస్తే బాగుంటుందని ప్రతిపాదించాను. ఆ తరువాత కళ్యాణరావును విరసం కార్యదర్శిగా ప్రతిపాదించాను.

నల్లా యాదిరెడ్డి అరెస్టయ్యాక రాష్ట్ర కార్యదర్శిగా ఎవరిని పెట్టాలని కొండపల్లి సీతారామయ్య సలహా అడిగినప్పుడు ముప్పాళ్ల లక్ష్మణరావు తప్ప సీనియర్లు ఎవరు లేరు. అందువల్ల ఆయననే కార్యదర్శి చేయక తప్పదు. అయితే ఆయన బహు జాగ్రత్త పరుడు. రహస్య నిర్మాణానికే ప్రాధాన్యత ఇస్తాడు తప్ప బహిరంగ అవకాశాలకు ఓటు వేయడు అని నా అభిప్రాయం వివరించాను.

సిద్ధాంతాలు ఎన్నో వస్తుంటాయి. పోతుంటాయి. నా ఆవేదన సిద్ధాంతాల గురించి కాదు. నా ఆవేదన మనిషి గురించి. ఒక మనిషి పుట్టి, పెరిగి, ఎదగడానికి ఇరవై, ముప్పయేళ్ళు కావాలి. అలా సమాజ సంపదతో, తల్లిదండ్రుల త్యాగాలతో ఎదిగి చైతన్యవంతులైన కార్యకర్తలు, నాయకులు, మనుషులు చనిపోవడం గురించే నా ఆవేదన.

వాళ్ళు బతికుంటే సమాజానికి ఎంతో సేవ చేస్తారు. సాయుధ పోరాట పంథాలో వెళ్ళాక వాళ్ళు బతుకుతున్న సగటు వయస్సు అయిదు నుండి ఏడేళ్ళే. కొందరు ఏడాదిలోపే చనిపోతున్నారు. కొందరు డెబ్బయ్యేళ్ళ దాకా జీవిస్తున్నారు. అందరిది కలిపి సగటు వయస్సు 5-7 సంవత్సరాలే. వీళ్ళంతా డబ్బయ్యేళ్ళ దాకా బతికితే ఒక్కొక్కరే 5×14=70 మంది ఎంత పని చేస్తారో అంత పని చేస్తారు. వారి అనుభవాలు 70 రెట్లు పెరుగుతాయి. ఇలా ఒకరు చనిపోవడం 70 మంది సామాజిక కార్యకర్తలు చనిపోవడంతో సమానం. శాంతియుత పద్ధతిలోపని చేస్తే పదివేల మంది కార్యకర్తలు తమ జీవిత కాలంలో ఏడు లక్షలమంది విప్లవ కార్యకర్తలంత పని చేస్తారు. ఆరెసెస్ కార్యకర్తలు ఇలానే శాంతియుత పంథాలో విస్తరిస్తున్నారు. మనుషులు ముందు బతకాలి. బతికి సాధించాలి. మీ పుట్టుక, పెరుగుదల సమాజం యొక్క పెట్టుబడే. సమాజానికి మీపై హక్కు ఉంది.

పారిశ్రామిక సరుకులను కొనకపోతే కన్సూమరిజం, పారిశ్రామిక వ్యవస్థ సంక్షోభంలో పడి అన్ని పరిశ్రమలు మూతపడతాయి. ఏడాదిలో అవుటవుతాయి. కనుక వస్తువుల వాడకం తగ్గించాలి. ప్రకృతిలో ఆనందం పొందాలి. నగరాల్లో జనాభా కేంద్రీకరణ తగ్గాలి. చిన్న పట్టణాలను అభివృద్ధి పరచాలి. పల్లెలను అభివృద్ధి పరచాలి. ఈనాటి పల్లెలు నగరానికి కాలనీల వంటివే.

పని జరగాలంటే ఎన్నో మార్గాలున్నాయి. సమాజం మారాలంటే ఎన్నో మార్గాలున్నాయి. ఉద్యమాలు అందులో ఒక మార్గం మాత్రమే. ఫైళ్ళలా పేరుకుపోయిన సమస్యలే ఉద్యమాలుగా రావచ్చు. ఫైళ్ళలా పేరుకుపోకుండా పరిష్కరించడమే మార్గం. ఉద్యమం కూడా తిరిగి ఒప్పందాల కోసమే. సంస్థకు, ఉద్యోగులకు ఒప్పందాలు. ఒప్పందాలకు ఉద్యమాలే కానక్కర్లేదు. చర్చలు కూడా మార్గమే. యాజమాన్యం మైండ్‌సెట్ మార్చడం కూడా మార్గం. ప్రభుత్వ చట్టాలు తేవడం కూడా మార్గమే. చట్టాలు తయారు చేసే వారు, అమలు జరిపే వారు మారితే సమాజాన్ని కూడా మార్చడం సాధ్యమే. అందువల్ల ఉద్యమాలే ముఖ్యం కాదు. భావాలు కూడా మనుషులను మార్చుతాయి. భావాలు ఎందరికి చేరాయి అనేది ఒక్కటే ముఖ్యం కాదు. ఎవరికి చేరాయి అనేది కూడా ముఖ్యమే. అవి ఎన్ని రకాల పరిష్కారాలను, ఫలితాలను సాధించాయి అనేది కూడా ముఖ్యం. చట్టాలు చేసే వారు, అమలు జరిపేవారు, ఉద్యమాలు నడిపే వారు స్వీకరిస్తే భావాలు ఉద్యమాలు లేకుండానే అవి సమాజాన్ని ఎంతగానో మార్చుతాయి.

ఊహకు, అనుభవానికి తేడా ఉంటుంది. నేను సభలకు వెళ్ళినప్పుడు ఫొటోలు తీసుకోవచ్చని ఒక కెమెరా ఉంటే బాగుండనుకున్నాను. ఒక యువ మిత్రుడు కానుకగా ఇచ్చాడు. కెమెరా వెంట తీసుకువెళ్ళాను. ఆ కెమెరాలో నేను పాల్గొన్న మీటింగ్‌లను ఫొటోలు తీశాను. అందులో నా ఫొటోయే లేదు. నా ఫొటోల కోసం కెమెరా ఉంటే బాగుంటుంది అనుకున్నది ఊహ. అది చేతికి వచ్చాక నా ఫొటోనే అందులో ఉండదు అనేది అనుభవం.

ఏనుగుకు తినే దంతాలు వేరే, చూపే దంతాలు వేరే. సామాజిక ఉద్యమ భావజాలం, మతాలు, పార్లమెంటరీ పార్టీలు, ఎన్నికల్లో పాల్గొనే వారు తినే దంతాలు వేరే. చూపే దంతాలు వేరే.

మనసులో ఒకటి పెట్టుకొని పైకి ఒకటి మాట్లాడతారు. మాట ఒకటే పరిశీలించడం కాదు. మనసును పరిశీలించాలి. ఆచరణను పరిశీలించాలి. స్వభావాన్ని పరిశీలించాలి. ఆచరణ పరిణామాల్ని, ఫలితాల్ని పరిశీలించాలి. దృక్పథాలన్నిటికి, భావాలన్నిటికి, ఉద్యమాలన్నిటికి ఈ మాట వర్తిస్తుంది. అవి మనసులో ఒకటుంచుకొని పైకి ఒకటి చెప్పడం చేయవచ్చు.

చివరకు మిగిలేది ఏమిటి? చివరకు ఏదీ మిగలదు. మానవ కార్యకలాపాల చరిత్రే మిగులుతుంది. ఆస్తులు, అనుభవాలు సమాజానికి మిగిలిపోతాయి. చివరకు చరిత్ర కూడా సమాజానికి బరువుగా, భారంగా పరిణమిస్తుంది.

కార్మికవర్గ రాజ్యమంటే యూరప్ పెట్టుబడిదారుల స్థానంలో యూరప్ కార్మికులు పాలకులు కావడం. సోషలిజం, కమ్యూనిజం అంతిమ సత్యం అని చెప్పడం అంటే మార్క్సిజం ఒక మతంగా మారిపోయిందని అర్థం. మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు మేనిఫెస్టో రాసే నాటికి వారి వయస్సు పాతికేళ్ళే. 150 ఏళ్ళ చరిత్ర అనుభవాలు, కోట్లాది ప్రజల అనుభవాలు వారి అనుభవాల కన్నా, ఆచరణ కన్నా ఎన్నో రెట్లు ముందుకు సాగాయి.

ప్రతి చిన్న విషయానికి కొందరు యుద్ధం చేయాలన్నారు. గోర్లతో పోయే దానికి గొడ్డళ్ళతో నరకాలన్నారు. సమస్యల్ని ఉద్యమాల పేరిట పరిష్కరించే బదులు పెంచే, వాయిదా వేసే క్రమం కూడా ఉంటుంది. వీటిని పసికట్టడానికి నైపుణ్యంకావాలి.

ఇలా నేను 1976 నుండి విప్లవోద్యమంలో, సాహిత్య సామాజిక రంగంలో రకరకాల స్థాయిల్లో పనిచేస్తూ పీపుల్స్‌వార్ పార్టీ పూర్తికాలపు కార్యకర్తగా 1984-90 ఆరేళ్ళు పనిచేసి తరువాత బయటకు రావడానికి అవగాహనపరమైన విభేదాలతో పాటు, కార్యక్రమాల గురించిన విభేదాలు వున్నాయి. నాకు ఉద్యమానికి మధ్య గల సైద్ధాంతిక విభేదాల గురించి, నా ఉద్యమ అనుభవాల గురించి ఉద్యమంలో కలిసి పనిచేసిన లీగల్ మిత్రులు తెలుసుకోవాలని ఏ కోశాన అసక్తి చూపలేదు. పైగా నాతో మాటలు మానేసి శత్రువులాగా చూశారు.

ఇలాంటి వాళ్ళ మధ్యనా నేను నా జీవితాన్ని త్యాగం చేయాలని చేసింది? అని ఆవేదనకు గురయ్యాను. మానసిక వేదన సంక్షోభం తీవ్రమైంది. అయినా ఒంటరి పోరు చేయడానికే నిర్ణయించుకున్నాను. పార్టీకి నేను ఏమి సూచించానో ఉద్యమాలు ఎలా నడిస్తే బాగుంటుందని భావించానో వాటిని బహిరంగ జీవితంలోకి వచ్చాక ఎవరికి చెప్పాలి? వినడానికి ఎవరున్నారు? అందుకని నిర్మాణపరమైన కార్యక్రమాల రూపకల్పన, ఉద్యమాల నిర్వహణ సంస్థాగత లోపాలు, ప్రజాసంఘాలకు, పార్టీకి మధ్య ఉండాల్సిన సంబంధాలు మొదలైనవి చర్చించడం ఎవరు స్వీకరించాలో వారికి అక్కరలేనివి అయ్యాయి.

నేను సూచించిన అంశాలు, అవగాహన

1. ప్రజాసంఘాల ప్రజలు తమ జీవితం జీవిస్తూ ఉద్యమాల్లో పాల్గొంటారు. ప్రజలు సుఖ సంతోషాలతో శాంతియుతంగా జీవిస్తూ ఉద్యమించగలగాలి. కనుక ప్రజలు ఎప్పుడూ తమ ఊళ్ళల్లో జీవించే విధంగా కార్యక్రమాలు, ఉద్యమాలు ఉండాలి. నిర్బంధం ఒక స్థాయిని మించి ఉన్నప్పుడు ప్రజలు పారిపోవాల్సి వస్తుంది. కుటుంబాలు శిథిలమవుతాయి. అలా జరగకూడదు.
2. స్త్రీల సమస్య, కుల సమస్య, విద్యార్థుల సమస్య, ఉపాధ్యాయుల సమస్య ఉద్యోగుల రంగంలో బహిరంగ అవకాశాలకు ఎప్పుడూ స్థానం వుంటుంది. వారిపై నిర్బంధాలు ప్రయోగిస్తే ప్రభుత్వాలు పడిపోతాయి.
3. గిరిజనులను ముందుగా మైదాన ప్రాంతాల ప్రజల వలె ఆధునిక విద్య ఆధునిక అభివృద్ధిలో భాగం చేయాలి. అందుకు పాఠశాలలు, హాస్టళ్ళు, కాలేజీలు, స్కాలర్‌షిప్పులు మొదలైనవి విస్తృతంగా ఏర్పాటు చేయాలని ఉద్యమించడం ద్వారా శాంతియుత ఉద్యమాలు సాగుతాయి. వారి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ప్రవేశ పెట్టి ఎకరాకు మూడు క్వింటాళ్ళు పండిస్తున్న వారిని 30 క్వింటాళ్ళు పండించే స్థాయికి ఎదిగించి ఉత్పాదక పెంచడాన్ని ప్రభుత్వం అడ్డగించలేదు.
4. కులవృత్తుల వారి ఉద్యమాలు కూడా లీగల్ పోరాటాలకు సంబంధించినవే.
5. స్త్రీలు, బీసీలు, ఎస్సీలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమాల్లో కలిసి వచ్చినంతకాలం నిర్బంధాలకు అవకాశం తక్కువ. కుల సంఘాల మీద, స్త్రీల మీద, ఉద్యోగుల మీద లాఠీగోళీ చలాయించి, వారిని జైళ్ళలో పెట్టి ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదు. ఆ ప్రభుత్వం కుప్పకూలిపోతుంది.
6. అందువల్ల విప్లవం విజయవంతమయ్యే దాకా ఈ సామాజికవర్గాలను నిరంతరం లీగల్‌గా పనిచేసే ఉద్యమాలతో ముందుకు నడపడం అవసరం.
7. అలాగే పేదవర్గాలకు, ఆదివాసులకు, బీసీలకు, ఎస్సీలకు, గ్రామీణులకు ఆధునిక విద్య ఉన్నతస్థాయి దాకా ఉచితంగా అందించడానికి ఉద్యమించడం అవసరం.
8. బీసీ, ఎస్సీ, ఎస్టీలకే విప్లవం అవసరం. వారి నుంచే అత్యున్నత స్థాయి, పాలసీ నిర్ణాయక నాయకులు ఎదగాలి. అందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కేడర్‌గా అగ్రకులాల వాళ్ళు లీడర్లుగా ఎందుకుంటున్నారు. అంబేద్కర్ వలె వామపక్షాల ఉద్యమాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల నుండి మేధావులు, నాయకులు, రచయితలు ఎందుకు ఎదగలేదు? ఎదిగించడానికి అనువైన కార్యక్రమాలు తీసుకోవాలి.
9. ఇది అశాస్త్రీయ విద్యావిధానం అయినప్పటికీ ఆధునిక అభివృద్ధి

అందుకోవడానికి, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఈ విద్యే మూలాధారం. అందువల్ల ఇది అశాస్త్రీయ విద్యావిధానం అని చెప్పి చదువు పట్ల నిర్లక్ష్యం పెంచి పార్టీ కార్యకర్తలుగా మార్చుకోవడం బదులుగా విద్యావంతులుగా, ఉద్యోగులుగా, వృత్తి నిపుణులుగా మార్చడం అవసరం.

10. విప్లవ పార్టీలు ఒక మిషన్‌లాగా ఉద్యమం పని చేస్తే పదేళ్ళలోనే దళితులు, గిరిజనులు విద్యావంతులై తమ సమాజాలను మార్చుకుంటారు. మహిళ, బాల విద్యావంతుల కమిటీలను ఏర్పర్చుకుంటారు. వాటికి తామే నాయకత్వం వహించి ఆధునిక అభివృద్ధిలో తమ వాటాను సాధించుకుంటారు.

11. “అభివృద్ధి, అధికారం అందిన వారికి, అందాల్సిన వారికి మధ్యనుండే వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం.” ఇదే అనేక సిద్ధాంతాల రూపంలో, ఉద్యమాల రూపంలో వ్యక్తమవుతూ ఉంటుంది. అందువల్ల బాగా వెనుకబడిపోయిన ప్రాంతాలను, ప్రజలను, కులాలను, దళితులను, గిరిజనులను మొట్టమొదటగా అభివృద్ధిపరచాలి. అందుకు అంబేద్కర్, రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ఉపయోగించుకోవాలి. వాటిని మరింతగా విస్తరింప చేసుకోవాలి. అభివృద్ధి చెందిన వారే ఉద్యమాలు చేయాలి. అభివృద్ధిలో వెనుకబడి పోయిన వారు మొత్తం సమాజాన్ని మార్చే బరువును నెత్తికి ఎత్తుకోవాలని చెప్పడం సరికాదు. వాళ్ళు ముందు మిగతా సమాజంతో పాటు ఎదగాలి. అందుకు కృషి జరగాలి. మొత్తం సమాజం మారడానికి అందరూ కలిసి కృషి చేయాలి.

విప్లవంలో ఎన్ని సెక్షన్లు కలిసి వస్తాయి?

12. ఈ దశలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రైస్తవ, సిక్కులను మైనార్టీలను ప్రత్యేక సామాజిక వర్గాలుగా గుర్తించి సామాజికంగా, రాజకీయంగా సమీకరించి ఉద్యమించాలని దేశవ్యాప్తంగా ఒక ప్రతిపాదన బలంగా ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనను సమర్థిస్తూ విజయవాడలోని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్టు చంద్రశేఖర్, ఆంధ్రప్రభ జర్నలిస్టు సుబ్రహ్మణ్యేశ్వర్ రావు నాతో వాదించారు. వీరు కులానికి బ్రాహ్మణులు. బ్రాహ్మణవాదంపై పోరాటం చేయటానికి మార్క్సిస్టు వర్గ దృక్పథం చాలదని బహుజన దృక్పథం అవసరమని బీసీ, ఎస్సీ, ఎస్టీలను, ముస్లింలను, ఆయా సామాజిక వర్గాల పేరిట ప్రత్యేకంగా సమీకరించాల్సిందే నని

లెక్కలతో సహా నిరూపిస్తూ వాదించారు.

13. గ్రామీణ రైతు కూలీలను, దున్నేవారికే భూమి కార్యక్రమం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకొని పోయే కార్యక్రమంలో ఎంత మంది కలిసి వస్తారు? గ్రామంలో వెయ్యి జనాభా ఉంటే భూమి లేని కూలీలు, పేదలు 200మంది ఉంటారు. వీళ్ళు ప్రధానంగా దళితులు. చేతివృత్తుల బీసీలకు ఈ ఉద్యమంలో స్థానమే లేదు. వారి గురించిన కార్యక్రమాలే లేవు.

14. ఇలా 15శాతం జనాభా గల దళితులను, బీసీల్లో భూమి లేని కొందరు పేదలను కలుపుకుంటే 20 శాతం జనాభా మించదు. అగ్ర కులాలను, ధనిక రైతులను, సన్నకారు రైతులను, ముస్లింలను దున్నేవారికే భూమి అనే నినాదం, కార్యక్రమం ఆకర్షించి విప్లవోద్యమంలోకి సమీకరించే అవకాశం లేదు. కనుక పల్లెల నుండి పట్టణాలను విముక్తం చేయాలి అనే కార్యక్రమానికి గ్రామాల్లోని 20 శాతం జనాభా మాత్రమే పునాదిగా ఉంటుంది. కాంగ్రెస్, టీడీపీ తమ ఓట్ల సమీకరణ కోసం ఇండ్ల స్థలాలు, రోడ్లు, కరెంటు, ఇళ్ళు, స్కూళ్ళు, హాస్టల్‌లు, రోడ్లు, రిజర్వేషన్ ఉద్యోగాలు మొదలైన వాటి ద్వారా ఈ పేద వర్గాల్లో బలమైన సెక్షన్‌ను తయారు చేసుకొంటూనే ఉన్నవి.

15. అందువల్ల ఇవేవి అందని వారు మాత్రమే విప్లవోద్యమంలో నికరంగా మిగులుతారు. కేవలం పేదల్లో ఒక సెక్షన్ కదిలితే మొత్తం ప్రజానీకం కదిలినట్టు కాదని అందువల్ల బీసీలను, ఎస్సీలను, ఎస్టీలను, ముస్లింలను కలుపుకుంటే 70 శాతం కి పైగా జనాభా అవుతుందని చర్చలు జరిగాయి. ఈ లెక్కలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయి.

16. ముందే చెప్పినట్లు నక్సలైట్ ఉద్యమ తొలితరం యువ నాయకుల్లో ఒకరైన చారు మజుందార్ సహచరుడైన శంకర్ గుహ నియోగి విప్లవోద్యమం సమీక్ష చేసుకొని తన పంథా మార్చుకొని భిలాయి ఉక్కు కార్మాగారం, దాని గనులున్న రాజ్‌నంద్‌గామ్, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో తన నూతన అవగాహన అనుసరించి ఉద్యమాలను నడిపించారు. ఛత్తీస్‌ఘడ్ విషయంలో జాతుల సమస్యలో భాగంగా ‘ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం’ ఏర్పడాలని దేశ వ్యాప్తంగా ప్రచారం చేశారు. జాతుల సమస్య గురించిన అవగాహన కోసం జాతీయ స్థాయిలో పీపుల్స్‌వార్ పార్టీ, విమోచన పార్టీ తాలూకు మేధావులు, ప్రజాస్వామికవాదులు సెమినార్‌లు నిర్వహించారు. ఛత్తీస్‌ఘడ్

రాష్ట్రం ఏర్పడడానికి సైద్ధాంతిక, సామాజిక పునాదులు వేసింది శంకర్ గుహ నియోగియే.

17. బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలోని మావోయిస్ట్ కమ్యూనిస్టు సెంటర్ (ఎమ్‌సిసి) ప్రజాసంఘాలు లేకుండా ప్రజాసైన్యాన్ని తయారు చేసి మూకుమ్మడిగా దాడి చేయడం, స్వయంగా పర్యటించి తిరిగి చూసిన అనుభవంతో ఆ పని విధానం మధ్యయుగాల పనివిధానంగా గమనించాము. ఉద్యమించే ప్రజలకు సామాజిక పరిణామం తాలూకు అభివృద్ధి అందే దృష్టే ఎమ్‌సిసి కోల్పోయింది. ఇది సరైంది కాదు.

18. దేశ వ్యాప్త పర్యటనలో వందలాది మేథావులతో, రచయితలతో, పార్టీ ప్రతినిధులతో దళిత సమస్య, జాతుల సమస్య, కుల సమస్య, స్త్రీ సమస్య, వెనుకబడిన ప్రాంతాల సమస్య పట్ల జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో చర్చల్లో పాల్గొనడం జరిగింది. మాతో పాటు మేధావుల మధ్య, సామాజిక ఉద్యమకారుల మధ్య విస్తృతంగా చర్చలు సాగాయి. నేను పీపుల్స్‌వార్ పార్టీలో ఈ విషయాలను చర్చించడానికి అనేక వ్యాసాలను రాసి చర్చకు అందించాను.

నేను ఎన్ని రకాలుగా బహిరంగంగా పని చేయవచ్చో సూచించినప్పటికీ రహస్య నిర్మాణానికే ప్రాధాన్యత నిచ్చారు. తన జీవిత కాలంలో తెలంగాణ సాయుధ పోరాటం అంతటి గొప్ప పోరాటం చేసానని అన్పించుకోవాలని కొండపల్లి సీతారామయ్యకు యావ పట్టుకుందని అర్థమైపోయింది. అందుకోసం తప్ప మేము ఉద్యమ నిర్మాణంలో భాగంగా బహిరంగ కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పే వాటిని వ్యతిరేకించే అవసరమే లేదు.

శ్రమశక్తి – అదనపు విలువ

శ్రమ శక్తి, అదనపు విలువ, పెట్టుబడి చర్చలో అదనపు విలువ అంతా కార్మికుడిదే అని నిరూపిస్తూ మార్క్స్, క్యాపిటల్ గ్రంథాలను రాశారు. అది అర్థ సత్యం మాత్రమే. సైన్సు, టెక్నాలజీలో సాధించిన అభివృద్ధి వల్ల ఉత్పత్తి, సంపద, అదనపు విలువ పెరుగుతున్నది.

నాగలి పట్టి ఒకరోజంతా దున్నితే రెండు ఎకరాలు దున్నుతారు. ట్రాక్టరుతో దున్నితే 20 ఎకరాలు దున్నుతారు. 20 ఎకరాలు దున్నినా ట్రాక్టరు డ్రైవరు అదనంగా చేసిందేమీ లేదు. నిజానికి నాగలితో దున్నే రైతుకే శరీర కష్టం ఎక్కువ. ట్రాక్టరు నడిపే డ్రైవరుకు అంత కష్టమేమీ లేదు. ట్రాక్టరు సాధించిన అభివృద్ధి ఇది. దానికి

ఇంజనీర్లు, సైంటిస్టులు ముఖ్య కారణం. అందువల్ల అదనపు విలువ సృష్టిలో సైంటిస్టులు, ఇంజనీర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, తదితరులదే ప్రధాన పాత్ర.

ఒక పరిశ్రమ లాభాల్లో నడవడానికి అలాంటి మరొక పరిశ్రమ నష్టాల్లో నడవడానికి యాజమాన్య సామర్థ్యం ప్రధానమైనది. అందువల్ల అదనపు విలువ సృష్టిలో యాజమాన్య సామర్థ్యం కూడా అత్యంత ప్రధానమైనది. వీటితో పాటు కార్మికుడు కూడా అందుకు కారకుడు. కార్మికుడు ఆధునిక అభివృద్ధి, టెక్నాలజీ రీత్యా చూస్తే, శారీరక కష్టంతో పనిచేసే స్థాయి కృషి లాంటిదే అని చెప్పవచ్చు. స్విచ్ వేయగానే మిషన్లు నడుస్తుంటాయి. వాటిని సరిగ్గా నడిచేటట్టు చూడ్డమే కార్మికులుగా చేస్తున్న పని. ఇలా అదనపు విలువ అని మార్క్స్ చెప్పింది కేవలం కార్మికులదే కాదని అది సైన్సు, టెక్నాలజీ, సృష్టించిన శాస్త్రవేత్తలది, ఇంజనీర్లది, యాజమాన్య సామర్థ్యానిది. వీటన్నిటికీ కారణమైన సమాజానికి సంబంధించినది. అందువల్ల ఒక కార్మికుడు బ్రతకడానికి పోగా మిగిలేదంతా ఆ సమాజానికి చెందాల్సిన అదనపు విలువే తప్ప కేవలం కార్మికుడిది కాదు అని సోదాహరణంగా నిర్ధారించాను.

అందువల్ల కార్మిక వర్గ నియంతృత్వం అనే మాటే అర్థం లేనిదై పోయింది. కాలం తీరిపోయింది. ప్రపంచమంతా మార్కెట్ ద్వారా ఐక్యరాజ్య సమితి ద్వారా, దాని అనుబంద సంస్థల ద్వారా ఒక్కటవుతూ వస్తున్నది. ఇందులో శాంతియుత పద్ధతిలో వెనుకబడిన దేశాలు, ప్రాంతాలు, జాతులు, కులాలు, వర్గాలు, ఆధునిక టెక్నాలజీని, సైన్సును వెంటదివెంట అందిపుచ్చుకుని ప్రపంచ స్థాయికి ఎదగాల్సిన సందర్భం వచ్చింది. అందుకు ఎదిగిన దేశాలు సైన్సు, టెక్నాలజీని మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ని ఉచితంగా లేదా నామమాత్రపు రేటుపై అందించాలి. అందుకోసం అది అవసరమైన వాళ్లు ఉద్యమించాలి. ప్రజాస్వామ్య బహుళ పార్టీ వ్యవస్థ ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అని తాత్విక దృక్పథం ప్రపంచంలోని అన్ని తత్వశాస్త్రాల కన్నా మహోన్నతమైనది. దీన్ని అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో సాధించడమే ప్రపంచ ముందున్న కర్తవ్యం.

ఇవన్నీ వదిలేసి కేవలం నేను కుల సమస్యపై మాత్రమే చర్చించినట్టు, ఆ విషయంలో నా అభిప్రాయాలు తప్పయినట్టు, పార్టీ అభిప్రాయాలు కరెక్టు అన్నట్టు పార్టీలో నాపై చర్చను ప్రచారం చేశారు. అయితే నేను మరో పార్టీ పెట్టదల్చుకోలేదు. పార్టీ పెట్టాలంటే దాని సమస్యలు దానికున్నాయి. తత్వశాస్త్రంలో మార్పులే ముఖ్యం. మార్క్సిజం కూడా తొలుత భావజాల యుద్ధమే చేసింది. ఆ భావాలతో అంగీకరిస్తూ సామాజిక ఆచరణలో ముందుకు సాగే వాళ్లు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య, విద్య, జర్నలిజం సంబంధాల్లో దాని వెలుగుతో విశ్లేషించారు.

కార్యక్రమాలు రూపొందించుకున్నారు.

నేను చేసే మార్క్సిస్టు తాత్విక చర్చలో కులం ఒక అంశం మాత్రమే. కులం అనే అంశం లేకపోయినా 'గతితర్క తత్వదర్శన భూమిక' పుస్తకంలో చర్చించిన అంశాలన్నీ అలాగే వుంటాయి. కులానికి అన్వయించి చర్చ చేయడం జరిగింది. అనగా సిద్ధాంత చర్చకు కులం అనేది, ఫెమినిజం అనేది ఒక ఉదాహరణగా ఇచ్చిందే తప్ప అది సిద్ధాంతంలో భాగంగా చర్చించలేదు. అప్పటికీ సులభంగా చెబితే సూత్రం ఉదాహరణగా మారి కూర్చుంటుందని అనేక సార్లు చెప్పినప్పటికీ ఉదాహరణ లేకుండా అర్థం చేసుకోవడం ఎలా అని ప్రశ్నిస్తుంటే కొన్ని ఉదాహరణలు ఇవ్వక తప్పదు. అయితే లెనిన్ ఉదాహరణలన్నీ కుంటివే అన్నాడు. ఎందుకు అన్నాడు? ఉదాహరణ అనేది ఒక పర్టిక్యులర్ మాత్రమే. వేనవేల పర్టిక్యులర్‌ల సామాన్యీకరణనే యూనివర్సల్‌గా, సిద్ధాంతంగా చెబుతాము. క్రోడీకరిస్తాము. అందువల్ల ఉదాహరణను పట్టుకొని సిద్ధాంతం తప్పు అని చర్చిస్తే వేపచెట్టును ఉదాహరణ ఇస్తే పండ్లన్నీ చేదుగా వుంటాయి అని వాదిస్తారు తప్ప చెరుకు తీపిగా వుంటుందని, మామిడి పండు తీపిగా వుంటుందని ఎంత చెప్పినా ఎక్కదు. అంగీకరించరు. అందువల్ల ఉదాహరణలు ఇవ్వడం వల్ల తత్వశాస్త్రంలో అనేక వక్రీకరణలకు దారితీస్తుంది.

అలాగే కుల సమస్యపై, స్త్రీ సమస్యపై నూతన ఆలోచనలు స్వీకరించాల్సి వుందని ప్రతిపాదించాను. ఫెమినిజం ముందుకు తెచ్చిన ప్రశ్నలను, పరిష్కారాలను, దృక్పథాన్ని పార్టీ స్వీకరించాలని స్పష్టం చేశాను. కుల సమస్య విషయంలో మనకన్నా ముందు అంబేద్కర్ గొప్ప పోరాటం చేశాడు. సిద్ధాంత ప్రాతిపదికలు నిర్మించాడు. చైనాలో మావో సన్‌యెట్‌సేన్‌ను గౌరవించి స్వీకరించినట్టుగానైనా డా॥ బి.ఆర్.అంబేద్కర్‌ని కుల సమస్య విషయంలో స్వీకరించాలని ప్రతిపాదించాను. సత్యమూర్తి పదవుల కోసం ఈ చర్చ చేశాడని అన్నారు. నాకు పదవులు అక్కర్లేదు, ఏపనైనా చేస్తాను సైద్ధాంతికంగా దీన్ని చర్చించండి అని ప్రతిపాదించాను. నెలల తరబడి చర్చలు సాగాయి. చివరకు ముప్పాళ్ల లక్ష్మణరావు మీరు అంబేద్కర్‌ను సమర్థిస్తే మార్క్సిజాన్ని వదిలేసినట్టే. అంబేద్కర్ పాలకవర్గాల ఏజెంట్, పెద్దపాలేరు అని విమర్శకు దిగారు. ఈ మాటలన్నీ డాంగే లాంటి వాళ్లు ఎన్నడో అన్నారు. అయితే డాంగేనే బ్రిటీష్ వాళ్ల ఏజెంట్ అని రహస్య పత్రాలు బయటపడ్డాయి అని తిరిగి వాదించాను. అలా మీ వాదన మీద మీరుంటే ఒక్క క్షణం కూడా పార్టీలో వుండే నైతిక హక్కు లేదు అని అన్నారు. ఇది పార్టీ అభిప్రాయం అన్నారు. పార్టీ ఎప్పుడు చర్చించింది? నీవు ఒక మార్క్సిస్టు పార్టీ కార్యదర్శివైనంత మాత్రాన మార్క్సిజానికి కార్యదర్శివి కావు. నా భావాలు నా అనుభవాల నుండి, అధ్యయనం

నుండి రూపొందాయి. నీ భావాలు, నీ కులం, నీ అధ్యయనం, అనుభవాల నుండి రూపొందాయి అని పార్టీ కింది నుండి పై స్థాయి దాకా చర్చించి నిరాకరించే దాకా లేదా అంగీకరించే దాకా నీ భావాలు, నా భావాలు కూడా వ్యక్తిగతమైనవే అని స్పష్టం చేశాను.

నా భావాలకు పార్టీలో స్థానం లేనప్పుడు పార్టీలో ఎందుకుండాలి? కనీసం పార్టీలో నా భావాలను చర్చకు కూడా తీసుకోనప్పుడు ఎందుకుండడం? అయినంత మాత్రాన ప్రభుత్వానికి సరెండరై వెనక్కి వెళ్లిపోవడానికి సిద్ధంగా లేను. ఎమర్జన్సీ తరువాత ప్రభుత్వ ఉద్యోగాన్ని, భార్య నలుగురు పిల్లల్ను వదిలి హోల్‌టైమర్‌గా మారింది పార్టీలో నేనొక్కడినే.

కేవలం పార్టీలో కొద్దిమందిని కాకుండా మొత్తం సమాజాన్ని మార్చడం అవసరం. సమాజం మారితేనే వీళ్లు కూడా మారతారు. పార్టీ తన అవగాహన, కార్యక్రమాల్లో తప్ప మిగతా విషయాల్లో సమాజానికి వెనుకబడి వుంటుంది. ఫెమినిజం వచ్చి ప్రపంచమంతా విస్తరించిన తరువాత సమాజం దాన్ని స్వీకరించిన తరువాత ఇక మారక తప్పదనే స్థితి వచ్చినప్పుడే వామపక్షాలు స్త్రీ సమస్య విషయంలో ఫెమినిస్టులు లేవనెత్తిన ప్రశ్నలను, పరిష్కారాలను సానుకూలంగా పరిశీలించి వీలైనన్ని స్వీకరించారు. ఇలా ఒక సెక్షన్ బలమైన వాయిస్‌తో ముందుకు వస్తే దాన్ని పట్టించుకోకుండా వుండడం సాధ్యం కాదు. ఆ సమస్యలపై, ఉద్యమాలపై ఆయా సంస్థలు, ఉద్యమాలు విస్తరిస్తూ వామపక్షాలను, పార్లమెంటరీ పార్టీలను, సామాజిక సంస్థలను మీ అభిప్రాయం తెలపాలని డిమాండ్ చేస్తాయి. అలా ఫెమినిజం ప్రశ్నించడంతో ఫెమినిజం ముందుకు తెచ్చిన అంశాలను సానుకూలంగా అంగీకరించాల్సి వచ్చింది. పార్టీలో వున్న మహిళలు కూడా పార్టీలో ఫెమినిజానికి అనుకూలంగా చర్చిస్తుంటారు.

అలాగే కుల సమస్యపై కూడా సమాజంలో జరిగే చర్చ పార్టీలోని శ్రేణుల మధ్య కూడా సాగుతుంది అని నాకు తెలుసు. అందుకని ఒక పార్టీని విమర్శించడం, దాన్ని మార్చాలని ప్రయత్నించడం కన్నా మొత్తం భావజాల రంగాన్నే చర్చించి మార్చడం అవసరం. అలా నా కార్యక్షేత్రాన్ని విస్తరించాలనుకున్నాను.

ఇలా ఆలోచిస్తూ ఒక అయిదేళ్ల తరువాత నా వైపు నీవొస్తావో, నీవైపు నేనొస్తానో తేల్చుకుందాం. ఛాలెంజ్! అంటూ సవాల్ విసిరాను. పార్టీలో చెప్పిన పని చేసుకుంటూనే వచ్చాను. 1989 రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఓడించాలని తద్వారా నిర్బంధం తగ్గుతుందని పార్టీ భావించింది. పరోక్షంగా కాంగ్రెస్

గెలవడాన్ని ఆశించింది. డా॥ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నక్సలైట్లను సగౌరవంగా బహిరంగ జీవితంలోకి ఆహ్వానిస్తున్నామని, వారికి తిరిగి ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని కొండపల్లి సీతారామయ్య ఆరోగ్యం కోసం అడవుల్లోకి వైద్య బృందాన్ని పంపిస్తామని ఇలా అనేక బహిరంగ అవకాశాలను ఇచ్చాడు. అలా వరవరరావు జైలు నుండి బయటికి వచ్చాడు. గద్దర్ రహస్య జీవితం నుండి బయటికి వచ్చాడు. నేను బహిరంగ జీవితంలోకి రావడానికి వారు ఎలాంటి కృషి చేయడం లేదు. బయటకు వచ్చాక నా భావాలను నేను ప్రచారం చేస్తానని వారికి తెలుసు. అందుకని అడవుల్లో గిరిజనుల గురించి, విప్లవ ఉద్యమం గురించి నవలలు రాస్తానన్నావు కదా అడవుల్లోకి, దళాల్లోకి వెళ్లమని ఉత్తరాలు పంపారు. ఒకవైపు బహిరంగ సభలు, అమరవీరుల స్థూపాలు నిర్మిస్తుంటే నన్ను అడవుల్లోకి వెళ్లమనడంలో ఏముందో అర్థం కాదా?

దాంతో నేను బహిరంగ జీవితంలోకి వెళ్లానుకుంటున్నాను అని ఉత్తరం రాసి పద్ధతి ప్రకారం సగౌరవంగా తిరిగి బహిరంగ జీవితంలోకి వచ్చే ఏర్పాట్లు చేయాలని కోరాను. సహృదయతతో ఆ ఏర్పాట్లన్నీ చేశారు. మూడవ ఏర్పాటులో బహిరంగ జీవితంలోకి మంథని బహిరంగ సభలో రావడం వీలైంది. ఆ తరువాత చరిత్ర అందరికీ తెలిసిందే.

రహస్య జీవితం నుండి బహిరంగ జీవితంలోకి

ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంలో 2-4-1990లో నేను రహస్య జీవితం నుండి కరీంనగర్ జిల్లా మంథనిలో జరిగిన రాడికల్స్ జిల్లా మహాసభలో బయటకు వచ్చాను. గద్దర్, వరవరరావు, గంజిరామారావు, పాటల సంధ్య, దేవులపల్లి అమర్‌లు ముసి ముసి మబ్బులనే నిద్రలేపి ఇదిగో మీ నాన్న అని మా పిల్లలకు పరిచయం చేసి యింట్లో దిగబెట్టారు.

నేను, నా కుటుంబం

తొమ్మిది సంవత్సరాలు చేసిన ప్రభుత్వ ఉద్యోగం వదిలి, ఇల్లు వదిలి విప్లవంలో చేరిన 1985 నాటికి పెద్దవాడు 7వ తరగతి, నాల్గవవాడు ఏడాది పిల్లవాడు. నాల్గవవాడు నెల పిల్లవాడుగా వున్నప్పుడు జైల్లో పడ్డాను. డా॥మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన లీగల్ అవకాశాల్లో 1989లో వరవరావు, గద్దర్, ముందుగా బహిరంగ జీవితంలోకి వచ్చారు. పార్టీలో విభేదాలతో కొనసాగిన నేను రహస్య జీవితం వదిలి ఇంటికి చేరేసరికి ఇంటి పరిస్థితి ఘోరంగా ఉంది. నిత్య

దరిద్ర్యంలో పిల్లలు కుటుంబం కునారిల్లుతున్నది. నా అవసరం కుటుంబానికి కొంత కాలమైనా ఎంతో అవసరమని భావించాను. అయినప్పటికీ శాంతియుతంగా ఉద్యమిద్దామని భావించాను.

1990 ఏప్రిల్‌లో నేను ఆరు సంవత్సరాల రహస్య జీవితం నుండి బహిరంగ జీవితంలోకి వచ్చాక సుమారు 450 మంది పూర్తి కాలం కార్యకర్తలుగా పని చేస్తామని మీరు నాయకత్వం వహించాలని కోరారు. అలా నన్ను కలిసిన వారిలో పీపుల్స్‌వార్, విమోచన పార్టీల కార్యకర్తలతో పాటు, కారంచేడు ఉద్యమం తరువాత అది ఆగిపోయిందని ఆగిపోయిన దళిత ఉద్యమాన్ని మీరే ముందుకు నడపాలని వచ్చిన కార్యకర్తలు కూడా ఎందరో ఉన్నారు.

ఆయా సంస్థల నుంచి బయటకు వచ్చిన దంపతులు ఎందరో తమ కోసం తాము పనిచేసుకొని బతకడం పట్ల అయిష్టంగా వున్నారు. సమాజం కోసం జీవితాలను అంకితం చేయాలని భావించారు. నాతో కలిసి పనిచేసిన వారు, నాతో స్ఫూర్తి పొందిన వారు ఎందరో నాపై పూర్తి విశ్వాసం ఉంచారు. వీళ్ళందరినీ శాంతియుత ఉద్యమాల నిర్మాణంలో ముందుకు నడపడం గురించి సీరియస్‌గా ఆలోచించాను. పూర్తికాలం కార్యకర్తలతో ఉద్యమం నిర్మించడం నిర్బంధాలను, విమర్శలను తట్టుకోవడమే కాకుండా ఆర్థికంగా కూడా శాంతియుత పద్ధతిలో ఫండ్స్ సేకరించాల్సిన మార్గాలు కూడా అవసరం. అందుకు అన్వేషణ ప్రారంభించాను.ఏయే రంగాల నుండి శాంతియుతంగా ఉద్యమాలు చేసేటప్పుడు ఫండ్స్ సేకరించవచ్చో అనేక కోణాల్లో రోజుల తరబడి చర్చించాను, విశ్లేషించాను.

ఉద్యమ కార్యకర్తలను పోషించడం ఎలా?

1990లో పూర్తికాలం కార్యకర్తకు కనీసం నెలకు 600 రూపాయలు అవసరం. 450 మంది కార్యకర్తలకు నెలకు 2,70,000 చొప్పున 12 నెలలకు 32,40,000 రూపాయలు అవసరం అవుతాయి. కనీసం ఏడాదికి ఇరవై అయిదు లక్షలు ఖర్చు చేస్తే తప్ప ఒక ఉద్యమంగా ముందుకు తీసుకురావడం సాధ్యం కాదని స్పష్టమైంది. కరపత్రాలకు, మీటింగ్ కర్చులకు మరికొన్ని లక్షల రూపాయలు అవసరం.

వందేళ్ళ ఉద్యమాల చరిత్రలను జాతీయోద్యమ కాలం నుండి ఆయా ఉద్యమాలకు ఫండ్‌ను ఎలా సేకరిస్తున్నారో తీవ్రంగా అధ్యయనం చేసి చూస్తే బ్యాంకులను కొల్లగొట్టడం, దోపిడీలు చేయడం, సంపన్నులైన మార్వాడీ, గుజరాతీ వ్యాపార పారిశ్రామిక వేత్తలను ఆశ్రయించడం, సారా కాంట్రాక్టర్లను, తునికిఆకు కాంట్రాక్టర్లను బెదిరించి వసూలు చేయడం మొదలైన రూపాల్లోనే పార్టీ ఫండ్

సేకరించారని, పేద ప్రజలపై ఆధారపడి ఫండ్స్ సేకరించలేదని తేలుతుంది. ఇలాంటి ఫండ్స్ సేకరణ, పాలక వర్గాల్లో ఒక సెక్షన్‌కు అనుకూలంగా మారడం లేదా నిర్బంధాలకు దారి తీయడమో జరుగుతుంది. మా గత చరిత్ర కారణంగా నిర్బంధించడం మరింత తొందరగా జరుగుతుందని తిరిగి రహస్య నిర్మాణానికి వెళ్ళడం అనివార్యమవుతుందని తద్వారా మళ్ళీ మొదటికి వస్తుందని స్పష్టమైంది.

Dalithayugam-1
03-09-09
162

రహస్య ఉద్యమాలు అవసరమా? దేనికి, ఎందుకు?

450 మందిని నిలుపుకోవడానికి చేసే ప్రయత్నం చివరకు మళ్ళీ రహస్య నిర్మాణానికి దారి తీస్తుందని అది సరియైనది కాదని ఉద్యమ నిర్మాణ ప్రయత్నాలు విరమించుకున్నాను. 1991 ఆగస్టులో చుండూరు సంఘటన జరగడంతో దళితులు, ప్రజాస్వామిక వాదులు కొందరు తిరిగి యాక్టివ్‌గా కదిలారు.

పిడిఎస్‌యు నాయకులు మారోజు వీరన్న కుల సమస్యపై తీవ్రంగా చర్చించి పార్టీ నుండి బయటకు వచ్చి సొంతంగా ఒక పార్టీని స్థాపించాడు. కుల సమస్య, స్త్రీ సమస్య వెనుకబడిన ప్రజల, ప్రాంతాల సమస్య తీసుకొని ముందుకు సాగితే రహస్య పార్టీల నిర్మాణం అవసరం లేదని వీరన్నకు వివరించాను. పార్టీ ఫండ్ కోసమే దళాల నిర్మాణం ప్రెషర్ గ్రూపుగా పని చేస్తుందని కానీ దాని వల్ల ప్రయోజనమేమీ లేదని, చేరదల్చుకున్న ప్రజలను లక్షలాదిగా కదిలించడానికి రహస్య నిర్మాణం పూర్తి అడ్డంకి అని, విప్లవోద్యమంలో 1977 - 84 తర్వాత బహిరంగ అవకాశాలు కోల్పోవడం కేవలం రహస్య నిర్మాణం కారణంగానే జరిగిందని బహిరంగ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తే అలా జరిగేది కాదని నా అనుభవాలను విశ్లేషించాను.

వీరన్న విన్నట్టే విని దళాలు తన వెంట రావడానికి సిద్ధపడడంతో తిరిగి రహస్య పార్టీ నిర్మాణానికే మొగ్గు చూపాడు. ఈ పరిణామాలన్నీ నేను ఉద్యమ నిర్మాణం చేపట్టక పోవడానికి దారి తీశాయి. నేను సామాజిక, తాత్విక, సాహిత్య భావజాల రంగాలకే పరిమితమయ్యాను. అయినా నిర్బంధం నీడలా వెన్నాడుతూ రెండుసార్లు పట్టుకు వెళ్ళి ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేసే ప్రయత్నాలను తృటిలో తప్పించుకోవడం జరిగింది.

1990 ఏప్రిల్‌లో బహిరంగ జీవితంలోకి వచ్చాక ఉద్యమాలను నిర్మించాలని ఎంతగా ఉత్సాహం ఉన్నప్పటికీ నా గత విప్లవ ఆచరణ నేను సామాజిక ఉద్యమాలను నిర్మించడానికి అడ్డంకి అయ్యింది. నిరంతరం కదలికలకు నిఘా పెరిగింది. నలుగురు వెంట లేకుండా ఎక్కడికి వెళ్ళడం మంచిది కాదని ఎప్పుడూ స్నేహితులు వెంట వుంటూ కాపాడుకుంటూ వచ్చారు. నేను రక్షణ కోసం ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ

రాష్ట్రమంతా తిరిగాను. ప్రభుత్వ ఉద్యోగంలో చేరకపోయి వుంటే ఎప్పుడు తీసుకెళ్ళి ఎన్‌కౌంటర్ పేరిట చంపేవారో, ఇతరులు చంపేవారో మూడు రకాల ముట్టడి మధ్య ప్రభుత్వ ఉద్యోగమనే రక్షణతో జీవించాను. అందువల్ల ఉద్యోగం చేస్తున్నప్పటికీ కుటుంబంపై, పిల్లలపై వారి వ్యక్తిత్వాలపై, మనస్సుపై నిర్బంధాలు వేసిన ప్రభావం వారిని నిరంతరం భయకంపితులను చేస్తూనే వుండింది. అమ్మ నా మీద బెంగతో ఆవేదనతో కొంతకాలం మతిస్థిమితం కోల్పోయింది. ఇలా గతం అనేక రూపాల్లో, వర్తమానంలో కూడా కొనసాగుతూ వెంటాడుతూ వుంది.

1984-90 నిర్బంధ కాలంలో - లేకలేక దొరికిన ఉద్యోగాన్ని, నలుగురు పసి పిల్లలను, భార్యను వదిలేసి నన్ను సాకాల్సిన సమయంలో అందరినీ వదిలి వెళ్ళాడని ఆవేదనతో, దుఃఖంతో ఏడ్చిఏడ్చి నా కోసం కలవరించి, పలవరించి మతిస్థిమితం కోల్పోయిన అమ్మ కీ.శే. మిట్టపల్లి లక్ష్మీ రాజు, మనమల అభివృద్ధిని చూడకుండానే 60వ ఏటనే 1991లో కన్ను మూశారు.

బహిరంగ జీవితంలోకి వచ్చాక పార్టీలో ఏం జరిగిందో నేను ఎవరికీ చెప్పదలుచుకోలేదు. ఎవరన్నా అడిగితే ఆరేళ్ల పాటు రోజూ టీవీ సీరియల్ చూసిన వాళ్లు ఆ సీరియల్ చూడని వాళ్లతో ఆ సీరియల్ గురించి ఎలా చర్చిస్తారు? ఏం అర్థమవుతుంది? చర్చించినా ఎలా సమానస్కందులవుతారు? నాలాగా భార్యాపిల్లలను, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి ఒక ఆరేళ్లు పార్టీలో పనిచేసి రండి. ప్రజలకు సేవ చేయండి. మీ అనుభవాలు మీకు కలుగుతాయి. నాకు కలిగిన అనుభవాలు మీకు కలగకపోవచ్చు అని చెప్పేవాణ్ణి.

గతంలో ఇది చేశాను, అది చేశాను అని గతం తాలూకు ఘనతను చెప్పుకొని వర్తమానంలో బతకదలుచుకోలేదు. వర్తమాన ఆచరణ ద్వారానే నేను ముందుకు సాగుతానని నిర్ణయించుకున్నాను. పార్టీకి చర్చ కోసం, అధ్యయనం కోసం రాసిచ్చిన డాక్యుమెంట్ల కాపీని పత్రికా వ్యాసాలకు అనువుగా సరిచేస్తూ దళిత వాయిస్ పత్రికకు పంపించాను. దళిత వాయిస్ పత్రిక నాకు వందలాది మంది కొత్త మిత్రులను సమకూర్చింది. ఆ వ్యాసాలు 'గతితర్క తత్వదర్శనం భూమిక' పుస్తకం లోనివి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రసంగించాలని ఆహ్వానించారు. చాలా చోట్లకు వెళ్ళాను. అయితే అక్కడ వున్న విరసం సభ్యులు, విప్లవ ప్రజా సంఘాలలో పనిచేసే వాళ్లు నా పట్ల అవమానకరంగా ప్రవర్తించారు. హృదయం గాయపడింది. నేను ఎందుకు పార్టీ నుండి బయటకు వచ్చానో, నా నోటి నుండి, నా అభిప్రాయాలు అడిగి తెలుసుకోలేదు. పార్టీ ద్వారా ఏం చెప్పారో తెలియదు. ఇంత యాంత్రికంగా ఉంటాయా మానవ

సంబంధాలు అని ఆశ్చర్యపోయాను. కుల సమస్యపై పార్టీ అభిమానుల్లో కొంతమందైనా నాకు సహచరులుగా మద్దతు లభిస్తుందని ఆశించాను. ఆశ నిరాశయింది. పార్టీ అభిప్రాయమే వారి అభిప్రాయంగా కలిగి వున్నారు. అప్పుడు అసలు వీళ్ల కులాలేమిటి? అని ఆరా తీశాను. జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఏ కాస్త పేరున్న వాళ్లయినా, పదవిలో వున్న వాళ్లయినా వాళ్లంతా బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, కాపు, తదితర అగ్రకులాలకు చెందిన వాళ్లే అని తెలిసి ఆశ్చర్యపోయాను. ఒకరిద్దరు మాత్రమే ఎస్సీ, బీసీలు కనిపించారు. వాళ్లు కూడా రెండవ శ్రేణి నాయకులు కావడం వల్ల తమ పై స్థాయి నాయకుల అభిప్రాయాలను వారికన్నా బలంగా వ్యక్తం చేశారు. భావ బానిసలు అని మనసులో తిట్టుకున్నాను. అలా నేను ముందుకు సాగే క్రమంలో నెల్లూరు నుండి ఇంగిలాల రామచంద్రరావు, రాజశేఖర్, హైదరాబాద్ నుండి నల్లా సూర్యప్రకాశ్, బొజ్జా తారకం, కె.జి.సత్యమూర్తి, కంచ ఐలయ్య, రామారావు, ఉ.సాంబశివరావు, నారగోని, మాష్టార్జీ, గూడ అంజయ్య, మారోజు వీరన్న, గోరటి వెంకన్న, తులసి సంపత్ కుమార్, రత్న, కత్తి పద్మారావు, నలుపు పక్షపత్రిక బృందం, విజయవాడకు చెందిన ఎమ్.చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఖాదర్ మొహియుద్దీన్, ఉషాయెస్ డానీ, తదితరులు నాకు తోడయ్యారు.

కొందరు ఎందుకో పార్టీలోని పై స్థాయి నాయకుల గురించి ఆరా తీస్తుండే వాళ్లు. ఓసారి కంచ ఐలయ్య, కొండపల్లి సీతారామయ్య గొప్ప విప్లవ కారుడు, గొప్ప వ్యూహకర్త, నిర్మాణకర్తనట కదా! మీరు దగ్గరునుంచి చూశారు కదా! ఆయనపై మీ అభిప్రాయం ఏమిటి? అని తెలుసుకో గోరాడు. ఆయన నాకు వెంట్రుకతో సమానం. ఆయన గురించి నా అభిప్రాయం దేనికి అని అన్నాను. కంచ ఐలయ్య అవాక్కయ్యాడు. ప్రపంచ విప్లవోద్యమంలో నాయకులు తల వెంట్రుకలు ఎన్ని వున్నాయో అంతమంది వున్నారని అందులో ఇతడొక వెంట్రుక అని చెప్పాను. కంచ ఐలయ్య ఈ చర్చను కొంతసాగ దీస్తే "నేను కె.జి.సత్యమూర్తి లాగా కొండపల్లి సీతారామయ్యను విమర్శించడం ద్వారా ప్రతిష్ట పెంచే విధంగా విమర్శించను. అంత పిచ్చివాన్ని కాదు. నా విమర్శ ఇలా వుంటుంది అని చెప్తుంటే ఆశ్చర్య పోయాడు. ఆ తరువాత కొద్దికాలానికే కొండపల్లి సీతారామయ్యను పీపుల్స్‌వార్ పార్టీ కేంద్ర కమిటీ నుంచి తొలగించారని, ముప్పాళ్ళ లక్ష్మణరావు కేంద్ర కమిటీ కార్యదర్శి అయ్యాడని పత్రికల ద్వారా స్పష్టమైంది. కంచ ఐలయ్యతో ఈ విషయం గుర్తు చేస్తూ ఆ రోజు నేను అన్న మాట గుర్తుందా? అని గుర్తు చేశాను. అలా ముందుగా ఎలా చెప్పగలిగారని ఆశ్చర్యపోయాడు. ఆయన ఫిలాసఫితో పాటు, ఆయన సైకాలజీని పసికట్టి తరువాత జరగబోయేదేమిటో ముందే అంచనాకు వచ్చిందని చెప్పాను.

అయితే బహిరంగంగా విప్లవ పార్టీలను, ఉద్యమాలను విమర్శించకుండా సమర్థిస్తూ మాట్లాడుతుండడం వల్ల, విప్లవ రచయితల సంఘంలో క్రియాశీలంగా కనిపించడం వల్ల కొన్నాళ్లకు పోలీసులు అర్ధరాత్రి ఇంటికి వచ్చారు. మా అమ్మ చనిపోయి పెద్ద కర్మ అయిపోయిన తరువాత మా అత్తగారి ఊరికి నిద్రకు తీసుకెళ్లారు. అందువల్ల మేము ఎవరం ఇంట్లో లేము. ఆ రోజు దొరికితే తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ పేరిట చంపెయ్యాలను అనుకున్నట్టుగా తరువాత విలేకరుల ద్వారా తెలిసింది.

ఈ సంఘటన తరువాత పార్టీ అభిప్రాయాలతో ఏకీభవించని నేను పార్టీకి సంబంధించిన నిర్బంధాలకు గురి కావడం సరైనది కాదు. పార్టీకి నాకు గల విభేదాలను ఇక నా ప్రసంగాల్లో స్పష్టం చేయక తప్పని స్థితి ఏర్పడింది. అలా పార్టీ అవగాహనపై కార్యక్రమాలపై నా అభిప్రాయాలను, విమర్శను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళాను. నా భావాలను ప్రధానం చేసి వాటిని మధ్యలో చెప్పే వాణ్ణి.

గమ్యం ఎక్కడో లేదు. గమనమే గమ్యం. గమ్యమే గమనం. సుదూర లక్ష్యాలను, ఉదాత్త ఆశయాలను పెట్టుకొని అది చేరుకోవాలని ప్రయాణిస్తుంటాము. అది చేరుకునే లోపలే అవగాహన మారుతుంది. ఆలోచన పెరుగుతుంది. అనుభవాలు కొత్త లక్ష్యాలను, మార్గాలను నిర్దేశిస్తుంటాయి. జీవితమంతా ఇలాగే సాగుతూ వుంటుంది. అందువల్ల నడకే జీవితం. జీవితమే లక్ష్యం. నా నడకే నా జీవితం. నాఅనుభవం. నా అనుభవసారం. నా జీవితమే నా సందేశం. ఈ మాట ఎమ్.కె.గాంధీ కూడా అన్నాడు. గాంధీ మాటలో నిజాయితీ ఎంత వుందో, చెప్పేదొకటి, చేసేదొకటి ఎలా వుండేదో డా॥ బి.ఆర్.అంబేద్కర్ అనేక విషయాల్లో నిర్మొహమాటంగా విశ్లేషించారు. అందువల్ల గాంధీజీకి, నాకు సంబంధం లేదు. నా జీవితమే నా ఆచరణ, నా సందేశం.

కొందరిలాగా నా జీవితం భావాలు, ఆచరణ వేరువేరు కావు. కొందరు మధ్య తరగతి జీవితాన్ని చక్కగా జీవిస్తూ కుటుంబాన్ని అదే గాడిలో అభివృద్ధి అందుకోవాలని నడిపిస్తారు. కానీ ఇతరులకు ఉద్యమాల గురించి, త్యాగాల గురించి చెపుతుంటారు. తమలాగా చదువుకొని ఎదగాలని మాత్రం వారు చెప్పరు. రాయరు. నాజీవితం అలాంటిది కాదు. తన కోసం ఒక తీరుగా, ఇతరుల కోసం మరొకతీరుగా ఆలోచించే, ఆచరించే రెండు నాల్కల ఆచరణ నా జీవితంలో లేదు. నా జీవితంలో భాగంగా నా ఆచరణ, నా భావాలు రూపుదిద్దుకుంటూ, మారుకుంటూ వచ్చాయి. అవన్నీ సామాజిక పరిణామాలు కూడా ప్రతిఫలిస్తాయి. వాటి ప్రభావాలను తెలియజేస్తాయి.

నేను మనసా, వాచా, కర్మేణ నమ్మిందే ఆచరించాను. ఆచరించిందే ఇతరులకు చెప్పాను. నా ఆచరణే నా జీవితంగా, సందేశంగా, సిద్ధాంతంగా, దృక్పథంగా

కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమాన్ని సంక్షిప్తంగానైనా తెలుసుకుంటేనే నా భావాలు, ఆచరణ రూపుదిద్దుకున్న పరిణామాలు ఒక సమగ్రతలో నిష్పాక్షికంగా అర్థం చేసుకోవడం సాధ్యపడుతుంది.

ఇదే స్థూలంగా 1964-1994 మధ్య మూడు దశాబ్దాల భావజాల జీవిత పరిణామాలు.

ఇది భావజాల పరిణామమా?

ఇది జీవిత పరిణామమా?

ఇది సామాజిక పరిణామమా?

భావజాల యుద్ధమా?

ఇది అనివార్యతా?

ప్రజల పట్ల కర్తవ్యమా? చైతన్యమా?

ఇవి అన్నీ కలిసిన జీవితమా?

భావజాల యుద్ధంలో భావజాల పరిణామం సాగింది.

ఇంతకూ నేను పార్టీని ఎందుకు వీడాను?

నా భావాలను, ఆచరణను నిరోధించే శక్తిగా మారడం వల్ల.

నేను నాయకత్వంలో వుండి నేనే నిర్మించిన సంస్థలను ఎందువల్ల వదిలేశాను?

'నిర్మాణం' - భావజాల యుద్ధానికి అడ్డంకిగా మారడం వల్ల.

ఈ విషయాలు ఇలా ఎందుకు పరిణమిస్తాయో 'వ్యక్తిత్వ వికాసం-సామాజిక న్యాయకత్వం', 'జీవితం అంటే ఏమిటి?' గ్రంథాల్లో విశ్లేషించాను.

రహస్యోద్యమం
భావాలు–అనుభవాలు

భావజాల యుద్ధమా?
భావజాల సంఘర్షణా?

Dalithayugam-1
03-09-09
165

వస్తువులోని విరుద్ధాంశాల ఘర్షణలో పరిణామం సాగుతుంది.

సమాజంలోని విరుద్ధాంశాల యుద్ధంలో సామాజిక పరిణామం సాగుతుంది.

సిద్ధాంతాలు పాతబడుతుంటాయి... ఎండిపోతుంటాయి... జీవిత వృక్షం పచ్చగా వికసిస్తూనే వుంటుంది... లెనిన్.

జీవితం కన్నా సిద్ధాంతాలేవీ ప్రధానం కాదు. సిద్ధాంతాలన్నీ జీవితానికి లోబడి వుండాలి. జీవితాలను మరింత వున్నతీకరించాలి.

జీవితానికి, భావజాలానికి మధ్య ఆచరణలో అంతరం వున్నప్పుడు జరిగితే అది భావజాల సంఘర్షణ.

భావజాలం జీవితాచరణ రెండూ ఒకటిగా కలిసి సాగుతున్నప్పుడు జరిగితే అది భావజాల యుద్ధం. అది జీవితాన్ని పణంగా పెట్టి యుద్ధం చేయడం. జీవితంతో యుద్ధం చేయడం.

భావజాల సంఘర్షణలో జీవితం, దారి జీవితానివి. భావజాలం దారి భావజాలానిది. భావాలకు మాత్రమే కమిట్‌మెంట్ వుండి జీవితాన్ని జీవిస్తుంటే అప్పుడు జరిగేది భావజాల సంఘర్షణ. భావజాలం చర్చలు ఎన్ని జరిగినా జీవితం యధావిధిగా పెద్దగా ప్రభావాలు లేకుండా సాగడం భావజాల సంఘర్షణ. అది నిజానికి భావవాద సంఘర్షణ కూడా.

భౌతికవాద దృక్పథంతో సాగే భావజాల సంఘర్షణ జీవితంలో మార్పు, పరిణామాలు ఏమీ తీసుకురాకపోతే అది భౌతికవాద దృక్పథం ఎలా అవుతుంది? అందువల్ల కాలక్షేపం లాగా భావజాల సంఘర్షణ భౌతికవాదం ద్వారా చేసినా,

భావవాదం ద్వారా చేసినా అదంతా ఆచరణతో సంబంధం లేని, ఆచరణను, జీవితాన్ని మార్చలేని భావవాదమే.

భావజాలం జీవితాచరణ రెండు ఒకటే. జీవితాచరణే భావజాలం. భావజాలమే జీవితాచరణగా నిమగ్నమైతే **'భావజాల యుద్ధం'**.

జీవితంపై ప్రభావం వేసి జీవితంలో మార్పులకు కారణమైనప్పుడు అది భావజాల యుద్ధం.

కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి పాత మిత్రులు. ఒకే పార్టీలో చాలా కాలం కలిసి పనిచేశారు. ఇద్దరిదీ కృష్ణా జిల్లాయే. వరంగల్‌లో అధ్యాపక వృత్తిలో వుంటూ సిపిఐ, సిపిఎమ్‌తో విభేదించి నక్సలైట్, శ్రీకాకుళం ఉద్యమం వలె తెలంగాణాలో ఉద్యమాలు నిర్మించాలని భావించారు. ఢిల్లీలో సాంబశివరావును కలిసి నీవు కూడా వస్తావా అని అడిగారు. అప్పటికి ఆయన కేంద్ర ప్రభుత్వంలో ఉన్నతోద్యోగం చేస్తున్నాడు. ఎంతమంది వున్నారు అని రావు అడిగాడు. కె.ఎస్. అందుకు జవాబుగా నేను, కె.జి.సత్యమూర్తి ఇద్దరం రెడీగా వున్నాం. నువ్వు కలిస్తే ముగ్గురం అవుతాము అని అన్నాడు. సరే అన్నాడు. అలా ముగ్గురు కలిసి తెలంగాణలో విప్లవోద్యమం ఎలా చేపట్టాలా అని ఆలోచిస్తూ తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన పాత మిత్రులను వెతుక్కుంటూ, కలుస్తూ వెళ్ళారు. వారిలో పెద్దగా ఆసక్తి కనబడలేదు. వరంగల్‌లో వుండడం వల్ల రీజనల్ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు, యూనివర్సిటీ విద్యార్థులు కొందరు ఆసక్తి చూపారు. వరవరరావు వంటి వాళ్లు సాహిత్య రంగంలో వుంటూ వారి లక్ష్యాలతో అంగీకరిస్తూ పనిచేయడానికి తోడయ్యారు. అలా పని చేస్తూ ఏరియాను పరిశీలించడానికి చెట్లు, గుట్టలు, నదులు, కాలువలు పట్టుకొని తిరిగారు. ఉద్యమం ఒక రూపానికి వచ్చాక కొండపల్లి సీతారామయ్య గ్రూపు అని పేరు పెట్టారు.

1969లో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల గ్రామాలను, అడవులను పరిశీలించారు. తెలంగాణ సాయుధ పోరాటం ఉధృతంగా సాగని ప్రాంతాల్లో ఉద్యమాలను ప్రారంభిద్దామనుకున్నారు. జగిత్యాల తాలూకా రంగపేట సమీపంలో గోదావరి నదిలో స్నానాలు చేస్తున్నప్పుడు పోలీసులు వీరిని చూసి అరెస్టు చేసి జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. ఆధారాలు ఏమీ లేవు. ఉద్యమాలేమీ చేయలేదు. అందువల్ల పోలీసులు వారిని వదిలివేశారు. అలా ఉద్యమించే ప్రాంతాలపై ఒక అవగాహనకు వచ్చారు. ఆదిలాబాద్ జిల్లా లక్సెట్టిపేట తాలూకాలో కోస్తాంధ్ర ప్రాంతం నుండి వలస వచ్చి పొలాలు కొనుక్కొని స్థిరపడిన వారితో సంబంధాలు పెట్టుకున్నారు.

మస్సూరు, పితాంబర్‌రావు వద్ద కొన్ని స్థలాలు కొన్నారు. కొంత గొడవ జరిగింది. భూమయ్య, కిష్టాగౌడ్‌లు హత్యకేసులో జైలు పాలయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ పేరిట విద్యార్థి సంఘాలను నిర్మించారు. అందులో పుల్లారెడ్డి గ్రూపు, కొండపల్లి సీతారామయ్య గ్రూపు కలిసి పనిచేశారు. ఏబివిపి, ఆరెస్సెస్‌కు, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్‌కు మధ్య కొట్లాటలు అవుతుండేవి. ఈ కొట్లాటలో జార్జి రెడ్డి చనిపోయాడు. చెన్నమనేని విద్యాసాగర్‌రావు దాడుల నుండి ప్రాణంతో బయటపడ్డాడు.

1974లో విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభలో పిడిఎస్‌యు, ఆర్ఎస్‌యు అంటూ విడిపోయాయి. పుల్లారెడ్డి గ్రూపుతో వున్న విద్యార్థి సంఘం పిడిఎస్‌యుగా, కొండపల్లి సీతారామయ్య గ్రూపుతో వున్న విద్యార్థి సంఘం రాడికల్ విద్యార్థి సంఘంగా పిలవబడింది. గ్రామాలకు తరలండి అనే కార్యక్రమాలను తీసుకున్నారు. గ్రామాల్లోని భూస్వాములను వర్గ శత్రువు నిర్మూలన పేరిట చంపేయాలని, గ్రామాలను విముక్తం చేసి పట్టణాలను ఆక్రమించాలని, పాత చరిత్రను అందులోని వీరులను, వ్యక్తిత్వాలను విగ్రహ విధ్వంసం చేయాలని చారు మజుందార్ నక్సలైట్ ఉద్యమ నిర్మాణంలో భావించిన వాటిని స్వీకరించారు. ఈ వ్యవస్థ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ అని భావించారు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత గ్రామీణ ప్రజలతో ఉద్యమ ప్రజాసంఘాలను నిర్మించారు. రైతు కూలి సంఘం, రాడికల్ యువజన సంఘం, రాడికల్ విద్యార్థి సంఘం, పిడిఎస్‌యు, ప్రోగ్రెసివ్ యూత్‌లీగ్ మొదలైనవి ప్రధానమైనవి. వీటి ఉద్యమాలకు మద్దతుగా విప్లవ రచయితల సంఘం, జననాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, పౌరహక్కుల సంఘం, ఉపాధ్యాయుల సంఘం మొదలైనవి ఆయా రంగాల్లో విస్తరించాయి. 1977 నుండి గ్రామాల్లో భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి గతంలో చేసిన అన్యాయాలు, గుంజుకున్న భూములు, వసూలు చేసి దండగలు, మొదలైన వాటిపై ఉద్యమించారు. సాంఘిక బహిష్కరణ విధించారు. భూస్వాములు ఇళ్లు వదిలి ఇతర ఊర్లకు పారిపోయారు.

1978 అక్టోబర్‌లో జగిత్యాల, సిరిసిల్ల, పాత తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. నిర్బంధాలు పెరిగాయి. సారా వ్యతిరేక పోరాటాలు, తునికాకు కూలి పోరాటాలు, వ్యవసాయ రంగంలో కూలీల పెంపుదల, పాలేర్ల జీతాల పెంపుదల మొదలైన పోరాటాలు ఉత్తేజంగా ముందుకు సాగాయి. దాన్నుంచి వందలాది మంది విద్యార్థులు, యువకులు, రైతు కూలీలు, విద్యావంతులు ఆయా నక్సలైట్ పార్టీలలో జీవితాలను అంకితం చేసి పనిచేసే హోల్‌టైమర్లుగా చేరారు. అలా ఎమర్జెన్సీకి ముందు కరీంనగర్ జిల్లా నుండి కోటేశ్వరరావు, వేణుగోపాల్, రాజిరెడ్డి, కల్లూరి నారాయణ, ముప్పాళ్ల లక్ష్మణరావు, ముంజె రత్నయ్య, నల్లా ఆదిరెడ్డి, శనిగరం వెంకటేశ్వర్లు (సాహూ), కనకయ్య, ఎక్కల్‌దేవి రాంకిషన్, ప్రభాకర్, నారదాసు లక్ష్మణరావు మొదలైన వాళ్లు కొండపల్లి సీతారామయ్య గ్రూపులో పార్టీ కార్యకర్తలుగా, నాయకులుగా ఎదిగారు. పుల్లారెడ్డి గ్రూపులో కూర రాజన్న, చలపతిరావు, మురళీధర్‌రాజు, కూర దేవేందర్, బడె స్వామిదాసు, చెట్టి రాజేశ్వర్ మొదలైన వాళ్లు పూర్తికాలపు కార్యకర్తలుగా, నాయకులుగా ఎదిగారు.

1982 నుండి విభిన్న శ్రేణుల నుండి, చైతన్య స్థాయిలో అనేక వ్యత్యాసాల వల్ల వచ్చిన వారి నుండి అనేక ప్రశ్నలు వచ్చాయి. వారందరినీ ఒక తాటిపైకి తీసుకురావడంలో భావజాల పరమైన, నిర్మాణ పరమైన సంఘర్షణ మొదలైంది. దీన్ని సత్యమూర్తి పరిష్కరించే క్రమంలో మరింత పెరిగింది. దాంతో అరెస్టయి జైల్లో వున్న కొండపల్లి సీతారామయ్యను హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నప్పుడు కాల్పులు జరిపి ఉద్యమంలోకి తీసుకొని వెళ్లారు. కొండపల్లి సీతారామయ్యకు, సత్యమూర్తికి మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. సత్యమూర్తి పార్టీలో కొనసాగుతున్న పెడధోరణులను పార్టీలో చర్చగా ముందుకు తీసుకొచ్చారు.

అలా మొదలైన చర్చ విస్తరిస్తు పోయింది. వరవరరావు, అప్పుడు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న కోటేశ్వరరావు బ్రాహ్మణులు కనుక పరస్పరం సహకరించుకుంటూ ముఠా కట్టారని సత్యమూర్తి చర్చకు తెచ్చారు. అలా పార్టీలో కులతత్వం, ముఠాతత్వం, అధికార దుర్వినియోగం, ఫండ్సు దుర్వినియోగం, క్రమశిక్షణా రాహిత్యం మొదలైనవి పెరిగాయని చర్చ రాష్ట్ర కమిటీ నుండి జిల్లా కమిటీల దాకా విస్తరించింది. పార్టీ సిద్ధాంతాలు, పార్టీ చరిత్ర ఎలా మొదలై, ఎలా మార్పులు, చేర్పులు జరుగుతూ ముందుకు సాగుతున్నదో తెలియడానికి 'చాకిరేవు' పేరుతో మురికి పట్టిన బట్టలు ఉతుకుడు కార్యక్రమం మొదలైంది. దీన్ని రెక్టిఫికేషన్ క్యాంపెయిన్ అని పిలిచారు. పార్టీ పుట్టిన నుండి వెలువడిన డాక్యుమెంట్లన్నిటినీ సంపుటాలుగా పునర్ముద్రించారు. ప్రజలపై ఆధారపడి ఉద్యమాలు సాగాలని కోరుకుంటూ, కేవలం కలిసి వచ్చే ఉత్సాహ వంతులైన యువకులపై, మిలిటెంట్లపై ఆధారపడి ఉద్యమాలు నిర్మిస్తున్నామని ఆత్మవిమర్శ చేసుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న కోటేశ్వరరావును పదవి నుండి తొలగించి గ్రామాల్లో ఒక కింది స్థాయి ఆర్గనైజర్‌గా పనిచేయాలని పంపించారు. నల్లా ఆదిరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఆయన హైదరాబాద్‌లోని రామ్‌నగర్‌లో అరెస్టయ్యారు. దాంతో పార్టీ లింకులన్నీ తిరిగి నెలకొల్పడానికి కోటేశ్వరరావు కొంతకాలం ఇన్‌ఛార్జి కార్యదర్శిగా పనిచేశారు. తరువాత పూర్తికాలపు కార్యదర్శిగా ముప్పాళ్ల లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

సత్యమూర్తి కేంద్ర కమిటీ కార్యదర్శిగా వుండేవారు. తాను కేంద్ర కమిటీ కార్యదర్శిగా వుండడానికి, పార్టీని అయోమయానికి గురి చేసి, చీల్చి బలహీనపర్చడానికి కుట్ర చేస్తున్నాడని అందుకోసమే కుల సమస్యను చర్చకు తెచ్చాడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ వాదించింది. కాదు నిజంగానే కుల సమస్యపై చర్చించాలని మహరాష్ట్ర కమిటీ, సత్యమూర్తి వాదించారు.

అలా కేంద్ర స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో 1984 నుండి కుల సమస్య పట్ల పార్టీలో తీవ్రంగా చర్చ మొదలైంది. ఆ చర్చలో ఒకరినొకరు కుట్రదారులని, విప్లవ వ్యతిరేకులని విమర్శించుకోవడం చాలా బాధ కలిగించింది. అంబేద్కర్ కుల సమస్యపై ఏనాడో పరిష్కారాలు సూచించాడు. ఇప్పుడు ప్రత్యేకంగా దాని గురించి పోట్లాడుకోవడం, చర్చించుకోవడం, విడిపోవడం, విప్లవద్రోహులని ముద్రలు వేసుకోవడం సరైంది కాదు అనిపించింది. నా అధ్యయనం ఈ విషయంలో ఎంతగానో ఉపయోగపడతాయని ఈ విమర్శలు తగ్గిపోయి అందరు కలిసి తిరిగి ఉద్యమిస్తారని భావించాను. కానీ ఆ పోట్లాట రెండు పంథాల మధ్య పోరాటం పేరిట కొనసాగుతునే వచ్చింది. పార్టీలో, ప్రజాసంఘాల్లో గందరగోళం ఏర్పడింది. మూడింట ఒకవంతు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఈ రెండు గ్రూపులకు దూరమయ్యారు. ఉద్యమానికే దూరమయ్యారు. ఇదంతా బాగా కలిచివేసింది. ప్రజల కోసం పనిచేసే వాళ్లం భావాల పట్ల ఇంత పోట్లాడుకోవడం దేనికి, కలిసి పనిచేయడం ముఖ్యం కదా! అనుకున్నాను. నాలాగా అనుకున్న వాళ్లు ఎందరో బయటికి వెళ్లిపోయారు. నేను ఉద్యోగం వదిలేసి పార్టీలో చేరిన వాణ్ణి. నేను అలా వెళ్లదలుచుకోలేదు.

అందుకని కులసమస్య పరిష్కారానికి నేను 1976 నుండి అంబేద్కర్‌ను అధ్యయనం చేసిన అనుభవాలను విప్లవోద్యమంలో కులసమస్య పరిష్కారానికి ఏ మేరకు ఉపయోగపడతాయో ఆలోచిస్తూ సమీక్షించుకున్నాను. అంతేకాకుండా దేశవ్యాప్తంగా జరిపిన పర్యటనలో అనేక ఉద్యమాలు, పార్టీలు ఏకరువు పెట్టిన, చర్చించిన కులసమస్య, జాతుల సమస్య, వెనుకబడిన ప్రాంతాల సమస్య, గిరిజనుల సమస్య, స్త్రీల సమస్య పరిష్కరించడం కోసం విప్లవోద్యమం దున్నే వాడికే భూమి కార్యక్రమంతో పాటు ప్రత్యేకంగా పలు కార్యక్రమాలను రూపొందించి ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం వుంటుందని భావించాను. అప్పుడే కోట్లాది ప్రజలు కదిలి వస్తారని ఆలోచిస్తూ అధ్యయనం చేశాను. ఆనాటి పర్యటన, అనుభవాలు, ఆయా పార్టీలు, ఉద్యమాలు దేశవ్యాప్తంగా ఎదుర్కొన్న సంక్షోభాలు, కుల సమస్య, జాతుల సమస్య, ప్రజాసంఘాల సమస్య గురించి వివరంగా రాస్తే అది మరో గ్రంథం అవుతుంది.

వామపక్షాలు, నక్సలైట్లు కనీసం అంబేద్కర్ రచనలైనా అధ్యయనం చేయలేకపోయారని అంబేద్కర్ ఏం చెప్పారో వివరిస్తుంటే అర్థమైంది. భూమి సమస్య ఎలా పుట్టిందో డా॥బి.ఆర్.అంబేద్కర్ విశ్లేషించిన క్రమం వీరికి తెలియదు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ సైమన్ కమిషన్‌కు సమర్పించిన రిపోర్టులో బ్రిటిష్ వాళ్ళు వచ్చాక, ఆధునిక పారిశ్రామికీకరణ జరిగే క్రమంలో భారతదేశంలోని శూద్రులు వృత్తులు కోల్పోయి వ్యవసాయం మీద పడ్డారు.

వ్యవసాయంపై అలా 1760-1810 కాలంలో పట్టణ జానాభాగా ఉన్న శూద్రులు వ్యవసాయ కూలీలుగా గ్రామాలకు తరలిపోయారని, భూమి మీద కూలీల ఒత్తిడి పెరిగి దళితుల కూలీలు కూడా పడిపోయి అందరూ అత్యంత పేదరికంలోకి మారిపోయారని లెక్కలతో సహా వివరించారు.

1840-1860 మధ్యలో ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ ప్రభుత్వం అదివరకటి మొగల్ పాలకుల వలె భూమి పన్ను కోసం కొందరిని జాగీరుదారులుగా, జమీందారులుగా నియమించడం వల్ల భూమి కేంద్రీకరణ పెరిగింది. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు 1840 నుండి రోజు రోజుకూ పేదరికంలోకి నెట్టివేయబడుతూ ఆకలి చావులకు, కరువులకు గురై కోట్లాది ప్రజలు మరణించారు. వామపక్షాలు అంబేద్కర్ ఎప్పుడో విశ్లేషించిన స్థాయికి ఇప్పటికీ చేరుకోలేకపోయారు.

లోహియా కృషి

రామ్‌మనోహర్ లోహియా బీసీలను వారి ఉత్పత్తి సామర్థ్యాల కోణంలో పట్టించుకొని, భారీ పారిశ్రామిక ఉత్పత్తి మన దేశంలో అవసరం లేదని కుటీర పరిశ్రమలు, చేతివృత్తులే దేశీయ అవసరాలను తీర్చే సామర్థ్యం కలిగి ఉన్నాయని బీసీలకోసం ఆర్థిక, సైద్ధాంతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అనేక ప్రతిపాదనలు చేశారు. కార్యక్రమాలు రూపొందించారు. లోహియా, సోషలిస్టు పార్టీ పార్లమెంటులో, శాసన సభల్లో పెద్ద ఎత్తున చర్చలు ముందుకు తెచ్చారు.

మార్క్సిస్టు వర్గ దృక్పథం ప్రకారం భిన్నమైన సెక్షన్లను ప్రత్యేక సామాజిక వర్గాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను, ముస్లింలను, క్రైస్తవులను ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని, వారిని సమీకరించడానికై ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవాలని తీవ్రమైన సైద్ధాంతిక చర్చలు జరిగాయి. కె.జి.సత్యమూర్తి విప్లవ పార్టీలో బ్రాహ్మణీయ శక్తులను ప్రశ్నించి దళితుల సమస్యను ముందుకు తెచ్చారని కొంత అనుమానం వచ్చింది. అయినప్పటికీ వాదన కోసం నేను సత్యమూర్తిలాగా ఏవో పదవులను ఆశించి కుల సమస్య చర్చ చేయడం లేదు. కుల సమస్యను చర్చించడం

కోసం చర్చిస్తున్నాను అని నా అనుభవాలను, అధ్యయనాన్ని దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు ఎదుర్కొంటున్న కుల సమస్య తీరును పర్యవసానంగా అవి స్తంభించిపోయిన తీరును వివరించాను. అయినా పార్టీ నాయకత్వం వినిపించుకోలేదు. స్వీకరించలేదు. నా అవగాహనలో పొరపాటుందన్నారు. అది పెటీబూర్జువా, లిబరల్ బూర్జువా దృక్పథం కిందికి వస్తుందన్నారు. ఇలా విమర్శించడమే తప్ప చర్చను తాత్వికంగా, సామాజికంగా, ఉద్యమ కార్యరూపకంగా ఎలా పరిష్కరించుకోవాలో చర్చించలేదు. తమ అభిప్రాయాలను బలవంతంగా పార్టీ అభిప్రాయాలుగా అందరిపై రుద్దారు. అందరు వాటిననుసరించే పనిచేయాలన్నారు. ప్రచారం చేయాలన్నారు.

అప్పుడు ఒక అనుమానం వచ్చింది. నేను ప్రభుత్వ ఉద్యోగంలో వుండి పార్టీ కోసం, ఉద్యమం కోసం పనిచేస్తున్నప్పుడు సార్, సార్ అని పిలిస్తూ గౌరవించేవారు. ఏదైనా భిన్నాభిప్రాయం వుంటే అలా కాదు ఇలా అని ఒప్పించే ప్రయత్నం చేసే వారు. ఇప్పుడేమో ఒప్పించే ప్రయత్నం చేయకుండా పార్టీ నిర్ణయం కాబట్టి అంగీకరించాల్సిందే అని దబాయిస్తున్నారు. ఇలా ఎందుకు మారింది? నేను ఉద్యోగం వదిలేసి ప్రజల కోసం పనిచేద్దామని పార్టీలోకి రావడమే పొరపాటా? పార్ట్‌టైమర్‌గా వున్నప్పుడు వుండే గౌరవం, హోల్‌టైమర్‌గా మారితే పోతుందా? కేవలం వాళ్లు చెప్పింది వినే గుమాస్తాలుగా పనిచేయాలా? అని ఆవేదనకు గురయ్యాను.

అదే విషయంపై నాయకత్వాన్ని నిలదీశాను. అప్పుడు ఎలా ప్రేమతో వున్నారు? ఇప్పుడు ఇలా కఠినంగా ఎందుకు మాట్లాడుతున్నారు? సాయిని ప్రభాకర్, నువ్వు అప్పుడు కూడా ఇలాగే మాట్లాడి వుంటే నీకోదండం, నీ పార్టీకో దండం అని దూరంగా వుంటూ సహకరించేవాడిని. ఎందుకు ఇంత నీచంగా ప్రవర్తిస్తున్నావు? ప్రేమ, ఆత్మీయత పార్టీ సభ్యుల మధ్య ఎందుకు కొరవడుతున్నది? యాంత్రికంగా పనిచేయడం కోసం అయితే ప్రభుత్వ ఉద్యోగం కూడా అలాగే వుంటుంది. పైగా అది ఎనిమిది గంటల డ్యూటీయే. ఆ తరువాత మనకిష్టమైన పనిచేసుకోవచ్చు. ఇక్కడ 24 గంటలు యాంత్రికంగా మానవ సంబంధాలను నడిపిస్తే ఎట్లా పనిచేస్తారు? వీళ్లంతా నావాళ్లు అనే భావన లేకుండా పోతే విప్లవోద్యమంలోకి ఎలా వస్తారు? వచ్చిన వారు ఎలా వుంటారు? వాపసు వెళ్ళిపోతారు కదా! అని చర్చించాను.

మీరన్నది నిజమే కానీ రాష్ట్ర కార్యదర్శినయ్యాక అలా పనిచేస్తే ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. అందువల్ల కేవలం పనిగురించి మాత్రమే మాట్లాడడానికి పరిమితమవుతున్నాను. వ్యక్తిగత అనుబంధాలు, స్నేహాలు, చర్చలు అనేక సమస్యల్ని సృష్టిస్తున్నాయి అని లక్ష్మణరావు తన అనుభవాలను వివరించాడు.

ఆ అనుభవాలు నిజమైనప్పటికీ మెకానికల్‌గా కలిసి పనిచేయడం సరైంది కాదు. మానవ సంబంధాలు మరింత మానవీయ సంబంధాలుగా ఎదగడానికి, మహోన్నత మానవీయ సంస్కృతి, నిర్మాణం కోసం మనం ఉద్యమాల్లోకి వచ్చాము. ఏదో భూమివస్తుంది, దున్నుకొని బతుకుదాము, జీతం పెరుగుతుంది, ప్రమోషన్లు పొందుదాము అనుకునే చైతన్య స్థాయి నుంచి ఈ ఉద్యమంలోకి మీరుగాని, నేను గాని రాలేదు. మీరు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదిలేసి వచ్చారు. నేను కూడా ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి వచ్చాను. పేద రైతు కూలీల నుండి గ్రామీణ రైతాంగం నుండి వస్తే మెకానికల్‌గా ప్రవర్తిస్తే కాస్త అర్థం చేసుకోవచ్చు. మనకు వ్యక్తిగతంగా అవసరాల కోసం, ఆయా ప్రజాసంఘాల డిమాండ్ల సాధన కోసం ఉద్యమాల్లోకి రాలేదు. ప్రజలే లక్ష్యంగా, గమ్యంగా మనం ఉద్యమాల్లోకి వచ్చాము. మనం మానవీయ సంస్కృతిని ఆచరించాలి అని చెప్పాను. ఆదర్శం బాగానే వుంది కాని, అది పార్టీ నిర్మాణంలో కుదరదని అనుభవం తేల్చింది అని అన్నాడు లక్ష్మణరావు. ఇలా మాట్లాడేదుంటే నేను అసలు పార్టీలోనే చేరి వుండే వాడిని కాదు అని స్పష్టం చేశాను. మీరంతా నాకు పరిచయస్తులు, స్నేహితులు వున్నారని చేరాను. ఇప్పుడు మెకానికల్‌గా మాట్లాడతానంటే మా కష్టాలు, ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలి. కష్టాల్లో పాలు పంచుకునే వాళ్లు లేకపోతే ఆ జీవితం ఏం జీవితం? అని ప్రశ్నించాను. ఆయన తన అభిప్రాయాలపైనే ఉండిపోయాడు. నేను నా అభిప్రాయాల పైనే ఉండిపోయాను. కథల్లో, నవలల్లో విప్లవకారుల గురించి ఎంతో ఆదర్శవంతంగా రాస్తే ఆచరణలో ఇలా వుంటే ఎలా అనే ఆవేదన...

ఇలా కుల సమస్యపై, ప్రజాసంఘాల నిర్మాణంపై, బహిరంగ ఉద్యమాలపై పార్టీకి ప్రజాసంఘాలకు మధ్య ఏర్పడే అభిప్రాయ భేదాలను, అనుభవాలను దేనికనువుగా పరిష్కరించాలి అనే ప్రశ్న మొదలైంది. ఇలాంటి సందర్భాల్లో పై నాయకత్వానికి కింది కార్యకర్తలకు ఉండే సంబంధాలు కలెక్టరుకు తన కింది అధికారులకు గుమాస్తాలకు ఉండే సంబంధాలా? పార్టీకి దాని ప్రజాసంఘాలకు మధ్య నిర్మాణ సంబంధాలు ఎలా ఉండాలి అనే అంశంలో పార్టీ భావజాలం ప్రజాసంఘాల మీదరుద్దడమే గానీ ప్రజాసంఘాల నాయకుల (వారూ పార్టీ సభ్యులే) అనుభవాలను పార్టీ తన కాలు తనచెయ్యి, తన జ్ఞానం యొక్క ఒక శాఖ అని గుర్తించి కలుపుకోవడం లేదు. పార్టీ వేరుగా ప్రజాసంఘాల నాయకుల అనుభవాలు వేరుగా భావిస్తున్నారు. అన్ని పార్టీల్లో ఈ సమస్య కొనసాగుతున్నది.

ప్రజాసంఘాల అనుభవాలు వారి ఫీల్డులో వారి జీవితానుభవాలు

ప్రజాసంఘాల అనుభవాలు వారి ఫీల్డులో వారి జీవితానుభవాలు. అందుకని పార్టీ నిర్మాణ సూత్రాల రీత్యా తన ఆధిక్యతను నిలబెట్టుకుంటూ తన అభిప్రాయాలను పార్టీ అభిప్రాయాలుగా భావించాలని చెప్పడంతో ఆయా అభిప్రాయాలు ఏ సామాజ్కి అనుభవాల నేపథ్యంలో రూపుదిద్దుకున్నాయో చర్చించాల్సి వచ్చింది.

అలా "నీవు వెలమ కులంలో పుట్టిన రైతువు. గ్రామంలో పుట్టావు. నేను జగిత్యాల పట్టణంలో పుట్టాను. నా తండ్రి బొంబాయి మిల్లు కార్మికుడు. నా తల్లి బీడీ కార్మికురాలు. నేను పారిశ్రామికీకరణ వల్ల వృత్తికోల్పోయిన చేనేత పద్మశాలి కులంలో పుట్టిన వాడిని. నేను, నీవు కూడా ప్రభుత్వం ఉద్యోగాలు చేసినవారిమే. నీ భావాలకు నీ కులం పునాదిగా వుండవచ్చు. నా భావాలకు నా అనుభవాలకు నా కార్మికవర్గ, శ్రామిక కులాల పునాది వుంటుంది. నా భావాలు అనుభవాలే మార్క్సిజానికి దగ్గరగా వుంటాయి. నీవు రైతువు పైగా అగ్రకులానికి చెందిన పల్లెటూరి వెలమ కులంలో పుట్టినవాడివి. నీ భావాలే, అనుభవాలే మార్క్సిజం ఎలా అవుతాయి?" అని వివరించే ప్రయత్నం చేశాను.

"నీవు ఒక మార్క్సిస్టు పార్టీకి కార్యదర్శివైనంత మాత్రాన 'ప్రపంచ మార్క్సిజానికి' కార్యదర్శివి కావు. నీ అభిప్రాయాలు పార్టీలో చర్చించి తీర్మానించిన అభిప్రాయాలు కావు. అందువల్ల మన ఇద్దరి అభిప్రాయాలు ఎవరి వర్గకుల జీవితానుభవాలననుసరించి వారికి ఏర్పడ్డ వ్యక్తిగత అభిప్రాయాలు. నేను ప్రజలకోసమే, పార్టీ కోసమే ఇవన్నీ చర్చిస్తున్నాను. పదవిలో వున్నంత మాత్రాన నీ అభిప్రాయాలు, పార్టీ అభిప్రాయాలై, నా అభిప్రాయాలు వ్యక్తిగత అభిప్రాయాలు అవుతాయా? రాతపూర్వకంగా పార్టీలో తీర్మానించేదాకా ఇద్దరివి వ్యక్తిగత అభిప్రాయాలే అవుతాయి. రాతపూర్వకంగా చర్చిద్దాం" అన్నాను. నేను రాసిచ్చాను. ఆయన రాయలేకపోయాడు. నేను రాసిన వాటిపై పార్టీ అవునని, కాదని ఏదీ రాతపూర్వకంగా రాయలేకపోయింది.

అంబేడ్కర్ గురించి చర్చిస్తే నీవు మార్క్సిజాన్ని వదిలేసినట్టే అంటూ రాయడానికి వీలుకాని అవమానకరమైన మాటలన్నాడు లక్ష్మణరావు. సరే! ఐదేళ్ళ తర్వాత నావైపు నీవొస్తావో, నీవైపు నేనొస్తానో అంటూ 1988లో తమిళనాడులోని కంచి కామాక్షి దేవాలయం ప్రాంగణంలో ఛాలెంజ్ చేశాను. 1993 నాటికి వాళ్ళు కుల సమస్యను గుర్తించామని, కుల సమస్య కోసం ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవాలని డాక్యుమెంట్లలో రాసుకున్నారు. పార్టీ నుండి బయటకు వచ్చి, పార్టీపై విజయం సాధించినట్టయింది. అలా వామపక్ష, నక్సలైట్ ఉద్యమాలు గాంధీకన్నా, అంబేడ్కర్ కన్నా డెబ్బయ్యేళ్ళు ఆలస్యంగా కుల సమస్యను పట్టించుకున్నారు.

Dalithayugam-1
03-09-09
169

1986లో మా అనుభవాలకు, పార్టీ నాయకత్వానికి గల అభిప్రాయలకు మధ్య తేడా వచ్చింది. మీ ఫీల్డులో మీ అనుభవాలు ఎంత విలువైనవో, మా ఫీల్డులో మా అనుభవాలు అంతే విలువైనవి. కనక కనీసం మా ఫీల్డులోనైనా మా అనుభవాలు భావాలు పరిగణనలోకి తీసికొని కార్యక్రమాల్ని రూపొందించుకోవాలి అని మేము కోరాము. నాతోపాటు కెవిఆర్, వివి, చెంచయ్య, బాలగోపాల్, గద్దర్, ఆకుల రాఘవయ్య, తదితరుల అనుభవాల్ని పార్టీ అంటరానివిగా చూసింది. మా అభిప్రాయాలను అనుభవసారంగా స్వీకరించకుండా లీగలిజం అంటూ పక్కకు పెట్టారు. వారి ఫీల్డులో వారి భావాలకెంత విలువ ఇస్తున్నారో మా ఫీల్డులో మా భావాలకంత ప్రాధాన్యత యిచ్చి స్వీకరించ లేదు. పార్టీలు గిడసబారి పోవడానికి ప్రజాసంఘాటు అనే ప్రధాన అంగాల జ్ఞానాన్ని, అనుభవాలను స్వీకరించకపోవడమే. కొత్త పార్టీలు కొంతకాలం దాకా ఎదగడానికి, తిరిగి అవి కూడా ఇలాగే ప్రవర్తించి గిడసబారి పోవడానికి ఈ నిర్మాణ సూత్రాలే ప్రధాన కారణం.

ఈ జ్ఞాన సమస్య పార్టీ నాయకత్వానికనువుగా పరిష్కరింప బడుతున్నది. తద్వారా పార్టీ జ్ఞాన ద్వారాలు మూసుకుపోతున్నాయి. ప్రజా సంఘాల నిర్మాణంలో ఎవరి ఫీల్డులో వారు కొత్త అనుభవాలు, కొత్త జ్ఞానం సాధించే పార్టీ శరీరంగా, హృదయంగా ఉన్నది ఆ ప్రజా సంఘాల నాయకులే. వారు పార్టీకి జ్ఞానవిద్యుత్తు ప్రసారం చేసే కండక్టర్లు. ఆ జ్ఞానాన్ని పార్టీ వెలుపలే ఉంచితే పార్టీ అవగాహనలో ఎప్పటికీ పాత జ్ఞానమే ఉంటుంది గాని కొత్త జ్ఞానం జత పడదు. పార్టీ క్రమశిక్షణలో పడి ప్రజాసంఘాల నాయకులు పనిచేస్తారు కనుక పార్టీ వెలుపల ఉద్యమించే వారిలాగా పార్టీని డిమాండ్ చేసి ఒప్పించే అవకాశం ఉండదు. పార్టీ అవగాహనకు లోబడి పనిచేయాల్సి వుంటుంది.

పార్టీ చెప్పినట్టుగానే వింటే తుపాకి ట్రిగ్గర్ నొక్కినట్టుగానే ఉంటుంది గానీ కొత్త జ్ఞానం ఆ ఫీల్డులో సాధించేదెలా? ప్రజా సంఘాలు, పార్టీ అభివృద్ధి అయ్యేది ఎలా? పార్టీకి ప్రజాసంఘాలకు అనుభవంలో, జ్ఞానంలో జరిగే ఈ ఐక్యతాపోరాటంలో పార్టీ గెలిస్తే ప్రజాసంఘాల జ్ఞానం నిరాకరించ బడ్డట్టే. ప్రజాసంఘాలు గెలిస్తే–పార్టీ కొత్త జ్ఞానం స్వీకరించినట్టే. ఇది పార్టీ జ్ఞానం, ఆచరణ సుసంపన్నం కావడానికి సంబంధించిన చర్చ. ఈ చర్చ చేస్తే పార్టీ నిర్మాణ రూపాలను ప్రశ్నించే చర్చ అని ఫీలయ్యారు. నిజమే అది పార్టీ నిర్మాణ రూపాలు ఎలా ఉండాలి అనే చర్చయే. కానడం లేదు. కాని అది రూపం మాత్రమే. దాని సారం జ్ఞానక్రమానికి, మార్క్సిస్టు జ్ఞాన శాస్త్రానికి సంబంధించినది. ఈ విషయమే నేను పార్టీ నాయకత్వానికి అర్థం చేయించే ప్రయత్నం చేశాను. అర్థం చేసికోలేదు. నేను బయటకు వచ్చాను.

బహిరంగంగా తత్వశాస్త్ర, జ్ఞానశాస్త్ర చర్చల్లో భాగంగా దీన్ని చర్చిస్తూ వస్తున్నాను.

1972లో 'ఉందర్రామాలపేట' అని వంగపండు పాట రాస్తే మాల మాదిగలు అనే పదాలుండకూడదని అభ్యంతరం పెట్టారు. ఆరోజుల్లో నన్ను ఆ ఒరవడిలో మీలాగా ప్రోత్సహించి ఉండేవారుండి ఉంటే నేను అలాంటి మరెన్ని దళిత పాటలు రాసి ఉండే వాణ్ణో. దళిత సాహిత్యం విప్లవ సాహిత్యంలో భాగంగా 1972 నుండే ఎంత గొప్పగా అభివృద్ధి చెంది ఉండేదో అని వంగపండు వాపోయాడు.

అలాగే "సిరిమల్లె చెట్టుకింద లచ్చుమ్మో" పాటరాస్తే ఇదేం విప్లవపాట, అని నిరసించి దళితుల జీవితాల్ని విభిన్న కోణాల్లో చిత్రించే కోణాల్ని, చొరవను అడ్డుకున్నారని పత్రికా ముఖంగా వాపోయాడు గద్దర్. అలాగే 'పాలు' అనే కథను 1980లో సృజనలో వేయమని కోరాను. అది మంచి కథే కాని సృజనకు (అనగా విప్లవ కథకు) పనికి రాదన్నారు. అలాగే మరికొన్ని కథలు. అంటే ఏమిటి? పార్టీ గురించి రాస్తేనే విప్లవపాట, విప్లవకథ విప్లవసాహిత్యం, ప్రజల జీవితాల గురించి పీడిత వర్గ దృక్పథంతో రాస్తే విప్లవ సాహిత్యం కాదు అనే భావన కొనసాగుతోంది అని అర్థం. అది నిర్మాణ రూపాల పేరిట సాగుతోంది.

సమాజానికన్నా కనీసం 30 ఏళ్ళ ముందుచూపుతో ఆలోచించగలిగే వాడే తత్త్వవేత్త. వేల ఏళ్ళ గత సమాజాన్ని అధ్యయనం చేయాలి. గత కాలపు తాత్విక ధోరణులను, చరిత్ర పరిణామాలను, మానవ సంబంధాలను అధ్యయనం చేయాలి. ప్రస్తుత సమాజ సమస్యలను అధ్యయనం చేయాలి. పరిష్కారాలు సూచించాలి. ముందుకు నడిపించాలి. 20 ఏళ్ళు ముందుచూపుతో సమాజానికి కార్యక్రమం ఇవ్వాలి. కృష్ణా నీటి నుండి రాయలసీమకి నీరు ఇచ్చే సమస్య గురించి, ఇచ్చంపల్లి ప్రాజెక్టు గురించి బాబా ఆమ్టే గురించి, మన్నెం పోరాటంలో మరిచిన అల్లూరి సీతారామరాజు గురించి, అమరుల గురించి రాసేటప్పుడు అంతస్తులు, వివక్ష గురించి, పెంచిన రిజర్వేషన్ల గురించి, విరసంలో రెండవ తరం నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం గురించి, టీఎమ్ఎస్ చర్చ గురించి, రెండు పంథాల మధ్య పోరాటం గురించి నాకు తోచిన విషయాలను అందరి ముందుంచడం వాటిని స్వీకరించడం ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆత్మవిశ్వాసమిచ్చింది.

రష్యా, చైనాలు మారినా మారని స్వదేశీ అగ్రకులస్తులు

1985లో సోవియట్ యూనియన్ 13 దేశాలుగా విడిపోయి సోషలిస్టు పంథాను వదిలి వేశాయి. గ్లాస్‌నాస్త్, పెరిస్త్రోయికా పేర్లతో సైద్ధాంతిక చర్చలను వేగవంతం చేసి ఓటు హక్కును, బహుళపార్టీ ప్రజా స్వామ్యాన్ని నెలకొల్పారు. వీటి నుండి చైనా

పార్టీ కొన్ని గుణపాఠాలు తీసుకొని **"కొద్ది మందిని ముందు సంపన్నం కానీయండి"** అనే నినాదంతో పెట్టుబడి దారులను, పారిశ్రామిక వేత్తలను రూపొందించే కార్యక్రమంతో ముందుకు సాగింది. ఇది జాతీయ బూర్జువాను సోషలిస్టు దేశంలో కూడా అవసరమే అనే అవగాహనతో సాగించారు. వీటిని మార్గదర్శకంగా స్వీకరించి వామపక్షాలు, నక్సలైట్లు మనదేశంలో సామాజికవర్గాల వారీగా జాతీయ పారిశ్రామిక వేత్తల అభివృద్ధి గురించి, పారిశ్రామిక అభివృద్ధి గురించి కాదుగదా కనీసం మధ్య తరగతి గురించి గానీ, చేతివృత్తులు కోల్పోతున్న పల్లెప్రజల గురించి గానీ ఎలాంటి కార్యక్రమాలు రూపొందించలేకపోయారు. ఇలా ప్రపంచ సామాజిక పరిణామాల నుండి భారతదేశంలోని వామపక్షాలు, నక్సలైట్ పార్టీలు ఏమీ నేర్చుకోలేక పోయాయి. స్వీకరించలేక పోయాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా సామాజిక శక్తులు నూతన సామాజిక పరిణామాలను అనుసరించి నూతన సైద్ధాంతిక పునాదులను వేసుకుంటూ ముందుకు సాగాయి.

నిర్బంధం విరుచుకుపడుతుంటే "జైల్‌భరో" నినాదం ఇవ్వాలని భావించాను. వేలాది మంది అరెస్టయితే ప్రభుత్వం తిండిపెట్టలేదు, అరెస్టు చేయలేదు. అయితే జైల్‌భరో కార్యక్రమం వల్ల గ్రామాల్లో మనకు తిండిపెట్టేవాళ్ళు, ఆశ్రయం యిచ్చేవాళ్ళు అందరూ శత్రువుకు తెల్సిపోతారు అని పార్టీ భావించింది. ప్రజల మీది నిర్బంధం తొలగిపోవడం కన్నా తమ తిండి, షెల్టరే ముఖ్యంగా భావించడాన్ని వ్యతిరేకించాను.

1984లో జైల్‌భరో కార్యక్రమం తీసుకొని ఉంటే వేలాదిమంది ఎన్‌కౌంటర్లలో పోయేవారు కాదు. వేలాది మానభంగాలు, లక్షలాది ప్రజల ఆస్తినష్టం, జరిగి ఉండేది కాదు. రాడికల్ విద్యార్థి యువజన సంఘాలు, రైతుకూలి సంఘాలు, బహిరంగంగా రోజురోజుకు విస్తరించి ప్రభుత్వాన్ని శాంతియుత పద్ధతుల్లోనే స్తంభింపజేసి ఉండేవారు. జైళ్ళల్లో, జైలుక్యాంపుల్లో లక్షలాది ప్రజలకు విప్లవ రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో గొప్పగా సాగి ఉండేవి.

లీగల్ సంఘాలు రహస్య నిర్మాణంలోకి వెళ్ళడం వల్ల కోట్లాది ప్రజలకు విప్లవ సందేశం, విప్లవ సంస్కృతి అందకుండా పోయింది. ముఖ్యంగా 1984-95ల మధ్య టీవీ సంస్కృతి, సామ్రాజ్యవాదుల విషసంస్కృతి ర్యాగింగ్ విజృంభించి విద్యార్థి యువజనుల్లో స్వార్థాన్ని, భోగాపేక్షను, కన్స్యూమరిజాన్ని పెంచింది. పిడియస్యూ, ఆరెస్యూ, ఆర్‌వైఎల్, సంఘాలు లీగల్ సంఘాలుగా అలాగే నిర్వహించి ఉంటే యువత పరిస్థితి ఇంత హీనంగా ఉండేది కాదు. లీగల్ ఉద్యమం యిచ్చే ఉత్తేజంతో ఏదీ సాటిరాదు. లీగల్ ఉద్యమాలవల్ల అంతర్లీనంగా సాగే ఒక గొప్ప సాంస్కృతిక విప్లవాన్ని

గత 25 ఏళ్ళుగా కోట్లాది ప్రజానీకం కోల్పోయింది.

తరానికి తరానికి మధ్య భావాలు, అవసరాలు మారతాయి. సమాజం పరిణామం చెందుతుంది. తరాల మధ్య అంతరం అంటే భావజాలాల మధ్య, సామాజిక పరిణామాల మధ్య, సంస్కృతి మధ్య అంతరమే. అది కలిసి పనిచేయడానికి గానీ, కలలు కలబోసుకోవడానికి గానీ, కష్టాల్లో సుఖాల్లో పరస్పరం కలిసి పరిష్కరించుకోవడానికి గానీ అడ్డంకి కాదు. ఉమ్మడి కుటుంబాలు విడిపోయి చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. అయినా మానవ సంబంధాలు, బంధుత్వాలు కొనసాగుతూనే ఉన్నాయి. గణాలు, తెగలు, కులాలు ఏక రక్త సంబంధీకులే. ఒకే కుటుంబం వంటివే. అవి అదృశ్యమై కుటుంబాలుగా మారినప్పటికీ మానవ సంబంధాలు, బంధుత్వాలు కలిసి జీవించడం కొనసాగుతూనే ఉన్నాయి. కలిసి జీవించడానికి అనువుగా కొత్త నిర్మాణాలను, సందర్భాలను రూపొందించుకుంటూనే ఉన్నారు. మానవాళి దీన్ని పరిష్కరించుకుంటూ రావడంలోనే సమాజ పరిణామం జరుగుతూ వస్తున్నది. ప్రముఖ చారిత్రక పరిశోధకుడు గార్డెన్ చైల్డ్, ఈ విషయాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు.

శిథిలమవుతున్న కుటీర పరిశ్రమలకు, కులవృత్తులకు ప్రత్యామ్నాయ జీవన మార్గాలను, పెట్టుబడిదారీ పారిశ్రామిక ఉత్పత్తి విధానం కాకుండా అందరికీ పని కల్పించే “దేశీయ ఉత్పత్తి విధానం” రెండు వందల ఏళ్ళయినా చూపగలిగామా! కుల వృత్తులు మనుధర్మ, బ్రాహ్మణీయ కుల వ్యవస్థఅని, అది బానిస, ఫ్యూడల్ ఉత్పత్తి విధానమని దాన్ని తొలగించి కొత్త ఉత్పత్తి విధానం తెచ్చామా?

దున్నేవానికే భూమి బీసీలకు ఏ మేరకు పనికొస్తుంది? అదైనా దున్నుకొని బతకాలనుకునే వారికి ఎప్పుడిస్తారు? విప్లవం వచ్చాక ఇస్తారు. అంతదాకా భూమ్మీద చట్టబద్ధమైన హక్కు కోసం ఉద్యమించరు. అందువల్ల దున్నే వాడికే భూమి అనే నినాదం కూడా ఉత్తదే. అది తక్షణ పరిష్కారానికి సంబంధించింది కాదు. కేవలం ప్రచార నినాదమే తప్ప సమస్య పరిష్కార నినాదం కాదు.

దేశంలో 55 కోట్లమంది బీసీలు భూమి దున్ని బతకాలనుకోవడం లేదు. కులవృత్తులు చేయాలను కోవడంలేదు. మంచి చదువులు చదివి మంచి ఉద్యోగాలు, మంచి వృత్తులు చేయాలని కోరుకుంటున్నారు. జీవన భద్రత ఉండాలని కోరుకుంటున్నారు. వీరి గురించి విప్లవోద్యమంలో కార్యక్రమం ఏది? దున్నే వారికే భూమి అని భూమి దున్నుకునే బ్రతకాలని కోరడమంటే ఆయా బీసీలు, ఎస్సీలు కులవృత్తులను చేసుకొంటూ బ్రతకాలని కోరడమే. కులవ్యవస్థ తాలూకు ఉత్పత్తి సంబంధాలను మళ్ళీ స్థిరీకరించడమే.

ఆధునిక అభివృద్ధిలో ఎదగడానికి విద్య తప్పనిసరి. ఆధునిక విద్య లేకుండా ఆధునిక అభివృద్ధిని అందుకోవడం అసాధ్యం. ఆధునిక సమాజంగా ఆయా సామాజిక వర్గాలు, ప్రాంతాలు, జాతులు, కులాలు, దేశాలు ఎదగడం అసాధ్యం. పారిశ్రామిక అభివృద్ధిపై, పెట్టుబడిపై, ద్రవ్య వినియోగంపై, మార్కెటింగ్ వ్యవస్థపై, బడ్జెట్ రూపకల్పనపై, ప్రణాళికా సంఘాల రూపకల్పనపై అధ్యయనం చేయడం అన్ని రంగాల్లో యాజమాన్యం పరిపాలన నిర్వహించడం అంతకన్నా అసాధ్యం. ఆధునిక విద్య అందుకోకపోతే వ్యవసాయ సమాజంలోని, భూసామ్య సంస్కృతిలో, జీవన విధానంలో కుల వ్యవస్థలో నిర్ణయించబడిన కులవృత్తుల్లో జీవించాల్సి వస్తుంది. మార్క్సిజం పుట్టిందే పారిశ్రామిక విప్లవం తరువాత పెట్టుబడిదారీ పారిశ్రామిక ఆధునిక సమాజాల విద్య, అభివృద్ధి తరువాత ఎదగాల్సిన మరింత ఉన్నతమైన నూతన సమాజం నిర్మాణం అవసరమని దృష్టి నుంచి.

అందువల్ల అలాంటి ఉన్నత విద్య, సాంకేతిక, శాస్త్రీయ రంగాలలో ఎదగాలని కులవృత్తులు, సాంప్రదాయ వృత్తులు వదిలేసి నూతన రంగాలలో ఎదగాలనే అవగాహన, కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. రైతు కూలీలు, అలాగే కూలీలుగా ఉండకుండా ఎదగాలి. వారి పిల్లలు అత్యున్నత విద్యను అందుకోవాలి. కులవృత్తులు వదిలివెయ్యాలి. ఆదునిక వృత్తుల్లో అత్యున్నతంగా ఎదగాలి. జిల్లా పరిషత్, స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తూ కరపత్రం వేస్తే జిల్లా పరిషత్ వారి అభివృద్ధి ప్రణాళిక కన్నా ఉన్నతంగా అయిదు సంవత్సరాల ప్రణాళికను రూపొందించి చెప్పగలగాలి. అది నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమంగా కూడా ఉండాలి. ‘వ్యవసాయ విప్లవం’ పుస్తకంలోని కార్యక్రమాలను వర్తమానంలో అన్వయిస్తూ స్థానిక సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించినా, పోటీ చేసినా ఆ గ్రామాన్ని ఐదేళ్లలో నూతన ప్రజాస్వామిక విప్లవ దృక్పథంతో ఎలా అభివృద్ధి పరుస్తామో చెప్పగలగాలి. ఇలా నూతన ప్రజాస్వామ్య విప్లవం వర్తమాన సమాజాన్ని, వాటి అవసరాలను, అభివృద్ధిని కూడా పట్టించుకొని విశ్లేషించాలి. పాలకవర్గాల కన్నా ఎక్కువ అభివృద్ధిని ప్రజలకు అందించాలి. పాలకవర్గాల నాయకత్వంలో చెందే అభివృద్ధి కన్నా ఎక్కువ అభివృద్ధిని ప్రజలు విప్లవ పార్టీల నాయకత్వంలో పొందాలి. ఇలాంటి కార్యక్రమాలను పార్టీలు తీసుకోలేవు.

అందువల్ల భూస్వామ్య వ్యవస్థలోని, కులవ్యవస్థలోని అట్టడుగు స్థాయి వృత్తులకు, జీవన ప్రమాణాలకు ప్రజలు పరిమితం కావాలని ఆ మేరకు ఎదగడాన్ని మాత్రమే వ్యవసాయ విప్లవం, నూతన ప్రజాస్వామ్యక విప్లవం, కార్యక్రమాలు, నినాదాలు ప్రతిపాదించాయి. పైగా ఇది అశాస్త్రీయ విద్యా విధానమని దశాబ్దాల తరబడి ప్రచారం

చేసి ఆధునిక విద్య అందుకోకుండా చేశారు. ఆధునిక విద్యను వ్యతిరేకించడం ద్వారా ఆధునిక అభివృద్ధి అందుకోడాన్ని నిరోధించారు. ఇలా సమాజంలో వస్తున్న సాంకేతిక, సైన్స్, విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఆధునిక అత్యున్నత అవకాశాలను అందుకోవడం ఎలాగో చెప్పకుండా పైగా వాటిని వ్యతిరేకిస్తూ వచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 1920ల నుండి ఆధునిక అభివృద్ధిలో అన్ని సామాజిక వర్గాలు ఎదగాలని తమ వంతు వాటా అందుకోవాలని, వ్యవసాయంపై ఉన్న మనుషుల వత్తిడిని తగ్గించాలని కోరారు. సాధించారు.

పలువురు ముస్లిములు కూడా భూమి దున్నుకుని బతకాలనుకోవడంలేదు. వారిలో పై స్థాయిలో వున్న వారు మేము పాలకులం అనే భావనతో వుంటారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు ఫ్యూడల్ అవశేషాలైన కులవృత్తులు వదిలి విముక్తం కావాలనుకున్నారు. రాజకీయ అధికారం అందుకోవాలనుకుంటున్నారు. లారీ ట్రాన్స్‌పోర్టు ద్వారా ముస్లింలు, దళితులు, బీసీలు లక్షలాది మంది డ్రైవర్లుగా, క్లీనర్లుగా, మెకానిక్‌లుగా మాత్రమే పనిచేస్తున్నారు. వర్తమాన అభివృద్ధిలో, అధికారంలో, ఉద్యోగాల్లో తమ వంతు తమకు దక్కాలంటున్నారు.

ఇందుకు విప్లవోద్యమం, మార్క్సిస్టులు ఇస్తున్న కార్యక్రమాలేమిటి? సహకారమేమిటి? నిజానికి ఈ ప్రశ్న బీసీ, ఎస్సీ. ఎస్టీలు, మైనార్టీలు ఒక సంఘటిత శక్తిగా ఈ ప్రశ్నతో ఉద్యమాలు నిర్మించకముందే విప్లవ నాయకత్వం ముందుండి తానే ఈ ఉద్యమాలను నడిపించాల్సి ఉండింది.

ఎక్కడ చూసినా కుల సమస్యపై స్తంభనకుగురైన విప్లవ ఉద్యమం... "మీరక్కడ కులసమస్యను ఎలాపరిష్కరిస్తున్నారు." అని ప్రశ్నించడం నన్ను ఆలోచింపజేసింది. పార్టీలో అప్పటికే అంతర్గత చర్చ సాగుతున్న నేపథ్యంలో సరికొత్త దృష్టితో సరికొత్త అధ్యయనం అవసరం. నా లాంటి వాళ్లు, బీసీ, ఎస్సీలు పార్టీ అధినాయకత్వంలో వుంటే ఇదే పార్టీ పంథా అయి ఉండేది.

నేను చాలా దూరం ప్రయాణం చేశాక దేశమంతా కులం గురించి చర్చించే క్రమంలో పార్టీ కూడా కుల సమస్యని గుర్తించినట్టు ప్రకటించుకుంది. కానీ ఆచరణ కార్యక్రమాలు తీసుకోలేక పోయింది. కుల సమస్య, స్త్రీ సమస్య, బీసీల సమస్య, ఆధునిక అభివృద్ధిని అందుకునే సమస్య, రాజకీయ అధికారంలో వాటా పొందే సమస్య ఆయా సామాజిక వర్గాల సాధికారికత మొదలైనవి విప్లవం విజయవంతమయ్యేదాక నిర్బంధాలులేని బహిరంగ అవకాశాలు నిరంతరం ఉండే అవకాశాలున్న కార్యక్షేత్రాలు. దృష్టితో పార్టీకోసం, పార్టీలో భాగంగా ఆలోచించాను.

భారత దేశంలో పేదరికాన్ని ఎలా నిర్మూలించవచ్చో పదేళ్ళలో ప్రపంచంలోని ఒక సంపన్న దేశంగా భారతదేశాన్ని ఎలా మార్చవచ్చో "భారతీయసమాజం – నేటి రాజకీయ సమాజ పరిణామాలు", "బి.సి.లు ఏం చేయాలి?" "సామాజిక అర్థశాస్త్రం" గ్రంథాల్లో చూడవచ్చు.

జాతుల సమస్యపై 1980 నుండి సెమినార్‌లు, చర్చలు సాగుతున్నాయి. సత్యమూర్తి మహారాష్ట్ర పార్టీ వేరయిపోయింది. ఆంధ్రప్రదేశ్ పార్టీ కొండపల్లి సీతారామయ్య వెంట వుంది. పార్టీ చీలికలకు సిద్ధాంతాలు ప్రాతిపదిక అయ్యాయి. అయితే చీలిపోయిన తర్వాత ఇద్దరూ ఒకే రకంగా ఆలోచించారు. రెండు ప్రపంచాలే వున్నాయనే దాన్ని ఆచరించారు. మూడు ప్రపంచాల సిద్ధాంతం యుద్ధం వస్తే అంతర్యుద్ధంగా మార్చండి అని ఇరాక్ సద్దాం హుస్సేన్‌పై విరుకుపడింది. కానీ కాలక్రమంలో అమెరికాను వ్యతిరేకించే పేరుతో సద్దాం హుస్సేన్‌ను సమర్థించారు.

అవయవి అవయవ అనే సిద్ధాంతం పదాలు కొత్తవి కాని భావం పాతదే. ఇండివిడ్యూవల్, పర్టిక్యులర్, యూనివర్సల్ అనే చర్చను త్రిపురనేని అవయవి, అవయవగా మార్చాడు. ఇండివిడ్యూవల్, పర్టిక్యులర్, యూనివర్సల్ అనే చర్చ బౌద్ధం కాలం నుండి ప్లేటో, అరిస్టాటిల్ కాలం నుండి కొనసాగుతున్నది. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావో కూడా తమకు తోచిన విధంగా వీటిని నిర్వచించారు, విశ్లేషించారు.

అయితే కొత్త పదాలు కావడం వల్ల పార్టీ త్రిపురనేని ప్రతిపాదనను తిరస్కరించింది. ఐక్యతా, ఘర్షణ, వైరుధ్యంలో రెండు అంశాలు, పర్టిక్యులర్, యూనివర్సల్ అనే చర్చను 2500 ఏళ్ళ నుంచి కొనసాగుతున్నాయి. ప్లేటో యూనివర్సల్, పర్టిక్యులర్ చర్చలో యూనివర్సలే ముఖ్యమన్నాడు. అతని శిష్యుడు అరిస్టాటిల్ పర్టిక్యులరే ముఖ్యమన్నాడు. బుద్ధిస్టు తార్కికులు పర్టిక్యులరే ముఖ్యమన్నారు. న్యాయ వైశేషిక దర్శనాలు కూడా పర్టిక్యులర్ ముఖ్యమన్నాయి. ఒక సార్వజనీన లక్షణాలను చెట్టుత్వం అని సాధారణీకరిస్తారు. అంతేగానీ చెట్టు అనేది ఎక్కడా వుండదు. అది వేపచెట్టు, మామిడి చెట్టు, రాగిచెట్టు మొదలైన పర్టిక్యులర్ రూపాల్లోనే వుంటుంది. ఇది అరిస్టాటిల్ నుండి బుద్ధిస్టు తార్కికులు, మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావోలు అందరూ అంగీకరించారు. అలా కులం ఒక పర్టిక్యులర్ అంశం ఐనప్పటికీ దాన్ని సార్వజనీన స్థాయిలో చర్చించాలని ప్రతిపాదించారు.

కులం ఉత్పత్తి సంబంధాలను, ఉత్పత్తి శక్తులను, వర్గాలను ఉత్పత్తి చేస్తున్నదని, నిర్ణయిస్తున్నదని, వర్గాలను కంటున్న కన్నతల్లి కులవ్యవస్థ అని అర్థమయ్యాక అన్ని వ్యవస్థల్లో, పార్టీల్లో, ఉద్యోగాల్లో చివరకు విప్లవ పార్టీల్లో కూడా వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ

తాలూకు నిచ్చెనమెట్ల ప్రకారమే అధికారంలోకి కొన్ని కులాలే రావడం ఎందుకు జరగుతున్నదో స్పష్టమైంది. దీన్ని తలకిందులు చేసే నిర్మాణాలని, పని పద్ధతులను, ప్రమోషన్ పద్ధతులను ప్రత్యేకంగా రూపొందించాలని అర్థమయ్యింది. కానీ, ఆధిక్యతను, అధికారాన్ని స్వచ్ఛందంగా ఎవరు వదులుకుంటారు?

అందువల్ల వారి అధికారాన్ని వదిలించుకునే రూపాలు, కార్యక్రమాలు, భావజాలాలు, అనివార్యమయ్యాయి. తుపాకి ఎవరిచేతుల్లో ఉందనేది దాని ఉపయోగాన్ని నిర్ణయిస్తుంది. పోలీసుల చేతుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వాలకు ఉపయోగపడుతుంది. విప్లవ కారుల చేతిలో ఉన్నప్పుడు విప్లవానికి ఉపయోగ పడుతుంది. మార్క్సిజంగాని, హిందూమతతత్వ భావజాలంగాని, గాంధీయిజంగాని, మరోయిజంగాని, అధికారంగాని అది ఎవరి చేతిలో ఉంది అనేది ముఖ్యం. అవి కొన్ని దోపిడి కులాల చేతుల్లో ఆయుధాలుగా మెజారిటీ ప్రజలకు వ్యతిరేకంగా ఉపయోగిస్తూ ఉంటే వాటిని నిర్వీర్యం చేయడం, వ్యతిరేకించడమే కర్తవ్యమవుతుంది. భావజాలచర్చ కూడా వర్తమానం ఆచరణ అనుసరించే నిర్దిష్ట రూపాలను సంతరించుకుంటుంది.

పర్యవసానంగా భారతదేశంలో మార్క్సిజంపై నాలాంటి వాళ్లు సాగించే చర్చ ప్రధానంగా దాన్ని ఆయుధంగా మార్చుకున్న వారిపై జరిగే చర్చ. ఈ విషయం అర్థమయినపుడు చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. భిన్నాభిప్రాయాలు కలవారు కలసి పనిచేయడం సులువవుతుంది. కలిసిపనిచేసే ఆచరణను అడ్డగించే ఏ భావజాలాన్నైనా వదులుకోవాల్సిందే. రష్యాలో, చైనాలో విప్లవాలు 35 ఏళ్ళకు విజయవంతమయ్యాయి. మనదేశంలో విజయవంతం కాకపోవడానికి ఇలాంటి కారణాలు ఎన్నో! ఇందులో కులం ప్రధానమైనది. ఎవరికి మౌలిక మార్పులు అవసరమో వారి చేతుల్లో నాయకత్వం లేకపోవడం అందులో ముఖ్యమైనది. అందువల్ల ఆచరణల్లో, అవగాహనల్లో, నాయకత్వంలో, కార్యక్రమాల్లో ప్రాధాన్యతల్లో ఎన్నో మార్పుచేర్పులు చేసుకోవాల్సి ఉంటుంది.

కులం, ప్రాంతీయ అసమానతలు, నీటి సమస్య, భాషా సమస్య, "అభివృద్ధి సమస్య", అధికార సమస్య విప్లవం విజయవంతమయ్యేదాకా దోపిడీ వర్గాలకు, దోపిడి కులాలకు వదిలేయడం, రిజర్వు చేయడం, పోటీకి వెళ్ళకుండా ఎన్నికలను బహిష్కరిచడం అనేవి దోపిడీ వర్గాల, దోపిడీ కులాల సంపదను, అధికారాన్ని వర్గస్వభావాన్ని మరింత బలోపేతం చేయడానికే అని జీవితం స్పష్టం చేసింది.

లెనిన్ కూడా "రాజ్యం–విప్లవం" అనే గ్రంథంలో విప్లవం వచ్చాక ఇప్పుడున్న ఉపాధ్యాయులను, ఉద్యోగులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని, విప్లవ లక్ష్యాల కనుకూలంగా శిక్షణ ఇచ్చి వాడుకుంటాము అని అన్నారు. అది నన్ను బాగా ఆలోచింపజేసింది. హర్ట్ చేసింది. విప్లవం వచ్చిన తర్వాత కూడా వాళ్ళే ఉండేదైతే ఇప్పుడున్న అవకాశాలు వదులుకోవడం దేనికి? విద్యను, ఎన్నికలను బహిష్కరిస్తూ ఆధునిక విద్యను, ఉద్యోగాలను, అభివృద్ధిని, రాజకీయ అధికారాన్ని అందుకోవడాన్ని వాయిదా వేయడం దేనికి? మనం పోటీపడకుండా పాలకవర్గాలకు అధికారం, సంపద, పరిశ్రమలు, అన్నీ రిజర్వు చేసిపెట్టడం దేనికి? ఇప్పటినుంచే ఆ యా రంగాల్లో పోటీ పడి, రిజర్వేషన్లు సాధించి మనమే చేరడం ఎంతో అవసరం అని భావించాను.

నెహ్రూ కూడా స్వాతంత్ర్యం అనంతరం ఇలాగే పాత ప్రభుత్వ యంత్రాంగాన్ని కొనసాగించారు. అందువల్ల ఆధునిక విద్య, ఆధునిక అభివృద్ధిలో వాటా పొందిన మేరకే విప్లవానంతరం కూడా ఉద్యోగాలు, అధికారం అందుబాటులోకి వస్తుందనిపించింది. ఈ దశలో డా॥ బి.ఆర్.అంబేద్కర్ రిజర్వేషన్ల ద్వారా సాధించిన సామాజిక అభివృద్ధిలో, అధికారంలో వాటా అనే సామాజిక న్యాయదృష్టి లెనిన్ 'రాజ్యం విప్లవం' చదివిన తర్వాత కొత్త అర్థంలో కొత్తగా అర్థం కాసాగింది.

వర్తమాన, నిర్దిష్ట, పర్టికులర్ వైరుధ్యాల పరిష్కారాలను ప్రధాన వైరుధ్య పరిష్కారం కోసం వాయిదా వేయకూడదని, నిజానికి ఆ యా నిర్దిష్ట, పర్టికులర్ వర్తమాన వైరుధ్యాల పరిష్కారాల రూపంలోనే ప్రధాన వైరుధ్య పరిష్కారం కోసం ప్రజలు కదులుతున్నారని అవగాహనకు వచ్చాను. ఉదా॥కు విద్యార్థుల సమస్యలను తీసుకుని ఉద్యమించడం, సారా సమస్యను, తునికాకు కూలి సమస్యను, ఉద్యోగుల జీతాల సమస్యను తీసుకుని ఉద్యమించడం తద్వారా వారి చైతన్యాన్ని పెంపొందించడం అనే క్రమమంతా దీన్నే స్పష్టం చేస్తుంది.

వీటిలాగే కుల సమస్యను, కుల వ్యవస్థను, స్త్రీ సమస్యను కూడా ఆ యా సెక్షన్లను, శ్రేణులను, వర్గాలను ఆర్గనైజ్ చేయడానికి స్వీకరించి పోరాట రూపాలను, కార్యక్రమాలను తీసుకోవడం అవసరమని భావించాను. బీసీ, ఎస్సీ, ఎస్టీల్లోంచి ఎదిగి అన్ని రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం అభివృద్ధిని, అధికారాన్ని, విద్యను, సంపదను కైవసం చేసుకోవాలి. అశాస్త్రీయ విద్యా విధానం అని దీన్ని వదిలివేయకూడదు. పైగా స్వంతం చేసుకుని ఎదగాలి. అలా రెక్కలు తప్ప ఆస్తులు లేని ఈ దళిత బహుజనుల నుండి జాతీయ బూర్జువాలు, ప్రాంతీయ బూర్జువాలు, పెటీ బూర్జువాలు, మధ్యతరగతి, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ

నాయకులు ఎదగాలి. అప్పుడే లెనిన్ 'రాజ్యం-విప్లవం' పుస్తకంలో పేర్కొన్నట్టు విప్లవం వచ్చాక వీరందరినీ ప్రత్యేక శిక్షణతో ప్రజానుకూలంగా మార్చుకోవడం సాధ్యపడుతుంది.

ప్రధాన పోరాట స్రవంతికి మిగతా వైరుధ్యాలు అడ్డంకి కానవసరంలేదు. ఆ వైరుధ్యాలను వైవిధ్యాలుగా భిన్నత్వంలో ఏకత్వంగా, ఏకత్వంలో భిన్నత్వంగా సమన్వయించుకొని సమిష్టి కృషి చేసినప్పుడు సంఘటిత శక్తి పెరుగుతుంది.

కులాల మధ్య పెళ్లి ఆదర్శాన్ని 1984లో ప్రతిపాదించాను. కాని అది ఉద్యమంలో విప్లవిస్తున్న ప్రజల్లో ప్రధాన స్రవంతి కాలేకపోయింది. కులాల వారీగానే పెళ్లిళ్ళు జరుగుతున్నాయి. ఇలా ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఆచరణ ముందుకు సాగలేకపోయింది. కులాల మధ్య పెళ్లిళ్ళు కార్యకర్తలకు, నాయకులకే పరిమితమయింది.

లక్షలాది విద్యార్థి యువజనులు స్వార్థరహితంగా సమాజం కోసం పాటుపడే వారిగా మనం తీర్చిదిద్దగలిగే లీగల్ అవకాశాలస్థాయికి అనువుగా వ్యూహం, ఎత్తుగడల్ని నిర్ణయించుకుంటే యువత ఒక మహోన్నత సామాజిక శక్తిగా ఎదిగి ఉండేది. 1977-1983 నాటి లీగల్ కాలమే వాటి చరిత్రలోని మహోజ్వల ఘట్టాలు. సరిగా అలాంటి అవకాశాల్ని దశాబ్దాలుగా పోగొడ్తున్నది ఆయా పార్టీల వ్యూహం ఎత్తుగడలే. లక్షలాది విద్యార్థి యువజనుల భవిష్యత్తు తీర్చిదిద్దాల్సిన కర్తవ్యాల్ని పార్టీలు రహస్య నిర్మాణాల పేరిట వదిలేసాయి.

కొండపల్లి సీతారామయ్య, చంద్ర పుల్లారెడ్డి విప్లవ పార్టీలను రహస్య నిర్మాణాల్లోకి కుదించడం అనేది పార్టీ సభ్యుల మధ్య, ప్రజాసంఘాల మధ్య కమ్యూనికేషన్ తెంపడం కోసమేనా అనే అనుమానం వచ్చింది. ఎందుకంటే బహిరంగంగా వుంటే అందరూ చర్చిస్తారు. రహస్యంగా వుంటే విడివిడిగా చర్చించి అందరూ ఒప్పుకున్నారు మీరొక్కరే మిగిలిపోయారు అనే పద్ధతిలో చర్చిస్తారు. ఇతరులతో కలవనీయరు. కలిస్తే పార్టీ నిర్మాణ సూత్రాలకు విరుద్ధంగా కలుస్తున్నారని క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు. ఏమైనప్పటికీ తన నాయకత్వం నిలవాలనే స్వార్థపూరిత ఆలోచనాల్తో రెండు పంథాల పోరాటం పేరుతో చేసిన గయ్యాళి అత్తల పట్టుదల కారణంగా ఎన్నో వందల మంది సిన్సియర్ విప్లవకారులు విప్లవం నుండి తప్పుకున్నారు. మరెన్నో వేల మంది విప్లవం దాకా రాకుండా దూరమయ్యారు.

అగ్రనాయకుల ముఠాతగాదాల కోసమా మేము లక్షలాది ప్రజల్ని విప్లవోత్తేజంతో విప్లవోన్ముఖం చేసింది! విప్లవోత్తేజంతో ముందుకురికే యువతరం త్యాగాలు అగ్రనాయకత్వ ముఠాతగవులకు పెట్టుబడిగా మారాలా?

లీగల్ నిర్మాణాలకు ప్రాధాన్యతను, ఆవశ్యకతను ముందుకుతెస్తూ పర్టిక్యులర్ యూనివర్సల్, ప్రధాన వైరుధ్యం అప్రధాన వైరుధ్యాలకు మధ్యగల సంబంధం, అప్రధాన వైరుధ్యాల పరిష్కారంలో బాగంగానే ప్రధానవైరుధ్యం పరిష్కరించబడుతుందని యూనివర్సల్ అనేది అనేక పర్టికులర్‌ల యొక్క అవగాహనే తప్ప దాని పట్ల ఆచరణ కాదని సిద్ధాంత పోరాటాల్ని ముందుకు తీసుకు వెళ్ళాము. తద్వారా ఆయా విప్లవోద్యమాలు తమ దృక్పథాల్ని మరింత సమగ్రం చేసికొనే చేసికొనే ఆవశ్యకత ఏర్పడుతుంది. దళిత, స్త్రీవాద దృక్పథాల్ని తమలోకి తీసుకోవడం వల్ల ఈ రెండూ విప్లవం విజయవంతమయ్యేదాకా నిరంతరం లీగల్ అవకాశాల రంగాలుగా ఉంటాయి. పీడితవర్గ దృక్పథానికి దళితవాదం, స్త్రీవాదంతోడై జాతుల సమస్యతోపాటుగా, కలుపుకుని సమాజంలోని అన్ని రకాల అన్యాయాలు అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించిననాడు నిర్బంధాలు తగ్గిపోతాయి.

స్వాతంత్ర్యం వచ్చాక అధికారం అందుకున్నవాళ్లపై కింది కులాల వాళ్ళు పెట్టుకున్న ఆశలు క్రమక్రమంగా మొత్తంగా నీరుకారిపోయాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీలు దాంతో విప్లవోద్యమం వైపు ఆకర్షితులయ్యారు. విప్లవం సఫలం అయితే తమ జీవితాలు బాగుపడతాయని ఆశించారు. ఆ ఆశే విప్లవోద్యమంలో నన్ను ముందుకు నడిపించింది.

ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పరిణామాలపై, సిద్ధాంతాలపై పార్టీ వద్ద సమాధానాలు లేవు. కొత్తవి చేర్చుకోవడానికి వెనకా ముందు అవుతున్నారు. ఫెమినిజం అసంఘటితంగా ఉండడం వల్ల స్త్రీవాదం లేవనెత్తిన అంశాలను తీసుకొని పార్టీలో అవగాహన పెంచాలని కొన్ని కార్యక్రమాలు తీసుకోవాలని పార్టీ భావించింది. అందుకు మహరాష్ట్ర నుండి బొంబాయి, నాగపూర్, అర్బన్ మేధావుల నుండి పార్టీలోకి వచ్చిన స్త్రీలు ముఖ్యంగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలైన కీ.శే. అనురాధా గాంధీ చొరవతో స్త్రీ సమస్య, దళిత సమస్య పార్టీలో చర్చకు వచ్చాయి.

విప్లవ పార్టీలు తమ అవసరాల కోసం కార్యకర్తల రిక్రూట్‌మెంట్ కోసం కాకుండా ప్రజల అవసరాల కోసం ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసే కార్యక్రమాలను రూపొందించడం అవసరం. అప్పుడు చట్టబద్ధంగానే అనేక డిమాండ్లను సాధించుకోవచ్చు. నిర్బంధం చాలా తక్కువగా వుంటుంది. కుల సమస్యను పరిష్కరించడానికి డా॥ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన కృషి చైనాలోని సన్‌యెట్‌సేన్‌లాగా గౌరవించి స్వీకరించాలని ప్రతిపాదించాను. అంబేడ్కర్ పట్ల అధ్యయనం లేకపోవడం వల్ల పార్టీ శ్రేణులు అంగీకరించలేదు.

ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా పలు సిద్ధాంతాల మధ్య సంఘర్షణ తీవ్రమైంది. వీటన్నిటినీ సమీక్షిస్తూ అనేక ప్రశ్నలను లేవనెత్తుతూ భావాలను పలు బృందాలు చర్చించాయి. భారతదేశంలో బీసీలపై ఏ మేధావికి, ఏ విప్లవ పార్టీకి సరియైన అంచనా లేదని, వేల ఏళ్ళుగా భారత దేశం సంపన్నంగా కొనసాగడానికి ఈ బీసీలు సృష్టించిన సంపదే ప్రధాన కారణమని అలాంటి బీసీలను జాతీయోద్యమంలో గానీ, స్వాతంత్ర్య అనంతరం గానీ సామాజిక రాజకీయ ఉద్యమాల్లో ఒక బలమైన శక్తిగా సమీకరించాలని అనుకోవడం లేదని బీసీల్లోంచి నాయకులు, దార్శనికులు ఎదిగినప్పుడే దేశంలో సామాజిక మార్పులు సంభవిస్తాయని కొందరు తీవ్రంగా వాదించారు.

ఎస్సీలు 16వ శతాబ్దం నుండి దేశంలో రకరకాలుగా ఉద్యమిస్తూ సంఘటితమవుతూనే ఉన్నారని, సంఘటితం కావాల్సింది బీసీలే అని బీసీల పట్ల అవగాహన లేకపోవడం వల్లే సామాజిక ఉద్యమాలు, విప్లవోద్యమాలు విఫలవుతున్నాయని బీసీల్లోంచి బీసీ దృక్పథంతో బలమైన విజన్‌తో శక్తివంతమైన నాయకులు, మేధావులు ఎదిగినప్పుడే ఇవి విజయవంతం అవుతాయని కొంతమంది అభిప్రాయ పడ్డారు. రామ్‌మనోహర్ లోహియా బీసీలను గురించి పట్టించుకొని విజయం సాధించిన మొదటి జాతీయ నాయకుడని అది ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి కొన్ని ప్రాంతాలకే పరిమితమైపోయిందని, ఆంధ్రప్రదేశ్‌లో లోహియా కృషి ఎంతో సాగినప్పటికీ ఆ ఫలితాలు రాలేదని రాష్ట్రంలోని లోహియా వాదులు వాపోయారు. తెలుగుదేశం పార్టీ నిర్మాణంలో దాని ప్రణాళిక కార్యక్రమాల రూపకల్పనలో లోహియా వాదులు లోహియా వాదంతో చురుకుగా పాల్గొన్నారు. టిడిపిలో బిసిలకు, మాదిగలకు సముచిత స్థానం కల్పించాలనే ప్రతిపాదన లోహియా వాదులను స్వీకరించినది.

రెండువేల ఏళ్ళు ప్రపంచానికే మార్గదర్శకులైన శూద్రులు, వృత్తి కులాల వారు పారిశ్రామిక విప్లవంతో వృత్తికోల్పోయి పేదలయ్యారు. స్వాతంత్ర్యానంతరం కూడా పాత వృత్తులు పట్టుకొని వేలాడుతూ బీసీలు కులాన్ని దాటి క్లాస్ దృక్పథానికి రావడం లేదు కాబట్టి కులాల మధ్య సమాఖ్య అవగాహనతో అన్ని కులాల డిమాండ్స్‌ను కలుపుకొని ఫెడరేషన్‌గా బీసీ కులాల సమాఖ్య ఉద్యమాలను నిర్మించాలని, ప్రతీ కులానికి సంబంధించిన క్యాపిటల్, అదనపు విలువ, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి సాధనాలు, సమాజంలో వారు నిర్వహిస్తున్న పాత్ర, వారి స్థానం గురించి ప్రత్యేకంగా విశ్లేషిస్తూ మార్క్స్ క్యాపిటల్ వంటి గ్రంథాలను ప్రతి కులం గురించి రాయాలని అప్పుడే సామాజిక వర్గాల విశ్లేషణ సమగ్రంగా చేసినట్టు అవుతుందని కొందరు ప్రతిపాదించారు. నూతన ప్రజాస్వామిక విప్లవంలో, సోషలిస్టు

విప్లవంలో బీసీల స్థానమేమిటో స్పష్టం చేయకుండా వాళ్ళు ఎలా కలిసి వస్తారని వారు ప్రశ్నించారు.

పీపుల్స్ వార్ పార్టీలో సైద్ధాంతిక చర్చ కోసం అవగాహన, కార్యక్రమాలలో మార్పుల కోసం 1985 నుండి 1989 దాకా ప్రవేశ పెట్టిన డాక్యుమెంట్లు ఎన్నో. అయితే వాటిని వాళ్ళు అచ్చు వేయడానికి నిరాకరించారు. ఇంత సీరియస్‌గా సిద్ధాంతాలు రాస్తే మాకు అర్థం కావడం లేదన్నారు. మాకు అర్థం కానప్పుడు అచ్చు వేసి జిల్లా స్థాయి దాకా కమిటీలకు చర్చ కోసం ఇస్తే వాళ్ళడిగితే ఏం చెప్పడం? మాకు అర్థం కాని దాని మీద మేము వారికి వివరించడం ఎలా సాధ్యం? అందువల్ల అచ్చువేయలేం. ఇప్పటికీ మేము మా అభిప్రాయాలే సరైనవని మీ అభిప్రాయాలు తప్పని భావిస్తున్నాము అంటూ అచ్చు వేయడానికి, చర్చించడానికి నిరాకరించారు.

ఆ డాక్యుమెంట్లు అంతర్గత చర్చ పద్ధతిలో సెకండ్ పర్సన్‌లో రాయబడ్డాయి. బహిరంగ జీవితంలోకి వచ్చాక వాటిని థర్డ్ పర్సన్‌లోకి మార్చి టెక్స్ట్‌గా సిద్ధాంత గ్రంథంగా రూపొందించాను. అదే **'గతితర్క తత్వదర్శన భూమిక'.** ఆ గ్రంథం 1990 నుండి తెలుగు దళిత వాయిస్ పత్రికలో సీరియల్‌గా ప్రచురించబడ్డాక 1991లో గ్రంథరూపంలో వెలువడింది. ఈ గ్రంథం పునాదిగా 1992లో దేశంలోని వైరుధ్యాలను పునరధ్యయనం చేయాలని విశాలాంధ్ర వారి కమ్యూనిజం మాసపత్రిక తరపున ఏటుకూరి బలరామమూర్తి, ఈడ్పుగంటి నాగేశ్వర రావు, చండ్ర రాజేశ్వర రావు చొరవ తీసుకొని నా ప్రత్యేక ప్రసంగానికి సెమినార్ ఏర్పాటు చేశారు. కానీ తరువాత ఇంకా ఇతరులను కూడా ఆహ్వానిస్తే బాగుంటుందని దాన్ని విజయవాడలో సెమినార్‌గా నిర్వహించారు. భారత దేశంలో కుల సమస్య పేరుతో ఈ సెమినార్ పత్రాలను పుస్తకంగా ప్రచురించారు. పునర్ముద్రణ కూడా వెలువడింది. నా సెమినార్ పేపర్ 38 పేజీలను కుదించి 13 పేజీలే ఇందులో చేర్చారు. పూర్తిస్థాయి వ్యాసాన్ని బహుజనతత్వం పుస్తకంలో చేర్చాను.

1990 నుండి నేను రాష్ట్ర మంతటా పర్యటిస్తూ వర్గం గురించి, కులం గురించి, వైరుధ్యాల గురించి, స్త్రీల గురించి, జాతుల గురించి, వెనుకబడిన ప్రాంతాల గురించి ఎలా అధ్యయనం చేయాలో విస్తృతంగా ప్రసంగాలు చేశాను. వ్యాసాలు రాశాను. కరపత్రాలు ప్రచురించాను. దరకమే ఐక్య వేదిక నిర్మించడానికి గతితర్క తత్వదర్శన భూమిక గ్రంథం ప్రాతపదిక.

ఒక తాత్విక భూమికలోని కార్యక్రమాల్లో, అవగాహనలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం, అనుభవాల్లోని వైవిధ్యాన్ని చర్చించి విశ్లేషించడం వేరు. మార్క్సిజం,

లెనినిజం, మావో ఆలోచనా విధానం తాత్విక భూమికగా పనిచేస్తున్న సంస్థలో అనుభవాల్లోని వైవిధ్యం, భిన్నాభిప్రాయాలు అందులో ఇముడ్చుకుంటే ఆయా సిద్ధాంతాలు సుసంపన్నం అవుతాయి. వాటిని స్వీకరించడానికి నిరాకరించినప్పుడు ఏం చేయాలి? ఆయా సమస్యలు, కార్యక్రమాలు, అనుభవాలు వాటికవే స్వయం సంపూర్ణం కావు. వాటిని నిరాకరించాక అవి ఏ తాత్విక భూమికలో ఇముడుతాయో, వాటన్నిటినీ ఒకచోటికి తెచ్చి ఒక తాత్విక భూమికను నూతనంగా ఏర్పరచడం, పునర్నిర్మించడం, నవీకరించడం అనేవి కష్ట సాధ్యాలు. అన్ని భావాలకు, అనుభవాలకు ప్రత్యేక వాదాలుగా, యిజాలుగా రూపొందడం కూడా సాధ్యం కాకపోవచ్చు.

అందువల్ల నా అనుభవాలకు తాత్విక భూమిక ఎక్కడ ఉందో, ఎలా రూపొందించాలో అన్వేషించాను. తత్వశాస్త్రాలను, తత్వవేత్తలను, ఉద్యమాల తాత్విక భూమికలను, వాటి ఫలితాలను, పరిణామాలను అధ్యయనం చేశాను. ఆ క్రమంలో ఫెమినిజం, అంబేద్కరిజం, అస్తిత్వవాదాలు, బుద్ధిజం, ప్రజాస్వామ్య బహుళ పార్టీ రాజ్యాంగాలు, పనివిధానం, ఏకపార్టీ, నియంతృత్వ వ్యవస్థలు పనివిధానాలు పరిశీలించడం అనివార్యమైంది.

మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం తరువాత సమాజం ముందుకు సాగి అనేక దేశాల్లో, అనేక రంగాల్లో ఎదిగివచ్చిన నూతన తాత్వికాంశాలు, సైన్సు, టెక్నాలజీ, అవి జీవితంలో, అవగాహనలో తెచ్చిన మార్పులు ఏవీ మార్క్సిజం తాత్విక భూమికలో వాటి సరైన స్థాయిలో స్థానం పొందలేదు. పోలరైజేషన్‌లో తమ నుండి వెళ్ళిపోకుండా ఎదుటివారిని మేం కూడా పట్టించుకున్నాం అనే మేరకు వాటిని సిద్ధాంతాలుగా, కొంతమేరకు కార్యాచరణలో స్వీకరిస్తున్నట్లు కనపడతారు. వాటిని అలా కుదించి చూపుతారు. ఆయా రంగాల్లో అవే ప్రధాన అంశాలని ఫెమినిస్టులు, కుల సమస్య పీడితులు, వెనుకబడిన ప్రాంతాల వాళ్లు, జాతుల వాళ్లు పట్టించుకొని ముందుకు సాగిన మేరకు సంఘీభావం ప్రకటిస్తూ లేదా వారికన్నా మాదే సమగ్ర దృక్పథం అంటూ వారిని పూర్వపక్షం చేసే ప్రయత్నం చేస్తారు. ఆయా సెక్షన్ల ఉద్యమాలు బలహీన పడగానే వామపక్షాల వాళ్లు, పార్లమెంటరీ పార్టీలు వాటిని వదిలివేస్తారు. ఈ వైరుధ్యం నిరంతరం అలాగే కొనసాగుతుంది. ఫెమినిస్టులు, దళితవాదులు, బహుజన వాదులు ఎంత బలంగా వుంటే అంత మేరకే వాళ్లు పట్టించుకున్నట్టు చేస్తారు. అంటే రియల్ ఫోర్స్ వారిది కాదు. ఆయా సమస్యలను ప్రధానంగా తీసుకొని ముందుకు నడిచే వారే రియల్ ఫోర్స్. మిగతా వాళ్ళు అందుకు ప్రతిధ్వనులు, ప్రతిస్పందనలు మాత్రమే.

Dalithayugam-1

03-09-09

176

చార్వాకులు, బుద్ధుడు, జైనుడు, భక్తి ఉద్యమాలు, పారిశ్రామిక, ప్రజాస్వామిక విప్లవాలు, పూలే, అంబేద్కరిజం మొదలుకొని గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, ఏకధృవ ప్రపంచం దాకా అధ్యయనం చేసి ఒక సమగ్ర తాత్విక భూమికను రూపొందించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.ఆ క్రమంలో 1987లో తొలుత "ఆలోచన–ఆచరణల మధ్య వైరుధ్యం" అనే వ్యాసాన్ని కలం పేరుతో అరుణతార మాసపత్రికలో రాశాను. అందులో తాత్విక చర్చలో మౌలిక అంశాలైన ఇండివిడ్యువల్, పర్టిక్యులర్, యూనివర్సల్, థింగ్ ఇన్ ఇట్‌సెల్ఫ్, థింగ్ ఫర్ ఇట్‌సెల్ఫ్, థింగ్ ఫర్ అజ్, కుల సమస్య, వర్గ సమస్యలను చర్చించాను. ఈ వ్యాసంపై ఏడాదిన్నర పాటు అరుణతారలో చర్చ కొనసాగింది. ప్రతి ఒక్కరికి జవాబులు ఇచ్చాను. పార్టీ నాయకులు కూడా కలం పేర్లతో చర్చలో పాల్గొని ఖండించే ప్రయత్నం చేశారు. వారికి కూడా జవాబులు ఇచ్చాను.

మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల భావాల్లో ఉన్న వైవిధ్యాలను, వైరుధ్యాలను గమనించాను. ఒక దశలో మార్క్స్ కన్నా, ఏంగెల్స్‌యే మార్క్సిజానికి తాత్విక భూమికను అందించాడని అనిపించింది. ఎందుకంటే వ్యక్తిగత ఆస్తి, కుటుంబం, రాజ్యం, పుట్టుక – ఫ్యూర్‌బా జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి, డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్, ఆంటిడ్యూరింగ్ మొదలైన మార్క్సిస్టు తాత్విక మౌలిక గ్రంథాలను ఎంగెల్సే రాశాడు.

ఆ తరువాత లెనిన్ సమాజం, పరిస్థితులు ప్రాథమికమని, ఇండివిడ్యూవల్, వ్యక్తి సెకండరీ అని చెప్తే మావో వ్యక్తి ప్రాథమికమని సమాజం, పరిస్థితులు సెకండరీ అని చెప్పడానికి ప్రాధాన్యత నిచ్చాడు. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్‌లు రాజ్యం క్రమంగా అదృశ్యమవుతుందని అంటే మావో రాజ్యాన్ని నిర్మూలించాలి అని అన్నారు. ఇలా అనేక అంశాలు, వైవిధ్యాలు, వైరుధ్యాలు అర్థం కాసాగాయి. మావో వైరుధ్యాలు వ్యాసాన్ని కొడవటిగంటి కుటుంబరావు చేసిన అనువాదంలో చాలా అంశాలు సారాంశ భూతంగా ఉన్నాయని దాన్ని యదార్థ అర్థంలో అనువాదం చేయాలని భావించాను. ఉదాహరణకు అందులోని మొదటి వాక్యాన్ని వస్తువులలోని విరుద్ధాంశాలు అని అనువదించారు. ఇంగ్లీషులో ఉన్నట్టుగా దాన్ని వస్తువులోని విరుద్ధాంశాలు అని అనువదించాను. పార్టీ ఈ అనువాదాన్ని సరిచూసి ప్రచురించింది.

అరుణతారలో ఏడాదిన్నర పాటు సాగిన చర్చ వల్ల పార్టీ శ్రేణుల్లో విరసం సభ్యుల్లో తత్వశాస్త్ర చర్చపై ఆసక్తి పెరిగింది. పాఠకులు రెట్టింపయ్యారు. అలాగే స్త్రీ వాదంపై వచ్చే విమర్శలను ఖండిస్తూ స్త్రీవాదాన్ని సమర్థిస్తూ కలం పేరుతో అరుణ

తారలో వ్యాసాలు రాశాను. తాత్విక చర్చ అన్ని స్థాయిల్లో తీవ్రమైంది. పార్టీ నాయకులు నన్ను కలం పేర్లతో కూడా పత్రికలకు రాయవద్దని ఆదేశించారు. భావాలు వ్యక్తం చేయకుండా, చర్చించకుండా ఉండడం కన్నా చిత్రహింస, ప్రత్యక్ష నరకం మరెక్కడ ఉంటుంది? ఉదయం దినపత్రికలో, ఆంధ్రప్రభ దినపత్రికలో కూడా కలం పేర్లతో రాశాను. ప్రతిసారి కలం పేర్లు కొత్తవి పెడుతున్నాను కనుక పార్టీ వాయిస్‌గా భావించే అవకాశం ఏమీ లేదుగదా అని అన్నాను. నీ భాష, శిల్పం, వాక్యం ఒక పేరా చదవగానే నువ్వే రాశావని తెలిసిపోతుంది, అందుకని నువ్వు ఏ పేరుతో రాసినా పార్టీకి భిన్నమైన అభిప్రాయాలను నువ్వు ప్రచారం చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. కనుక రాయడానికి వీల్లేదన్నారు. అలా పార్టీ నాయకత్వం నా తాత్విక అన్వేషణను నూతన అంశాల విశ్లేషణను అడ్డుకుంది. నేను వందలాది పేజీలు నోట్సు, డాక్యుమెంట్లు రికార్డు చేస్తూ వచ్చాను.

బహిరంగ జీవితంలోకి వచ్చాక వాటిని వ్యాసాలుగా రాసి పత్రికలకు పంపాను. విరసం సభ్యుడిగా కొనసాగుతున్నందున అరుణతార మాసపత్రికలో నా వ్యాసాలు నిరాకరించడానికి లేదు. అయితే ఎన్ని పంపినా ఏ ఒక్క వ్యాసం కూడా అచ్చువేయలేదు. పార్టీ నుండి వారికి అలాంటి ఆదేశాలు అందినట్టున్నాయి. ఇక్కడ పార్టీ అంటే ఎవరో మరి. విరసంలో వుంటూ విరసం పత్రికలో వ్యాసాలు రాకపోతే ఎలా? పొమ్మనలేక పొగ పెట్టడం పద్ధతిలో అనేక విధాలుగా మనసును కష్టపెట్టారు.

విరసం 1991 జనవరిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కుల సమస్యపై నిర్ణయం తీసుకోవాలని, అవగాహనకు రావాలని ప్రతిపాదించాను. అందరూ వ్యతిరేకించారు. జనశక్తి పార్టీ అవగాహనతో కలిసి పనిచేసే విమల వంటి విరసం సభ్యులు బి.ఎస్.గారి అభిప్రాయాలను చెప్పుకునే ప్రజాస్వామిక హక్కును గౌరవించాలని మద్దతు ఇచ్చారు. అలా నా అవగాహనని వివరంగా వారి ముందుంచాను. వారు ఖండించే ప్రయత్నం చేశారు.

నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను. కులం వుందో లేదో ఇక్కడే నిరూపిస్తాను అని సవాలు చేశాను. ఒక్కొక్కరిని సంబోధిస్తూ నీ కులమేమిటి? నీ తండ్రి కులమేమిటి? నీ తల్లి కులమేమిటి? నీ భార్య కులమేమిటి? నీ తాత కులమేమిటి? నీ నానమ్మ కులమేమిటి? నీ కొడుకు కులమేమిటి? నీ కూతురు కులమేమిటి? అంటూ ప్రశ్నల పరంపర కురిపించాను. దాంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. మూడు తరాలు కూడా ఒకే కులంలో పెళ్ళిళ్ళు చేసుకున్నారు. అయినా కులం లేదని ఎలా అంటున్నారు?

ఇలా ప్రశ్నల పరంపరకు జవాబు ఎవరూ ఇవ్వలేకపోయారు. అసలు చర్చను

Dalithayugam-1
03-09-09
177

పక్కదారి పట్టించడానికి వంకర ప్రశ్నలు వేసి మానసికంగా హింసించారు. రాత్రి భోజనమైన తరువాత తిరిగి అందరం చర్చకు కుర్చున్నాం. రాత్రి మూడున్నర దాకా చర్చ కొనసాగుతూనే వుంది. వాళ్లందరూ ఒకవైపు, నేను ఒక్కడిని ఒకవైపు. ఏ ఒక్క బీసీ, ఎస్సీ, ఎస్టీ అయినా నా వాదాన్ని సమర్థించకపోయినా కనీసం అందులో ఆలోచించాల్సిన అంశాలున్నాయని, అయినా మద్దతు ఇవ్వలేకపోయారు. ఎస్సీ, బీసీల మైండ్‌సెట్‌ను అగ్రకుల నాయకత్వం ఎంతగా ట్యూన్ చేసిందో దీన్ని బట్టి అర్థమవుతుంది.

ఉదయం స్నానం చేసేటప్పుడు కొంతమంది అన్నా చాలా గొప్పగా చెప్పినవే అని ప్రశంసించారు. మీ ఓటు హక్కు వినియోగించుకుని సర్వసభ్య సమావేశంలో మద్దతివ్వని ఈ ప్రశంస దేనికి? నపుంసకులు మీరు అని సీరియస్‌గా జవాబిచ్చాను. రాత్రి గుచ్చిగుచ్చి క్షోభకు గురి చేసినందుకు కనీసం క్షమాపణ కూడా కోరని మీరు ఇప్పుడు ఇక్కడ ప్రశంసించడం దేనికి? సర్వసభ్య సమావేశంలో మద్దతిస్తే నేను ఒంటరిని కాదని, బీసీ, ఎస్సీ, ఎస్టీలు నా వెంట ఉన్నారని మిగతా వాళ్లు భావించే వాళ్ళు. దాంతో వాళ్లు తమ అభిప్రాయాలను మార్చుకుని వుండే వారు. ఈ చర్చ నా కోసం కాదు. నాకు స్పష్టత ఉంది. మీకు స్పష్టత రావాలన్నదే నా ప్రయత్నం అని చెప్పాను.

నేను విరసంలో ఉండను. విరసం కన్నా, విప్లవోద్యమాల కన్నా వందల రెట్ల సమూహాల్లో నా సిద్ధాంతం ముందుకు సాగుతున్నది. తేల్చుకోవాల్సింది మీరు తప్ప నేను కాదు. మీ కోసం మీరు మారాలి. విరసం నుండి నన్ను తొలగించడానికి సంబంధించిన నిర్ణయం నాకు సంబంధించినది కాదు. మీరు మీ ఆత్మగౌరవం కోసం దాన్ని తొలగించాలని కోరుకున్న నాడు మీకు కుల సమస్య పట్ల స్పష్టత ఏర్పడినట్లు లెక్క. 1929లో సభ్యత్వం తొలగించి ఉరి తీసిన బుఖారిన్ పార్టీ సభ్యత్వాన్ని రష్యా ఇటీవలే పునరుద్ధరించి గౌరవించింది. అట్లా నా సభ్యత్వాన్ని మీరు పునరుద్ధరించుకొన్న నాడు మీకు, మీ అవగాహనకు విరసంలో సాధికారికత సాధించుకున్నట్లు. విరసంలో నా సభ్యత్వాన్ని రద్దు చేయడమనేది నాకు సంబంధించిన విషయం కాదు అని చెప్పి బయటకు వచ్చాను.

ఉద్యోగ సంఘాల నిర్మాణం-ప్రమోషన్ల సాధన

1990 ఏప్రిల్ 2వ తేదీన మంథనిలో జరిగిన కరీంనగర్ జిల్లా ఆర్‌వైఎల్ మహాసభల్లో బహిరంగ జీవితంలోకి వచ్చాను. ప్రస్తుతం దళితవాద, స్త్రీవాద, విప్లవవాద, బౌద్ధ, మానవీయ వాదాలను సమన్వయిస్తూ తాత్విక, సాంస్కృతిక రంగాల్లో కృషి

సాగిస్తున్నాను. 1990 నుండి రాష్ట్రమంతటా సుడిగాలిలా పర్యటించాను. 1992లో బీసీ, ఎస్సీ, ఎస్టీల వేదికగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక" వ్యవస్థాపక అధ్యక్షుడిగా, గౌరవాధ్యక్షుడిగా పని చేశాను.

1990 నుండి బహిరంగ జీవితంలోకి వచ్చాక తిరిగి ఉద్యోగ సంఘాల నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నాను. ప్రమోషన్లు లేని హాస్టల్ వార్డెన్ ఉద్యోగాలకు ప్రమోషన్లు సృష్టించాలని కె.సీతారాములు, వెంకటరత్నం, కె.పోచయ్య, ఎమ్.సత్యనారాయణ, మహబూబ్‌నగర్ రాజయ్య, ఎన్జీవోల నాయకులు స్వామినాథం, ..., తదితరులం సోషల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం చుట్టూ సెక్రటేరియట్ చుట్టూ సాంఘిక సంక్షేమ మంత్రుల చుట్టూ నెలల తరబడి తిరిగాము. చివరకు ప్రమోషన్ ఛానల్ సాధించాము. వార్డెన్‌లలో 10 శాతం మేరకు గ్రేడ్-1 వార్డెన్‌లుగా, ఆ తరువాత సహాయ సాంఘిక సంక్షేమ అధికారులుగా, జిల్లా సంక్షేమ అధికారులుగా ప్రమోషన్లు పొందే కోటాను సాధించడం జరిగింది.

ఈ జీవోలను విడుదల చేయించాక ఎంతో సంతోష పడ్డాము. ప్రమోషన్లు లేని రంగంలో ప్రమోషన్లు సృష్టించాక సాధారణంగా సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇచ్చి తగిన అర్హతలను రెండు సంవత్సరాల లోగా సంపాదించుకోవాలని సూచిస్తారు. దీని ప్రకారంగా మా అందరికీ ప్రమోషన్లు రావాలి. కాని పైరవీలు చేసి, డబ్బులు పోసి నానా విధాలుగా జూనియర్లు ప్రమోషన్లు పొందారు. దాంతో జీవితంలో ఒక నైరాశ్యం ప్రవేశించింది. పోరాడింది ఎవరు? ప్రమోషన్లు పొందింది ఎవరు? ఇంకా చాలా విషయాలను ప్రభుత్వం నుండి సాధించుకోవాల్సి వుండె. సెలవు రోజుల్లో కూడా పని చేస్తున్నందువల్ల ఏడాదికి 60 రోజులు సంపాదిత సెలవులు, హాస్టల్లో తరుగుల వల్ల జరిగే నష్టం గురించి సివిల్ సప్లయిస్ శాఖలో వలె తరుగు శాతం అమలు చేయాలని లేకపోతే పుచ్చిపోయినవి, ఎలుకలు తిన్నవి, పడేసినవి కూడా హాస్టల్ విద్యార్థులకు పెట్టినట్లు ఖర్చు రాయాల్సి వుంటుంది. ఇది నిజాయితీ గల పని కాదు అని జీవోలు విడుదల చేయించే కార్యక్రమం వుండింది. ప్రమోషన్లలో జరిగిన మోసాల వల్ల, స్వార్థాల వల్ల మళ్లీ వాటి జోక్యానికి వెళ్లలేదు. ఆ సమస్యలు ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి. నాతో అపాయింట్ అయిన వాళ్లు, కొందరు నా కన్నా జూనియర్లు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రమోషన్లు పొంది రిటైరయ్యారు. మేము వార్డెన్లుగానే రిటైరయ్యే విధానం కొనసాగింది. వార్డెన్ల పేరును హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా మార్పించాము.

పది మందికి చెప్పే పెద్దమనుషులుగా మేము జూనియర్లను ప్రమోషన్లు ఎలా

తీసుకున్నారని నిలదీసి ప్రశ్నించ లేకపోయాము. మమ్మల్ని స్వార్థ పరులు అంటారని ఆ స్వార్థపరులను చూసి మిన్నకుండిపోయాము. అలా మా పెద్దరికం మా బలహీనతగా పరిణమించింది.

సాంఘిక సంక్షేమ శాఖలో వుండే అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిసారి వ్యక్తిగతంగా ఉద్యోగంలో అనేక రూపాల్లో నష్టం కలిగించే వాళ్ళు. ప్రమోషన్లు రాకపోవడం, బదిలీలు చేయడం అందులో ఒకటి. వారి అవినీతి, ఒత్తిడిలను తట్టుకొని నిజాయితీగా ఉద్యోగం చేయడం కత్తి మీద సాములాగా వుండేది. లంచం తీసుకునే వాళ్లు నిజాయితీగా వుంటే చాలా మంచిపేరు వస్తుంది. కానీ లంచం ఇవ్వాల్సిన స్థానంలో వున్న వాళ్లు నిజాయితీగా వుంటూ లంచం ఇవ్వకపోతే చాలా కష్టపెడతారు. చెడుగా ప్రచారం చేస్తారు. లంచాలు ఇచ్చే వారినే మంచి ఉద్యోగులని మెచ్చుకుంటారు. హాస్టల్ వార్డెన్ ఉద్యోగం అందరికీ లంచాలు ఇవ్వాల్సిన ఉద్యోగం. లంచాలను హక్కుగా భావించే ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు దాన్ని ఎలా సాధించుకోవాలో నిరంతరం ప్రయత్నిస్తుంటారు. వారు చాడీలను, పత్రికల్లో వచ్చే వార్తలను, విద్యార్థులు, విద్యార్థి సంఘాల వాళ్లు చెప్పే విషయాలను సముదాయించి సమస్యలను పరిష్కరించే బదులుగా వాటిని తమకనుకూలంగా లంచాలు గుంజడానికి బ్లాక్‌మెయిల్ చేయడానికి ఉపయోగిస్తారు. ఈ దశలో నిజాయితీ పరులు నిలబడి నిలదొక్కుకోవడం అంత సులభం కాదు.

విద్యార్థులకు హాస్టల్‌లోని ప్రార్థన సమయంలో వీలైనప్పుడల్లా జీవితం అంటే ఏమిటి? దాన్ని ఎలా గెలుచుకోవాలి? ఎలా కష్టపడాలి? ఎందుకు కష్టపడాలి? ఇప్పుడు కష్టపడితేనే భవిష్యత్తులో ఎలా సుఖపడతారు? ఇప్పుడు సుఖపడితే భవిష్యత్తులో ఎలా కష్టపడవలసి వస్తుంది? అనేక భావజాలాలు ఎలా ఉంటాయి? నేను కష్టపడి పైకి వచ్చాను? ఎవరెవరు ఎలా కష్టపడి పైకి వచ్చారు? అమ్మానాన్నలు మీమీదే ఆశలు పెట్టుకొని బతుకుతున్నారు. నా జీవితానుభవాల ఏమిటి? మా పిల్లలు ఎంత చక్కగా చదువుకుంటున్నారు? మొదలైనవన్నీ వివరించే వాణ్ణి. వార్షిక పరీక్షల దాకా వెంటవుండి చదివించి పరీక్షలు ప్రారంభమయ్యే ముందు పరీక్షలంటే భయపడకుండా పాసైనా, ఫెయిలయినా తిరిగి జీవితాన్ని ఎలా గెలచుకోవచ్చో? మళ్లీ పరీక్ష రాసి ఎలా పాసుకోవచ్చో? చెప్పి వచ్చినకాడికి ముందు ఎలా రాయాలో చెప్పేవాణ్ణి. నా కోసం వచ్చే రచయితలు, మేధావులు, తత్వవేత్తలు మొదలైన వారితో హాస్టల్ విద్యార్థులకు లెక్చర్స్‌ని ఇప్పించే వాన్ని. వచ్చిన మిత్రులకు ఆ పూట ప్రత్యేక వంటలేమీ మా కోసం చేయించకుండా విద్యార్థులకు పెట్టేదే పెట్టి రోజూ ఇలా ఉంటుందని వారికి అర్థం చేయించే వాన్ని. విద్యార్థుల్లో ఒక ఆత్మవిశ్వాసం కలిగేది.

సమస్యలను సృష్టించడం కోసం హాస్టల్‌కు వచ్చే వారిని ఇవి అడగండి అని విద్యార్థులతో చెప్పాను. వారికి ఆయా సబ్జెక్టులలో ట్యూషన్లు చెప్పడం, ఫ్యాన్లు, సరిపోను నోటుబుక్‌లు కొనివ్వడం, ఆరోగ్య విషయాల పట్ల మందులు ఇప్పించడం మొదలైన సహకారాలు అందించాలని విద్యార్థులు వచ్చిన వారిని కోరే వారు. దాంతో వచ్చిన వాళ్ల పరిమితి బయటపడేది. కొందరు ఫ్యాన్లు కొని పెట్టారు. కొందరు మందులు కొనిచ్చారు. అయితే అలా కొనిచ్చిన సెక్షన్లు, ప్రజలు వేరు. వారు హాస్టల్‌లో సమస్యలు సృష్టించడం కోసం వచ్చిన వాళ్లు కాదు. విద్యార్థులను చెడగొట్టడానికి ఎక్కడికక్కడ కాచుకొని వుండే వాతావరణం వుండేది. దీనికి తోడు సినిమా సంస్కృతి ఒకటి.

నేను రాసిన కథలను మొదట విద్యార్థులకే వినిపించే వాన్ని. వారి సూచనలను అడిగే వాన్ని. కథలో లీనమై విద్యార్థులు అనేకమైన సూచనలు చేసే వాళ్లు. అవి వాళ్ల జీవితాలకు దగ్గరగా ఉండే సూచనలే. అలా వాళ్లు చేసిన సూచనలతో కథలను తిరిగి రాసేవాన్ని. ఫైనల్ కాపీని కూడా వారికి వినిపించే వాన్ని. వ్యాసాలు కూడా అలా వినిపించే వాణ్ని. అలా రేపటి దళిత తరం ఏం ఆలోచిస్తున్నదో, ఎలా ఆలోచించాలో రెండూ ఏకకాలంలో తెలిసి వచ్చేవి.

మీటింగ్‌లకి రాష్ట్ర వ్యాప్తంగా వెళ్లి వచ్చిన విశేషాలను విద్యార్థులకు చెప్పేవాన్ని. దాంతో విద్యార్థులకు నాకు మధ్య ఒక అనుబంధం కొనసాగుతూ వుండేది. ఎవరు వచ్చి హాస్టల్ గురించి ఎన్ని రకాలుగా సమస్యలు సృష్టించాలని ప్రయత్నించినా విద్యార్థులు వారిని నిరాశ చేసి పంపేవాళ్లు. పట్టణంలో ఉండే కొందరికి నా భావజాలం పట్ల వ్యతిరేకత ఉండేది. అందువల్ల వాళ్లు ఉద్యోగ రీత్యా నష్టపరచాలని, కించపరచాలని నిరంతరం ప్రయత్నిస్తూ వుండే వాళ్లు. ఎంత ఎదిగితే అంతగా వారి వ్యతిరేకత పెరిగేది. స్థానికంగా అన్ని సంస్థలతో, ఉద్యోగ సంఘాలతో, ఉపాధ్యాయ సంఘాలతో సత్సంబంధాలతో చురుకుగా పాల్గొంటూ కొనసాగే వాన్ని. అలా పోలియో, తదితర వైద్యశిబిరాలను, క్యాంపులను నిర్వహించాము. స్థానిక సాహిత్య, సాంస్కృతిక సదస్సులను, విద్యా సదస్సులను నిర్వహించే వాళ్లం.

1984లో అరెస్టు చేసి జైలుకు పంపిన కోర్టు కేసు వాయిదాలకు కృష్ణారావు అడ్వకేట్‌గా వాదించారు. 1993లో కోర్టుకేసు కొట్టివేయబడింది. కేసు ఆరోపణలు నిరూపణ కాలేదు కనుక సస్పెండ్ చేయడమే పొరపాటు కనుక నా తప్పేమీ లేదు గనుక ఆరేళ్ల సస్పెన్షన్ కాలాన్ని ఆన్‌డ్యూటీగా పరిగణించాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చాను. మానవతా దృక్పథంతో అందుకు అంగీకరిస్తున్నట్టుగా ఉత్తర్వులు ఇచ్చారు. అలా ఆరేళ్ల రహస్య జీవితం, సస్పెన్షన్ కాలం కూడా తిరిగి ఆన్‌డ్యూటీగా

లెక్కించబడింది. దాంతో ఆరేళ్ల మిగతా సగం జీతభత్యాలు దఫదఫాలుగా తీసుకున్నాను. దాంతో 1984లో ఆగిపోయిన ఇంటిపనిని పూర్తి చేశాను. పెద్దవాడు పాణిగ్రాహి, ఎం.టెక్, రెండవ వాడు శ్రీకాంత్ ఎం.సి.ఏ. దాకా చదవడానికి ఆ బకాయి పైసలు ఉపయోగ పడ్డాయి. ప్రభుత్వ ఉద్యోగం కావడంతో స్కాలర్‌షిప్పులు ఏవి వర్తించ లేదు. అందువల్ల పిల్లలకు పూర్తి ఫీజులు, హాస్టల్ మెస్ ఖర్చులు అన్నీ జీతంలోంచే పెట్టాల్సి వచ్చింది. దానికి ఏరియర్స్ డబ్బులు పొదుపు చేయడం ఎంతో ఉపయోగ పడింది. తిరిగి బతికి ఇంటికి వస్తానని ఇంట్లోంచి బయటికి వెళ్ళినప్పుడు ఎప్పుడూ అనుకోలేదు. ఏదో ఎన్‌కౌంటర్‌లో చనిపోతాననే అనుకున్నాను. పోలీసులకు రహస్య జీవితంలో రెండుసార్లు చిక్కి బయట పడగలిగాను. తిరిగి ఇంటికి వచ్చి కుటుంబంతో జీవిస్తూ ఉద్యోగం చేయడం, భావజాల రంగంలో ఉద్యమించడం గురించి అప్పుడప్పుడు ఆశ్చర్యం వేస్తుంది. ఇదంతా కలా, నిజమా అనిపిస్తుంది. రహస్య జీవితం నుండి తిరిగి ఇంటికి రావడం, బతికి వుండడం అనేదంతా బోనస్ బతుకే! అందుకని అది పునర్జన్మ. భావజాలంలోను, జీవితంలోను, ఉద్యమంలోను అది పునర్జన్మ.....

దరకమే ఐక్యవేదిక చారిత్రక ఆవశ్యకత

1988 నుండి అరుణతార మాసపత్రికలో నా వ్యాసాలు వేయడం ఆపేశారు. పార్టీ సభ్యుడిగా అపోహలు కలుగుతాయని ఆపేసి ఉండవచ్చు. 1990 తరువాత నేను పార్టీ సభ్యుడిని కాను. కేవలం విరసం సభ్యుడిని. విరసం సభ్యుడిగా నా రచనలు అచ్చు వేయాలని కోరే హక్కు నాకుంది. ఎన్ని సార్లు రాసినా అచ్చు వేయలేదు. అప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కుల సమస్యపై, దళిత సమస్యపై పర్యటిస్తున్నాను. దళిత మహాసభ, దళిత ఉద్యమాలతో అంబేద్కర్ సంఘాలతో కలిసి పనిచేస్తున్నాను. నలుపు పక్షపత్రికలో, దళిత వాయిస్ మాసపత్రికలో, ఆంధ్రజ్యోతిలో తీవ్రమైన సైద్ధాంతిక చర్చ సాగుతున్నది.

దళిత రచయితలు, కళాకారులారా! ఒకే వేదికపైకి రండి అని 21-06-1992న కరపత్రాన్ని రాసి పత్రికలకు, రచయితలకు, కళాకారులకు, మేధావులకు పంపాము. విరసం సభ్యుడిగా వున్నందున ఆ కరపత్రంపై నా పేరు వేయకూడదనుకున్నాను. అయినా నా రచనల పట్ల, ప్రసంగాల పట్ల ఎక్కడికక్కడ విమర్శలు, పరిమితులు విధించడం ప్రారంభించారు. తాను అచ్చు వేయకపోగా ఇతరత్రా అచ్చవుతుంటే కూడా ఓర్వలేకపోయారు. విరసం సభ్యత్వమనేది ఒక లాకప్‌గా, జైలు శిక్షగా మార్చారు. దాంతో నా ఉత్తరాల్లో రెండు తిట్లు జతచేస్తే అటోఇటో తేలిపోతుందని నిర్ణయానికి

వచ్చాను. సరిగ్గా నేను ఊహించినట్టుగానే ఆ తీర్మానం మీద చర్చించి, ఆ ఉత్తరాల్లోని అసలు అంశాలను వదిలేసి విరసం సభ్యత్వం నుండి తొలగిస్తున్నామని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ఏకగ్రీవ తీర్మానం వారి ప్రజాస్వామిక స్వభావానికి నిదర్శనం. మూడేళ్ళుగా చర్చించాలని, అచ్చు వేయాలని కోరుతున్న నా రచనల గురించి గాని, నా సిద్ధాంతాల గురించి గాని చర్చించాలని ప్రతిపాదించలేకపోయారు. నేను వారి నుండి అది ఆశించలేదు కూడా. వారి మెదళ్ళు ఆయా పార్టీల మోకాళ్లో వుంటాయి. అందువల్ల మిమ్మల్ని మార్చడం కాదు, మీ పార్టీ నాయకులను, మీ మార్క్సిజాన్ని మార్చడం నా కర్తవ్యం అని స్పష్టం చేశాను. అందుకని నన్ను విరసం నుండి తొలగించినప్పుడు విరసాన్ని, విప్లవోద్యమాన్ని ఇంకా ప్రేమిస్తున్నానని, తెలంగాణ భాషలో రాసి పంపాను. ఆ ఉత్తరం ప్రతిని దళిత వాయిస్ పత్రికలో ముద్రించారు.

1992లో ఏర్పడిన దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలను ఒక వేదిక మీదికి తీసుకు వచ్చింది. ఆ క్రమంలో స్వీయ, సామాజిక వర్గ చైతన్యాన్ని కూడా పెంచింది. అలా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు తమ అస్తిత్వం కోసం ఆలోచించడానికి, ఉద్యమించడానికి, తమ స్థానం కోసం ముందుకు కదలడానికి సైద్ధాంతికంగా, సామాజికంగా స్ఫూర్తి నిచ్చింది.

ఈ చారిత్రక పరిణామాల్లో బహుజన సమాజ్ పార్టీ ముందుకు తెచ్చిన సైద్ధాంతిక భూమిక ప్రాతిపదికతో 1992లో దరకమే ఐక్యవేదిక బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఒకే వేదిక మీదికి రావాలని ఒకే సామాజిక వర్గంగా కలిసి ఉద్యమించాలని ప్రతిపాదిస్తూ సైద్ధాంతికంగా ముందుకు సాగింది. అది రాష్ట్ర వ్యాప్తంగా సాహిత్యాన్ని, సామాజిక ఉద్యమాలను మలుపు తిప్పింది. దరకమే ఐక్య వేదిక, గతితర్క తత్వదర్శన భూమిక వేసిన మార్గంలో 'నేను హిందువునెట్లయిత' అనే గ్రంథాన్ని కంచ ఐలయ్య వెలువరించారు.

దరకమే ఐక్య వేదికలో రాష్ట్రంలోని అనేక రంగాల్లో అప్పటికే పనిచేస్తున్న రచయితలు, కళాకారులు, మేథావులు, ఉద్యమకారులు ఒక వేదికపైకి వచ్చారు. రాష్ట్ర స్థాయిలో ఆధునిక సాహిత్య చరిత్రలో ఇదొక అపూర్వ ఘట్టం. అరసం, విరసం, అరుణోదయ, జననాట్యమండలి వంటి సంస్థలు దశాబ్దాల క్రితం ఏర్పడినప్పటికీ అవి వామపక్ష భావజాలంతో వర్గ దృక్పథంతో, కులవివక్షతని పట్టించుకోకుండా జీవితంలో, సమాజంలో కొనసాగుతున్న కులం ప్రాధాన్యతని కులాల దొంతరలను నిర్మూలించకుండా దానికి సంబంధించిన కార్యక్రమాలు లేకుండా అన్నీ వర్గ

దృక్పథంతోనే పరిష్కారమవుతాయని భావించారు. దానికి ధీటుగా మొట్టమొదటిసారిగా దరకమే ఐక్యవేదిక ప్రశ్నలు సంధిస్తూ ముందుకు వచ్చింది.

సాహిత్యానికి వర్గ దృక్పథం వుంటుందా? అది వుంటే సాహిత్యానికి కులదృక్పథం వుండదా? ఎవరి జీవితం చిత్రిస్తే వారి కులానికి చెందిన సాహిత్యం కాదా? పీడిత వర్గ దృక్పథం, కార్మికవర్గ దృక్పథం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకమైనదా? నిజమైన పీడిత వర్గం వీళ్లు కాదా? వీళ్లు కాకుండా ఇంకా వుండిపోయే పీడిత వర్గ దృక్పథం అగ్రకుల పేదలు తప్ప ఎవరుంటారు? అగ్రకుల పేదలు మాత్రమే పీడిత వర్గ దృక్పథం కలిగి వుంటారా? బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వర్గ దృక్పథం వుండదా? జీవితమే దృక్పథాన్ని నిర్ణయించినప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీల పేదరికం, ఉత్పత్తి సంబంధాలు వారి వర్గ దృక్పథాన్ని నిర్ణయిస్తాయి కదా? అటువంటప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీల వర్గదృక్పథమే పీడిత వర్గ, కార్మికవర్గ దృక్పథమవుతుంది. మిగతా వారి దృక్పథాన్ని ఇందుకనువుగా మార్చుకోవాల్సి వుంటుంది. అందువల్ల వామపక్షాలు, వామపక్ష సంస్థలు తమ వర్గ దృక్పథాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల దృక్పథంతో విశ్లేషించి సవరించుకోవాలి. అప్పుడే అది నిజమైన వర్గదృక్పథం అవుతుంది. దీన్ని నిరాకరించే వాళ్లు వర్గ దృక్పథం పేరిట బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకంగా అగ్రకుల, దోపిడీకుల వర్గాలకు సంబంధించిన వారే వామపక్ష దృక్పథం పేరిట ఊరేగుతూ నాయకత్వం వహిస్తున్నారని అర్థం.

దీనికి కన్యాశుల్కం నాటకంపై చర్చను ఉదాహరణగా తీసుకురావడం జరిగింది. సాహిత్య రంగంలో పోలరైజేషన్ తీవ్రమైంది. బీసీ, ఎస్సీ, ఎస్టీలను వ్యతిరేకించే వారంతా అగ్రవర్ణ, అగ్రకుల, దోపిడీ వర్గ ప్రతినిధులే అని తీవ్రంగా వర్గీకరణ జరిగింది. ఈ నేపథ్యంలో దరకమే ఐక్యవేదిక నిర్వహించిన పాత్ర మహోన్నతమైనది. కె.జి.సత్యమూర్తి, బొజ్జా తారకం, ఊ.సాంబశివరావు, కత్తి పద్మారావు, కె.ఎస్.చలం, చార్వాక రామకృష్ణ మొదలుకొని ఐ.ఎ.ఎస్. అధికారులు, ఉద్యోగులు, ప్రొఫెసర్లు ఎందరో దరకమే ఐక్యవేదిక ప్రథమ మహాసభల్లో పాలు పంచుకున్నారు. స్పష్టంగా పీడిత కులదృక్పథం రూపుదిద్దుకున్నది. వర్గ దృక్పథం పేరిట కొనసాగుతున్న అగ్రకులాల నాయకత్వం, రచయితలు, కళాకారులు, విద్యావంతులు, మేథావులు ఒంటరివాళ్ళయి పోయారు. వారు మెల్లిమెల్లిగా కుల వ్యవస్థ ప్రాధాన్యతను గుర్తిస్తూ తమను తాము సంస్కరించుకున్నారు. క్రమంగా తామే పీడిత కుల దృక్పథంతో మొదట రాశామని చెప్పుకోవడం ప్రారంభించారు. అలా దళిత బహుజన సాహిత్య కారులను మళ్లీ వెనక్కి నెట్టి అగ్రకులాల వారే ఊరేగాలని ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలన్ని దరకమే ఐక్య వేదిక తిప్పికొట్టింది.

దళితుల జీవితాలను, కులవృత్తి సంబంధాలను, సంస్కృతిని, భాషను, కుల వివక్షను చిత్రిస్తూ వారి అభ్యున్నతికి, ఆధునిక అభివృద్ధిలో ఎదగాల్సిన క్రమానికి మార్గదర్శకం చేస్తూ చేయూతనిచ్చేదే దళిత బహుజన సాహిత్యమని స్పష్టం చేయడం జరిగింది. దాంతో అంతదాకా దశాబ్దాల తరబడి సామాన్యుడు, మధ్యతరగతి అనే పేర్లతో అగ్రకుల మధ్యతరగతి జీవితాలను ప్రజల జీవితాలుగా చిత్రించిన క్రమాన్ని అది దళిత బహుజన జీవితం కాదని కూడా స్పష్టం చేయడం జరిగింది. అలా సాహిత్య కళాతాత్విక సామాజిక రంగాల్లో వర్గ దృక్పథానికి, దళిత బహుజన దృక్పథానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ ఏర్పడింది.

ఆ క్రమంలో దళితులు, బహుజనులు తమ జీవితాలను తామే చిత్రించాలనే పట్టుదలతో కథలు, నవలలు, కవితలు, పాటలు, కళారూపాలు మొదలైన ప్రక్రియల్లో కృషి వేగవంతం చేశారు.

1993 ఫిబ్రవరిలో దరకమే ఐక్యవేదిక ప్రథమ మహాసభలు విజయవంతంగా జరిగాక జూన్ మొదటి వారంలో కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో కథా వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. కంచ ఐలయ్య, చక్రవేణు, ఉప్పల నర్సింహం మొదలైన వాళ్లు వక్తలుగా ప్రసంగించారు. నాలుగు రోజుల పాటు ఈ కథా వర్క్‌షాప్ జరిగింది. 125 మంది పాల్గొన్న ఈ కథా వర్క్‌షాపులో 70 మంది యువకథా రచయితలు ఎదిగారు. సాహిత్య రంగంలో వారి కృషి వేగవంతమైంది. అక్కడే చక్రవేణు, గూడూరు అమరావతిల పెళ్లి జరిగింది.

కాకినాడ, విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, అనంతపూర్, కరీంనగర్, వరంగల్‌లలో దరకమే ఐక్యవేదిక సదస్సులు నిర్వహించడం జరిగింది. క్రమంగా సంస్థ స్థిరపడుతూ వచ్చింది. ఇంగిలాల రామచంద్రరావు, ఊ.సాంబశివరావు, గూడ అంజయ్య, మాష్టార్జీ, వి.జి.ఆర్.నారగోని, కె.సీతారాములు, జూపల్లి సత్యనారాయణ, కడలి సత్యనారాయణమూర్తి, కె.ఎస్.చలం, వెంకటరత్నం, డా॥ కె.లక్ష్మినారాయణ, ఖాదర్ మొహియుద్దీన్, డా॥ ననుమాస స్వామి, డా॥ జయ సలోమి, అనిశెట్టి రజిత, చందనగిరి దేవయ్య, కె.రామలక్ష్మణ్, పి.రాములు, పి.యన్.ప్రసంగి, బి.అనంతయ్య, ఎమ్.ఎ.దళిత్ సలీమ్, శ్రమశ్రీ మల్లయ్య, అన్నవరం దేవేందర్, జి.ఆర్.కుర్మే, లింగాల రాజసమ్మయ్య, ప్రభంజన్, దార్ల రామచంద్ర, మొదలైన వాళ్లు నిర్మాణ పరంగా దరకమే ఐక్యవేదిక సదస్సులు, సభలు నిర్వహించారు.

సాహిత్య రంగంలో కొలకలూరి ఇనాక్, కత్తి పద్మారావు, బోయ జంగయ్య, ఏ.వై.ప్రభుదాస్, కలేకూరి ప్రసాద్, జూలూరి గౌరి శంకర్, జి.లక్ష్మి నరసయ్య,

సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్, దుర్గం సుబ్బారావు, బి.ఎమ్.లీలా కుమారి మొదలైన వాళ్లు నూతనోత్సాహంతో సాహిత్య రంగంలో విశేషమైన కృషి చేశారు. దరకమే ఐక్యవేదిక ఒక ప్రతినిధిగా, ప్రతీకగా మార్గదర్శకం చేసుకుంటూ ముందుకు సాగింది. వందలాది యువరచయితలు ఎదుగుతూ వచ్చారు.

వందలాది మంది రచయితలకు, కళాకారులకు ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని ఇవ్వడంతో పాటు ఎన్నో రెట్లు వారి ప్రతిష్టను పెంచడంలో దరకమే ఐక్యవేదిక చరిత్రలో నిర్వహించిన పాత్ర అపూర్వమైనది. అద్వితీయమైనది.

త్రిపురనేని మధుసూదనరావు, వరవరరావు, గద్దర్, కళ్యాణరావు, తదితరులు బి.ఎస్.రాములుకు కుల గజ్జి పట్టుకుందని ప్రసంగాలు చేశారు. త్రిపురనేని మధుసూదనరావు వ్యాసాలు కూడా రాశాడు. ప్రతి వ్యాసానికి ఆంధ్రజ్యోతి దినపత్రిక మొదలుకొని అన్ని పత్రికల్లో జవాబు ఇచ్చాను. చివరకు అతనికి కులగజ్జి ఎలా వుందో నిరూపించాను. ఆయనకున్న మార్క్సిస్టు పరిజ్ఞానం, తాత్విక గాఢత ఏ పాటిదో నగ్నంగా నిలబెట్టాను.

దాంతో వరవరరావు, బాలగోపాల్ మొదలైన వాళ్ళు త్రిపురనేని మధుసూదనరావును సంప్రదించి బి.ఎస్.తో పెట్టుకోకు. నువ్వు ఏదైనా రాస్తే అరుణతారలో వేస్తాము అని చెప్పారు. అలా విరసం సభ్యత్వం రద్దయిన త్రిపురనేని వ్యాసాలను అరుణతారలో వేశారు. కాని విరసం సభ్యుడిగా కొనసాగుతున్నప్పటికీ నా వ్యాసాలు అరుణతారలో వేయలేదు. 20ఏళ్ళుగా విరసానికి లోపల, బయట మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం గురించి అధికార ప్రతినిధిగా, తత్వవేత్తగా మిమ్మల్ని భావిస్తే ఇప్పుడు ఎడాపెడా చర్చలో ఓడిపోతుంటే మా పరువు పోతుంది. నీవే ఓడిపోతే మేమెక్కడ జవాబు ఇవ్వగలం. అందుకని బి.ఎస్.తో చర్చకు దిగకండి అని అతన్ని నిలిపివేశారు. మిగతా వాళ్ళు చర్చకు దిగలేదు. నోటిమాటలతో వంకర భాష్యాలతో చర్చను, వ్యక్తిత్వాన్ని హత్యాకాండకు గురి చేశారు. కలంపట్టి అక్షరాల్లో పెట్టండి జవాబు ఇస్తానన్నాను.

మార్క్సిస్టు మహోపాధ్యాయులు, పార్టీ నాయకులు చెపుతున్న దానికన్నా అదనంగా మీరు ఏం చెపుతారో చెప్పండి వింటాను. దానికి జవాబు ఇస్తాను. వాళ్ళు చెప్పేదే మీరు వాదించేదయితే మీతో వాదన ఎందుకు? మార్క్సిస్టు మహోపాధ్యాయుల గ్రంథాలు మీకెంత అందుబాటులో వున్నాయో, నాకు అంత అందుబాటులో వున్నాయి. పార్టీలో ఆరేళ్ళు ఉద్యోగం వదిలేసి పనిచేసి వచ్చిన వాణ్ణి. పార్టీ గురించి మీకేం తెలుసు? ఆరు సంవత్సరాలు రోజూ టీవీ సీరియల్ చూసిన వాళ్లు ఆ సీరియల్

చూడని వాళ్ళతో ఆ సీరియల్ గురించి ఎలా చర్చిస్తారు? మీకున్న అర్హత ఏమిటి? మీకున్న త్యాగాలేమిటి? మీరు కూడా ఆరేళ్ళపాటు భార్యా, పిల్లలను, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి పార్టీలో చేరి రహస్యంగా పనిచేసి ఆ తరువాత వచ్చి మాట్లాడితే అప్పుడు మీ మాటకు అర్థం వుంటుంది. రోజూ కుటుంబంలో భాగంగా జీవిస్తూ భార్య బిడ్డలతో అన్ని సుఖాలు అనుభవిస్తూ, అష్టకష్టాలు పడి బతుకుతున్న నాతో మీకు పోలిక ఏమిటి? నాతో చర్చించే అర్హత మీకెక్కడిది? అని ఎక్కడికక్కడ సవాలు విసిరాను. మీ మెదడు పార్టీ మోకాట్లో వుంది. పార్టీ నాయకత్వానికి, భావజాలానికి బానిసలు మీరు.

మార్క్సిజంతో నేను డైరెక్టుగా సంభాషిస్తాను. వారి గ్రంథాలు నీకన్నా నాకు ఎక్కువ అందుబాటులో వున్నాయి. వాటిని చర్చిస్తాను. నీతో ఎందుకు చర్చ? నీవేదైనా చెప్పదలచుకున్నది వుంటే పుస్తకాలు రాయి. నా పుస్తకాలపై విమర్శలు రాయి. అప్పుడు అవసరమయితే జవాబిస్తాను అని స్పష్టం చేశాను. పీపుల్స్ వార్ పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి గణపతి (ముప్పాళ్ళ లక్ష్మణరావు)ని కూడా 1988లో ఇదే మాట అడిగాను. రాతలో పెట్టడానికి అతనికే ధైర్యం చాలలేదు. అరుణతారలో జరిగిన తాత్విక చర్చలో ఎవరు రాశారో, వారి అవగాహన స్థాయి ఏమిటో తెలిసిపోయింది.

అందువల్ల శత్రువులాగా నన్ను విమర్శించే వారిని విడవకుండా అందరికీ జవాబులు ఇస్తూ, రాస్తూ ప్రసంగాలు చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను సామాజిక రంగంలో సమీకరించాను. ఆయా పార్టీల నుండి వందల వేల మంది నా అభిమానులుగా మారుతూ వచ్చారు. పార్టీల నుండి బయటకు వచ్చారు. పార్టీ లోపల వున్న వాళ్ళు వీటిపై చర్చ చేయాల్సిందే అని పట్టుబట్టారు. గద్దర్ లాంటి వాళ్లు బయటికి నన్ను విమర్శించినప్పటికీ పార్టీ లోపల కుల సమస్యపై చర్చించాల్సిందేనని పట్టుపట్టారు. అన్ని పార్టీలు ఈ సమస్యను ఎదుర్కోక తప్పలేదు. అభిమానులు, కార్యకర్తలు పార్టీని వదిలేయడం వేగం పుంజుకుంది. దాంతో ఏదో ఒక స్థాయిలో కుల సమస్యల పట్ల అవగాహనతో, కార్యక్రమాలను, రూపొందించకపోతే పార్టీలు సైనికుల్లేని సైన్యంలా తయారవుతుందని గమనించారు. ఈ నేపథ్యంలో విరసంతో తెగతెంపులు చేసుకున్నాను.

నేను బహిరంగ జీవితంలోకి వచ్చాక నక్సలైట్‌ను, మాజీ నక్సలైట్‌ను అనే ముద్ర తొలగించుకోకపోతే పోలీసు రికార్డుల్లో, ఇంటలిజెన్స్ డిపార్టమెంట్లలో నా పేరు కంటిన్యూ అవుతూనే వుంటుంది. ఎప్పుడో ఒకప్పుడు తీవ్రంగా నిర్బంధాలకు గురి చేస్తారు. ఇది ఒకసారి పోలీసు కేసుల్లోకి ఎక్కిన వారికి అందరికీ అనుభవమైన విషయమే. అందుకని నా ప్రయాణాన్ని ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగిస్తున్నాను అనే అవగాహనకు సమాజాన్ని తీసుకురావాలని భావించాను. అందుకు కొన్ని ప్రయోగాలు చేశాను. నేనింకా పార్టీతో సంబంధంలో వున్నానని వందలాది మంది తమ సమస్యల పరిష్కారానికి తీర్పు చెప్పమని ఒక పక్షం వారే వచ్చే వారు. పాతబాకీలు ఇప్పించడం, భార్యాభర్తల పంచాయితీలు, అన్నదమ్ముల ఆస్తి పంచాయితీలు, ఊర్లో కొట్లాటలు, పార్టీ మిలిటెంట్లు తనకు అన్యాయం చేస్తున్నారు, నాదే న్యాయం అని ఊర్లోకి వచ్చి విచారించి తెలుసుకొమ్మనే పంచాయితీలు, పోలీసుల నిర్బంధాల గురించిన సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగుల అవినీతి సమస్యలు... ఇలా అనేక సమస్యలు తీసుకొచ్చే వారు. అన్నలకు చెప్పి తన్నించాలి అనే సమస్యలు తెచ్చే వాళ్లు. అన్నీ వారి అవసరాలకన్నా వారి స్వార్థాల చుట్టూ తిరిగే సమస్యలే. వాటిని స్వయంగా జనాన్ని కూడగట్టుకొని ఎలా పరిష్కరించుకోవాలో వివరించి చెప్పేవాణ్ణి.

అన్ని విన్న తరువాత కూడా కొందరు మీరు తప్పక రావాలి అని డిమాండ్ చేసే వాళ్లు. ఇదిగో చూడు! నీకు లాభం జరిగితే అంతా కలిసి పదివేల రూపాయలకు మించదు. దీని కోసం అన్నలు రావాలి. నేను రావాలి. రాంగానో, పోంగానో పోలీసులకు తెలిసి ఎన్‌కౌంటర్ కావాలి. నీకు వ్యతిరేక పక్షం వాడు పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా మారి మమ్మల్ని పట్టియ్యాలి. మేము జైళ్ల పాలు కావాలి. జైలుకు పోవడానికి, ఎన్‌కౌంటర్‌లో చావడానికి భయపడేది లేదు. కానీ నీ పదివేల రూపాయల కోసం ఇవన్నీ జరగాలన్ని కోరుకుంటున్నావు. అలాంటి వాడివి నేను చచ్చిపోతే నా భార్య పిల్లలకు ఏం పెడతావు? పార్టీకి ఏం మేలు చేస్తావు? మీ స్వార్థం కోసం పార్టీ నాయకులు, ఉద్యమకారులు బలిపశువులు కావాలా? అని తీవ్రంగా హెచ్చరించి వాళ్ల స్వార్థపు మూలాలన్నిటినీ కూకటి వేళ్లతో సహా వెలికి తీసి స్పష్టం చేసి మళ్లీ రాకుండా పంపించాను. అలా కొంతకాలానికి జాతరలాగా వచ్చే జనం ఆగిపోయారు.

ఇక సామాజిక రంగంలో ఇలాంటి మలుపు తీసుకుందామని నేను నక్సలైట్ కాదని చెప్పడానికి, తత్వవేత్తనని, రచయితనని, ప్రభుత్వ ఉద్యోగినని అని ప్రచారం చేశాను. తత్వవేత్త అనే పదం నువ్వు పెట్టుకుంటావా? అని ఎంత ధైర్యం నీకు అన్నట్టు కొందరు ప్రశ్నించారు. ఆ ప్రశ్న రాష్ట్ర వ్యాప్తంగా గిరగిరా తిరిగింది. దానికి బహిరంగ సభల్లోనే జవాబిచ్చాను. నన్ను తత్వవేత్తగా అంగీకరిస్తే ఆ పదంతో మీకు ఏ అభ్యంతరం ఉండాల్సిన పనిలేదు. నన్ను తత్వవేత్తగా అంగీకరించకపోతే నీలాంటి పనికిమాలిన వాళ్ల అభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం నాకు లేదు. స్నేహం రూపంలో, మరో రూపంలో మీరు మాట్లాడేదంతా నా వ్యతిరేకమైనదే. మీరు ప్రదర్శించే

స్నేహం నిజమైన స్నేహం కాదు. నిజమైన మిత్రులు కష్టాల్లో ఆదుకుంటారు. కష్టాల్లో మరింత చిత్రహింస విమర్శలు చేయరు. నాలాగా ఓ ఆరేళ్ళ భార్యపిల్లలను, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి విప్లవంలో పనిచేసి రండి అప్పుడు మాట్లాడండి అని ఎక్కడికక్కడ వారి స్వార్థాన్ని ఎండగడుతూ, విప్లవోద్యమం యొక్క పరువు ప్రతిష్టలను, గౌరవాలను పనిచేయకుండానే పొందాలనుకునే నీచ స్వభావాన్ని స్పష్టం చేశాను. ఏనుగు మీద ఈగవాలి ఏనుగును నేనే నడిపిస్తున్నానని మీకు ఈ ఫోజులెందుకు అని, మీరు విప్లవానికి చేసిందేమిటి? అని నిక్కచ్చిగా నిలదీశాను. కాకతీయ యూనివర్సిటీలో కులం, జెండర్, అధికారం అనే అంశంపై జరిగిన జాతీయ సెమినార్‌లో కూడా ఈ చర్చ వచ్చినప్పుడు కంచ ఐలయ్య మరింత స్పష్టంగా ఆ వేదిక నుండి జవాబిచ్చాడు. బీసీల్లోంచి, ఎస్సీల్లోంచి తత్వవేత్తలు రాకూడదా? తత్వవేత్త అనే పదం బ్రాహ్మణుల సొత్తా అని ప్రశ్నించాడు. బి.ఎస్.రాములుగారు తత్వశాస్త్రమే రాస్తున్నారు. రచయిత, కవి, జర్నలిస్టు అయిన వారు రచయిత అని, జర్నలిస్టు అని, కవి అని నేమ్‌ప్లేట్లపై, అడ్రస్సులపై రాసుకోవడం లేదా? చెప్పుకోవడం లేదా? అంటూ నిలదీశారు.

నేను బహిరంగ జీవితంలోకి వచ్చాక నిర్బంధాల నుండి కాస్త సేద తీరాలని విప్లవోద్యమంలో కాకుండా సాహిత్య, సామాజిక రంగాలకే పరిమితమై పని చేస్తున్నానని, శత్రువులకు, మిత్రులకు తెలియాల్సిన అవసరం వుందని నేను లెటర్ ప్యాడ్ కొట్టిస్తూ దానిపై విరసం సభ్యులు, ఎ.ఐ.ఎల్ఆర్‌సి వ్యవస్థాపక సభ్యులు అని పేర్కొన్నాను. ఇవి విప్లవోద్యమం, నిర్బంధం, హిందూత్వ వాదుల నుండి, పోలీసుల నుండి, ఇతరత్రా అనేక కోణాల నుండి ఆలోచించి జగిత్యాలలో ఉండి ఈ సిద్ధాంత చర్చ చేయడం, అక్కడ ఉండి ఆత్మగౌరవంతో బతకడం మాజీ నక్సలైట్‌లుగా మారిన వారికి ఎంత కష్టమో అది అనుభవించిన వారికి తెలుసు. ఆ దశలో ఉన్న నన్ను వరవరరావు విరసం సభ్యుడిని, ఎ.ఐ.ఎల్.ఆర్.సి వ్యవస్థాపక సభ్యుడినని ఎలా వేసుకున్నావు అని ప్రశ్నించాడు. కష్టాల్లో భిన్నాభిప్రాయాలు కల వారికి విరసం, విప్లవోద్యమం ఇచ్చే మద్దతు ఇలాంటిది. నీవు ఎ.ఐ.ఎల్.ఆర్.సి. ఏర్పాటు చేసే చర్చల్లో పాల్గొన్నావా? అని అన్నాడు.

అలా చర్చలు చేసిన వారు ఎవరి ప్రతినిధులు? విరసం ప్రతినిధులు. విరసం ఎ.ఐ.ఎల్.ఆర్.సిలో వ్యవస్థాపక సభ్యురాలు. అందువల్ల విరసం సభ్యులందరూ ఎ.ఐ.ఎల్.ఆర్.సి వ్యవస్థాపక సభ్యులవుతారు అని వివరించాను. ఎ.ఐ.ఎల్.ఆర్.సి ఏర్పడక ముందు అందుకు కృషి చేసిన వాళ్ళు సన్నాహక కమిటి వంటివాళ్ళు అని చెప్పాను. వరవరరావుకే ఈ విషయం చెప్పేదాకా అర్థం కాలేదు. వారికి గల అసహనం, కోపం, ఈర్ష్య, సిద్ధాంతాలను సిద్ధాంతాల ద్వారా పూర్వపక్షం చేయలేని నిస్సహాయత

Dalithayugam-1
03-09-09
183

నాకు తెలుసు. అందువల్ల సహనంతో జవాబిచ్చాను. విరసం నుండి బయటకు వచ్చాక చర్చ లోపల, బయట అన్ని పార్టీల్లో, అన్ని సంస్థల్లో వేగవంతమైంది.

అలా 1990 నుండి 1993ల మధ్య ఈ చర్చ మరింత వేగవంతమైంది. మార్క్సిజం వర్గ దృక్పథం నుండి కుల సమస్యను స్వీకరించడానికి సైద్ధాంతిక ప్రతిపత్తి కోసం రాష్ట్రంలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి. సిపిఐ మొదలుకొని పీపుల్స్ వార్ పార్టీ దాకా అనేక సంస్థలు, పార్టీలు తమ అవగాహనను మార్చుకొన్నాయి. కుల సమస్య పట్ల, దాని అవగాహన పట్ల తమ పాత అభిప్రాయాలను, కార్యక్రమాలను మార్చుకున్నారు. అలా మార్చుకున్నట్టుగా పీపుల్స్ వార్ పార్టీ కలకత్తా నుండి వెలువడే ఫ్రాంటియర్ అనే ఇంగ్లీషు వార పత్రికలో తన డాక్యుమెంటును ప్రకటించుకుంది. అయితే అందులో ఈ చర్చను లేవనెత్తిన వాళ్లు స్వప్రయోజనాల కోసం లేవనెత్తారని ఆరోపించారు. ఆలస్యంగా తమను తాము సవరించుకొంటున్నామని వినయాన్ని, కృతజ్ఞతను ప్రదర్శించలేకపోయారు. ఎలాగైతేనేమి 1988లో నా వైపు నీవొస్తావో, నీవైపు నేనొస్తానో అయిదేళ్ళలో తేలిపోతుంది అని విసిరిన సవాలులో గణపతి, పీపుల్స్ వార్ పార్టీ ఆలోచనా ధోరణి నా వైపే రాక తప్పలేదు.

భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం వేరు, పూర్తి స్థాయిలో సిద్ధాంత భూమిక రూపొందించి తత్వశాస్త్ర ప్రతిపత్తికి ఎదిగించడం వేరు. గ్లాసెడు మంచినీళ్లు తాగడం వేరు, నీళ్ళ కోసం బావి తవ్వుకోవడం వేరు. ఇంట్లో అద్దెకుండడం వేరు, సొంత ఇళ్ళు స్వయంగా కట్టుకోవడం వేరు. అమ్మవండింది తినుకుంటూ వంకలు పెట్టడం వేరు, అన్నీ బయట నుండి కొని తెచ్చి సొంతంగా వంట చేసుకొనే నైపుణ్యం సాధించడం వేరు. కుల సమస్యపై, మార్క్సిజంపై అలా తత్వశాస్త్రాన్ని పూర్తి స్థాయిలో రూపొందించాల్సిన కర్తవ్యం ముందుకు వచ్చింది.

దాంతో ప్రపంచంలోని తత్వశాస్త్రాలను, భారతీయ తత్వశాస్త్రాలను అధ్యయనం చేసి ఫెమినిజాన్ని, సబాల్టన్ సిద్ధాంతాలను, అస్తిత్వ ఉద్యమాలను, వాటి సిద్ధాంత భూమికలను, కార్యక్రమాలను అధ్యయనం చేసి అన్నింటినీ సంశ్లేషించాను. మార్క్స్, ఏంగెల్స్‌లు కూడా తమ కాలం నాటి వివిధ రంగాల సిద్ధాంతాలను, ఉద్యమాలను అధ్యయనం చేసి వాటన్నిటిని కలిపి మార్క్సిజాన్ని రూపొందించారు.

నేను చేసిన నా ప్రయత్నాలను కొందరు అంబేద్కరిస్టులు ఇది అంబేద్కరిజం కాదన్నారు. మార్క్సిస్టులు మార్క్సిజం కాదన్నారు. కావచ్చు, కాకపోవచ్చు. గతితర్క తత్వదర్శన భూమిక, గతితర్కం–అంబేద్కరిజం–మార్క్సిజం, బుద్ధిజం–సోషలిజం, కులం– వర్గం– లింగం–సోషలిజం, అంబేద్కరిజం–సోషలిజం మొదలైన రచనల

ద్వారా సమకాలీన సిద్ధాంతాలను, ఉద్యమాలను, ప్రజాసమస్యలను, కార్యక్రమాల రూపకల్పనను చర్చించాను. వాస్తవాలను చూపాను. అనేక అంశాలను ప్రతిపాదించాను. అవి కొన్ని ఇతర దేశాల్లో గతంలో కొందరు ప్రతిపాదించారని వారి గురించి కొందరు మిత్రులు చెప్పారు. దాంతో వారిని కూడా చదివాను.

నా రచనల్లోని వెలుగు మార్క్సిజం నుండి, ఫెమినిజం నుండి, అంబేడ్కరిజం నుండి, బుద్ధిజం నుండి, వెనకబడినప్రాంతాల, జాతుల, కులాల, దేశాల దృక్పథం నుండి తీసుకున్నదే. వాటన్నిటిని ఒక సమగ్ర దృక్పథంలో సమకాలీనం చేసి, సంశ్లేషించి నూతన రూపాన్ని, నూతన సారాన్ని, ముందుకు తెచ్చాను. సాహిత్య విమర్శలో, అలంకార శాస్త్రాల్లో, సాహిత్య చరిత్ర నిర్మాణంలో, అనేక గ్రంథాలు, రచనలు వెలువరించాను. సామాజిక చరిత్ర పునరధ్యయనంలో చరిత్ర అధ్యయన శాస్త్రంగా రూపొందించడానికి కొన్ని రచనలు చేసిన తరువాత భారతీయ చరిత్ర – శూద్ర దృక్పథం గ్రంథాన్ని వెలువరించి శూద్రులే వేల ఏళ్ళుగా ఈ దేశ సంపద సృష్టికర్తలని, సమాజ నిర్మాతలని, రాజులు, బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్ర సంపదను తమదిగా మార్చుకుని యుద్ధాలకు, భోజనాలకు, కూడబెట్టడానికి వాడుకున్నారని స్పష్టం చేశాను.

అన్నిటినీ కలిపి ఒకే ఒక వాక్యంలోకి సిద్ధాంతాన్ని సూత్రీకరించాను. "సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, ప్రాంత, భాష, దేశ, విచక్షణలకు, అసమానతలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం ప్రాతిపదికగా మనుషులందరూ సమానమే" దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక తాత్విక భూమికగా దీన్నే స్వీకరించి "సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, భాష, ప్రాంత, దేశ, విచక్షణలకు, అసమానతలకు వ్యతిరేకంగా కృషి చేస్తుంది" అని మొదటి వాక్యంలోనే ప్రకటించడం జరిగింది. దీనికి బుద్ధుడి నుండి అంబేద్కర్ దాకా గల తాత్విక కారణంను అంబేద్కరిజంగా నిర్వచించి ఆ అంబేద్కరిజం తాత్విక భూమికగా ఉంటుందని ప్రకటించాము.

రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా కుల సమస్యపై పునరధ్యయనం సాగింది. నాగార్జున యూనివర్సిటీ అంజయ్య మొదలైన వాళ్ళు ఈ విషయంపై 1978 నుండి సిపిఎం పార్టీ నుండి విడిపోయి మార్క్సిజం ఫూలే అంబేద్కరిజం సిద్ధాంతాన్ని రూపొందించి సత్యశోధక కమ్యూనిస్టు పార్టీని నిర్మాణం చేసి మహారాష్ట్రలోని ధూలే జిల్లా ప్రాంతాల్లో పని చేస్తున్న మేధావి నాయకుడైన శరద్‌పాటిల్‌ను అంబేద్కరిజం – మార్క్సిజం అనే అంశంపై ప్రసంగానికి విజయవాడకు పిలిచారు. జగిత్యాల నుండి విజయవాడ వెళ్ళాను. ఆయన ఇంగ్లీషులో రాసిన వ్యాసాన్ని తెలుగులోకి

అనువదించి నలుపు పక్షపత్రికలో ప్రచురింప చేశాను. ఆ తరువాత వెంటనే 1993లో "గతితర్కం అంబేద్కరిజం మార్క్సిజం" గ్రంథంలో ఆ వ్యాసాన్ని చేర్చి ప్రచురించాను.

చాలా మంది మార్క్సిజం పరిధిని విశాలం చేయడానికి సంకోచించారు. పీపుల్స్ వార్ పార్టీ, విమోచన పార్టీ ఎటూ తేల్చుకోలేక పోయారు. దాంతో పార్టీల్లో అంతర్గత చర్చలు తీవ్రమయ్యాయి. పార్టీల్లోంచి మూడవ వంతు పూర్తి కాలం కార్యకర్తలు, వేలాది పార్ట్ టైం కార్యకర్తలు పార్టీలను వదిలివేశారు.

1994లో బీఎస్పీ ప్రచారం బాగా పెరిగినప్పటికీ ఎన్నికల్లో ఓడిపోయాక బలహీనపడింది. అప్పుడు దరకమే ఐక్య వేదిక బహుజన ఐక్యత సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొని సాగింది. ఆ క్రమంలో బీసీ సాహిత్యం, ముస్లిం సాహిత్యం, మాదిగ సాహిత్యం ప్రత్యేక అస్తిత్వంతో మిత్ర వర్గాలుగా కలిసి ఉంటూ సహకరించుకుంటూ ముందుకు సాగాయి. కుల సమస్యను అన్ని వామపక్షాలు పట్టించుకున్నాయి. తమతమ స్థాయిలో కార్యక్రమాలను రూపొందించుకున్నాయి.

అమెరికా సోషలిస్టు పార్టీలు, మేధావులు చేసిన ప్రయోగాలు, సిద్ధాంతాలను ఎరిక్‌ఫాం 'సేన్ సొసైటీ' అనే గ్రంథంలో విస్తారంగా చర్చించారు. బొంబాయికి చెందిన ముస్లిం మేధావి అస్గరలీ ఇంజనీర్ రాస్తున్న అంశాలు ఏ మేరకు రాష్ట్రంలో పనికి వస్తాయి అని చర్చించాను. కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తి, త్రిపురనేని మధుసూదన రావు, కంచె అయిలయ్య, ఉ. సాంబశివరావు మొదలైన వాళ్ళు సిద్ధాంత చర్చల్లో వివిధ స్థాయిలో పాల్గొన్నారు. సామాజిక అవగాహన మారడానికి వీరందరి కృషి ఎంతో తోడ్పడింది.

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు అవ్యక్త సమాజం అని వ్యక్త సమాజంగా అగ్రవర్ణాలు, అగ్ర కులాలు కొనసాగుతున్నాయని, అవ్యక్త సమాజం వ్యక్తసమాజంగా తనను తాను వ్యక్తీకరించుకుంటున్నప్పుడు సామాజిక సంఘర్షణ మొదలవుతుందని అది అస్థిత్వవాదం, ప్రాంతీయవాదం, స్త్రీ వాదం వంటి అనేక రూపాల్లో వ్యక్తమవుతుందని కొందరు ప్రతిపాదించారు. కాలక్రమంలో కొందరు దళితులు, బీసీలు, ఎస్సీలు ఒకటి కాదని వాద దళితులు, ఊరి దళితులు అని చర్చను ముందుకు తెచ్చాయి. నేను, డానీ, కాన్షీరామ్, కత్తి పద్మారావు మొదలైన వాళ్ళందరూ ఒక్కటిగా కలిసి ఉండాలని బహుజన సమాజాన్ని నిర్మించాలని కోరినప్పటికీ రాష్ట్రంలో అది విడి విడి అస్తిత్వ ఉద్యమాలకు దారి తీసింది. బీసీ అస్తిత్వ ఉద్యమం, స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం, తెలంగాణ అస్తిత్వ ఉద్యమం, మాదిగ దండోరా అస్తిత్వ ఉద్యమం, కుల సంఘాలు, మొదలైన అస్తిత్వవాద ఉద్యమాలు ముందుకు వచ్చాయి.

దేశంలో 60, 70 చిన్నా, పెద్ద పార్టీలు శాసనసభల్లో, పార్లమెంటులో స్థానం సంపాదించుకుంటున్నారు. జాతీయ పార్టీలు స్థానిక, ప్రాంతీయ సాధికారికతను పట్టించుకోకపోవడం వల్ల ప్రాంతీయ, ఉపప్రాంతీయ పార్టీలు వెలసి ప్రజలచేత ఎన్నికవుతూ వస్తున్నాయి. బీజేపి నాయకత్వంలో 23 పార్టీల ఐక్యసంఘటన ఎన్డీయే కేంద్రంలో ఐదేళ్లు పూర్తికాలం పరిపాలించింది.

అటు తర్వాత కాంగ్రెస్ పార్టీ యుపిఏ కూటమి పేరిట సంకీర్ణ రాజకీయాన్ని నడుపుతూ కేంద్ర ప్రభుత్వాన్ని చెలాయిస్తున్నది. ఇలా దేశంలోని అనేక ప్రాంతాల్లో నిర్దిష్ట, పర్టికులర్ సామాజిక పరిణామాలలో భాగంగా జాతీయ యూనివర్సల్ పరిణామాలు కొనసాగుతున్నాయి. భిన్న సిద్ధాంతాలు, ఆచరణలు, భిన్న ప్రాధాన్యతలు ఉన్నప్పటికీ కనీస కార్యక్రమం ప్రాతిపదికగా కలిసి పనిచేయడం ఒక చారిత్రక అవసరంగా ముందుకు వచ్చింది.

మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానంతో సాగుతున్న నక్సలైట్ పార్టీలు, వామపక్షాలు దళిత వాదాన్ని, కుల సమస్యను, మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్‌ల సిద్ధాంతాలను, కృషిని, లేవనెత్తిన సమస్యలను, సూచించిన పరిష్కారాలను పట్టించుకోక తప్పలేదు. ఎక్కడికక్కడ కార్యకర్తలు, ఉద్యమకారులు పార్టీ నాయకులను నిలదీశారు. మూడింట ఒక వంతు కార్యకర్తలు, నాయకులు ఆయా పార్టీలను, సంస్థలను వదిలేసి వెళ్ళిపోయారు. అందువల్ల వామపక్షాలు, నక్సలైట్‌పార్టీలు మునుపెన్నడూ లేనివిధంగా కుల సమస్యను, బీసీ, ఎస్సీ, ఎస్టీలు అత్యున్నత స్థాయి కమిటీల్లో, పాలసీ నిర్ణాయక కమిటీల్లో ఎందుకు లేరనే ప్రశ్నను ఎదుర్కొన్నాయి. నాయకులు తప్ప కేడర్ లేని పార్టీలుగా మారిపోతున్నాయని గమనించారు. దాంతో కుల సమస్యను, దళిత సమస్యను, అంబేద్కర్‌ను పట్టించుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. అలా మభ్య పెట్టే మాటలతో, చర్చలతో కొంతకాలం సాగదీసి చివరికి కుల వివక్ష వ్యతిరేక కమిటీ, కుల నిర్మూలన కమిటీ, దళిత సాహిత్య సదస్సులు, దళిత సిద్ధాంతాలు, మార్క్సిజం, మార్క్సిజం దృష్టిలో దళిత సిద్ధాంతాలు, దళిత సమస్య అంటూ చర్చలు, సదస్సులు నిర్వహించారు. పుస్తకాలు వెలువరించారు. కొన్ని కార్యక్రమాలు కంటితుడుపుగా తీసుకున్నారు. అయినప్పటికీ బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆయా పార్టీల్లో మునపటిలా ఉత్సాహంగా, హృదయ పూర్వకంగా పనిచేయడం తగ్గింది. నాయకులపైగల అచంచల విశ్వాసం విమర్శనాత్మక విశ్వాసంగా మారింది. అలా పార్టీల్లో అంతర్మధనం, మేధోమధనం జరిగింది.

జనశక్తి పార్టీలో దీనిపై ఒక అంగీకారానికి వచ్చి అందరినీ కలుపుకుని ఒక

వేదిక ఏర్పాటు చేయాలని భావించారు. కుల సమస్యపై జాతీయ స్థాయిలో అనేక చోట్ల సెమినార్‌లు, మహాసభలు నిర్వహించారు. అనంతపురంలో ఫిబ్రవరి 1993 మొదటివారంలో పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభల్లో కుల సమస్య లేవనెత్తిన మేధావులను ప్రత్యేకంగా పిలిచి ప్రసంగాలు చేయించారు. నాతో పాటు కె.జి.సత్యమూర్తి, ఊ.సాంబశివరావు, కంచ ఐలయ్య, బొజ్జా తారకం తదితరులు ఆ మహాసభలో విస్తృతంగా కుల సమస్యను, అంబేద్కరిజాన్ని విశ్లేషించారు.

గుంటూరులో 1993... నెలలో జనశక్తి వారి నాయకత్వంలో డఫోడమ్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. అందులో నాతో సహా దళిత వాదంపై, కుల సమస్యపై పని చేస్తున్న మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు రాష్ట్ర కార్యవర్గంగా రూపొందారు. మొదట దీనిపై నాకున్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేశాను. అయితే మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానంతో గల ఒక పార్టీ కేంద్ర కమిటీ ప్రత్యేకంగా కుల సమస్యను పట్టించుకొని ఒక ప్రజా సంఘాన్ని నిర్మాణం చేసేటప్పుడు ఇంతదాకా వారు పట్టించుకోలేదని విమర్శించిన మనం దాని నిర్మాణానికి కొంతకాలమైనా సహకరించాలి గదా! మనం కోరిన పనిని వాళ్ళు చేస్తున్నప్పుడు సహకరించకపోతే ఎలా? అని కంచ ఐలయ్య వంటి వాళ్ళు వాదించి ఒప్పించారు. అయితే వాళ్ళు దళితుల సమస్యపై కాకుండా రాజ్యంపై వ్యతిరేకతతో పనిచేసే నెగెటివ్ కార్యక్రమాలను ప్రారంభించారు. దాంతో నాతో పాటు చాలామందిమి దాన్ని వదిలేశాము. అది ఆగిపోయింది.

ఇది అశాస్త్రీయ విద్యా విధానం, దున్నే వాడికే భూమి వంటి నినాదాలను, వాటి సిద్ధాంత భూమిక ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసంగాలు, వ్యాసాలు, చర్చలు చేశాను. ఇది అశాస్త్రీయ విద్యావిధానమైతే, అలా చెప్పేవాళ్ళు ముందు తమ సర్టిఫికెట్‌లను చింపేయాలి. ఆ విద్య ద్వారా వచ్చిన ఉద్యోగాలను వదిలేయాలి. వారి పిల్లలను ఈ చదువులు మాన్పించి శరీర కష్టం చేసేవృత్తుల్లో ప్రవేశ పెట్టాలి. వారి కులాల వారిని ఈ చదువులు మాన్పించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు చదువుల్లో, ఉద్యోగాల్లో పోటీ రాకుండా చూడాలి. ఒక 100 సంవత్సరాలు ఇలా చేయాలి. అప్పుడు ఈ విద్య అందుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఇది అశాస్త్రీయ విద్యా విధానం అవునో కాదో తేల్చుకుని సరైన విద్యా విధానాన్ని రూపొందిస్తారు. ఈ కోవలో మాట్లాడిన చర్చ చాలా వేడిగా సాగించాను. ఒక్కొక్కరిని పేరు పేరునా విమర్శించాను. పిడిఎస్‌యు నాయకుడిగా వున్న మారోజు వీరన్నకు అశాస్త్రీయ విద్యా విధానం అనే పేరిట చదువులు మానేయిస్తున్న దాంట్లో గల కుట్రను వివరించాను. వెనకటి మనువాదులు, బ్రాహ్మణవాదులు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు

చదువు నిరాకరించి శరీర కష్టం చేసుకుని, కులవృత్తులు చేసుకొని తమకు సేవ చేయాలని కోరిన క్రమమే ఈ నినాదంలో ఉందని స్పష్టం చేశాను. ఇది అశాస్త్రీయ విద్యా విధానం అనే వారిని చెప్పుతో కొట్టండి అని పిలుపునిచ్చాను. దాంతో ఈ అశాస్త్రీయ విద్యా విధానం అనే నినాదం గోడల మీద రాయడం, ప్రచారం చేయడం ఆగిపోయింది.

దున్నే వాడికే భూమి నినాదం కూడా పేద ప్రజల అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వారిని అక్కడే ఉంచాలని చేస్తున్న ప్రయత్నమిది. భూమి దున్నుకుని బ్రతకాలని చెప్పడం అంటే ఆయా కులవృత్తులు చేసుకొని బ్రతకాలని చెప్పడమే. గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ నిజానికి కుల వ్యవస్థ తప్ప వేరు కాదు. అందులో దున్నే వాడికి భూమి కార్యక్రమం మాత్రమే ఇవ్వడం ద్వారా అందరూ ఆ కుల వ్యవస్థ గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ స్థాయిలో వెనకబడిన జీవన విధానంలో బతకాలని చెప్పడమే. ఆధునిక విద్య అందుకోవాలని తద్వారా ఆధునిక అభివృద్ధిని, నూతన ఉపాధి అవకాశాలను అందుకోవాలని డా. బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. నక్సలైట్లు ఆధునిక విద్యను, ఆధునిక అభివృద్ధిని, నూతన ఉపాధి అవకాశాలను అందుకోవాలని చెప్పే బదులుగా ఇది అశాస్త్రీయ విద్యా విధానమని విద్యకే దూరం చేశారు. అందువల్ల దున్నే వారికి భూమి అనే కార్యక్రమం, నినాదం పేదలను ఆధునిక అభివృద్ధిలో ఎదగకుండా గ్రామీణ అట్టడగు స్థాయి జీవితానికి నెట్టివేయడమే. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయాన్ని సదస్సులు, ప్రసంగాలు, వ్యాసాలతో విశ్లేషించాను. వామపక్షాల, నక్సలైట్ల వెంట ఉండే ప్రజలు చైతన్యవంతులై తిరిగి విద్య, ఉద్యోగ రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలతో విజృంభించారు. అలా గ్లోబలైజేషన్, సాఫ్ట్‌వేర్ రంగాల ద్వారా అందివచ్చిన నూతన అవకాశాలను అందుకోవడం మొదలైంది. ఇది అశాస్త్రీయ విద్యా విధానం అని విద్యను వదిలేసి ఉద్యమాల్లో ఉండిపోతే బీసీ, ఎస్సీ, ఎస్టీలు వారి జీవితాలు ఎంత దయనీయంగా దారిద్ర్యంలో కూరుకుని పోయి వుండేవో ఇవి అందుకోని వర్గాలను గ్రామాల్లో చూస్తే స్పష్టమవుతుంది. అలా ఒక చారిత్రక దశలో సిద్ధాంత చర్చలు యువతరానికి నూతన దృష్టిని, అవకాశాలను అందుకునే ఉత్సాహాన్ని పెంచాయి.

భారతదేశంలో కుల వ్యవస్థనే వర్గాలను సృష్టించింది. వర్ణ, కుల వ్యవస్థలు, చాతుర్వర్ణ వ్యవస్థ, గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ ఎవరు పాలకవర్గాలుగా, ఆధిపత్య వర్గాలుగా, సమాజంలో లాభోక్తలుగా వుండాలో, ఎవరు వారికి సేవకులుగా సేవలు, ఉత్పత్తులు అందించాలో స్పష్టంగా నిర్ణయించాయి. మనుస్మృతి, నారదస్మృతి, పరాశరస్మృతి, పురాణాలు, భగవద్గీత మొదలైవన్నీ మతం పేరిట, కులం పేరిట వీటినే ప్రచారం చేస్తూ ఆచరింప చేస్తూ వచ్చాయి. వర్గాలను కన్న తల్లి వర్ణ కుల వ్యవస్థలే. వర్గానికి, కులానికి మధ్య వున్న సంబంధం తల్లీకూతుళ్ల మధ్య వుండే సంబంధం. చాతుర్వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ వర్గాలను కనిపెంచే తల్లి. దాని పిల్లలే పేదలు, పేద కులాలు, శ్రామిక కులాలు, ఆధిపత్య కులాలు, వర్గాలు.

వర్గ దృక్పథంతో పాటు పీడిత కులదృక్పథం వున్నప్పుడే అది శ్రామిక వర్గ మార్క్సిస్టు దృక్పథమవుతుంది. పీడిత కుల దృక్పథం లేని వర్గ దృక్పథం అగ్రకులాల నాయకత్వంలో సాగే మార్క్సిస్టు దృక్పథం అవుతుంది. అనగా అగ్రకుల నాయకత్వంలో, అగ్రకుల ప్రయోజనాల పరిమితిలో పనిచేసే దృక్పథమే తప్ప అది నిజమైన పీడిత వర్గ మార్క్సిస్టు దృక్పథం కాదు. ఈ చర్చలను జాతీయ, అంతర్జాతీయ వేదికల మీదికి తీసుకెళ్ళి దీన్ని ఎందరో విస్తృతం చేశారు. అంతర్జాతీయ రచయిత్రి గెయిల్ ఒమ్‌వెద్, శరద్ పాటిల్, కె.ఎస్.చలం, కంచ ఐలయ్య, కత్తి పద్మారావు మొదలైన వాళ్ళు ఈ చర్చలను ఇంగ్లీషులో చర్చించి అంతర్జాతీయ ప్రతిపత్తి సాధించారు. అంతర్జాతీయ ఫెమినిస్టులు ఇందుకు సహకరించారు.

దున్నే వారికి భూమి అనే నినాదం భూస్వామ్య వ్యవస్థలోని ఆయా కులవృత్తులకు పరిమితమై జీవించాలని కోరే నినాదమే. ఆధునిక అభివృద్ధిలో అందరూ సమాన వాటా పొందాలని చెప్పే కార్యక్రమాలు, సిద్ధాంతాలు అవసరం. గ్లోబలైజేషన్ పరిణామాలను, గ్లోబలైజేషన్‌ను వ్యతిరేకిస్తూ దేశంలోని మార్క్సిస్టులు, ప్రపంచంలోని మార్క్సిస్టులు కూడా అనేక చర్చలు చేశారు. గ్లోబలైజేషన్‌ను అడ్డుకోవడం సాధ్యం కాదని అది అనివార్యమని స్పష్టమైన తరువాత గ్లోబలైజేషన్ లాభోక్తులుగా పీడిత వర్గాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు తదితరులను ఎదిగించడం అవసరం. అందుకు ఆధునిక విద్యలో సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఎదగడం తప్పనిసరి. అందుకోసం ప్రభుత్వ రంగంలోనైనా, ప్రైవేటు రంగంలోనైనా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఎదగడం ముఖ్యం. అలాగే అన్ని రంగాల్లో ఎదగడం ముఖ్యం.

అది నల్లపిల్లా, తెల్లపిల్లా అనేదానికన్నా అది ఎలుకల్ని పట్టడం ముఖ్యం. ప్రైవేటు విద్యారంగమా, ప్రభుత్వ విద్యారంగమా అనేదాన్ని కన్నా అందులో పేదలకు, మధ్య తరగతికి ఎదిగే అవకాశం ఉందా లేదా అనేది ముఖ్యం. అందుకు ప్రైవేటు రంగమైతే స్కాలర్‌షిప్పులు, ఫీజులు, హాస్టళ్ళు వంటి సౌకర్యాలను ప్రభుత్వమే కల్పించాలి. ఇలాంటి దృక్పథంతో ముందుకు సాగాల్సిన క్రమంలో వామపక్షాలు, మావోయిస్టులు దీనికి భిన్నంగా ఆయా వృత్తుల్లో గిట్టుబాటు కావాలని చెప్పడానికి

Dalithayugam-1
03-09-09
186

పరిమితమయ్యారు. దున్నుకోడానికి భూమి కావాలని అంటూ ఆధునిక అభివృద్ధిలో అత్యున్నత స్థాయికి ఎదగాలని, అత్యున్నత రాజకీయ నాయకులుగా ఎదిగి సమాజాన్ని మీరే మార్చాలనే ఉదాత్త లక్ష్యాలను పక్కదారి పట్టించారు.

పాత కుల వృత్తుల్లో శతాబ్దాల తరబడి జీవచ్ఛావల్లా బతుకుతూ ఆకలితో, ఆత్మహత్యలతో చావాలని, అలాగే బతకాలని కోరే హక్కు ఎవరికీ లేదు అని ఖండించాను. వారి వృత్తులు పోతాయని తెలిసినప్పుడు ఆధునిక వృత్తులు ఎలా చేపట్టాలో అందుకు ప్రభుత్వం, ప్రణాళికా సంఘం ఏ చేయాలో నిర్దిష్టంగా అధ్యయనం చేసి సూచించాల్సిన బాధ్యత సామాజిక శాస్త్రవేత్తల మీద ఉంది. అది వదిలేసి వారి పట్ల మొసలి కన్నీరు కార్చడం సరైంది కాదు. చిన్నవృత్తుల్లో నీచంగా చూడబడే వృత్తుల్లో, గిట్టుబాటు కాని వృత్తుల్లో ఎందుకుండాలి? మీరంతా ఆ వృత్తులు ఎందుకు చేయకూడదు? ఎందుకు చేయడం లేదు? అలాగే మా ప్రజలు కూడా మీ లాగే ఎదగాలని కోరుకుంటున్నాం. వాళ్ళు పేదరికంలో మగ్గాలని, పాత సాంప్రదాయక వృత్తుల్లో అలాగే వెనకటి జీవితాన్ని జీవించాలని మేం కోరుకోవడం లేదు.

అంతేకాకుండా భారతదేశంలో ఇంతదాకా ఇతర దేశాల నుండి వలసలు, సంపర్కాలు పెట్టుకున్నప్పుడే ఏ మార్పయినా రావడం జరిగింది. ఆర్యులు వచ్చాక అనేక మార్పులు వచ్చాయి. గ్రీకులు, కుషాణులు, మధ్య ఆసియా ప్రజలు, అరబ్బులు, ముస్లింలు, అటు తరువాత యూరప్ దేశాల ప్రజలు భారతదేశంలో ప్రవేశించిన క్రమంలోనే వారి రాజ్యాలు పరిపాలన ఏర్పర్చుకున్న క్రమంలోనే గ్రామీణ స్వయం పోషక, ఆర్థిక, కుల వ్యవస్థలో మార్పులు వచ్చాయి. ఆధునిక పరిపాలనా విధానం యూరప్ దేశాల వాళ్లు ఈ దేశాన్ని వలసగా మార్చుకుని నేర్పినదే. ఆధునిక విద్యా విధానం, ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ప్రజాస్వామ్య వ్యవస్థ మొదలైనవన్నీ ఇతర దేశాల సంపర్కంతో సమకూర్చుకున్నవే. అందువల్ల ఈ దేశంలో ఏ మార్పుకైనా ప్రపంచంలోని ఇతర దేశాలతో సంబంధంలో పరస్పర సంపర్కంలో ఉన్నప్పుడే సాధ్య పడుతున్నది. అప్పుడే కులవ్యవస్థ ప్రశ్నించబడుతుంది. కుల వివక్ష తొలగిపోతుంది. అన్ని కులాలు సమానమవుతాయి. అన్ని ప్రాంతాలు సమానమవుతాయి. అన్ని భాషలు సమానంగా చూడబడతాయి. ఇతర దేశాల వాళ్ళకి ఒక కులం వారు తక్కువగా, ఎక్కువగా కనపడరు. కనుక కుల సమస్య పరిష్కారం కోసం వారి సంబంధం ఎంతగానో ఉపకరిస్తుంది.

మహిళలకు సమాన హక్కుల కోసం ప్రపంచం అందుకున్న అభివృద్ధిని ఈ దేశంలోని డెబ్బయి శాతం గల బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజలు అందుకోడానికి ఫెమినిజం తెచ్చిన వెలుగు, అందుకు సంబంధించిన కార్యక్రమాలు మహిళలకు

Dalithayugam-1
03-09-09
187

రిజర్వేషన్లు ఎంతో అవసరం. అందుకు అంతర్జాతీయ మద్దతు లభిస్తుంది. కుల సమస్యపై కూడా అంతర్జాతీయ మద్దతు లభిస్తుంది. రంగు భేదం కన్నా తీవ్రమైన కుల సమస్య, కులవివక్షను రద్దు చేయడానికి ప్రపంచంతో సంబంధంలో ఉండి ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్ళి బతకడం ద్వారా ఎంతో ఉపయోగం.

కుల సమస్య మహిళలకు సమాన హక్కులు, రిజర్వేషన్ల కోసం ఎంతగానో ఉపకరిస్తుంది. ప్రపంచ ప్రజలందరూ ఒక్కటి కావడానికి పరస్పరం ఉత్పత్తులు, సేవలు మార్పిడి చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ప్రపంచం ఒక్కటిగా మారే అవకాశం పెరుగుతుంది. అందులో అందరికీ అన్ని అవకాశాలు అందుకునే కృషి జరగాలి. ఆయా దేశాల నిబంధనలను సడలించాలి. పాస్‌పోర్టు తప్ప వీసాలు అవసరం లేని విధంగా దేశాల మధ్య మనుషుల రాకపోకలు పెరగాలి. ఎక్కడైనా సరే పనిచేసుకుంటూ బతికే అవకాశం పెరగాలి.

భారతదేశంలోని వామపక్ష వాదులు, మావోయిస్టులు, మార్క్సిస్టులు మమ్మల్ని ప్రజా వ్యతిరేకులుగా ముద్రవేసే ప్రయత్నం చేశారు. వాళ్ళంతా ఈనాటి ఆధునిక అభివృద్ధిని అందుకుని మాట్లాడుతున్న వాళ్ళే. వారికి, వారి పిల్లలకు మనం పోటీ రావద్దని ఆయా వృత్తులు చేసుకొని బతకమని, దున్నుకుని బతకమని చెప్తున్నారని వాళ్ళకు చిత్తశుద్ధి వుంటే తమ కులాల వృత్తులు చేసుకుంటూ బతకాలని వారి పిల్లలకు అవే కులవృత్తులను నేర్పి, ఆ కులవృత్తుల్లో చేర్చాలని డిమాండ్ చేశాము.

మీలాగా బతకాలని మా వాళ్ళకు చెపుతుంటే ఎందుకు మీకు కడుపు మంట. ఇవాల్టి అభివృద్ధి మీకు రేపటి అభివృద్ధి మాకు అంటూ రేపటి అభివృద్ధి కోసం మీరు విప్లవించండి, మేము నాయకత్వం వహిస్తాం, సిద్ధాంతాలు చేస్తాం అంటారా? ఇవాల్టి అభివృద్ధిలో మా వాటా మేము ఎందుకు పొందకూడదు? ఇవాల్టి అభివృద్ధి అందుకున్న వాళ్ళు రేపటి అభివృద్ధికరమైన సమాజం కోసం ఎందుకు విప్లవించకూడదు. మీరు ఉద్యోగాలు చేసుకుంటూ ఎందుకు బతుకుతారు? ఉద్యోగాలు వదిలేయండి. ఉద్యమాల్లో చేరి మిమ్మల్ని మీరు నిరూపించుకోండి అంటూ మార్క్సిస్టు మేధావులను, శాస్త్రవేత్తలను, అభిమానులను, రచయితలను దేశవ్యాప్తంగా నిలదీశాము. లెఫ్ట్ ప్రివిలేజ్ రైట్ సౌఖ్యాలు అన్నీ కావాలనుకునే ఈ పెటీబూర్జువా మేధో వర్గాలను అన్ని విధాలుగా కార్నర్ చేశాము. వారి దగ్గర ఏ జవాబు లేదు. వాళ్ళే ఆధునిక అభివృద్ధిని అందుకోవడానికి పరిగెత్తారు. సొంత ఇల్లు కట్టుకున్నారు. టీవీలు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లు, ఫోన్లు, సెల్‌ఫోన్లు, సైకిల్ మోటార్లు, కార్లు వాళ్ళిళ్లలోనే స్థానం సంపాదించాయి. ప్రజలనేమో త్యాగాలు చేసి విప్లవోద్యమం దాకా వాళ్ల చదువులను, ఇల్లను, ఆధునిక

అభివృద్ధిలో వాటాను వాయిదా వేసే కార్యక్రమాలిచ్చారు. ఆ తరువాత ఇంటర్‌నెట్‌ను, సెల్‌ఫోన్‌లను, సాఫ్ట్‌వేర్‌లను కూడా వాళ్ళే వాడుకోవడం పెరిగింది.

కానీ తప్పుడు సిద్ధాంతాలు చేసి, ప్రజలు అభివృద్ధి అందుకోకుండా, అభివృద్ధి ఎలా అందుకోవాలో చెప్పకుండా తీవ్రమైన నష్టం చేశారు.

16 సంవత్సరాల ఉన్నత విద్య, ఉచిత వైద్యం, ప్రభుత్వం అందించగలిగే స్థాయికి సంపద సృష్టి పెరిగింది. అందువల్ల ప్రపంచంలోని అన్ని దేశాలు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడం సాధ్యమే. అలాగే వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వడం కూడా సాధ్యమే. గృహ వసతి మరొక ముఖ్యమైన అవసరం. ప్రభుత్వాలు ఆయుధాల కొనుగోలును అయిదు శాతం తగ్గిస్తే ప్రతి దేశంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించవచ్చు. వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వవచ్చు. నేడు మధ్య తరగతిని, పేదలను జీవితమంతా పట్టిపీడిస్తున్న సమస్యలు ఇవే. వీటికోసం జీవితాలను, జీతాలను వెచ్చించాల్సి వస్తున్నది. ఇన్సూరెన్సుల కోసం, విద్యా వైద్యం కోసం 40–70 శాతం దాకా ఖర్చయిపోతున్నది. అందువల్ల ప్రజలు నిరంతరం జీవన భద్రత లేక టెన్షన్‌కు గురవుతున్నారు. దాంతో సగం రోగాలు టెన్షన్ వల్ల వస్తున్నాయి. వీటన్నిటికీ పరిష్కారం ప్రభుత్వం యొక్క వృధా ఖర్చులను ఆయుధ ఖర్చులను తగ్గించి విద్యా, వైద్యం సంక్షేమ పథకాలకు వాటిని మళ్ళించడమే. సమగ్ర సామాజిక అభివృద్ధి కోసం, సమగ్ర సామాజిక వికాసం కోసం ప్రణాళికా సంఘం విస్తృతమైన ప్రణాళికలను రూపొందించి, అమలులోకి తెచ్చి లాభోక్తులు నిజంగా లాభపడే విధంగా చూసినప్పుడు 15 సంవత్సరాల్లో దేశంలో నిరక్షరాస్యులు లేకుండా పోతారు. అందరూ డిగ్రీ స్థాయిలో చదువుకుంటారు. ఆధునిక అభివృద్ధిని అందుకోవడం కోసం, సంపద పెంచడం కోసం సౌకర్యాలు పెరగడం కోసం అనేక నైపుణ్యాలను అలరవర్చుకుని కృషి చేస్తారు.

అన్ని రకాల చెట్లుంటేనే అడవి. సమాజంలో భిన్నత్వం – భిన్నత్వంలో ఏకత్వమే అడవి. సమాజంలోని భిన్నత్వంలో ఏకత్వం సాధించడమే దార్శనికుల, మార్గదర్శుల కర్తవ్యం.

తొలుత మొయిలి శ్రీరాములు నా జీవిత చరిత్రని రాయడానికి ప్రణాళిక వేశాడు. ఇద్దరం కలిసి చర్చించి ఆయా సన్నివేశాలకు, సంఘటనలకు, పరిణామాలకు అనువుగా సుమారు 60 అధ్యాయాలుగా కొన్ని శీర్షికల, సంఘటనల, సన్నివేశాల పేర్లతో పేర్కొనడం జరిగింది. సంక్షిప్తంగా కొంత రాసిన తరువాత దృశ్యీకరణ అందులోనూ రావడం లేదని గమనించాను. దృశ్యీకరణ రావడానికి మొయిలి శ్రీరాములు నేను జీవించిన కాలంలోకి వెళ్లడానికి మిత్రులను, స్థల కాలాలను

Dalithayugam-1

03-09-09

188

సందర్శించి చర్చించడం అవసరం. ఆయనకు ఆ వ్యవధి లభించలేదు. అది అలా ఆగిపోయింది.

నా డైరీలు, రాతప్రతులు పేరిట కంపోజ్ చేసిన వాటిని చూసి మొయిలి శ్రీరాములు వీటిని పుస్తకాలుగా తీసుకువస్తాను అని అన్నాడు. ఇద్దరం కలిసి చర్చించి, వర్గీకరించి మూడు సంపుటాలుగా తుది రూపం ఇచ్చాము. దానికి ఒక నేపథ్యం, సామాజిక పరిణామాల పరిచయం చేయడం అవసరమనిపించింది. అదే ఇది.

Dalithayugam-1

03-09-09

189

Dalithayugam-1

03-09-09

190

Dalithayugam-1

03-09-09

191

Dalithayugam-1

03-09-09

192

Dalithayugam-1

03-09-09

193

Dalithayugam-1

03-09-09

194

Dalithayugam-1

03-09-09

195

Dalithayugam-1

03-09-09

196

Dalithayugam-1

03-09-09

197

Dalithayugam-1

03-09-09

198

Dalithayugam-1

03-09-09

199

Dalithayugam-1

03-09-09

200

Dalithayugam-1

03-09-09

201

Dalithayugam-1

03-09-09

202

Dalithayugam-1

03-09-09

203

Dalithayugam-1

03-09-09

204

Dalithayugam-1

03-09-09

205

Dalithayugam-1

03-09-09

206

Dalithayugam-1

03-09-09

207

Dalithayugam-1

03-09-09

208

Dalithayugam-1

03-09-09

209

Dalithayugam-1

03-09-09

210

Dalithayugam-1

03-09-09

211

Dalithayugam-1

03-09-09

212

Dalithayugam-1

03-09-09

213

Dalithayugam-1

03-09-09

214

Dalithayugam-1

03-09-09

215

Dalithayugam-1

03-09-09

216

కృతజ్ఞతలు

బి.ఎస్.రాములు గారు వ్యక్తి కాదు... ఒక సామాజిక శక్తి... ఈ గ్రంథం చదివాక మీరు కూడా ఈ అభిప్రాయానికి వస్తారు.

నా వ్యాసాల్ని ప్రచురించిన పద్మపీఠం సంపాదకులు కొక్కుల భాస్కర్ గారికి నేటి నిజం, హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక సంపాదకులకు, మన పత్రిక, నడుస్తున్న చరిత్ర పత్రికా సంపాదకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎప్పుడు సెలవులు వచ్చినా ఇంటి ముఖం చూడకుండా పరిశోధన పేరుతో హైదరాబాదు వస్తుండడం వల్ల నా కుటుంబ సభ్యులకు కలుగుతున్న అసౌకర్యానికి తల్లిదండ్రులు మొయిలి చిన్నవాడు, నారాయణ వర్మలకు, నా భార్య ప్రభావతికి, కుమారులు చిన్నారులు మొయిలి మోహిత్, శ్రీకార్, మదన్, సోదరి భాగ్యలక్ష్మి చెల్లెలు శ్రీమతి బండారి సురేఖ, బావగారు తండాన రామారావుగార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. బావలు మంత్రి కొండలరావు, శీర రమేష్, శీర కోటీశ్వరరావుకు కృతజ్ఞతలు. ఖాజీపేట గ్రామపెద్దలు ముద్దాడ సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడుగారికి, గొలివి సత్యనారాయణ గారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు.

పై చదువుల్ని ప్రోత్సహించిన చిన్నాన్నలు మొయిలి అప్పారావు, మొయిలి సూర్యనారాయణ గార్లకు, మిగిలిన కుటుంబ సభ్యులు పిన్నమ్మలు, రమాదేవి, లచ్చుమ్మ గార్లకు, సోదరుడు మొయిలి విశ్వనాథం, మొయిలి మోహన్ ఎమ్మే తెలుగు పండిట్, హారతి, మొయిలి బావాజీ, మొయిలి శ్రీనివాసరావు, డా॥హేమలత, జగన్ గార్లకు కృతజ్ఞతలు.

మామయ్యలు శీర జగన్నాథరావు, మంత్రి సూర్యనారాయణ, అత్తలు మొయిలి చిన్నమ్మలు నర్సమ్మ, పోలమ్మ గార్లకు, కీ.శే. మొయిలి తాత గారు మొయిలి అశీరన్న, మొయిలి నీలమ్మ, మున్నమ్మలకు కృతజ్ఞతలు.

జవహర్ నవోదయ పాఠశాల చొప్పదండి ప్రిన్సిపాల్ డా॥పడాలి సత్యనారాయణ, వైస్ ప్రినిపాల్ జె.కృష్ణయ్య గార్లకు, ఉపాధ్యాయ మిత్రులు పి.వెంకటేశ్వర్లు, ఆర్ట్ టీచర్ భాస్కర్, వేణుగోపాల్, గౌసియా బేగం మేడమ్, వందనా పవార్, ఇ.ఎ.కె.చార్లెస్, శ్రీమతి శైలజారెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు. బంగోని ప్రకాష్ దంపతులకు, మంచాల శ్రీరాం, ప్రత్యక్ష పరోక్ష బంధుమిత్రులకు కృతజ్ఞతలు.

ఈ సంపుటాలను డీటీపీ చేసి ఇచ్చిన శారద, కృష్ణ, విజయ్‌కుమార్ గార్లకు నా ప్రత్యేక ధన్యవాదాలు.

Dalithayugam-1

03-09-09

217

బి.ఎస్.రాములుగారి జీవిత విశేషాలు

పుట్టిన తేది, స్థలం : ఆగస్టు 23, 1949, జగిత్యాల పట్టణం, కరీంనగర్ జిల్లా. పద్మశాలి కుటుంబం.

తల్లిదండ్రులు : కీ. శే. బేతి లక్ష్మిరాజు, కీ. శే. మిట్టపెల్లి నారాయణగారల ద్వితీయ పుత్రుడు. తండ్రి బొంబాయి బట్టల మిల్లు కార్మికుడు. ఆరో యేట 1955లో తండ్రి మృతి. తల్లి బీడీ కార్మికురాలిగా పిల్లలను పెంచి పోషించింది. 1991 జనవరి సంక్రాంతి రోజున మృతి.

బాలశిక్ష : సాతాని అయ్యోరు పంతులు, జగిత్యాల

ప్రాథమిక విద్య : 1955-60 మర్కజి (సెంట్రల్) ప్రైమరీ స్కూలు, జగిత్యాల.

హైస్కూలు విద్య : 1960-67 మల్టీపర్పస్ హైస్కూలు, జగిత్యాల.

కళాశాల విద్య : 1970-74 డి.ఓ.ఎల్, బి.ఓ.ఎల్, శ్రీలక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి, కరీంనగర్ జిల్లా.

తెలుగుపండిత శిక్షణ : 1979-80 కాకతీయ యూనివర్సిటీ, బీఈడీ కాలేజీ, హన్మకొండ.

పెళ్లి : 17, మే 1973, చెన్న నారాయణ, చెన్న గౌరమ్మల ఎనిమది పిల్లల్లో నాలుగో సంతానం ప్రథమ పుత్రిక - చెన్న శ్యామలతో, పైడిమడుగులో మెట్‌పల్లి తాలూకా, కరీంనగర్ జిల్లా. సాంప్రదాయిక వివాహం.

రచనారంగం : విద్యార్థి దశలో 1964 నుండి రచనలు చేస్తున్నారు. సాహిత్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగం : 1967-75 హైస్కూలు విద్యార్హతతో పోస్టాఫీసులో రావాల్సిన ఉద్యోగం రాకపోవడం, ఇతర ప్రాంతాల వాళ్ళు ఉద్యోగాలు ఆక్రమించడం వల్ల తొమ్మిది సంవత్సరాల పాటు నిరుద్యోగంలో చిన్న చిన్న వృత్తులు.

ఉద్యోగం : 17-12-1975 సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగం. 31 జులై 2007 ఉద్యోగ విరమణ.

ఉద్యమాలు :

- ధర్మపురి కళాశాలలో విద్యార్థి ఉద్యమాల నిర్వహణ. 1964లో ఆరెస్సెస్ శాఖకు వెళ్లుట. 1967 నుండి 1972 ఆర్ఎస్ఎస్ ముఖ్య శిక్షక్‌గా జగిత్యాల, ధర్మపురిలలో ఆరెస్సెస్ నిర్మాణం. 1976 నుండి సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం, జిల్లా, రాష్ట్ర శాఖల నిర్వహణ.
- 1977-80 ఉద్యోగ సంఘాల నిర్మాణంతో పాటు పీడీఎస్‌యూ, ఆర్ఎస్‌యూ విద్యార్థి యువజన సంఘాల నిర్మాణంలో చేయూత నందించడం. అధ్యయన తరగతుల నిర్వహణ. 1978 నుండి పౌరహక్కుల సంఘం, హుజూరాబాద్, రాడికల్ విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణం, అంబేద్కర్ సంఘాల నిర్మాణం. జిల్లా కార్యక్రమాలు.
- 1980 నుండి విరసం సభ్యులు. 1983- పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి. 1984 జనవరి విరసం సభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. 1984లో అనంతపూర్‌లో జరిగిన రాడికల్ యువజన సంఘం రాష్ట్ర మహా సభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక.

- 1984–88 రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. నక్సలైట్ కార్యకలాపాలు చేస్తున్నారనే ఆరోపణలతో 1984 జనవరిలో జగిత్యాలలో అరెస్టు. కరీంనగర్ జైలులో నిర్బంధం. ఉద్యోగం నుండి సస్పెండ్ చేయుట. అప్పటి నుండి పూర్తి కాలం రాడికల్ యువజన సంఘం, పౌర హక్కుల సంఘం, రాష్ట్ర కార్యకలాపాల నిర్వహణ.
- 1985లో పెరిగిన నిర్బంధం వల్ల 1985 జూన్ నుండి 90 వరకు రహస్య జీవితం. ఈ కాలంలో గద్దర్, వరవరరావు, సంజీవ్ తదితరులతో కలిసి అఖిలభారత సాహిత్య, సాంస్కృతిక, ఉద్యమ ప్రచార యాత్ర నిర్వహణ.
- 1990 ఏప్రిల్ 1న కరీంనగర్ జిల్లా మంథనిలో జరిగిన రాడికల్ యువజన సంఘం జిల్లా మహా సభల్లో బహిరంగ జీవితంలోకి రాక. ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి హయాంలో పోలీస్ కేస్ పెండింగ్‌లో ఉంచి తిరిగి ఉద్యోగంలో చేర్చుకుంటూ జిల్లా కలెక్టర్, ఉత్తర్వులతో 17 ఏప్రిల్ 1990లో సుల్తానాబాద్‌లో ఉద్యోగంలో చేరిక. జూలైలో జగిత్యాల బదిలీ.
- 1997 దాకా జగిత్యాలలో ఉద్యోగం. 1997 – 2000 సిరిసిల్లలో ఉద్యోగం. తర్వాత తిరిగి జగిత్యాలలో ఉద్యోగం. 2003 నుండి దీర్ఘ కాలిక లీవు పెట్టి పూర్తి కాలం సామాజిక జీవితానికి అంకితం చేశారు.
- 1990 నుండి రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల ఐక్యత కోసం పూలే, అంబేడ్కర్ బుద్ధిస్ట్ దృక్పథంతో సాహిత్య, భావజాల ఉద్యమాల నిర్మాణం. రాష్ట్రవ్యాప్త పర్యటన. వందలాది ప్రసంగాలు.
- 1992 డిసెంబర్ 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక ఏర్పాటు. దానికి వ్యవస్థాపక కన్వీనర్.
- 1993 ఫిబ్రవరి 12, 13 తేదీల్లో హైదరాబాద్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆం.ప్ర. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నిక. రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రచయితలను కళాకారులను సామాజిక కార్యకర్తలను తీర్చిదిద్దుట. రాజకీయ రంగంలో ఈ దృష్టితో పనిచేసే యువతరాన్ని తయారుచేయుట.
- 1996 నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సభలు, సమావేశాలు వ్యాసాలు ప్రసంగాలు. తెలంగాణ రచయితల, కళాకారుల, మేధావుల సమీకరణ. సైద్ధాంతిక వ్యాసాలు, పుస్తకాలు. తెలంగాణ రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక కన్వీనర్.

తెలంగాణ తల్లి రూపకల్పన : తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, భాషను వెలికి తీస్తూ, ఉద్యమిస్తూ అందులో భాగంగా తెలంగాణ తల్లి రూపకల్పన చేశారు. క్యాలండర్‌లు, విగ్రహాలు వెలయించారు.

పత్రికా సంపాదకత్వం : 1977లో సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగస్తుల కోసం సంఘమిత్ర పత్రిక ప్రచురణ. 1980 నుండి మంటలు పక్షపత్రిక. సృజన మాసపత్రిక. 1983 నుండి చాటింపు పక్షపత్రిక సంపాదక మిత్ర మండలిలో కృషి. 84లో కరీంనగర్ కేంద్రంగా జీవగడ్డ దినపత్రిక నిర్వహించాలని విజయ కుమార్‌తో అవగాహన. మధ్యలో నిర్బంధం వలన ఆగిపోవుట. 1995 నుండి దరకమే ఐక్యవేదిక తరపున గబ్బిలం మాసపత్రిక ప్రచురణ.

ఆం.ప్ర.దరకమే ఐక్య వేదిక ద్వారా కృషి :

- దరకమే ఐక్య వేదిక రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలు, సభలు, సమావేశాలు.
- వందలాది పాటలు, కథలు, 200 పుస్తకాలు వెలువడ్డాయి. కంచ ఐలయ్య గారి నేను హిందువునెట్లయిత గ్రంథం దరకమే ఐక్యవేదిక పునాది నుండి వెలువడిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. వందలాది వ్యాసాలు, దేశవ్యాప్తంగా ప్రసంగాలు.
- 125పైగా పుస్తకాలకు పీఠికలు. కథా శిక్షణా శిబిరాలు సాహితీ శిక్షణా తరగతులు సిద్ధాంత అధ్యయన తరగతులు.
- 150కి పైగా కథలు, ఆరు నవలలు, 150 సిద్ధాంత వ్యాసాలు, 150 సాహిత్య వ్యాసాలు, పది తాత్త్విక గ్రంథాలు, మూడు అలంకార శాస్త్ర గ్రంథాలు.
- వివిధ కథా సంకలనాల్లో వీరి కథలు 50 వరకు ప్రచురించబడ్డాయి.
- రాష్ట్రంలో వివిధ సంస్థల ద్వారా, ఇతర రాష్ట్రాల్లో నాగపూర్, ఢిల్లీ, పానిపట్, నగరాల్లో పలు సత్కారాలు, సన్మానాలు.
- 1993లో కథా సాహితీ వేదిక ప్రారంభం.

కరీంనగర్ బుక్ ట్రస్ట్ ప్రచురణలు : 1982లో నిజాం వెంకటేశంతో కలిసి కరీంనగర్ బుక్‌ట్రస్ట్ స్థాపన. బతుకుపోరు నవల, భూమి, బొగ్గు పొరల్లో, అడవిలో వెన్నెల కథా సంపుటాల ప్రచురణ.

విశాల సాహిత్య అకాడమీ స్థాపన : బహిరంగ జీవితంలో వచ్చాక 1990లో విశాల సాహిత్య అకాడమీ ప్రారంభించారు. పుస్తకాల ప్రచురణ. కథా శిక్షణ శిబిరాల నిర్వహణ. సాహిత్య సభలు. సిద్ధాంత అధ్యయన తరగతుల నిర్వహణ. వందలాది యువ రచయితలను తీర్చిదిద్ది వారి రచనలను పత్రికల్లో ప్రచురణకై చేయూత. వారి పుస్తకాల ప్రచురణ. వందలాది యువ రచయితలకు ఇంటింటి గ్రంథాయం ఏర్పాటు చేసుకోవడానికి కృషి.

ముఖ్యమైన ఉద్యమాలు, కార్యక్రమాలు :

- 1973లో ధర్మపురి కాలేజీలో రెండు నెలల పాటు
- విద్యార్థుల సమ్మె నిర్వహణ. ఆరెసెస్ ద్వారా వ్యక్తిత్వ వికాస,
- దేశభక్తి ప్రచారం. 1977–80 రాడికల్ విద్యార్థి యువజన సంఘాల నిర్మాణం. అంబేడ్కర్ సంఘాల నిర్మాణం. ప్రచురణ 1990 నుండి విశాల సాహితి ప్రచురణల ప్రారంభం. 1995 నుంచి విశాల సాహితి తరఫున సభలు, సమావేశాలు.

సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం : 2002 నుండి సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం స్థాపన.

Dalithayugam-1
03-09-09
218

సభలు, సమావేశాలు, పుస్తక ప్రచురణ. విశాల సాహితి, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం తరపున 90 పుస్తకాల ప్రచురణ.

గృహ గ్రంథాలయం : వందలాది గ్రంథాలతో 1980 నుండి గృహ గ్రంథాలయ నిర్వహణ. ఉద్యమ కారులుగా విద్యార్థులను, యువకులను చైతన్య పరచుట కోసం మొబైల్ గ్రంథాలయ నిర్వహణ. 1984లో పోలీసులు అరెస్టు చేసినపుడు పుస్తకాలు ఎత్తుకుపోయారు. 1990నుండి తిరిగి పుస్తకాల కొనుగోలు. గ్రంథాలయ నిర్వహణ. 2004లో షోలాపూర్ గ్రంథాలయానికి 600 గ్రంథాలు వితరణ. పరిశోధక విద్యార్థులకు సహకారం.

కార్యాలయ స్థాపన : 1992 నుండి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీగారి జల దృశ్యంలో దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక కార్యాలయ నిర్వహణ. 2002 నుండి విశాల సాహితి, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయానికి ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ సమీపంలో కార్యాలయ నిర్వహణ. పుస్తక ప్రచురణ వేగవంతం చేయడం.

ముఖ్యమైన ఉద్యమాలు: 1977–1990 నక్సలైట్ భావజాలంతో పలు ప్రజాసంఘాల ఉద్యమాల నిర్మాణం. 1985–90 దేశ వ్యాప్తంగా పర్యటన. వందలాది రచయితలతో, కళాకారులతో, ఉద్యమ కారులతో చర్చలు, ప్రసంగాలు. 1996–2008 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. 1990–2008 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత కోసం అనేక సంస్థల నిర్మాణం, అధ్యయన తరగతులు. సాహిత్య శిక్షణ తరగతులు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలు. బుద్ధుడి నుండి జ్యోతిరావు పూలే, అంబేద్కర్‌ల దాకా సామాజిక తాత్వికత భూమికను అంబేద్కరిజంగా సమన్వయం చేసి రాష్ట్ర వ్యాప్తంగా భావజాల ఉద్యమ నిర్మాణం.

భావజాల ఉద్యమం : 1991లో వెలువడిన 'గతితర్క తత్వదర్శన భూమిక' అనే తాత్విక గ్రంథం తెలుగునాట భావజాల చర్చతీరును పూర్తిగా మార్చివేసింది. ప్రపంచ భావజాల ఉద్యమరంగంలో ఈ గ్రంథం ఒక మైలురాయి. ఈ గ్రంథం బీసీ, ఎస్సీ, ఎస్టీల వేదికైన దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక నిర్మాణానికి తాత్విక పునాది. 'గతితర్కం – అంబేద్కరిజం – మార్క్సిజం', 'అంబేద్కరిజం – సోషలిజం', 'నేను ఎవరు?', 'ప్రేమ అంటే ఏమిటి?', 'భౌతికవాద ప్రాపంచిక దృక్పథం', 'జ్ఞానం పుట్టుక', 'బహుజన తత్వం', 'బీసీలు ఏం చేయాలి?', 'భారతీయ చరిత్ర – శూద్ర దృక్పథం', 'బీసీలకు రాజకీయ అధికారం', 60 ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు', వందలాది పత్రికా వ్యాసాలు.

అరెస్టులు :
- 1980లో గ్రామాలకు తరలండి అని విరసం ఇచ్చిన పిలుపుతో వేములవాడ తాలూకా కోనరావుపేటకు వెళ్ళిన సందర్భంగా అరెస్టు.
- 1984 జనవరి 21న అరెస్టు. వారం రోజుల పాటు లాకప్‌లో. 20 రోజులు కరీంనగర్ జిల్లా జైలులో.
- 1985 ఏప్రిల్ 20వ తేదీన ఇంద్రవెల్లి సభ సందర్భంగా గుడి హత్నూరులో అరెస్టు. పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.బాలగోపాల్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.మురళీమనోహర్, ప్రొ॥ సీతా రామారావు తదితరులతో కలిసి మూడు రోజులు ఉట్నూరు, ఆదిలాబాద్‌లలో లాకప్‌లో.
- 1987లో హైదరాబాద్‌లో అరెస్టు. తప్పించుకోవడం

విశ్వవిద్యాలయ సెమినార్లు : కాకతీయ, ఆంధ్ర, ఉస్మానియా, శ్రీకృష్ణదేవరాయ, విశ్వవిద్యాలయాల్లో సెమినార్ పత్రాలు.

అవార్డులు :
- కొడవటిగంటి కుటుంబరావు స్మారక విప్లవ కథకు ఇచ్చే పురస్కారం – ఆదివాసుల జీవితాన్ని – పోరాటాన్ని చిత్రించిన "అడవిలో వెన్నెల" కథకు 1984 అక్టోబరు 28న తెనాలిలో కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, కొడవటిగంటి వరూధినిల నేతృత్వంలో పురస్కారం.
- బీడీ కార్మికుల జీవితాలను చిత్రించిన 'బతుకుపోరు' నవలకు 1992లో డా॥దాశరథి రంగాచార్య పురస్కారం.
- మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, బీ.సీ. ఉద్యమ నాయకులు, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం 1992.
- వరంగల్ జిల్లా 'పాలకుర్తి సోమన కళాపీఠం' వారి "పాల్కురికి సోమన" పురస్కారం–1995.
- ప్రముఖ హేతువాది త్రిపురనేని రామస్వామి చౌదరి పేరిట గల తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం–1995.
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారిచే 2002 లో బి.యస్.రాములు 'మమతలు మానవ సంబంధాలు' కథ సంపుటికి ఉత్తమ కథా సంపుటి పురస్కారం.
- షోలాపూర్–సిరిసిల్ల పద్మపీఠం వారిచే "పద్మాంజలి అవార్డు"–2001.
- దళిత సాహిత్య అకాడమీ, ఢిల్లీ వారిచే మహాత్మా జ్యోతిరావ్ పూలే ఫెలోషిప్ 2001.
- హర్యానాలోని పానిపట్‌లో ప్రేమ్‌చంద్ సమకాలికులు జయప్రకాశ్ నారాయణ్ సహచరుడైన బిహార్ కథకుడు రామవృక్ష బేనిపురి శతజయంతి పురస్కారం 2003.

స్వర్ణకంకణాలు :
- టిఆర్ఎస్, కెసిఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ సంబురాలు– 2007లో తెలంగాణ తల్లి రూపకల్పన చేసిన సందర్భంగా బంగారు గండపెండేరంతో నిజాం కాలేజి, హైదరాబాద్‌లో సత్కారం
- డా॥ పి.యశోదారెడ్డి స్మారక తొలి పురస్కారం, స్వర్ణకంకణం. తేది : 4–11–08

ఇతర విశేషాలు : 50వ జన్మదిన స్వర్ణోత్సవాల సందర్భంగా జగిత్యాలలో సాహిత్య సదస్సు. 'సామాజిక తత్వవేత్త' బిరుదు ప్రదానం. 50వ జన్మదిన ప్రత్యేక సంచిక ప్రచురణ. పలు సామాజిక రాజకీయ, సాహిత్య అంశాలపై

Dalithayugam-1
03-09-09
219

ఇంటర్వ్యూలు. 52 పుస్తకాల ప్రచురణ. మరో 10 పుస్తకాలు అముద్రితాలు. తల్లి మిట్టపల్లి లక్ష్మీరాజు పేరిట 27 మందికి విశాల సాహితీ కథా పురస్కారాల ప్రదానం.

సామాజిక సేవారంగం : మద్యపాన వ్యతిరేక, అవినీతి వ్యతిరేక ఉద్యమాలు. పేదలను విద్యావంతులను చేయడం. వ్యక్తిత్వ వికాసం తోడ్పాటు. ఆత్మవిశ్వాసం పెంచడం. రచయితల్లో, సామాజిక కార్యకర్తల్లో వారి సృజన, నాయకత్వ శక్తి సామర్థ్యాలను వెలికి తీయడం, ప్రోత్సహించడం. స్త్రీ విద్య ప్రాధాన్యత. ప్రజాస్వామ్య హక్కుల ప్రాధాన్యత వివరించడం. ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ. పర్యావరణ, ఆరోగ్య చైతన్యం. కనీస కూలీల, జీవన ప్రమాణాల పెంపుదలకోసం ఉద్యమించడం. పొదుపు ఉద్యమాల ఆవశ్యకత. ఆధునిక సమాజంలో అందుకోవాల్సిన స్థానం గురించి చేయూత నందించడం.

సంఘ సంస్కరణ : కులాంతర, మతాంతర వివాహాల ప్రోత్సాహం. కులాతీత, మతాతీత ప్రజాస్వామ్య, సామ్యవాద, సమగ్ర సామాజిక వికాసానికై సమస్త రంగాల్లో సంఘ సంస్కరణలకు ఉద్యమించడం. మూఢ విశ్వాసాల నిర్మూలన, వర్ణ, కుల వివక్షతల వ్యతిరేక ఉద్యమాలు, స్త్రీ విద్య, ఆయా కుల సంఘాలను సంఘ సంస్కరణలకై తీర్చిదిద్దుట. హిందూ, ముస్లిం, క్రైస్తవుల సమైక్యత. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజకీయ సామాజిక, సాంస్కృతికై కృషి. వివాహ పద్ధతులను, పండగలను, పాత సంస్కృతిని సంస్కరించుట. ఆధునిక విద్య, సమస్త అవకాశాలు అందరికీ అందేందుకు కృషి. కూడు, గుడ్డ, నీడ కోసం, జీవన ప్రమాణాల కోసం సమస్త మానవాళి వికాసం కోసం కృషి.

బి.ఎస్.రాములు రచనలపై
వెలుడిన గ్రంథాలు-పరిశోధనలు :

- 50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక
- బి.ఎస్.రాములు కథలు-ఒక పరిశీలన - కర్రె సదాశివ్, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ చేసి పుస్తకంగా వెలువరించారు.
- 'బతుకుపోరు-సామాజికత' ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పల్లా మాలతి చంద్ర ఎం.ఫిల్ పరిశోధనకు గోల్డ్‌మెడల్. పుస్తకంగా వెలువరించారు.
- ఎమ్.లలిత, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మరో పరిశోధనకు ఎం.ఫిల్ తీసుకున్నారు.
- అడవిలో వెన్నెల కథల సంపుటిపై పరిశోధన చేసి సెంట్రల్ యూనివర్సిటీలో రమేష్ ఎం.ఫిల్. తీసుకున్నారు.
- నిర్మల, తదితరులు కొనసాగిస్తున్న విశ్వవిద్యాలయాల పరిశోధనలు.
- బి.ఎస్.రాములు కథలపై, నవలలపై, ఇతర రచనలపై అనేక విశ్వవిద్యాయాల్లో కోవెల సంపత్ కుమారాచార్య నుండి సిహెచ్.వి. ప్రభాకర్‌రావు ద్వారా పలువురు సెమినార్ పత్రాలు వెలువరించారు.

Dalithayugam-1
03-09-09
220

బి.ఎస్.రాములు రచనలు

1.	బతుకుపోరు నవల (మూడవ ముద్రణ-2004)	1982
2.	పాలు - కథల సంపుటి	1991
3.	గతితర్క తత్వదర్శన భూమిక	1991
4	కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి? (6వ ముద్రణ-2005)	1993
5.	దళిత సాహిత్య గర్జన (మూడవ ముద్రణ-1995)	1993
6.	గతితర్కం - అంబేద్కరిజం - మార్క్సిజం	1993
7.	సాహూ ఇంటర్వ్యూలు	1994
8.	అంబేద్కరిజం - సోషలిజం	1994
9.	ప్రేమ అంటే ఏమిటి? (మూడవ ముద్రణ-2004)	1996
10.	స్మృతి కథల సంపుటి	1997
11.	జ్ఞానం పుట్టుక	1998
12.	భౌతికవాద ప్రాపంచిక దృక్పథం	1998
13.	నేను ఎవరు? గతితర్క తత్వదర్శన భూమిక	1998
14.	కథలబడి - కథా సాహిత్య అలంకార శాస్త్రం	1998
15.	మమతలు-మానవ సంబంధాలు కథల సంపుటి	2000
16.	వేపచెట్టు తెలంగాణ కథలు	2003
17.	సమగ్ర సామాజిక కథ 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు	2003
18.	బహుజనతత్వం (బీసీ, ఎస్సీ, ఎస్టీ సిద్ధాంతాలు-కార్యాచరణ)	2004
19.	బీసీలు ఏం చేయాలి?	2004
20.	బీసీ, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థి యువజనులారా!	2004
21.	తేనెటీగలు - కథల సంపుటి	2004
23.	పాలు-ఇతర కథలు	2004
24.	తెలంగాణ తల్లి ఎరుక	2005
25.	భారతీయ సమాజం-నేటి రాజకీయ సామాజిక పరిణామాలు	2004
26.	సాహిత్య చరిత్రను కొత్త చూపుతో తిరగరాయాలి	2004
27.	బతుకుపయనం - కథల సంపుటి	2005
28.	వ్యక్తిత్వ వికాసం-సామాజిక నాయకత్వం	2006
29.	జీవితం అంటే ఏమిటి ?	2006
30.	తెలంగాణ రాష్ట్ర చరిత్ర	2006
31.	తెలంగాణ రాష్ట్రం-నడుస్తున్న చరిత్ర	2006
32.	తెలంగాణ రాష్ట్ర ఉద్యమం - భవిష్యత్ కార్యక్రమాలు	2006
33.	తెలంగాణ జైత్రయాత్ర	2007
34.	అదిగదిగో తెలంగాణ-ఎంతో దూరంలో లేదు	2007
35.	తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మించండి మీ ఊరిని మీరే అధ్యయనం చేయండి	2007

36.	తెలంగాణ ఉద్యమంలో నక్సలైట్ల పాత్ర	2007
37.	తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మలుపులు	2007
38.	యుపిలో బిఎస్‌పి గెలుపు	2007
39.	60ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు	2007
40.	బీసీలకు రాజకీయ అధికారం	2007
41.	భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం	2007
42.	తెలంగాణ స్టేట్ నీడ్ ఆఫ్ రివైవల్	2008
43.	పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సోషల్ లీడర్‌షిప్	2008
44.	వాట్ ఈజ్ లైఫ్	2008
45.	తెలంగాణ స్టోరీస్	2008
46.	తెలంగాణ కథకులు-కథన రీతులు (మొదటిభాగం)	2008
47.	తెలంగాణ కథకులు-కథన రీతులు (రెండవభాగం)	2008
48.	పాట పుట్టుక	2008
49.	దళిత సాహిత్య యుగం సంపుటి-1	2008
50.	రాజ్యం - ప్రజలు	2008
51.	ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలు ఉద్యమాలు	2008
52.	**సామాజిక న్యాయం అంటే ఏమిటి?**	**2008**
53.	ప్రీతి ఎందరేను? (ప్రేమ అంటే ఏమిటి-కన్నడం)	2008

బి.ఎస్.రాములు గురించి వెలువడిన ఇతర గ్రంథాలు

1.	బి.ఎస్.రాములు50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక	1998-2000
2.	బి.ఎస్.రాములు కథలు-పరిశీలన కర్రె సదాశివ్, కాకతీయ యూనివర్సిటీ ఎంఫిల్ పొందినగ్రంథం	2007
3.	బి.ఎస్.రాములు బతుకుపోరు నవల-సామాజికత పల్లా మాలతి చంద్ర, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గోల్డ్ మెడల్ పొందిన ఎం.ఫిల్ గ్రంథం	2008

ముద్రణలో వున్న బి.ఎస్.రాములు ఇతర రచనలు

1. భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం-2, 3వ భాగాలు
2. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు, ఉద్యమాలు
3. గ్లోబలైజేషన్-నూతన సిద్ధాంతాలు అవగాహన పరిణామాలు-నా అనుభవాలు
4. పీఠికలు-ముందుమాటలు
5. విశ్వ సహజాతాలు (నవల-1985)
6. దొంగలు (నవల-1983)
7. బి.ఎస్.రాములు కవితలు
8. సారా సారాంశాలు (నవల-1984)

బి.ఎస్.రాములు విశాల సాహితి కథా పురస్కారాలు

	రచయిత పేరు	కథల సంపుటి పేరు	సంవత్సరం
1.	నవీన్	జీవితకాల కృషికి	1998
2.	భూపాల్	'అంబల్లబండ' కథల సంపుటి	1998
3.	ఆడెపు లక్ష్మీపతి	నాలుగు దృశ్యాలు కథల సంపుటి	1998
4.	కాలువ మల్లయ్య	'మాకథలు' కథల సంపుటి	1999
5.	ముదిగంటి సుజాతారెడ్డి	'విసుర్రాయి' కథల సంపుటి	1999
6.	శాంతి నారాయణ	'పల్లేరు ముళ్ళు' కథల సంపుటి	1999
7.	కె.వి.నరేందర్	అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి	1999
8.	ఓల్గా	ప్రయోగం, రాజకీయ కథలు	2000
9.	ఎండ్లూరి సుధాకర్	మల్లెమొగ్గల గొడుగు కథలు	2000
10.	ఎ.అప్పలనాయుడు	ప్రత్యామ్నాయం కథలు	2000
11.	వి.చంద్రశేఖర్‌రావు	లెనిన్ ప్లేస్ కథలు	2000
12.	నాగప్పగారి సుందరరాజు	మాదిగోడు, మావూరి మైసమ్మ	2000
13.	గంటేడ గౌరనాయుడు	ఏటిపాట కథలు	2000
14.	బోయ జంగయ్య	బోజ కథలు	2001
15.	అంబల్ల జనార్ధన్	బొంబాయి కథలు	2001
16.	కుప్పిలి పద్మ	ముక్తి కథలు	2001
17.	సింగమనేని నారాయణ	సింగమనేని కథలు	2001
18.	పి.చంద్	భూనిర్వాసితులు, శేషగిరినవల	2001
19.	పెద్దింటి అశోక్ కుమార్	వలస బతుకులు, ఎడారి మంటలు	2001
20.	డా॥ కొలకలూరి ఇనాక్	అస్పృశ్యగంగ (కథల సంపుటి)	2002
21.	నంబూరి పరిపూర్ణ	ఉంటాయి మాకుషస్సులు	2002
22.	పులుగు శ్రీనివాస్	సంకర విత్తులు (కథల సంపుటి)	2002
23.	కె.వరలక్ష్మి	మట్టి-బంగారం (కథల సంపుటి)	2003
24.	నల్లాల లక్ష్మీరాజం	తిరుగు ప్రయాణం	2003
25.	బెజ్జారపు వినోద్ కుమార్	గవ్వలమూట (కథలసంపుటి)	2003
26.	దాశరథి రంగాచార్య	జీవనయానం (స్వీయచరిత్ర)	2002
27.	కీ.శే. బిట్ల నారాయణ	నా అంతరంగ తరంగాలు	2003

బి.ఎస్.రాములు సంపాదకత్వంలో వెలువడిన రచనలు

1.	దళిత భారతి కవితా సంపుటి-ఆకుల గంగాధర్	1993
2.	ప్రభాతం నాటిక - కె.సీతారాములు	1993
3.	కరీంనగర్ జిల్లా దళిత పాటలు	1993
4.	హాస్టల్ కథలు - కె.సీతారాములు,	1995
5.	గబ్బిలం మాసపత్రిక	1995
6.	ప్రవహించే పాట - ఆంధ్రప్రదేశ్ దళిత పాటలు	1996
7.	కె.రామలక్ష్మణ్ దళిత పాటలు	1997

8.	ఆధునిక కథా సరిత్సాగరం, కరీంనగర్ జిల్లా కథలు	1997
9.	జన్మభూమి – కె.సీతారాములు, నాటికలు, పాటలు	1998
10.	కె.వి.నరేందర్ – అమ్మ కథల సంపుటి	1998
11.	ముదిగంటి సుజాతారెడ్డి – విసుర్రాయి కథల సంపుటి	1998
12.	జనజాగృతి పాటలు – కె.రామలక్ష్మణ్	2000
13.	ప్రజాధ్వని పాటలు – ఎర్దండి భూమయ్య	2001
14.	కన్నీటి గాథలు–కవితా సంపుటి – ఎర్రశ్రీ	2001
15.	అనాగరిక గేయం–మునిమడుల రాజారావు	2001
16.	అంకురం–కవితా సంపుటి – గోపగాని రవీందర్	2001
17.	"పద్మపీఠం సంపాదకీయాలు" – కొక్కుల భాస్కర్	2002
18.	ఆధునిక కథా సరిత్సాగరం, కరీంనగర్ జిల్లా కథలు 2వ సంపుటి	2003
19.	పి.చంద్ – భూనిర్వాసితులు కథా సంపుటి	2003
20.	మేలుకో రైతన్న – అట్ల ఆగరెడ్డి పాటలు	2003
21.	తిరుగు ప్రయాణం – నల్లాల లక్ష్మిరాజం కథలు	2004
22.	భారతీయ సాహిత్యం – తెలుగు కథలు	2004
23.	పెద్దింటి అశోక్ కుమార్–వలస బతుకులు కథల సంపుటి	2004
24.	విశాల సాహితీ – బీసీ, ఎస్సీల పాటలు	2004
25.	విశాల సాహితి సామాజిక చైతన్య గీతాలు	2004
26.	మన్నుబువ్వ – జాజుల గౌరి కథల సంపుటి	2004
27.	సామాజిక అర్థశాస్త్రం – ఎస్.విద్యాసాగర్	2004
28.	వొడ్నాల సూర్య కవితలు	2004
29.	దార్ల రామచంద్ర – కిర్రు చెప్పులు కథల సంపుటి	2004
30.	అంబల్ల జనార్ధన్ కథలు	2004
31.	నాగమ్మ పూలే – కులగీత దీర్ఘకవిత	2004
32.	బతుకుతాడు నవల – నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్	2004
33.	ప్రేమాంజలి – సారంగ కవిత	2004
34.	బి.సి.కులాల దృక్పథం–ఇ.వెంకటేశు	2004
35.	బతుకుబాటలో కవితా సంపుటి – వి.శంకర్	2006
36	గూడ అంజయ్య – దళిత కథలు	2006
37.	దళిత దర్శనం–డా॥కత్తి పద్మారావు	2008
38.	మహాత్మా జ్యోతిరావు పూలే–డా॥కత్తి పద్మారావు	2008
39.	దనుంబోదు బౌద్ధ స్థూపం–అజ్మీర్ వీరభద్రయ్య	2008
40.	జీవనవాహిని స్వీయచరిత్ర – వంగా నర్సయ్య	2008

బోధించు పోరాడు సమీకరించు

స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం

ఆం.ప్ర. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక

(ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీల)

12 డిసెంబరు 93న కరీంనగర్‌లో జరిగే జిల్లా ప్రథమ మహాసభలకు విరాళాలకై విజ్ఞప్తి

నిరుడు 6 డిసెంబర్ 92 నాడు కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఒక రూపుదిద్దుకున్నది. అంతకుముందు జూన్‌లో ఉట్నూరులో జరిగిన దళిత సాహిత్య సమావేశం ఇందుకు బీజం వేసింది. గత ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ప్రథమ రాష్ట్ర మహాసభలు దిగ్విజయంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్రంలో పలు జిల్లాల్లో జిల్లా శాఖలు ఏర్పడి పని చేయనారంభించాయి. అలా కరీంనగర్ జిల్లా ప్రథమ మహాసభలు 12 డిశంబరు 93 ఆదివారం నిర్వహించబడుతున్నవి.

ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యవేదిక అయిన ఈ సంస్థ సమస్త రకాల పీడనకు అణిచివేతలకు వ్యతిరేకంగా కృషి చేస్తుంది. చార్వాకులు, బుద్ధుడు, గురునానక్, కబీరు, అమీరఖుస్రో, వేమన, జ్యోతిబాపులే, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణగురు, అంబేద్కర్, జాషువా, తదితరుల వారసత్వాన్ని స్ఫూర్తిని స్వీకరించి తాత్విక భావజాల సాహిత్య సాంస్కృతిక సామాజిక రంగాల్లో కృషిచేస్తుంది. దళితుల అనగా ఎస్సీ, బీసీ, ఎస్టీల నిజమైన సంస్కృతి సాహిత్యం అభివృద్ధి కోసం మరియు అన్ని రంగాలలో వీరు నాయకత్వంలోకి రావడానికి సైద్ధాంతిక మద్దతునిస్తుంది.

ఈ జిల్లా మహాసభల సందర్భంగా 'కరీంనగర్ జిల్లా దళిత పాటలు' "సాహు ఇంటర్వ్యూలు" బి.యస్.రాములు గారి 'కులంలో యిమిడివున్న అంశాలు – పరిష్కారాలు' "హుస్నాబాద్‌లో జూన్‌లో నిర్వహించిన కథా వర్కు షాపు ప్రసంగాలు" హుజూరాబాద్‌లో జూలైలో నిర్వహించిన క్లాసుల ప్రసంగాలు, తదితర పుస్తకాల్ని వెలువరించాల్సి వుంది. అట్లే ఈ జిల్లా మహాసభల ప్రసంగాలను కూడా పుస్తకం రూపంలో తేవాల్సి వుంది.

ఈ మహాసభలకు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రఖ్యాత మేధావి అయిన డి.ప్రేమవతి, అంతర్జాతీయ స్థాయిలో స్త్రీ వాద ఉద్యమ తాత్వికతలో దళిత స్త్రీల కనువుగా సిద్ధాంత చర్చ చేస్తున్న ప్రఖ్యాత అమెరికన్ (ప్రస్తుతం భారతీయురాలు) రచయిత్రి గెయిల్ ఒంవెద్, మరాఠీలో ప్రఖ్యాత దళిత ఉద్యమ నిర్మాత దళిత లిబరేషన్ ఆర్మీ చీఫ్ జోగిందర్ కవాడే (నాగపూర్), మరాఠి దళిత సాహిత్యం ప్రఖ్యాతులైన అర్జున్ దాంగ్లే (బొంబాయి) తదితరులను ఆహ్వానిస్తున్నాము.

ఈ జిల్లా మహాసభలకు విరివిగా విరాళాలిచ్చి వేలాదిగా తరలివచ్చి ఈ సభలను జయప్రదం చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఆం.ప్ర. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక, కరీంనగర్ జిల్లా శాఖ.

"ఏమైనా బావా! నాయిన అవ్వా ఒక్కరేమిటి మా యి పల్లెలో వ్యవసాయాన్ని నమ్ముకొని బతికినవాళ్ళున్నారు గానీ బాగుపడ్డవారు లేరు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే తిండికి కొరత లేదు. కాని జంతువులు కూడా ఏదో తిని బతుకుతాయి. మా మీద వేసే పన్నుల్తో అడ్డగోలు జీతాలు దొబ్బి మీరు సుఖాలనుభవిస్తున్నారు. మేమేమో వెనకబడి పోతున్నాం. ప్రభుత్వం మీ సౌఖ్యాల కోసమే పుట్టినట్టుంది. మా కోసమని పుట్టిన ప్రభుత్వం మీ సుఖాలు, సౌకర్యాలకి పరిమితమైపోయింది. అందుకే నువ్విట్లా ఎర్రగా, బుర్రగా నునుపు తేలినావు. నీ పిల్లలు బాగా చదువుకొని ఎదుగుతున్నారు." అది నన్ను ఉద్దేశించిన మాటైనా మా ఆవిడ తననే అన్నట్టు ముఖం మాడ్చుకుంది.

ఈ కుటుంబం విచ్ఛిన్నమైతే పిల్లలు మనుషులందరిని ప్రేమించడం ప్రారంభిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఉన్నంతకాలం తల్లిదండ్రులు తమ పిల్లల్ని మాత్రమే ప్రేమిస్తారు. కుటుంబం మొత్తం సమాజాన్ని ప్రేమించే సంస్కృతిని నేర్పితే కుటుంబం విచ్ఛిన్నమయ్యే అవసరమూ లేదు. వ్యక్తిగత కుటుంబంలో పిల్లలు తన వాళ్ళను, తన స్వార్థాన్ని మాత్రమే ప్రేమిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఒక పంజరం.

జీవితంలో ఇలా ఎంతో అవసరమైన ప్రతి సమయంలో నీవు సాయం చేయగలిగిన స్థాయిలో ఉండీ చేయలేదు. ఎందుకో తెల్సా! నేనంటే నీకున్న చిన్నచూపు. మధ్య తరగతిగా వున్న నువ్వు చెప్పడమే తప్ప దేన్ని ఆచరించని నీ వర్గస్వభావం. క్రమంగా నేను ఎదిగితే నీలో చూసి ఓర్వలేనితనం. నీ సానుభూతి మీదనే నేను జీవితమంతా బతకాలని కోరుకున్నావు. అసలు సమయాల్లో ఆదుకోని నీ సానుభూతి నా మీద ఆధిక్యత చెలాయించడానికే తప్ప నీది నిజమైన ప్రేమ కాదని తెల్సుకోవడానికి నాకే దశాబ్దాలు పట్టింది.

"సరూ! పారిశ్రామికీకరణ మీకు ఆధునిక అభివృద్ధిని, నాగరికతను యిచ్చింది. కాని వాళ్ళకు ఉన్న కులవృత్తులు పోగొట్టింది. జీవితాలు కాలే కడుపులతో కొడిగట్టిపోయినై. అంబేద్కర్ ఎందరికో వెలుగు చూపినా గాంధీ పంథాయే రహదారి అయింది. కాని ఈ యిద్దరికి గురువైన జ్యోతిబా పూలే వేసిన బీసీల దారి అక్కడే ఆగిపోయింది."

"చూడు కాంత్. మహాత్మాపూలే తన భార్యకు అక్షరాలు నేర్పి టీచర్గా తీర్చిదిద్దాడు. ఆ సావిత్రిబాయి పూలే మన దేశంలోని మొదటి మహిళా టీచరు. ఈ ఆదర్శాన్ని నీవెందుకు ముందుకు తీసుకు పోకూడదు. నీ భార్య పద్మ మరీ చదువు రానిదేమీ కాదు. ఇంటర్ చదివిన అమ్మాయిని నీకనుకూలంగా తీర్చిదిద్దుకోలేకపోతే ఇక సమాజాన్నెలా తీర్చిదిద్దుతావు. ఆమె నీకు చెప్పకుండా పోయింది సరే. మరి నువ్వేపోయి రమ్మని ఎందుకడగలేదు. సరవ్వ వల్లనే నా సంసారం గిట్లయిందని మీ ఆవిడ అనుకుంటే ఆ తప్పు ఎవరిది. అలా అనుకోవాలనే నీ ఉద్దేశమా!"

తెలంగాణ తల్లి ఎరుక

1910 నుండి తెలంగాణ, నైజాం రాజ్యం గురించి రాయబడిన చరిత్రనంతా ప్రశ్నించవలసిందే. తిరిగి కొత్తగా తిరగరాసుకోవలసిందే. 1910 నాటి వరకు ప్రపంచంలో దక్కను పీఠభూమి నిర్వహించిన చారిత్రక పాత్ర భారత ఉపఖండంలో యూరోపు ఆధిపత్యం పెరగడానికి, యూరోపు సింహాసనం నిలువడానికి దోహదం చేసిన టిప్పుసుల్తాన్, నిజాం, మరాఠా రాజుల మధ్య, రాజ్యాల మధ్య కొనసాగిన శత్రుత్వాలు ఎలా కారణమయ్యాయో సరోజని రేగాని రాసిన "నిజాం-బ్రిటీష్ సంబంధాలు" సిద్ధాంత గ్రంథం స్పష్టంచేస్తుంది. నిజాం రాజ్యం ఆసరాతోనే మరో వందేళ్ళు బ్రిటీష్ సామ్రాజ్యం భారతదేశంలో కొనసాగడం ఎలా సాధ్యపడిందో సరోజని రేగాని గ్రంథం సరైన సాక్ష్యాధారాలతోసహా నిర్ధారించింది. ఆ యుద్ధాల ఖర్చు కింద 1768లో కోస్తాంధ్ర తీరప్రాంతాన్ని, 1798లో రాయలసీమ ప్రాంతాన్ని నిజా రాజు బ్రిటీషువాళ్ళకి దత్తం చేశాడు. మద్రాసు రాష్ట్రంలో తెలుగువాళ్ళు పలు కష్టాలు, అవమానాలు అనుభవించారు. తెలుగు భాషకు గౌరవం లేకుండా పోయింది. ఆంధ్రులు మద్రాసీలుగా పిలువబడ్డారు. రెండవశ్రేణి పౌరులుగా చూడబడ్డారు. వారి విజ్ఞప్తులతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని 1921లో కాంగ్రెస్ ఒక తీర్మానం చేసింది. 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

నైజాం అన్నది బ్రిటీష్వారు పూర్తిగా లొంగదీసుకోలేకపోయిన ఒక స్వతంత్ర రాజ్యం, దేశం. మొఘల్లతో సహా భారత ఉపఖండం బ్రిటీష్వారికి దాసోహం అయిన రోజుల్లో బ్రిటీష్వారిని నిలువరించి వారు సంధికి వచ్చి స్నేహహస్తం చాచేలా చేసిన దేశం ఇది. పాలకులు ముస్లింలే కావచ్చు. అది వేరే విషయం. చరిత్రకారులు "నైజాం దేశాన్ని ఎప్పుడూ దేశంగా పేర్కొనలేదు. ఎందుకని? నైజాంను విలాస పురుషుడుగా పరిపాలన తెలియని నియంతగా ఎందుకు వర్ణిస్తారు? నైజాం రాజ్యంలో పరిపాలన తెలిసిన అధికారులు ఎందరో ఉండేవారు. ఇదొక స్వతంత్ర దేశంగా యూరోపియన్ దేశాల్లో తన రాయబారులను నియమించుకున్న దేశం. స్వతంత్రం వచ్చేనాటికి "రాజ్యపాలన తెలిసినవారు యావత్ భారత ఉపఖండంలో నైజాం దేశంలోనే ఉన్నారు. పాకిస్తాన్ ఏర్పడడంతో వారు పాకిస్తాన్ వెళ్ళిపోయారు లేదా ప్రాధాన్యత లేక మిన్నకుండి పోయారు. ఆనాటి రోడ్లు, వంతెనలు, కట్టడాలు, చెరువులు,

నీటిపారుదల సౌకర్యాలు అన్నీ పరిపాలన దక్షతను స్పష్టం చేస్తాయి.

తెలంగాణ ప్రాంతం 1956 నాటికి ఆర్థికంగా స్వయంసమృద్ధి కలిగి ఉందఇ. 6వ, 7వ నిజాం రాజుల పాలనలో హైదరాబాదు రాజ్యం నీటిపారుదల, పరిశ్రమలు, విద్యారంగిల్లో ఎనలేని అభివృద్ధి సాధించింది. ఆనాడు లోటుబడ్జెట్‌తో వనరులు లేక కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం నిరంతరం జీతాలివ్వలేని దయనీయ స్థితిలో ఉండేది.

తెలంగాణ రాష్ట్రంలోని నిధులను వాడుకోవడం ద్వారా ఆంధ్రరాష్ట్రం కష్టాల నుండి గట్టెక్కుతుందని ఆంధ్రపత్రికల్లాంటి పత్రికల్లో వందల వ్యాసాలు, చర్చలు కొనసాగాయి. వాటిని ఇప్పటికీ 1952-56 సంచికలు వెదికితే విస్తారంగా కనబడతాయి. ఆనాటి ఆర్థిక స్థితి ఎవ్వరిది, ఎలా ఉండేదో ఆంధ్రపత్రిక మొదలైన పత్రికలు తిరగేస్తే తెలిసిపోతుంది. అలాగే బి.యన్.శాస్త్రిగారి తాత సీనియర్ బి.యన్. శాస్త్రి 1953లో రాసిన గ్రంథాల్లో వీటిని పేర్కొని హైదరాబాదు రాష్ట్రం ఆంధ్రరాష్ట్రంతో కలవకూడదని ఎన్నో సాక్ష్యాలు చూపించాడు. 1956లో ఆంధ్రప్రదేశ్‌లో చేరి సామంత రాజ్యంగా మారకుండా స్వతంత్ర రాష్ట్రంగా వుండివుంటే తెలంగాణ, పంజాబ్, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాలతో సమానంగా ముందుకు సాగిఉండేది.

గొలుసు చెరువుల నిర్మాణంలో ప్రపంచానికే ఆదర్శం :

తెలంగాణ భారతదేశానికి అపూర్వమైన అనుసంధాన (లింక్) నీటిపారుదల వ్యవస్థగా దశబంద గొలుసు చెరువు నిర్మాణ రీతులను అందించింది. తద్వారా వరదలను అరికట్టింది. నదుల నుండి కాలువలు తీసి పంట కాలువలకు మళ్లించారు. జానపద కళలు, కళారూపాలు, సంస్కృతుల ద్వారా సమాజ చరిత్రను పరిణామాలను ఇప్పటికీ సజీవంగా నిలుపుకున్నది. ఆయా కుల పురాణాలు, చిందు భాగోతం, జాంబవంతుల కథ, శారదకాండ్రు, బైరూపులోల్లు, గొల్లసుద్దులు, బైండ్ల కథలు, బైరాగి తత్త్వాలు, ఎల్లమ్మ కథలు, మోటబాయి పాటలు, అచలతత్త్వ గీతాలు, బాలసంతులోల్లు, దొమ్మరి విద్యలు, గారడి విద్యలు మొదలైనవి క్రీస్తుశకం ఏడో శతాబ్దం నుంచి చిన్న చిన్న మార్పులతో తమ మూలస్వభావంతో ఇప్పటికీ సజీవంగా కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తమైన బతుకమ్మ పండుగ :

బతుకమ్మ పండుగ తెలంగాణ జానపదుల కళాత్మక హృదయాన్ని ఆవిష్కరిస్తుంది.

కొత్తగా ఎదుగుతున్న సామాజిక శక్తులు కుల సమస్యను, తెలంగాణ సమస్యను, దళిత సమస్యను, స్త్రీ సమస్యను తీసుకొని మొత్తం సమాజానికి నాయకత్వం వహించే

Dalithayugam-1
03-09-09
225

క్రమంలోకి ఎదిగాయి.

స్వాతంత్ర్యం వస్తే దళితులకు వుండే వాటా ఏమిటో ఇప్పుడే స్పష్టం కావాలని నిలదీసి సాధించుకోవడం వల్లనే అవి రిజర్వేషన్లుగా, హక్కులుగా, రాజ్యాంగంలో పొందుపర్చబడ్డాయి. కానీ అదే సమయంలో గాంధీజీ, నెహ్రూ నాయకత్వాన్ని నమ్మి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిసిలకు ఎస్‌సిలకు లాగే రిజర్వేషన్లు ఇస్తామని, ఇచ్చిన హామీని నమ్మి వారికి అనుచరులుగా మారడం వల్ల స్వాతంత్ర్యం వచ్చి యాభై నాలుగేళ్ళయినప్పటికీ కూడా ఎస్‌సి, ఎస్‌టిలకు లాగా బిసిలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు కాకుండా పోయాయి.

బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకత్వ సమస్యను వదిలేసిన క్రమం :

అందువల్ల తెలంగాణ వచ్చిన తర్వాత కాదు, తెలంగాణ రావడం కోసం కృషి చేసే క్రమంలోనే బిసి, ఎస్‌సి, ఎస్‌టి నాయకత్వం ఎదగాలనే దాని పట్ల స్పష్టత ఉండాలని యువతరం శక్తులు నిలదీశాయి. ఇది నిజమైన సమస్య. మెజారిటీ ప్రజల సమస్య. ఈ సమస్యను ఎప్పటికీ దృష్టిలో ఉంచుకోవలసింది.

మన మార్కెట్ మందం మన తెలంగాణ సినిమాలు తీయాలె :

మన భాష మనకే పరాయీకరణం చెంది, మనకే దూరం అయిపోతున్నది. ఏదో భాష మన మీద రుద్దబడుతూ వస్తున్నది. మర సినిమాల్లో బోలెదు పెట్టుబడులున్నై. మనం ఎన్నో సినిమాలు తీసుకోవచ్చు.

బీసీలకు రాజకీయ అధికారం

ఉద్యమ నాయకులు అనేక పరిమితులకు కుదించబడతారు. రాజకీయ నాయకులకు అపరిమిత అవకాశాలు ఉంటాయి. ఉదా.కు చంద్రబాబు నాయుడు కుప్పం ఒకే నియోజకవర్గంలో గెలిచి రాష్ట్రానికంతటికీ ప్రతినిధిగా, శ్రేయోభిలాషిగా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. రాజశేఖర్ రెడ్డి పులివెందులలో గెలిచి మొత్తం రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. వాళ్ళు గెలవడానికి ఎన్ని తంటాలు పడ్డారో, రిగ్గింగ్‌లు చేశారో అనే దానితో నిమిత్తం లేకుండానే ప్రతి శాసనసభ్యుడు రాష్ట్రానికి, ప్రతి పార్లమెంటు సభ్యుడు దేశానికి ప్రతినిధి అవుతున్నారు. గుర్తింపు పొందుతున్నారు. కానీ లక్షలాది మందిని, కోట్లాది మందిని సమీకరించి ఒక నిర్దిష్ట సమస్యపై ఉద్యమిస్తే సామాజిక ఉద్యమకారులను దానికే పరిమితం చేసి చూస్తుంటారు.

బిసిలు తమ రాజకీయాధికారం కోసం అన్ని రంగాల్లో తమకు సహకరించే

లాబీలను తయారు చేసుకోవాలి. మేము అధికారంలోకి వస్తే ఫలానా పారిశ్రామిక వేత్తలకు బదులుగా వారికన్నా ఎక్కువగా మీరే ఎదిగేటట్టు సహకరిస్తాం, లైసెన్సులిస్తాం ఎన్నో రూపాల్లో తోడ్పడతాం. కాంట్రాక్టులు మీకే, మీ వారికే ఇవ్వడం ద్వారా సహకరిస్తాం అని ఒక అవగాహనకు రావాల్సి ఉంటుంది. అలాంటి వర్గాలను తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ వర్గాలు బిసి, ఎస్‌సి, ఎస్‌టిల నుండే ఉండాల్సిన అవసరం లేదు. అసలు ఆ వర్గాల నుండి అలాంటి స్థాయికి ఎదిగినవారు ఉండే అవకాశమే తక్కువ. కనుక ఇతర కులాల నుండే వారు ఉండే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇక్కడ కులాల ప్రకారంగానే ప్రవర్తించాలి. ఎన్నికచేసుకోవాలి అనేది కుదరని వ్యవహారం.

ఎన్నికల్లో పోటీ చేయనివాళ్ళు, ఏ పార్టీలో సభ్యులు కానివారు రాజకీయ నాయకులు కాదు. ఎన్నికల్లో పోటీ చేసేవాళ్ళే రాజకీయ నాయకులు. ఎన్నికల్లో పోటీ చేయకుండా, పార్టీ కోసం పని చేయకుండా రాజకీయ నాయకులు కాకూడదు. అయితే పార్టీలో ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయాలను నడపడం దేశానికి, ప్రజలకు చాలా నష్టం చేస్తుంది. వాళ్ళు ప్రజల ఓటు హక్కును, ప్రజల నిర్ణయ శక్తిని గౌరవించడం లేదు. ప్రజల చేత ఎన్నికవ్వడం లేదు. అనగా వారిది రాజరికాల కాలానికి సంబంధించిన పని విధానం. అందువల్ల దశాబ్దాల తరబడి రాజకీయాల గురించి మాట్లాడుతూ రాజకీయాలను ప్రభావితం చేస్తూ వస్తున్న నాయకులు నిజంగా రాజకీయ నాయకులు కారు. రాజకీయనాయకులుగా వారికి శక్తి సామర్థ్యాలు లేవు అని అర్థం.

ఎన్నికల్లో స్వయంగా తన నియోజక వర్గంలో కృషి చేసి కార్యకర్తలను, ప్రజలను, ఓటర్లను సమీకరించడం ద్వారానే రాజకీయ నాయకుడు ప్రజలకు చేరువవుతారు. తద్వారా ప్రజలను కలిసినప్పుడు ప్రజలకు అందుబాటులోకి వస్తారు. ప్రజల హృదయాలను గెలుచుకోవడానికి తన వ్యక్తిత్వంలో, స్వభావంలో ఆలోచన విధానంలో, భావ అభివ్యక్తిలో అనేక మార్పులు చేసుకుంటారు. ప్రజల దగ్గరికి చేరే క్రమంలో ప్రజాస్వామ్య స్వభావాన్ని ఇలా సంతరించుకుంటాడు.

ప్రజల దగ్గరికి ఓట్ల కోసం వెళ్ళని రాజకీయ నాయకులకు ఈ ప్రజాస్వామ్య స్వభావం అబ్బడం కష్టం. వాళ్ళు కలెక్టర్లలాగా అధికారాన్ని కార్యకర్తలకు, పార్టీపై చెలాయించడానికి అలవాటు పడతారు. వారి పని విధానంలో బ్యూరోక్రసి ఉంటుంది. తాను చెప్పిందే పార్టీ వినాలని కార్యకర్తలు చేయాలని ఒక అహంకారం, ఆత్మవిశ్వాసం ఉంటుంది.

Dalithayugam-1
03-09-09
226

Telangana State - Need of Revival

Why the British accorded the independence to us? What they gained? They could how down to the historical aspects - political, social and cultural struggles and changes.

So also, all the political parties should improve their individual, selfish, survival legacies and strategies been instead they have to respect the historical separate statehood demands. And it is unfair and unethical to turn deaf hear to the demand and which paves way for agitations and violence, raising.

All the Governments - the state and the central have receive the grave ritreation of the demand and take immediate action in solving the problem. Which will entrance the National Development. Otherwise, it results in a civil war situation and destruction the economy.

Ruling with national perspective should predict and act in advance to avent dangerous of discontent. National perspective is all about understand the turmoil in advance and quench it with constructive action programme.

Hence all the political parties should take in consideration the ideas, the theoritical foundations and concepts of intelectuals.

స్మృతి

“నాయనా నీవనుకుంటున్న పద్ధతి సరైందికాదు. ఈ లోకం సత్యం. ఈ స్వార్థం, అసూయ, భవభావబంధాలు, ఆధిపత్యం, రాజ్యం ఇవన్నీ సత్యమే. అయినా ఇవన్నీ మాయ. తన స్వార్థంతో వీటిల్లో కూరుకుపోవడం మాయ. స్వార్థం నుండి విముక్తమై వీటన్నిటా ఉంటూనే సన్యాసిలా జీవించడమే ఈ మాయనుండి విముక్తం కావడం. అదే నిజమైన స్వేచ్ఛ, స్వచ్ఛమైన ప్రేమ, కరుణ. ఏ పని చేయకుండా కొందరిలా

బొర్రలు పెంచి మఠాలు, ఆశ్రమాలు నడపడం, ఆశ్రమాల ఆస్తుల్ని పెంచుకుంటూ శిష్యుల్ని దోపిడీ చేస్తూ పోవడం స్వార్థం, పనిపట్ల ఆనందమే బ్రహ్మానందం, గురు రవిదాసు ఎంత గొప్ప తత్వగురువైనా తత్వబోధ చేస్తూ చెప్పులు కుట్టి బతుకుతూ దేశాటన చేసిన నిగర్వి. బ్రహ్మజ్ఞానం ఎవరి వద్దోలేదు. ఎక్కడో లేదు. అది శూద్రుల్లో ఈ చిల్లర కులాల్లోనే ఉంది. బ్రహ్మజ్ఞానం అంటే సృష్టించడంలో పొందే ఆనందం. సమస్త వస్తువుల్ని, సంపదల్ని సృష్టించేది కింది జాతులవాళ్లే. అందువల్ల కింది జాతులవాళ్లే బ్రహ్మజ్ఞానులు. బ్రహ్మానందం అంటే వారికి తెలిసినంతగా మరెవరికి తెలియదు.”

“బ్రహ్మజ్ఞానం పొందినవారే బ్రాహ్మణులు అనే మాటేమిటి?” ఎవరో శిష్యులు ప్రశ్నించారు.

“అది తప్పు నాయనా. బ్రహ్మజ్ఞానం పొందినవాళ్లే శూద్రులు, చిల్లరజాతులు. ఈ ప్రకృతిలో లీనమయ్యే ఏ వృత్తీ చేయని బ్రాహ్మణజాతికి బ్రహ్మజ్ఞానం, బ్రహ్మానందం లభించడం ఎలా సాధ్యం? వారు ఇది నాది, నాకులం, నా కులంగొప్ప, నా జన్మగొప్ప అనే భావాన్నే జయించలేకపోయారు. ఈ భేషజాలకు బ్రహ్మజ్ఞానం, బ్రహ్మానందం ఆమడదూరం ఉంటుంది. ఈ ఆధిక్యత, అహంకారం వదులుకున్న వారికే అది సాధ్యం. అదే బ్రహ్మజ్ఞానం. అదే ఈ మాయ నుండి విముక్తి కావటం. స్వార్థం, అసూయ, భవభావబంధాలు నేను గొప్ప. ఇది నాది, ఇది నాది కాదు అనే ఈ లోకంలో వీటన్నిటి మధ్య జీవిస్తూనే మానవులు ఈ మాయనుండి బయటపడడమే అసలు నిర్వాణం, అదే అసలు సన్యాసం. ఏది నీది కానపుడు అన్నీ నీవే అవుతాయి అని చెప్పిన బుద్ధుని మాట గొప్పమాట. గంగాధరి కోరుతున్నది విడిగా ఉండే ఆదర్శ ప్రపంచం. అది ఎన్నడూ సాధ్యం కాదు. ఈ లోకంలో అన్నిటా ఉంటూనే లోకకళ్యాణం కోసం అన్ని పనులూ చేస్తూనే ఏదీ తనదికాదు అనే స్థితికి తన ఆత్మను, మనసును జయించడం గురించే మనం చెప్పవలసిది. ఈ భార్యాబిడ్డలు, ఈ ఆస్తిపాస్తులు, అధికారం, పేరు ప్రతిష్టలు, కులం, మతం ఈ దేహంతోపాటు నీ భావాలపై కూడా ఇది నాది అనే ఆస్తి హక్కులేని అభావ స్థితికి చేరుకోవడమే ఈ మాయ నుండి విముక్తి కావడం. అపుడే నిజమైన స్వేచ్ఛ, స్వచ్ఛమైన ప్రేమ, కరుణ, ఆదర్శ ప్రపంచం, నిజమైన సోషలిజం అనుభవంలోకి వస్తుంది. బుద్ధుడు, కబీరు, గురు రవిదాసు చెప్పిన సారం ఇదే నాయనా. అదే ఈ కార్తీక పున్నమి సందేశం.”

క్షమాగుణం లేని జీవితం మనిషిని హేయంగా మార్చి క్రూరుణ్ణి చేస్తుంది. పశ్చాత్తాపంతో దహించుకుపోయి పునీతులై తిరిగి కొత్త జీవితాన్ని కోరుకునే మనిషిని క్షమాగుణంతో స్వీకరించి అవకాశం యివ్వలేని సమాజం క్రూరమైంది. పశ్చాత్తాపిని తిరిగి గతంతో బాధించే సమాజంలో పశ్చాత్తాపపడ్డమే తప్పు అని తిరిగి పాతపద్ధతికే మళ్ళడాన్ని అనివార్యం చేస్తుంది. కొత్త జన్మలు ఎక్కడో లేవు. క్షమాగుణం – పశ్చాత్తాపమే తిరిగి కొత్త జన్మలనిస్తాయి. తెల్సీ తెలియకుండా గడిచిపోయిన జీవితాల్నించి తిరిగి కొత్త జీవితాల్ని ప్రారంభించే అవకాశం ఉంటే ఈ మనుషులు – ఈ సమాజం – ఈ మానవ సంబంధాలు మరింత ఉన్నతంగా ఎదుగుతాయి.

నిరాశ నిండు గర్భిణివంటిది. అనుభవించడం రావాలేగాని నిరాశలో గర్భిణి స్త్రీలా ఆనందాన్ని పొందవచ్చు. అది జీవితాన్ని కొత్తగా ప్రసవిస్తుంది. కొత్త ఆనందాన్నిస్తుంది. ఆశ ఒక ఊహ. ఆశ అందమైంది. నిరాశ ఒక వాస్తవం. నిరాశ – వాస్తవం నుండి ఊహకు చేరుకొని దాన్ని వాస్తవం చేసుకోలేకపోయిన తీరును తెలుపుతుంది. ఆశ గమనాన్ని తెలుపుతుంది. నిరాశ గమ్యం యొక్క దూరాన్ని తెలుపుతుంది. ఆశ లక్ష్యాన్ని తెలుపుతుంది. నిరాశ ఆ లక్ష్యాన్ని చేరుకోలేని దశను తెలుపుతుంది. నిరాశ దాటిన లక్ష్యాల గమ్యాలపట్ల అహాన్ని తొలగిస్తుంది. మరింత ఉన్నత జీవిత లక్ష్యాన్ని తిరిగి కొత్తగా ప్రారంభిస్తుంది.

బతుకు పయనం

“ఈ మొగోల్లు ఉత్తపనిదొంగలే. పని మనది పేరు వాళ్ళది. పడుగు పోసుడు, గంజి తెచ్చుడు, కండెలు చుట్టుడు, వంట చేసుడు, పోరగాన్లను సవరిచ్చుడు అన్ని చేసుకుంట మల్ల మొగ్గంనేయాలె. అంచునెయ్యాలె ఆడోల్లు. మొగోల్లు ఏమున్నదే పడుగు సరిచేసి నేసి అమ్ముకచ్చుడు. గంతే అమ్ముకరాను వోయి రాంగరాంగ తాల్లల్ల కల్లు దాగి అంత మందం ధర తక్కువకు అమ్మిందని అబద్దాలాడుతరు.”

“ఈ సంసారం ఒక్కతీరు చేస్తే పురి కట్టిందానే! మనకు పొలాలు లేకపాయె, పెరండ్లు లేకపోయె. ఇత్తులు ఏది కొన్నా ధరలు అగ్గిమండె. కూలికి పోయి ఇత్తులు తెస్తుంటి. మక్క గట్క అందరు తింటే నాకు అది గూడ దొరకక పోవు. గంజిల ఉప్పురవ్వ ఏసుకుని తాగి పంటే ఆకలికి రాత్రికి పేగులు కడుపు నొప్పితోటి వడి తిరుగుతుండె.”

“బట్టనేత అంటే ఆడిసేత లేనిది అసలే కాదే. ఇంట్ల ఆడిది పోతే కుల కశిపి

పోయినట్టేనే. ఆ యిల్లు యిల్లు గాదు. గాడిదలు పొర్లినట్లుంటది. పోరగాన్ల దుబ్బల పొర్లినట్టుంటరు."

"ఇరవై ఏండ్ల కింద నూరు కుటుంబాలుండె. ఆల్లందరు యిక్కన్నే వుంటే తక్కువకు తక్కువ మూడువందల కుటుంబాలైతుండె. కని యిప్పుడు 50 గడప వుండచ్చు. మిగిలినోల్లందరు పొట్ట చేతపట్టుకుని ఏదో ఒక పని వెతుక్కుంట ఎటెటో పోయిన్రు. ఒక ఊరుగాదు – ఒక రేవు గాదు. ఒక పని గాదు." శిథిలమైన కుటుంబాలు, సంబంధాలు...

"మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా ఉండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలాలపజతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె. రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని బట్టి ఉంటుంది. బిల్‌గేట్స్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? సత్యం రామలింగరాజు, ఇన్ఫోసిస్ నారాయణమూర్తిగార్లకు ఎవరు చెప్పారు? గుమాస్తా జీవితాన్ని ప్రారంభించిన రిలయన్స్ అంబానీకి ఎవరు చెప్పారు ఎదగాలని? అనాథగా పుట్టిపెరిగిన ఫోర్డ్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? అంతా సంకల్పబలం. పట్టుదల, నిరంతర కృషి. విశ్వవిజేత అలెగ్జాండర్ ఒక మాటన్నాడు : గెలవదలచుకున్నవారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని. నేను ఇంతకన్నా కొత్తగా, అదనంగా చెప్పడానికేమీ లేదు. మీరు ఎంత ఎదిగితే అంతగా సేవచేసే అవకాశం ఉంటుంది."

ఊహలు వేరు. భయాలు వేరు. వాస్తవంగా చూడ్డం వేరు. పాము అని ఊహించుకుని ఉలికి పడ్డప్పుడు భయపడ్తాం. కానీ, నిజంగా పాము కనబడితే అంతగా భయపడం, దాన్ని చంపడమో మనమో తప్పుకుపోవడమో చేయాలనే ఆచరణాత్మక ఆలోచనలు కలుగుతాయి. ఊహల్లోని భయాలే ఎక్కువ భయపెడతాయి. అవి ఎదురైనప్పుడు నిజానికి అంతా భయమేమీ కాదు. నేను లాకప్పులో ఉన్నప్పుడు, జైలుకు వచ్చిన తరువాత కలిగిన అనుభవం ఇది. అంతకన్నా ముందు జైలంటే ఎంతో భయంగా ఉండేది. కానీ, ఇక్కడికొచ్చిన తరువాత ఆ భయం పోయింది. గాంధీ, నెహ్రూ వంటి ఎందరో గొప్పగొప్ప వాళ్ళు ఏళ్ళ తరబడి జైల్లో గడిపారు. నెల్సన్ మండేలా 27 ఏళ్ళు జైల్లోనే గడిపాడు. జైల్లో ఉన్నంత స్వేచ్ఛ నిజానికి బయటి ప్రపంచంలో ఉంటుందా?

ఆ మధ్య ప్రముఖ గాంధేయవాది, వాటర్‌షెడ్ పథకాలకు స్ఫూర్తిదాత అయిన అన్నాహజారే మహారాష్ట్ర మంత్రి మీద అవినీతి ఆరోపణలు చేస్తే ఆయన కేసు పెట్టాడు. కేసులో మంత్రికి అనుకూలంగా తీర్పు వచ్చింది. అన్నాహజారే జైలుకు పోతానన్నాడు గాని బెయిల్ పిటిషన్ వద్దన్నాడు. దాంతోని కేసువెట్టి జైలుకు పంపిన మహారాష్ట్ర మంత్రి మీదనే జనం విరుచుకపడ్డరు. మంత్రి కేసుల గెల్చిండు. కానీ, ప్రజలల్ల ఓడిపోయిండు. అన్నాహజారే నన్ను అరెస్టు చేయొద్దు అని మేధావుల, కళాకారుల, రచయితల, శాస్త్రవేత్తల సంతకాల సేకరణ చేయలేదు. అలా చేసి ఉండుంటే ఆ కొందరే స్పందించేవారు. ఆయన నేను జైలు కెళ్ళడమే ఇష్టపడతాను అని అనడం ద్వారా జైలు కెళ్ళడం ద్వారా ప్రజలందరూ అతనికి అనుకూలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చివరకు కోర్టుకు వ్యతిరేకంగా కూడా ముందుకు వచ్చారు. నైతిక బలం విజయం ఇది. విజయం ఎప్పుడూ నైతిక బలంలోనే ఉంటుంది.

అంగట్లో అన్నీ ఉన్నాయి. జేబులో డబ్బులు ఉండవు. చేయడానికి పని ఉండదు. ఉన్న ఫ్యాక్టరీలను వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం కింద కార్మికులను పంపించేసి మూసి వేస్తున్నారు. ఫ్యాక్టరీల స్థలాన్ని ఇళ్ళ స్థలాల కోసం అమ్మేసి కోట్లు సంపాదిస్తున్నారు. సామాన్యుల బతుకు ఇలా ఎందుకయిపోతున్నది. రైతులు కూడా కాంట్రాక్టర్లను, ప్రొక్రెయినర్లను కిరాయికి తీసుకుని వ్యవసాయం నడుపుకుంటున్నారు. కూలీలకు ఏ పని దొరకడం లేదు.

బావులు తవ్వడంపోయి బోరింగులు వేయడం వచ్చింది. చేనేత నూలు బట్టలు పోయి మిల్లు బట్టలు వచ్చాయి. మాదిగ చెప్పులు పోయి కంపెనీ చెప్పులు వచ్చాయి. ఎడ్లబండ్లు పోయి ఆటోలు, లారీలు, బస్సులు వచ్చాయి. ఇక పల్లెటూరి పాతకాలపు మనుషులు ఏం పని చేసుకుని బతకాలి. ఇవన్నీ గుర్తు చేసుకుని నిస్సహాయంగా ఏడ్చారు. ఇలా ఎందుకు జరుగుతున్నదో?

"ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఇవన్నీ రాజకీయాలే. ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే, సామాజికమైనదే. వీటితోపాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువల పట్ల సాధ్యపడుతున్నది."

"నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడీ

వర్గాల, పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు."

బతుకుపోరు

"పోరగాన్లకు డిమాండు బాగా పెరిగింది. ఏమిట్లకు అక్కరకు రానోడు గూడ వేలకు వేలు అడుగవట్టె. గుంటెడు జాగుండది ఒడిసెకు కప్పుందదిగని వేలకువేలు కావాలె కట్నాలు! ఏడికెల్లి తెచ్చిపోత్తరనుకుంటరో, మరి ఆడు అంతగనం సంపాంచి ఎన్ని మిగిలిచ్చిండట? ఏమన్న కూసుండవెట్టితినవెట్టడా గంతగనం కట్నం దీసుకోని?"

నువు జూత్తలేవ నా సంసారం, పోరగాన్లు, బొట్టెగాన్లు, వండుకునుడు, తినుడు, తానాలు జేసుడు, చేపిచ్చుడు, పోరగాన్ల బడికి పంపుడు, అందరి బట్టలుతుకుడు, ఊడ్సుడు, అలుకుజల్లుడు, ముగ్గులేసుడు, అగ్గత్తిరిచ్చుడు, బీడీలు జేసుడు, పొద్దుగాల లేసఇ మొదలువెట్టె రాత్రి పదకొండు గొట్టెదాక తీరనే తీరదాయె. రికాంలేని బతుకు. పనిచేసి చేసి బొక్కలన్ని తెల్లవడవట్టె కాట్లెవడ్తెనే రికాం యీ బతుక్కు."

మా ఆడోల్ల కష్టాలు మీకేమెరుక. ఊడ్సుకునుడు. అలుకు జల్లుకునుడు, తొమ్మిది నెల్లు కడుపుల మోసి అయిదేండ్ల దాక కంటిపాప తీర్గ కాపాడుడు, వంట జేసుడు, యివన్నీ గాక యింకమీదికెల్లి బీడీలు జేసుడు మేం ఆడోల్లం జేసే పనిల మీరు ఏ పాటి పని జేత్తను? మేం ఒక్క పోరగాన్లటను సగివెట్టినంత పనిగాదు మీరు పొద్దుందాక రాజ్యాలేలచ్చేది, పనులు చేసేది అంత గలిపి! ఏదో ఆడిపుటక పుట్టినమని వంచిన తల ఎత్తకుంట మాటకు ఎదురు జవాబివ్వకుంట, మాట్లాడకుంట పని జేసుకుంట జేర్తె మీకు ఏమేర్పడుతది మేం జేసే పని, ఆడోల్లందరం ఓసారి పదిహేను రోజులు పిల్లగాన్లను మొగనికి అప్పజెప్పి తల్లిగారింటికోతె తెలుత్తది."

Dalithayugam-1

03-09-09

230

ఆం.ప్ర. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక

దళిత రచయితలకు, ఐక్యవేదిక సభ్యులకు, అభిమానులకు, నమస్కారం

తేది. 20.2.94న హైదరాబాదులో ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. పలు తీర్మానాలు చేయబడ్డాయి. కొన్ని కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. ముఖ్యంగా దళితకళా మండలి 15వ వార్షికోత్సవం మార్చి 13 నుంచి 16 వరకు హైదరాబాదులో జరుగుతుంది. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్ రోడ్డులోని జలదృశ్యం భవనంలో హైదరాబాదులో పాటలు పాడడం, రాయడం, అభినయంపై శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ 3 రోజుల పాటు జరుగుతుంది. 16న రవీంద్రభారతిలో ఎన్నిక చేసిన కళాబృందాలతో ప్రదర్శనలు ఉంటాయి. 16 నుంచి 25 వరకు సమీప గ్రామంలో ఈ శిక్షణ పొందిన కళాకారులు గ్రామాలకు తరలండి. క్యాంపెయిన్ ద్వారా దళిత సంస్కృతిని ప్రచారం చేస్తారు. 25న కాన్షీరాంగారి నుండి ఈ బృందాలు ప్రశంసా పత్రాలు బహుమతులు బహిరంగ సభలో అందుకుంటారు. ఈ శిక్షణ పొందగోరే గాయకులు, పాటలు, రచయితలు, అభిమానులు వెంటనే మాస్టర్‌జీ, 4-107, మచ్చుబొల్లారం, సికింద్రాబాద్ - 500010 అను చిరునామాను సంప్రదించగలరు. మూడురోజుల శిక్షణకు రూ.25/-లు భోజన ఏర్పాటుకు ఇవ్వాలి. ఇంకా వివరాలు కరపత్రం ద్వారా తెలియజేయబడుతాయి. ఆసక్తి కలవారు వెంటనే తమ పేరును నమోదు చేసుకోగలరని కోరుచున్నాము.

అట్లే ఈ వేసవి సెలవుల్లో నిరుటిలాగే మనం క్లాసులు నిర్వహిద్దామా? నిరుడు కథలపై, యిప్పుడు పాటలపై క్లాసులు ఏర్పాటు అయినాయి. మనవాళ్లను వ్యాసకర్తలుగా, మేధావులుగా ఎదిగించేందుకు వ్యాసం వ్రాయడంపై క్లాసులు నిర్వహించడం ఎంతో అవసరం. ఈ వేసవిలో వ్యాసాలు వ్రాయడం ఎలా అనే అంశంపై క్లాసులు నిర్వహిద్దామా? అందులో విద్యార్థులుగా, ఉపాధ్యాయులుగా

పాల్గొనువారికోసం ఈ క్రింది విషయాలు సూచిస్తున్నాను. ఇవి చదివాక క్లాసుల నిర్వహణ అవసరమా? అవసరమైతే ఎలా ప్లాన్ చేద్దాం, ఎలా నిర్వహిద్దాం, ఎక్కడ నిర్వహిద్దాం అనే విషయాన్ని సూచిస్తూ వ్రాయగలరు.

వ్యాసాలు రాయడం ఎలా అనే అంశంపై క్లాసుల ప్రణాళిక ఒకటో భాగం

1. వ్యాసం అంటే ఏమిటి? ఎందుకు? వ్యాసం పుట్టుపూర్వోత్తరాలు
2. ఒక ప్రక్రియగా వ్యాసం ఎన్ని రకాలుగా ఉంటుంది.
3. లేఖ రచనకు వ్యాసరచనకు పోలికలు, తేడాలు, పరిమితులు, ప్రయోజనాలు
4. ఉపన్యాసానికి – వ్యాసరచనకు గల పోలికలు, తేడాలు, పరిమితులు, ప్రయోజనాలు – నోటి మాటలకు సంభాషణలకు వ్యాసానికి పోలికలు, తేడాలు (ఉపన్యాసం–పాట, వచన కవిత వ్యాసం పోలికలు)
5. వ్యాసానికి పాఠకులు ఎవరు? ఇది ఎప్పుడు, ఎలా నిర్ణయం అవుతుంది?
6. చర్చ వ్యాసానికి, వ్యాసానికి పోలికలు, తేడాలు, పరిమితులు, ప్రయోజనాలు.
7. ఒక విషయం పరిచయం చేసే వ్యాసానికి, విషయ పరిశీలన విశ్లేషణ చేసే వ్యాసానికి పోలికలు, తేడాలు, పరిమితులు, ప్రయోజనాలు, పాఠకుల దశలు, స్థాయిలో భిన్నత్వం.
8. పాఠ్య (టెక్ట్స్) వ్యాసానికి తన అభిప్రాయ ప్రకటనకు పరిమితమైన వ్యాసానికి పోలికలు, తేడాలు.
9. కథకు, వ్యాసానికి పోలికలు, తేడాలు.
10. గ్రంథానికి వ్యాసాలు, పోలికలు, తేడాలు – ఒకే విషయంపై రాసినవి అయినప్పటికీ వ్యాస సంకలనం గ్రంథం అవుతుందా (కథకు నవలకు ఉండే తేడా, గ్రంథానికి వ్యాసానికి ఉండే తేడా ఒకే రకమైనదా?) కథల సంకలనానికి నవలకు ఉండే తేడా గ్రంథానికి వ్యాస సంకలనానికి ఉంటుందా?
11. వ్యాసం కళా? శాస్త్రమా? (వ్యాసం సృజనాత్మక వ్యక్తీకరణ కనుక కళ అందులో శాస్త్రపరమైన అంశాలుంటాయి కనుక శాస్త్రం)
12. జర్నలిస్ట్ వ్యాసానికి, వార్త వ్రాయడానికి ప్రామాణిక వ్యాసానికి పోలికలు, తేడాలు, పరిమితులు.

13. వ్యాస ప్రక్రియల్లో ఒకటిగా సంపాదకీయం.
14. దినవార పత్రికల్లో వచ్చే వ్యాసాలకు సిద్ధాంత పత్రికల్లో, ఉద్యమ పత్రికల్లో వచ్చే వ్యాసాలకు పోలికలు, తేడాలు, పరిమితులు, ప్రయోజనాలు. భిన్న పాఠకులు, భిన్నస్థాయిలు వాటి భాషలో, భావంలో ఉండే పోలికలు, తేడాలు.

రెండవ భాగం

1. వ్యాస నిర్మాణం ఎలా ఉంటుంది? స్కీం – చేరాలు – శీర్షికలు – ఉపశీర్షికలు – ముగింపు వగైరా.
2. వ్యాసంలో నుడికారం, భాష, భావం, టెర్మినాలజీ, వాక్యనిర్మాణం, లిపి తప్పులు.
3. వ్యాసంలో శైలి, శిల్పం, అందం, ఆకర్షణ, వాటి ప్రాధాన్యత – సొంత శైలిశిల్పం ఏర్పరచుకోవడం ఎలా?
4. వ్యాంసలో సంక్షిప్తత యొక్క ఆవశ్యకత ఏమిటి? వ్యాసాలను తానే ఎడిట్ చేసుకోవడం ఎలా. రీరైట్ చేయడం ఎలా?
5. విశ్లేషణ పద్ధతి – ప్రాపంచిక దృక్పథం – వ్యాసం యొక్క పద్ధతిని, రూపాన్ని, సారాంశాన్ని నిర్ణయించే తీరు.
6. వ్యాసరచనా పద్ధతిలో శాఖలు – హేతువాద పద్ధతి – మార్క్సిస్టు పద్ధతి – దళిత పద్ధతి – శాస్త్ర పద్ధతి – చార్వాకుల పద్ధతి – బౌద్ధుల పద్ధతి – బ్రాహ్మణిస్టుల పద్ధతి – తదితరాలు.
7. వ్యాసరచనా పద్ధతిలో శాఖలు:2 – రాజకీయ పద్ధతి, సామాజిక పద్ధతి, తాత్విక పద్ధతి, ఆర్థిక పద్ధతి, సాంస్కృతిక పద్ధతి, వైజ్ఞానిక పద్ధతి, మనస్తత్వశాస్త్ర పద్ధతి, విద్యాశాస్త్ర పద్ధతి, ప్రబోధ పద్ధతి, స్త్రీవాదపద్ధతి – తదితరాలు
8. వ్యాసరచన పద్ధతిలో శాఖలు:3 – గతితర్క పద్ధతి, తర్క పద్ధతి, అగవ పద్ధతి, కథాకథన పద్ధతి, అధికార పద్ధతి, సాధికార పద్ధతి, వినయ పద్ధతి, ఉపాధ్యాయ పద్ధతి, అనుమాన పద్ధతి, అనుమాన నివృత్తి పద్ధతి, నిర్మాణవాద పద్ధతి, ఇంటర్ డిసిప్లినరీ పద్ధతి, ఆకర్షణీయ పద్ధతి, ఈస్తటిక్ పద్ధతి, సైంటిఫిక్ పద్ధతి.
9. ఒక గ్రంథము యొక్క సారాంశమును వ్యాసంగా రాయడం ఎలా? ఒక భావాన్ని విస్తరించి వ్యాసంగా రాయడం ఎలా? ఒక సూత్రీకరణను వ్యాసంగా విస్తరించడం ఎలా?
10. వ్యాసరచన పద్ధతిలో గల శాఖలు:4 – థీసిస్, యాంటీథీసిస్, సింథసిస్

(వాద-ప్రతివాద-సంశ్లేషణ) ప్రతిపాదన - అనుమానము - నిర్ధారణ - పరికల్పన - అంచనా - పరిమితులు - ప్రయోజనాలు.

11. ఒక సంఘటనను, సినిమాను చూసి వచ్చాక చెప్పే పద్ధతి - ఎప్పుడు కథ అవుతుంది? ఎప్పుడు వ్యాసం అవుతుంది? వ్యాసరచనకు అనుభవాలకు జీవితానికి గల సంబంధం?
12. తన అనుభవాలను చెప్పడంలో కథ - ఉపన్యాసం - సంభాషణ - అనుభవాలను వ్యాసాలుగా రాయడం ఎలా?

మూడవ భాగం

1. వ్యాసరచనకు తర్కశాస్త్రానికి గల సంబంధం - వ్యాసాలు రాయడంలో తర్కశాస్త్ర, సమాజశాస్త్ర అధ్యయనం యొక్క జీవిత ఆశయం, ఆచరణల యొక్క ప్రయోజనం ఏమిటి?
2. తర్కశాస్త్రానికి తత్వశాస్త్రానికి మధ్యగల సంబంధం
3. సామాజానికి వాస్తవాలకు - తర్కశాస్త్రం - తత్వశాస్త్రంల సంబంధం ఏమిటి? ఈ సంబంధాలు వ్యాసాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?
4. ప్రాపంచిక దృక్పథానికి, తత్వశాస్త్రానికి వ్యాసానికి గల సంబంధం వేసే ప్రభావం.
5. వాస్తవాలకు తర్కశాస్త్రానికి, తత్వశాస్త్రానికి మధ్యగల వైవిధ్యం, వైరుధ్యం
6. వాస్తవాలకు గతితర్కానికి - విద్యాశాస్త్రానికి - జ్ఞానశాస్త్రానికి మధ్య గల వైవిధ్యం
7. సత్యం - తర్కం - వాస్తవం - తత్వం - ఈ నాలుగు ఒకటేనా వేర్వేరా?
8. వాస్తవాలను పరిశీలించే తీరు క్రమం - దాన్ని వ్యాసంలో పెట్టే తీరు క్రమం రెండింటి మధ్యగల వైవిధ్యం, వైరుధ్యం, భిన్నత్వం, ఏకత్వం ఏమిటి?

నాల్గవ భాగం

1. వ్యాసాలలో వస్తుపర విభజన - రాజకీయ వ్యాసం - సామాజిక వ్యాసం - సాహిత్య వ్యాసం వగైరా.
2. తత్వశాస్త్ర, భౌతికశాస్త్ర, ఆర్థికశాస్త్ర, అలంకారశాస్త్ర, కళలు విశ్లేషించే వ్యాసాలు రాయడం ఎలా?
3. టి.వి., సినిమా సమీక్షా వ్యాసాలు, పత్రికల్లో చర్చలో పాల్గొనే వ్యాసాలు, పత్రికల్లో అభిప్రాయాలు రాసే పద్ధతులు, పత్రికలో వ్యాసాలు రాసే పద్ధతులు,

Dalithayugam-1
03-09-09
232

సంపాదకీయాలు రాసే పద్ధతులు

4. పుస్తకాలకు ముందుమాట రాసే పద్ధతులు - పరిచయం - ప్రశంస - విశ్లేషణ
5. ప్రచార సాహిత్యం, కరపత్రాలు రాయడం ఎలా?
6. లేఖలు, వ్యాసాలు ప్రామాణికంగా వుండాలంటే ఏం చేయాలి? అధ్యయనం, ఆచరణల పాత్ర
7. ఉపాన్యాసాలను వ్యాసాలుగా మార్చడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రసంగ పాఠాలు
8. తాత్కాలిక లక్ష్యం గల వ్యాసరచన పద్ధతి - దీర్ఘకాలిక లక్ష్యం గల పద్ధతి
9. వ్యాసరచన - అచ్చు - పత్రికలు - పుస్తక ప్రచురణ - అమ్మకం.

పైవాటిలో మీకు తెలిసిన అంశాలకు టిక్కులు పెట్టుకోండి. మీరు వేటిలో నిపుణులో వాటిక్రింద గీతలు పెట్టండి. వీటిలో మీరు ఏ ఏ అంశాలు నేర్చుకోదలచుకున్నారో, విద్యార్థులకు నేర్పడం మీకు సాధ్యమా వాటిని తెలుపండి. నేర్పదల్చుకున్న ఉపాధ్యాయులు మీరు చెప్పగలిగే అంశాలకు సంబంధించి ఒక శీర్షిక పేరును మీరే సూచించండి. అందులో చెప్పి అంశాలను రాయండి.

ఈ క్లాసులు వేసవి సెలవుల్లో వారంపాటు సాగితే పూర్తి ప్రయోజనం. విద్యార్థులు బాగా చదివి క్లాసులకు వస్తే ఉపయోగం. ఉపాధ్యాయులు క్లాసులకు 20 రోజులు ముందుగా ప్రసంగాల్ని రాతలో పంపిస్తే వాటిని విద్యార్థులకు జెల్లి తీసి కాపీలు విద్యార్థులకు ముందే పంపిస్తే తయారైవస్తారు. జెల్లీ కాపీలకు, భోజన ఏర్పాట్లకు విద్యార్థులు రూ.100లు చెల్లించాలి. ఇవి ఏమాత్రం సరిపోవు. ప్రతి విద్యార్థికి మరో రూ.150ల చొప్పున ప్రచార ఖర్చులు, నిర్వహణ ఖర్చులు, ఉపాధ్యాయుల బస్సుఛార్జీలు అవుతాయి. వాటిని విరాళాలుగా సేకరించడం జరగాలి. ఎవరెవరు క్లాసులకు వస్తారో విద్యార్థులు, ఉపాధ్యాయులు వెంటనే తెలియజేస్తే క్లాసులు ఎప్పుడు, ఎక్కడ, ఎన్ని రోజులు, ఏ సంస్థల సహకారంతో అనేవి నిర్ణయించు కోవడం సాధ్యపడుతుంది.

ఐక్యవేదిక అభిమానులు, సభ్యులు, జిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులు ఈ క్లాసుల నిర్వహణ అవసరం అనిపిస్తే రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి దీనికి ఒక రూపం ఇస్తాము. వెంటనే మీ సూచనలు, అభిప్రాయాలు వ్రాయగలరు. క్లాసులను నిర్వహించే ఉత్సాహం గల జిల్లా శాఖల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు ఆ విషయం తెలిపితే వారి జిల్లాల్లోనే క్లాసులు నిర్వహించడానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. స్త్రీల కోసం కథావర్క్‌షాప్ గురించి స్త్రీల నుంచి స్పందన పెద్దగా రాలేదు. స్పందన వస్తే దాని గురించి కూడా

కార్యవర్గం ఒక నిర్ణయం తీసుకుంటుంది.

20.2.94 కార్యవర్గంలో ఈ క్రింది నిర్ణయాలు కూడా తీసుకోబడ్డాయి. 1. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇక నుండి రాష్ట్ర కార్యవర్గంలో పూర్తిస్థాయి సభ్యులుగా పాల్గొనవచ్చు. 2. సారా పాటలు, భూకంప బాధితుల కవితల సంకలనం, దళితకళామండలి సావనీరు త్వరలో ప్రచురించాలని నిర్ణయించడమైనది. నిరుడు సారా కవితలు పంపినవారు సారానిషేధం జరిగింది కనుక వారి కవితల్లో మార్పులు చేయదలిస్తే వెంటనే పంపండి. మార్చి 13-15ల మధ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉంటుంది. స్థలం: జలదృశ్యం, హైదరాబాదు.

అవసరమైన వారు దీని ప్రతులు జిరాక్సు చేసి ఇవ్వండి. పాటల శిక్షణ శిబిరానికి విద్యార్థులను పంపండి. మీ జవాబు కొరకు ఎదురు చూస్తూ ఉంటాను.

ఇ.నం. 1-1-262, వీక్లీ బజార్,
జగిత్యాల - 505327.

Dalithayugam-1

03-09-09

234

C.C. of Remand Report

In the Court of Judl. Magistrate of F.C., at Jagtial.

Cr. No. 32/84

Between :

The State P.S. Jagtial.,

V/s

Bethi Sri Ramulu & Others.

REMAND CASE DIARY

Part – I

P.S. Jagtial. Dist. Karimnagar.

F.I.R. No. 32/84

Date and place of occurrance; on 28-1-1984 at Pochammawada., Jagtial.

C.D. for the date : 29–1–1984.

Offence : U/s 25(1) (a) and 27 of Indian Arms Act, 4 and 5 of Indian Explosive substances Act, 120–B IPC.

* * *

1. On 28–1–1984 at 21.30 hours.
2. State through S.I. of police, P.S. Jagitial.
3. 1. Gandla Sivaprasad S/o Gangaram, 21 years, r/o Jagtial.
   2. T. Narsiah S/o Venkati, 21 yrs, r/o Singaraopet.

   3. Bethi Sreeramulu S/o Narsiah, 35 years, S.C. Hostel Warden, at Mallial R/o Jagtial.
   4. Bommidi Laxminarayana S/o Lachiah, 20 yrs, r/o Nerella.
4. and 5; Nil
6. C.D. dt. 28–1–1984.
7. --------
8. 1. Mohd. Faizoddin S/o Md. Yasin, 52 yrs, r/o jagtial.
   2. Elpula Rajam S/o Iasmiah, 50 yrs, Mala, Sunkari of Jagtial.
   3. PC. 340, Shankar of Korutla P.S.
   4. PC. 377, Rajamallu -do-
   5. T. Narsinga Rao, S.I. of Police, P.S. Korutla.
   6. K.Jaganohan Reddy, S.I. of Police, Jagtial P.S.

* * *

IN THE COURCE OF THE JUDL.

MAGISTRATE OF FIRST CLASS AT JAGTIAL

Sir,

The facts of the case are that in pursuance to the confession of one Theepiri Thirupathi (accused inCr.No. 7/84 of PS Korutla) and at his instance the accused No.1 to 4 noted in the margin were arrested on 28–1–1984 at 8 p.m. in a room at Pochammawada at Jagtial. In the presence of two panchyathdars the accused 1 to 4 were interrogated separately and recovered fromthe possession of A.1 and A.2 one Country made bomb from each of them under separate panchanamas. From the possession of A.3 twelve bore cartridges 4 and from the possession of A.4 twelve bore cartridges 3 were recovered

under separate panchanamas.

From the confession of A.1 and A.2 it is revealed tht they are also involved in Cr.No. 315/33 U/s 457r/w 511 IPC. of P.S. Jagtial. The accused No.2 is also an accused in Crime No. 169/83 u/s 307 IPC of P.S. Jagtial.

On the basis of confessions and recoveries of A.1 to A.4 a case as Cr.No. 32/84 u/s 25(1) (a) and 27 of Indian Arms Act and Sec. 4 and 5 of Indian Explosive substance Act and sec. 120–B IPC was registered at P.S. Jagtial.

From the facts so far collected in the investigation it is proved that the accused 1 to 4 are the active workers moving openly having close contacts with the UG extermists and supplying them arms, ammunition etc., from time to time The possession of ammunition and high explosives byA.1 to A.4 without valid licence, for supplying to the U.G. extermists with a view to facilitatin them for committing offences conspired to be committed by them, in a serious offence.

The accused 1 to 4 are therefore sent under proper escort with a request to remand them to judicial custody for a period of 15 days to enable the Police to complete investigation.

Hence the remand

Sd/-

Sub-Inspector, of Police

Jagtial

C.C. of F.I.R.

In the Court of Judl. Magistrate of F.C., at Jagtial.

Cr. No. 32/84

Between :

The State P.S. Jagtial.,

V/s

Bethi Sri Ramulu & Others.

క్రి.ప్రో.కో. 154 సెక్షన్ ప్రకారము పోలీస్ స్టేషన్‌కు రిపోర్టు చేయబడిన పోలీస్ వారు పట్టదగిన నేరముయొక్క ప్రథమ సమాచారము

సర్కిల్ : జగిత్యాల, జిల్లా : కరీంనగర్

నెం. 32/84 నేరము జరిగిన తేదీ గంట 28-1-84, రా.8గం.

రిపోర్టు చేయబడిన తేదీ గంట : 28-1-84, 21.30 గం.

నేరము జరిగిన స్థలము
పోలీసు స్టేషన్ నుంచి
దూరము, దిక్కు : At Pochamma wada, Jagityal
1 Km from P.S. towards west

పోలీస్ స్టేషన్ నుంచి రవాణా తేదీ : 28–1–84

1) సమాచారము చెప్పిన వాని యొక్క
మరియు ఫిర్యాదు యొక్కయు

పేరు. నివాస స్థలము : State through S.I. of police, P.S. Jagtial

2) నేరస్తుని పేరు
నివాస స్థలము : 1. Gandla Shivaprasad
2. T. Narsiah
3. Bethi SriRamulu
4. Bommidi Laxmi Narayana

3) సెక్షన్ సహా నేరము గురించి
సంక్షేమ వివరము, పోయిన

యెడల మాలు వివరము : U/s 25(1) (a) & 27 of Indian Arms Act; Sec. 4&5 of I.E.S. Act and Sec. 120–B IPC.

The facts of the case in brief are that on 28–1–84 at 8 p.m., the accused persons noted in Co. No.2 wee arrested at Pochamma wada, Jagital and from their possession two Country made bombs and 7 12 bore cartridges were recovered.

Hence F.I.R..

4) పరిశోధన విషయమై చేసిన

చర్య సమాచారము రికార్డు చేయుటలో

విలంబమునకు సంజాయిషీ No delay

5) కేసు యొక్క ఫలితము U.I.

In the Court of the Judl. Magistrate of F.C., at Jagtial.

Sir,

on 28-1-84 at 8 p.m. the SIs of Police, Korutla and Jagtial have in pursuance to the confession made by Theepiri Thirupathi (accused in Cr. No. 7/84 of Korutla P.S.) summoned for two panchayatdars. The accused Theepiri Thirupathi has led the Police part and panchayathdars to a room in Pochamma wada at Jagtial proper. As the doors were bolted- from inside the accused has knocked at the doors giving his identity, Soon after the doors were opened, the accused has pointed to the four persons available in the room and identified them as the active workers of extermists group collecting and supplying arms, ammunition and literature to the UG caders, All the four persons were arrested and interrogated in the presence of panchayatdars. They have disclosed their identity as 1) Gandla Sivaprasad S/o Gangaram, aged 21 yrs. r/o Jagtial 2) T. Narsiah S/o Venkati, aged 21 years, r/o Singaraopet, 3) Bethi Sreeramulu S/o Narsiah, 35 years, S.C. Hostel Warden at Mallial r/o Jagtial (4) Bommidi Laxminarayana S/o Lachiah, aged 20 yrs, r/o Nerella village. At the instance and from the possession of A.1 and A.2 one country made bomb from each of them was recovered under separated panchanamas. Similarly at the instance and from the possession of A.3 and A.4 twelve bore cartridges 4 and 3 respectively were recovered under separate panchanamas.

The accused No. 2 ia also a wanted accused in Crime No. 169/83 u/s 307 IPC of P.S.Jagtial.

In view of the recoveries effected from the accused 1 to 4 and on the basis of their confessions recorded, a case as Cr.No.32/84 u/s 25(1) (a) and 27 of the Indian Arms Act and Sec. 4 and 5 of Explosive substance Act. and section 120–B IPC is registered at P.S.Jagtial and investigation taken up.

Hence the F.I.R.

Sd/- Sub-Inspector of Police

P.S.Jagtial

28–1–84

Copies submitted to all concerned officers for favour of information.......

Dalithayugam-1
03-09-09
236

బి.ఎస్.రాములును సస్పెండ్ చేసిన ఉత్తర్వులు

ఉద్యోగంలో చేరాక బి.ఎస్.రాములు సస్పెన్షన్‌ను పొడిగించిన ఉత్తర్వులు

Dalithayugam-1

03-09-09

237

బి.ఎస్.రాములుపై కేసును కొట్టివేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు

బి.ఎస్.రాములును తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వు

Dalithayugam-1

03-09-09

238

Dalithayugam-1

03-09-09

239